# ఆంజనేయుని ఆనతి

## (మూడవ భాగము)



# ఆంజనేయుని ఆనతి

(మూడవ భాగము)

**[Aanjaneyuni Aanathi (Part -III)]**


ప్రధమ ముద్రణ: **నవంబర్, 2024**



కాపీ రైట్స్ : **రచయితవి.**



రచయిత అడ్రస్సు: మాతా విశ్వాత్మానందగిరి

స్వామి సుజ్ఞానానందగిరి

**శ్రీసత్యసాయి కుటీర్, కోవెలగుట్టపల్లి రోడ్డు**

**పుట్టపర్తి - 515134**

ఫోన్ : **80080 05854**



ప్రింటింగ్ : **విజయవాడ**



ఓం పవనపుత్రాయ విద్మహే  పావన పుత్రాయ  ధీమహి ।
తన్నో హనుమాన్ ప్రచోదయాత్ ॥

ఓం అంజనీ సుతాయ విద్మహే  అఖండ చైతన్య స్వరూపాయ ధీమహి ।
తన్నో ఆంజనేయ ప్రచోదయాత్ ॥



ఒక గొప్ప చెట్టు

చక్కగా పండిన ఒక అందమైన పండును తయారుచేస్తుంది.

ఆ పండు నేలరాలి కుళ్ళుతుంది.

ఆ కుళ్ళులోనుండే వేర్లు పుట్టి,

ముందటి దానికన్నా మహోన్నతమైన వృక్షం తయారవుతుంది.

ఇంతవరకూ పతనావస్థలో మీరు గడిపిన

ఈ కాలం కూడా అవసరం.

ఈ కుళ్ళులోనుండే యోగజీవితం మొలకెత్తబోతోంది.

అదిగో... చిగురుటాకులు ఇప్పటికే కనిపిస్తున్నాయి.

ఒక బ్రహ్మాండమైన, మహోన్నతమైన వృక్షం, 'ఊర్ధ్వమూలం',

ఇదిగో, ఇప్పటికే కనబడుతోంది.

ఈ ఆంజనేయుడు అందించిన ఈ సాగునీటిని వృక్షాలకి అందించి,

చెట్టు పెరుగుటకు మీ సాధన కారణమై,

దాని నీడన ముక్తి లేక మోక్షం అనే సేదతీరండి

నా చిన్నారి ముద్దుబిడ్డలారా!

# శ్రీఆంజనేయుని ఆనతి
## (మూడవ భాగము)

ఓం

**04-11-2019** 08:45 AM

**1) క్షేత్రజ్ఞుడు అనగా ఏమిటి స్వామి? నేను క్షేత్రజ్ఞుడను అన్న సత్యాన్ని ఏ విధంగా విశ్లేషించుకోవచ్చును స్వామి?**

*క్షేత్రాన్ని తెలుసుకునేవాడే క్షేత్రజ్ఞుడు. ఇపుడు నేను చెప్పిన విషయం తెలిసిందా? అని ప్రశ్నిస్తున్నాను. మీరు తెలిసింది అని సమాధానం ఇచ్చారనుకోండి. ఆ తెలిసింది ఎవరికి? తెలిసినట్లుగా అనుభూతి పొందిందెవరు? ఆ తెలిసింది అని సమాధానమివ్వాలనుకున్నది ఎవరు? నీ శరీరమా? కాదు, అది తెలియబడేదే గానీ తెలుసుకునేది కాదు. తెలియబడే దానికన్నా, తెలుసుకునేది వేరుగా వుంటుంది. చూడబడే దానికి చూచేవాడు వేరుగా వుంటాడు. కనుక, ఇక్కడ శరీరం కన్నా వేరుగా ఏదో వున్నది. అదే క్షేత్రజ్ఞుడు. క్షేత్రం జడం కాబట్టి, అది తనను తానూ తెలుసుకోలేదు, వేరే దేనినీ తెలుసుకోలేదు. కనుక దానిని (శరీరాన్ని, క్షేత్రాన్ని) తెలుసుకునేవాడు వేరే వున్నాడు. అతడే క్షేత్రజ్ఞుడు. అతడే తెలుసుకునేవాడు. చూచేవాడు ద్రష్ట. ద్రష్ట వేరు - దృశ్యం వేరు. ద్రష్ట ఎప్పుడూ దృశ్యం కాదు. కానీ, మీరు అజ్ఞానం చేత క్షేత్ర (శరీర) ధర్మాలను క్షేత్రజ్ఞునిలోనూ, క్షేత్రజ్ఞుని ధర్మాలను క్షేత్రంలోనూ కలగాపులగం చేసి, అన్యోన్య అధ్యాస చేసి, జననమరణ యాతనలకు గురైపోతున్నారు. అంటే, శరీరం చేసే పనులను "నేను చేస్తున్నాను" అని ఆత్మపై ఆరోపిస్తున్నారు. ఆత్మ ధర్మాలైన సత్-చిత్-ఆనందంలను ఈ శరీరంపై ఆరోపిస్తున్నారు. నేను తెలుసుకున్నాను, నేను ఆనందంగా వున్నాను అంటూ ఈ శరీరమే నేను అనే భావనలో ఉంటున్నారు. ఈ రెండింటినీ, క్షేత్రాన్నీ - క్షేత్రజ్ఞుడినీ విడగొట్టి చూచేది నేర్చుకోవాలి. ఈ క్షేత్ర-క్షేత్రజ్ఞుల ధర్మాలను విభజించి చూచి, ఆత్మ-అనాత్మ వివేకం కలిగితే, అదే సంసారబంధన విముక్తికి తారకమంత్రం. నీటిని వదిలి పాలను గ్రహించే హంసలాగా, క్షేత్ర-క్షేత్రజ్ఞులను విడగొట్టి, క్షేత్రాన్ని వదిలి క్షేత్రజ్ఞుడైన ఆత్మయే తన స్వరూపమని గ్రహించాలి. అలా గ్రహించగలవాడే పరమహంస, పరమజ్ఞాని. అలా తెలుసుకోలేనివాడే సామాన్యుడు!*

*ఒక చిన్న విషయం చెబుతాను. అది కాశీ నగరం. అద్వైత వేదాంత భాస్కరుడు శంకరాచార్యులవారు గంగానదిలో స్నానం చేసి, విశ్వనాథుని దర్శించుకొనుటకు వస్తున్నారు. అదే సమయంలో ఒక ఛండాలుడు కొన్ని కుక్కలను వెంటబెట్టుకుని ఆ దారిలోనే ఎదురు వస్తున్నాడు. కేరళలోని బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన శంకరులవారికి అస్పృశ్యతా వాసన పోలేదు. అందుకే అతడ్ని చూచి,*

*"గచ్ఛ దూరం గచ్ఛ దూరం" అంటే, "దూరంగా తొలగిపో" అన్నారు. ఇది అలవాటు యొక్క ప్రభావం. అలవాట్లు అంత త్వరగా వదలవు. ఒక బ్రాహ్మణుని వీపు జిలగా వున్నప్పుడు, జంధ్యంతో బరికేవాడు. వానికది అలవాటు. క్రొత్తగా సన్యాసం తీసుకున్నాడు జిల పుట్టినప్పుడల్లా జంధ్యం కోసం వెతుక్కునేవాడు. సన్యాసం పుచ్చుకుంటే మాత్రం అలవాటు ఎక్కడకు పోతుంది? అలవాట్లను కూడా సన్యసించాలి గదా! అలాగే, అంతటి మహాజ్ఞానియైన శంకరుల వారిలో కూడా పాత అలవాటు ప్రభావం చూపింది. ఆ వచ్చినవాడు నిజంగా ఛండాలుడు కాదు. శంకరులలోని ఆ ఛండాలదోషాన్ని పారద్రోలటం కోసం వచ్చిన పరమశివుడు. అలాగే దారికి అడ్డంగా నిలబడ్డాడు. నెమ్మదిగా ఆచార్యునితో అంటున్నాడు, "స్వామీ! దూరంగా పొమ్మంటున్నారే, ఎవరినో కాస్త వివరంగా చెప్పండి. ఇందులో రెండు అంశాలున్నాయి. 1) జడమైన శరీరం 2) చైతన్యస్వరూపమైన ఆత్మ. శరీరాన్ని పొమ్మంటారా? అది జడం కదా! స్వయంగా పోలేదు. చెప్పిన మాట విని అర్థం చేసుకునే తెలివి దానికి లేదు. కనుక, శరీరన్ని పొమ్మనటంలో అర్థం లేదు. అంతే కాదు, తమరి శరీరం, నా శరీరం రెండూ అన్న వికారాలే గదా! అన్నంతో పుట్టి, అన్నంతో పెరిగి, అన్నరూపమైన భూమిలో కలిసిపోయేవే. కనుక, మీవంటి జ్ఞాని, మీ శరీరం నుండి నా శరీరాన్ని దూరంగా పొమ్మనటంలో అర్థం లేదు. లేకపోతే, ఆత్మను పొమ్మంటున్నారా? అదెక్కడికి పోతుంది? ఆత్మలేని చోటంటూ లేదు గదా? అది కదిలేది కాదు గదా. కనుక మహాత్మా! మీమాట నాకర్థం కావటంలేదు. దయచేసి, కాస్త వివరంగా చెప్పండి" అన్నాడు. ఈ దెబ్బతో శంకరాచార్యులవారి లోకవాసన కాస్తా ఎగిరిపోయింది. మూడవనేత్రం తెరుచుకుంది. ఆ ఛండాలునికి చేతులు జోడించారు. అతడి పాదాలపై పడ్డారు. శరీరం వేరని, తాను వేరని, ఆత్మానాత్మ వివేకం కలిగి, తాను తానుగ వున్న మహాత్ముడు ఛండాలుడైతేనేమి, బ్రాహ్మణుడైతేనేమి? అతడే నా సద్గురువు అని భావించారు. కనుక, ఆత్మానాత్మల వివేకం వేదాంతానికి సింహద్వారం వంటిది. దానినే భగవద్గీతలో క్షేత్ర-క్షేత్రజ్ఞ విభాగం అన్నారు. ఈ క్షేత్ర-క్షేత్రజ్ఞుల జ్ఞానమే నిజమైన జ్ఞానము. క్షేత్రం కేవలం భ్రమాత్మకమని, అలాగే క్షేత్రజ్ఞుడు జ్ఞానస్వరూప పరమాత్మయని తెలుసుకొనుటయే జ్ఞానం, నిజమైన జ్ఞానం. క్షేత్రంలోని క్షేత్రజ్ఞుడ్ని తెలుసుకో. అదే నేను అని భగవంతుడు చెబుతున్నాడు.*

***దేహమనిత్యం - ఆత్మ నిత్యం***
***దేహం జడం - ఆత్మ జీవం***
***దేహమొక పరికరం - ఆత్మ దానికి చైతన్యం***
***ఆత్మావలోకం ముద్దు - భౌతికవాదం వద్దు***
***ప్రేమ దైవత్వం - సేవ మానవత్వం***
***అంతరంగ శక్తిని అనుభవించేది ముక్తి***
***అంతరంగంలో బోధించే బోధ గ్రహించాలి మేధ***
***అంతరంగశుద్ధితో ప్రకాశించేను బుద్ధి***
***నిజం తెలియని జీవితం, తెగిన పూలహారం***
***పవనకుమారుడందించిన ఎన్నో రహస్యాలు కర్మ జ్ఞాన మోక్ష మార్గాలు***

*అహం బ్రహ్మాస్మి, తత్త్వమసి, ప్రజ్ఞానం బ్రహ్మ,*
*సత్యం వద, ధర్మం చర అన్నవి తెలుసుకోండి.*
*జగమంతా - శాంతి నింపండి.*
*జగన్నాథుని పాదాలు పట్టుకోండి*
*నా చిన్నారి ముద్దుబిడ్డలారా!*

ఓం

**05-11-2019** 08:45 AM

**2) భయానికి కారణం ఏమిటి స్వామి? దానిని ఎలా అధిగమించాలి స్వామి?**

ఇద్దరు వ్యక్తులు దేనికీ భయపడరు. ఒకరు అన్నీ తెలిసిన జ్ఞాని – ఇంకొకరు పరమమూర్ఖుడు, అంటే దేని పర్యవసానం ఏమిటో, ఎలా వుంటుందో ఆలోచించలేని అవివేకి. మీరందరూ జ్ఞానులూ కాదు, పరమమూర్ఖులూ కాదు. మీరు మీ ఆలోచనలతో ఆనందంగా ఉన్నారా? అని ప్రశ్నించుకున్నట్లయితే, మనిషి తనతో, తన ఆలోచనలతో సంతోషంగా ఉండలేకపోవటం వలన కలుగుతున్న పరిణామం దుఃఖం. ఒకరోజు సెలవు వస్తే ఏమి చేయాలో తెలియదు. ఒక చక్కటి పుస్తకం చదువుకోవచ్చు, జపం చేసుకోవచ్చు, ధ్యానం చేసుకోవచ్చు, మౌనవ్రతాన్ని అవలంభించి మానసిక శక్తులను ఆదా చేసుకోవచ్చు. తనలో తాను వుండటానికి, తనలో తాను చూసుకోవటానికి కూడా భయపడిపోవటం వలన, మనిషికి ఎప్పుడూ బాహ్యవ్యాసంగం అవసరమవుతున్నది. తననుంచి తాను పారిపోవాలనుకుంటున్నాడు. తన ఆలోచనలంటే తనకే భయం. అసౌకర్యంగా పరిణమించిన ఈ ఆలోచనల నుంచి తప్పించుకోవటానికే, ఈ బాహ్యతంతులన్నీ. ఇలాంటి భావాలే అందరినీ నడిపిస్తున్నాయి. అంతా అలానే ఉండేసరికి, ఇక ఇదే జీవితమంటే అన్న భావన స్థిరమవుతున్నది. ఇది కాదు అని లోపల్నుంచి అంతర్వాణి పలుకుతున్నప్పటికీ, ఆ అంతర్వాణిని వినాలన్నా, విపరీతమైన భయం, భయం, భయం. అంత శక్తివంతమైనది ఈ భయమనేది. నిర్భయమనేది జ్ఞానప్రసాదితం. వైరాగ్యఫలం. వైరాగ్యం ద్వారానే మీరు భయరహితులవుతారు. కానీ, నేడు వైరాగ్యమన్నా భయమే. అదేదో వైఫల్యం వలన జనించింది అనుకుంటారు. ఒక భూతం లాగా చూస్తారు కానీ, వైరాగ్యం నిర్భయాన్ని ప్రసాదిస్తుంది. మనిషిని శక్తివంతుడ్ని చేస్తుంది. తాను కోల్పోయేది ఏదీ లేదని మీరు తెలుసుకున్నప్పుడు నిర్భయులవుతారు. సంతృప్తితో, ఆనందంతో జీవించగలుగుతారు. అమృతసాగరానికి సేతువు వైరాగ్యంతో నిర్మితమైంది. ఆ వారధిని చేరుకోవాలంటే, ఈ వారధిని ఆశ్రయించాల్సిందే. విచారణ చేస్తే ఇది అర్థమవుతుంది. అందుకే, త్యాగేనైకే అమృతత్వ మానసుః. అంటే త్యాగము ధైర్యాన్ని ఇస్తుంది – త్యాగం అలవర్చుకోవాలంటే ధైర్యం కావాలి. ఏది ముందు? "ఉదితౌదార్య సౌందర్య వైరాగ్య రసరంజితా ఆనందస్పందినీ యేషాం మతిస్తే భ్యాసినః పరే" అంటే, "ఎవరి బుద్ధి ఔదార్య సుందరమై, వైరాగ్యము నిండి, ఆనందమును అనుభవించుచున్నదో, వారే పరమసాధకులు" అని చెప్పదలుచుకున్నాను. మీరు ఇంతింత భయాలతో జీవిస్తున్నారు. అలా జీవించే

జీవితం ఒక జీవితమేనా? ఇంత భయంతో జీవించటం కూడా ఒక జీవితమేనా? అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. ఒక పర్యాయం కాదు, జీవించివున్నంత కాలం వేసుకోవాల్సిన ప్రశ్న ఇది. పూర్తిగా భయాన్ని పోగొట్టుకోవాలంటే ఏం చేయాలి? మరి ఆలోచించాలి కదా. మీరు తెలివైన వారైతే, మహావృక్షం తొర్రలో గొప్ప అగ్నికణం ప్రవేశించిందనుకోండి, అప్పుడు వృక్షం బైటకి తన ఆకులతో పిల్లగాలులను ఆస్వాదిస్తున్నట్లు కనిపించినా, లోపల మాత్రం శిథిలత్వం పొందుచుండునట్లు మీరు కూడా భయం, అసంతృప్తి, వెలితి, క్షీణిస్తున్న ఆయుష్షు లాంటి పరితాపాగ్నులతో దహించబడుతూ వేదన చెందుతున్నా, పైకి మాత్రం విషయసుఖాలతో అర్థవంతంగా గొప్ప ప్రయోజనం కోసం జీవిస్తున్నట్లు, మిమ్మల్ని మీరు మభ్యపెట్టుకుంటున్నారు. భయమంతా మనసు మీతో ఆడుతున్న నాటకమే. మనసును మీ అధీనంలోకి తెచ్చుకోవడమే జీవనపోరాట లక్ష్యం. మీకు అనుగుణంగా, విధేయంగా వర్తించేటట్లు చేసుకోవడమే అన్ని చదువుల సారం. మనోనిర్మూలనమే పూర్ణప్రజ్ఞకు నిదర్శనం. మనస్సు వీధికుక్కలాగా పని లేకనే, అటూ ఇటూ పచార్లు చేస్తున్నది. నెమలిపింఛపు తుది కొనలాగా చంచలమైనది. సాధించిన దానితో తృప్తిపడదు. సంకల్పపరంపరలను త్యజించే శక్తి లేక, దీనత్వం, వ్యాకులత్వం పొందుతున్నది. మనసు క్షీణిస్తే లోకాలు క్షీణిస్తాయి, విజృంభిస్తే లోకాలు విజృంభిస్తాయి. "సంతోషః పరమోలాభః సత్సంగం పరమాగతిః విచారః పరమజ్ఞానం శమోహి పరమంసుఖం" సంతోషమే మీరు కోరుకోవాల్సిన సంపద, సత్సంగమే నిజమైన భాగ్యం, ఆత్మవిచారణయే ఉత్కృష్ట జ్ఞానం, మనసు ఉపశమించడమే పరమసుఖానికి మార్గం. అంటే, జగన్నాటకమంతా బయటలేదు. లోపల్నుంచి ఉత్పన్నమవుతుంది. అంటే, మనస్సు ఉపశమిస్తే, అన్ని భయాలు, సంసారం ఉపశమిస్తుంది. మనస్సు వుంటే అన్ని భయాలు వుంటాయి. మనస్సు ఉపశమించాలంటే, వివేకబుద్ధిని పెంచుకోవాలి. నేనెవరిని? నా స్వరూపమేమిటి? అని విచారణ చెయ్యాలి. అందుకు కొంత ఏకాంతవాసం అవసరమవుతుంది. ప్రార్థన అవసరమవుతుంది. ప్రస్తుత స్థితిని మించి ఇంకో ఉన్నతమైన ఉనికి మీకు సాధ్యమన్న స్ఫురణ కూడా కావాలి. అందుకే ఉత్తిష్టత! జాగ్రత! అంటే, "ఓ మనిషీ మేలుకో!" అని. "కాలమనే బాలిక శరీరమనే పువ్వును మృత్యువనే చెత్తబుట్టలో పడవేయకముందు, మేలుకున్నవాడే, తెలివైన మనిషి". మరి, మీరు తెలివైనవారే కదా, మేలుకోండి. మీ నిజస్వరూపాన్ని తెలుసుకోండి. ఈ ఆంజనేయుని సహాయం అందుకోండి. చేయిపట్టుకుని మీ భయాన్ని వీడండి!

***అన్నీ తెలిసిన జ్ఞానులా? అక్షరజ్ఞానం లేని అజ్ఞానులా?***
***ఏది ఏమైతేనేం, మీరంతా మాయామోహితులు.***
***బ్రతుకు గాయాల పోరులో పెనవేసుకున్న మీరు,***
***జ్ఞానోదయపు శిఖరాలై ఆత్మీయత నింపుకుని,***
***పరవశంతో పారమార్థికాన్ని ప్రణవంతో కలిపి***
***పాటపాడుతూ పరవశించి పరవశించి***
***అదృష్టమనేడిది ఆంజనేయుని రూపంలో అరుదెంచి***
***అదృష్టం తొంగి చూస్తున్న వేళ***

***అరవిరిసిన ఆహ్లాదపు తామరలై***
***తీరని వెతల నడుమ తరగని ఆనందపు ఊటలై***
***నా దరి చేరినవేళ, మారుతి మమతల పిలుపుల్ని నంజుకుంటూ***
***కలసిరాని కాలమైనా, తెచ్చిన చద్దిని పంచుకుంటూ***
***ఆనందపు ఊయలలూగుచూ,***
***పలకరింపుల గుభాళింపుతో***
***అనుభూతుల ఆలింగనాలతో***
***పెదవి చివరన హాస్యముతో***
***పెనుభూతానికి చిక్కక,***
***పెరుమాళ్ళ పెన్నిధిని చేరి పరవశించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**06-11-2019** 08:45 AM

**3) నిష్కామకర్మ యొక్క విశిష్టత ఏమిటి స్వామి?**

మీరు నా మాటలు అనేకం వింటున్నారు. ప్రతిరోజూ చెబుతూనే వున్నాను. అనేకరకమైన అనుష్ఠానాలు, తీర్థయాత్రలు చాలానే చేస్తున్నారు. ఆడంబరాలతో కూడిన బాహ్యభక్తి బాగానే వుంది. కానీ, ఉన్న చిక్కల్లా హృదయవికాసమే లోపిస్తుంది. ఆధ్యాత్మికత ఆచరణకు, దైనదిన జీవితంలో మీ ప్రవర్తనకు, ఆలోచనా విధానానికి ఎటువంటి సంబంధం లేదని భావిస్తూంటారు. హృదయపరివర్తన లేకుండా, తోటివానికి మీ పరిధిలో సహాయం చేసే దయాగుణం లేకుండా వుంటే మీ జీవితాలు అర్థవంతం అవ్వవు, భగవంతుడూ హర్షించడు. మీరు చేసే పనులు మానవులు చూస్తారు. కానీ, భగవంతుడు మీ ఉద్దేశ్యాలను కనిపెడతాడు. చిత్తశుద్ధిలేని రిక్తసాధకులకు ఆత్మతత్త్వమెట్లు అలవియగును? మంచిచెడ్డల నడత మనుషులయందుండ, పైకి కానరాదు, బయటపడదు. మరలా జన్మకిదే మార్గమిచ్చు. మీలో చిత్తశుద్ధి వుంటే, మంచి నడతకు భగవంతుడే మార్గదర్శి అవుతాడు. కోలుకోవాలన్న ఆకాంక్ష రోగికి ప్రధానంగా వుంటేనే, చికిత్స ఫలిస్తుంది. నేను ఎన్ని చెప్పినా, మీరెన్ని విన్నా, ప్రయత్నము లేకపోతే, క్రమశిక్షణలో నూరో వంతైనా రాదు అని గట్టిగా చెప్పదలుచుకున్నాను. నేను ఇచట కూర్చుని ఎంతో ఓపికతో మీ కొరకు ఎన్నో సందర్భాలను, సంగతులను తెల్పుచున్నాను. ఈ ప్రబోధాలను విన్న తర్వాత, కొన్ని నిముషములైనా నిశ్శబ్దంగా కూర్చుని మననం చేసుకోకుండా దానికనీ, దీనికనీ పరుగులు తీస్తే, అక్కడితో ఈ ప్రబోధాలు మాయమవుతాయి. మహనీయుల ఉపన్యాసం విన్నా, ఆధ్యాత్మిక గ్రంథాలు చదివినా, వైరాగ్యభావనతో అంతా అర్థమైనట్లుగా అన్పించినా, ఆ ప్రాంగణం విడిచిన వెంటనే మామూలే. మీ పనులలో, మీ మాటలలో అవి మరుగున పడిపోతాయి. దైవానుగ్రహానికి పాత్రులు కావాలంటే,

నిష్కామకర్మ అంటే, ఫలితం ఆశించని సేవ చేయండి. సాధారణంగా మీరు ఫలితం ఆశించకుండా ఏ కర్మనూ చేయరు. నిజానికి కర్మలు చేయటానికి మిమ్మల్ని ప్రేరేపించేది ఫలితంపట్ల వున్న మక్కువే. కనుక, ఫలితాన్ని ఆశించకుండా ఎవ్వరూ ఏ పనీ చేయరు, చేయుట లేదు. కాని, మీ దుఃఖానికి, ఒత్తిడికి, ఆందోళనకు, కృంగుబాటుకు, విషాదానికి కారణం ఫలితం ఆశించి కర్మ చేయడమే. ఫలితం ఆశాజనకమైతే ఆనందం, నిరాశాజనకమైతే దుఃఖం. ఈ సుఖదుఃఖాలే మిమ్మల్ని బంధించేవి గాని, ఫలితం ఆశించడంవల్ల కాదు. సుఖదుఃఖాలు, జయాపజయాలు, మానావమానాలను సమానంగా స్వీకరించేవాడే యోగి అని చెబుతాను. కానీ, కర్మల వల్ల కలిగే ఫలితాలు ఎలాంటివైనా సమానంగా స్వీకరించగలిగే స్థితి, ఎలా లభిస్తుంది? అంటే, నిష్కామ బుద్ధి ద్వారానే సాధ్యమవుతుంది. సేవ అనే పదాన్ని మీరు బాగా గుర్తించాలి. సేవను, సహాయాన్ని ఒకటిగా చూడకండి. అడిగిన తర్వాత చేసేది సహాయం, అడుగకుండగనే అవసరం ఎరిగి చేసే ప్రతి కార్యమూ సేవే. అటువంటి సేవను భగవంతుడు హర్షిస్తాడు. నాగరికత పెరుగుతున్నకొద్దీ, ఆధ్యాత్మిక విలువలు నశించిపోతున్నాయి. దైవం గురించిన అవగాహన గానీ, చింతన గానీ మృగ్యమైపోతున్నాయి. చాలామంది, ఏనాడూ చూడని వారిని, ఎట్లా నమ్మేది? ఎట్లా ప్రేమించేది? అంటారు. పుష్పానికి రూపం వున్నది గానీ, వాసనకు రూపం వున్నదా? అలా అని, దానిని నమ్మకుండా వుండగలరా? అలాగే ప్రేమకు రూపం వున్నది. ప్రేమించేవారు లేకపోతే, ప్రేమ లేదు కదా! ఆ ప్రేమయే ఈ రూపము ధరించి మీముందు కూర్చుని మీకు బోధిస్తున్నది. బోధల సారం బాధపెట్టుట కాదు, మీరు బోల్‌గా అంటే, అంతా ఖాళీ అవ్వాలన్న నా సదుద్దేశ్యాన్ని అర్థం చేసుకుని, అర్థవంతమైన అభ్యాసంతో కూడిన ఆంతరంగిక ఆధ్యాత్మికతతో అలరారండి నా చిన్నారి ముద్దుబిడ్డలారా! ఇది ఆంజనేయుని ఆశీర్వచనం, అనంతమైన బోధ.

ॐ

**08-11-2019** 08:45 AM

**4) మాట్లాడటం ఒక కళ కదా స్వామి? మేము ఏ విధంగా మాట్లాడాలి స్వామి?**

ఒంటరిగా వున్నప్పుడు ఆలోచనలను, నలుగురితో వున్నప్పుడు నాలుకను అదుపులో ఉంచుకోగలిగితే, మీ జీవితం అదుపు తప్పకుండా వుంటుంది. నాలుకను అదుపు చేసుకోగల విద్య తెలిస్తే, అనేక విద్యలు అవలీలగా వంటపడతాయి. నోటిని అదుపులో పెట్టుకుని, అందరితో మర్యాదగా మాట్లాడుతూ, పద్ధతిగా నడుచుకుంటూ వుంటే ఎక్కడైనా, ఎప్పుడైనా మంచే జరుగుతుంది. చెట్టు సారం పండులో వ్యక్తమైనట్లుగా, మనిషి సారం అతడి మాటలలో తొంగిచూస్తూ వుంటుంది. మంగళకరమైన మాటతీరు, మనిషి సంస్కారానికి గీటురాయి. మనిషికి నిజమైన అలంకారం అతడి మాటతీరే. వాగ్భూషణం ఒక్కటే మనిషికి సుభూషణం. సంభాషణం, మితభాషణం, హితభాషణం, స్మితభాషణం, ప్రియభాషణం, పూర్వభాషణం, సత్యభాషణం అయినప్పుడు, అంతకన్నా భూషణం మరొకటి లేదు. మితంగా హితంగా మాట్లాడాలి. మనిషికి గౌరవం తెచ్చేవి ఇవే. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ మాట్లాడాలి. మధురభాషణం

వల్ల మర్యాద లభిస్తుంది. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది అన్న మాట విన్నారు గదా. ప్రియంగా మాట్లాడాలి. ఎదుటివారిని ముందుగా మీరే పలకరించడం పూర్వభాషణం. సత్యమే సర్వోన్నతమైనది. కనుక నిర్భయంగా సత్యాన్ని పలకండి. ఆ సత్యాన్ని ప్రేమగా, నేర్పుగా, మర్యాదగా, హుందాగా మాట్లాడాలి. ఆలోచించకుండా మాట్లాడటం, గురి చూడకుండా బాణం వేయడంలాంటిది. మాట్లాడిన తర్వాత ఆలోచించాల్సిన అవసరం రాకూడదు. కాబట్టి, ఆలోచించి ఆచితూచి మాట్లాడాలి. తాను ఏం మాట్లాడాలో తెలిసినవాడు తెలివైనవాడు. తాను ఏం మాట్లాడకూడదో తెలుసుకోగలిగినవాడు వివేకవంతుడు. ఎవరైతే తమ మాటలవల్ల ఇతరులకు బాధ కలిగించకుండా వుంటారో, వారే ఉత్తములు. ఆచరిస్తూ చెప్పే మాటలకు ఆదరణ ఎక్కువ. ఆదరణపూర్వకంగా చెప్పే మాటలకు ఆదరణ ఎక్కువ. ఆకట్టుకునే విధంగా మాట్లాడటం ఓ కళ. అయితే, ఆ మాటలను ఎప్పుడు మొదలుపెట్టాలో, ఎప్పుడు ఆపాలో తెలియడం మరీ ఒక గొప్పకళ. మాటలే మంత్రాలు. చెట్లే ఔషధాలు. మాటలు చాలా పదునైనవి కనుక, జాగ్రత్తగా వాడాలి. బలమైనవి కనుక సున్నితంగా వాడాలి. ఖరీదైనవి కనుక పొదుపుగా వాడాలి. మాట్లాడటం అందరూ చేస్తారు. అయితే, అందరిలాగా కేవలం నోటితో మాట్లాడితే సరిపోదు. మరింత ప్రభావాన్వితంగా ఉండాలంటే మనసుతో, శరీరంతో మాట్లాడాలి. మాటే సంపదలకు, మానవసంబంధాలకు మూలం. మాటే స్నేహితుల్ని సంపాదించిపెడుతుంది, శత్రువుల్ని తయారుచేస్తుంది. "నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ" అని విన్నారు కదా! అలాంటివారికి శత్రువులే వుండరు. మాటలు గాయపరచగలవు, గాయాన్ని నయంచేయగలవు. సరైన మాటతీరు, చంపడానికి వచ్చిన శత్రువు మనసునైనా మార్చగలదు. మాటల మధ్యలో సందర్భానుసారంగా సామెతలు, ఛలోక్తులు వాడితే, పాయసంలో జీడిపప్పులా మరింత మధురంగా వినసొంపుగా అన్పిస్తుంది. సంభాషణ సరస, చతురత కలిగి వుండాలి. తిడుతూనే నవ్వించే హాస్యకుశలత కలిగి వుండాలి. ఎవరితో, ఎప్పుడు, ఎలా మాట్లాడాలో తెలిసివుండాలి. మనిషికి భావవ్యక్తీకరణ గొప్ప ఆస్తి. ఏం చెప్పారన్న దాని కన్నా, ఎలా చెప్పారనే దాన్ని బట్టి భావప్రసరణ మరింత ఆకర్షణీయంగా వుంటుంది. భావవ్యక్తీకరణ ఎంత గొప్పగా వుంటే, ఫలితం అంత మహత్తరంగా వుంటుంది. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, మీ అందరిలో భావవ్యక్తీకరణను సరిచేసుకోమని చెబుతున్నాను. ఎదుటివారిని బాధించకండి. ఆంజనేయుని బోధలు బాగా జీర్ణించుకుని బాధలు లేని సంభాషణతో పదుగురికి ఆనందాన్ని అందివ్వండి.

***సాధన అంటే సాధించడం కానేకాదు - సాధించాలి అనే భావనను వదలటమే!***

***సాధించాలి అనేది అసంతృప్తికి చిహ్నం.***

***సాధించవలసింది లేదు అనేది సంతృప్తి - సాధనలో అసంతృప్తి వుండకూడదు.***

***సాధించలేకపోవడమే అహంకారం***

***సాధించవలసింది లేదు అనే భావనే సాధనలోని అత్యంత కీలకాంశం***

***దేవుడిచ్చిన జీవితాన్ని ఉత్సవంగా జరుపుకోండి***

***పరవశించిన ఆనందంతో, దుఃఖమన్నది మరచిపోండి***

***నచ్చినవాటిని పంచుకుంటూ, మారుతి మాటలు మన్నిస్తూ,***

***విజ్ఞానద్వారాలు తెరుచుకుని, వినమ్రులై విధిగా నా దరి చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**09-11-2019** 08:45 AM

**5) ఎటువంటి విలువలను అనుసరించుట వలన జీవితం సార్ధకం అవుతుంది స్వామి?**

*మీరు దేనికి తగిన విలువ దానికి అందించుటయే నిజమైన యోగము. ఒక అమాయకుడైన గొల్లకాపరి తన మేకలను మేపటానికి తోలుకుని వెళ్ళాడు. దారిలో తళతళా మెరుస్తూ ఒక వజ్రం కంటపడింది. దాని విలువ తెలియక, ఆ మెరుస్తున్న రాయిని ఒక చిన్న మేకపిల్ల మెడలో కట్టి, ఆనందించసాగాడు. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న ఒక రత్నాల వ్యాపారికి దాని మీద కన్నుపడి, "అబ్బాయీ! ఈ రాయి నీకు ఎక్కడ దొరికింది? దానిని మేక మెడలో ఎందుకు కట్టావు?" అని ప్రశ్నిస్తే, అది దొరికిన వస్తువని చెప్పాడు కాపరి. ఆ వజ్రము కొన్ని లక్షల విలువగలదని వ్యాపారికి తెలుసు. తిరగమరగిన కాలు, తిట్టమరగిన నోరు, కొట్టమరగిన చేయి కట్టినా వుండవు. ఆ వ్యాపారి, "రాయి నాకిచ్చేస్తే, పది రూపాయలు నీకు ఇస్తాను. దానితో అనేక రాళ్ళను కొనుక్కుని, అన్ని మేకలకు కట్టుకోవచ్చు" అనగానే, వజ్రం విలువ తెలియని ఆ కాపరి పదిరూపాయలు తీసుకొని, దానిని వ్యాపారి చేతిలో పెట్టాడు. లక్షల విలువ చేసే వజ్రం కేవలం పదిరూపాయలే దొరికింది కదా అని ఆ వ్యాపారి ఆనందిస్తుండగా, ఆ వజ్రం ఉన్నట్లుండి పగిలి ముక్కలైపోయింది. వెంటనే అశరీరవాణి వర్తకునితో, "వర్తకుడా! నా విలువ తెలిసినప్పటికీ, నీవు నన్ను మోసం చేయడానికి ప్రయత్నించావు. విలువ తెలియని ఆ కాపరి ఎట్టి అహంకారము, అభిమానము లేకుండా నన్ను మేక మెడలో కట్టి ఆనందించాడు. కానీ, విలువ తెలిసిన నీవు మోసం చేయడం చూసి, నా హృదయం పగిలిపోయింది" అన్నది. అందుకే, భగవన్నామాన్ని మీరు విలువ తెలుసుకుని పలకాలి. అందుకే, త్యాగరాజులవారు కూడా "తెలిసి రామచింతన చేయవే మనసా!" అన్నారు. కనుక, దేనికి తగిన విలువ దానికందించుటయే నిజమైన యోగం. ఈనాడు మీరు బ్రహ్మజ్ఞానాన్ని ఏదో రీతిగా ఉపయోగించుకుంటున్నారంటే, దాని విలువ మీకు తెలియదు అనే చెప్పాలి. ఒక డైమండ్ విలువ తెలిస్తే, దానిని బీరువాలో పెట్టి, తాళం వేసి ఆ తాళంచెవిని భద్రంగా దాస్తారు. తెలియనంతవరకు దానిని పేపర్‌వెయిట్‌గా బల్లమీద పెడ్తారు. ఈనాడు మీరు ఆధ్యాత్మికం యొక్క విలువ తెలియక, దానిని అలక్ష్యం చేస్తున్నారు. నామము అనే రత్నం విలువ తెలియనప్పుడు అది మీ వద్దవున్నా ఉపయోగం లేదు. నామస్మరణ అత్యంత శక్తివంతమైనదని, అందువల్ల, త్రికరణశుద్ధి కలుగుతుందని వాల్మీకి చరిత్ర మీకు నిరూపిస్తుంది. ఈ ఆంజనేయుని జీవితం కూడా నిరూపిస్తుంది. నామస్మరణలో భావం ముఖ్యం. భగవంతుడు భావప్రియుడు. మానవుడు కూడా భావప్రియుడే. ఎందుకంటే, మానవుడే మాధవుడు కదా! మీకు అతి దగ్గరగా వచ్చిన స్వామి అందరినీ ప్రేమస్వరూపులారా! అని సంబోధించేవారు. ఎందుకంటారూ? ఒక్కసారి ఆలోచించండి! ఇతర సంబోధనలు ఏమీ వుండవు. అలాంటప్పుడు*

*ఎంతమంది ఆ సంబోధనకు తగినట్లుగా నడుచుకుంటున్నారనే ప్రశ్నకు మీకు మీరే సమాధానం చెప్పుకోవలసి వస్తుంది కదా! ఉదాహరణకు ఒక కుక్కపిల్లను తెచ్చి దానికి 'టామీ' అని పేరుపెట్టి సాకుతూ (దానికి మాత్రం తన పేరు టామీ అని తెలియదు), ఒక ప్లేటులో పాలుపోసి, "టామీ టామీ" అని పిలిస్తే, అది వచ్చి పాలు త్రాగుతుంది. కొన్ని రోజులు అలా జరిగాక, టామీ అనే పేరు వినగానే ఆ కుక్కపిల్లకు తానే టామీ అని తెలిసిపోతుంది. ఇలా ఆ చిన్న కుక్కపిల్ల తన పేరును కొన్నాళ్ళకు గుర్తించగలుగుతుంది. మిమ్మల్ని "ప్రేమస్వరూపులారా!" అని స్వామి కొన్ని దశాబ్దాల తరబడి సంబోధిస్తున్నా మీరు మాత్రం కుక్కపిల్ల కంటే గొప్పవాళ్ళం కాదని నిరూపించుకుంటున్నారు. కానీ, ఏనాటికైనా మానవుడు తన పేరును గుర్తించలేకపోతాడా? అని ఆశతో భగవంతుడు మాత్రం తన సంబోధనను మానలేదు, మార్చుకోలేదు. ప్రేమాభిమానాలకు బదులుగా తీయగా మాట్లాడి, లోపల కుటిలంగా వుండటం కపటమవుతుంది. జంతువులు వాటి భావోద్వేగాలను అణచుకోలేవు. అవి కొమ్ములు చూపి, కాళ్ళు నేలకు తాకించి, కోరపళ్ళు బయటకు పెట్టి బెదిరిస్తాయి. మనిషి మాత్రం ఏ హావభావాలూ లేకుండగానే, వాటికంటే కౄరంగా ప్రవర్తిస్తున్నాడు. జీవితంలో ప్రేమతత్త్వం పెరగాలంటే జీవనవిధానంలో భావోద్వేగాలను నియంత్రించుకోవాలి. కానీ, ఆడంబరాలకు మీరు పెద్దపీట వేస్తున్నారు. సింపుల్ లివింగ్ – హై థింకింగ్ కావాలి. నిరాడంబరానికి నిలువెత్తు నిదర్శనం పరమేశ్వరుడు. వాసం–రుద్రభూమి, అంబరం–ఏనుగు చర్మం, బిరుదు–ఆదిభిక్షువు. ఏ దేవతలతో పోల్చినా, జీవనశైలి నిరాడంబరం. అయితే, నిరాడంబరంగా, నిస్సంగంగా వుండమంటే, మీ చుట్టూ వున్నవాళ్ళ అవసరాలను గుర్తించకపోవటం కాదు. అనుబంధాలను మర్చిపోవటం కాదు, మీకు లేకపోయినా ఇంకొకరికి పెట్టమనీ కాదు. ఉన్నదానిలో ఇంకొకరికి పెట్టడం మానవత్వం. ఒక వస్తువు మీ దగ్గర వున్నది, ఇంకొకరి వద్ద లేకపోతే మీకు అహంకారం. ఇంకొకరి వద్ద వున్నది మీ దగ్గర లేకపోతే అసూయ. మీకెప్పుడూ పరుల ధ్యాసే గానీ, పరమాత్మ ధ్యాస లేదు. కాకి రంగు కాకిదే, హంస రంగు హంసదే. పోలికలెందుకు? శివుని వాసం స్మశానం – వైకుంఠంలో శేషతల్పంపై సేదతీరుతూ వున్న విష్ణువుతో తనను పోల్చుకోలేదు. ఆభరణం సర్పం – విష్ణువులాగా కౌస్తుభహారాలు లేవని చింత లేదు. వాహనం నంది – గరుడవాహనుని చూచి బాధపడలేదు. జీవనాధారం భిక్షాటన – ఇంద్రునిలాగా కల్పతరువు, కామధేనువు లేవని విచారిస్తూ కూర్చోలేదు. ఇతరులతో పోల్చుకునే రుగ్మతల నుంచి బయటపడలేకపోతున్నారు మీరు. పరచర్చే గానీ, ఆత్మచర్చ లేదు.*

***మానవత్వమే మనిషికి వెలకట్టలేని ఆభరణం***<br>
***మానవత్వాన్ని మించిన మహోన్నత సంపద లేదు***<br>
***మానవత్వాన్ని మరచిపోతే, మనిషి మృగంకన్నా హీనం***<br>
***మానవత్వంతో జీవించేవారు మాధవులుగా మారతారు***<br>
***మానవత్వమంటే కరుణ, జాలి, దయ, ప్రేమ, ఆప్యాయత***<br>
***మానవత్వం లేకపోతే, జీవితానికి అర్థం, పరమార్థం వుండవు***<br>
***మానవత్వాన్ని మించిన ఔన్నత్యం సృష్టిలో ఏముంటుంది?***

***మానవత్వం అనే పుస్తకం కంటే, వేరే ఉత్తమ గ్రంథం మరొకటి మీకు ఏముంటుంది?***
***ఆచరణ లేని పుస్తకపఠనం అతి ప్రమాదకరం***
***మనిషి మనసును స్పృశించే విజ్ఞానద్వారాలు తెరవాలి***
***అసలైన జ్ఞానం సృజించాలి***
***జీవితాన్ని జీవించడం మరచిపోకూడదు***
***చూపులే తప్ప చేతలు లేవు***
***రాత్రి పగలు చూపులే తప్ప చేతలు లేని నా బిడ్డలను***
***ఈ చిరంజీవి చిరుచిరు నడత నేర్పుటకై అనేక మార్గాల బోధిస్తూ***
***అంతరంగ ప్రయాణానికి సిద్ధం చేస్తున్నాడు***
***ఈ పవనకుమారుడు తన ఈ చిన్నారి బిడ్డలను తెలుసుకోండి***
***నా చిన్నారి బిడ్డలారా!***

ఓం

**10-11-2019** 08:45 AM

**6) అన్నదాత అంటే ఎవరు స్వామి? అన్నదానం యొక్క విశిష్ఠత ఏమిటి స్వామి?**

*మీ ఇంటికి భోజనానికి వచ్చిన అతిథులలో కొందరు "అన్నదాత సుఖీభవ" అని ఆశీర్వదించి వెళ్ళడం మీరు చూస్తుంటారు. వారలా అన్నప్పుడు, మీరు అన్నదాతలమని, మీకు సుఖం కలగాలని ఆశీర్వదిస్తున్నారని మీరు అనుకోవటం సహజం. కానీ, నిజంగా అన్నదాత అంటే ప్రభుత్వనేతలు, మీ రాజకీయ నాయకులు తరచూ పొగుడుతుండే 'రైతులే' అన్నదాతలు. ఒక్క రైతులే కాదు, పొలం పనిచేసే రైతు కుటుంబం, కూలీలు, ఎడ్లు, ఆహారోత్పత్తుల కోసం పాలుపంచుకుంటున్న ప్రతివారూ అన్నదాతలే. పూర్వజన్మలో మీకు కుమారులుగా జన్మించి తద్దినాలు పెడుతున్నవారు నిజంగా మీ అన్నదాతలే. పారలౌకిక దృష్టితో చూస్తే, తద్దినం పెట్టే వారందరూ అన్నదాతలే. అతడక్కడ పెట్టిన పిండం, అటు పితృదేవతలకు, మీ పూర్వజన్మ కాయంలోని జీవాత్మకు, తిరిగి జన్మించిన తర్వాత ఈ జన్మలో దేహానికీ కూడా ఆ పిండం ఆహారదాయి అవుతుంది. కనుక, పూర్వజన్మలో తద్దినం పెట్టేవారు కూడా అన్నదాతలే. లోకంలో "పెడితే పుడుతుంది" అనే వాడుకపదం వాడుతుంటారు. అంటే, పూర్వజన్మలో మీరు అన్నదానం చేసివుంటే, ఈ జన్మలో మళ్ళీ ఆహారం లభిస్తుంది. కనుక, అన్నదానమనేది కేవలం మీ విధి, కర్తవ్యంగా చేయాలే గాని, పుణ్యం కోసం కాదు, కామ్యకర్మగా చేయరాదు. ప్రతిరోజూ అన్నదానం చేయండి. ఏదో ఒక జీవికి ఆహారాన్ని అందించండి. అసలు అన్నదాత భగవంతుడే. ఆయనపట్ల భక్తి కలిగి వుంటే, మీ అవసరాలన్నీ ఆయనే చూస్తాడు. రామావతారంలో శరణన్న వారిని కాపాడుతానని అభయమిచ్చాడు. ఆ రోజుల్లో మానవుల కనీస అవసరాలకు లోటులేదు. కృష్ణావతారంలో నన్ను నమ్ముకున్నవారి యోగక్షేమాలను నేను చూస్తానని వాగ్దానం చేశాడు. షిరిడి బాబా అవతారంలో నా భక్తుని ఇంట లేమి*

అనునది ఉండదు అని హామీ ఇచ్చాడు. నేటి రాముడు సాయిరాముని అవతారంలో, నా భక్తుల అన్నపానాదులకు ఎన్నడూ లోటు రానివ్వను అని భరోసా ఇచ్చాడు. ఆ రాముని దూతగా, సేవకుడిగా ఈ ఆంజనేయుడు భక్తితో కూడిన ముక్తితత్త్వాన్ని బోధించి, శరణాగతి మార్గంలో పయనించేటట్లు చేయగలను అని నా రాముని సాక్షిగా నిజం చెబుతున్నాను. ఆంజనేయుని నమ్మినవాడి అడుగు అధఃపాతాళానికి కాదు, అంబరం వైపు అడుగు వేయిస్తాడు. ముందుగా కావల్సింది అంతరంగ ప్రక్షాళన. దీనికై అనేక రకాలుగా బోధిస్తున్నాడు. దీనిని విని ఆచరణలో పెట్టగలిగితే, జీవితమనే పంటను పండించి నిత్యాన్నదానము చేయవచ్చు. "అన్నదాత సుఖీభవ" అన్న ఆకాంక్ష అతిథులే కాదు, ఎవరింట్లో వాళ్ళు, ఎవరికి వారు అనుకోదగిన మాటే. ఎందుకంటే, మీకు ప్రత్యక్షంగా కన్పించే అన్నదాతకాక, ఇలా పరోక్షంగా వున్న అన్నదాతలెందరో! భగవంతుడు మీకు ఇచ్చిన దాంట్లో నుంచే ఎంతోకొంత శక్తి మేరకు ఇతరులకు సహాయపడటం ఒక కర్తవ్యం. మీవాళ్ళకు ఎంత పెట్టినా అది దానం క్రిందకు రాదు, ఇతరులకు ఇవ్వడమే దానం. దీనిని ఎవరూ భారం అనుకోకూడదు. దానమిచ్చిన వారికి అంతకంటే ఎన్నోరెట్లు ఫలం దక్కుతుంది. దానం ఒక బీజం. దాని నుండే అనేక ఫలాలు వృద్ధి అవుతాయి. ధర్మమార్గంలో తగినంత ధనం దొరక్కపోతే అవసరాలు తగ్గించుకోవాల్సిందే గానీ, అధర్మమార్గం మాత్రం అనుసరించకూడదు. సకాలంలో ప్రత్యుపకారం ఉపేక్షింపక కర్తవ్యబుద్ధితో ఇచ్చే దానం సాత్త్వికము. ప్రతిఫలాన్ని ఆపేక్షించి అహంకారంతో మనఃక్లేశముతో చేసేది రాజసికము, దేశకాలపాత్రలను గమనించక అర్హులు కానివారికి చేయబడునది తామసిక దానము. అనగా, తిరస్కారభావముతో "ఫో! తీసుకుఫో!" అని తిట్టుకొనుచూ ఇచ్చునది. దానమనేది డబ్బు రూపంలోనే వుండాలనే నియమం ఏమీ లేదు. పేదవాళ్ళు సైతం దానం చేయవచ్చు. శ్రమదానం కూడా గొప్ప దానమే. అట్లే, విద్యాదానం, సత్సంగాలను ఏర్పాటుచేయడం, ఆధ్యాత్మిక గ్రంథాలను ముద్రించి సాధకులకు పంచడం, తక్కువ ధరకు ఇవ్వడం కూడా దానమవుతుంది. పశుపక్ష్యాదులందు కారుణ్యం చూపడం, నిర్ధనులు రోగిష్టులకు చికిత్స, పాఠశాలలు ఆసుపత్రులు నెలకొల్పడం, అనాథ శరణాలయాలు ఏర్పర్చడం, వికలాంగులకు సహాయం చేయడం, రక్తదానం, నేత్రదానం వంటివి ఎన్నో వున్నాయి. ఎవరికి ఏది కలిగితే, అది లేనివారికి మనఃపూర్వకంగా ప్రీతితో ఇవ్వడమే దానం. మాటసహాయం, డబ్బు సహాయం కంటే ఎన్నోరెట్లు గొప్పది. భారతంలో ఒక సన్నివేశం గుర్తుకు తెస్తాను. కర్ణుడు అభ్యంగనస్నానం చేసే ముందు నూనెతో ఉన్న బంగారుగిన్నెను శ్రీకృష్ణుడు హఠాత్తుగా వచ్చి దానమివ్వమని కోరగా, కుడిచేతి నుండి నూనెను తీసి ఎడమచేతితో దానమిచ్చిన కర్ణుడిని ప్రశ్నించిన కృష్ణునికి కర్ణుడిచ్చిన సమాధానం, "క్షణం చిత్తం, క్షణం విత్తం, క్షణం జీవితం మావయోః యమశ్య కరుణా నాస్తి ధర్మస్య త్వరితాగతి" – "మనసు క్షణం, ధనం క్షణం. ఎడమచేతి నుండి గిన్నె కుడిచేతిలోకి వచ్చేలోగా మనస్సు మారవచ్చు. యమధర్మరాజుకు ఏమాత్రం కరుణ లేదు. సమయమాసన్నమవగానే ప్రాణం లాగేస్తాడు. కనుక, అనుకున్న వెంటనే ధర్మం చెయ్యాలి" అని బదులిచ్చాడు కర్ణుడు. ఏదైనా ఉపకారం చేసే ముందు, అవతలి వ్యక్తి యోగ్యతను పరిశీలించాలి. ఎందుకంటే, ఆవుకు వేసేది గడ్డి, ప్రకృతిలో ఇంతకంటే తేలికైనది, తక్కువైనది ఇంకొకటి లేదు. ఆ గడ్డి తిని ఆవు కమ్మని పాలను ఇస్తుంది. ఆ పాలను పాముకు పోస్తే అది ఇచ్చేది ప్రాణం తీసే విషం. కనుక

*దోషవంతులకు మీరు చేసే ఉపకారమూ అంతే. దానానికి విచక్షణా జ్ఞానం అవసరం. అన్నదానానికి అటువంటి ఎటువంటి విచక్షణ అవసరం లేదు. నమఃశివాయ అనునది శివపంచాక్షరీ మంత్రం. నమః అంటే (మంగళకరమైన దానికి) నమస్కరించుచున్నాను. శివాయ అంటే మంగళకరమైనది (సుఖము చేకూర్చునది). అనగా, శుభకరమైన ఓంకారమునకు నమస్కరిస్తున్నాను అని అర్ధము. మంత్రములను మంగళకార్యములందు పఠించే తంత్రములుగా భావించి, వీటిని మీరు అలక్ష్యం చేస్తున్నారు. మంత్రములనే బరువులను మోస్తున్నారు గానీ, మంత్ర అర్ధములనే సుగంధములను స్వీకరించుట లేదు. పాపం అనునది పశుపక్ష్యాదులకు అన్వయించదు. వాటికి బుద్ధికుశలత, మంచిచెడ్డలు విచారించే శక్తి లేదు. కాని, ఈ ఆంజనేయునికి వున్నది. మానవునకు ఉన్నది కనుక మానవులను ఉద్ధరించే నిమిత్తమే భగవంతుడు పాపం, శాపం, శాసనం, శాస్త్రం అని నిర్దేశించి మానవునికి ఒక్కనికే వర్తింపచేశాడు. ఈనాడు దైవం చెంతకు వెళ్ళి కూడా ధనాన్ని ఆశిస్తున్నాడు కానీ దయను, ప్రేమను ఆశించడం లేదు. ఇక మీలో ఆధ్యాత్మికత ఏ విధంగా అభివృద్ధి అవుతుంది? ఆలోచించండి!*

***అపురూపమైన భవిష్యత్ అంధకారంలో***
***వారసత్వ వలయ మోహాన్వితుడవై***
***స్వరూప వర్తమాన వెలుగును ఆర్పుకుంటూ***
***నీలోని నన్నే గుర్తించడంలేదు***
***నిన్ను నీవు కోల్పోయి ఎంతకాలమైందో, నన్నే ఎవరని అడుగుతున్నావంటే!***
***లక్ష్యం వేరుగా ఉన్నప్పుడు, రసాస్వాదన లేని జీవితాలతో,***
***రగులుతున్న ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో ఏమి సాధించారు ఇప్పటి వరకు?***
***కాలం చేజారే వరకేగా?***
***ఎందాక సాగిస్తారు ఈ పయనం?***
***తప్పినపోయిన వాటిని వెతుకుతూ, దూరమైన అనుభూతులకై ప్రాకులాడుతూ***
***శూన్యంలో హాహాకారాలు చేస్తూ వుంటే ఎలా?***
***ఇప్పటికైనా మిమ్మల్ని మీరు మలచుకోండి***
***అజ్ఞానపు పార్శ్వపు పొరల్ని ఛేదించి***
***జ్ఞానసూర్యులై వెలుగొంది***
***నువ్వే నేనుగా నేనే నువ్వుగా మారాలని***
***మారుతి ఆశయాన్ని మాట తప్పక సాగిస్తే***
***ఈ ఆంజనేయుడు రక్షణ కవచమై నిలిచి***
***రొమ్ము గుద్ది మీ ఎదుట నిలుస్తాడు రామ పాదదాసుడు ఈ ఆంజనేయుడు తన బిడ్డల కొరకై***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**20-11-2019** 08:40 AM

**7) జీవితంలో మేము గుర్తించి ఆచరించవలసిన మెళకువలు, విలువలు ఏవి స్వామి?**

*మీకు సందేహాలు కలగాలి. తర్కబద్ధంగా వాటి గూర్చి ఆలోచించాలి. విషయపరిశీలన విషయంలో విచక్షణతో ప్రవర్తించాలి. వివేచన లేని పరిశోధన నీడలేని ఎడారినడక లాంటిది. సంపూర్ణ విషయాన్వేషణ ఒంటరిగా చేయడం సాధ్యం కాదు. ఇలా చేయాలంటే, ఎంతో అధ్యయనం కావాలి. మనిషికి భగవంతుడు జీవితకాలంలో ప్రసాదించిన ఎన్నో పగళ్ళు, మరెన్నో రాత్రులు కదా! వీటిని సుఖాన్వేషణలో వ్యర్థం చేసుకుంటున్నారు. సత్యాన్వేషణలో జీవితాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేయ్యడం లేదు. అద్వైతంలో ప్రధానంగా మూడు విషయాలు ద్యోతకమవుతాయి. ఒకటి బ్రహ్మసత్యం, రెండు జగన్మిథ్య, మూడు జీవుడే బ్రహ్మ. ఇక్కడ బ్రహ్మ అనేది దేవుడికి పర్యాయపదంగా గ్రహించాలి. ఈ ముఖ్యమైన మూడింటిని గూర్చి ప్రకృతిలో జీవుడు నిరంతరం అనేకానేక సందేహాలతో అన్వేషిస్తూనే వుంటాడు. పుట్టుకతో భోగియైనవారు, తర్వాత వ్యక్తం చేయలేని అనేక రోగాల పాలవుతారు. పుట్టుకతో కష్టాలకోర్చి భగవధ్యానంలో ప్రశాంతచిత్తంతో జీవించువారు, తర్వాత భోగాలను అనుభవించవచ్చు. సుఖం ఎవరో ఒక్కరి సొత్తు కాదు. అలాగని దుఃఖం ఎవర్నో ఒకర్ని పట్టుకుని జీవితాంతం పీడించదు. ఏమీ తెలుసుకోకుండా జీవిస్తుంటారు ఎక్కువ మంది – ఏదో కొంత తెలుసుకుని జీవిస్తూంటారు ఇంకొందరు – పూర్తిగా తెలుసుకుని జీవించేవారు అతి కొద్దిమంది కూడా వుండరు. ఒకవేళ వున్నా, అరుదుగా వుంటారు. వాళ్ళు మాటలతో కాలక్షేపం చేయరు. ఈ జీవనసూత్రం అర్థమైనవారికి దుఃఖనివారణామార్గం తెలిసే వుంటుంది. సత్యం అంటే నిజం చెప్పడం అనే అర్థం మాత్రమే కాదు. సత్యంలోని విశాలార్థాన్ని గ్రహించాలి. మనోవాక్కాయకర్మలతో సత్యాన్ని అనుసంధానించి, బాహ్యజీవితాన్ని ఆంతరంగిక జీవితంతో సమ్మేళనం చేయాలి. ఆసన్నమైన కష్టాలను లక్ష్యపెట్టకుండా, ఏకాగ్రచిత్తంతో ప్రవర్తించాలి. దైవానికి, గురువుకు, ధర్మానికి, నీతికి, సమాజానికి, చట్టానికి భయపడటం అవసరమే. కానీ, అది మితమై ఆదరణ, విశ్వాసం, శ్రద్ధతో కూడి వుండాలి. అదే భయ సందేహాలతో, నిరాశా నిస్పృహలు సృష్టించుకుని, బెంబేలెత్తి కృంగిపోకూడదు. లౌకిక ప్రపంచంలో మానవసేవ చేసి, సంతృప్తి పొందాలన్నా, అలౌకిక తత్త్వంతో మాధవసేవ చేసి కైవల్యం సాధించాలన్నా, అడుగులు ముందుకే వెయ్యాలి. సత్కార్యాలకు విపత్తులు ఎదురవుతూ వుంటాయి. నిరాశతో అడుగులు వెనక్కు వేయడం వల్ల విపత్తులను తప్పించుకోలేరు. బుద్ధి చాలా చంచలమైంది కూడా. కోరికను నియంత్రించటానికి శరీరాన్ని, ఇంద్రియాల్ని, మనసును అదుపాజ్ఞలో పెట్టుకోవటానికి, సమాలోచన చేసి సమన్వయించుకునే బుద్ధి మనిషికి ఆ భగవంతుడు ప్రసాదించిన ఒక వరంగా భావించాలి. కొత్త ధనం కోసం, మనసు ఉవ్విళ్ళూరుతూ వుంటుంది. కానీ, లోలోపల సాధనేచ్ఛ మాత్రం వుండదు. దీనిని కోల్పోవడం అంటే, జీవితంపట్ల ఆసక్తిని కోల్పోవడమే. అంతేకాక, ఆసక్తులు ఏమిటో స్పష్టంగా తెలియకపోవటం మరో కారణం. కాబట్టి, ఎవరికి వాళ్ళు తమ నిజమైన ఆసక్తులేమిటో తెలుసుకుని, అందుకు అనుగుణంగా పనిచేయాలి. ఇదే మనిషికి ఆనందకరమైన*

ఆధ్యాత్మిక జీవితాన్ని ప్రసాదిస్తుంది. హృదయ సౌందర్యాన్ని అర్థం చేసుకోవాలంటే, సంస్కారం వుండాలి. అందం తక్కువ వున్నవాళ్ళు కూడా ఆభరణాలు, వస్త్రాలు, అలంకరణల చేత ఆకర్షణీయంగా కనబడవచ్చు. ఇవ్వన్నీ భౌతిక సౌందర్య సాధనాలు. అవన్నీ తాత్కాలికమైనవి. బాహ్య సౌందర్యానికైతే పరిమితులుంటాయి. హృదయ సౌందర్యం అపరిమితం. హృదయ సౌందర్యంలో కరుణ, ప్రేమ, సానుభూతి వుంటాయి. ఇది దైవాంశాలు. ఏదైనా మంచిపని చెయ్యాలనే భావన మనసులో కలగటమే గొప్ప అదృష్టం. ఇతరులకు మేలు చేయాలని అనుకోవడం ఇంకా గొప్ప అదృష్టం. ఆ భావాన్ని ఆచరణలోకి తేవటానికి సంకల్పబలం అధికంగా వుండాలి. అహింస, దానం, ధర్మం, సహనం అనేవి ఉత్తమ ధర్మాలు. సహనం కలవాడిని విజయం వరిస్తుంది. సహనం కల్గి, ధర్మం మీద ఆదరం కలవాడికి లోకం తలవంచి నమస్కరిస్తుంది. అనుభవరీత్యా మీకు అర్థమయ్యే విషయం ఏమిటంటే, రుచి లేక, అభిరుచి ద్వారా లభించే ఆనందం తాత్కాలికమే. ఆహారం తీసుకుంటే ఆకలి తీరుతుంది. కొంత సమయం గడిచాక మళ్ళీ ఆకలి, దాహం వేస్తాయి. తాత్కాలిక ఆనందపరిస్థితి కూడా అంతే. శ్రోతలు ప్రశ్నలు వేస్తే ప్రవచనం చెప్పే వ్యక్తి తాను మాత్రమే ఆ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడు. ఇటువంటి ప్రశ్న పూర్వం ఎవరెవరు వేశారో, దానికి సమాధానం ఆనాటి పెద్దలు ఏమి చెప్పారో కూడా తెలియపరుస్తారు. అందుకే ఏ విషయాన్నైనా అతి ప్రాచీనుడైన పరబ్రహ్మ ఈ ఆంజనేయునికి సూచించిన బహువిధ మార్గాల్ని అతి సునాయాసంగా అర్థం చేసుకోవటానికి మీ ముందు వుంచుతున్నాడు.

***చిన్న విషయమనుకొని చిన్నచూపు చూస్తూ,***
***చిన్నారి హృదయాన్ని ఛిన్నాభిన్నం చేస్తూ,***
***చూడరానిది చూపిస్తూ, చేయరానివి చేయిస్తూ,***
***చీకటి ప్రక్కనే నడిచేటట్లు చేస్తున్నారు, చూస్తున్నారు,***
***చూస్తున్నారు, చూస్తున్నారు తమాషా చూస్తున్నారు***
***శోకసముద్రంలోన పీకలదాకా మునిగి***
***బిక్కుబిక్కుమంటూ దిక్కులు తెలియక తీరం చేరే దారి కానక దీనులై,***
***జీవన సంద్రపు సుడిగుండంలో మునకలేస్తున్నారు, మునిగిపోతున్నారు.***
***ఇది సబబేనా? శుభమేనా?***
***ఇన్ని నీతులు చెప్పినసూ వినుటయే***
***విచారించదగిన దానిని విచారించండి***
***విచారణ అంటే బాధ కాదు***
***బోధలను విచారణ చెయ్యండి***
***విలువగల వాటిని విని ఆచరించి వినుతికెక్కండి***
***వేయి విధాల బోధిస్తున్న ఈ వీరాంజనేయుని విన్నపాలను వినమ్రతతో పాటించి,***
***పరుగు పరుగున పరంధామము చేరి పరవశించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**21-11-2019** 08:45 AM

**8) కర్మప్రభావం ఏ విధంగా ఉంటుంది స్వామి? దానిని తప్పించుకొనుటకు ప్రార్థన సహాయకారియా స్వామి?**

*అన్ని రకాల ప్రాణికోటిలో 84 లక్షల రకాల జీవరాశులలో పుట్టేటప్పుడు ఏడుస్తూ పుట్టేది ఒక్క మానవుడే. ఏ ప్రాణీ ఏడవదు. అవి పుట్టేది కర్మఫలాలను అనుభవించడానికి, వాసనలను ఖర్చు చేసుకోవటానికి. ఆ రెండు పనులను ఎలాగూ చేస్తాయి. కనుక ఏడ్చే పనిలేదు. కానీ, మానవుడు పుట్టేది జన్మరాహిత్యానికి, ప్రయోజనం మోక్షం అందుకోవటానికి, పరమాత్మలో ఐక్యం కావటానికి. కానీ, ఈ పనిని మాత్రం మర్చిపోతాడు. మానవజన్మలో ఆ దిశగా ప్రయాణించలేను అని ముందుగానే ఏడుస్తూ పుడతాడు అని చెబుతాను. పాపము ఎక్కడో పరదేశములో లేదు, తన చేసే కర్మలందు వుంటుంది. పాపమనేది మీరు చేసే కర్మల ఫలితంగానే వస్తుంది తప్ప మరెక్కడి నుంచో రాదు. ముళ్ళవిత్తనాలు నాటి పండ్లచెట్లు కావాలని అడిగితే ఎలా? "దేవుడిస్తాడు కానీ, కర్మ తీసుకుంటుంది" అనే దానికి ఒక సంఘటన చెబుతాను. అత్యంత దయనీయస్థితిలో వున్న ఒక వ్యక్తి షిరిడీనాథుని వద్దకు వచ్చి సాయం చేయమని ప్రార్థిస్తాడు. అంతకు ముందే ఎవరో ఒకతను తినరాని వస్తువును ఒకటి మూటగట్టి తెచ్చి అక్కడ ఇచ్చి వెళ్తాడు. అది ఒక మూల పడివుంది. సాయినాథుడు, "ఆ మూటను తీసుకువెళ్ళు. ఇంటికి వెళ్ళాక దానిని విప్పు" అన్నాడు. అతడు అలాగే అని పొలిమేరలలో నది దగ్గరకు చేరగనే అందులో ఏముందో అనే సందేహంతో ఆ మూటను విప్పాడు. అందులో అతనికి మాంసం కన్పించింది. అసహ్యంతో దానిని ఆ నదిలో పడవేశాడు. ఆ బట్టను నీళ్ళల్లో ఝాడించి దానిని తీసుకొని ఇంటికి వెళ్ళాడు. ఆరవేద్దామని ఆ బట్టను దులిపితే అందులోనుండి బంగారపు ముక్క ఒకటి క్రింద పడింది. అతను ఎంతో పశ్చాత్తాపపడ్డాడు. కానీ, ప్రయోజనమేమిటి? భగవంతుడ్ని సందేహిస్తే కలిగే ఫలితమిదే. దేవుడిచ్చినా, కర్మఫలం దక్కకుండా చేసింది. మానవుడు జన్మతః పవిత్రుడే. కానీ పెరుగుతూ పెరుగుతూ పెద్దబావ కోతి అయినట్లుగా, దుర్గుణాలను పెంచుకుంటున్నాడు. ఇవి నేర్చుకునేవేగానీ సహజమైనవి కావు. నేడు చాలామందికి, పదిమంది ముందరా భగవన్నామస్మరణ, ప్రార్థన చేయాలంటే బిడియం. బయటకు వెళ్ళేటప్పుడు బొట్టు పెట్టుకోవాలంటే అవమానం. రెండు చేతులెత్తి నమస్కారం చేయాలంటే ఏదో కొంప కూలిపోయినట్లు బాధపడతారు. కానీ, గజేంద్రునికి మోక్షాన్ని ప్రసాదించింది ప్రార్థనే, ద్రౌపదిని అవమానం నుండి కాపాడిందీ ప్రార్థనే, అర్జునుడ్ని విజయుడ్ని చేసిందీ ప్రార్థనే, ఈ ఆంజనేయుడ్ని రామచరణదాసుడిగా మార్చిందీ ప్రార్థనే, ఈ రోజు మీరు నా సన్నిధిన కూర్చుని సమయం గడపటానికీ ప్రార్థనే. మీ అందరి ప్రార్థనల ఫలితమే భగవంతుడు ఒక రూపధారియై అవతరించడం!*

**9) మేము ఆచరించే కర్మలను భగవంతుడు ఏ విధంగా గమనిస్తుంటారు స్వామి? కర్మలు ఏ విధంగా ఆచరించాలి స్వామి?**

*మీరు, "నేను ఒక్కడినే వున్నాను. నన్ను ఎవ్వరూ గుర్తించుట లేదు" అని అనుకుంటారు. కానీ,*

*మనిషి ఏ పని చేసినా, నిశితంగా పరిశీలించేది ఒకటి కాదు, రెండు కాదు, పద్దెనిమిది. అవి నాలుగువేదాలు, పంచభూతాలు, ధర్మం, ఉభయసంధ్యలు, యముడు, సూర్యచంద్రులు, అంతరాత్మ, పగలు, రాత్రి. ఆనాడు భీష్ముడు పంచభూతాల సాక్షిగా ప్రతిజ్ఞ చేశాడంటే, వాటి ఉనికిని ఆయన గుర్తించినట్లే గదా! మీ ప్రతి చర్యనూ నమోదు చేసి సత్కర్మలను, దుష్కర్మలను విడదీసి, విధికి చేరవేస్తాయి ఇవి. ఇది నిరంతరం సాగిపోయే సృష్టి పరిణామక్రమం. వీటిని చైతన్యస్వరూపులుగా గుర్తించగలిగినవారు వివేకవంతులు. తక్కిన మాటలు ఎలా వున్నా, ప్రతి మనిషికీ అంతరాత్మ అనేది ఒకటి వుంది. అది ఎప్పుడూ నిలదీయటం, తాను సిగ్గుపడటం మనిషికి మామూలు అయింది. ఏ పని చేసినా భావశుద్ధి ముఖ్యం. మీ దగ్గర పనిచేసేవారికి, క్రిందివారికి మిగిలిపోయాయని, పాడైపోయాయని, వాసన వస్తున్నాయని, డాగులుపడ్డాయని తినుబండారాలు, చిరిగిపోయిన వస్త్రాలను ఇస్తూంటారు. ఇంకా దాని కోసమై, వారి నుండి కృతజ్ఞతా భావాన్ని ఆశిస్తారు. కానీ, మనసులో అవి పనికిరావని మీకు తెలుసు. దాని వలన వచ్చే ఫలితం శూన్యం. భావాన్ని బట్టే ఫలితముంటుంది. భగవంతుడు పూజామందిరంలోనో, గుడిలోనో ఉన్నాడనుకొని, అక్కడ మాత్రమే పవిత్రంగా వుంటారు. కానీ, బయట ఆ పవిత్రతగానీ, వినయంగానీ ఏ మాత్రం కనబడదు. భగవంతుడి నుండి ఏమైనా కోరతారు కానీ, "భగవంతుడు కావాలి" అని మాత్రం కోరరు. బయట బిచ్చగాళ్ళు యాచన చేస్తుంటారు. మీరు లోపలకు వెళ్ళి కోర్కెల చిట్టా విప్పి చేసేపని అదే కదా! భక్తి ముసుగులో జరిగేది ఆధ్యాత్మిక వ్యాపారమే. మీ భాషలో స్పిరిచువల్ షాపింగ్. భక్తి కేంద్రాలు, యాచన కేంద్రాలుగా మారటం నిజమేనంటారా, కాదా? అందరికీ ఈ లోకంలో భగవంతుడున్నాడు కానీ, భగవంతుడికే భక్తులు లేరు. నన్ను తెలుసుకోవాలంటే నామస్మరణ ఒక్కటి చాలు. ఎమ్మేలు, బియ్యేలు పాసై వచ్చి, పేరుగాంచిన పెద్దవారలైనా సాటిరారు భక్తులకు ఏనాటికైనా. నేను ఏ చదువూ చదవలేదు. కానీ, ఆధ్యాత్మిక మార్గంలో ఆరితేరినాను. ఎన్ని విద్యలున్నా నైతిక, ధార్మిక, ఆధ్యాత్మికముల ఆధారంగా లేకపోతే, అది నిరుపయోగమైన చదువు అనే చెప్పాలి.*

***ఎక్కడ పోతుందోనని లాకర్లలో దాచుకోవడం కాదు***
***ఎప్పుడూ మీతోనే శాశ్వితంగా ఉంటుందని కాదు***
***నోట్ల కట్టలు, తరాజులలోని తులాల బంగారం కాదు***
***అందరూ మిమ్మల్ని గుర్తించి గౌరవించాలనుకోవటం కాదు ఐశ్వర్యం***
***అవసరంలో ఆపదలో ఆదుకునే స్నేహితుడు ఐశ్వర్యం***
***అవసర సమయంలో అందించే ఆధ్యాత్మికత ఐశ్వర్యం***
***ఆంజనేయుని ఆపన్న హస్తం, అభిమానం, ప్రేమ ఐశ్వర్యం***
***క్రమశిక్షణా బుద్ధిగా నడుచుకుంటే అదే ఐశ్వర్యం***
***ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, ఆధ్యాత్మికంగా వుండుటే ఐశ్వర్యం***
***సంపద కన్నా సంతృప్తిగా జీవించే మంచి మనసే ఐశ్వర్యం***
***కాసులలో ఉన్నది ఐశ్వర్యం కానేకాదు, క్యారక్టర్‌లో వుండేదే ఐశ్వర్యం***
***బిడ్డలాగా దానిని అందుకునే ప్రయత్నము ఆంజనేయుని ద్వారా అందుకొని***

***సంపన్నులై, సౌభాగ్యవంతులై, సొగసుగా జీవితాన్ని మలచుకుని***
***మారుతి మాటలతో మనసును మథించి, సంతృప్తి అనే ఫలితాన్ని అందుకొని***
***అధరమ్ముపై చిరునగవు చెదరనీయక***
***సాత్త్విక భావాలంకారముతో సొగసుగా సోల్‌ను గుర్తించి***
***సాగండి స్వస్వరూపానందులై***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**22-11-2019** 08:50 AM

**10) జ్ఞానం అంటే ఏమిటి స్వామి? దానిని ఎలా పొందవచ్చు స్వామి?**

*ఆధ్యాత్మిక మార్గానికి జ్ఞానమే ప్రాణం. అయితే, ఆ జ్ఞానం అనేది ఎలా వుండాలి? జ్ఞానం కూడా మాయే అనే స్థితికి మనిషిని తయారు చేసే విధంగా వుండాలి. అసలు జ్ఞానమంటే ఏమిటి? కంటికి కనిపించే ప్రాణులు, వస్తువులు, ఆకారాలు, రూపాలు, రంగులు, స్థితి, స్వరూపం, స్వభావం వంటివానిని, ఆలోచనల ద్వారా, మాటల ద్వారా, భాషల ద్వారా వ్యక్తీకరించడమే. అయితే, అసలు కంటికి కనిపించే దృశ్య ప్రపంచమంతా వాస్తవమా? లేక మాయకు ప్రతిరూపమా? ఈ విశ్వంలో మార్పులు చెందేది ఏదైనా మాయే. సత్యం కానే కాదు. ఆత్మ నుండి ఏర్పడి అనాత్మతో కూడిన స్థూలజగత్తంతా నిరంతరం మార్పులకు లోనవుతున్నప్పుడు, దానికి సంబంధించిన సమాచారం ఏదైనా, ఎటువంటిదైనా మాయే కదా. అందులో ఎటువంటి సందేహము లేదు. అంతేగాక, ఆత్మ నుండి అనాత్మతో కూడిన స్థూలజగత్తు ఆవిర్భవించి, తిరిగి మరలా ఆత్మలో లయమవుతున్నప్పుడు, ఇక అక్కడ స్థూలజగత్తుకు ఉనికి లేదు కదా! మరొక విషయం. ఏకత్వంతో కూడిన ఆత్మ ద్వంద్వాలతో, సంకల్పవికల్పాలతో కూడిన మనసుగా రూపాంతరం చెంది, అటువంటి మనసు ద్వారా భౌతికప్రపంచం ఆవిర్భవించి, సంకల్పాలు నెరవేరిన తర్వాత అది ఆత్మలో కలిసిపోతున్నప్పుడు, మనసు కూడా మాయలో ఒక భాగమే. మనసే మాయ అయినప్పుడు, దాని ద్వారా వ్యక్తీకరించబడే సమాచారమంతా మాయకు ప్రతిరూపమే కదా! అంటే, మీరు ఏ కోణం నుండి పరిశీలించినా, అసలు జ్ఞానమనేది లేదు. మరొక విషయమేమిటంటే, ఆత్మ నిరాకార, నిరంజన, నిర్గుణమై కంటికి కనిపించనప్పుడు, దానిని వర్ణించడం, వివరించడం, వ్యక్తీకరించడం వాస్తవం కాదు కదా! అటువంటి ఆత్మ ద్వారా ఉత్పన్నమైన భౌతికజగత్తు కూడా నిరాకార, నిరంజన, నిర్గుణమే. భౌతికదృష్టితో చూచినప్పుడు మాత్రమే రూపనామాలు, ఆకారాలు, స్వరూపాలు కనిపిస్తాయి. సూక్ష్మత్వానికి వెళ్ళగలిగితే, ఇక అక్కడ అంతటా ఏకత్వమే కన్పిస్తుంది. రెండు గానీ, రెండవది గానీ వుండవు. భిన్నత్వానికి జ్ఞానముంటుంది గానీ, ఏకత్వానికి జ్ఞానమెక్కడిది? మరొక ప్రత్యేకత ఏమిటంటే, విశ్వం అనంతం. భగవంతుడు అనంతం. జ్ఞానం కూడా అనంతమే. కాబట్టి, జ్ఞానమే భగవంతుడు. అటువంటి భగవంతుడు సర్వత్రా, అంతటా, అన్నిటా, అందరియందు*

వున్నాడు. కాబట్టి, అక్కడ వర్ణనలు, వివరణలు, నిరూపణలు వుండవు. దానినే సత్యదర్శనం అంటారు. సత్యదర్శనమైన తర్వాత మాటలు ఆగిపోతాయి. అటువంటి స్థితినే సంపూర్ణమౌనం అంటారు. అటువంటి మౌనమే సత్యం. సత్యమే భగవంతుడు. అటువంటి భగవంతుని కూడా వదిలివేసి, మనసును విశ్వం నుండి సంపూర్ణంగా ఉపసంహరించుకోవడమే శూన్యస్థితి అవుతుంది. మీరు జీవనవేదం శిక్షణ కొనసాగేటప్పుడు, పరిపూర్ణజ్ఞానాన్ని అనుభవంలోకి పొందటం ద్వారా భగవంతుడు కూడా మాయే అనే వాస్తవం వెలుగులోకి వస్తుంది. అయితే, ఈ చరాచర జగత్తు ఆవిర్భవించటానికి మూలకారణం భగవంతుడే. భగవంతుని ఉనికి లేకుండా మీరు జన్మించటానికి, జీవించడానికి అవకాశం లేదు కదా. అందువలన, భగవంతుడు ఎలా మాయ అవుతాడు అనే మీ సందేహానికి సమాధానమిచ్చాను. మానవ జీవితానికి అర్ధం పరమార్ధం చేకూరి, పరిపూర్ణత్వం సిద్ధించాలంటే, ఆధ్యాత్మికమార్గం మినహా, వేరే దారే లేదు. అటువంటి ఆధ్యాత్మికమార్గంలో కీలకాంశాలు ధ్యానం మరియు సమాధి. ఇవి కంటికి కన్పించని సూక్ష్మశరీరాన్ని శుద్ధి చేసే అతి సూక్ష్మమైన ప్రక్రియలు. వాటిని క్రమం తప్పకుండా సాధన చేయగలిగితే జీవితం, జీవనవిధానంలో అద్భుతమైన మార్పులు సంభవిస్తాయి. అయితే, వాటిని క్రమం తప్పకుండా సాధన చేసి, ఆ మార్గంలో ఉత్తీర్ణత చెందాలంటే శరీరం, మనసు సహకరించాలి. మీరు సాధనలో వున్నప్పుడు, పరధ్యానం పెరుగుతుందంటే, అది రజోగుణం. నిద్రమత్తు ఆవహిస్తుందంటే అది తమోగుణం. ఆ రెండు గుణాలు ఎక్కువ వుండి సాధన చేయడం ద్వారా ఆశించిన, ఊహించిన ఫలితం రాదు. అయితే, అందుకు మార్గమేమిటి? అని అడిగినట్లయితే, జ్ఞానపరంగా పరిణతి చెందగలిగితే, మనసు ప్రశాంతంగా వుంటుంది. మనసులో అలజడి, అశాంతి, భయం, ఉద్రేకం వంటివి ఎక్కువగా వుంటే, సాధన చేయడం ద్వారా శక్తి విపరీతంగా హరించుకుపోతుంది. అందువలననే మీరు సాధనలో పరధ్యానంలో వుంటూ, నిద్రమత్తు ఆవహించడం వలన ఫలితం పొందలేకపోతున్నారు. మరొక కీలకాంశమేమిటంటే, వేదాంతమనేది పరస్పర విరుద్ధమైన అంశాలతో కూడివుండి, సామాన్యులకు సులభంగా అర్ధం కాదు. మీరు నిద్రమత్తులో వుంటున్నారు కాబట్టి, దానిని వదిలించుకోవడం కోసం దైనందిన జీవితంలో నిరంతరం ఏదో ఒక కార్యక్రమంలో పాల్గొంటూ వుండండి. అలాగే రజోగుణాన్ని కలిగించుకొని పరధ్యానం నుండి బయటపడాలంటే, భక్తిమార్గాన్ని అవలంభించండి. తమో, రజోగుణాలు ఎక్కువగా వున్నప్పుడు, మీరు గురువు ద్వారా పొందిన జ్ఞానాన్ని కూడా స్పష్టంగా అవగాహన చేసుకోలేరు. ముందు కర్మయోగాన్ని, ఆ తదుపరి భక్తియోగాన్ని ఆచరిస్తూ, జ్ఞానయోగాన్ని అందుకోగలగాలి. కర్మయోగం ద్వారా తమోగుణం తొలగిపోతుంది. భక్తియోగం ద్వారా రజోగుణం కరిగిపోతుంది. జ్ఞానయోగం ద్వారా సత్వగుణం అలవడుతుంది. అందుకే ఎల్లప్పుడూ నామసంకీర్తన చేయండి, భజనలు వినండి, మంచి శ్లోకాలను పఠించండి మీ శోకం దూరం కావటానికి. అప్పుడే మీ తమోగుణ, రజోగుణాల నుండి బయటపడి సత్త్వగుణాన్ని అలవరుచుకుని సత్ఫలితాన్ని పొందుతారు. ఇది ఆంజనేయుని హామీ!

**ప్రపంచమే పరమాత్మ  పరమాత్మే ప్రపంచం**

**ప్రపంచానికి భిన్నంగా పరమాత్మ లేనే లేడు**

**ప్రపంచంలో ఇరుక్కుంటే పరమాత్మను గుర్తించలేరు**

***ప్రపంచంలో పరమాత్మను చూస్తే, తానే పరమాత్ముడవుతాడు***
***పరమాత్మ కోసం పరితపించే వ్యక్తి, ప్రపంచాన్ని విస్మరిస్తాడు***
***ప్రపంచానికి సేవ చేయడమంటే, పరమాత్మకు సేవ చేయడమే***
***ప్రపంచాన్ని ప్రేమించే వ్యక్తి, పరమాత్మను ప్రేమించినట్లే***
***ప్రపంచాన్ని వ్యతిరేకిస్తే, పరమాత్మను పొందటం అసాధ్యం***
***ప్రపంచమంతా పరమాత్మ మాయయే, మరింకేమీ కాదు***
***ప్రపంచానికి భిన్నంగా పరమాత్మను వెదకటమే అజ్ఞానం***
***ప్రపంచమంతా పరమాత్మ అయితే, నీవు కూడా పరమాత్మవే***
***ప్రపంచాన్ని వ్యతిరేకించడం అంటే దానికి బానిస కావడమే***
***ప్రపంచంలో ప్రతీదీ పరమాత్మయే గుర్తుంచుకోండి***
***ప్రసన్నాంజనేయుని ప్రకృతిలో దర్శించినప్పుడు దొరికేను ప్రశాంత గంభీరస్వరం***
***ఆ స్వరమే సప్తస్వరాలను పలికించి సప్తలోక జీవులను మైమరపించి***
***అజ్ఞానపు పొరను చీల్చి, ఆంజనేయుని ఆలింగనములోకి చేర్చి***
***జ్ఞానభాస్కరులై స్వస్వరూపులై సదా సుఖిస్తారు సత్త్వగుణ భాసితులై***
***నా చిన్నారి బిడ్డలారా!***

ॐ

**24-11-2019** 08:45 AM

**11)** మనస్సును ఎలా జయించాలి స్వామి?

చాలాసార్లు, చాలా సందర్భాలలో మనస్సును జయించడమే మోక్షం అని చెబుతూ వుంటాను. అది నూటికి నూరుశాతం వాస్తవమే. ఎటువంటి సందేహమూ లేదు. అయితే, ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం తారాస్థాయిలో వుండి, మనిషి పూర్తిగా భౌతికవాద ప్రమత్తులో జీవిస్తున్నప్పుడు, అది సాధ్యమేనా? వాస్తవానికి మనసే జీవితానికి మూలం మరియు ఆధారం కదా! అది లేకుండా జీవితమే లేదు కదా! దానిని జయించడమనేది మామూలు స్థాయి వ్యక్తులకు సాధ్యమవుతుందా? ఇవ్వన్నీ మీ ప్రశ్నల వలయం. దానికి నా సమాధానం, మనస్సనేది మానవజీవితానికి, స్థూలజగత్తు ఆవిర్భావానికి మూలమవుతుంది. అందువలన మనసు లేకపోతే జీవితానికి అర్థం, పరమార్థం వుండదు. మనసు ద్వారానే మీరు మీ దైనందిన కార్యక్రమాలను నిర్వహించగలుగుతారు. అందువలన, అది ఎంతో కీలకమైనది. అందులో ఎటువంటి సందేహం లేదు. అయితే, వేదాంతపరంగా దాని స్వరూప స్వభావాన్ని గురించి తెలుసుకోగలిగితే, దానిని వదిలివేయగలుగుతారు. కనిపించే స్థూలజగత్తంగా ఆత్మ నుండే ఆవిర్భవించింది, తిరిగి మరలా దానిలోనికే లయం చెందుతుంది. అంటే, విశ్వమంతటికీ ఆధారం అదియే కదా! ఎవరైతే ఆత్మస్థితికి చేరగలుగుతారో, వారు మాత్రమే సంపూర్ణస్వేచ్ఛతో జీవించగలుగుతారు. అదే మానవజీవిత పరమార్థం.

అందుకే మీరు స్థూలజగత్తును వదిలివేయగలగాలి లేక కరగించగలగాలి. అయితే, ఆ స్థూలజగత్తు మనసు ద్వారానే ఆవిర్భవించింది కదా! అటువంటి మనస్సనేది ఒక వ్యక్తికి సంబంధించిందైతే, 'వ్యష్టిమేధస్సు' అని, విశ్వమంతటికీ సంబంధించినదైతే 'సమిష్టిమేధస్సు' అని అంటారు. అది ద్వంద్వాలతో కూడివుంటుంది. అంటే రెండు సమానమైన అర్ధభాగాలుగా వుంటుంది. ఒకటి బయటకు కన్పిస్తుంది, మరొకటి దాని వెనుక వుంటుంది. అవి నిలకడగా వుండవు. నిరంతరం మార్పులు చెందుతూ వుంటాయి. అందువలన అవి వాస్తవం కానే కాదు – మాయకు ప్రతిరూపమే. ఎందుకంటే, విశ్వంలో ఏదైతే మారుతూ వుంటుందో, అది సత్యం కానే కాదు. అందువలన మనసుగానీ, దాని నుండి ఏర్పడిన మానవుడు లేక స్థూలజగత్తుగానీ, వాస్తవం కానే కాదు. ఈ సత్యం అవగాహన అయితే చాలు, మీరు మనసును వదిలివేయగలుగుతారు. ఎవరైతే ద్వంద్వాలను, స్థూలజగత్తును, మానవజీవితాన్ని వాస్తవంగా భ్రమిస్తారో, వారు మనసు పరిధిలో జీవిస్తారు. ఆత్మకు చేరువ కాలేరు. అలాకాక, దాని వాస్తవ పరిస్థితిని అవగాహన గావించుకోగలిగితే, దానిని మాయలో ఒక భాగంగా భావించి వదిలివేయగల్గుతారు. అయితే, పుట్టుక నుండి మరణం వరకూ మీ దైనందిన కార్యక్రమాలకు మనస్సనేది తప్పక అవసరమే. అందువలన, అంతరంగంలో ఏకత్వముండాలి – దైనందిన జీవితంలో ద్వంద్వాలతో కూడిన ద్వైతాన్ని ఆచరించగలగాలి. ద్వంద్వాలు మాయ అని తెలుసుకొని జీవించగలిగితే, నిరంతరం మోక్షాన్ని అనుభవిస్తున్నట్లే, అనుమానమే లేదు. అయితే, మీలో చాలామందికి మానవజీవితం పుట్టుక–మరణాల మధ్యనే కొనసాగుతుందా? పుట్టుకకు ముందు మరణం తర్వాత కూడా జీవితముంటుందా? మనిషి పుట్టుకకు ముందు మరణం తర్వాత ఏమవుతాడు? మరణం తర్వాత కూడా జీవుడు బ్రతికే వుంటాడా? అయితే, అసలు జీవుడు కంటికి కనబడతాడా? అతడు భగవంతుడేనా? అన్న మీ సందేహాలకి నా సమాధానం ఒకటే. మానవజీవితం జీవభావంతో మొదలవుతుంది. జీవుడంటే కోరికలు, సంకల్పాలతో కూడిన సూక్ష్మశరీరం. కోరికలు ప్రాపంచిక విషయవాంఛలకు సంబంధించినవైతే, ఫలవంతమైన సంతానాన్ని ప్రకృతికి కానుకగా అందించడమే జీవిత సంకల్పమవుతుంది. అందమైన, ఆరోగ్యవంతమైన, సంస్కారవంతమైన, ఉత్తమ సంస్కారాలతో కూడిన గొప్ప వ్యక్తిని సమాజానికి కానుకగా అందించడమే బలమైన సంకల్పమవుతుంది. అంతకు మించిన జీవిత కార్యక్రమం మరొకటి వుండదు. అటువంటి జీవుడు భౌతిక నేత్రాలకు కన్పించడు. అయితే, ఆ జీవుడి ద్వారానే మానవుని దైనందిన కార్యక్రమాలన్నీ నిర్వహించబడతాయి. టి.వి. పనిచేయటానికి రిమోట్ ఏ విధంగా ఉపయోగపడుతుందో, మానవజీవితం కొనసాగటానికి కూడా జీవుడు కీలకపాత్ర పోషిస్తాడు. వాస్తవానికి మానవునకు పుట్టుక–మరణాల మధ్యజీవితమే కంటికి కన్పిస్తుంది. అయితే, అది పుట్టుకకు ముందు, మరణం తర్వాత కూడా కొనసాగుతుంది. మరణమనేది కేవలం భౌతిక శరీరానికి మాత్రమే వర్తిస్తుంది, జీవుడికి వర్తించదు. ఎవరైతే ప్రపంచంతో, ప్రాపంచిక విషయవాంఛలతో విడరాని సంబంధమేర్పర్చుకొని కోరికలు, సంకల్పాల మోతాదులను ఇంకా ఇంకా పెంచుకొని, జీవభావాన్ని బలోపేతం చేసుకుంటారో, వారు భౌతికదేహం విడిచిన తర్వాత కూడా సూక్ష్మరూపంలో కొనసాగుతారు. ఎటువంటి శరీరం ద్వారానైతే తన కోరికలు, సంకల్పాలు నెరవేరతాయో, అటువంటి దేహంలోనికి ప్రవేశించి, మిగిలివున్న కోరికలను ఆ దేహం ద్వారా నెరవేర్చుకుంటారు. అయితే,

*లక్షలాది మందిలో కొద్దిమంది మాత్రమే పరిపూర్ణ అద్వైత బ్రహ్మజ్ఞానం ద్వారా, జీవితాన్ని గురించి చక్కని అవగాహనను ఏర్పర్చుకొని, వారు జీవించి వుండగానే కోరికలు, సంకల్పాలను పూర్తిగా నెరవేర్చుకుంటారు. ఒకవైపు కర్మలను ఆచరిస్తూనే, మరొకవైపు కర్మల ద్వారా ఎటువంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా జీవించడం వలన, అదనంగా కర్మలు చేరకుండా జాగ్రత్తపడతారు. అయితే కోరికలు, సంకల్పాలు బలీయంగా ఉన్నప్పుడు, మానవమేధస్సు నుండి వాసనాబీజాలు బయటకు వెళ్తూ వుంటాయి. కాబట్టి జీవుడు తన పరిధిని పెంచుకుంటూ వుంటాడు. తన భావాలను, పథకాలను, ప్రణాళికలను, ఆశయాలను, సంకల్పాలను అనేకమందితో కలసి పంచుకుంటారు. కాబట్టి, ఇతరుల శరీరాలలోనికి జీవితాంతం ప్రవేశించడం జరుగుతూనే వుంటుంది. అంటే, మరణసమయంలో మాత్రమే కాకుండా, జీవించి ఉన్నంత వరకు ఇతరులతో ఏర్పర్చుకునే సంబంధాల ద్వారా జీవుడు బ్రతికే వుంటాడు. దేహాలు మాత్రమే మారతాయి. అయితే, జీవుడు భగవంతునిలో ఒక భాగమే గాని, భగవంతుడు మాత్రం కాదు. మానవజీవితం భౌతికవాదంతో ప్రారంభమై, ఆధ్యాత్మికతతో అంతం కావాలి. ఇది ఆంజనేయుని అభిలాష. చెప్పదలుచుకున్నది నేరుగా చెప్పడమే ఈ ఆంజనేయుని భావం.*

*నిజం చెప్పొద్దూ! బ్రతికి ఏమి సాధిస్తాం అంటారు. కానీ, బ్రతికినప్పుడే కదా, ఆనందాన్ని ఆస్వాదించగలిగేది. వెతకాలేగానీ, ఆనందం ప్రతిదానిలో వుంటుంది. జీవితపు అంచులకు చేరేవాళ్ళకే జీవితపు విలువ తెలుస్తుంది. ఎందుకంటే, జీవించడమంటే తెలిసేది అప్పుడే, ఈ ఆంజనేయుని భాషలో, భావంలో.*

*60 దాటిన జీవితం, బోనస్ లాంటిది.*
*50 లో వున్న జీవితం, అనుభవించటానికి ఇంకా వుందని చెప్పేది.*
*40 లో జీవితం, ఆనందాన్ని గురించి అవగాహన కలిగించేది*
*30 లో జీవితం, మీరు జీవించే విధానమే ఆనందం అని భ్రమ కలిగిస్తుంది.*
*20 లోపు జీవితం, జీవితంలో ఏది జరిగినా అదే ఆనందమని మురిసిపోయేది.*

***కాబట్టి, ఆనందం కోసమే జీవితం - దానిని మిస్సవకండి.***
***ఆనందంగా గడిపిన ప్రతిక్షణం అమృతమే అన్న సత్యాన్ని గుర్తించండి.***
***ఆంజనేయుని ప్రతి వాక్యం కానుకగా స్వీకరించి***
***ఆంజనేయుని కరుణా కటాక్ష వీక్షణాలను పొందండి.***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**25-11-2019** 08:45 AM

**12) సత్వ – రజ – తమో ఈ మూడుగుణాలు ఒక్కరిలోనే వుంటాయా? ఒక్కసారే అన్నీ పనిచేస్తాయా? ఒకదానికొకటి అనుగుణంగా పనిచేస్తాయా, వ్యతిరేకంగా పనిచేస్తాయా? ఈ మూడుగుణాల మధ్య**

**సంబంధం ఎలాంటిది స్వామి?**

*సత్వగుణం, రజస్తమో గుణాలను అణచివేసి పైకి వస్తుంది. రజోగుణం, సత్త్వ–తమో గుణాలను, అలాగే తమోగుణం సత్త్వ–రజోగుణాలను అణచి, అభివృద్ధి చెందుతాయి. ఈ మూడు గుణాలు ప్రతి ఒక్కరిలోనూ వుంటాయి. అయితే, అన్నీ ఒక్కసారే పనిచేయవు. అవి ఒకదానికొకటి పరస్పర విరుద్ధమైనవి. అందువల్ల, ఒక సమయంలో ఏదో ఒక గుణమే పనిచేస్తుంది. ఆ సమయంలో మిగిలిన రెండు గుణాలు అణిగి వుంటాయి. ఒక గుణం పెరిగితే, మిగిలిన రెండింటినీ అణచి వేస్తుంది. అంటే, మీరు సత్త్వగుణాన్ని పెంచుకోవటానికి ప్రయత్నిస్తే, తక్కిన రెండింటినీ అణచివేయడానికి ప్రత్యేకంగా ప్రయత్నించవలసిన అవసరం లేదు. అలాగే రజోగుణాన్ని పెంచుకోవటానికి ప్రయత్నిస్తే, తమోగుణాన్ని గురించి బాధపడనక్కరలేదు. ఈ రహస్యాన్ని తెలుసుకుంటే, మీరు మీ జీవితాన్ని చక్కగా మీరు కోరుకున్నట్లుగా మలచుకోవచ్చు. ఒకడు సత్త్వగుణం కలవాడు అని చెప్పినప్పుడు, మిగిలిన రెండు గుణాలు అతడిలో లేవని కాదు. అవి అతడి మీద ఆ సమయంలో పనిచేయడం లేదని అర్థం. నీటిలో బెల్లం కలిపితే పానకం అవుతుంది. అందులో వేపకాయలు వేస్తే అంతా చేదుగా వుంటుంది. ఇప్పుడు చేదుగా వున్నదానిలో తీపి లేదని కాదు. ఉన్నది. కానీ, చేదు ముందు తీపి అణిగిపోయింది. అలాగే, ఒక గుణం అధికంగా వుంటే, మిగిలిన రెండూ లేవని కాదు. వుంటాయి. కాకపోతే, అణిగిపోయి వుంటాయి. ఆధ్యాత్మిక రంగంలో వున్న సాధకుడు ముక్తిని అందుకోవాలంటే, తమోగుణం నుండి రజోగుణానికి, రజోగుణం నుండి సత్త్వగుణం లోనికి ప్రయాణం చేయాలి. గుణం ఒక్కటే అయినా, స్థితులను బట్టి అది మూడు విధాలుగా వుంటుంది. ఒక్కొక్క స్థితిలో ఒక్కొక్క గుణంగా వ్యక్తమవుతుంది. నీటి యొక్క రూపాలు చూడండి. 1) హిమాలయాల్లో మంచుగడ్డ రూపంలో గట్టిగా, జడంగా వుంటుంది. 2) అదే మంచు కరిగి, నీరై చలనంతో వుంటుంది, గలగలా పారుతూ వుంటుంది. 3) అదే నీరు వేడిచేస్తే ఆవిరై, పైకి పోతుంది. ఇలా మూడు రూపాలు. మంచుగడ్డ తమోగుణం, నీరు రజోగుణం, ఆవిరి సత్త్వగుణం. ఇపుడు మీరు ఏ గుణం పెంచుకోవాలనుకుంటున్నారో, దానికి తగినట్లుగా ప్రవర్తించాలి, ప్రయత్నం చేయాలి. వాటిని ఇలా చెబుతాను. 1) శాస్త్రం 2) జలం 3) జనులు 4) ప్రదేశం 5) కాలం 6) కర్మలు 7) జన్మలు 8) ధ్యానం 9) మంత్రం 10) సంస్కారం – ఇవి కారణాలు. వాటి గురించి కొంత తెలుపుతాను.*

*1) శాస్త్రం: తత్త్వజ్ఞానాన్ని ప్రసాదించేవి, జన్మసార్థక్యానికి ఉపకరించేవి సాత్త్విక శాస్త్రాలు. లౌకికమైన సుఖాలను, భోగాలను అందించటానికి తగిన కర్మలను ప్రబోధించే గ్రహచారాలు, న్యూమరాలజీలు, రత్నాలు ధరించడం, జ్యోతిష్యం, పూజాదికములు రాజసికములు. ఇక పాషండత్వాన్ని ప్రబోధించే శాస్త్రాలు, నాస్తికవాదాలు, డిటెక్టివ్ నవలలు, ఉద్రేకాలను కలిగించేవి తామసగ్రంథాలు.*

*2) జలం: పవిత్ర నదీజలం, తీర్థజలం సాత్త్వికజలం. పన్నీరు, సెంట్లు, సుగంధజలాలు రాజసికజలాలు. కల్లు, సారాయి మత్తుపదార్థాలు తామసికం.*

*3) జనులు: భగవద్భక్తులు, సాధుపురుషులు, జ్ఞానులు, సన్యాసులు, దైవకార్యాలు చేసేవారు, గురువులు*

సత్త్వగుణానికి చెందినవారు. వ్యాపారులు, ఉద్యోగులు, నటులు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు, పారిశ్రామికవేత్తలు రాజసికగుణ ప్రతినిధులు. దుష్టకార్యాలు చేసేవారు, దోపిడీలు హత్యలు చేసేవారు, రౌడీలు, గూండాలు, క్షుద్రమాంత్రికులు వీరంతా తామసగుణం కలవారు.

4) ప్రదేశాలు: పుణ్యక్షేత్రాలు, పవిత్రతీర్థాలు, దైవమందిరాలు, ఆశ్రమాలు ఇవి సాత్త్విక ప్రదేశాలు. వ్యాపారకూడళ్ళు, సంతబజారులు, మార్కెట్ సెంటర్లు ఇవి రాజసిక ప్రదేశాలు. మద్యశాలలు, జూదశాలలు, వ్యభిచారగృహాలు, క్లబ్బులు ఇవి తామసిక ప్రదేశాలు.

5) కాలం: ప్రాతఃకాలం శుభప్రదం, సాత్త్విక సంబంధమైనది. పగటి సమయం రాజసిక సంబంధమైనది. రాత్రికాలం నిషిద్ధకాలం, తమోగుణ సంబంధమైనది.

6) కర్మలు: నిత్యకర్మలు సాత్త్వికాలు. కామ్యకర్మలు రాజసికాలు. నిషిద్ధకర్మలు తామసికాలు.

7) జన్మలు: జన్మసార్థక్యానికి దీక్షాస్వీకారం చేయాలి. సద్గురువుల నుండి మంత్రదీక్షను స్వీకరించడం మంచిది. శైవ, వైష్ణవ, బ్రహ్మదీక్షలు సాత్త్వికాలు. శాక్తదీక్ష రాజసం. క్షుద్రదీక్షలు తామసం.

8) ధ్యానం: భగవత్‌ధ్యానం, ఆత్మధ్యానం ఇవి సాత్త్వికాలు. కోరికలతో సంపదల కోసం, భోగాల కోసం చేసే ధ్యానం రాజసికం, శత్రునాశనానికి చేసే ధ్యానం తామసికం.

9) మంత్రం: ప్రణవ మంత్రం, ఇష్టదేవతా మంత్రాలు సాత్త్వికాలు. ఫలసిద్ధి కొరకు చేసే కామ్యమంత్రాలు రాజసికాలు. క్షుద్రదేవతా మంత్రాలు తామసికం.

10) సంస్కారాలు:చిత్తశుద్ధిని కలిగించేవి, ఆత్మనిష్ఠలో నిలిపేవి, భగవద్భావనను స్థిరం చేసేవి సాత్త్విక సంస్కారాలు. దేహభావనను కలిగించేవి, భోగాసక్తిని కలిగించేవి రాజసిక సంస్కారాలు. శత్రునాశనాన్ని కోరేవి, దుష్టభావనలకు సంబంధించినవి తామసిక సంస్కారాలు.

పైన చెప్పిన వాటిలో సాత్త్వికమైన వాటిని అనుసరించే వారిలో సత్త్వగుణం పెరుగుతుంది. రజోగుణ, తమోగుణాలు అణగారిపోతాయి. రాజసికమైనటువంటి వాటిని అనుసరిస్తే, సత్త్వగుణం, తమోగుణం అణిగిపోయి, రజోగుణం వృద్ధి చెందుతుంది. తామసికమైనటువంటి వానిని అనుసరించేవారిలో తమోగుణం పెరిగిపోతుంది. సత్వగుణం, రజోగుణం అణగారిపోతాయి. ఇంతవరకు ఎందుకు బోధించాను? జ్ఞానమునందు ఆసక్తి గలవారై, ఆంజనేయుని ముద్దుబిడ్డలై, సత్త్వగుణాన్ని అభివృద్ధి చేసుకోండి.

**దేవుడిచ్చిన జీవితాన్ని ఉత్సవంగా జరుపుకోండి**
**పరవశించిన ఆనందంలో దుఃఖమన్నది మరచిపోండి**
**జ్ఞాన ధ్యానాలు సత్సంగాలతో, సత్యసోధనా సోపానాలు నిర్మించండి**
**ఉన్నతులౌదురు సామాన్యులైనా, అధిరోహింతురు కీర్తి శిఖరాలను**
**గడ్డిపోచలన్నీ ఏకమవ్వంగా ఉపకరించును రకరకాలుగా మానవాళి మనుగడ సాగంగా,**
**పంచభూతాలు కలవంగా మనిషి జీవితం ఉన్నతంగా వుంచుతుంది.**

***ధ్యానపరంగా ఎదగండి, సత్సంగాలు ఎక్కువ చేయండి***
***సమాజ హితము కోరండి, సన్నిహితంగా మెలగండి***
***హృదయ కవాటాలను తెరవండి***
***ఆలోచనలను నిర్వీర్యం కాకుండా, సాధించాలన్న తపనను పెంచుకుంటూ,***
***మనస్సుపై ముసుగు వేస్తున్న చేదుగుళికలను***
***మనస్సును స్పృశించే విజ్ఞాన గుళికలు సేవించి***
***సమయాన్ని వృధా చేయ్యక, అసలైన జ్ఞానంతో ఆంజనేయుడు అందించు***
***అంతులేని జ్ఞానాన్ని సొంతం చేసుకొని,***
***నిజమైన ప్రగతిని సాధించి ప్రఫుల్లవదనులై నా దరి చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**26-11-2019** 08:55 AM

**13) సత్త్వగుణం మాలో అభివృద్ధి చెందిందని, మాలోని ఏ లక్షణాలను బట్టి తెలుసుకోగలం స్వామి?**

*ఈ దేహంలోని అన్ని ద్వారాల నుండి ప్రకాశరూపమైన జ్ఞానం ఎప్పుడు వ్యక్తమవుతుందో, అప్పుడు సత్త్వగుణం వృద్ధి అవుతున్నట్లు తెలుసుకోండి. మీ దేహంలో కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, మనసు, బుద్ధి అనే అంతరింద్రియాలు ఇవ్వన్నీ 'ద్వారాలే'. ఇంటికి ద్వారాలుంటాయి, అవి దేనికి ఉపయోగపడతాయి? బయట నుండి లోపలకు, లోపల నుండి బయటకు తిరగటానికి ఉపయోగపడతాయి. అలాగే దేహంలోని ఈ ఇంద్రియాలు కూడా బయట వున్న విషయాలను గ్రహించి, లోపలకు చేర్చటానికి, లోపల నుండి సూచనలను, ఆజ్ఞలను బయటకు వెలువరించటానికి ఉపయోగపడతాయి. అందుకే వీటిని ద్వారాలు అన్నారు. ఎప్పుడు సత్త్వగుణం వృద్ధి చెందుతూ వుంటుందో, అప్పుడు అంతఃకరణములోని జ్ఞానం ఇంద్రియాల ద్వారా వెలుపలకు వ్యక్తమవుతుంది. హంస ఎలాగైతే పాలు-నీరు వేరు చేయగలుగుతుందో, అలాగే సత్త్వగుణ సంపన్నులు ఇది సత్యము-ఇది అసత్యము అని, ఇది మంచి-ఇది చెడు అని విచక్షణ చేయగలుగుతారు. వారిలో దైవీగుణాలు వృద్ధి చెందుతూ వుంటాయి - ఆసురీగుణాలు తొలగిపోతూ వుంటాయి. అతడి ముఖం ప్రసన్నంగా వుంటుంది, ప్రశాంతంగా వుంటాడు. వసంత ఋతువులో పుష్పముల యొక్క సుగంధ సువాసనలు ఎలా నలువైపులా వ్యాపిస్తూ వుంటాయో, అలాగే వారి నుండి జ్ఞానమనే సుగంధం అన్ని వైపులా వ్యాపిస్తుంది. వారి సాన్నిధ్యం ప్రశాంతతను, సంతోషాన్ని, సంతృప్తిని కలిగిస్తుంది. వారు ఈ లోకంలో దేన్ని చూస్తున్నా, దాని నుండి జ్ఞానాన్ని గ్రహిస్తారు. ఏం మాట్లాడుతున్నా జ్ఞానమే వారి నోటి నుండి జాలువారుతుంది. భగవత్సంబంధమైన జ్ఞానాన్ని అందరికీ అందించాలని తహతహలాడుతుంటారు. ఆందుకోసం ఎంతటి త్యాగానికైనా వెనుకాడకుండా వుంటారు. ఈ లక్షణాలను బట్టి, వారిని సత్త్వగుణ సంపన్నులని చెప్పవచ్చు. ఒకరు ఎలాంటి ఆహారాన్ని భుజిస్తారో,*

ఎలా మాట్లాడతారో, ఎలాంటి పనులు చేస్తుంటారో, ఎలా నడుస్తారో చూస్తే దానిని బట్టి వారిలో ఏ గుణం అధికంగా వున్నదో చెప్పవచ్చు. సత్త్వగుణ సంపన్నుడు మాట్లాడేటప్పుడు ప్రశాంతంగా మాట్లాడుతాడు. స్థిరంగా మాట్లాడుతాడు. అవసరమైన విషయాలనే మాట్లాడుతాడు. ఉద్రేకం చెందడు. భుజించేటప్పుడు సాత్త్విక ఆహారాన్నే భుజిస్తాడు. చదివేటప్పుడు ఉత్తమగ్రంథాలనే చదువుతాడు. ఆలోచించేటప్పుడు సద్విషయాలను గురించే ఆలోచిస్తాడు. అతడి సమస్త ఇంద్రియాల నుండి ప్రకాశరూపమైన జ్ఞానమే వెల్లివిరుస్తుంది. అట్టివానిలో సత్త్వగుణం బాగా వృద్ధి చెందుతున్నదని తెలుసుకోవచ్చు. కొందరికి ఇంకా ఇంకా జ్ఞానాన్ని తెలుసుకోవాలని అన్పిస్తుంది. జన్మను సార్థకం చేసుకోవాలని అన్పిస్తుంది. కొందరికి తెలుసుకున్న జ్ఞానం చాలులే అన్పిస్తుంది. కొందరికైతే, ఈ జ్ఞానం గీనం మనకెందుకూ? అనవసరంగా మా సమయాన్ని వృధా చేసుకుంటున్నాము అన్పిస్తుంది. ఇలా వారి వారి భావాలు ఎలా ఉంటున్నాయో దానిని బట్టే వారి స్థితి అర్థమవుతుంది. దీనిని బట్టి ఎవరిలో ఏ గుణం వున్నదో, ఏ గుణం వృద్ధి అవుతున్నదో, ఏ గుణప్రభావంలో వున్నారో తెలుస్తుంది. ఇలా తెలిస్తే, తమోగుణం నుండి రజోగుణానికి, రజోగుణం నుండి సత్త్వగుణానికి ప్రయాణం చేయవచ్చు.

**14) మాలో రజోగుణ ప్రభావం ఉన్నదని ఏ లక్షణాల వల్ల గుర్తించవచ్చు స్వామి?**

రజస్సు పెరుగుతున్నప్పుడు లోభము, కర్మలయందు ప్రవృత్తి, కర్మలనారంభించుట, అశాంతి, ఆశ కలుగుతుంటాయి. రజోగుణం అభివృద్ధి చెందుతున్నదని మీలోని ఏ లక్షణాలను బట్టి చెప్పవచ్చు అనే సందేహానికి 5 లక్షణాలను చెబుతాను. 1) లోభం 2) ప్రవృత్తి 3) కర్మణా ఆరంభ 4) అశమః 5) స్పృహ. <u>లోభం</u> అంటే డబ్బుపై అధిక వ్యామోహం. పిసినారితనం, నిరంతరం ధనసంపాదన, సంపాదించిన దానిని ఇళ్ళ రూపంలోనో, బంగారం రూపంలోనో, పొలాలు స్థలాలు రూపంలోనో, వ్యాపారాలు పరిశ్రమల రూపంలోనో దాచుకొని చూచుకుంటూ ఆనందించటం, సంపాదించిన దానిని ఏమాత్రం ఖర్చుపెట్టకుండా తాను తినకుండా ఇతరులకు పెట్టకుండా వుండటం – ఇదే లోభం. తనంత తానుగా పైసా వదలకపోయినా, ప్రకృతి గాని, అదృశ్యశక్తి గాని బలవంతంగా వారి వద్ద నుండి లాగివేస్తుంది. ఎంతకాలం, ఎంత సంపాదించినా, ఎంత నిలవచేసినా ఎప్పుడో ఒకప్పుడు అది మిమ్ములను వదిలిపోవటమో, మీరే దానిని వదిలివెళ్ళటమో తప్పక జరుగుతుందని ఊహించలేరు రజోగుణ సంపన్నులు. లోభికి సంబంధించినంత వరకు, అందరి సొమ్ము నాకే రానివ్వు అని! అందరూ ఎప్పుడో ఒకప్పుడు అంతో ఇంతో త్యాగం చేస్తూంటారు. కానీ, లోభికి అసలు త్యాగమంటే ఏమిటో తెలియదు. కానీ, ఇది కొంతవరకు నిజం కాదని తామాషాగా చెబుతాను. ఎందుకంటే తాను తింటూ, అనుభవిస్తూ ఇతరులను అనుభవించనిస్తూ, మిగిలిన దానినే ఎవరికైనా త్యాగం చేస్తుంటారు. కానీ, లోభి అలా కాదు. తాను తినడు, ఇతరులను తిననివ్వడు. ఏ సుఖాలూ అనుభవించడు. పైసా ఖర్చు చెయ్యడు. జీవితమంతా కూడబెట్టి కూడబెట్టి మొత్తం మొత్తంగా ఒక్కసారిగా అప్పగించి వెళతాడు. ఇదెంత గొప్ప త్యాగం! కనుక లోభి మహాత్యాగే అని చమత్కారంగా అంగీకరించాలి గదా! మనిషికన్నా డబ్బుకే విలువ ఎక్కువ. డబ్బుకన్నా మనిషి గొప్పవాడని అంగీకరించరు. భార్యాబిడ్డలకన్నా, బంధుమిత్రులకన్నా, తల్లిదండ్రులకన్నా, గురువుకన్నా, దైవంకన్నా డబ్బే గొప్పదని భావిస్తారు. లోభం రజోగుణానికి పెద్దకొడుకు లాంటిది.

కనుక, లోభి రజోగుణ సంపన్నుడు. ప్రవృత్తి: ఎప్పుడూ ప్రాపంచిక విషయాలపైనే ఆసక్తి. పారమార్థిక విషయాలు కూడా గొప్పకోసమే చేస్తూంటారు. నిరంతరం ఏవో ఆలోచనలు చేస్తూంటారు. గాలిలో మేడలు కడుతూ వుంటారు. ఎప్పుడూ ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉంటారు. ప్రశాంతంగా వుండలేరు. హడావుడి, ఆందోళన పరుగులు, ఏదో సంపాదించాలని తహతహ, అంతులేని కోరికలతో వేగిపోతూంటారు. ఉద్యోగాలు చేస్తూ, రిటైరైనా వ్యాపారాలు, వృత్తులు చేసి వృద్ధాప్యం వచ్చినా ఏదో చేయాలని, సంపాదించాలని తహతహలాడేవారు. ఈ జీవిత చరమాంకంలోనన్నా భగవత్‌సేవకి జీవితాన్ని అంకితం చేయాలని భావించక, ఇంకా లౌకిక ప్రవృత్తిలో వున్నవారంతా ఈ రాజసిక లక్షణం గలవారే. కర్మణా ఆరంభః: ధనదాహం కలిగిన లోభి నిరంతరం ప్రవృత్తిలోనే వుంటాడు. ఏవేవో కర్మలను ప్రారంభిస్తాడు. అవి పూర్తి చేసిగానీ, చేయకుండాగానీ మళ్ళీ క్రొత్త పనులు ప్రారంభిస్తాడు. పని చెయ్యటానికి ముందే వచ్చే ఫలితం గురించి ఆలోచిస్తాడు, అంచనా వేస్తాడు. ఇది లాభం లేదని, అది బాగా లేదని పనులను మార్చిమార్చి చేస్తుంటాడు. వాడి మనసు నిలకడగా వుండదు. "కందెన లేని ఇరుసులాగా" ఎప్పుడూ గరగరమంటూ పనులలో మునిగిపోతాడు. ఒకసారి కోతులు మామిడితోటను వెయ్యాలనుకున్నాయి. ఎంతో ప్రయత్నం చేసి, మంచి విత్తనాలు తెచ్చి నాటినవి. అయితే, మరుసటి రోజు నుంచి తమ విత్తనాలు ఎలా పెరుగుతున్నాయో చూడాలని రోజూ ఆ విత్తనాలను బయటకు తీసి వాసన చూసి మళ్ళీ యథాప్రకారంగా నాటుతున్నాయి. ఎన్నాళు ఇలా గడిచిపోయినా, అవి అలాగే చేస్తూ వున్నాయి కానీ, మొలక మాత్రం రాలేదు. రాజసగుణం ప్రధానంగా వున్న వ్యక్తి పనులు ఇలాగే వుంటాయి. త్వరత్వరగా ఫలితాల కోసం ఎదురుచూస్తూ, చేసే పనులను సక్రమంగా చేయడు. అశమం: లోభబుద్ధి గలవాడు నిరంతరం ప్రవృత్తి యందుంటాడు. కర్మలను చేస్తూ వుంటాడు. మార్చిమార్చి చేస్తుంటాడు. ఇలా ఎప్పుడూ లేనిపోని కర్మలను నెత్తిపై వేసుకుంటూ వుండటం వల్ల శాంతి వుండదు. ప్రశాంతత వుండదు. అశాంతి కలుగుతుంది. చేసిన పనుల వల్ల ఎంత ప్రయోజనం సిద్ధించినా సంతృప్తి కలగదు. ఇంకాఇంకా ఎక్కువ పొందాలనుకుంటాడు. ఎప్పుడూ అవే ఆలోచనలు. అప్పుడప్పుడు చేసిన పనిలో ప్రయోజనం కలగకపోయినా, నష్టం కలిగినా విపరీతంగా చలించిపోతాడు. అందుకే అశాంతి పాలవుతాడు. కోరిన కోరికలు తీరకున్నా, క్రొత్తగా కలిగి, వాటికోసం ప్రయత్నం ప్రారంభిస్తాడు. ఉన్నదానితో తృప్తి చెందక, వచ్చే దానితో తృప్తి చెందక అన్నింటికీ అశాంతితో అలమటిస్తుంటాడు. ఇలా అశాంతి పాలయ్యేవారంతా తప్పకుండా రజోగుణ సంపన్నులే. స్పృహ (ఆశ): ఏది చూచినా నాకే కావాలి. ఇవ్వాళ ఇది చేశాను, రేపు అది చేస్తాను అంటూ తలమునకలయ్యే ప్రణాళికలు వేస్తూంటాడు. సామాన్యమైన ఆశయే స్పృహ. ఇది ముదిరితే లోభం అవుతుంది. కలసిరాకపోతే కలసిరాలేదు అని బాధ, కలిసివస్తే ఇంకా ఇంకా కావాలని ఆశ. ఒక ఇల్లుంటే, రెండుమూడు కావాలి. ఒక వ్యాపారం చేస్తూ, మరో రెండు మూడు వ్యాపారాలు చెయ్యాలని ఆశ. ఒక పరిశ్రమ వుంటే ఇంకా నాలుగైదు నెలకొల్పాలని ఆశ. ఇలా కోరికలను పెంచుకుంటూ అవి ఆశలుగా మారి, వాటినే ఆశయాలుగా భావిస్తూ, నిరంతరం కర్మరంగంలో వుంటూ తృప్తి పర్చలేని మనసు గలవాడే రజోగుణ సంపన్నుడు. ఇలా ఈ పై లక్షణాలున్నవారు రజోగుణ సంపన్నులుగా తెలుసుకోవచ్చు.

***ఈ పది వరాలను, మీ మదివనరులను, పవిత్ర ఆజ్ఞలుగా భావించుకోండి.***
***మీ జీవితంలో సదా వల్లెవేసుకోండి.***
***నేను అనే మాటను మరచిపోండి***
***మనము అనే బాటలో నడవండి***
***అహం అనే పదాన్ని అంతం చేసుకోండి***
***ప్రేమ అనే ఫలాన్ని అందరితో పంచుకోండి***
***నవ్వు అనే సొమ్ములు సదా ధరించండి***
***తప్పు అనే నిప్పును దూరంగా వుంచండి***
***విజయం అనే గమ్యం కోసం నిరంతరం శ్రమించండి***
***ఈర్ష్య అనే శత్రువును దూరంగా వుంచండి***
***విజ్ఞానం అనే మిత్రుడ్ని సంపాదించుకోండి***
***స్నేహం అనే వరంతో మనుష్యుల్ని అక్కున చేర్చుకోండి***
***మాధవసేవే మానవసేవయని, నీవే జీవుడని-నీవే దేవుడని***
***ఉన్నదానితో సుఖంగా జీవించి, మానవతతో సదా పరిమళించండి***
***అప్పుడు మీరే ఋషులు, మహామనీషివి, మరో మనిషివి***
***ఇవే నవజీవన రహస్యాలు!***
***ఆత్మార్పణకు, త్యాగానికి, స్వచ్ఛతకు నిలయం కాకపోతే, మీకు ఎటువంటి విలువ వుండదు.***
***మీపట్ల గౌరవం మీ ప్రవర్తన, శీలంలోనే వుంటుంది***
***ఈ ఆంజనేయుని ఆలంబనలో, మీ ఆలోచనలను మార్చుకుని***
***ఆలోచనల పరిణామమే మనిషి అన్నట్లుగా, అతను ఎలా ఆలోచిస్తే అలా తయారవుతాడు.***
***కావున సవ్యంగా ఆలోచించి, సవ్యంగా నడిచినట్లైతే***
***స్వస్వరూపవంతులై, సర్వజ్ఞానశోభితులై***
***సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడి***
***మీరు ఆంజనేయుని ముద్దుబిడ్డలై గమ్యం చేరుతారన్నది***
***ఈ పవనపుత్రుడు తన బిడ్డలకిస్తున్న హామీ***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**27-11-2019** 08:45 AM

**15)** మాలో తమోగుణ ప్రభావం ఉన్నదని ఎలా గుర్తించాలి స్వామి?

*తమోగుణం పెరుగుతున్నప్పుడు బుద్ధి మందగించడం (అయోమయ స్థితి), ఏమరుపాటు, బద్ధకం*

*(సోమరితనం), భ్రాంతి జనిస్తాయి. తమోగుణం మీలో వృద్ధి అవుతున్నదనేది ఎలా తెలుసుకోగలరో, దానికి 4 ముఖ్య లక్షణాలను చెబుతాను. అవి, 1) అప్రకాశకం (బుద్ధిమాంద్యం, అయోమయం), 2) అప్రవృత్తి (ఏమరుపాటు) 3) ప్రమాదం (బద్ధకం, సోమరితనం) 4) మోహం (భ్రమ, భ్రాంతి). 1) అప్రకాశకం: అంటే బుద్ధిమాంద్యం. ఏమీ తెలియని అయోమయస్థితి. సాధారణంగా లోకంలో చాలామంది తమ కర్తవ్యాలను గురించి, బాధ్యతలను గురించి ఏమాత్రం పట్టించుకోకుండా, అసలు ఆలోచనే చేయకుండా వుంటారు. అలాంటివారు ఆలోచించాలనుకున్నా, సరైన ఆలోచనలే చేయరు, చేయలేరు. వారి బుద్ధి అసలు పనిచేయదు. అందువల్ల, ఏ పనీ చేయకుండా వుంటారు. ఇక ఆధ్యాత్మికరంగంలో కూడా తమోగుణ సంపన్నులుంటారు. శాస్త్రాల గురించి గురువులు, సద్గురువులు ఎంత బోధించినా, బోధిస్తున్నా, ఎన్ని విధాలుగా స్థాయి దిగివచ్చి చెప్పినా, వారికి మాత్రం, ఏమాత్రం జ్ఞానం బుద్ధిలోకి ఎక్కదు. ఎందుకంటే, బుద్ధి మందగించి వుంటుంది. నిద్రావస్థలో వుంటుంది కనుక. అందువల్ల వారి స్థితి అంతా అయోమయస్థితియే. అదే అప్రకాశకం. ధృతరాష్ట్రుడు అలాంటి లక్షణం గలవాడే. విదురుడుగానీ, సంజయుడుగానీ, భీష్మ ద్రోణులుగానీ, వ్యాసుడుగానీ, మహర్షులుగానీ ఎన్ని మంచి మాటలు చెప్పినా అన్నీ వింటాడుగానీ, ఏ ఒక్కదాన్నీ ఆచరించడు. వాళ్ళు చెప్పిన మాటలు బాగున్నాయంటాడు, కానీ వారు చూపిన మార్గాన పోడు. చివరకు సర్వనాశనం జరిగింది. ఇదే తమోగుణ లక్షణం. కొందరు గంటలు గంటలు, రోజులకు రోజులు ఎంత చెబుతున్నా వారు విన్నా, వారిలో ఏమీ నిలవదు. కారణం, తమోగుణ ప్రవృత్తియే. అలాగే నిర్ణయాలు తీసుకోవలసి వచ్చినప్పుడు అందరినీ అడిగి, దేనినీ పాటించరు. అదే అయోమయం. అప్రకాశం అంటే ఇదే. 2) అప్రవృత్తి: ప్రవృత్తి అంటే నిరంతర లౌకిక విషయాలపట్ల ఆ పనితో కర్మలు చేయుట. అప్రవృత్తి అంటే, వేటిపట్ల ఆసక్తి వుండదు. ఏమీ చేయరు. బద్ధకంతో, సోమరితనంతో ఎక్కువగా నిద్రకు అంకితమై, కర్తవ్య-అకర్తవ్యాల పట్ల ఏ మాత్రం ధ్యాస లేకుండా వుండిపోతారు. ఇదే సోమరి లక్షణం. ప్రపంచంలో అన్నీ వున్నాయి. కానీ, సోమరికి ఏమీ లేదు. సోమరి తలకాయలో దయ్యాలు నివసిస్తాయి. ఇదంతా తమోగుణ లక్షణం. ఏమరుపాటు, మతిమరుపు, తెలివితక్కువతనం ఉన్న ఇలాంటి వారికి ఏమి చేయాలో తెలియదు, తోచదు. ఏమీ గుర్తుండవు. గోళ్ళు గిల్లుకుంటూ, పుల్లలు విరుచుకుంటూ వుంటారు. చిన్నచిన్న పనులకు కూడా జామునేపు గడుపుతుంటారు. వీరికి మతిమరుపు ఎక్కువ. ఒకవేళ ఏదైనా పని చేయటానికి సిద్ధమైనా, తెలివితక్కువతనంతో ఆ పనిని చెడగొడతారు. 3) ప్రమాదం: బద్ధకం, సోమరితనం, అతినిద్ర 4) మోహం: అంటే భ్రమ, భ్రాంతి, మూఢత్వం అని కూడా అర్థం. చూచిన వాటిని నాది అని పట్టుకోవటమే మోహం. తనకు ఏది అవసరమో, ఏది అవసరం లేదో కూడా తెలియదు. ఎందుకూ పనికిరానివన్నీ, ఎంతో అపురూపంగా దాచుకుంటారు. ఇదంతా తమోగుణ లక్షణమే. సాధకుడైనవాడు ముందుగా తమోగుణ కార్యాలను నిరోధించాలి, నిగ్రహించాలి. రజోగుణాన్ని ఆశ్రయించి, తమోగుణాన్ని తొలగించాలి. సత్త్వగుణాన్ని ఆశ్రయించి రజోగుణాన్ని పారద్రోలాలి. చివరకు, సత్త్వాన్ని కూడా దాటి శుద్ధసత్త్వంలో నిలవాలి. చెట్టు మొదట్లో నీరు పోస్తే పిందె కాయగా మారి, కాయ పండుగా మారి, చివరకు చెట్టు నుండి రాలిపడిపోతుంది. పిందె వగరుగా వుంటుంది, కాయ పులుపుగా వుంటుంది,*

పండు తియ్యగా వుంటుంది. పిందె – తమోగుణం, కాయ – రజోగుణం, పండు – సత్త్వగుణం. చివరకు పండు చెట్టు నుండి రాలి పడుతుంది. అలాగే మీలో ఏ గుణం వుందో కనిపెట్టి, సాధనాప్రయత్నం చేసి, క్రమంగా ఒక్కొక్క గుణాన్ని వదులుతూ, చివరకు గుణాతీతులై జీవన్ముక్తులు కావాలి. ఈ గుణసంబంధ విషయాలను తెలుసుకుంటే, మీలో ఏ గుణం ప్రబలంగా వుందో తెలుసుకొని, తొలగించుకోగలుగుతారు.

***పున్నెపు పంటగా పుట్టిన సాధనను కన్నుల పండువుగా చూచేదెపుడో?***
***కన్నుల పంటగా ఎదిగేదెప్పుడో? కన్నులు తెరచి చూచెదెప్పుడో?***
***తిన్నగా నన్ను అంటే, తనను తాను గుర్తించేదెపుడో? నా మురిపాలను తీర్చేదెపుడో?***
***చల్లగా నన్ను చేరేదెప్పుడో? మెల్లమెల్లగా నన్ను చేరేదెప్పుడో?***
***బుడిబుడి అడుగులు వేసేదెప్పుడో? వడివడి పరుగులు తీసేదెపుడో?***
***ముద్దుముద్దు పలుకులు పలుకుతూ, ముద్దుగా స్వామీ అని పిలుస్తూ,***
***కోరి కోరి కోదండరాముని ఆశ్రయించి గోరుముద్దలు పవనకుమారునిచే స్వీకరించి,***
***జ్ఞానామృతాన్ని గ్రోలి, మురిపాలలో మునుగుతూ, తండ్రి పరిష్వంగనకై***
***దోగాడు బిడ్డ చందము త్వరత్వరగా నన్ను చేరి సదా సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**28-11-2019** 09:15 AM

**16)** **భక్తుని స్థితి ఎట్టిది స్వామి?**

భక్తుడు అనబడేవాడు శుభాన్నీ, అశుభాన్నీ రెండింటినీ త్యజించాలి. అలా త్యజించగలవాడే భక్తుడు. మీరు అశుభాన్ని పరిత్యజిస్తారు కానీ, శుభాన్ని ఎలా పరిత్యజిస్తారు? కానీ, రెండూ విడిచినవాడే భక్తుడు. శుభాశుభాలు మనోబుద్ధులకే గానీ, వాటిని దాటి ఆ పరమాత్మలోనే స్థితి గలిగినవారికి శుభాలు, అశుభాలు అంటూ ఏమీ వుండవు. సాధన దశలో మొదట అశుభాన్ని వదిలి, శుభకర్మలు చేయాలి. చివరకు, ఆ శుభకర్మఫలాలు కూడా అడ్డంకే. అవికూడా బంధాలే అవుతాయి. కనుక, వాటిని కూడా వదలాలి. చెడ్డపనులు చేస్తే ఇనుపసంకెళ్ళు, మంచిపనులు చేస్తే బంగారుసంకెళ్ళు. కనుక, ఫలత్యాగంతో, కర్తృత్వం లేకుండా కర్మలు చేసినా, చేయనివాడే అవుతాడు. భక్తుని దృష్టిలో పరమాత్మే వుంటాడు గానీ, కర్మలుండవు. కనుక, అవి శభమని, అశుభమని వుండవు. కనుక, అతడు రెండూ విడిచినవాడే. ఇట్టి భక్తుడే భగవంతునికి ప్రియుడు. శత్రువులయందు, మిత్రులయందు సమంగా ప్రవర్తించేవాడు, అలాగే మానావమానములయందు, శీతోష్ణములయందు, సుఖదుఃఖములయందు సమంగా వుండేవారు, సంగభావాన్ని విడిచేవారు భగవంతునికి ప్రీతిపాత్రులు అంటే ప్రియభక్తులు. మీకు అపకారం చేసినవాడు శత్రువు – మీకు ఉపకారం చేసినవాడు మిత్రుడు. వీరిద్దరినీ సమానంగా చూడగలిగినవాడు భక్తుడు. వేర్వేరుగా భావించేవాడు సామాన్యుడు. పరిపూర్ణభక్తుడు మనసు యొక్క పరిధిని దాటినవాడు. ఆత్మతో

నిరంతరం సంబంధం పెట్టుకున్నవాడు. ఆ స్థాయిలో ఉన్నవానికి మిత్రులు, శత్రువులు వుండరు. అందుకే రాగద్వేషాలుండవు. అందరినీ సమంగా చూడగల్గుతారు. మనసుతో తాదాత్మ్యం చెందిన సామాన్యులెవరైన మనసుకు బాధ కలిగించినవారిని శత్రువుగా చూచి ద్వేషిస్తారు. మనసుకు సంతోషం కలిగించినవారిని మిత్రులుగా భావించి ప్రేమిస్తారు. విదురుడు ధృతరాష్ట్రుని సోదరుడు. సోదరుని క్షేమాన్ని కాంక్షించేవాడు. ఎల్లప్పుడూ కౌరవహితాన్ని కోరి, సరియైన సలహాలను ఇస్తూ వుంటాడు. అలాంటి విదురుడ్ని కోపగించుకొని, ఆ పాండవుల వద్దకే వెళ్ళమన్నాడు ధృతరాష్ట్రుడు. ఎందుకంటే, పాండవులను మాయాజూదంలో ఓడించి, అరణ్యాలకు పంపటం క్షేమం కాదు. వారిని పిలిపించి, వారి రాజ్యాన్ని వారికిచ్చి పంపమని ధృతరాష్ట్రునికి సలహా ఇచ్చినందుకు. ధృతరాష్ట్రుడు అలా ఆదేశించటంతో మారు మాట్లాడకుండా పాండవుల వద్దకు వెళ్ళిపోయాడు విదురుడు. వెంటనే తన తొందరపాటుకు పశ్చాత్తాపం చెంది పిలిపించగా, తిరిగి వచ్చాడు ధృతరాష్ట్రుని వద్దకు. అంటే విదురునికి ఎవరైనా ఒకటే, ఏ తేడా లేదు. అదీ భక్తుడంటే! మానావమానాలు బుద్ధిపరిథిలోనివి. తమ ప్రతిభను అందరూ ప్రశంసిస్తుంటే సన్మానం, తమను కించపరిస్తే అవమానం, సామాన్యుడు బుద్ధిపరిథిలో వుంటాడు కనుక, బుద్ధితో తాదాత్మ్యం చెంది వుంటాడు కనుక, మానావమానాలవల్ల సంతోషాన్నీ విషాదాన్నీ పొందుతూ వుంటారు. భక్తులైనవారు బుద్ధిపరిథిని దాటినవారు. కనుక, ఆత్మతో అనుసంధానమైనవారు గనుక వారికి రెండూ సమానమే. ఇటువంటివారు తమకిచ్చే గౌరవాన్ని గాని, అగౌరవాన్ని గాని పట్టించుకోరు. “లోకులు పలుకాకులు” అన్నారు. ఒక్కొక్కప్పుడు వారే గౌరవిస్తుంటారు, ఒక్కొక్కప్పుడు వారే అవమానిస్తారు, హీనంగా చూస్తారు. భక్తులైనవారు వాటిని పట్టించుకోరు. ఒక గ్రామంలో ఇద్దరు వ్యక్తులున్నారు. ఒకడు ఎప్పుడు ఎక్కడికి వెళ్ళినా, గుర్రమెక్కి వెడుతుంటాడు. దాన్ని వదిలి ప్రయాణం చెయ్యడు. మరొకడు ఎక్కడ కూర్చున్నా పరుపు, దిండు లేకుండా కూర్చోడు, పడుకోడు. ఎక్కడకు వెళ్ళాలన్నా చిన్నపరుపు, దిండు మూడగట్టుకుని వెడుతుంటాడు. ఆ ఇద్దరూ ఒకే రోజున ఒకే సమయంలో పొరుగూరికి బయలుదేరారు. గుర్రమెక్కి వెళ్ళేవాడు ముందు వెళుతున్నాడు, రెండవవాడు పరుపు, దిండు మూటగుట్టకుని నెత్తిన పెట్టుకొని ఆ వెనుకనే వెళుతున్నాడు. ఇద్దరూ ఒకరికొకరు సంబంధం లేకపోయినా, ఆ ప్రయాణం అలా కుదిరింది. ఒక పల్లెగుండా అలా వెళ్తున్న వారిద్దరినీ చూసి ఆ పల్లె ప్రజలు అనుకుంటున్నారు, “ఆ గుర్రమెక్కి వెళ్తున్నవాడు తాసిల్దారు అయివుంటాడు. ఆ నెత్తిన మూట పెట్టుకుని వెళ్ళేవాడు బంట్రోతు అయవుంటాడు అని. సరే, ఇద్దరూ చేరవలసిన గమ్యం చేరుకున్నారు. గుర్రమెక్కి వచ్చినవాడు ముందుగా వచ్చి ఊరి మధ్యలో వున్న ధర్మశాల వద్ద గుర్రాన్ని ఆపి, గుర్రాన్ని కట్టివేయటానికి అటూఇటూ తచ్చాడుతున్నాడు. చివరకు ఒకచోట స్తంభాన్ని చూచి, దానికి కట్టివేశాడు. ఇంతలో రెండవాడు ఆ ధర్మశాల దగ్గరికే వచ్చి, అక్కడే వరండాలో పరుపు పరుచుకుని దిండు వేసుకుని ఠీవిగా కాలుమీద కాలు వేసుకొని శేషపాన్పు వేసి విశ్రాంతి తీసుకుంటున్నాడు. మొదటివాడు గుర్రాన్ని కట్టివేసి దాని మేత కోసం వెళ్ళి కొంత మేతను తెచ్చి గుర్రానికి వేస్తున్నాడు. ఇది చూచిన అక్కడివారు అనుకుంటున్నారు, ఆ దిండువారగా పరుపుమీద ఠీవిగా పడుకున్నవడు తాసిల్దారు అయివుంటాడు, ఈ గుర్రానికి మేత వేస్తున్నవాడు బంట్రోతు అని. ఈ లోకం గ్రుడ్డిది. వివేకంలేనివారి మాటలతో, మానమర్యాదలతో ఒరిగేది తరిగేది

ఏమీ వుండదు. తాసిల్దారు బంట్రోతు కావటానికి, బంట్రోతు తాసిల్దారు కావటానికి ఎంతోసేపు పట్టలేదు. లోకుల మానావమానాలకు ఏమాత్రం విలువలేదు. భక్తుడు వీటిని అల్పమైనవిగా భావిస్తాడు. మానావమానాలను సమంగా చూస్తాడు. అసలు నిజమైన భక్తుడు ఎంతటి మనావమానాలనైనా సంతోషంగా స్వీకరిస్తాడు.

***మీరు మారితే అందుతుంది మోక్షము - లేకుంటే ఎదుర్కొంటారు పరీక్షలు.***
***ఏ దేవుడూ కాడు ప్రత్యక్షం - నీకు నీవే దైవం***
***బాగుపరిచేది విచక్షణ - నష్టపరిచేది నిర్లక్ష్యం***
***అవసరం లేదు లక్షలు - విచ్చుకోవాలి అంతఃచక్షువులు***
***ఇది ఆంజనేయుని అనురాగంతోనే***
***అన్నింట్లో ఆంజనేయుని భాగస్వామ్యంతోనే***
***ఆధ్యాత్మికమనేది అనేక వసంతాల వృక్షమయ్యా***
***కలకాలం నిలుస్తుంది సాక్ష్యంగా***
***జీవితలక్ష్యం జీవనగమ్యం మోక్షమొక్కటే***
***మానవలక్ష్యం ముక్తి మాత్రమే ముక్తి మాత్రమే***
***మారుతి మాటలు మాత్రమే***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**29-11-2019** 08:40 AM

**17) జీవితంలో ఎదురయ్యే పరిస్థితులకు భక్తుడు ఎలా స్పందిస్తాడు స్వామి?**

ఒక గ్రామంలో భక్తాగ్రేసరుడైన ఏకనాథస్వామి అనే పేరుగల వ్యక్తి వుండేవాడు. అదే గ్రామంలో ఒక పేద బ్రాహ్మణుడు తన కుమార్తె వివాహానికై ఒక పండితుని వద్దకు వెళ్లి యాచించాడు. ఆ పండితుడు ధనవంతుడు, ధనగర్వం బాగా తలకెక్కినవాడు. అతడిది పుస్తకపాండిత్యమే గాని, మస్తకపాండిత్యము కాదు. ఆ పండితుడు బ్రాహ్మణునితో, "నేను తప్పకుండా నీకు ధనసహాయము చేస్తాను. అయితే, నీవొక పని చేయాలి" అన్నాడు. దానికి విధి లేక, ఆ బ్రాహ్మణుడు ఏకనాథుని అవమానించటానికి సమయం కోసం ఎదురుచూస్తున్నాడు. ఒకరోజు ఏకనాథుడు గోదావరిలో స్నానం చేసి ఆలయంలోనికి వెళ్ళాలనుకుంటూ వుండగా, ఆ గోదావరి గట్టున కూర్చున్న బ్రాహ్మణుడు అదే సరియైన సమయమని భావించి, ఏకనాథునిపై ఉమ్మివేశాడు. ఏకనాథుడు ఏమీ మాట్లాడకుండా శాంతచిత్తంతో మళ్ళీ గోదావరిలో స్నానం చేశాడు. తిరిగి రాగానే బ్రాహ్మణుడు మళ్ళీ ఉమ్మివేశాడు. ఏకనాథుడు ఏమీ మాట్లాడకుండా మరలా శాంతచిత్తంతో గోదావరిలో దిగి స్నానం చేసి వస్తున్నాడు. అతనికి ఎలాగైనా కోపం తెప్పించాలని బ్రాహ్మణుడు మళ్ళీ ఊసాడు. అతడు మౌనంగా వెళ్ళి స్నానం చేసి వస్తున్నాడు. ఇతడు ప్రతిసారీ ఇలాగే

చేస్తున్నాడు. మధ్యాహ్నం అయ్యింది, ఇదే తంతు. చివరకు బ్రాహ్మణునిలో పశ్చాత్తాపం కలిగింది. ఏకనాథుని పాదాలపై పడి క్షమించమని వేడుకున్నాడు. దానికి ఏకనాథుడు, "నాయనా! నీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను. ఎందుకంటే, పవిత్రగోదావరిలో 108 సార్లు స్నానం చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాను. ఇప్పుడా కల నెరవేరింది" అన్నాడు. ఆ బ్రాహ్మణుడు తానిలా ఎందుకు అవమానించిందీ తెలియచేశాడు. దానితో, ఆ బ్రాహ్మణుడ్ని ఆలింగనం చేసుకుని, "నాయనా! నీవు ఇంత కష్టంలో ఉన్నావా? నేను కోపగిస్తే నీకు ధనం వస్తుంది, నీ అవసరం తీరుతుంది అని తెలిస్తే, తప్పకుండా కోపం ప్రదర్శించేవాడ్ని" అన్నాడు ఏకనాథుడు. అదీ అవమానం పట్ల భక్తుల వైఖరి. ఎంత సన్మానమైనా, అవమానమైనా అతడికి పట్టవు. అతడు దేహానికి జరిగే మానావమానాలను నిర్లిప్తంగా చూస్తూ పరమాత్మలోనే వుండిపోతాడు. కనుక, మానావమానాల పట్ల సమబుద్ధితో వుంటాడు. భక్తుడైనవాడు శీతోష్ణాలకు చలించడు. శీతోష్ణాలు శరీరానికి సంబంధించినవి. సామాన్యుడు వీటికి చలించిపోతుంటాడు. ఒక ఆశ్రమంలో గురువుగారు శిష్యుడ్ని పిలిచి, "నాయనా! పాఠాలు బాగా చదువుతున్నావా?" అని అడిగాడు. "ఆ. చక్కగా చదువుతున్నాను గురువుగారూ!" అన్నాడు శిష్యుడు. "చదువుతున్నావు సరే, జ్ఞాపకం వుంటున్నాయా?" అని అడిగారు గురువుగారు. "కొన్ని జ్ఞాపకం వుంటున్నాయి, కొన్ని వుండటం లేదు" అన్నాడు శిష్యుడు. "అలా కాదు. అన్నీ జ్ఞాపకం వుంచుకోవాలి" అన్నాడు గురువు. "అలానే వుంచుకుందాం అనుకున్నాను గురువుగారు. కానీ, మొన్న ఒకాయన అన్నీ గుర్తుపెట్టుకుంటె, బుర్ర వేడెక్కిపోతుంది అనటంతో జాగ్రత్తపడుతున్నాను" అన్నాడు శిష్యుడు. "అందుకని ఏమి చేస్తున్నావు?" అని గురువుగారు అడగ్గా, "కొన్ని గుర్తుపెట్టుకొని, కొన్ని వదిలివేస్తున్నాను. "ఏం గుర్తుంచుకున్నావు? ఏం వదిలివేశావు?" అని గురువుగారు అడగ్గా, "చలికాలంలో ఏం తినాలి, ఎండాకాలంలో ఏం తినాలి? చలికాలంలో ఎక్కడ నిద్రించాలి, ఎండాకాలంలో ఎక్కడ నిద్రించాలి అనేవి జాగ్రత్తగా గుర్తుపెట్టుకున్నాను" అన్నాడు శిష్యుడు. "మరి పాఠాలో?" అని అడిగితే, "అవి వదిలివేశాను గురువుగారూ! బుర్ర వేడెక్కుతుంది గదా! అసలే నేను భరించలేను" అన్నాడు. "ఓరి సోమరిపోతా! పాఠాలను చక్కగా గుర్తుపెట్టుకో. తిండి, నిద్ర గురించి మర్చిపో" అన్నాడు గురువు. ఇలా చలికీ, వేడికీ చలించేవాడూ, కర్తవ్యాలను విడిచిపెట్టేవాడూ భక్తుడు కాదు, సోమరిపోతు. భక్తుడు శీతోష్ణాలకు చలించకూడదు. మహాత్ములు, భక్తులు అయినవారు సుఖాలకు పొంగరు, దుఃఖాలకు క్రుంగరు. రెండింటినీ సమంగానే చూస్తారు. ఇవి మనోస్థాయిలోనివి. భక్తుడు మనోస్థాయిని దాటి వుంటాడు గనుక సమదృష్టితో వుంటాడు. మీ చేతలే మీ రాతలని, ఆ రాతలను బట్టే మీకిక్కడ వాతలని తెలుసుకుంటే, సుఖదుఃఖాలకు చలించే పనిలేదు. మీ సుఖదుఃఖాలకు మూలకారణం మీ పూర్వజన్మ కర్మలేనని తెలుసుకోలేనివాడు ఎంతటి గొప్పవాడైనా చలించిపోతాడు. ఒక గొప్ప హరిదాసుగారున్నారు. ఆయన చేత హరికథను చెప్పించుకోవాలని, 2, 3 నెలల ముందే అడ్వాన్సులిచ్చి ఖాయం చేసుకుంటారు అందరూ. ఒక గ్రామంలో పెద్దలందరూ కలిసి ఆయనతో మట్లాడి కార్యక్రమం సిద్ధం చేసుకున్నారు. రాత్రి 9 గంటలకు హరికథ ప్రారంభం. 8 గంటల నుండే భక్తులు వస్తున్నారు. సభాస్థలం నిండిపోయింది. సరిగ్గా 9 గంటలకు భాగవతార్‌గారు స్టేజీ మీదకు వచ్చారు.

ఆహ్వానసంఘంవారు ఒక పెద్ద గజమాలను కట్టించి నలుగురు జాగ్రత్తగా మోసుకొచ్చి, దానిని భాగవతార్‌గారి మెడలో వేశారు. ఆ పూలదండను చూడగానే ముఖం వెలిగిపోయింది. "నా జీవితంలో ఇంత ఆనందాన్ని నేనెరుగను" అన్నాడు. సభికులు చప్పట్లు కొట్టారు. కథ ప్రారంభమైంది. "రఘురాముడు, రమణీయ, రమణీయ ఘనశ్యాముడూ..." అంటూ చిడతలు వాయిస్తూ పాడుతూ నృత్యం చేస్తున్నారు. తన్మయత్వంతో, ఆనందంతో పరవశించి పాడుతున్న ఆయన ముఖంలో క్రమంగా కళ తగ్గిపోతున్నది. ఏదో తెలియని వేదన. క్రమంగా పాటమీద శ్రద్ధ తగ్గింది. ఇక ఓర్చుకోలేక, శరీరాన్ని గోకటం ప్రారంభించాడు. పిచ్చిపిచ్చిగా గోకుతున్నాడు. శరీరమంతా మంటెక్కిపోతుంది. జనానికేమీ అర్థంకావటం లేదు. ఇక లాభం లేదనుకొని, ఆ పూలదండను తీసి విసిరి అవతల పడేశాడు. ఎందుకంటే, ఆ పూలదండలో ఎర్రచీమలు చేరాయి. అవి కుడుతున్నాయి. అంతసేపు దండ తీసివేయటానికి ప్రాణం ఒప్పక ఎలాగో భరించాడు. చివరకు భరించలేక తీసి విసిరేశాడు. అప్పుడు నానా యాతన పడుతూ అన్నాడు, "ఈరోజు నా జీవితంలో గొప్ప దౌర్భాగ్యమైన రోజు" అని. ఆనందంలో పొంగిపోయినంతసేపు పట్టలేదు, దుఃఖించటానికి. ఈ లోకంలో సుఖాలుగానీ, దుఃఖాలుగానీ శాశ్వితంగా వుండేవికావు. వస్తూపోతూ వుంటాయి. కనుక, వీటిని చూచి పొంగే పనీలేదు, కృంగే పనీలేదు. రెండిటినీ సమంగా చూడగలగాలి. అట్టివారే భక్తులు. సుఖదుఃఖాల అసలుతత్త్వం తెలుసుకోలేనివారే వాటికి చలిస్తారు, పొంగుతారు, కృంగుతారు.

***సాధన చేస్తే ప్రతి మనిషికీ విజయం సొంతం***
***కృషి వుంటే మనుషులే ఋషులవుతారు అన్నది నిజం***
***ఆలోచనలకు విశ్లేషణ తోడైతే, జీవితం అమృతతుల్యం***
***వటవృక్షం కావటానికి విత్తే కదా మూలం***
***చరిత్ర సృష్టించటానికి గమ్యాన్ని ఛేదించటమే కదా ముఖ్యం***
***అందుకు కావాలి మారుతి మాటలు మీకు ఆదర్శం***
***చిన్ని ఆలోచనలను చిలికితే గొప్ప ఫలితం అందుతుంది***
***ఆవేదన నుంచే కదా ఆలోచన***
***ప్రేరణ నుంచే కదా విశ్లేషణ***
***తపనే గమ్యాన్ని ఛేదించే విలక్షణ గమనమే కదా గమ్యానికి ప్రేరణ***
***మౌనంతోనే ప్రతిమనిషీ మునీశ్వరుడు***
***ధ్యానంతో ప్రతి ఒక్కరూ పరమేశ్వరుడే***
***ఆటంకాలు ధీరుని విజయానికి సోపానాలు***
***లక్ష్యాన్ని ఛేదించటమే విజయానికి ఓనమాలు***
***వినీలాకాశంలో విహరిస్తూ వీరహనుమాన్ బోధలతో విజయులై***
***కష్టసుఖాలకతీతమైన శీతోష్ణ సుఖదుఃఖేషులై***
***సుఖించండి నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**30-11-2019** 08:40 AM

మీరు జీవితంలో ఆచరించవలసినవి ఎన్నో వున్నాయి. వాటిని ఒకసారి మరలా గుర్తు తెచ్చుకోండి.

1. మానవజీవితానికి అర్థం పరమార్థం, సార్థకత, పరిపూర్ణత్వం సిద్ధించాలంటే, ఆధ్యాత్మికమార్గమే శరణ్యం. ఎవరు ఏ మార్గాన్ని ఎన్నుకున్నా, చివరకు ఈ మార్గంలోకి ప్రవేశించినప్పుడే జీవితం పరిపూర్ణమవుతుంది. ఎందుకనగా, అన్ని మార్గాలకూ తల్లివంటి మార్గమే ఆధ్యాత్మికమార్గం. అయితే, అంతర్ముఖమార్గం, బాహ్యాముఖమార్గం రెండు మార్గాలను తెలుసుకున్నప్పుడే, పరిపూర్ణం సిద్ధిస్తుంది. అంతర్ముఖమార్గం ఆనందం పంచుతుంది. బాహ్యాముఖమార్గం అసంతృప్తిని పెంచుతుంది. ఆధ్యాత్మికత అంటే, ఆది + ఆత్మకత = ఆధ్యాత్మికత. ఆది నుండి అనంతంగా వున్న ఆత్మను గురించి తెలుసుకోవాలంటే అంతర్ముఖద్వారం ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది. దీనిద్వారా ప్రతిఒక్కరూ సత్యవంతంగా, సమర్థవంతంగా, శీలవంతంగా, సేవాభావంతో, ధర్మబద్ధంగా, క్రమశిక్షణగా, ఆనందంగా, ఆరోగ్యంగా, ప్రశాంతంగా, పవిత్రంగా జీవితాన్ని పరిపూర్ణం గావించుకుని, సంతృప్తిగా, సహజసిద్ధంగా భగవంతునిలో కలసిపోతారు.

2. పరిష్కారమార్గం తెలిసినా, ఆధ్యాత్మికమార్గం వైపుకు మొగ్గు చూపలేకపోవటానికి మనసులో వున్న సంస్కారాలు లేక,ముద్రలే కారణం. వాటి స్వభావాన్ని మార్చుకోగలిగిన ఏకైకజాతి మానవజాతి మాత్రమే. మిగిలిన జాతులకు అటువంటి అవకాశం లేదు. ఉదా:- కుక్కజాతిని గమనించండి. పుట్టుక నుండి మరణం వరకూ ఒకేశబ్దం భౌభౌభౌ అని పలుకుతుంది తప్ప, భావాలు కలిగిన భాషకు అవకాశమే లేదు. మానవజాతిని గమనించినట్లయితే, అన్ని జీవరాసుల భాషలను కూడా ఉచ్ఛరించగల్గుతాడు. కాబట్టి, అన్ని జాతులలోకెల్లా మానవజాతి ఉత్తమమైన జాతి. అందుకే, "జంతూనాం నరజన్మ దుర్లభం" అంటారు. దుర్లభమైన దానిని జాగ్రత్తగా కాపాడుకోవటం మీ బాధ్యత.

3. అంతరంగంలో పేదరికం వుంటే అదే నిజజీవితంలో కార్యరూపం దాలుస్తుంది. భావదారిద్ర్యం అతి ప్రమాదకరమైన అవలక్షణం. భౌతికసంపద కన్నా భావఐశ్వర్యం ఎంతో మిన్న. ఆధ్యాత్మికంగా ఎదిగిన వ్యక్తి ఐశ్వర్యాన్ని గురించి ఆలోచించనవసరం లేదు. ఎవరైనా ఆధ్యాత్మిక మార్గంలో వుంటూ కూడా ఆర్థిక బాధలను అనుభవిస్తున్నాడంటే, ఆ మార్గంలో అతడు ఇంకా అభివృద్ధి చెందలేదని భావించాలి.

4. ఆలోచించకుండా మాట్లాడటం, గురి చూడకుండా బాణం వేయడంలాంటిది. మాట్లాడిన తర్వాత ఆలోచించాల్సిన అవసరం రాకూడదు. కాబట్టి, ఆలోచించి, ఆచితూచి మాట్లాడాలి. తాను ఏం మాట్లాడాలో తెలిసినవాడు తెలివైనవాడు, తాను ఏం మాట్లాడకూడదో తెలుసుకున్నవాడు వివేకవంతుడు.

5. మనిషికి భావవ్యక్తీకరణ గొప్ప ఆస్తి. ఏం చెప్పారనే దానికన్నా, ఎలా చెప్పారనే దానినిబట్టి భావప్రసరణ మరింత ఆకర్షణీయంగా వుంటుంది. భావవ్యక్తీకరణ ఎంత గొప్పగా వుంటే, ఫలితం అంత మహత్తరంగా వుంటుంది.

*6.* తామసాన్ని విడనాడండి. తామసానికి ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. ఇద్దరు వ్యక్తులు నేరేడు చెట్టు క్రింద పడుకున్నారు. ఆ దారిన సైకిలుపై ఒక వ్యక్తి వెడుతున్నాడు. "అయ్యా అయ్యా!" అని ఒకడు కేకవేశాడు. ఏమిటోనని అతడు వచ్చి అడిగాడు. దానికి వాడన్నాడూ, "ఆ, ఏమీ లేదు. నేరేడు పండు నా పొట్టమీద పడ్డది. కాస్త దానిని తీసి నా నోట్లోకి పెట్టండి" అన్నాడట. దానితో ఆ వచ్చినవాడు కోపంతో కర్ర తీసుకుని నాలుగు వడ్డించాడు. అది చూచి ప్రక్కన వున్నవాడంటున్నాడు, "అంతే కావాలి. సోమరిపోతు వెధవ! నా ముఖం మీద కుక్క మూత్రం పోస్తుంటే, అరగంట నుండి దానిని తోలకుండా చూస్తూ వున్నాడు. వెధవ!" అన్నాడట. వాడు సోమరి – వీడి మహాసోమరి. ఎందుకు చెప్పానో ఎవరికి వారే అర్థం చేసుకోండి.

*7.* ఎవరి సహజసిద్ధమైన ధర్మాశయాలతో వారిని ఎదగనిస్తే, అదే విజయానికి పునాది అవుతుంది. ఉన్నతమైన ధర్మబద్ధమైన ఆశయాలు సహజసిద్ధంగా ఏర్పడాలి. ఒకరిపై ఆపాదించినా, కలిగించాలని చూసినా కుదరదు. సహజసిద్ధంగా ఏర్పడిన ఆ ధర్మాత్మకమైన ఉన్నతాశయాలు ఆ వ్యక్తిని ఖచ్చితంగా ఉన్నతునిగా నిలబెడతాయి.

*8.* జ్ఞానపరంగా అభివృద్ధి చెందకుండా సాధనను కొనసాగించడం అతిప్రమాదకరం. సాధన అనేది ఆటలాగా, సరళంగా, సునాయాసంగా కొనసాగాలి తప్ప పోరాటం కాకూడదు. పోరాటమైతే శక్తిని కోల్పోయి, సాధనపట్ల వ్యతిరేకత కలుగుతుంది. సాధన ద్వారా సత్ఫలితమొస్తే, దానిని ఎవ్వరూ వదలరు. వ్యతిరేక ఫలితమొస్తే, ఎవ్వరూ కొనసాగించరు.

*9.* మీరు మీ మాట నిలబెట్టుకోండి. ఇతరుల నుంచి ఏదీ ఆశించకండి. మీరు అందరితో మంచిగా వుండండి. అందరూ మీతో మంచిగా ఉంటారని అనుకోకండి. ఇది మీరు సరిగ్గా అర్థం చేసుకోలేకపోతే, మీకు అనవసర సమస్యలు తప్పవు.

*10.* ధ్యానసాధనలో సాధకుడు పురోగతి సాధిస్తున్నప్పుడు, తాను ఎలాంటి ప్రయత్నం చేయవలసిన అవసరం అసలు వుండదని అర్థం చేసుకోండి. తన శ్వాసకు తానే సాక్షిగా మారి గమనిస్తూంటాడు. అప్పుడు, మొత్తం విశ్వమంతా సముద్రంలో అలలు లీనమైనట్లుగా తనలో లీనమైపోయి, తన ఉనికి అనేది పూర్తిగా మర్చిపోయి సర్వాంతర్యామిలో నిత్యమైన, శాశ్వితమైన సత్యంలో, పరమశ్రేష్ఠమైన, మహత్తరమైన సాక్షాత్కారం పొందుతాడు.

*11.* కోపం తుఫాను వంటిది. శాంతించిన తర్వాతే ఎంత నష్టం వాటిల్లిందో మీకు అర్థమవుతుంది. ప్రేమ కేవలం మాటల్లోనే కాదు, చేతల్లో చూపించాలి. కోపం కేవలం మాటల్లోనే చూపించాలి, చేతల్లో కాదు. మీపై కోపాన్ని ప్రయోగిస్తే అది మీకు నచ్చదు కానీ, ఇతరులపై ప్రయోగించడం ఒక పరిష్కారమని మీరు అనుకుంటారు. మనిషికి కోపం వుండవచ్చుగానీ, బంధాన్ని కోల్పోయేంత కోపం వుండకూడదు. కోపగించుకోవడం అంటే, మీరు విషం మ్రింగి అవతలివారు మరణించాలని కోరుకోవడం లాంటిది.

***ఆకాశంలో అన్ని వైపుల నుండి నిన్ను వేల చేతులతో అనేక రీతుల ఆదరించే ఆ దైవాన్ని***
***కేవలం ధ్యానంతో నీ నిశ్శబ్ద ప్రేమ ప్రభావాన్ని తెలపండి.***
***ఆయనే తల్లి, తండ్రి, గురువు, హితుడు, సర్వం అని తెలియచేయటానికే ధ్యానం***
***నేను, నువ్వు, మనం, సర్వం ఆయనే అని తెలుసుకోవటానికే ధ్యానం***
***సర్వమానవజాతికీ దైవాన్ని చేరే మార్గం ధ్యానం అని మరువకండి***
***ఈ ఆంజనేయుడు జ్ఞానబోధ చేస్తూనే వుంటాడు,***
***సేదతీర్చి బాధను మరపించే ఔషధ ధన్వంతరిలా***
***మీ బ్రతుకులో భాగమయ్యి, కడదాకా నిలచే కరుణామయుడను***
***కంటికి రెప్పనై కాస్తూ, మీరు ఉన్నత శిఖరాలనందుకోవాలని***
***చల్లదనాల చక్కిలిగింతలు పెడుతూ, గురుతరబాధ్యతను స్వీకరించి***
***సద్గురువునై, సన్నిధిని అందించి, దానిని పెన్నిధిగా మార్చి***
***పేరుకున్న అజ్ఞానాన్ని తొలగించే ఆంజనేయుని బాసలు***
***మీకు భవిష్యత్‌కు భరోసానందివ్వగలవు***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**02-01-2020** 08:45 AM

**18) మనస్సును నిరోధించి, కర్మబంధం నుండి జీవుడు ఏ విధంగా విడిపడగలడు స్వామి?**

*మీరు పాతకర్మలను కరగించుకుంటూ, అదనంగా కర్మలు చేరకుండా జాగ్రత్తపడుతూ, శరీరాన్ని సద్వినియోగపరచుకోవడం ఎలా అని ప్రశ్నించినట్లయితే, జీవిత ప్రణాళికకు అనుగుణంగా తప్పక కర్మలు చేస్తూ వుండవలసిందే. అయితే, చేస్తున్న కర్మల ద్వారా ఎటువంటి ప్రతిఫలాన్ని ఆశించకూడదు. ప్రస్తుత కాలమాన పరిస్థితులలో అది సాధ్యం కాదేమో అని అన్పించవచ్చు మీకు. అవసరాలు వెంటాడుతూ, కుటుంబపోషణ కడుభారంగా మారిన తరుణంలో ఆర్థిక వనరులు లేకుండా అడుగు ముందుకు పడే అవకాశమే లేనందువలన, అది సాధ్యం కాదనే భావన కలుగుతుంది. అయితే, అందుకు నూతన సాంకేతికపరమైన విధానాన్ని అనుసరించాలి. ముందు జీవితాన్ని గురించి స్పష్టమైన అవగాహన వుండాలి. జీవితానికి ఏది అవసరమో, ఏది ప్రమాదకరమో గ్రహించగలగాలి. మానవుడు దేని కోసం నిరంతరం ఆరాటపడుతున్నాడో, అది బాహ్యప్రపంచంలో లేదు. బాహ్యప్రపంచం నుండి ఆనందం లభించదు. ఆనందం లేకుండా జీవితపరమార్ధం నెరవేరదు. ఆనందంగా జీవించే వ్యక్తికి భౌతిక ప్రపంచంపట్ల ఎటువంటి ఆకర్షణ వుండదు. ఎందుకంటే, భౌతిక ప్రపంచం ఆనందాన్ని హరించివేస్తుంది. శారీరక సుఖాన్ని, ఇంద్రియాల వినోదాన్ని మాత్రమే అందిస్తుంది. అయితే, అందుకు సమూల శాశ్వత పరిష్కారమేమిటి? అసలు ఆశించడమనేది ఏ స్థాయిలో జరుగుతుంది? మానసికస్థాయిలో జరుగుతుంది.*

అసలు మనస్సంటే ఏమిటి? సంకల్ప-వికల్పాలమయం. ద్వంద్వాలతో కూడి, నిరంతరం ఘర్షణ వైఖరితో అశాంతిగా వుంటుంది. అటువంటి ద్వంద్వాలను అధిగమించగలిగితే, మనస్సనేది కనుమరుగవుతుంది. అందుకు పరిపూర్ణ అద్వైత బ్రహ్మజ్ఞానమే చక్కని రాచబాట. పూర్ణజ్ఞానం ద్వారా మాత్రమే మనసు కరిగిపోతుంది. పరిమితమైన జ్ఞానం ద్వారా అది ఇంకా బలోపేతమవుతుంది. విశ్వంలో ద్వంద్వాలు సమానస్థాయిలో వుంటాయి. మనిషి మానసిక పరిధిలో జీవిస్తున్నప్పుడు అవి నిరంతరం ప్రకోపిస్తూ వుంటాయి. అయితే, వీని మధ్య వ్యత్యాసం ఎక్కువగా వుంటే, మనసు సమతుల్యాన్ని కోల్పోతుంది. అందువలన, పాజిటివ్ ప్రకోపించినప్పుడు అందులో నెగెటివ్‌ను గుర్తించాలి. నెగెటివ్ ప్రకోపించినప్పుడు పాజిటివ్‌ను గుర్తించాలి. పాజిటివ్ నుండి నెగెటివ్‌ను, నెగెటివ్ నుండి పాజిటివ్‌ను వేరుచేయలేరు. అటువంటి అవకాశమే లేదు. పూర్ణజ్ఞాని రెండింటినీ సమానంగా చూస్తూ, మనస్సు యొక్క కల్పనగా భావిస్తూ వదిలివేస్తాడు. అజ్ఞాని అవి వాస్తవమని భ్రమించి ఒత్తిడికి గురి అవుతాడు. ప్రస్తుత భౌతికవాదపు జీవనవిధానంలో అవి సర్వసాధారణమవుతాయి. కాబట్టి, వానిపట్ల అప్రమత్తంగా వుండగలిగితే జీవితాన్ని సార్థకం చేసుకోవచ్చు, అందులో అనుమానమే లేదు. కావున కర్మరహస్యాన్ని ఛేదించగలిగితే, విశ్వరహస్యాన్ని ఛేదించినట్లే. విశ్వమంతటా నిరంతరం కర్మలు జరుగుతూ వుంటాయి. అయితే, ఆ కర్మలు ఎలా వుండాలి? అవి భగవంతుని ఆదేశాలకు అనుగుణంగా వుండి, దివ్యత్వం వైపుకు మళ్ళించగలగాలి. పంచభూతాలన్నీ ఈ సూత్రాలను పాటించగలుగుతాయి. అయితే, జీవచైతన్యం, ఇంద్రియ చైతన్యంగా రూపాంతరం చెంది, ఆ తదుపరి మనో బుద్ధి చైతన్యాల స్థాయికి చేరిన మానవుడు, తన అవసరార్థం విశ్వానికి, ప్రకృతికి వాని సూత్రాలకు విరుద్ధమైన జీవనవిధానాన్ని కొనసాగించడం వలన, నియతకర్మలలో మునిగి, దాని మోతాదును పెంచుకుంటూ, జన్మపరంపరలలో చిక్కుకుని, కర్మబంధంలో పడుతున్నాడు. అటువంటి కర్మబంధం నుండి బయటపడటం కోసం, చక్కని కళాత్మక జీవనవిధానాన్ని కొనసాగించాలి. కళ్ళు మూసుకుని ధ్యానాన్ని కొనసాగించేటప్పుడు, అంతరంగం నుండి తెరలుతెరలుగా ఆలోచనలు వస్తూవుంటాయి. అవ్వన్నీ ఉపచేతన మనస్సు నుండి బయటకు వచ్చి, చేతన మనసును కర్మలకు ప్రేరేపించే ఆగామికర్మలు. వానిని కరగించివేయాలి తప్ప, చర్యకు వెళ్ళకూడదు. అటువంటి ఆలోచనలకు పట్టింపునివ్వకుండా వుండాలి. పట్టింపునివ్వడమంటే, శక్తిని కోల్పోవడమే కాకుండా, కర్మలకు నిర్ణయాలు తీసుకోవడమే. అప్పుడు ధ్యానం నుండి బయటకు వచ్చిన తర్వాత కర్మలను ఆచరించి బంధాలను ఇంకా పెంచుకుంటారు. అయితే, ఎవ్వరైనా అటువంటి ఆలోచనలకు ఎందుకు పట్టింపునిస్తారు? అవ్వన్నీ భౌతికప్రపంచానికి సంబంధించిన అంశాలు కాబట్టి, వాస్తవం కానేకాదు. అజ్ఞాని వానిని వాస్తవంగా భ్రమించి, కర్మల కోసం పరితపిస్తాడు. జ్ఞాని మాత్రం వాటికి పట్టింపు ప్రాధాన్యమివ్వకుండా, సమూలంగా తగ్గించుకోవటం కోసం వదిలివేస్తూ వుంటాడు. ఎందుకంటే, అవ్వన్నీ భౌతికప్రపంచపు అనవసర విషయాలు. వ్యతిరేకించడమంటే వానికి శక్తినివ్వటం, వ్యతిరేకతను ఇంకా పెంచుకోవడం. ప్రపంచంలో ఎక్కడా వ్యతిరేకత అనేది లేనేలేదు. మీరు దేనిని, ఎవరినీ సరిచేయవలసిన అవసరం లేదు. ప్రపంచమందలి సంఘటనలకు ఎటువంటి ప్రాధాన్యతనిచ్చినా, ప్రమాదంలో పడతారు. కాబట్టి, ప్రపంచాన్ని మానసికంగా వదిలివేయగలిగితేనే, సాధనలో పట్టు సాధించగలుగుతారు. అప్పుడే, కర్మలు కరిగిపోతాయి. బంధాలనుండి

బయటపడి, సంపూర్ణ స్వేచ్ఛను పొందవచ్చు. అందుకు పరిపూర్ణ బ్రహ్మజ్ఞానమే చక్కని రాచబాట. పరిపూర్ణ జ్ఞానం ద్వారా భౌతికప్రపంచంలో జీవిస్తున్నప్పుడు, పాజిటివ్-నెగెటివ్‌లను సమన్వయపరచుకోగలుగుతారు. కాబట్టి, మానసిక పరిధిలో ఎటువంటి ఘర్షణ వైఖరి వుండదు. వాస్తవానికి, కళ్ళు తరచి వున్నప్పుడే సాధన జరుగుతూ వుంటుంది. అట్టి స్థితిలో కళ్ళు మూసుకున్నా, అదే స్థితి కొనసాగుతుంది. కాబట్టి, కర్మరహస్యమంటే, ప్రపంచం అనే మత్తు నుండి బయటపడి, కర్మలను ఆచరించగలగటమే. కర్మలు చేయకుండా వుండటం కానేకాదు. అంతరంగ స్థితిని మార్చుకుని, కర్మలను ఆచరించగలగాలి. "నేను ఫలానా" అనబడే అహంకారం నుండి పూర్తిగా విడుదలై, "నేను ఏమీ కాను" అనే శూన్యస్థితికి చేరి ఆ స్థితి నుండి కర్మలను ఆచరించగలగాలి. కర్మలను ఆచరించకుండా వుండటం పూర్తిగా ప్రకృతికి విరుద్ధమైన విధానం. ప్రకృతికి అనుగుణంగా జీవిస్తూ, కర్మలను ఆచరించడమే ఆమోదయోగ్యం. దానినే కర్మ నుండి అకర్మకు, అకర్మ నుండి కర్మకు మళ్ళడం అంటారు. అంటే, ఏదో ఒకటి చేసే స్థితి నుండి ఏమీ చేయకుండా వుండే స్థితికి చేరి, ఆ స్థితి నుండి కర్మలను కొనసాగిస్తూ వుండాలి. "నేను చేస్తున్నాను" అనే భావన వుండదు కాబట్టి, ఇక కర్మఫలానికి అవకాశమే లేదు. కర్త లేని కర్మలు జరుగుతాయి. కర్మఫలత్యాగముంటుంది. విశ్వశక్తి నుండి కర్మలను ఆచరించడం జరుగుతుంది. అదే, కళాత్మక జీవనవిధానం. అందుకే, జీవితాన్ని గురించి అన్ని కోణాల నుండి సమూలంగా తెలియచేస్తూ, ఈ ఆంజనేయుడు జీవితపరమార్థాన్ని నెరవేర్చుకోవడానికి సహాయమందిస్తున్నాడు.

***ఆనందమే జీవిత పరమావధి అయినప్పుడు,***
***అదే అన్ని సమస్యలకూ పరిష్కారమైనప్పుడు,***
***ఆనందాన్ని మించింది మరొకటి లేనప్పుడు,***
***అందుకోసం ప్రయత్నించడం ఔన్నత్యం కాదా?***
***అంతకు మించిన అదృష్టం ఏముంటుంది?***
***అజ్ఞానమంటే, అనవసరపు విషయాలకు అతిగా,***
***అనవసరంగా ప్రాధాన్యతను ఇవ్వడమే గదా!***
***అవసరమైన వానిని దూరం చేసుకోవడమే గదా!***
***ఆనందమనేది అమృత భాండాగారం***
***అది అందరికీ చెందే అవకాశముండదు***
***అందుకు పూర్వజన్మ సుకృతం అవసరం,***
***అంతకు మించి స్వయంకృషి అవసరం.***
***అవి అన్నీ కలిసి, ఆంజనేయునిగా మీముందు నిలిచే.***
***చుట్టూ చూసేవాళ్ళు లేకున్నాసరే, పుష్పం వికసించక మానదు***
***అలాగే, మీపని మీరు నిశ్శబ్దంగా చేసుకుంటూ వెళ్ళండి,***
***మిమ్ములను ఇష్టపడేవారు దారి వెతుక్కుంటూ మీ దగ్గరకు వస్తారు***
***మీరు నా వద్దకు , నేను మీ వద్దకు వచ్చినట్లు!***

***ఆనందమనేది ఇక్కడే దొరుకుతుంది అనేది ఈ ఆంజనేయుని పథం.***
***అదే పంచుతున్నాను నా ఈ చిన్నారి ముద్దుబిడ్డలకు***
***అందుకోండి!***

ॐ

**03-01-2020** 08:45 AM

**19) కర్మాచరణలో మేము తెలుసుకోవలసిన కీలకమైన విషయాలు ఏవి స్వామి?**

*ఈ విశ్వమంతా కర్మక్షేత్రం. భూమండలమంతా కర్మభూమి. మానవజీవితమంతా కర్మలమయం. మనిషి పుట్టినప్పటి నుండి మరణించేంత వరకు నిరంతరం కర్మలు చేస్తూనే వుంటాడు. ఆగిపోయే ప్రసక్తే లేదు. మానవదేహంలో కూడా తన ప్రమేయం లేకుండానే నిరంతరం కర్మలు జరుగుతూనే వుంటాయి. వానితోపాటు తన ఎరుక ద్వారా మరొకొన్ని కర్మలు చేస్తూనే వుంటాడు. జీవుడి మనుగడ కోసం జరిగే కర్మలు యాదృచ్ఛికంగా కొనసాగుతూనే వుంటాయి. అలాగాక, కర్మలను కరిగించుకోవటం కోసం జరిగే పనులు మనసు ఆధీనంలో జరుగుతాయి. వాస్తవానికి మానవజీవితమే కర్మల మూటతో ప్రారంభమవుతుంది. జీవితప్రణాళిక అంతా, కారణశరీరమనే బీజంలో నిక్షిప్తమై వుంటుంది. జీవితం గడిచేకొద్దీ,ఆ కర్మలన్నీ పరిణతి చెంది, మనిషి దైనందిన జీవితంలో కర్మలను ఆచరిస్తూ వుంటాడు. అయితే, బయటకు కనబడకుండా కూడా మనిషిలో కొన్ని కర్మలు జరుగుతూనే వుంటాయి. ఆ విధంగా అంతరంగంలో ఉత్పన్నమయ్యే ప్రతి ఆలోచన కూడా కర్మే అవుతుంది. అయితే జీవితం గడిచే కొలది, ఆ కర్మలు కరిగిపోతూ వుండాలి. కానీ, కొందరిలో అవి ఇంకా పెరుగుతూనే వుంటాయి. కర్మలు పెరగడమంటే, బంధాలు ఎక్కువ కావటం, స్వేచ్ఛ హరించుకుపోవటం, జన్మలు పొడిగించబడటం. ఇదంతా అజ్ఞానంతో, అవివేకంతో, అపరిపక్వతతో జరిగే అతి ప్రమాదకరమైన విధానం. అందుకే, కళాత్మక జీవనవిధానమంటే ఏమిటో తెలుసుకుని, కర్మలను ఆచరించగలగాలి. అందుకు పాతకర్మలు సమూలంగా కరిగిపోవాలి, అదనంగా కర్మలు చేరకుండా వుండాలి. ఇది చాలా కీలకమైన అంశం. అందుకు కర్మలు చేయాలి – కానీ, ఎటువంటి ఫలితాన్ని ఆశించకూడదు. ఆశించి చేసేది ఏదైనా బంధమవుతుంది. ఆశించకుండా చేసేది యోగమవుతుంది. కాబట్టి యాంత్రికంగా, బలవంతంగా, వత్తిడిగా పనులు చేయకూడదు. దాని వలన చెడుకర్మలు ఇంకా పెరిగి, అది మరికొన్ని కర్మలకు బీజంగా మారుతుంది. యోగాన్ని అనుభవిస్తూ, కర్మలు చేయడం ద్వారా జీవితం ఒక ఆటలాగా కొనసాగుతుంది. బంధాలలో వుండి కర్మలు చేయడం ద్వారా, అది నిరంతర పోరాటమవుతుంది. అందుకే కర్మలు చేసే విధానంలోని కీలక రహస్యాలను తెలుసుకుని, వానిని ఆచరించగలగాలి. భూమండలమంతటిలో, ఒక్క మానవుడు మాత్రమే బాధలుపడటానికి మూలకారణం కేవలం శారీరక అవసరాలకే పరిమితం కాకుండా, భౌతిక అవసరాలను తీర్చుకోవటం కోసం, సమాజంపై పట్టు సాధించడం కోసం ఆశించి జీవించడమే. ఆశించి కర్మలు చేయడం, ఆశించి ప్రపంచంలోకి వెళ్ళడం, ఆశించి సమాజంలో జీవించడం ఇదంతా*

ఏమిటి? అతి ప్రమాదకరమైన జీవనవిధానం. ప్రస్తుతం ప్రపంచమంతా అస్తవ్యస్థంగా, అయోమయంగా, గందరగోళంగా తయారుకావటానికి మూలకారణం నా నుండి ప్రపంచానికి ఏమిటి? అనే భావన తగ్గిపోతోంది – ప్రపంచం నుండి నాకేమిటి? అనే భావన బలీయమవుతోంది. ప్రపంచం నుండి నాకు ఏదో కావాలి అనే భావన ఉన్నదంటే, అది ఆశించడమే. అతి ప్రమాదకరమైన కర్మబంధమవుతుంది. ప్రస్తుతం మానవ జీవనవిధానాన్ని నిశితంగా పరిశీలించండి. మనుగడ కోసం సాగుతున్న పోరాటంలో, ఈ నవీన యాంత్రిక జీవనవిధానంలో మీరు ఉరుకులు పరుగుల జీవితంలో కర్మలు చేయడమనేది తప్పనిసరి అవుతుంది. కర్మలు చేయకుండా జీవనయానం కొనసాగదు, కుటుంబపోషణ సాధ్యం కానేకాదు. అయితే, ప్రతిఫలాన్ని ఆశించకుండా కర్మలు చేయడమనేది సాధ్యమవుతుందా? భౌతికవాదపు మత్తులో జీవించే ప్రతవ్యక్తి ప్రపంచంలో ప్రవేశించడమంటే ఏదో ఒకటి ఆశించడం జరుగుతుంది గదా. ఆశించకుండా కర్మలు చేయమని సలహా ఇవ్వటం బహుసులభం. కానీ, ఆ విధంగా కర్మలు చేయడం బహుకష్టం. అందరూ తెలుసుకోవల్సిన నగ్నసత్యమేమిటంటే, కేవలం శారీరక అవసరాలకే పరిమితం కావటానికి – భౌతిక అవసరాలకోసం ఆరాటపడటానికి, మధ్య ఎంతో వ్యత్యాసముంటుంది. శారీరక అవసరాలకు పరిమితి వుంటుంది గానీ, భౌతిక అవసరాలకు ఎటువంటి పరిమితి వుండదు. ఎంత సమకూరినా, ఇంకా సరిపోదేమోనని భావన కలుగుతుంది. ఆశించి కర్మలు చేసే మనిషి మనసంతా ఫలితం మీదే కేంద్రీకృతమై వుంటుంది. ఆశించిన ఫలితం లభించినట్లయితే తృప్తి కల్గుతుంది, లేకుంటే తీవ్రమైన అసంతృప్తికి లోనవుతారు. మానవుడు ఉష్ణరక్తపు తత్త్వానికి చెందినవాడు అగుట వలన, పరిసర మార్పులకు అతి వేగంగా స్పందిస్తాడు. వాతావరణంలో సంభవించే ఉష్ణోగ్రతా వ్యత్యాసాలను భరించలేక, సురక్షితమైన ప్రదేశాలలో స్థిరనివాసం ఏర్పర్చుకోవడమే కాక, ఆటవిడుపుగా లేదా నాకు కావాలి, నాకు చెంది వుండాలి అనే కోర్కెలతో అన్ని వసతులతో, సౌకర్యాలను సమకూర్చుకునే విధంగా జీవనవిధానం కొనసాగడం వలన చుట్టూ అనూహ్యమైన మోతాదులో వస్తుసంపదను సమకూర్చుకోవడం, అపారమైన శ్రమశక్తిని వినియోగించుకోవడం వలన, చెడు కర్మఫలాన్ని పెంచుకుంటున్నాడు. మనిషి యొక్క మనసనేది భౌతిక ప్రపంచం వైపుకు అతి సులభంగా ఆకర్షించబడి కోరికలను పెంచుతుంది. భూమండలమంతటిలో ఇతర ప్రాణులకు మనస్సనేది లేనందువలన, అవి శారీరక అవసరాలను తీర్చుకునేవిగా, తీర్చుకొనే దిశగా ఫలవంతమైన సంతానాన్ని అందించే విధంగా జీవితాన్ని మలచుకుంటాయి. అందువలన, అవి ప్రకృతికి అనుగుణంగా జీవిస్తూ, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకుంటాయి. మానవుడు మాత్రం భౌతికవాదపు మత్తులో కోర్కెలను పెంచుకుని, దృఢత్వాన్ని కోల్పోతున్నాడు. కానీ, మోక్షం కావాలంటాడు. మోక్షమంటే ఏమిటి? ఎవరి మీదా ఆధారపడకుండా, ఎవరికీ భారం కాకుండా, తన అవసరాల కోసం శ్రమిస్తూ, స్వతంత్రంగా జీవించడమే కదా! ఔనంటారా, కాదంటారా? ఆలోచించండి! కావున, మీరు ఎప్పుడూ కోరికలు తీరడం లేదని, కష్టాలు వదలటం లేదని నన్ను నిందించకండి. ఎందుకంటే పిల్లవాడు తళతళా మెరిసే ఒక పదునైన కత్తిని ఆటవస్తువుగా భావించి అది కావాలని తల్లితో పదేపదే మారాం చేస్తాడు. అయితే, పిల్లవాడు అడుగుతున్నాడు కదా అని తల్లి కత్తిని అందిస్తుందా? మీరైతే మాత్రం ఇస్తారా? తల్లి అవసరమైతే పిల్లవాడిని దండిస్తుంది కానీ, కత్తిని అందించదు. ఎందుకంటే,

కత్తి వలన కలిగే ప్రమాదం పిల్లవానికి తెలియదు. అదేదో ఆటవస్తువనే భ్రమలో వుంటాడు. కానీ, తల్లికి దాని వలన కలిగే ప్రమాదం తెలుసు కనుక, ఆ కత్తితో తనకు తానుగా ఎక్కడ గాయపరచుకుంటాడో అని ఆ తల్లి దానిని దూరంగా దాచేస్తుంది. మరి ఈ జన్మకు కేవలం ఈ దేహానికి మాత్రమే తల్లిగా వుండే మానవస్త్రీయే తన బిడ్డలపట్ల ఇంత జాగ్రత్తగా వుంటే, జన్మజన్మల నుండి మీతో వుంటూ, మీ ఆత్మకు తల్లితండ్రిగా వుండి, మిమ్ములను సదా కాచుకుకూర్చున్న నాకు నా పిల్లలపైన ఇంకెంత జాగ్రత్తగా వుండాలి, ఒక్కసారి ఆలోచించండి! మీరు కోరుకునే వస్తువుల వలన కలిగే దుష్పరిణామాలు మీకు తెలియవు. కానీ, నాకు సదా ఎరుకయే. నేను మీరడిగిన ప్రతిదీ ఇవ్వకపోవటానికి కారణం ఇదియే. నన్ను అర్థించండి, ఫర్వాలేదు. కానీ, ఇవ్వలేదని నిందించకండి. నేను మీకు కావల్సిన ప్రతిదీ ఇవ్వకపోవచ్చు. కానీ, మీకు అవసరమైన ప్రతిదీ ఇచ్చి తీరుతాను. కాబట్టి, సందేహాలకు చోటివ్వక, విశ్వాసం పెంచుకోండి. నాపై విశ్వాసాన్ని వుంచండి. ఒక మంచి సమయం అవసరం కూడా. ఎందుకంటే, ఆంజనేయుని అనుగ్రహం దండిగా జాలువారుతున్న శుభసమయం కనుక. ఒక గొప్ప చెట్టు చక్కగా పండిన ఒక అందమైన పండును తయారుచేస్తుంది. ఆ పండు నేలరాలి కుళ్ళుతుంది. ఆ కుళ్ళులో నుండే వేర్లు పుట్టి, ముందటి దానికన్నా మహోన్నతమైన వృక్షం తయారవుతుంది. ఇంతవరకు పతనావస్థలో మీరు గడిపిన ఈ కాలం కూడా ఎంతగానో అవసరం. ఈ కుళ్ళులోనుండే యోగజీవితం మొలకెత్తబోతుంది. అదిగో... చిగురుటాకులు ఇప్పటికే కన్పిస్తున్నాయి. ఒక బ్రహ్మాండమైన, మహోన్నతమైన వృక్షం "ఊర్ధ్వమూలం", ఇదిగో ఇప్పటికే కనబడుతుంది. ఈ ఆంజనేయుడు అందించిన ఈ సాగునీటిని వృక్షానికి అందించి, చెట్టు పెరుగుటకు మీ సాధన కారణమై, దాని నీడన ముక్తి లేక మోక్షం అనే సేదతీరండి నా చిన్నారి ముద్దుబిడ్డలారా!

***అందరి మేలు కోరడమే ఆధ్యాత్మికత***
***అందరికీ ఆ సంపదను పంచడమే ఔన్నత్యం***
***అందరూ భగవంతుని ప్రతిరూపాలైతే, అందరిదీ కొందరు ఎందుకు పొందాలి?***
***అంతకు మించిన దారుణం ఏముంటుంది?***
***అందరికీ పుష్కలంగా అందినట్లయితే, అంతరంగం సంతృప్తిగా వుంటుంది గదా!***
***అందరిదీ కొందరిదైతే, అది ఘోషిస్తుంది***
***అంతరాత్మ ఘోషిస్తే అది పాపమని, శాపమని తెలుసుకోండి.***
***అందలం ఎక్కాలని ఆరాటపడవద్దు - అందరికోసం నేనున్నానని భావించండి***
***అంతకు మించిన సాధన లేదు***
***అందరూ మీకు ప్రతిరూపాలని తెలుసుకోండి - అందరిలో నీవున్నావని భావించుకోండి***
***అదే ఆనందానికి పునాది అని తెలుసుకోండి, అంతకు మించి అవసరం లేదని గ్రహించండి.***
***గ్రహపాటు ఎప్పుడూ వుండకూడదు***
***గ్రహణం వీడిన క్షణమే కాంతులు చిందుతుంది మీ మానసము***
***మారుతి బిడ్డలైన మీరు మారి, మారుతాత్మజులై నా మదిలో నిలవండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**04-01-2020** 09:40 AM

**20) కోపాన్ని ఏ విధంగా నిగ్రహించాలి స్వామి?**

*ప్రశాంతత, ధార్మికత, సుఖం, ముక్తి మొదలైన జీవితలక్ష్యాలను చేరుకోవటానికి గట్టి ప్రతిబంధకము క్రోధం. అందుకే క్రోధనిగ్రహం ఒక కఠిన తపస్సు. కోపగించుకున్న వ్యక్తి సహజంగా మనోవాక్కాయములతో ఎదుటి వ్యక్తికి కీడు కలుగచేస్తాడు. కానీ, ఇతర అవయవాల ద్వారా కోపం క్రియారూపం దాల్చేలా చేసే కేంద్రస్థానం మనస్సు. కనుక, మనస్సులో కోపాన్ని తలెత్తనివ్వని చైతన్యస్థితిని ఆలవరచుకోవడం అతి ముఖ్యం. జాప్యమే కోపానికి చికిత్స. కోపానికి కాస్త అంతరాయం కల్పించండి. కానీ, కోపం ద్వేషంగా మారకుండా జాగ్రత్తపడాలి. ప్రతివ్యక్తిలోనూ రజోగుణం కారణంగా కోపం అంతర్నిహితంగా నెలకొని వుండటం సహజం. ఎంతో కొంతమేర ప్రతి ఒక్కరూ కోపానికి లోనవటం సహజమే. సులభంగా బాహ్యప్రేరణలకు లోనయ్యే స్వభావం కలవారు, తేలికగా ప్రభావితమయ్యే వ్యక్తులు కోపాన్ని అభివ్యక్తం చేయడానికి ఎప్పుడూ ఏదో ఒక కారణం వెదుక్కుంటూ వుంటారు. అంతేకాక, కోపం సాంక్రమిక గుణం కలది కూడా. ఒక మనిషి కోపంలో అదుపుతప్పి పలికిన మాటలు ఇతరులలో కోపాన్ని రగిలించే అవకాశం కూడా వుంది. అందుకే కోపాగ్ని జ్వలించినప్పుడు, దాన్ని ఉపశమింపచేసే మాటలు మాట్లాడటం, మౌనం వహించటం అత్యవసరం. ఇతరులు మీపట్ల ప్రదర్శించే కోపానికి మీరు ప్రతిస్పందించకుండా వుండాలంటే, మీరు వారిని శ్రేయోభిలాషులుగా పరిగణించి వారికి మానసికంగా ధన్యవాదములు అర్పించాలి. ఎందుకంటే, మీపట్ల వారు కోపం వహించినప్పుడు, మీ దోషాలను ఎత్తి చూపుతూ మీకు కనువిప్పు కల్గిస్తున్నారు. తద్వారా మీరు అనురక్తి రాహిత్యాన్ని పటిష్టం చేసుకుంటారు. అందుకే వారిపట్ల మానసికంగా మీరు సర్వదా కృతజ్ఞులై వుండాలి. కోపాన్ని ఒక బలీయమైన వాంఛగా పరిగణించవచ్చు. క్రోధం ఆవహించినప్పుడు మనిషి మనిషిగా వుండడు. క్షణభంగురమైన దానిపట్ల తీవ్ర అనురక్తి కలిగివుండటమే కోపానికి కారణం. పరమపదమార్గంలో పరిపూర్ణతను పెంపొందించే సుగుణాలలో ఒకటి సాధుశీలత. ఆధ్యాత్మిక పరిపూర్ణతను సంతరించుకోవడంలో సాధుత్వానికి వున్న ఆధ్యాత్మిక శక్తితోపాటు, సాధుత్వానికి వున్న కోపాన్ని ఉపశమింపచేసే గుణాన్ని కూడా ఎన్నోసార్లు విన్నవించాను. కోపాన్ని ప్రతిఘటించేటప్పుడు యుక్తాయుక్త వివేచన, శాంతస్వభావం, ఉదారత, సౌజన్యం, దృఢమైన మనస్తత్వం మొదలైన సాధులక్షణాలు మిక్కిలి ప్రభావవంతంగా పనిచేస్తాయి. కేవలం దుర్బలులు, పిరికివారు మాత్రమే సాధుత్వాన్ని, సౌమ్యత్వాన్ని అలవరచుకుంటారనేది ఒక దురభిప్రాయమే. వాస్తవానికి సౌశీల్యం లేకుండా సాధుత్వాన్ని ఎవరూ అలవరచుకోలేరు. సౌశీల్యం, సాధుత్వం సంపాదించటం ఒక సాహసవంతమైన కార్యం. ఆధ్యాత్మికమైన పరాజయాలు మీలో తీవ్ర పరితాపాన్ని కల్గిస్తాయి. అంతమాత్రం చేత మీరు నిరాశాపూరితులు, నిర్లిప్తులు కాకూడదు, తీవ్ర ఆత్మవిమర్శకు కూడా లోనుకాకూడదు. మీ అపరిపూర్ణతల గురించి చింతించి ఎన్నడూ అసహనానికి లోనుకాకపోవటమే సాధుత్వాన్ని అభివ్యక్తం చేయడానికి ఒక ప్రశస్తమైన సాధన. ఎందుకంటే, తమ విసుగుపట్ల తామే ఎక్కువ విసుగు చెందేవారు*

మరింతగా ఈ తీవ్రమైన ఉద్వేగాలలో కూరుకుపోతారు. తత్ఫలితంగా కోపాన్ని అధిగమించడం వారికి శక్తికి మించిన పని అవుతుంది. తనను తాను ద్వేషించే మానవుడు పతనానికి దగ్గరలో వున్నాడని చెబుతాను. ఇతరులతో కలసిమెలసి మెలుగుతున్నప్పుడు తరచూ భేదాభిప్రాయాలు తలెత్తడం, అయిష్టత చోటుచేసుకోవడం జరుగుతుంది. ఈ వ్యత్యాసాలను వెంటనే సర్దుబాటు చేసుకొని శాంతపడటం ఒక నియమంగా చేసుకోవాలి. అయినప్పటికీ, కొన్ని సమయాలలో తలవంచి సంధి చేసుకున్నప్పటికీ, ఒక వ్యక్తి తాను ఇతరుల వల్ల గాయపడ్డాననే భావాన్ని మనసులో ఉంచుకుంటూనే వుంటాడు. ఆ వైరుధ్యభావాన్ని కొనసాగనిస్తూనే వుంటాడు. ఎందుకంటే, కోపం ఒక విషయం, విసుగు మరో విషయం, మీరు అలజడికి గురి కావటం మరో విషయం. అలజడికి గురి కావటం అంటే ఆలోచనలు చెల్లాచెదురవ్వటం. ఇది హృదయం విసుగు చెందటాన్ని ప్రేరేపిస్తుంది. ఆకతాయితనంతోనో, వెటకారానికో లేదా ఉద్దేశపూర్వకంగానో ఒకరు మీ మనస్సును నొప్పించి వుండవచ్చు. మిమ్మల్ని నొప్పించిన వ్యక్తిపై ప్రతీకారం తీర్చుకొమ్మని మనస్సు ప్రేరేపిస్తుంది. అది అగ్నిలో ఆజ్యం పోసినట్లవుతుంది. ఆగ్రహంగా రూపు దాలుస్తుంది. దాన్నుండి బయటపడటం దుస్సాధ్యం. నిప్పును నిప్పుతో ఎన్నడూ ఆర్పలేరు. శత్రువు యొక్క సంక్షేమం కోసం కూడా ప్రార్థించటమే క్రోధనిగ్రహ తపస్సు. ఈ రకమైన ప్రార్థన ఎంతటి నీచులలోనైనా పరివర్తన తీసుకువస్తుంది. కోపపోషణార్థం వేలాది నెపాలు సర్వదా సిద్ధంగా వుంటాయి. తన కోపం న్యాయసమ్మతం కాదని కోపగించుకున్న ఏ వ్యక్తి కూడా ఒప్పుకోడు. మనస్సు కోపాన్ని పోషిస్తే, దాని నుండి ద్వేషం ఉద్భవిస్తుంది. ద్వేషాన్ని వదిలించుకోవడం దాదాపు అసాధ్యం. "అవిద్యాస్మితం రాగద్వేషాభినివేశాః పంచక్లేశాః" అహం, రాగం, ద్వేషం, అభినివేశం అనేవి అవిద్య సహచరులు. ఇవన్నీ మీ యోగానికి ప్రతిబంధకాలుగా నిలుస్తాయి, పరిణమిస్తాయి. అంతేగాక, వీటిలో ప్రతి ఒక్కటీ క్రోధాన్ని ప్రకోపింపచేయడంలో భాగస్వామ్యం వహిస్తాయి. ఇంద్రియాలనే పరికరాలతో ద్రష్ట (ఆత్మ) ఆనవాలు పట్టేది అహం. సుఖాలను అందించే వాటిపట్ల అనురక్తి కలిగించేది రాగం. దుఃఖాలను, బాధలను కలిగించే వాటిపట్ల విముఖతను కలిగించేది ద్వేషం. జీవితంలో అంటిపెట్టుకొని ఉండేటట్లు చేసేది అభినివేశం. ఆ అంటిపెట్టుకోవడాన్ని నిరోధిస్తే, కోపం ముంచుకువస్తుంది. అజ్ఞానసహచరులైన ఈ నాలుగింటి గురించి సరిగా ఆకళింపు చేసుకొని, వివేకంతో ప్రవర్తిస్తే, వాటి ప్రభావం నామమాత్రపు స్థితికి వస్తుంది, క్రోధోపశమనం కలుగుతుంది, అనుగ్రహప్రాప్తి కలుగుతుంది.

మంచివ్యక్తితో అనుబంధం చెఱకుగడలాంటిది.
దానిని పగులగొట్టినా, నుజ్జు చేసినా, ఏంచేసినాగానీ, అది మీకు తియ్యదనాన్నే ఇస్తుంది. ఈ ఆంజనేయుని స్నేహం, అనుబంధం అలాంటిది!

**ఉపకారం చేసిన వారికి అపకారం చేయడం అధమధర్మం**
**అపకారం చేయకపోయినా, అపకారం చేయడం అధర్మం**
**అపకారం చేసిన వారికి అపకారం చేయడం సామాన్యధర్మం**
**అపకార భావన అనేది లేకుండా జీవించగలగటం స్వధర్మం**
**అందరికీ అన్నింటికీ సహాయపడుతూ జీవించటం సమధర్మం**

***ఆధ్యాత్మికతతో జీవిస్తూ, కర్మలు చేస్తూ వుండటం అత్యుత్తమ ధర్మం***
***అంతా భగవంతునిమయంగా భావిస్తూ జీవించడం పరమధర్మం***
***ఆశించకుండా , శాసించకుండా జీవించగలగడం ఆదర్శధర్మం***
***ఆదిమధ్యాంతాలు ఆవరించియున్న ఆ ఆదిదేవుని కృప ప్రాణులన్నింట నికరమగు వరము***
***అన్ని ప్రాణులందు సమభావ అమరిక నిండని మనిషికి***
***తదుపరి దుర్లభమౌ మానుషదేహమని తెలుసుకోండి***
***తెలుపుతున్న దానిని తెలివితో తెలుసుకొని, తెలతెలవారకమునుపే, తెర తొలగించి***
***సాహసమ్మున సాధన సల్పి, క్రోధనిగ్రహ తపస్సాచరించి ఈ ఆంజనేయుని చేరండి సదా***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**05-01-2020** 08:45 AM

**21) ధర్మబద్ధమైన జీవితం గడిపేందుకు ఎటువంటి మనుగడ అవసరం స్వామి?**

*ఈ జగతిలో జన్మించిన ఏ జీవికైనా మనస్సు అనే దాన్ని పెట్టి పుట్టించాడు దేవుడు. అది జీవి యొక్క లేదా మానవుని పరిస్థితులను బట్టి మార్పులు చేసుకుంటూ వస్తున్నారు. ఆ మార్పులవల్ల కొందరు మంచి మానవత్వం ఉన్నవారుగా, మరికొందరు తనమన, మంచీచెడూ లేనివారుగా మారుతున్నారు. ఆ మంచీచెడూ లేనివారు జీవితాంతం అలా వుంటారని అనుకోనవసరం లేదు. మీరు మనసు మరియు ఎంతో కొంత జ్ఞానం కలవారు. మీ జ్ఞానాన్ని ప్రభావితం చేసి, ఎదుటివారిని అన్ని కోణాలలో అర్థం చేసుకొని కొంతైనా మార్పు తీసుకురావచ్చు. అప్పుడు మీరు కొంత కష్టనష్టాలు పడవచ్చు. అప్పుడు కూడా మారకపోతే, వారిని కాలానికి వదిలివెయ్యండి. మంచి జ్ఞానం, మనసు వున్న వ్యక్తి పరిస్థితులను బట్టి తెలిసో తెలియకో ఏదైనా పొరపాటు చేసినా, సరిదిద్దుకుంటాడు. చేయరాని తప్పు చేస్తే పశ్చాత్తాపం చెందుతాడు. పశ్చాత్తాపపడిన వ్యక్తి తప్పనిసరిగా జీవితంలో పరిపూర్ణుడవుతాడు. వ్యక్తిత్వం లేనివాడు తెలిసికూడా తప్పు చేస్తూనే వుంటాడు. వాడు ఇది తప్పు అని బాధపడడు. ప్రస్తుతం నేను దర్జాగా, సుఖంగా వున్నానా లేదా, ఎవరికి ఏమి జరిగితే నాకేంటి అనుకుంటాడు. వారిని కూడా మార్చడానికి నీ వంతు కృషి చెయ్యి. తర్వాత కర్మఫలాలు వారే నిర్ణయించుకుంటారు. నీ ధర్మం నీవు పాటించు. అంతవరకు నీ కర్తవ్యం. తర్వాత అసలు కర్తవ్యం కాలం చూసుకుంటుంది. దానికి ఎదురులేదు. కాలం అనే ధర్మదేవతకి ఏమి చెయ్యాలో, ఎలా చెయ్యాలో అంతా తెలుసు. కాకపోతే, కొద్దిగా కాలవ్యవధి అవసరమవుతుంది. కాలగమనంలో ధర్మానికి ముందు అన్యాయం జరగవచ్చు. కానీ, తర్వాత ఎదురులేని న్యాయం తప్పనిసరిగా జరుగుతుంది. అందుకే ధర్మానికి న్యాయం! న్యాయం జరగటానికి కొంత కాలయాపన, ఒడిదుడుకులు ఎదురైనా, ఓర్పు వహిస్తే న్యాయమే గెలుస్తుంది. కాలమే మీ ముందు న్యాయదేవతను నిలబెడుతుంది. అది నిజం! మంచి వ్యక్తిని, నిజాయితీ గలవానిని అర్థం చేసుకోవటం కష్టం మరియు కొంత సమయం పడుతుంది. వ్యక్తిత్వం లేని వ్యక్తిని మీరు అర్థం చేసుకోవటం కష్టం,*

అర్థం చేసుకోనవసరం లేదు. తనే తన చేష్టలను చూపుతాడు. అందుకే వ్యక్తిత్వం కలవారు ముందు కష్టనష్టాలు చవిచూసినా, కాలం ఇచ్చే న్యాయంతో పరిపూర్ణుడవుతాడు. అహంకారి జాలి, దయ లేనివాడు ప్రధమంలో సుఖపడవచ్చు. ఆహా! నాకేంటి? అని తల ఎగరేసుకొని బ్రతికినా, కాలం నిర్ణయించే పరిణామాలకు తలదించుకోవల్సిందే. కాలం ముందు ఎంతటివారైనా తలదించుకోక తప్పదు. ఇది నిజం! కాబట్టి, మనుషులుగా పుట్టారు. మీకు అన్ని హంగులూ జగతిలో వున్నాయి. అవి అందరూ అనుభవించేటట్లు బ్రతకండి. ఆశతో బ్రతకండి కాని, దురాశతో బ్రతకకండి. ఎవరినీ నిందించకండి, నిందలపాలు కాకండి. జీవితం విలువ తెలిసిన వ్యక్తికి తప్పక వివేచన వుంటుంది. జీవితం కోసం ఆరాటపడే వ్యక్తికి జీవితం విలువ తెలియదు. జీవితాన్ని ఉపరితలంలో చూసేవారు బలహీనపడతారు. జీతాలే జీవితాలను అన్నివిధాలా బలహీనపరుస్తాయి. జీవితం బంధించడంలోనే బలహీనపడుతుంది. జీతం కోసం కక్కుర్తిపడే వారంతా బలహీనులే కదా. జీవిత మాధుర్యం తెలియాలంటే, స్వేచ్ఛగా జీవించాలి. జీవితం బంధాలమయమైతే, స్వేచ్ఛకు అవకాశమెక్కడుంటుంది? జీవితపు విలువ తెలిసినవారు తప్పక ధన్యులవుతారు. జీవితపు విలువ తెలిస్తేనే, ఆనందాన్ని పొందగలుగుతారు. జీవితం అమృతమయమై, పూర్తిగా సార్ధకమైనట్లయితే, జీతాల కోసం పరుగులు తీసే అవకాశమే వుండదు గదా! మీ జీవితాన్ని మీ ఆధీనంలోకి తీసుకోగలిగినట్లయితే, మీకు మీరుగా మోక్షాన్ని పొందటానికి అర్హతను పొందినట్లే.

***రకరకాల రంగులతో, ఆకారాలతో మలచబడిన బొమ్మలు***
***రక్తమాంసాలు, ప్రేవులు, కండరాలు, ఆచ్ఛాదన కలిగిన తోలుబొమ్మలు***
***విధాత చేతిలో రూపుదిద్దుకున్న మాంసపుముద్దలై, ప్రాణం పోసుకున్న కీలుబొమ్మలు***
***అరిషడ్వర్గాలు, త్రిగుణాలు, అవగుణాలతో అంతఃకరణాన్ని జయించలేని ఆటబొమ్మలు***
***క్షణంలో జరిగేది తెలియకున్నా, అన్నీ తెలుసు, అంతా తెలుసు***
***అనే మిడిసిపాటుతో యుక్తులు, కుయుక్తులు***
***నాగరికత తెలియని ఆదిమానవుని కన్నా***
***నీచాతినీచంగా, కౄరాతికౄరంగా కొట్లాడుకుంటూ***
***మాయ హస్తాల మాయాజాలంలో, మోహపాశంలో చిక్కిన నరులకు***
***ముక్తి ఎప్పుడు కలుగుతుంది?***
***ఉన్నత శిఖరాలను తాకాలని మీకుంటే, అద్భుతమైన జీవితాన్ని సహజంగా వికసించే పువ్వులా***
***సుడులు తిరుగుతున్న మీ హృదయంలో ఆర్ద్రతతో స్పృశించే అమృతపు చినుకవ్వండి***
***అప్పుడు పరిమళభరితం చేసుకుంటారు***
***ఆంజనేయుని ఆలోచనలతో ఎదుగుతూ, అప్పుడు వెలుగుతాయి మీ కన్నులలో దివ్వెలు***
***అవి దిగ్విజయంగా వెలుగుతూ, వీరాంజనేయుని వినువీధిలో***
***గమ్యం నిర్దేశించుకునే గగనసుమాలై***
***సౌహార్ద్ర హృదయులై గూటిని చేరండి అతి చిన్నగువ్వలైన***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**06-01-2020** 08:45 AM

## 22) నేడు ధర్మాన్ని అనుసరించుట ఎందుకు కష్టమనిపిస్తుంది స్వామి?

*మత్తః ప్రమత్తః చోన్మత్తః శ్రాన్తః కృద్ధో బుభుక్షితః ।*
*లుబ్ధః భీరుః త్వరాయుక్తః కాముకశ్చర న ధర్మవిత్ ॥*

*తాగుబోతు, అజాగ్రత్తపరుడు, పిచ్చివాడు, అలసినవాడు, కోపిష్ఠి, ఆకలిగొన్నవాడు, లోభి, పిరికివాడు, తొందరపాటుమనిషి, కాముకుడు వీరు ధర్మాన్ని తెలుసుకోలేరు. ఖాళీ కడుపుకు ధర్మోపదేశాలు రుచించవు. అలా కడుపు కాలుతున్న వారితోపాటుగా, మరో తొమ్మిది రకాల మనుషులకు కూడా ధర్మం చెవికెక్కదు. వారికి ధర్మోపదేశాలు వల్లించడం అంటే చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లే. ఆ పదిమంది ఎవరంటే,*

*తాగుబోతు:* *మద్యపానానికి బానిసైన ఇతగాడికి తాగుడు మానమని చెబితే సరేనంటాడు కానీ, సమయం అయ్యేసరికి షరా మామూలే! ఒట్టు తీసి గట్టున పెడతాడు, సొమ్ములు కూడా తాకట్టు పెడతాడు.*

*ప్రమత్తుడు:* *అప్రమత్తత లేనివాడు. అజాగ్రత్తపరుడికి నీ మనసును నిగ్రహించుకో అని మంచి ఉపదేశం చేసినందువల్ల ఏం లాభం? దానికి అభ్యాసం కావాలి. అందుకు తగ్గ శ్రద్ధ అతనికి వుండదు. అతనికి చేసే ఉపదేశాలన్నీ బూడిదలో పోసిన పన్నీరే.*

*ఉన్మత్తుడు:* *పిచ్చివాడు. నీ పిచ్చి తగ్గించుకోమని అతనికి ఉపదేశించేవాడు కూడా తప్పక పిచ్చివాడై వుండే అవకాశం వుంది. వీలైతే, అతనికి వైద్యం చేయించటం ఉత్తమం.*

*శ్రాంతుడు:* *బాగా శ్రమించి అలసిపోయినవాడు. అతనికి బాధ్యతను గుర్తు చేయడం వలన ప్రయోజనం శూన్యం. అతనికి విశ్రాంతినిచ్చి, అలసట పోయే మార్గం ఏదైనా వుంటే చూడటం మంచిది.*

*కోపిష్ఠి:* *కోపిష్ఠిని కోపం తగ్గించుకోమంటే, ఇంకా కోపం పెరుగుతుంది. అతనికి కోపం రాక ముందో, కోపం పోయిన తర్వాతనో ధర్మం చెప్పాలి.*

*ఆకలిగొన్నవాడు:* *ఆకలితో అలమటించేవాడికి ధనవంతులను చూసి అసూయపడరాదని, అది అశాంతికి హేతువనీ వేదాంత ఉపదేశం చేస్తే, కడుపుతో పాటుగా ఒళ్ళు మండుతుంది. వీలైతే, అతని కడుపు నింపాలి. అప్పుడు అతడి మనసు శాంతిస్తుంది.*

*లోభి:* *లోభికి దురాశ దుఃఖానికి హేతువు, దానం చేస్తే ఉత్తమగతులు కల్గును అని చెప్పినా లాభం సున్నా. అతడు ధనానికి యజమాని కాదు, బానిస. అతని మనస్సు అతని వద్ద లేనప్పుడు, ఇక ధర్మాచరణ సాధ్యమేనా? అతనికి, కానీ ఖర్చులేని ధర్మం ఏదైనా వుంటే చెప్పవచ్చు. అదైనా ఎదురు డబ్బులు ఇచ్చుకుంటేనే వినే అవకాశం వుంది.*

*పిరికివాడు:* *చీకటిని చూస్తేనే జడుసుకుచచ్చే పిరికివాడికి విజయమో వీరస్వర్గమో అని ఉపదేశించడం*

*వృధా. అతడు బ్రతికుంటే బలుసాకు తిని బ్రతకవచ్చని పారిపోతాడు కానీ, ఫలితం వుంటుందా? వీలైతే, అతనికి అండగా నిలవాలి.*

*<u>తొందరపాటు మనిషి:</u> ఎప్పుడూ ఉరుకులూ పరుగులూ పెట్టే మనిషికి ఒకచోట కూర్చుని ధ్యానం చేసి శాంతిని పొందమనో, లేక నెమ్మదించమనో సలహా ఇస్తే పాటించగలడా? కళ్ళు మూసుకుని కూర్చుంటే ఏకంగా అతని మతే పోయే అవకాశం వుంది, ప్రమాదం వుంది.*

*<u>కాముకుడు:</u> కాముకుడికి స్త్రీ పూజనీయురాలని బోధిస్తే, వింటాడా? మానవతులని అతని నుండి కాపాడుకోవటం మినహా అతడిని మార్చే ఉపాయమే లేదు.*

*ఉంగరాల జుట్టును ఎంత దువ్వినా దారికిరాదు. రాతిలో నీరు ఇంకదు. అలాగే సంసారబద్ధులైన ఈ పదిమంది మనుష్యుల్ని, వట్టిమాటలతో మార్చడం అయ్యేపని కాదు. సామ దాన భేద దండోపాయాలతో తగిన దాన్ని ప్రయోగించాలి. అప్పటికీ దారికి రాకుంటే, వారికి ఉచిత ఉపదేశాలు చేసి ఉద్ధరించాలనే ఉబలాటాన్ని తగ్గించుకొని, వారిని భరిస్తూ, క్షమించే అభ్యాసం చేయడం ద్వారా, మీ మనశ్శాంతిని కాపాడుకోవచ్చు. అయితే, ఈ పదిమందికీ ధర్మం ఎవరు చెప్పకుంటే తెలిసేదెలా? అని అడిగితే, ధర్మం చెప్పవచ్చు. కానీ, అది వారు ఆచరించగలిగినవై వుండాలి. ఆ ఉపదేశం కూడా వారు అడిగినప్పుడే చేయాలి. నిచ్చెనలో చివరిమెట్టు గురించి కాక, తరువాత మెట్టు గురించి మాత్రమే వారికి చెప్పాలి. వారికి దేవుడే గురువు. వారి సమస్యలే వారికి మార్గదర్శకులు. వాటివల్ల వారు పడే బాధలే వారికి నిజమైన బోధకులు.*

***నిన్ను నీవు నమ్ముకున్నావా, నీకు మోక్షప్రాప్తి సిద్ధించినట్లే!***
***నీ గురించి నీవు మరచిపోయి, భగవంతుని మీద భారమేశావా,***
***నీ జీవితం సమూలంగా పతనమైనట్లే, గాడి తప్పినట్లే!***
***నీ గురించి నీవు తెలుసుకునే ప్రయత్నం చేయగలిగితే,***
***నీ అంతరంగాన్ని సమూలంగా శుద్ధి గావించుకోగలిగితే,***
***నీ మనస్తత్వాన్ని నీవు సంపూర్ణంగా తెలుసుకోగలిగితే,***
***నీ జీవితాన్ని గురించి అన్ని కోణాలలో అధ్యయనం చేస్తే,***
***నీ ఇంద్రియాలను పూర్తిగా నిగ్రహించుకోగలిగితే,***
***నీయందలి లోపాలను పూర్తిగా సవరించుకోగలిగితే,***
***నీవెవరివో శాస్త్రయుక్తంగా నిరూపించుకోగలిగినట్లయితే,***
***నీ జీవితాన్ని నీ ఆధీనంలోకి తీసుకోగలిగినట్లయితే,***
***నీకు నీవుగా మోక్షాన్ని పొందటానికి అర్హతను పొందినట్లే!***
***ఇన్నీ సాధిస్తే, అరుదైన ఆంజనేయుని సాన్నిధ్యం అతి చేరువలో వున్నట్లే***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

సమాజానికి మీ వంతు సేవలను అందించాలనే భావనలోనే సంపద దాగివుంది. అది చాలు! అక్కడి నుండే అసలు కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. కొద్దిమందికి ఎన్నో ఆలోచనలు వస్తాయిగానీ, వాటిని కార్యరూపం దాల్చే అవకాశం వుండదు. అతి కొద్దిమంది మాత్రం, ఆ అవకాశాన్ని సద్వినియోగపర్చుకుంటారు. ఆంజనేయుని ఆనతి, ఆశీస్సులు, అభయం ద్వారా ఆధ్యాత్మిక సేవలు చెయ్యండి. ఆధ్యాత్మిక సేవలు మిమ్మల్ని ఉన్నతపథం వైపు నడిపిస్తాయి. భౌతికసేవల వలన మీరు మేలు చేస్తున్నామనుకుంటే, అందులో తప్పక నష్టం కూడా వుంటుంది. అలాగాక, ఆధ్యాత్మిక మార్గంవైపుకు మళ్ళించే ప్రయత్నాలు చేయగలిగితే, వారికి ఆనందాన్ని, ఆరోగ్యాన్ని, మనశ్శాంతిని ప్రసాదించిన వారవుతారు. అంతకుమించి మరింకేం కావాలి?

మీరు ఎప్పుడూ గుప్పెటను (మనసును) మూసి వుంచండి.
లోపల ఏముందో ఎవరికీ తెలియకూడదు.
తెరిచారా, అయిపోతారు... గుర్తుంచుకోండి!
ఇక్కడి డిపాజిట్ సంగతి ఎవ్వరికీ చెప్పొద్దు. పెదవి దాటితే పృథ్వి దాటుతుంది.
మీ సర్టిఫికెట్, మీ బ్యాంక్ పాస్‌బుక్ ఇచటనే, నా వద్దనే వుంచండి.
ఎందుకంటే, నా వద్ద వున్నా, నీవే ఓనర్‌వి కనుక!
తాళాలు మీకే ఇస్తాను. మరి ఇంతటి మిత్రుడు, శ్రేయోభిలాషి ఇంకొకరు
మీకు దొరుకుతారా, ఈ ఆంజనేయుడు తప్ప?

ॐ

**07-01-2020** 06:40 PM

**23) స్వామి! పాండిత్యము మరియు అనుభవమునకు ఉన్న వ్యత్యాసము ఎట్టిది స్వామి?**

పాండిత్యమనేది స్వయం అనుభవం కాదు. అది కేవలం పుస్తక పరిజ్ఞానమవుతుంది. సమాచారాన్ని సేకరించి దానిని వల్లెవేయడం జరుగుతుంది. స్వయం అనుభవానికి, సమాచార సేకరణకు ఎంతో వ్యత్యాసముంటుంది. ఇతరుల అనుభవాన్ని తెలుసుకోవటం వలన కొంతవరకు మీరు ప్రభావితులవుతారు. కానీ, మార్పుకు అది అవరోధమే తప్ప ఎటువంటి ప్రయోజనము వుండదు. సమాచారం అనేది ఏదైనా, ఎటువంటిదైనా బాహ్యముఖ ప్రయాణాన్ని, బంధాలను పెంచుతుంది, మార్పుకు అవరోధమవుతుంది, మనిషిని బలహీనపరుస్తుంది. తెలుసుకోవడం, చదవటం, వినడం ఇవ్వన్నీ అతి ప్రమాదకరమైన బలహీనతలు. అసంతృప్తికి, లేమికి, కొరతకు చిహ్నాలౌతాయి. ఆచారం ముఖ్యం తప్ప ప్రచారం కాదు. కొండంత పాండిత్యంకన్నా గోరంత ఆచరణ ముఖ్యం. ఆచరించకుండా బోధించడం ఆత్మవంచన అవుతుంది, అంతరాత్మకు విరుద్ధమవుతుంది. ఎవరికైనా మాటలనేవి అంతరంగమందలి సంస్కారాల ప్రేరణద్వారా బహిర్గతమవుతాయి. అటువంటి ప్రేరణే ఆలోచన అవుతుంది. ఆలోచనలకు అనుగుణంగా మాటలు వెల్లడించబడితే మనసుకు, మాటకు సమన్వయముంటుంది. అయితే, భాషలో వున్న ప్రమాదమేమిటంటే,

అంతరంగ స్వభావానికి విరుద్ధంగా వుంటాయి. అంతరంగం ఒక రకంగా, భాష మరొక రకంగా వుంటే, దానినేమంటారు? అంతరంగాన్ని నొక్కివేయడం లేక చంపుకోవడమంటారు. అంతరంగంలో నెగెటివ్ వుండి, ఆకర్షణీయమైన భాషను ఉపయోగించినా, ప్రదర్శించినా ఎటువంటి ప్రయోజనము వుండదు. ఇప్పటి రోజులలో ఏమి జరుగుతున్నదో గుర్తించండి. పాండిత్యం పెరుగుతుంది, అనుభవం తగ్గుతుంది. ఉన్న దానిని అణచివేసినా, లేనిదానిని పెంచినా అది సహజత్వానికి విరుద్ధమవుతుంది. అంతరంగ సంస్కారాన్ని బట్టి భాష వ్యక్తీకరించబడితే, రెండింటి మధ్య సమన్వయం వుంటుంది లేకుంటే, అసహజమవుతుంది. అయితే, అంతరంగంలో చెడు వుండి, దానిని వ్యక్తీకరించడం వలన, పరిసరాలన్నీ కలుషితమవుతాయి. ప్రపంచం చిన్నచూపు చూస్తుంది, తిరస్కరిస్తుంది, వ్యతిరేకిస్తుంది. అందుకే మేథావులంతా అంతరంగంలో చెడు సంస్కారమున్నప్పటికీ, దానిని బహిర్గతం కాకుండా ఆకర్షణీయమైన భాషలో అందరినీ ఆకర్షించే ప్రయత్నం చేస్తుంటారు. దానిని మేథావులు ఆడే ఆటగా లెక్కించవచ్చు. ప్రపంచం మెప్పుకోసం, దానిని ఆకర్షించడం కోసం, సమాజం మీద పట్టు సాధించడం కోసం, గుర్తింపు కాంక్ష, కీర్తికాంక్ష, సన్మానాలు, సత్కారాలు, బిరుదులు వంటి వాటిని ఆశించి తమ కళను, ప్రతిభను, పాండిత్యాన్ని ప్రదర్శించడమంత ప్రమాదం మరొకటి వుండదు. మాటలు పెరుగుతున్నాయంటే, అనుభవం కరిగిపోతుందని గ్రహించాలి. అనుభవాన్ని పెంచుకోవాలంటే, నోటికి తాళం వేయవలసిందే. బోధన అనేది అవసరమే. కానీ, ఒక వ్యసనం కాకూడదు. అలవాటును మార్చుకోవడం సులభం కానీ, వ్యసనాన్ని వదులుకోవడం అసాధ్యం. అనుభవం నుండి వెలువడేమాటలు ప్రపంచాన్ని ప్రభావితం చేయగలుగుతాయి. కానీ, అనుభవం లేని పాండిత్యాన్ని ప్రదర్శించడం వలన ఎటువంటి ఫలితం వుండదు. అందుకే పండితులు పెరుగుతున్నారు – ప్రపంచం సమస్యలనెదుర్కొంటుంది. అనుభవం లేని పండితుని కన్నా, అమాయకుడు మిన్న. భాష అనేది కర్మకు మూలమవుతుంది. అది బంధాలను పెంచుతుంది. అనుభవం పెరిగేకొలది, అంతర్ముఖ ప్రయాణం సులభమై, ఏకత్వం సిద్ధిస్తుంది. పాండిత్యం పెరిగేకొలది ఈర్ష్య, అసూయ, పోటీతత్త్వాలు అధికమవుతాయి. అందుకే పండితులను గమనించండి. ఒకరి ఎదుగుదలను ఒకరు సహించరు. ఒకరికి సన్మానం జరుగుతుంటే, మరొకరు భరించలేరు, మనస్ఫూర్తిగా అభినందించలేరు. మనసు, మాట, క్రియ ఈ మూడింటి మధ్య సమన్వయముందనుకోండి, దానినే త్రికరణశుద్ధి అంటారు. అది ఎంతో మహోన్నతమైన లక్షణం అవుతుంది. గొప్ప వ్యక్తిత్వం గలవారు అనుసరించే విధానమిదే. వారు అంతరాత్మకు అనుగుణంగా మాట్లాడుతారు. అనుభవసారాన్ని పంచుతారు. అందుకే వారు అందరి హృదయాలను స్పందింపచేస్తారు. కాబట్టి, పాండిత్యాన్ని ప్రక్కనపెట్టి, అనుభవాన్ని పెంచుకొని, జీవిత సారాంశాన్ని మీరు అనుభవించాలని మనసా–వాచా–కర్మణా త్రికరణశుద్ధిగా ఈ ఆంజనేయుడు కోరుకుంటూ, సదా రామచరణారవిందులై త్రికరణశుద్ధులై జీవితాన్ని గడపాలని ఆశీర్వదిస్తున్నాను. అందుకోండి అనంతమైన ఆశీస్సులు!

అల్పాకర్షణీయం యః కదయతి నిశ్చితం స ఖలు వాగ్మీ ।
బహువచన మల్పసారం యః కథయతి విప్రలాపీనః ॥

కొద్దిమాటలలోనే మనోహరంగా ఎవరు విషయమును చెప్పగలరో, వారే వాగ్మి యనుటకు అర్హుడు.

అట్టుగాక, అల్ప విషయము పలుమాటలలో చెప్పి విసుగెత్తించువాడు ప్రేలుడుగాడు అని చెప్పవచ్చు అని ఆంజనేయుని భావం!

***మేలుకోండి జగమంతా మిథ్య - అందుకోండి గురుకుల విద్య***
***తెలుసుకోండి జీవితసత్యం - చేసుకోండి ఆనందం నిత్యం***
***పుచ్చుకోండి జ్ఞానతీర్థం - తెలుసుకోండి జన్మకర్థం***
***అవుతుంది మీకు జ్ఞానవృద్ధి - జరుగుతుంది ఆత్మశుద్ధి***
***చేరాలి మీరంతా ప్రశాంత ధ్యానస్థితి - కావాలి మీకు అదే అసలైన ఆధ్యాత్మిక ప్రవేశం***
***పొందండి సిసలైన జ్ఞానప్రకాశం - అందులోనుండి ఆస్వాదించాలి అసలైన ఆనందపు విశ్వవికాసం***
***యోగసాధనతోనే మొదలవుతుంది అంతరమథనం***
***అనుభవించండి ఆ మధురక్షణాలను***
***అపుడే మీరు మారుట ఖాయం***
***మారుతి అభిమానం ఆంజనేయుని మమకారం***
***ఆప్యాయత రంగరించి జ్ఞానబోధను చేయగా***
***సునాయాసంగా ఈదండి సంసారసాగరాన్ని***
***జ్ఞానబోధ మీకు అవుతుంది సాకారం సహకారం***
***అవుతుంది అదే జ్ఞానతృష్ణకి సాకారం***
***వంటబట్టించుకోండి ఓంకార ప్రాముఖ్యం - భజన కీర్తన భక్తి పారవశ్యం***
***సంపూర్ణ మౌనసాధనలతో ఆశయసిద్ధికి నిన్ను సిద్ధం చేస్తుంది***
***సిద్ధంకండి మారుతి మాటలలోని మాధుర్యాన్ని చవిచూచుటకు***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**08-01-2020** 08:45 PM

**24)** మాకు శుభమును లేక మంగళమును చేకూర్చునవి ఏవి స్వామి?

మనసా-వాచా-కర్మణా మీరు నమ్మిన దానిని గట్టిగా పట్టుకోవాలి. అది విశ్వాసమైనా, భగవత్స్వరూపమైనా సరే. అయితే, అది మీకు శుభాన్నిచ్చేవిగా వుండాలి.

మఙ్గలాలంబనం యోగః శ్రుత ముత్థానమార్జనమ్ ।
భూతిమేతాని కుర్వన్తి సతాం చాభీక్ష్ణం దర్శనమ్ ॥

అంటే, మంగళవస్తువులను తాకుట, సహాయములతో కూడి వుండుట, శాస్త్రజ్ఞానం, ప్రయత్నము, ఋజుప్రవర్తనం, సత్పురుషులను మాటిమాటికీ దర్శించుట అనునవి శుభమును చేకూరుస్తుంది. అంటే మంగళవస్తువులలో మంచిశక్తి వుంటుంది. వాటిని తాకగానే మీలోగల చెడుశక్తి నిష్క్రమిస్తుంది. నిత్యపూజలు

చేసేటప్పుడు, మీ శరీరాన్ని శుభ్రం చేసుకుంటారు. శరీరశుభ్రత ప్రభావం మనసు మీద కూడా పడుతుంది. స్నానం చేయకముందు, చేసిన తరువాత ఈ తేడా స్పష్టంగా మీకు తెలుస్తుంది. శారీరక మలినాలు మనసుకు చికాకు కల్గిస్తాయి. స్నానం చేసే వరకు మనసు అశాంతిగా వుంటుంది. ధ్యానం కూడా స్నానంతో సమానమే. అది మనసును మలినరహితం చేస్తుంది. మనోస్నానం ధ్యానం. మీకు అందుబాటులో వుండే మంగళవస్తువులు గరిక, నువ్వులు, దేవతావృక్షాలు, పాలు, పెరుగు, గోవు, పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, అక్షితలు మొదలగునవి. ఇవి సహాయకులు. అంటే, సదా మీకు మేలు చేసేవి. మీ క్షేమం కోరేవారిని ఎన్నడూ దూరం చేసుకోకూడదు. ఉపకారులు నిస్వార్ధంగానే సాయం చేస్తారు. నిస్వార్ధసాయం చేసేవారికి అమితమైన తృప్తి, ఆనందం కలుగుతాయి. తమ ఇష్టులకు ఆత్మీయులకు సాయం చేయడం కన్నా అపరిచితులకు ఆపదలో వున్నవారికి సాయం చేయడం మానవీయ లక్షణం. ఆర్ధిక సంబంధాలుగా మారిపోయిన మానవ సంబంధాలలో మానవీయ పరిమళం వుండటం లేదు. షరతులతో కూడిన సహాయాలు, ఇచ్చిపుచ్చుకోవటాలుగా మారిపోయిన అనుబంధాలు, మానసిక కాలుష్యానికి కారణాలవుతాయి. మనిషికి శాస్త్రజ్ఞానం తప్పక వుండితీరాలి. అయితే, అందరికీ ఆ అవకాశం వుండకపోవచ్చు. కాబట్టి, శాస్త్రజ్ఞానం గలవారి నుండి సందేహాలు తీర్చుకోవచ్చు. అంటే, అంతో ఇంతో శాస్త్రజ్ఞానం ఈ ఆంజనేయుని వద్ద వున్నది. అడిగి తెలుసుకోవచ్చు. అజ్ఞానం అంటే శాస్త్రజ్ఞానం లేకపోవటం. అజ్ఞానంతో చేసే పొరపాట్ల వలన ఒక్కోసారి తీరని నష్టం కలుగవచ్చు. కొందరు తమ మనసుకు తోచినట్లు చేస్తారు. అదృష్టం బావుండి అది మంచి ఫలితాన్నిస్తే ఫర్వాలేదు. లేని పక్షంలో పర్యవసానాలు బహుకాలం వేధిస్తాయి. అందుకే అనుభవజ్ఞులైన పెద్దలు, జ్ఞానుల సలహాలు స్వీకరించాలి. ప్రయత్నం అనేది పురుషలక్షణం. స్త్రీ లక్షణం కాదా? అని అనుకోవద్దు. ఎందుకంటే, వ్యవహారాలన్నీ చక్కదిద్దాల్సిన బాధ్యత పురుషుల మీద అధికంగా వుంది. ఇప్పుడు స్త్రీలు కూడా పురుషులతో సమంగా బాధ్యతలు పంచుకుంటున్నారు. కాబట్టి, ప్రయత్నం అనేది అందరికీ వర్తించే అంశంగా భావించండి. ప్రయత్నం అనేది అన్ని పనులకూ వర్తిస్తుంది. మనసును చేతనావస్థలో వుంచాలి. అది శరీరాన్ని చేతనావస్థలో వుంచుతుంది. శరీరానికి తగినంత కదలికలు వుండాలి. అది వ్యాయామం కావచ్చు, యోగా కావచ్చు. శరీరం జడంగా వుంటే, బుద్ధి కూడా జడంగా మారిపోతుంది. ఇక ఋజువర్తనం గురించి. వర్తనం అంటే ప్రవర్తన. సచ్ఛమైన మనసుతో మోసభావనలకు తావీయకుండా అందరి మేలు కాంక్షిస్తూ ప్రవర్తించాలి. సజ్జనులకు అన్ని చోట్లా గౌరవ ఆదరాలు లభిస్తాయి. ప్రవర్తనను సరిదిద్దుకోవటానికే ఈ ఆంజనేయుడు ఇంతటి జ్ఞానాన్ని బోధిస్తున్నాడు. దుష్ప్రవర్తన మానసిక అనారోగ్యం వంటిది. వ్యాధినివారణలో మందులకు ఎలాంటి ప్రాధాన్యముందో, మనసును ఆరోగ్యంగా వుంచటానికి మీ సంప్రదాయాలలో ఎన్నో పద్ధతులున్నాయి. సత్పురుషులను తరచుగా సందర్శించాలి అని ఎందుకు చెబుతున్నానంటే, సత్పురుషులతో సంభాషిస్తే, మీ మనసు ఎంతో ఉల్లాసం చెందుతుంది. అనేక సందేహాలకు సమాధానాలు లభిస్తాయి. జ్ఞానం అంటే ఇదే. సత్పురుషులను ఎప్పుడో ఒకసారి, సందర్శిస్తే చాలదు. ప్రయోజనం లభించదు. పాఠశాలకు నిత్యమూ వెళ్ళి పాఠాలు నేర్చుకుంటారు. అలాగే, సత్పురుషుల వద్దకు వీలైనన్ని ఎక్కువసార్లు వెళ్ళి వస్తుండాలి. అది శ్రద్ధకు తార్కాణం. నేను చెప్పినవన్నీ ఆచరిస్తే, మనిషికి మేలు కలిగిస్తాయి.

*అనిర్వేదః శ్రియోమూలం లాభశ్యచ శుభస్యచ ।*
*మహాన్ భవత్యనిర్విణ్ణః సుఖంచానన్త్యమశ్నుతే ॥*

*అంటే, ఏదైనా సాధించటానికి ప్రయత్నం అవసరం. ఆ ప్రయత్నంలో పట్టుదల, కృషి, నేర్పు, ఓర్పు, కలగలసి వుండాలి. ఏ ప్రయత్నమూ సత్వరఫలితాలను ఇవ్వదు. అలా సత్వరఫలితాలను ఆశించినవారు నిరాశానిస్పృహలకు లోనవుతారు. ఒక్కోమారు ప్రయత్నాన్ని విరమించాలని కూడా అనుకోవచ్చు. ఉత్తమఫలితాల కోసం కఠిన పరిశ్రమ, ప్రయత్నమూ చేయాలి. కష్టనష్టాలను తట్టుకోవాలి. అంతిమ లక్ష్యం సాధించేవరకూ ప్రయత్నం మానకూడదు. అలా ఉన్నపుడే లాభం, శుభం కలుగుతాయి. ఉద్యోగపరుడు అంటే నిరంతరం మంచిపనులలో నిమగ్నుడైనవాడు. అలాంటివాడు అంతములేని సుఖమును పొందుతారు. సుఖానికి, కష్టానికి ఒక పరిమితి వుండాలి. అక్కడితో అవి అంతమైపోతాయి. కష్టం అంతమైతే సుఖం కలుగుతుంది, సుఖం అంతమైతే కష్టం కలుగుతుంది. వీటి రెండిటికీ అతీతంగా జీవించేవాడు అంతులేని సుఖానుభూతిని పొందగలడు. అదే చిదానందం. కష్టసుఖాలు కేవలం మానసిక భావనలు. మనసు మీ వశంలో ఉన్నప్పుడు, కష్టసుఖాల అనుభూతులు మిమ్మల్ని ప్రభావితం చెయ్యలేవు. ఆధ్యాత్మిక పరిపక్వత అని దీన్నే అంటారు. శిఖరం మీద కూర్చున్నవాడు క్రిందకు చూస్తే, అంతా సమానంగా కన్పిస్తుంది. ఆధ్యాత్మిక శిఖరం చేరుకున్నవారికి తరతమభేదాలు, ఉచ్చనీచాలు, ఆధిక్యతాభావాలు వుండవు. గగనంలా గంభీరంగా, సముద్రంలా గాఢంగా, ప్రకృతిలా పవిత్రంగా, చంద్రుడిలా ఆత్మీయంగా వుంటారు. మనిషి కృషిలోపం, సోమరితనం వల్లనే అనుకున్నది సాధించలేకపోతున్నాడు. సంకల్పబలమే శక్తినిస్తుంది. పట్టుదల కలిగిస్తుంది. కృషి బీదవాడ్ని ధనికుడ్ని చేస్తుంది. అజ్ఞాని కృషి వల్ల, జ్ఞాని అవుతాడు. కృషిలోపం ధనికుడ్ని దరిద్రుడిగా చేస్తుంది. జప తప ధ్యాన యోగాలన్నీ కృషిలో భాగాలే. అయితే, ఫలాలను ఆశిస్తే, అది పవిత్రత లేని కృషి అవుతుంది. "కర్మణ్యేవాధికారస్తే" అన్నట్లు, కృషి ఒక జీవనవిధానంగా, స్వభావంగా వుండాలి. చీమలు అలా నిరంతర కృషికి అంకితం అయివుంటాయి. చీమ చిన్నదే అయినా, ఏనుగంత సందేశం తన చర్యల ద్వారా ఇస్తోంది. మనసు పెట్టి పరిశీలిస్తే, ప్రకృతిలోని అణువణువూ మీకు మౌనసందేశాలను ఇస్తున్నదని గ్రహించగలరు.*

***క్రితజన్మ పుణ్యఫలముగా భువికి వచ్చావని సంబరపడిపోకండి***
***మరుజన్మకు పునాదులేసుకోండి , లేక పరమపదం కోసం తపించండి***
***తపిస్తే సరిపోదు, అడుగులెయ్యండి, అడుగులేసి ఆచరించండి***
***ఆచరించాలంటే, కొన్ని నియమనిబంధనలకు కట్టుబడండి***
***దానికి తొలిమెట్లు మూడు. అవి మనోనిగ్రహం, మనసును అదుపులో వుంచడం, సంతృప్తి. ఎలా?***
***గుండె గుప్పెడే అన్నది నిజమే. అది ఆ జీవిని బ్రతికిస్తూనే వుంటుంది.***
***కళ్ళు రెండే, కానీ చూపు ఒకటే. చెవులు రెండే, కానీ వినే శబ్దం ఒకటే***
***మిగతా జ్ఞానేంద్రియాలు అంతే. అవి పనిచేస్తూ, జీవికి సహకరిస్తాయి***
***మనసు ఒక్కటే, కానీ ఆలోచనలెన్నో***
***ఆ ఆలోచనలు మంచివో, చెడ్డవో బుద్ధికి మాత్రమే తెలుసు***

***అది కూడా సద్బుద్ధిగానీ, దుర్బుద్ధి గానీ కావచ్చు***
***ఈ జన్మ, గతజన్మల కర్మఫలాలను అనుభవించటానికే.***
***కావున, చెవులతో వినే శబ్దాలను బయటనే బంధించి, ధ్యానదీక్షరూపకంగా యత్నించి***
***ఆత్మానందాన్ని పెంపొందింపచేసుకుని, జీవిని ఉద్ధరించడం ద్వారా***
***సంతృప్తిగా ఈ జన్మలోనే సాధ్యం చేసుకొని***
***ఆంజనేయుని ఆశీస్సులతో సుసాధ్యం చేసుకోండి, ఈ జన్మలోనే***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**09-01-2020** 08:55 PM

**25)** భగవద్గీత యొక్క విశిష్ఠత ఎట్టిది స్వామి?

*గీతా గంగాచ గాయత్రీ, సీతా సత్యా సరస్వతీ బ్రహ్మవిద్యా బ్రహ్మవల్లీ త్రిసంధ్యా ముక్తి గేహినీ ।*
*అర్ధమాత్రా చిదానంద భవఘ్ని భ్రాంతినాశినీ వేదత్రయీ పరానంతా తత్త్వార్థ జ్ఞానమంజరి ॥*
*ఇత్యేతాని జపేన్నిత్యం నరో నిశ్చలమానస ।*

*జ్ఞానసిద్ధిం లభేచ్ఛీఘ్రం తథాంతే పరమం పదంగీత*
*గంగ గాయత్రి సీత సత్య సరస్వతి బ్రహ్మవిద్య బ్రహ్మవల్లి ।*
*త్రిసంధ్య ముక్తిగేహిని అర్ధమాత్ర చిదానంద భవఘ్ని*
*భ్రాంతినాశిని వేదత్రయీ పర అనంత తత్త్వార్థ జ్ఞానమంజరి ॥*

*(మీమీద అతి ప్రేమతో పద్యాలను చెబుతున్నాను)*

*ఈ పద్దెనిమిది గీతానామాలను జపించండి. అతి తత్వరలో జ్ఞానసిద్ధి పొందవచ్చు. కానీ, నిశ్చలచిత్తం కావాలి. దానితో పరమపదప్రాప్తి సిద్ధిస్తుంది. భగవద్గీత భీష్మపర్వంలో గీత గురించి చెప్పబడింది. దీనిలోని 18 అధ్యాయాలు 700 శ్లోకాలు వున్నాయి. దీనిలోని ప్రతి అధ్యాయానికి ప్రత్యేకమైన నామము ఇవ్వబడింది. అది ఏమిటంటే, ప్రతి అధ్యాయానికి 'యోగము' అని చెప్పబడింది. ఒక్కొక్కటీ ఒక్కొక్క యోగము. కురుక్షేత్ర రణరంగంలో కౌరవ-పాండవుల యుద్ధారంభంలో అర్జునునికి శ్రీకృష్ణపరమాత్మునిచే చెప్పబడింది. నావారు' అనే మమకారం, 'నాచే చంపబడుతున్నారు' అనే మోహం అర్జునుని ఆవరించి, విషాదాన్ని కలుగచేయగా, విషాదయోగాన్ని పోగొట్టి జ్ఞానాన్ని కలుగచేయడానికి శ్రీకృష్ణునిచే గీతాబోధ చేయబడింది. గీత, దీనుడైన అర్జునుని ధీరునిగా చేసింది. అందుకే, గీతలోని శ్లోకాలు మీలోని శోకాన్ని దూరం చేస్తాయి. గీతను ధర్మరాజుకుగానీ, భీష్మునికి గానీ బోధించక, అర్జునునికి ఎందుకు బోధించాడు శ్రీకృష్ణుడు? భీష్మునికి చేయకపోవటానికి కారణం ఏమిటంటే, న్యాయం, ధర్మం పాండవుల పక్షాన వుందని చెబుతూ, అధర్మపరులైనా, కౌరవుల పక్షాన యుద్ధం చేశాడు.*

ఆలోచనలకు-చెప్పేమాటకు-చేసే క్రియకు భేదమున్నది. అనగా త్రికరణశుద్ధి లేదు. అట్టివారు జ్ఞానబోధకు అర్హులు కారు. ధర్మరాజు ధర్మవర్తనుడే. కానీ అతనిది పశ్చాత్తాపమే గానీ, పూర్వతాపం కాదు. ఒక పనిచేసే ముందుగానే దాని మంచిచెడ్డలు విచారించేవాడు పూర్వతాపం కలవాడు. జూదం ఓడిపోయి, అడవుల పాలయ్యాక జరిగిన దానికి పశ్చాత్తాపపడి, ప్రాయశ్చిత్తం చేసుకోవడం ప్రారంభించాడు. ముందుగా దాని పర్యవసానం ఏమిటో ఆలోచించలేదు. పూర్వతాపం లేనివారు గీతాబోధకు అర్హులు కారు. అర్జునుడు యుద్ధభూమిలోనికి ప్రవేశించి తన వారినందరినీ చూచి, "ఇంతమందిని చంపి ఈ రాజ్యాన్ని అనుభవించేకంటే, భిక్షాటన మేలు. అందరూ చనిపోయాక ఈ రాజ్యాన్ని పాలించి ఏమి ఆనందం అనుభవించగలము? త్రిలోకాధిపత్యం ఇచ్చినా నేను యుద్ధం చెయ్యలేను" అని ముందుగానే వివరించాడు. తనను శిష్యునిగా చేసుకొని, కర్తవ్యం బోధించమని శ్రీకృష్ణభగవానుని ప్రార్థించాడు. అందువలన, అర్జునునికి గీతాబోధ చేయబడింది. పూర్వతాపం, పరిశుద్ధ హృదయమున్న వారికి కలుగును. పరిశుద్ధ హృదయుడే జ్ఞానబోధకు అర్హుడు. విశ్వసాహిత్యంలో గీతకు ఒక ప్రత్యేక స్థానముంది. తక్కిన సాహిత్యమంతా మానవనిర్మితాలు కాగా, గీత భగవంతుని నిర్మితము. శ్రీకృష్ణుడు చేసిన గీతోపదేశం కేవలం అర్జునునికి మాత్రమే కాదు, సమస్త మానవాళికీ. అంతేకాదు, ఒక కాలానికి గాని, ఒక జాతికి గాని, ఒక మతానికి గాని కాదు. సమస్త మతములలోని ప్రధాన సూత్రములు, ధర్మములు గీతలో క్రోఢీకరించబడ్డాయి. సర్వమతధర్మ సమన్వయము గీత. గీత అనగా - 'గీ' అంటే గానము చేయువారిని, 'త' అంటే తరింపచేయునది. గీత ఆశ్రితులను కల్పవృక్షంవలే కాపాడుతుంది. స్వర్గంలోని కల్పవృక్షం క్షణికమైన ప్రాపంచిక వస్తువులను అందిస్తుంది. గీత, సంకల్పరహితమైన మోక్షప్రాప్తిని కల్గిస్తుంది. గీత కామధేనువు వంటిది. నశ్వరమైన భోగవస్తువులను సమకూర్చదు. కామవర్జితమగు నిష్కళంక నిర్వాణపరిధిని సమకూర్చుతుంది. గీత, చింతామణివంటిది. చింతలను పోగొడుతుంది. మోక్షమును చేకూర్చుతుంది. వేదములసారం ఉపనిషత్తులు. వీటిని వేదాంత శాస్త్రములని, శ్రుతి శిరస్సులని అంటారు. వీటి సారమే భగవద్గీత. సాంఖ్య, యోగ, న్యాయ, మీమాంస వేదాంతముల శాక్త, శైవ, గాణాపత్య, వైష్ణవాది మతముల ప్రపంచములో వున్న అన్ని సంప్రదాయాలు సమన్వయం గీతలో ప్రతిబింబిస్తుంది. అందువల్లే, గీత విశ్వమతగ్రంథము. ఆధ్యాత్మ వాఙ్మయంలో ముముక్షువులకు ప్రస్థానత్రయం అతిముఖ్యమైన ఆధారం. పరమార్ధ తత్త్వం తెలుసుకొనుటకు ఉపయోగపడుతుంది. దశోపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రములు ఈ మూడింటినీ ప్రస్థానత్రయం అంటారు. అనేక ధర్మసూత్రములు గీతలో ఉన్నందువల్ల, ప్రస్థానత్రయంలో చోటు లభించింది. అంతేకాదు, కర్మ-భక్తి-జ్ఞానములనే మూడు ప్రవాహముల త్రివేణీ సంగమ పుణ్యతీర్థం భగవద్గీత. కర్మ-భక్తి-జ్ఞానము-ధ్యానము ఈ నాలుగు వేర్వేరుగా విడదీయుటకు వీలుకానివి. ఇవి ఒకదానితో ఒకటి సన్నిహిత సంబంధము ఏర్పర్చుకున్నాయి. సంస్కార వశాత్తూ ఒకనిలో వీటిలో ఏదైనా ఒక గుణం ప్రధానంగా కనిపిస్తే, మిగిలిన మూడు గుణాలు అంతర్లీనంగా వుంటాయి. పరబ్రహ్మ సాక్షాత్కారం జీవుడు ఏ విధంగా పొందగలడో, అందుకు కారణాలేమిటో గీతలో బోధించబడ్డాయి. అవి నిర్మలబుద్ధితో, ధైర్యంతో మనసును స్వాధీనపరచుకొని, శబ్దాది విషయాలను, రాగద్వేషాలను విడిచిపెట్టాలి. ఏకాంతవాసియై, మితాహారాన్ని స్వీకరిస్తూ, నిరంతర ధ్యానయోగాభ్యాసం చేయాలి. భోగవస్తువులను

త్యజించాలి. మమకారరహితుడై వుండాలి. అహంకార దర్పాలను, కామక్రోధాలని విడనాడి, శాంతస్వభావం కలిగివున్న మహనీయుడు, పరబ్రహ్మ సాక్షాత్కారం పొందగలుగుటకు సమర్ధుడవుతాడు. అన్ని యోగములతోపాటు భూతదయ అత్యవసరము అని గీతలో చెప్పబడింది. ఇతర ప్రాణులపై దయ, కరుణ కలిగినపుడే, భక్తి, ధ్యానము, జ్ఞానము, యోగం అభివృద్ధి చెందుతాయి. అంతేగానీ, భగవంతునిపై భక్తి కలిగి జీవరాశులపై ద్వేషం కలిగివుంటే ఆ భక్తికి విలువ వుండదు. అది భగవంతునికి చేసిన అపరాధమే అవుతుంది. కారణం భగవంతుడు అన్ని జీవరాశులలో వుండటమే. అన్ని జీవరాశులు భగవంతుని వివిధ అవయవములవంటివి. అందులో ఏ అవయవానికి దెబ్బ తగిలినా భగవంతునికి బాధ కలుగుతుంది. "సర్వజీవ తిరస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" అని, "అద్వేష్టా సర్వేభూతానాం" అని, సర్వభూతహితేరతాః నిర్వైరస్సర్వ భూతానాం" అని గీతలో పలుచోట్ల జీవకారుణ్యమును గురించి శ్రీకృష్ణుడు చెప్పాడు. గీతాపారాయణవల్ల పొందే లాభాన్ని భక్తితో శ్రద్ధతో చేసేవారికి లభించే సత్ఫలితాలను అఖండశక్తిని విపులంగా చెబుతాను. అలనాడు అర్జునునితోపాటు వినే అర్హతను ఈ ఆంజనేయునికి కల్గించారు. జండాపై కపిరాజు అని విన్నారా? అది ఈ ఆంజనేయునికి దయతో ప్రేమతో ఒసగిన దివ్యమైన కానుక.

| | | |
|---|---|---|
| 1వ అధ్యాయఫలం | – | పారాయణ వలన కలిగే ఫలం పాపవిముక్తి, పూర్వజన్మ స్మృతి |
| 2వ అధ్యాయఫలం | – | ఆత్మజ్ఞానప్రాప్తి |
| 3వ అధ్యాయఫలం | – | పాపరాహిత్యం, ప్రేతత్వవిముక్తి |
| 4వ అధ్యాయఫలం | – | మానవులే కాదు, వృక్షాదులు కూడా దోషవిముక్తులై తరించుదురు. |
| 5వ అధ్యాయఫలం | – | దోషవిముక్తి పశుపక్ష్యాదులు కూడా తరించుట |
| 6వ అధ్యాయఫలం | – | మోక్షప్రాప్తి |
| 7వ అధ్యాయఫలం | – | మానవులు, పితృదేవతలు తరించుట |
| 8వ అధ్యాయఫలం | – | సమస్త దుర్గతి నివారణ, మోక్షప్రాప్తి |
| 9వ అధ్యాయఫలం | – | ప్రతిగ్రహణ దోషవిముక్తి |
| 10వ అధ్యాయఫలం | – | బ్రహ్మజ్ఞానప్రాప్తి |
| 11వ అధ్యాయఫలం | – | సర్వపాపవిముక్తి, పరమాత్మపదప్రాప్తి |
| 12వ అధ్యాయఫలం | – | దివ్యశక్తులుదయించుట, మోక్షరూప సద్గతి లభించుట |
| 13వ అధ్యాయఫలం | – | పాపవిముక్తి, సద్గతిప్రాప్తి |
| 14వ అధ్యాయఫలం | – | ఫలదోషనివారణ, ఉత్తమగతిప్రాప్తి |
| 15వ అధ్యాయఫలం | – | ఉత్తమగతిప్రాప్తి, ఉత్తమ మోక్షగతి సంప్రాప్తి |
| 16వ అధ్యాయఫలం | – | బలవిక్రమాదులు కల్గుట, మోక్షము కల్గుట |
| 17వ అధ్యాయఫలం | – | సర్వరోగనివారణ, మోక్షప్రాప్తి |
| 18వ అధ్యాయఫలం | – | సర్వపుణ్యఫలం, మోక్షరూపసద్గతి లభించును |

తర్వాత మహాత్మ్యమును పఠించి ఉత్తమగతిని పొంది రుద్రలోక నివాసులై తరించండి.

*కాలము ఒక మహాద్భుత దివ్యశక్తి*
*కాలము ఎంతో పవిత్రమైనది, విలువైనది*
*కాలప్రవాహం సదా ఒకే రీతిలో వుంటుంది*
*కాలప్రభావం వలన సంభవాలు అనూహ్యం*
*కాలానికి మార్పులేదు, చేర్పులేదు*
*కాలప్రభావం వలన ఎన్నో వింతలూ, మహిమలు, అద్భుతాలు*
*ఈ విశ్వంలోనూ భూమిపైనా, సదా జరుగుతూనే వున్నాయి*
*కాలప్రవాహంలో రోజులు, గంటలు, నిముషాలు ఏర్పడ్డాయి*
*మనిషి పృథ్విపై భగవదాంశగల జీవి, మనిషి కూడా ఒక దివ్య మహాశక్తివంతుడు*
*మనిషి తన ప్రవృత్తిపరంగా ఈ పృథ్విపై మహనీయుడు, మహాత్ముడు,*
*మహాపురుషుడు,యుగపురుషుడై సదా ఆరాధ్యుడయ్యాడు*
*మనిషి తన ప్రవృత్తితోనే జగత్తును జయించి శ్రీరాముడుగా యుగపురుషుడయ్యాడు*
*శ్రీకృష్ణభగవానుడు కూడా యుగపురుషుడయ్యాడు శ్రీమద్భగవద్గీతను అర్జునునకు బోధించాడు*
*మీ జీవితాలకు కూడా భగవద్గీత ఇలనాడు హనుమ బోధిస్తూ*
*ఈ కాలంలో కూడా మీరందరూ మహనీయులుగానూ, మహాత్ములుగానూ, యుగపురుషులుగానూ,*
*మార్చగలదన్న గట్టి నమ్మకముతో మీ ప్రవృత్తులను మార్చుకుని*
*పరమపవిత్రులై, పావన మార్గాన్ని అనుసరించి పవమానపుత్రుని చేరి సదా సుఖించండి*
*నా చిన్నారి ముద్దుబిడ్డలారా!*

ॐ

**10-01-2020** 08:45 AM

**26)** సంతృప్తికరమైన, ఆనందమయ జీవనానికి ఎటువంటివి పాటించాలి స్వామి?

ఎవరైతే మానసికమట్టం స్థాయిలోనే జీవించగలుగుతారో, వారికి బుద్ధిమట్టం వికసించదు. అటువంటివారు జీవితాన్ని గురించి ఉపరితలంలో పాక్షికంగా ఒక కోణంలో చూడగలుగుతారు. అటువంటివారు ఎన్నుకొనే మార్గం అతి ప్రమాదకరంగా వుంటుంది. అనుసరించే విధానం అసంతృప్తిని పెంచుతుంది. అందువలన ఖరీదైన జీవితం ముఖ్యంకానే కాదు. ఆనందకరమైన జీవితం అత్యంత ఆవశ్యకం. ప్రస్తుత ప్రపంచంలో ఖరీదును గురించి ఆలోచించే వారంతా ఆనందానికి దూరమవుతున్నట్లే. ఆనందం కావాలనుకొనే వ్యక్తి, ఆడంబరాల వైపుకు వెళ్ళకూడదు. ఎవరైనా తనను గురించి కాక ఇతరుల గురించి అతిగా, అనవసరంగా ఆలోచిస్తున్నారంటే, వారిలో తప్పనిసరిగా లోపమున్నట్లే. దానిని సరిచేసుకోలేకపోతే, తర్వాత కాలంలో భారీమూల్యం చెల్లించవలసిందే, శిక్షను అనుభవించవలసిందే. వాస్తవానికి మీ పురోభివృద్ధికి ఎవ్వరూ అడ్డుకారు, ఆటంకపరిచే ప్రసక్తే లేదు. అలా ఆటంకపరిచినట్లైతే,

వారిని కూడా అడ్డు తొలగించుకునే ప్రయత్నం చేయాలి. మూఢనమ్మకాలకు ఎటువంటి అవకాశం ఇవ్వకూడదు. బలహీనంగా జీవించకూడదు, బలహీనతలను అనుసరించకూడదు. మీలో బలహీనత లేకుండా, బయటనుండి ఏ శక్తి లోపలకు ప్రవేశించదు. ఇప్పటివరకూ భౌతికపరమైన అంశాల మీదనే దృష్టి కేంద్రీకరించారు కాబట్టి, ఆధ్యాత్మికతను అందుకోవడం కూడా పెనుసవాలే అవుతుంది. ఎందుకంటే, పాత సంస్కారాలను తొలగించుకోవడం, నూతన సంస్కారాలను పెంపొందించుకునే సమయంలో అంతరంగంలో మహాభారతయుద్ధం జరుగుతుంది. ఆ పోరాటంలో అపజయం పాలైతే జీవితం తప్పక కుప్పకూలిపోతుంది. ఎవరైనా విజయం సాధించగలిగితే, విశ్వానికే విజేతలవుతారు. అందుకు బలమైన దృక్పథం వుండాలి. సంకల్పబలమే సత్యాన్ని బహిర్గతం చేస్తుంది. ఆనందామృతాన్ని చవి చూసిన ఏ వ్యక్తి అయినా విషం వైపుకు మళ్ళదు. ఎవరైనా ఆధ్యాత్మిక మార్గంలోనికి ప్రవేశించిన తర్వాత కూడా నిగ్రహాన్ని కోల్పోతున్నారంటే, వారికి ఆ మార్గంలో పట్టు లభించనట్లే. మాయావలయం నుండి బయటపడగలిగితేనే కొండ శిఖరానికి చేరగలుగుతారు. ఆధ్యాత్మికమార్గంలో పరిణతి చెందినట్లైతే, ప్రపంచాన్నే సమ్మోహితం చేయవచ్చు. సర్వశక్తులూ వ్యక్తి చుట్టూ పరిభ్రమిస్తూ వుంటాయి. ప్రతి సన్నివేశం, సంఘటన తనకు అపారమైన జ్ఞానసంపదను అందిస్తుంది. జ్ఞానపరంగా ఎదిగేకొలది ప్రకృతి సైతం పరవశించి రక్షణను కల్పిస్తుంది. ఎవరైనా అనంత వటవృక్షంగా మారితే, ఆ నీడలో కొన్ని వందల, వేల మొక్కలు ఆశ్రయాన్ని పొందుతాయి. ఆ విధంగా కొన్ని వేలమంది ప్రభావితులవుతారు. అట్టి స్థితిలో ప్రపంచమే మీకు దాసోహమంటుంది. మీ ఉనికే ప్రపంచానికి వరమవుతుంది. కుటుంబం పూర్తిగా ప్రేమాలయం అవుతుంది. వాక్శుద్ధి, సంకల్పశక్తి లభిస్తాయి. కాబట్టి, మీరు అనుసరించే మార్గాన్ని సులభతరం చేసుకోవాలి తప్ప, క్లిష్టంగా మార్చుకోకూడదు. కొండ శిఖరాన్ని చేరేంత వరకూ వేరే అంశాల వైపుకు దృష్టిని మళ్ళించకూడదు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో మీకు సంభవించే అవరోధాలు, ఆటంకాలు, అపజయాలు ఆశీస్సులవుతాయి. మీ ఎదుగుదలను చూసి అందరూ అసూయపడే విధంగా జీవితం కొనసాగుతుంది. మీతో సహచర్యం కోసం వేలాదిమంది పరితపిస్తూవుంటారు. కాబట్టి, సంపూర్ణ స్వేచ్ఛను పొందడమే జీవితలక్ష్యం కావాలి. మడమ తిప్పవద్దు, మాట తప్పవద్దు. ఇప్పుడే, ఇక్కడే బలమైన నిర్ణయం తీసుకొని, బంగారు భవిష్యత్తుకు పూలబాటను వేసుకోండి. శారీరక సుఖానికి–ఆనందానికి మధ్య వ్యత్యాసం తెలియకపోతే, వారు ప్రపంచానికి ఏ విధంగా న్యాయం చేయగలుగుతారు? ఆనందమనేది మీ అంతరంగంలోనే వుంది. అసలు మానవుడే సచ్చిదానంద స్వరూపుడు. దాని కోసం బయట ప్రపంచంలో ఎటువంటి అన్వేషణ చేయనవసరం లేదు. విచక్షణతో జీవించే వ్యక్తికి మాత్రమే ఈ సత్యం అవగాహన అవుతుంది. అది లేని వ్యక్తి ఆనందం కోసం బాహ్యప్రపంచంలో పరుగులు తీస్తూంటాడు. ఆనందం లేనిచోట ఆనందాన్ని వెతకడమంటే, దానిని ఏమంటారు? అజ్ఞానం కాదా? అజ్ఞానంలో జీవించేవారు ఏ విధంగా న్యాయం చేయగలుగుతారు ప్రపంచానికి? అందుకే గమనించండి, రోజురోజుకూ సమస్యలు పెరుగుతున్నాయే తప్ప తగ్గటం లేదు. సమస్యలతో జీవించే వ్యక్తి సమస్యలనే అందించగలడు గానీ, పరిష్కారాన్ని చూపలేడు. అందుకు విచక్షణ అనే అంశమే వ్యక్తిని సమూలంగా మారుస్తుంది. అది లేని వ్యక్తి తాను బలహీనపడి, ఇతరులను బలహీనపరుస్తాడు. తన అంతరంగంలో వున్న చెడునే

అంతటికీ ప్రసరింపచేస్తాడు, జీవితాన్ని నరకకూపంలోనికి మళ్ళించుకుంటాడు. అలాకాక, ఎవరైతే ఆధ్యాత్మిక మార్గాన్ని ఎన్నుకొని, దానిలో పట్టు సాధించేంత వరకూ తన దృష్టిని వేరే అంశాల మీదకు మళ్ళించకుండా క్రమం తప్పకుండా సాధన చేస్తారో, వారిలో విచక్షణ వున్నట్లే, అనుమానమే లేదు. కొందరిని గమనించండి. మంచి మార్గాన్ని ఎన్నుకున్నప్పటికీ, మధ్యలో దాని నుండి విరమించుకుంటున్నారంటే, వారు విచక్షణను కోల్పోయినట్లే. అసలు తనను గురించి తాను తెలుసుకోకుండా ప్రపంచాన్ని, అందలి మనుషులను గురించి ఆలోచించడమంత మూర్ఖత్వం మరేముంటుంది అన్నది ఈ ఆంజనేయుని ప్రశ్న. తెలిసిన జవాబునివ్వండి!

***కాలం కాలసర్పమై బుసలు కొట్టినా, పరిస్థితులు పగబట్టి చెరబట్ట చూసినా,***
***అయినవాళ్ళే ఏమీ కానట్టు మొఖం చాటుచేసినా,***
***నిమ్మకు నీరె త్తినట్లే వుండాలి.***
***ప్రతికూల పవనాలు ప్రచండ వేగంతో వీస్తుంటే, చిరుమొక్కలా తలవంచాలి.***
***మహిషి తత్త్వం ఎల్లెడలా విజృంభించినా, మనిషి మనిషితత్త్వాన్ని ఎప్పుడూ వదులుకోకూడదు.***
***మనిషి మనిషిలానే వుండాలి, మనిషిలాగే బ్రతకాలి, మనిషి తత్త్వాన్ని మహిలో చాటాలి.***
***జీవన గమనాన, మనసు వీణపై ఒలికిన ఆశయాల ప్రతిరూపాలకు***
***అహర్నిశలూ సహకరిస్తూ, ఏకాంతానికి చేరువై, జ్ఞానోద్దీపన దిశలో సాగి,***
***ఈ ఆంజనేయునితో శాశ్వత బంధమేర్పర్చుకొని,***
***ముందు తరాలవారికి దీపకళికలుగా, జీవన సాఫల్యానికి చిరునామాగా మారండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

దేవుడు వరాలనే ఇవ్వడు, శాపాలను కూడా ఇవ్వడు.
అవకాశాలను మాత్రమే ఇస్తాడు.
వానిని వరాలుగా మార్చుకోవడమే మీ విధి!

ॐ

**17-01-2020** 09:15 AM

**27)** ఆత్మ అనగా ఏమిటి స్వామి?

అంతరాత్మను తెలుసుకోవటానికి ఒకే ఒక మార్గముంది. అది అంతరాత్మ విషయంలో నిరంతరం జిజ్ఞాస కలిగి వుండటం. ఈ విషయంలో ఎంత శ్రద్ధ కలిగి వుంటారో, అంతగా దాని లోతులను తెలుసుకుంటారు. మీరు ఆత్మ విషయంలో నిరంతరం జిజ్ఞాస కలిగి వుండండి. ధ్యానం ద్వారా మీ ఆత్మను పరిచయం చేసుకుంటే, దాని మాటలు వినగలిగితే, అది చేసే మార్గనిర్దేశాన్ని అనుసరిస్తే మీరు అజ్ఞానం నుంచి విముక్తులవుతారు. సామాన్యంగా బాహ్యమును మాత్రమే చూస్తూ, వింటూ, అర్ధం

చేసుకుంటూ వుండే మనిషి జ్ఞాని కాజాలడు. కానీ, అతడు నిజమైన జ్ఞాని అని భావించడం జరుగుతుంది. అందుకు కారణం భ్రమ. నిజమైన జ్ఞానం కానిదానిని జ్ఞానమని తలుస్తూ, దానిని అనుసరించి కార్యాలను ఆచరిస్తూపోవడం వల్లనే, మనిషి తన అసలు లక్ష్యమైన సుఖశాంతుల వైపు కాక, వాటికి విరుద్ధమైన వాటివైపు నడుస్తాడు. నిజమైన జ్ఞానానుభవం కలిగినది, మనిషి అంతరాత్మ. అది శుద్ధము, బుద్ధమునైన స్వయం చేతన కనుక, దానికి అజ్ఞానమన్న చీకటి అంటుకోదు. అది పరమాత్మ యొక్క అంశ. కనుక, పరమాత్మ వలెనే సదానందమయము. పరమాత్మ సన్నిధిలో అసత్యముండటం అసంభవం. అదే విధంగా, పరమాత్మ అంశ అయిన ఆత్మలో అసత్యం ప్రవేశించడమన్నది కుదరదు. మనిషి అంతరాత్మ దేనిని చూస్తుందో, దేనిని వింటుందో, దేనిని అర్థం చేసుకుంటుందో అదే సత్యం. అదే నిజమైన జ్ఞానం. అంతరాత్మ చెప్పుచేతలకు బద్దుడైనవాడే సత్యాన్ని చూడగలుగుతాడు, నిజమైన జ్ఞానాన్ని పొందగలుగుతాడు. అలాంటి మనిషికి సుఖదుఃఖాల వంటి ద్వంద్వాలు సహజంగా సమసిపోయి, సమస్థితి కలుగుతుంది. వెలుతురున్న చోట వెలుగు, జ్ఞానరాహిత్యమే దుఃఖం. దుఃఖానికి తనదంటూ ఒక మూలభూతమైన ఉనికి లేదు. అంతరాత్మను వినటం, పాటించడం అనుశాసనం.

**28) అంతరాత్మ వాణి వినగలమా స్వామి? అది ఎలా సాధ్యము స్వామి?**

మనిషి అంతరాత్మ మాట్లాడుతుంది. కానీ, దాని మాట మీ మాటవలే స్థూలంగా వుండదు. శబ్దంతో కూడి వుండదు. అది సూక్ష్మాతిసూక్ష్మంగా వుంటుంది. బాహ్యములు, స్థూలములు అయిన చెవులతో దానిని వినటం కుదరదు. మనిషి అంతరాత్మ మాట్లాడుతుంది. కానీ, మౌనమైన ఆలోచనల స్ఫురణకు చెందిన భాషలో మాట్లాడుతుంది. కోలాహలంతో నిండిన తన మానసికస్థితిలో, మనిషి దాన్ని వినలేడు. అంతరాత్మ వాణిని వినాలంటే, మనిషిలోని మానసికస్థితిలో మనిషి దాన్ని వినలేడు. అంతరాత్మ వాణిని వినాలంటే, మనిషిలోని మానసిక కోలాహలం ఆగిపోవాలి. అంతరాత్మ సాన్నిధ్యం మనిషిని దాని మాటలు వినగలిగేటట్లు చేస్తుంది. నిజానికి మనుష్యునిలో అంతరాత్మ, సర్వకాలాల్లోనూ వుండనే వుంటుంది. కానీ, ఆ విషయాన్ని తెలుసుకోవటానికై మనిషికి దానితో సన్నిహిత పరిచయం ఏర్పడాలి. దానికి సంబంధించిన జ్ఞానం కలగాలి. నిజానికి మనిషి తన అంతరాత్మ వాణిని మనసు చేసే కోలాహలంలో వినలేకపోతాడు. మనసు స్వభావం గెంతులు, అరుపులతో నిండి వుంటుంది. మనిషి అంతరాత్మ శాంతంగా, నిశ్చలంగా వుంటుంది. అది మనసువలే కోలాహలం చేయదు, ఎగుర్లాటలు చేయదు. ఈ చంచలత్వం వల్లనే మనిషి మనసు అతని అంతరాత్మను వెనుకకు తొక్కి, మనిషికి పనికిరాని ప్రేరణలనిస్తూ వుంటుంది. తీవ్రస్వరంతోనూ, తీవ్ర ఆదేశాలతోనూ మనసు మనిషిని తనకు లోబరచుకొని, తనకు దాసుడ్ని చేసుకుంటుంది. కానీ శుద్ధమూ, బుద్ధమూ, శాంతమూ అయిన ఆత్మ మాత్రం, మనిషిని ఆ విధంగా తయారుచేయదు. మనసు చేసే కోలాహలానికి చెవులు మూసుకునే గుణం వుండాలి. అంతరాత్మ జిజ్ఞాసువుకు ఆ పద్ధతిని అభ్యాసం చేయాలి. అంతరాత్మ ఆదేశాలను విని పాటించడం ప్రారంభించిన రోజు నుండి మనిషి నిజమైన సుఖాన్ని, శాంతిని పొందటానికి అర్హుడవుతాడు, అధికారి అవుతాడు. తీవ్రమైన జిజ్ఞాస వల్ల, మనిషి చెవి, ఆ తన్మయత్వాన్ని అతి తేలికగా పొందగలుగుతుంది. అంతరాత్మ

ఆదేశాల్ని తేలికగా వినటానికి ఆ తన్మయత్త్వం సహాయపడుతుంది. మనిషికి నిజమైన మిత్రుడు ఆత్మయే. అది ఎల్లప్పుడూ మనిషిని మంచిమార్గంలో నడవమని, చెడుమార్గం విషయంలో జాగ్రత్తపడమని హెచ్చరిస్తుంది. కానీ, మనసు చేసే కోలాహలంలో మునిగిపోయిన మనిషి, దాని హెచ్చరికలను పట్టించుకోడు. అదే మిక్కిలి చింతించవలసిన విషయం. మనిషి నిజంగా దాన్ని వినదలుచుకుంటే, దాని మీదే ధ్యానం నిలిపితే వినగలుగుతాడు. ఎన్ని కంఠస్వరాల చప్పుడున్నా, శిశువు తన తల్లి కంఠస్వరాన్ని అతి తేలికగా గుర్తుపడతాడా లేదా? అంతరాత్మ, మనిషి నిజమైన మిత్రుడని గ్రహించాలి. అది సదా మనిషి శ్రేయస్సునే కోరుకుంటుంది, అతని ఉన్నతినే కోరుకుంటుంది. అయినప్పటికీ, అది మనిషికి ప్రత్యక్షంగా కనబడదెందుకు? చాటుమాటుల్లో దాగుతుందేమిటి? అన్న ప్రశ్న ఏ మనిషి మదిలోనైనా పుట్టవచ్చు. మనిషి విశృంఖలంగా ప్రవర్తించే మనస్సు యొక్క ప్రేరణతో నడచినంతవరకూ అటువంటి మార్గంలోనే ముందుకు సాగుతాడు. ఆ మార్గం సుఖదుఃఖాలు, శోకసంతోషాలు అన్న ముళ్ళతో నిండి వుంటుంది. అంతరాత్మవాణిని వినలేని స్థితిలో వుంటుంది. ఆత్మ ఎల్లప్పుడూ ప్రత్యక్షంగా కనబడుతూనే వుంటుంది కానీ, మనిషి దానిని చూడలేకపోతున్నాడు. దానిని చూడలేకపోవటం మనిషి చూపులో గల దోషం. నిత్యం మనిషికి సూర్యుడు ప్రత్యక్షమే. కానీ, సూర్యునికి – మనిషి చూపుకి మధ్యలో మేఘం ఏర్పడినప్పుడు సూర్యుడు మనిషి కళ్ళకు కనబడడు. అదే విధంగా, మనిషికి – అతని ఆత్మకు మధ్య మనసు యొక్క ప్రాధాన్యం అన్న తెర వుంటుంది. మనిషి మనసు యొక్క ప్రాధాన్యాన్ని కాదనగలిగితే, తప్పకుండా అతని అంతరాత్మ వెలుతురువలే అతని ముందు వెలుగుతుంది. అదే మానవజీవితానికి పరమసార్థకత. వాస్తవానికి మనిషి పొందవలసింది, తెలుసుకోదగింది, ఉపాసించదగినది, సాధించదగినది ఇదేనన్నది ఈ ఆంజనేయుని భావము యొక్క సారం.

***ఏమీ తెలియని మనస్సుకి అన్నీ తెలుసుకోవాలన్న ఆరాటం. కానీ, కంగారు పడకండి!***
***ఈ ఆంజనేయుడు అతి లాలనతో మిమ్ము పాలించుటకై ఒసగే దీనిని***
***కష్టంగా, బాధగా స్వీకరించకండి - ఇది మీ ఔన్నత్యానికే***
***బంగరు తల్లులారా! తండ్రులారా!***
***ఏం మాట్లాడుతున్నారో, ఎవరితో మాట్లాడుతున్నారో చూసుకోండి***
***ఎక్కడైనా నవ్వండి. కానీ, ఎవరి ముందు నవ్వుతున్నారో తెలుసుకోండి***
***ఎప్పుడైనా నవ్వండి. ఏ కారణంగా నవ్వుతున్నారో యోచించండి***
***ఎవరినైనా నమ్మండి. కానీ ఏ విధంగా నమ్ముతున్నారో ఆలోచించండి.***
***ఎవరితోనైనా స్నేహం చేయండి. వారు ఆడా, మగా అని కాదు,***
***పరిచయం వేరు, స్నేహం వేరు అని తెలుసుకోండి.***
***ట్రెండీగా వుండండి - ట్రెడిషన్ మరచిపోకండి***
***కట్టుబాటంటే అది మిమ్మల్ని కట్టిపడవేసేది కాదు, అది మీ రక్షణగోడ అని అర్థం చేసుకోండి.***
***కెరటాలెన్ని పొంగినా చింతలేదు - అది చెలియలికట్ట దాట రాదు.***
***ఇవన్నీ మనసు వంతెనను ఒడ్డికగా దాటడానికి చిట్కాలని తెలుసుకోండి.***

***ఈ చిరంజీవి అందిస్తున్న అనుభూతులు, అనుభవాలు తప్పనిసరిగా పాటించి,***
***పావనమైన మార్గాన్ని అవలంబించి, అంతులేని ఆధ్యాత్మిక అందాలను సొంతం చేసుకుని,***
***సొగసుగా జీవితాన్ని, దాని లోతుల్ని మథించగలిగితే అమృతపు వెన్న లభిస్తుంది.***
***అంధకారపు దుప్పటిని తొలగిస్తే, ఆంజనేయుడు అభిముఖంగా మీ ముందు నిలుస్తాడు***
***నా ఈ చిన్నారి బిడ్డలను దీవించుటకై***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

*అంతరంగం పవిత్రంగా వుంటే, ఆచరణ అర్థవంతంగా వుంటుంది.*
*అందుకే, అంతరంగాన్ని శుద్ధి చేయండి*
*చేసుకోగలగాలి!*

ॐ

**18-01-2020** 08:45 AM

**29) అనన్యభక్తి అంటే ఏమిటి స్వామి?**

*అనన్యయోగం నిజంగా ఇదే అన్నింటి కన్నా ముఖ్యం. అన్యమైన వాటికి మనసులో తావు ఇవ్వకుండా, కేవలం ఒక్క భగవంతునికే స్థానం ఇవ్వాలి. ఇదే అనన్యయోగం. కర్మయోగం, భక్తియోగం, జ్ఞానయోగం, ధ్యానయోగం, సాంఖ్యయోగం, విజ్ఞానయోగం, విభూతియోగం అనే యోగాలున్నాయి గానీ, అనన్యయోగమనే పేరు వినలేదని మీరనవచ్చు. నిజానికి ఇది ఒక ప్రత్యేకమైన యోగం కాదు. అయితే, ఇది కలిస్తేనే, ఏ యోగానికైనా రాణింపు. ఏ యోగాన్ని ఆచరించినా, అనన్యమైన చిత్తంతో ఆచరించాలి. అన్యము అంటే ఇతరమైనది. అనన్యము అంటే ఇతరము కానిది, ఇతరమైనవి లేనివి. కనుక, ఇతర ఆలోచనలు లేకుండా ఒక్కదాని మీదనే దృష్టిని నిలిపి, ఏ పనినైనా చేసినప్పుడు, అనన్యయోగంతో చేసినది అంటారు. అప్పుడే ఆ పనిని సక్రమంగా నెరవేర్చడం కుదురుతుంది. అంటే, భక్తి కూడా ఇతరమైన దేనిమీదా లేకుండా ఒక్క భగవంతుని మీదనే మనసును నిలపాలి. అదే అనన్యభక్తి, అనన్యయోగం. ఇప్పుడిక్కడ నేను చెప్పే విషయాలను వింటున్నారు. మీ మనసు ఏ ఇతర విషయాన్నీ ఆలోచించకుండా కేవలం ఇక్కడ చెప్పే విషయం మీదనే వుంటే, అదే అనన్యయోగం అవుతుంది. ఈ అనన్యయోగాన్ని భక్తిపరంగానూ, జ్ఞానపరంగానూ చెప్పుకోవచ్చు. నారదుడు తన భక్తిసూత్రాలలో ఒక సూత్రాన్ని ఇలా చెప్పారు. "అన్యాశ్రయానాం త్యాగో నన్యతా". అంటే, అన్యమైన వాటిని ఆశ్రయించకుండా వుండటమే అనన్యయోగం అని. ఎవరికి అన్యమైన వాటిని? అంటే, భగవంతునికి అన్యమైన వాటిని విడిచిపెట్టాలి. ముంచినా తేల్చినా భగవంతుడొక్కడే తనకు ఆశ్రయం, తనకు దిక్కు భగవంతుడు తప్ప ఎవ్వరినీ, దేనినీ ఆశ్రయించేది లేదు. ఇదే అనన్యత, అనన్యయోగం. మరి మీరు ఎటువంటి భక్తులు? అనన్యభక్తులేనా? ఆలోచించండి! ఇళ్ళూవాకిళ్ళు, ఆస్తిపాస్తులు, నగలూనాణేలు, ధనధాన్యాలు అన్నింటినీ సంపాదించుకుంటూ, కూడబెట్టుకుంటూ, రక్షించుకుంటూ, ఏదో కొద్దిసేపు భగవంతుడున్నాడని, ఆయన్ని పూజిస్తే ఇంకా బాగా*

కలసివస్తుందని చేసే పూజ అనన్యమైనదేనా? భోజనం చేస్తూ మధ్యమధ్యలో అప్పడం కొరికినట్టు, ఉల్లిపాయ నంజుకున్నట్టు మీరు కూడా అప్పుడప్పుడు భగవంతుడు, భక్తి అంటారు. ఇంకెవరినైనా ఆశ్రయిస్తే ఇంకా గొప్ప లాభం కలుగుతుంది అనుకున్నప్పుడు, ఈ దేవుణ్ని వదిలి ఆ దేవుణ్ని పట్టుకుంటారు. మీ సొంత పనులు గనుక అడ్డువస్తే భగవంతుడూ లేదు, భక్తీ లేదు – అన్నీ వదులుకుంటారు. పూజ చేయటానికి కూర్చుంటారు. టీ.వీ.లో మంచి సినిమా వస్తుంటే, “ఆ... ఈ పూజను ఆపి, తర్వాత చేసుకోవచ్చు. దేవుడెక్కడికి పోతాడు?” అని పూజను ఆపి సినామా కోసం టీ.వీ. ముందుకు వచ్చి కూర్చుంటారు. “నిన్న రాలేదేం?” అని అడిగితే, “వద్దామని బయలుదేరానండి. అదే సమయానికి మా ఫ్రెండ్ వచ్చాడు. వాడితో మాట్లాడుతూ వుంటే, టైమ్ అయిపోయింది” అంటారు. అంటే, వేదాంతం కోసం ఫ్రెండ్‌ను వదులుకోలేరు – ఫ్రెండ్ కోసం వేదాంతాన్ని వదిలివేశారు, నన్ను వదిలివేస్తారు. భగవంతుని కోసం మీ కర్మలను వదలటం కాదు, మీ పనుల కోసం భగవంతునికి టాటా చెప్పేస్తారు. ఇదీ మీ భక్తి–అన్యభక్తి! మీరు నిజంగా భగవంతుని ఆశ్రయంతో బ్రతుకుతున్నారు. అప్పుడప్పుడూ అంటూ వుంటారు, “ఏదో అంతా ఆ భగవంతుని దయండి!” అని. “ఆయన దయవల్లనే ఏదో కడుపునిండా తినగలుగుతున్నాము” అని. అలా అంటారే గాని, నిజంగా ఆ భావన మీలో వుందా? లేదు. ఏదో ఫ్యాషన్ కోసం అంటారు. అలవాటుగా అంటారు. ఊతపదంగా అంటారు. ఇలా భగవంతుని దయ అన్న మీరే, ఎవరైనా దూరపు బంధువు కనిపించి అంతా బావున్నారా? ఇప్పుడేమి చేస్తున్నారు? అని అంటే, అమ్మాయి పెళ్ళి చేసేశాను. అబ్బాయిలిద్దరికీ ఉద్యోగాలు వేయించాను. పెద్దవాడికి పెళ్ళి చేశాను, ఇక రెండోవాడికి పెళ్ళి చెయ్యాలని చూస్తున్నాను. పాత ఇల్లు పడేసి, క్రొత్త ఇల్లు కట్టించాను. ఇద్దరబ్బాయిలకు రెండు ఇళ్ళు కొని, వారి పేరున పెట్టేశాను. ఇక వృద్ధాప్యంలో వీళ్ళ మీద ఆధారపడకుండా 15 లక్షలు బ్యాంకులో వేసుకున్నాను. ఇక వాళ్ళు చూసినా, చూడకపోయినా ఫరవాలేదు... అంటారు. అన్ని జాగ్రత్తలూ మీరే పడితే, అన్ని తెలివితేటలు మీకే వుంటే, అన్నీ మీ చేతుల్లోనే వుంటే, ఇంక భగవంతునిదేముంది? ఆయన దయతో పనేమిటి? అంతా మీ ప్రతిభయే కానీ, భగవంతుని దయ ఎక్కడుంది? కనుక, అది అలవాటుగా పలికే మాటయే గాని, హృదయపూర్వకంగా నమ్మిన మాట కాదు. ఎవరన్నా తెలిసిన వారిని ఎలా వున్నావు? ఎలా జీవనం సాగిస్తున్నావు? అంటే, పొలాలున్నాయి కదా అంటారు, వ్యాపారం వుంది కదా అంటారు, ఉద్యోగం వుంది కదా అంటారు, పెన్షన్ వస్తుంది గదా అంటారు, అద్దెలు వస్తున్నాయి కదా అంటారు, కొడుక్కి జీతం వస్తుంది గదా అంటారు, ఆశ్రమం వుంది కదా అంటారు – కానీ, భగవంతుని ఆశ్రయంలో బ్రతుకుతున్నానని చెప్పేవాడే వుండడు. నిజంగా భగవంతుని దయ, ఆశ్రయం లేకపోతే, ఒక్క క్షణం జీవించగలరా? మీరు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, భగవంతుడు కళ్ళు తెరిస్తే, ఒక్క క్షణం పట్టదు అన్ని ఆశలు పేకమేడలుగా కూలిపోవటానికి. భూకంపాలు వచ్చినప్పుడు ఇళ్ళూవాకిళ్ళు, బ్యాంకులు, స్కూళ్ళు, మనుష్యులు, పిల్లలు, తిరిగి చూచేటప్పటికి లేరు. నిర్భాగ్యులుగా మిగిలిన కొద్దిమంది తప్ప ఏమీ వుండదు. మీ మేడలు, మీ పొలాలు, మీ నగలు, మీ బ్యాంక్ బ్యాలెన్స్‌లు, మీ పదవులు ఏమీ మీకు కూడు బెట్టవు. ప్రభుత్వంవాళ్ళు హెలికాప్టర్ నుండి వదిలే ఆహారపొట్లాల కోసం యుద్ధం చేసి, దక్కించుకుంటే తప్ప, మీకు గతి ఏమిటి? కోట్లున్న వాడివైనా,

ఆకలితో నకనకలాడాల్సిందే. భగవంతుని దయ లేకపోతే, ఏమీ లేనివాడివే. నేను చెబుతాను, మనిషి బ్రతుకుతున్నది ఆహారం వల్ల కాదు, దేవుని దయవల్ల అని. మనిషి ప్రాణ–అపానాల వల్ల జీవించడం లేదు, ప్రాణానికి ప్రాణమైన భగవంతుని వల్ల జీవిస్తున్నాడు. కానీ, మనిషి మాత్రం అవిశ్వాసి, అల్పవిశ్వాసి. భగవంతుడ్ని మాత్రం పూర్తిగా నమ్మడు. భగవంతుడే దిక్కని శరణాగతి చెందడు. ఆయన మీదనే భారం వెయ్యడు. అనన్యయోగంతో నమ్మడు. నిజమైన భక్తుడికి ఇతర విషయాలన్నీ అల్పమైనవి. తనకు వచ్చే కష్టాలు కూడా అల్పమైనవే. భగవంతుడొక్కడే తనకు ఆధారం, ఆయనే ఆశ్రయం. పాలముంచినా, నీటముంచినా భారం నీదేనంటాడు. భగవంతుని కోసం దేన్నైనా వదులుకుంటాడు. ఎన్ని అవమానాలనైనా భరిస్తాడు, ఎన్ని కష్టాలనైనా అనుభవిస్తాడు. అటువంటివారు ఈ ఆంజనేయునికి కావాలి. ఎందుకంటే, ఈ ఆంజనేయుడు జీవిస్తున్న విధానం అదే కనుక. అందుకే చెప్పాను, ఒక్కసారి నన్ను ఫాలో అయితే, మీ డౌట్స్ అన్నీ ఎబౌట్స్ అవుతాయని.

***భగవంతుని నామం విశ్వమంతా పరివ్యాప్తమైంది***
***తనను స్పర్శించే వారిపై అపారమైన కరుణను కురిపిస్తుంది***
***తనను నమ్మిన వారికి విజయాల మాలను అందిస్తుంది***
***జీవన గమనాన తనను అంటిపెట్టుకున్న వారికి శాశ్వత సౌభాగ్యాన్నిస్తుంది***
***నిరాశానిస్పృహలను భగ్నం చేస్తుంది***
***మనసువీణపై ఒలికిన రాగాలను సమన్వయం చేసి, కీర్తి సుసంపన్నం చేస్తుంది***
***అలసిన మనసుల భావోద్వేగాలకు, ఆవేదన అంతర్మథనాలకు, ఆవేశపు అణ్వస్త్రాలకు,***
***అనురాగపు ఆప్యాయతా జల్లులకు, ఆకాంక్షల కార్యాచరణకు, ఆశయాల ప్రతిరూపాలకు,***
***అహర్నిశలూ సహకరిస్తూ, తాను తేలికయై,***
***ఎన్ని బరువులను, భావోద్వేగాలను తనదిగా చేసుకుని, ఏకాంతానికి చేరువ చేసి,***
***తాత్కాలిక బంధాలు ప్రతిబంధకాలైనా, శాశ్వతబంధాన్ని పెనవేసి***
***కమలానికి సూర్యుడు, కలువకు చంద్రుడు, మనిషికి నామమే వికాసం***
***నామమంటే,***
***మస్తిష్కాలను రగిలించే నెగడు, పదుగురికీ పరోపకారి***
***పవనపుత్రుని మాట ముత్యాలసరాలు***
***వాటిని ధరించినవాడు ఒక వెలుగై వెలుగొందుతాడు***
***ఆ వెలుగు కిరణాలు మీరే ఎందుకు కాకూడదు***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా?***

మధురభాషణ అంటే మాటలు కాదు, మనసు అమృతంవలె వుండాలి.
అప్పుడు వాక్కులు కూడా అమృతమవుతాయి!

ॐ

**19-01-2020** 09:10 AM

## 30) నేటి విద్యావిధానం ఎలా ఉంది స్వామి?

*రాజుగారి తోటలో ఒక చిలుక వుండేది. చక్కగా పాడేది, స్వేచ్ఛగా ఎగిరేది కానీ చదవలేకపోయేది. ఒకరోజు అది రాజుగారి కంట్లో పడింది. వెంటనే మంత్రిని పిలిచి ఈ చిలుకను, "ఎడ్యుకేట్ ఇట్!" అని ఆదేశించాడు. దాన్ని ఎడ్యుకేట్ చేసే బాధ్యతను రాజుగారి మేనల్లుడి మీద వుంచాడు మంత్రి. అయితే, ఆ చిలుకను ఎలా ఎడ్యుకేట్ చేయడం? దానిని గురించి విద్యావేత్తలు కూర్చుని తీవ్రగా ఆలోచించారు. చిలుకకు చదువు చెప్పాలంటే మొదట అది కుదురుగా వుండాలి. అంటే అది ఎగురకూడదు. వెంటనే ఒక మంచి పంజరం చేయించారు. చిలుకను అందులో కూర్చోబెట్టారు. కోచింగ్ ఇవ్వడానికి ఒక పండితుడు వచ్చాడు. చిలుకను చూశాడు. ఈ చిలుకకి ఒక్క పుస్తకం సరిపోదు అన్నాడు. గుట్టలకొద్దీ పుస్తకాలు వచ్చేశాయి, గంటలకొద్దీ చదువు మొదలైంది. పంజరం చూడ్డానికి వచ్చిన వాళ్ళెవరూ అబ్బా! భలే చిలుక అనటం లేదు. అబ్బా! ఏం పంజరం అంటున్నారు. లేదంటే అబ్బా! ఏం చదువు? అంటున్నారు. రాజుగారిని మెచ్చుకుంటున్నారు. మంత్రిగారిని ప్రశంసిస్తున్నారు. రాజుగారి మేనల్లుడిని, పంజరం తయారుచేసిన కంసాలిని, చదువు చెప్పటానికి వచ్చిన పండితుడ్ని ఆహా, ఓహో అని కీర్తిస్తున్నారు. రాజుగారు మంత్రిగారికి మరలా ఒకసారి చెప్పారు. ఎన్ని లక్షల వరహాలు ఖర్చైనా ఫరవాలేదు. చిలుకకి బాగా చదువు రావాలి. మంచి మేనర్స్ కూడా రావాలి. అలాగే అని, లక్షల వరహాలు దఫదఫాలుగా కోశాగారం నుంచి తెప్పించారు మంత్రిగారు. సెమిస్టర్లు గడుస్తున్నాయి. ఓ రోజు రాజుగారికి చిలుక ఎలా చదువుతోందో చూడాలనిపించింది. వెంటనే ఏర్పాట్లు జరిగాయి. చిలుకను చూడటానికి రాజుగారు వస్తున్నారహో అని తప్పెట్లు, తాళాలు, పెద్దపెద్ద శబ్దాలు చేసే బూరలతో ఒక్కటే హోరు. రాజుగారి పరివారమంతా రాజు కన్నా ముందే చిలుక దగ్గరకి చేరిపోయింది. అయితే పంజరంలోని చిలుకను ఎవరూ పట్టించుకోవడంలేదు. ఎవరూ దానివైపు చూడటంలేదు. పండితుడొక్కడే చూస్తున్నాడు. ఆయనైనా చిలుక సరిగ్గా చదువుతుందా లేదా అని చూస్తున్నాడుతప్ప, చిలుకెలా వుందో చూడటంలేదు. చిలుక బాగా నీరసించిపోయింది. మానసికంగా బాగా అలసిపోయివుంది. ఆ రోజైతే రాజుగారి సందర్శన ధ్వనులకు చిలుక సగం చచ్చిపోయింది. తర్వాత కొద్ది రోజులకే పూర్తిగా ప్రాణం విడిచింది. ఆ సంగతి ఎవరికీ తెలీదు. తెలిసినవాళ్ళు ఎవరికీ చెప్పలేదు. ముఖ్యంగా రాజుగారికి చెప్పలేదు. రాజుగారు మేనల్లుడ్ని మళ్ళీ పిలిచి, చిలుక ఎలా చదువుతోంది? అని అడిగాడు. చిలుక స్టడీస్ కంప్లీట్ అయ్యింది అన్నాడు మేనల్లుడు. రాజుగారు సంతోషించారు. తన కృషి ఫలించిందన్నమాట. ఇప్పటికీ అల్లరిచిల్లరగా ఎగురుతోందా? అన్నారు రాజుగారు. ఎగరదు అన్నాడు మేనల్లుడు. ఏ పాటపడితే ఆ పాట పాడుతోందా? అన్నారు రాజుగారు. పాడదు అన్నాడు మేనల్లుడు. సరే, చిలుకను నా దగ్గరకు తీసుకురా అన్నారు రాజుగారు. చిలుకను తీసుకువచ్చారు. చులుక నోరు తెరవటంలేదు. ఒక్క మాట కూడా మాట్లాడటంలేదు. చిలుక కడుపు ఉబ్బెత్తుగా వుంది. చిలుక అసలు కదలనే కదలటంలేదు. ఆ కడుపులోనిది ఏమిటి? అని అడిగారు రాజుగారు. జ్ఞానం మామయ్యా! అని చెప్పాడు మేనల్లుడు. చిలుక చనిపోయినట్లు వుంది గదా*

అన్నారు రాజుగారు. చిలుక చదివిందా లేదా అన్నదే నా బాధ్యత. చచ్చిందా, బ్రతికిందా అని కాదు అన్నట్లు చూశాడు మేనల్లుడు. ఇప్పటి మీ విద్యావిధానానికి సరిపోతుందా? ఆలోచించండి!

***అహంకారంపై మమకారం - సంస్కారానికి వుండదు ఆస్కారం***
***అధికారం అండగా, అహంకారం నిండుగా, తలబిరుసుతనం దండిగా వుంటే,***
***తప్పవు తిప్పలు మెండుగా!***
***నడమంత్రపుసిరులు రావంగా, మీరు మిడిసిపాటు పడంగా,***
***వస్తుసంపదలు తోడుగా మమతా సమతలకు దూరంగా***
***అహంకారం వదులుకుంటే, అహింసకు అది నాంది ఆనందానికి నిలయం***
***స్వాగతించండి సోదరభావాన్ని, వదులుకోండి అహంకారాన్ని***
***పరోపకారంతో అహంకారం కరుగుతుంది, మానవత్వం విరయబూస్తుంది***
***మనోనేత్రం వెలుగుతుంది, వెలుగుకిరణాలు వెదజల్లుతుంది***
***శాంతి సౌఖ్యాలు విరజిల్లుతాయి, మనిషిలో మాధవుడు కొలువుతీరుతాడు***
***మనస్సు, మమతల కోవెలవుతుంది!***
***మారుతి మాటలు మనశ్శాంతికి, విశ్వశాంతికి దారి చూపగా***
***జైజై హనుమాన్ అంటూ, వదులుకోండి అహంకారాన్ని అతిత్వరగా***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

*మూడు ముఖ్యవిషయాలు చెబుతాను.*

*నాలుక, కోపం, కోరిక ఈ మూడింటినీ అదుపులో వుంచుకోవాలి.*
*గురువు, తల్లిదండ్రులు, దైవం ఈ ముగ్గురినీ గౌరవించాలి.*
*పవిత్రత, నిజాయితీ, కఠోరశ్రమ ఈ మూడింటినీ అలవర్చుకోవాలి.*
*సోమరితనం, అబద్ధం, పరనింద ఈ మూడింటినీ విడిచిపెట్టాలి.*
*ధైర్యం, కీర్తి, ప్రశాంతత ఈ మూడింటి కోసం పాటుపడాలి.*
*వాగ్దానం, స్నేహం, వాత్సల్యం ఈ మూడింటినీ నిలబెట్టుకోవాలి.*
*మాట, నడవడిక, పని ఈ మూడింటినీ నిరంతరం నేర్చుకోవాలి.*
*సత్ప్రవర్తన, దానగుణం, సేవ ఈ మూడింటినీ పెంచుకోవాలి.*
*ఈర్ష్య, అహంకారం, ద్వేషం ఈ మూడింటినీ లేకుండా చేసుకోవాలి.*

ॐ

**20-01-2020** 09:05 AM

**31) నేడు ఏర్పడుతున్న ఎన్నో వృద్ధాశ్రమాల గూర్చి మీ అభిప్రాయం ఏమిటి స్వామి?**

*"అక్కా! నీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలి. చేసేపని ఆపి వచ్చి ఇలా కూర్చో" అంటూ*

చిన్నకోడలు, పెద్దకోడలితో అంది. "ఏమైంది? అలా దిగులుగా వున్నావు? విషయమేమిటి?" అని అడిగింది పెద్దకోడలు. "ఏమీలేదు, గుండెజబ్బుతో అత్తయ్య చనిపోయి, 5 సంవత్సరాలైంది కదా. మామయ్యను అత్తగారే చూచుకునేవారు. ఇప్పుడు అన్నీ మనమే చేస్తున్నాం కదా. మనకూ పిల్లలు, సంసారం వున్నాయి. మామగారిని ఎన్ని రోజులని చూడగలం? అందుకని, నేను ఒక నిర్ణయానికి వచ్చాను" అన్నది చిన్నకోడలు. "ఏమిటది?" అని అడిగింది పెద్దకోడలు. మనమిద్దరం మన భర్తలను ఎలాగైనా ఒప్పించి, మామగారిని ఓ ఆశ్రమంలో చేర్పిద్దాము. అక్కడైతే, మామగారికి అన్ని సౌకర్యాలు వుంటాయి. ఈ వయస్సులో ప్రశాంతంగా వుండే అవకాశం వుంటుంది. ఈ రెండు ఇళ్ళల్లో మనం మన పిల్లలతో హాయిగా వుండవచ్చు" అంది చిన్నకోడలు. "దీనికి మన భర్తలు ఒప్పుకుంటారా? నాకైతే నమ్మకం లేదు" అంది పెద్దకోడలు. "మనం ఏదో ఒకటి చేసి ఒప్పించాలి. ప్రయత్నం చేయాలి" అంది చిన్నకోడలు. ఇద్దరూ ఈ విషయాన్ని తమ భర్తలతో చెప్పారు. వారు తండ్రిని ఆశ్రమంలో చేర్చటానికి ఒప్పుకోలేదు. తల్లి లేకపోయినా, తండ్రిని తమవద్దే వుంచుకుని సేవచేయాలన్నది వారి ఉద్దేశ్యం. కానీ, రోజూ భార్యల నస భరించలేక, ఇద్దరు కొడుకులు తండ్రితో ఇలా చెప్పారు. "నాన్నా! ఈ పిల్లల గొడవతో సమయానికి ఏమీ అందించలేకపోతున్నాము. మీకు కూడా వయస్సు అయింది. అమ్మ వున్నప్పుడు అన్నీ దగ్గర వుండి చూచుకునేది. దగ్గరలో మంచి ఆశ్రమం వుంది. మిమ్మల్ని అక్కడ చేరుద్దామని అనుకుంటున్నాము. మీరేమంటారు?" అన్నారు కొడుకులిద్దరూ. "నేను కూడా అదే ఆలోచిస్తున్నాను. ఎన్ని రోజులని నన్ను మీరు చూచుకుంటారు? మంచి విషయం చెప్పారు. పెట్టే బేడా సర్దుకుని బయలుదేరండి ఇద్దరూ" అన్నాడు తండ్రి. షాక్ కొట్టినంత పనైంది కొడుకులకు, నాన్న అలా అనేసరికి. "అదేంటి నాన్నా, అలా అనేశారు? మేము వెళ్ళడమేమిటి? బయట బాడుగలు పెట్టి మేము వేరు కాపురాలు ఎలాగ వెలగబెట్టాలి? ఆస్తిని మాకేగదా ఇవ్వాలి? ఆలోచించండి ఒకసారి" అన్నారు కొడుకులిద్దరూ. "నిజమే. మీకే ఇవ్వాలి నా ఆస్తిని. కానీ, మీ అమ్మ నేను, ఎంతో ఇష్టంగా కట్టుకున్న ఇల్లు ఇది. ఆమె బ్రతికివున్నన్నాళ్ళూ చాలా సంతోషంగా వున్నాము. ఆమెను తలచుకుంటూ, నేను ఈ ఇంట్లోనే కన్నుమూయాలి. నా తదనంతరం ఈ ఇల్లు మీకే. పైన ఇంటి బాడుగతో నేను ఎలాగోలా బ్రతికేస్తాను. బయలుదేరండి త్వరగా!" అన్నాడు తండ్రి. "అదేంటి మామగారు? ఊళ్ళో జనాలు ఏమనుకుంటారు? బయటకెళ్ళి అరకొర జీతాలతో ఎలా బ్రతకాలి? ఆలోచించండి" అన్నారు కోడళ్ళిద్దరూ. "ఊళ్ళో జనాలు మనకు ఎప్పుడూ వ్యతిరేకంగానే మాట్లాడుతారు. ఇల్లు నాది, ఇల్లు నా సొంతం. నా భార్య నాతో ప్రేమగా జీవించిన ఇల్లు. నేను పోయేదాకా ఇది నా సొంతం. నా గురించి ఆలోచించని మీరు జనాల గురించి ఆలోచిస్తున్నారు. నవ్వాలో ఏడవాలో తెలియటం లేదు. ఈ ఆలోచన మీదేనని నాకు తెలుసు. మరో దారి లేదు. మీకు ఇక్కడి నుండి వేరే కాపురానికి వెళ్ళడమే మంచిది. బయలుదేరండి" అంటూ తండ్రి చెప్పులు వేసుకుని గుడికి బయలుదేరాడు. షాక్‌తో తల దిమ్మెక్కింది ఈ కొడుకులకు, కోడళ్ళకు.

తల్లిదండ్రులను భారంగా అనుకోవద్దు. వారు మిమ్మల్ని బాధపెట్టకుండా ఆశ్రమాలకు వెళ్ళిపోతున్నారు. వారు ఇలా తిరగబడితే తప్ప గౌరవంగా బ్రతకలేరు. ఏమీ లేనివారి పరిస్థితి సరే.

ఆధారం వున్న తల్లిదండ్రులు, ఆస్తిపాస్తులు వున్న తల్లిదండ్రులు కూడా అనాథశరణాలయాల్లో వుంటున్నారు. వారు తప్పక తెలుసుకోవలసిన విషయం ఇది. తల్లిదండ్రులను బిడ్డల్లా కాపాడండి. చివరిదశలో వారిని చిత్రవధ చేయకండి. వారికంటే మించిన దేవుళ్ళు లేరని తెలుసుకోండి. ఎలాంటి అసూయాపరులైనా, ఎంత దుర్మార్గంగా ప్రవర్తించినవారైనా, ప్రేమ వారిని సాధిస్తుందే గాని, అసూయకు, ద్వేషమునకు అది వశము కాదు. బుద్ధుడు బాటసారియై నడుస్తున్న సమయంలో ఒక రాక్షసి హస్తంలో ఖడ్గం ధరించి, ఎదురుగా కన్పించింది. "బుద్ధా! నా అసూయకు ప్రేమ లొంగక తప్పదు. ఈ నాటితో నీ ప్రాణం అంతమైనట్లే" అన్నది ఆ రాక్షసి. అప్పుడు బుద్ధుడు చిరునవ్వు నవ్వి, "అసూయకు లొంగను, ద్వేషానికి వశుడను కాను, దూషణ, భూషణ, తిరస్కారాలను లెక్కచెయ్యను. నన్ను ద్వేషించే నిన్ను కూడా ప్రేమిస్తున్నాను" అన్నాడు. రాక్షసి ఈ పదములను విన్న తక్షణమే, ప్రేమకు, శాంతికి ఆలవాలమైన పావురరూపం ధరించి బుద్ధుని అనుగ్రహించి అంతర్ధానమైంది. ద్వేషించనవాడు ద్వేషానికి గురికాగలడు. అసూయతో నిండినవాడు అసూయతోనే అంతం కాగలడు. ధర్మమునకు, నీతికి కట్టుబడిన వ్యక్తిత్వంకలవాడు తాత్కాలికంగా కొన్ని కష్టనష్టములకు గురి కావచ్చు. నీతిరహితులై, కృతజ్ఞతాహీనులై మానవత్వమునే మరచి సంచరించే అవినీతిపరులకు తాత్కాలికంగా అన్నీ సుఖములే, ఆనందములే, లాభములే చేకూరవచ్చు. పితికిన తక్షణమే పాలిచ్చే గోవువంటిది కాదు అవినీతి. విత్తనము మొక్కై, చెట్టై, ఫలించేవరకూ సమయం పడుతుంది. ఈనాడు నవ్వుతూ గడిపిన జీవితం కొంతకాలానికి అశాంతితో గడపవలసి వస్తుంది. సందర్భమేదైనా ఆలోచించి ఎవరికీ బాధ కలుగచేయని మాటలను, చేతలను ఉపయోగించండి. అప్పుడే సత్ఫలితాలను అందుకోగలరు.

***ఎందరో, నేడెందరో వృద్ధులు, వయోవృద్ధులు ఊరూరా వున్నారు***
***ఒడలి, ఒదిగి వున్నారు, ఒంటరిగా బ్రతకలేక వృద్ధాశ్రమాల్లో మగ్గుతున్నారు***
***ఆస్తులేమో లేకపోయినవి, ఆప్తులేమో కాకపోయినారు***
***ఆరోగ్యం అదుపు తప్పింది, ఆసుపత్రి పాలవుతున్నారు***
***ప్రేగు తెంచుకుని పుట్టినవాళ్ళు పట్టించుకోకపోతే,***
***ఆత్మీయత కరువై, అనాథలై మిగులుతున్నారు***
***వృద్ధాప్యపెన్షన్లతో తిండిగింజలే రాక,***
***కూడూగుడ్డా కరువై, కూలీనాలీ చేసుకుంటూ,***
***భృతి ఏమో కానరాక, భిక్షాటన చేయలేక,***
***ఆలయాల అంగడిలో యాచకులై కూర్చుంటూ,***
***జీవితవలయంలో చిక్కుకున్న వృద్ధులకు చేతనైన సేవ చేసి***
***వారి అధరమున చిరునవ్వు, ఆలింగనములో ఆత్మీయతను కురిపించి,***
***కంటిలో కనిపించు కనరాని ప్రేమను చూచి***
***చేయూతనివ్వటానికై రారండి చిరంజీవి పదసన్నిధికి***
***మీరూ చిరంజీవులై వర్ధిల్లండి***
***నా చిన్నారి ముద్దబిడ్డలారా!***

*ఒక్క పుష్పం పరిమళం, గాలి వీచినప్పుడు గాలి వీచినవైపునకే వ్యాపిస్తుంది.*
*కానీ, మనిషి మంచితనం మాత్రం అన్నివైపులా వ్యాపిస్తుంది!*

ౕ

**24-01-2020** 08:45 AM

**32) గుణాల వల్ల ఎటువంటి జన్మలు తీసుకోవలసి వస్తుంది స్వామి?**

వాసనలన్నీ పూర్వజన్మలకు సంబంధించినవే. అవే ఈ జన్మలో పురుషార్థానికి పెట్టుబడి. ఒక్క విషయాన్ని మీరు గుర్తించాలి. మీరు చేసిన కర్మల కారణంగా మీకు వచ్చే జన్మను, కర్మఫలాలైన సుఖదుఃఖాలను మీరు మార్చుకోలేరు. కానీ, వాసనలను మార్చుకునేందుకు, పురుషార్థాన్ని సమర్థవంతంగా నెరవేర్చుకొనేందుకు అవకాశమున్నది. కనుక, మానవజన్మ మీరు బాగుపడేందుకు వచ్చిన ఒక సువర్ణావకాశం. ఈ ఛాన్స్‌ను వదులుకున్నారా, సమీప భవిష్యత్తులో మానవజన్మ రాదు, నీచజన్మలే గతి అని హెచ్చరిస్తున్నాను. కనుక, దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోండి. మరణానంతరం ఏ గుణాలు కలవారు ఏ లోకాలకు వెళతారో! సత్త్వంలో నిలిచినవారు ఊర్ధ్వలోకాలకు వెళ్తారు, రాజసులు మధ్యలోనే ఉండిపోతారు, అధమగుణమైన తమస్సులో నిలిచినవారు అధోలోకాలకు వెళ్ళిపోతారు. ఊర్ధ్వలోకాలు, అధోలోకాలు అంటే నిజంగా ఆయా లోకాలకు వెళ్ళటం కాదు. ఊర్ధ్వలోకాలు అంటే ఉత్తమజన్మలు, మధ్యలోకాలంటే మధ్యమజన్మలు, అధోలోకాలంటే నీచజన్మలు అని అర్థం. సత్త్వగుణంతో నిలిచినవారికి తర్వాత వచ్చేజన్మ ఉత్తమజన్మ. అంటే, తన స్వస్థితిలో, ఆత్మస్థితిలో నిలిచిపోవటానికి ప్రయత్నించే జన్మయే ఉత్తమజన్మ. అంటే ఆత్మజ్ఞానాన్ని పొంది, మోక్షం కొరకు మీరు సాధన చేస్తారు. రజోగుణంలో నిలిచినవారు మధ్యలోనే వుండిపోతారు. అంటే మధ్యస్థమైన జన్మ వస్తుంది. నిరంతరం తమ కోరికలను తీర్చుకొనుటకు, ఆశలను నెరవేర్చుకొనుటకు, కర్తవ్యపాలన చేయుటకు కర్మలు చేస్తూ, వీరు కర్మాసక్తులవుతారు. మళ్ళీమళ్ళీ పుడతూ, మళ్ళీమళ్ళీ ఛస్తూ, మళ్ళీమళ్ళీ తల్లిగర్భంలో ప్రవేశిస్తూ, ఈ ప్రపంచంలోనే బొంగరంలా తిరుగుతూ వుంటారు. కర్మలు చేయటం, కర్మఫలాలు రావటం, వాటి అనుభవానికి మళ్ళీ జన్మించటం, ఈ జన్మలో తిరిగి కర్మలు చేయటం... ఇలా కర్మ-జన్మ వలయంలో చిక్కి, సతమతమైపోతూ వుంటారు. వీరు ఉత్తమస్థితిని చేరుకోవాలని అనుకోరు, అసలు కొందరు తెలుసుకోలేరు. ఇక తమోగుణంలో వుండేవారు అంటే, అల్పమైన నీచమైన జన్మలెత్తుతూ వుంటారు. అంటే జంతువులుగా, పక్షులుగా, క్రిమికీటకాలుగా జన్మించి, కర్మఫలం అనుభవించి జన్మ నుండి విడుదల పొంది, తిరిగి అలాంటి నీచమైన జన్మలనే పొందుతుంటారు. నీచమైన యోనులలో జన్మించి కర్మఫలం అనుభవించి ఖర్చు చేసుకుంటారు, లేదా ఒకవేళ మానవజన్మ వచ్చినా పూర్తి అజ్ఞానంతో, ఏమరపాటుతో సోమరులుగా, దేశదిమ్మరులుగా, పిచ్చివారుగా, తెలివితక్కువవారుగా జన్మించి, వ్యర్థజీవితాన్ని గడుపుతారు. ఇలా మూఢజన్మలెత్తుతూ, ఇంకా ఇంకా అధోగతికి దిగజారిపోతారు. ఇక్కడే ఒక విశేషం వుంది. తామసుల స్వభావం నిద్ర, ఏమరపాటు, బద్ధకం. ఇవి అప్పుడప్పుడు సాత్త్వికులలో కూడా కనిపిస్తాయి.

మరి అలాంటప్పుడు వారికి కూడా నీచజన్మలు వస్తాయా అంటే, రావు. రానేరావు. ఎందుకంటే, తామసలక్షణాలైన నిద్రాదులు సాత్త్వికులకు అప్పుడప్పుడు సంభవించేవే గాని, అవి వారి స్వభావం కాదు. కానీ, తామసులకు అవి వారి స్వభావం. సాత్త్వికులలో, రాజసికులలో తమోగుణం ప్రధానం కాదు, కేవలం 'గుణం' గా వుంటుంది. అందుకే వారికి నీచజన్మలు రావు, అధోగతి కలగదు. తమోగుణం స్వభావంగా వున్నవారికి నీచనికృష్ట జన్మలు. అందుకే వారి స్థితిని తెలియచేయటానికి, "జఘన్యగుణ వృత్తిస్థాః తామసాః" అంటే నికృష్టగుణాలు స్వభావంగా కలిగిన తామసులు అని అర్థం. ఈ ప్రపంచంలో ఉత్తమకర్మలు ఆచరిస్తూ, ఉన్నతస్థితిని, మోక్షస్థితిని పొందేవారు కొందరైతే, సకామకర్మలతో గానుగెద్దులా ఈ సంసారచక్రంలో తిరిగేవారు మరికొందరు. నీచయోనులందు జన్మించేవారు ఎందరో. వారంతా అధోగతికి పోయేవారే. రామాయణంలో ఈ మూడు గుణాలకు ప్రతినిధులైన ముగ్గురు సోదరులున్నారు. దూతను వధించటం నింద్యమని చెప్పిన విభీషణుడు తన సర్వస్వాన్ని శ్రీరాముని పాదపద్మాల చెంత చెల్లించాడు, నివేదించాడు. అతడు సత్త్వగుణ సంపన్నుడు. పరకాంత వ్యామోహపీడితుడై, సీతాపహరణం గావించి, ప్రశాంత జీవనానికి దూరమై, బంధుమిత్ర సపరివార సమేతంగా నాశనమైన రావణుడు రజోగుణ సంపన్నుడు. నిద్రకు జీవితాన్ని అంకితం చేసిన కుంభకర్ణుడు తమోగుణ ప్రధానుడు.

***పరుల మేలు కోరనివాని పరము అపరము***
***దానమివ్వని ధనమా, ధనము నిధనము***
***అడవికాచిన వెన్నెల వెల పాల్లుచెల్లు కదా***
***తినక, దానమీక, ఫలము మాగినట్టు కదరా హే హనుమబిడ్డలారా!***

***తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు తప్పే***
***తెలిసీ తెలియక జరిగినా తప్పని తప్పు ముప్పే***
***ఎవ్వరైననూ తప్పించుకొనలేరు ఇల ముప్పు తప్పు***
***తప్పు ఒప్పుకొనిన, రాబోవు ముప్పు తప్పును హే హనుమ బిడ్డలారా!***

***జన్మించుట, మరణించుట నిష్కామకర్మ***
***జీవించుట, జన్మకడ దీపించు సాఫల్యయోగము***
***మరణా రూపానంతరం హీనమోన్నతమో మరుజన్మ***
***అనిమయ*** (విలువకట్టలేని) ***రూపుచేతల అక్షయపాత్రలు జన్మలు హే హనుమ బిడ్డలారా!***

***చిట్టి పలుకుల చిలుక రంగు బంగారు రాచిలుక***
***చెట్టు కొమ్మ రెమ్మల కలిసేటి పచ్చపచ్చని చిలుక***
***చెంగుచెంగున ఎగిరి, మురిసేటి మూన్నాళ్ళ చిలుక***
***చిలుకెగిరి చెట్టెండిపోవునే, ఉనికెరుగుమా హే హనుమ పిల్లల్లారా!***

***కరగును కాలము కడతేరుట కాలనియమము***

***తన్ను తానెరుగని తనమున తనువు అంతరించు***
***తరించు ఎరుకలేమి గుండె గూటి గోడలనడుమ***
***మొలచిన రావిచెట్టని ముందే తెలిసి చరించుట మేలు హే హనుమ బిడ్డలారా!***

***అదిమధ్యంతాలు ఆవరించియున్న ఆ ఆది***
***దేవుని కృప ప్రాణులన్నింట నికరమగు వరము***
***అన్ని ప్రాణులందు సమభావ అమరిక నిండని మనిషికి***
***తదుపరి దుర్లభమవు మానుషదేహం తెలియరా హే హనుమ బిడ్డలారా!***

ॐ

**25-01-2020** 10:00 AM

**33) విజయం పొందుటకు మేము ఏమేమి పాటించాలి స్వామి?**

*విజయం అనేది ఏ ఒక్కరి సొత్తు కాదు. విజయాన్ని సాధించాలని కోరుకునేవారు నిరంతరం కృషి చేస్తూనే వుండాలి. విజయసాధనకు అవసరమైన ప్రతిభను పెంపొందించుకుంటూ బలాన్ని పెంచుకోవాలి, బలహీనతలను దూరం చేసుకోవాలి. గెలుపు వైపు నడిపించే ఆయుధాలు ప్రతివ్యక్తిలో వుంటాయి. వాటిని గుర్తించి, ఉపయోగించటం నేర్చుకుంటేనే విజయం మీ సొంతం అవుతుంది. చాలామంది ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ వుంటారు. కొంతమంది తమ బలాలను గుర్తించక, తమ కంటే ఎవరైనా విజయం సాధించినా, ఎక్కువ ప్రతిభ కనబరచినా, అట్టివారి గురించి చులకనగా మాట్లాడుతారు. పైపెచ్చు అదేమంత గొప్ప విషయం కాదని, తామైతే ఇంకా ఏదేదో చేసేవారమని చెబుతారు. వాస్తవానికి మీరెంత గొప్పవారైనా, ఆ గొప్పదనాన్ని ఇతరులు గుర్తించినప్పుడే రాణింపు అనేది లభిస్తుంది. లేకపోతే, ఏ గుర్తింపూ లేక మరుగున పడిపోతారు. వ్యక్తులను గొప్ప స్థాయిలో నిలబెట్టేది చిన్నచిన్న సంఘటనలే. ఆ సమయంలో మీరు ఎలా స్పందించారో, ఏ విధంగా ప్రవర్తించారు అన్నదానిపైనే నలుగురిలో మీ గుర్తింపు ఆధారపడి వుంటుంది. ఎవరైనా విజయం సాధిస్తే, మనస్ఫూర్తిగా అభినందించాలి. మీలోని అహంకారాన్ని ప్రక్కనబెట్టి, బాగా చేశావు, చాలా బాగుంది అని అభినందించాలి. వాళ్ళ సంతోషాన్ని మీతో పంచుకున్నప్పుడు, అందులో పాజిటివ్స్‌ను గుర్తించండి. మీరు కూడా వాటిని అనుసరించటానికి ప్రయత్నించాలి. అన్నీ మీరు చేయలేరు. అన్నింటిలో వున్న మంచిచెడ్డలు స్వయంగా మీ అనుభవంద్వారా తెలుసుకోలేరు. అందుకే ఇతరుల అనుభవాలను వినాలి. వారిలోని గొప్పదనాన్ని గుర్తించాలి, అభినందించాలి. తద్వారా మీలో సహృదయత పెరుగుతుంది, ఉన్నత వ్యక్తిత్వం అభివృద్ధి చెందుతుంది. అందరిలోనూ మీకు ఒక గుర్తింపు వుంటుంది. అందుకు కావలసింది సహనం. ఆ సహనంమీకు ఉన్నప్పుడే, మీలోని విచక్షణా జ్ఞానం పనిచేయటం ప్రారంభమవుతుంది. మీ అవసరానికి అవసరమైన జ్ఞానాన్ని ఎక్కడ దొరుకుతుందో తెలుసుకోవటం, దాన్ని సొంతం చేసుకోవటం తెలివిగలవారు చేసే పని. అట్టివారు ఇతరుల అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటారు. "కాలం కలిసిరావాలి", "అదృష్టం*

వుండాలి", "పూర్వజన్మ సుకృతం వుండాలి" వంటి మాటలతో కాలాన్ని వ్యర్థం చెయ్యరు. ఈర్ష్య, ద్వేషం, అసూయ వంటి వాటిని ప్రక్కనబెట్టి, మనస్ఫూర్తిగా విజయసాధకులను అభినందిస్తారు. వారిలో వున్న గొప్పదనాన్ని గుర్తిస్తారు. అందుకు కావలసింది సహృదయత మాత్రమే. వ్యక్తులను ఉన్నత స్థాయిలో నిలిపేది వారు సాధించే విజయాలే అయినా, ఆ విజయం వెనుక వున్న అతని వ్యక్తిత్వమే ప్రధానం. అందుకే విజయం కోసం కృషి చేస్తూనే, వ్యక్తిత్వాన్ని కూడా తీర్చిదిద్దుకోవాలి. అప్పుడే పరిణతిని సాధించగలరు. అందులో ఒకటి, ఎక్కడ ఎవరిలో ఉన్నా, గొప్పదనాన్ని గుర్తించటం, అభినందించడం దాన్ని మీరు అలవర్చుకోవాలి. ఈనాడు హృదయాన్ని మాలిన్యపరిచే విద్యలనే మానవుడు నేర్చుకుంటున్నాడు. నేటి మానవుడు మంచి పదవులను, మంచి బ్రతుకును కోరుకుంటున్నాడే గాని, మంచి బుద్ధులను, మంచి నడతను కోరుకోవటం లేదు. ధనప్రాముఖ్యం అధికమైపోయింది – ధర్మచింతన క్షీణించిపోయింది. నీతినియమాలు గ్రంథాల వరకే పరిమితమైపోయాయి. మానవుల చేతలన్నియూ స్వార్థపూరితాలైపోయాయి. మీరు నేర్వవలసిన విద్యలు ఇట్టివి కావు. పవిత్రమైన పరోపకార సంబంధమైన విద్యను నేర్చుకోవాలి. మానవులయందు ఏకత్వమును సాధించే విద్యలను, దివ్యమైన ఆత్మస్వభావమును నిరూపించే విద్యలను నేర్చుకోవాలి. ఈనాడు సరియైన విద్యావంతులు ఎవ్వరూ నాకు కన్పించుటలేదు. అందరూ అవిద్యాశిఖామణులే. కేవలం పుస్తకాలను చదువుతున్నారు, వ్రాస్తున్నారు. ఈ విధంగా చదవ, వ్రాయ నేర్చిన వారందరూ విద్యావంతులు కారు. సుజ్ఞానము, సుకృతము అందించని విద్యలు సద్విద్యలు కావు. మానవునకు శరీరము అవసరము. ఈ శరీరమును సద్వినియోగపరచుకొనుటకు సద్గుణములు అవసరం. ఈ రెండింటి సమ్మేళనము వలన ఆదర్శవంతమైన జీవితమును అనుభవించవచ్చు. జగత్తును ఆదర్శవంతంగా తీర్చిదిద్దవచ్చు. అయితే, దేహమే ప్రధానముగా భావించి, గుణములను విస్మరించినప్పుడు, మీ జీవితమే వ్యర్థమైపోతుంది. హనుమ చెప్పిన మాటలు వ్యర్థమైపోతాయి. జీవితాన్ని గెలుపు దిశగా నడిపించి, పవిత్రమైన మానవజన్మను సద్భావములతో, సదాచారములతో అభివృద్ధి పథంలో పయనిస్తూ, ఈ జగత్తును నిత్యకళ్యాణం పచ్చతోరణంగా మార్చాలని ప్రబోధిస్తున్నాను.

యోహి ధర్మం సమాశ్రిత్య హిత్వాభర్తుః ప్రియాప్రియే ।
అప్రియణ్యాహ పృథాని తేన రాజా సహాయవాన్ ॥

ఎవరు ధర్మమును ఆశ్రయించి ఇది ప్రభువుకు ప్రియముగానుండునా, అప్రియముగానుండునా అను చర్చను వదిలి, హితకరమైన అప్రియవచనములు కూడా పలుకునో, అతడి వల్ల రాజు మిక్కిలి సహాయమును పొందగలడు.

***జీవితమంటే అలుసెందుకు మీకు?***

***ఎండమావుల వెంట పరుగులిడుతుంటారు, రాగద్వేషాదులతో రగిలిపోతుంటారెందుకు?***
***ఆవేదనలతో కుమిలిపోతుంటారెందుకు? అహం రెక్కలిప్పుకొని ఎగురుతుంటారెందుకు?***
***అహంను అణువణువూ నింపుకుంటారెందుకు? అభిమానధనులను అవమానిస్తుంటారెందుకు?***
***ప్రేమాభిమానాలను వలదువలదంటారెందుకు? స్వార్థపు ఊబిలో కూరుకొనిపోతారెందుకు?***

***కలల కౌగిలిలో తేలిపోతారెందుకు? కన్నీటి వరదలై పారుతుంటారెందుకు?***
***చంచలచిత్తులై తిరుగుతుంటారెందుకు? నీటిబుడగ జీవితమని మర్చిపోతుంటారెందుకు?***
***నివురుగప్పిన నిప్పని తెలుసుకోనంటారెందుకు?***
***ఇకనైనా మీ మనసును మేల్కొల్పండి***
***తెలివిగా మసలుకొమ్మని మీ మనసుకు తెల్పండి***
***క్షణభంగురమైన బ్రతుకును చందనంగా మార్చుకోండి***
***మనసుకు పట్టిన మాయపొరలను తక్షణమే ఒల్చుకోండి***
***మల్లెపూవులా మీరు స్వచ్ఛంగా***
***మారుతిమాటల మమతల కోవెలలో మణిదీపమై వెలిగిపోండి***
***మారుతిలా మనసున్న మనిషిలా అవనిలో నిలిచిపోండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**26-01-2020** 08:55 AM

పెరుగు, నీరు సమపాళ్ళల్లో కలిపి, చిలికి తయారుచేసిన మజ్జిగ తేలికగా వుంటుంది, శీఘ్రంగా జీర్ణమవుతుంది. కొంచెం వగరు, పులుపు కలిగి వుంటుంది. జఠరాగ్నిని వృద్ధి చేస్తుంది. కఫవాతాలను హరిస్తుంది. శోషరోగం, ఉదరం, మొల్లలరోగం, బంక విరేచనాలు, మూత్రబంధం, నోరు రుచిని కోల్పోవుట, గుల్మం, అధికంగా నెయ్యి త్రాగుట వలన కలుగు సమస్యలు, విషము, పాండురోగము వంటి సమస్యలను నివారిస్తుంది. మజ్జిగలో కూడా రకాలు వున్నాయి. ఆ రకాలను ఇప్పుడు చెబుతాను. పెరుగుకు నీళ్ళు కలపకుండా కేవలం పెరుగును మాత్రం చిలికి చేయబడిన మజ్జిగను 'గోళ' అంటారు. పెరుగుకు నాల్గవవంతు నీరు కలిపి కవ్వముతో చిలికి చేయబడిన మజ్జిగను 'ఉదశ్విత' అంటారు. సగభాగం నీరు కలిపి పెరుగును చిలికి చేయబడిన మజ్జిగను 'తక్రము' అంటారు. పెరుగును మూడువంతుల నీరు కలిపి చేయబడిన మజ్జిగను 'కాలశేయ' అంటారు.

వీటన్నింటిలో సగం పెరుగు – సగం నీరు కలిపి చేసిన తక్రము అని పిలిచే మజ్జిగ బహు శ్రేష్ఠమైనది. ఇప్పుడు మీకు తక్రము యొక్క విశేషగుణాలు చెబుతాను. మజ్జిగ వాడుట వలన శరీరము నందు జఠరాగ్నిని వృద్ధి చెందించును. వాంతి, వాపులు, భగంధరము, విషము, ఉదరరోగము, కామెర్లు, కఫము, వాతము హరిస్తుంది. వెన్న పూర్తిగా తీయని మజ్జిగను, 'మందజాతం' అంటారు. ఇది అంత తొందరగా జీర్ణం అవ్వదు. జిడ్డు కొంచెం కూడా లేకుండా చిలకబడిన మజ్జిగను 'అతిజాతం' అంటారు. ఇది మిక్కిలి పులుపుగా వుండి, ఉష్ణాన్ని కలుగచేస్తుంది. దప్పికను పెంచుతుంది. వగరు, పులుపు రుచులు కల్గిన మజ్జిగ మలబద్ధకం కలిగిస్తుంది. కేవలం పుల్లగా వుండే మజ్జిగ మలాన్ని బయటకు

పంపుతుంది. ఏమీ కలపకుండా వుండే చప్పటి మజ్జిగ ఉదరమునందు వుండు కఫాన్ని హరిస్తుంది కానీ, కంఠము నందు కఫాన్ని కలిగిస్తుంది.

మజ్జిగ ఉపయోగించకూడని సమయాల గురించి చెబుతాను. గాయాలు తగిలినప్పుడు, మూర్ఛరోగం వున్నప్పుడు, భ్రమ, రక్తపిత్తరోగమునందు, తక్రము అను మజ్జిగ వాడరాదు. అదే విధముగా, మంచుకాలము నందు శరీరంలో జఠరాగ్ని మందగించి వున్నప్పుడు, కఫము వలన వచ్చిన రోగములయందు, కంఠనాళముల సమస్యలయందు, వాతం ప్రకోపించినప్పుడు, తక్రమును యపయోగించరాదు. శరీరమునందు వాతము ప్రకోపించినప్పుడు పులిసిన మజ్జిగను సైంధవ లవణం కలిపి త్రాగాలి. పిత్తము ప్రకోపించినప్పుడు పంచదార కలిపి తియ్యటి మజ్జిగ త్రాగాలి. అదే విధముగా శరీరమునందు కఫము ప్రకోపించినప్పుడు త్రికటుకముల చూర్ణము అనగా, శొంఠి, పిప్పళ్ళు, మిరియాలు సమాన చూర్ణం మరియు ఉప్పు కలిగిన మజ్జిగను త్రాగాలి. కొంచెం పుల్లగా వుండు మజ్జిగ శుక్రవృద్ధికరం. మిక్కిలి పులుపు కల్గిన మజ్జిగ జఠరాగ్నిని వృద్ధి చేస్తుంది. పీనసరోగం అనగా ముక్కువెంట ఆగకుండా నీరుకారు రోగం, శ్వాస, రొప్పు వంటి రోగాలు వున్నప్పుడు, మజ్జిగను కాచి త్రాగాలి. శరీరంపైన వ్రణాలు లేచినప్పుడు, మజ్జిగ వాడినచో అనేక సమస్యలు వస్తాయి. మజ్జిగకు ద్రవాన్ని శోషించుకునే గుణం వుండుట వలన, నీళ్ళ విరేచనాలతో బాధపడే వారికి మజ్జిగ ఇవ్వటం వలన నీటిని గుంజి,మలమును గట్టిపడేటట్లు చేస్తుంది. అందువల్ల విరేచనాలు తగ్గుతాయి. గేదెమజ్జిగ కామెర్లరోగమునందు, పాండురోగమునందు అద్భుతంగా పనిచేస్తుంది. మనుష్యుల రోగాలకు ప్రధానకారణం వారు తీసుకునే ఆహారం. మీ యొక్క శరీరతత్త్వానికి అనుకూలమైన ఆహారాన్ని మీరు తీసుకున్నంత వరకూ మీకు సమస్య వుండదు. తీసుకునే ఆహారం చాలా పరిమితంగా మాత్రమే తీసుకోవాలి. "త్రికాల భోజనే మహారోగి, ద్వికాల భోజనే మహాభోగి, ఏకకాల భోజనే మహాయోగి". కావున, మీ శరీరతత్త్వానికి అనుకూలమైన ఆహారాన్ని తీసుకొని, అనారోగ్య సమస్యల బారిన పడకండి.

***గర్వంతో వుండవద్దు - దేవుడి ఆశీస్సులు కోల్పోతారు***

***ఈర్ష్యతో వుండవద్దు - స్నేహితులని కోల్పోతారు***

***కోపంతో వుండవద్దు - నిన్ను నీవే కోల్పోతావు***

***మంచి మనసుతో చేసిన సహాయం, మంచివారితో చేసిన స్నేహం ఎన్నటికీ వృధా కాదు.***

***ఇది ఆంజనేయుని అమృతవాక్కు!***

**34) గుణాతీత స్థితిని ఏ విధముగా సాధించాలి స్వామి?**

మీ అనుభవాన్ని చూడండి. జాగ్రదావస్థలో గుణాలున్నాయి. దేహం వున్నది, దుఃఖాలున్నాయి. స్వప్నావస్థలో కూడా గుణాలున్నాయి. అప్పుడు ఒక దేహం, స్వప్నపురుషుడున్నాడు. అప్పుడూ దుఃఖాలున్నాయి. కానీ సుషుప్తిలో దేహం లేదు, మనసు లేదు, గుణాలూ లేవు. అయినా ఆనందం వుంది. ప్రతివారి అనుభవము ఇదే. అంటే గుణాలుంటే దుఃఖాలు – గుణాలు లేకపోతే ఆనందం. అయితే, తిరిగి

మేలుకోవటంతోనే దేహగుణాలు అన్నీ వస్తున్నాయి. దానితో దుఃఖాలు. ఈ దుఃఖాలు శాశ్వతంగా పోయి, శాశ్వత ఆనందం పొందాలంటే, ఈ గుణాలను శాశ్వతంగా తొలగించుకోవాలి. అదే గుణాతీతుడు కావటం. గుణాతీతుడైతే, అనంతమైన, శాశ్వతమైన బ్రహ్మానందమే. అదే అమృతస్థితి. రామాయణంలో సుందరకాండ వున్నది. దానిలో సీతాన్వేషణకై మహావీరులైన కపులు దక్షిణదిక్కుగా వెళ్ళాము. సముద్రాన్ని దాటి లంకలో ప్రవేశించగల వీరుడెవ్వరా అని ఆలోచిస్తున్నారు అందరు. నేను మాత్రం దూరంగా ఊరికే కూర్చున్నాను. అది తమోగుణం. ఆ తర్వాత అందరూ నన్ను ప్రశంసించి, సముద్రలంఘనము నీకు తప్ప ఎవరివల్లా కాదన్నారు. దానితో నేను సముద్రాన్ని లంఘించాను. అంటే తమోగుణాన్ని దాటాను. ఆ తర్వాత లంకలో ప్రవేశించి లంఖిణిని దెబ్బకొట్టి సీతాన్వేషణ గావించాను. ఇది రజోగుణం. ఆ తర్వాత అశోకవనంలోకి ప్రవేశించాను. 'అశోక' అంటే, 'శోకము లేని' అని అర్ధం. అంటే రజోగుణాన్ని దాటి సత్త్వగుణంలోనికి ప్రవేశించాను. అశోకవనంలో శింశుపావృక్షం క్రింద సీతాదేవిని దర్శించాను. ఇదే ఆత్మసాక్షాత్కారం. అమృతత్వసిద్ధి. మూడుగుణాలు దాటితే అమృతత్వసిద్ధియే! మీ చేతికి ఐదు వ్రేళ్ళుంటాయి. 4 కలిసే వుంటాయి. ఒకటి మాత్రం దూరంగా వుంటుంది. అది పరమాత్మ. ఈ నాలుగు వ్రేళ్ళలో చూపుడువేలు జీవుడు. మిగిలిన మూడు వ్రేళ్ళు 3 గుణాలు. జీవుడెప్పుడూ 3 గుణాలతో కూడియే వుంటాడు. అందుకే నాలుగువ్రేళ్ళు కలిసే వుంటాయి. అయితే, ప్రయత్నంతో చూపుడువ్రేలు అనబడే జీవుడు మిగిలిన 3 వ్రేళ్ళు అనే గుణాలకు దూరంగా జరిగితే, పరమాత్మ అనే బొటనవ్రేలితో కలిసిపోతాడు. ఇలా చూపుడువ్రేలు, బొటనవ్రేలు కలిసి సున్నాగా ఏర్పడితే, అదే చిన్ముద్ర. మీకు ఆలయాల్లో దేవతా విగ్రహాలు చూపే చిన్ముద్రలోని ఆంతర్యం ఇదే. 3 గుణాలను వదిలించుకొని, నాతో ఐక్యంకండి అని చెప్పటమే. మానవుడు జీవించి వుండగనే మూడు గుణాలను దాటితే, అమృతత్వస్థితిని సాధించవచ్చు.

**దేవుడు అనాథరక్షకుడు కాకపోతే, కొంగుబంగారమై నిలవకపోతే,**
**వ్యయప్రయాసలకోర్చి, దర్శనాలకు అంతంత దూరం ఎందుకు వెళ్ళడం?**
**భగవంతుడు సర్వవ్యాపి అని తెలిసి కూడా**
**ఇంటిదగ్గర ఇంట్లో వున్న ఆలయం, అందులో కొలువైన దైవాన్ని మర్చిపోతారు, మీ కంటికి ఆనరు.**
**కారణం, వాళ్ళకు ఏ మహత్యాలు లేవు, మహిమలు చూపలేరు.**
**అసలు కోరికలే లేని వాళ్ళకు దేవుడక్కరలేదు**
**గొంతెమ్మ కోరికలను బట్టే, భగవంతుడికి ఆడంబర సేవలు, నిత్యకళ్యాణాలు.**
**మానవజీవిత పరమార్ధం తెలియకపోతే, మనిషి వ్యర్ధుడవుతాడు**
**మనిషి అంతరంగశుద్ధి అయితేనే, మానవత్వం వికసిస్తుంది**
**మనసే మానవజీవితంలో అత్యంత కీలకపాత్ర పోషిస్తుంది**
**జీవితంలో మారుతి మాటలే మిమ్మల్ని మలుపు త్రిప్పుతుంది**
**మలచిన మలుపుతో మహిలో అత్యంత మహోన్నతులై ఈ ఆంజనేయుని చేరండి**
**నా చిన్నారి ముద్దుబిడ్డలారా!**

ఓం

**27-01-2020** 08:55 AM

**35) చరాచర జీవరాసులకు ఆధారమైన చైతన్యం ఎట్టిది స్వామి?**

*జంతు సముదాయాన్ని పరిశీలించినట్లయితే, జీవచైతన్యం ఇంద్రియచైతన్యంగా రూపాంతరం చెందింది. వృక్షజాతులు ఒకేచోట స్థిరంగా వుంటే, జంతువులు భూమి మీద నిరంతరం సంచరిస్తూ వుంటాయి. తమ మనుగడ కోసం అవి పంచభూతాలతోపాటు వృక్షసంపదను కూడా ఉపయోగించుకుంటాయి. ఆహారం కోసం, ఆవాసం కోసం అవి వృక్షాల మీద ఆధారపడ్తాయి. అయితే, వీనిలో శాకాహారులు వృక్షసంబంధమైన పదార్థాన్ని స్వీకరిస్తే, మాంసాహారులు శాకాహారులను ఉపయోగించుకుంటాయి. అయితే వీటన్నింటియందు మూలపదార్థం మాత్రం పంచభూతాలే. పంచభూతాల ద్వారా వృక్షాలు, వృక్షసంపద ద్వారా శాకాహారులు, శాకాహారుల ద్వారా మాంసాహారులు ఒకదాని మీద మరొకటి ఆధారపడి జీవిస్తున్నాయి. జంతువులు వృక్షసంబంధమైన పదార్థాన్ని స్వీకరించినప్పటికీ, అటువంటి పదార్థమంతా పంచభూతాల యొక్క రూపాంతరమే కదా. ఇంద్రియచైతన్యం జీవచైతన్యం యొక్క రూపాంతరమైతే, అటువంటి జీవచైతన్యానికి ఆధారం ప్రాణశక్తియే కదా. అందువలన, వృక్షజాతులను జంతుసముదాయాన్ని విడదీయటం సాధ్యం కాదు. అవి కూడా అన్యోన్యాశ్రయాలే. జంతువులు మరణించిన పిదప, ఆ పదార్థమంతా భూమిలో కలసిపోయి, తిరిగి వృక్షాలకు ఆహారంగా మారుతుంది. వృక్షాల యొక్క ఫలాలు జంతువులకు బలాన్నిస్తే, జంతువుల యొక్క మలం వృక్షాలకు బలమవుతుంది గదా. అంటే, అవ్వన్నీ పరస్పరసహకారంతో, సహాయంతో, సహజీవనంతో కొనసాగుతున్నాయి గమనించండి! అయితే, వృక్షాలలో కేవలం జీవచైతన్యం మాత్రమే వుంది. కానీ, జంతువులలో అది ఇంద్రియచైతన్యంగా రూపాంతరం చెందుతుంది. శాకాహారులు, సాత్త్వికంగా వుంటే, మాంసాహారులలో ఇంద్రియచైతన్యం ఇంకా అధికంగా వుండి, అవి రౌద్రంగా, ఉద్రేకంగా వుంటాయి. అయితే, ఇక మానవుని గురించి తెలుసుకోండి. మానవస్వభావం పూర్తిగా శాకాహారతత్త్వమే. అందువల్లనే, అతనిలో ఇంద్రియచైతన్యం మనోచైతన్యంగా రూపాంతరం చెందింది. మానవునిలో మానవత్వముంటుంది. హృదయమట్టం వికసిస్తుంది. కరుణ, జాలి, దయ, ఆప్యాయత వంటివే అతని స్వభావాలు. అతనిలో పంచభూతాలు వృక్షసంబంధమైన పదార్థంగా రూపాంతరం చెంది ఆహారంగా ఉపయోగపడతాయి. మానవుడు జంతువుల కంటే భిన్నంగా, వేరుగా వుండి, వానితో అవినాభావ సంబంధాన్ని కలిగివుంటాడు. ఆలోచనలు, అవగాహన, స్పందన వంటి లక్షణాల వలన తనను గురించి, పంచభూతాలు, వృక్షజాతులు, జంతు సముదాయాన్ని గురించి, పరిసరాలలో జరిగే మార్పులు, పరిణామాన్ని గురించి అవగాహన చేసుకోగలుగుతాడు. అతనిలో మానసికమట్టం ఇంకా వికసించి, కొందరిలో ఇంకా అది బుద్ధిచైతన్యంగా రూపాంతరం చెందుతుంది. వివేచన, విచక్షణ, గమనం వంటి విశిష్టమైన అంశాల ద్వారా తనను గురించి, ప్రకృతి, విశ్వాలను గురించి లోతుగా అధ్యయనం చేయగల్గుతాడు. సత్యం, ధర్మాలను గురించి కూడా స్పష్టత వుంటుంది. ఏది చేయాలో, ఏది చేయకూడదో అవగాహన వుంటుంది.*

## 36) మేము ఆచరించవలసిన ధర్మము ఎట్టిది స్వామి?

*భూమండలమంతటిలో ధర్మాచరణకు శ్రీకారం చుట్టింది మానవుడు మాత్రమే. చతుర్విధ పురుషార్థాలు, చతుర్విధాశ్రమాలు, చాతుర్వర్ణ వ్యవస్థ వంటివన్నీ మానవుని మేథస్సు నుండి ఉద్భవించినవే. వాని అన్నింటి యందు, ధర్మమనే మూలసూత్రం దాగివుంది. ధర్మాన్ని ఆలంబనగా చేసుకొని, అర్థకామాలను ఆచరించాలి, అనుభవించాలి. బ్రహ్మచర్యంతో సత్యధర్మాలను గురించి తెలుసుకోవాలి. గృహస్థుగా ఆచరించాలి – వానప్రస్థంలో ఇతరులకు తెలియచేయాలి. సన్యాసిదశలో వానిని వదిలివేసి, విశ్వంతో ఐక్యం చెందాలి. చాతుర్వర్ణ వ్యవస్థలో మానవుడు సమాజానికి నిస్వార్థ నిష్కామ సేవలను అందించాలి. శూద్రుడు సమాజానికి భౌతిక సేవలను కొనసాగిస్తే, వైశ్యుడు సమాజపోషణ బాధ్యత వహించాలి. క్షత్రియుడు సమాజరక్షణలో నిమగ్నం కావాలి, బ్రాహ్మణుడు సమాజానికి మంచి మార్గదర్శకం చేయాలి. వీరు నలుగురూ ధర్మమనే మూలసూత్రం మీదనే జీవితాలను కొనసాగించాలి. మానవధర్మాన్ని గురించి తెలియచెబుతాను. మానవుడు తనను గురించి తాను సంపూర్ణంగా తెలుసుకోవడమే ధర్మమవుతుంది. సత్యం నుండి ధర్మం ఆవిర్భవించి, అది తిరిగి సత్యంలో ఐక్యం చెందుతున్నందువలన, ధర్మాన్ని కూడా భగవంతుడు అని అంటారు. అయితే, అటువంటి ధర్మాన్ని ఆచరించే మానవుడు ఏమవుతాడు? మానవుడు కూడా భగవంతుడే. తనలో పంచభూతాలు, వృక్షసంబంధమైన జీవచైతన్యం, జంతుసంబంధమైన ఇంద్రియచైతన్యం, అదనంగా మనోబుద్ధి చైతన్యాలు కూడా వుంటాయి. వీటన్నింటికీ ఆధారం శుద్ధచైతన్యం. అందువలన, మానవుడు ప్రకృతిలో విశ్వంలో ఒక భాగమే. వాని నుండి వేరు కాదు, భిన్నం కాదు, అతీతం అంతకన్నా కాదు. ప్రకృతిలో కలిసిపోయి, దానిలో మమేకమై, దానిని ఆరాధిస్తూ, పూజిస్తూ, దానిని కూడా భగవంతునిగా భావించటమే ధర్మమవుతుంది. తాను ప్రకృతిలో విశ్వంలో ఒక భాగమైతే, అహంకారం కరిగిపోయి, ప్రజ్ఞ అనంతంగా విస్తరిస్తుంది. ప్రకృతిలో వున్న పంచభూతాలు, వృక్షజాతులు, జంతుజాలాలు ఏ విధంగానైతే ధర్మాన్ని పాటిస్తున్నాయో, తాను కూడా అటువంటి ధర్మాన్ని పాటించగలగాలి. అందుకోసమై తనను గురించి, పంచభూతాలు, వృక్షజాతులు, జంతువులను గురించి తెలుసుకోవాలి. చతుర్విధాశ్రమాలలో, బ్రహ్మచర్యంలో గురుకులాలలో , ఆశ్రమాలలో, గురువు సమక్షంలో వుంటూ ప్రకృతికి అనుగుణంగా జీవిస్తూ, బ్రహ్మజ్ఞానాన్ని గురించి అధ్యయనం చేయడమే ధర్మమవుతుంది.*

***విశ్వాసం అనే పదం చిన్నది.***
***దీనిని చదవడానికి ఒక సెకెండ్ పడుతుంది.***
***ఆలోచించడానికి ఒక నిముషం పడుతుంది.***
***అర్థం చేసుకోవడానికి ఒక రోజు పడుతుంది.***
***నిరూపించుకోవటానికి మాత్రం జీవితకాలం కావాలి.***
***వస్తువు విలువ కొనేముందు తెలుసుకుంటారు.***
***మనిషి విలువ కోల్పోయాక తెలుసుకుంటారు.***
***కోల్పోవడంలో వున్న బాధను తెలిసినవాడు ప్రక్కవాడిది దోచుకోడు***
***ఇవ్వడంలో వున్న ఆనందం ఎరిగినవాడు ఉన్నది దాచుకోడు***

***దోచుకోలేని ధనం మంచితనం - దాచలేని ధనం ఆనందం***
***ఆరడుగుల మనిషి విలువ నాలుగు అంగుళాల నాలుకపై ఆధారపడి వుంటుంది***
***మనసులోని కోర్కెలు మట్టుబెట్టకున్న, హుండీలో వేయు కానుకలకు విలువేది?***
***ప్రేమతో పరమాత్ముని పిలువకున్న, బిడ్డలకు భగవంతుని పేరెట్టి ప్రయోజనమేమిటి?***
***ఈ ఆంజనేయుని పదములు విని, ఆచరణ పెట్టలేని మీ విశ్వాసం ఎంత?***
***కామక్రోధాది అరిషడ్వర్గములను వీడక, వినుతికెక్కుట దుస్సాహసం***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**28-01-2020** 08:55 AM

**37) ప్రజ్ఞానం బ్రహ్మ అంటే ఏమిటి స్వామి?**

మీ ఆశయం, ధ్యేయం – ధ్యానము, సేవ. ధ్యానానికి నిస్వార్థంగా చేసే సేవ సహకరిస్తుంది. ఒక మంచిపని చేసేటప్పుడు కలిగేది తృప్తి. ఆ తృప్తి లోపల అలజడిని తగ్గిస్తుంది. అలజడి తగ్గిన మనస్సు ప్రీతితో భగవంతుని తలచుకుంటుంది. ఆ తలపు ఏకాగ్రతకు దారితీస్తుంది. ఏకాగ్రత కుదిరిన మనస్సులో బ్రహ్మాకారం నెలకొంటుంది. బ్రహ్మాకారవృత్తిలోని ఆనందాన్ని రుచి చూసిన మనస్సు ఆ తర్వాత, పదేపదే బ్రహ్మాకారవృత్తి వైపే పరుగులు తీస్తుంది. అటు పిమ్మట, ఆ స్థానంలో మనస్సు అదృశ్యమై, కేవలం ప్రజ్ఞగా నిలచిపోతుంది. అంటే, ఆ తర్వాత అది మనస్సు అని పలువబడదు – ప్రజ్ఞ అని చెప్పబడుతుంది. అదే "ప్రజ్ఞానం బ్రహ్మ".

**38) లక్ష్యాన్ని సాధించుటకు మేము ఏవేవి పాటించాలి స్వామి?**

ఒక్కొక్క మహాత్ముడు, ఒక్కో సూత్రాన్ని ఆధారం చేసుకొని చివరిదాకా దానికి కట్టుబడి వుంటారు. చివరకు ఆ సూత్రం ఆధారంగానే వారి లక్ష్యాన్ని చేరుకుంటారు. ఆ సూత్రం సేవ కావచ్చు, అహింస కావచ్చు, సత్యం, ప్రేమతత్త్వం కావచ్చు. మీమీ లక్ష్యాలను అందుకోవటానికి ఒకరు అహింసను, మరొకరు సత్యాన్ని, మరొకరు దయను ఇలా ఎవరికి నచ్చిన సూత్రానికి వారు కట్టుబడి అందుకు సంబంధించిన విలువల్ని దృఢదీక్షతో అనుసరించాలి. మీ ముందు కూర్చున్న ఈ ఆంజనేయుడు కూడా సేవాతత్త్వాన్ని అవలంభించి శ్రీరామ చరణములకు సర్వస్య శరణాగతిని సమర్పించి, సేవకుడిగా రామసామ్రాజ్యంలో ఒక స్థానాన్ని సాధించుకున్నాడు. అవతారపురుషుడు శ్రీరాముడు శాంతి సాధకుడై, శాంతి సామ్రాజ్యాన్ని సాధించి, సర్వులకూ శాంతిని పంచాడు. ఇలనాటి అవతారపురుషుడు సత్యసాయిబాబాగారు ప్రేమతత్త్వాన్ని అనుసరిస్తూ, మహిలోని సర్వజీవులకూ సేవ ద్వారా ప్రేమను అందించగలరని బోధించి, తాను ఆచరించి సర్వుల ప్రేమకు పాత్రులయ్యారు. సద్గురువు ఆశయాలను నెరవేరుస్తూ, ఆశ్రమ బాధ్యతల్ని సక్రమంగా సమర్థవంతంగా నిర్వహించుకుంటూ, సాధన కోసం కుటీరాలకు వచ్చిన సాధకులకు ఆశ్రయాన్నిస్తూ, వారి అవసరాలను గుర్తిస్తూ, ప్రేమతత్త్వాన్ని కురిపించి, లౌకిక జీవితానికి అతీతంగా కుటీరంలోని చెట్లు,

పక్షులు, ఎంత నిష్కపటంగా వ్యవహరిస్తాయో, అంతటి మృదుత్వం, నిర్మలత్వం మీ వ్యవహారాలలో కనిపించాలి. సృష్టి అద్దం లాంటిది. చెడ్డవాడికి చెడ్డగానే కన్పిస్తుంది, కురూపికి సౌందర్యహీనంగా కన్పిస్తుంది. మీరు ప్రతిబింబాన్ని చూసుకోవాలనే వాంఛతో సృష్టికేసి చూడకుండా వుంటే, జీవితం ఆనందమయం, పవిత్రం అవుతుంది. మానవుడి సౌమ్యతాస్వరూపమే భగవంతుడు. సృష్టిలోని మనోహరమైన రూపాలలో భగవంతుని దర్శించవచ్చును. సూర్యోదయానికి ముందు ఉషఃకాలము ఎంతో దివ్యంగా వుంటుంది. ఆ దృశ్యం ఋషులు భగవంతుని మొదటి విభూతిగా దర్శించారు. మరికొందరు పరిశోధకులు దానిని సృష్టికి ఉపయోగపడే ఒక శక్తివంతమైన గోళంగా దర్శించారు. అలాగే వ్యక్తులపట్ల అభిప్రాయములు కూడా భిన్నభిన్నాలుగా వుంటాయి, వ్యక్తపరుస్తారు. సత్యసాయిబాబా, ఈ ఆంజనేయుడు పాదం మోపిన ఈ పుణ్యప్రదేశం కుటీరం, శాంతిప్రేమల నిలయం. నిజంగా ఇది శాంతికి నిలయం. ఆస్వాదించినవారికి ఆస్వాదించినంతగా శాంతిని పొందవచ్చు, అనుభవించవచ్చు. ఇక్కడి నేలలో, నీటిలో, గాలిలో, పువ్వులలో, మొక్కలలో, సర్వంలోనూ శాంతి, ప్రేమతత్త్వం నిండివున్న అనుభూతి మీకు కలగాలి. అప్పుడే, ఇది శాంతి సౌధంగా, మీ ముక్తిధామాన్ని మారుతి బోధలననుభవించగలరు. ఒక్క విషయం చెబుతాను శ్రద్ధగా వినండి. ఒకతల్లి ప్రేమ వల్ల ఆనందభాష్పములు జాలువారి, బిడ్డను చేరదీసి, రోమాంచితం కలుగునట్లుగా భక్తిరసం భక్తుడ్ని ఆనందాంబుధిలో ఓలలాడింపచేస్తుంది. తల్లి బిడ్డకు దుప్పటి కప్పి ఈగలు, దోమలు, చలి చేత, వేడి చేత బాధించకుండా, కాపాడునట్లుగానే, భక్తిజనని భక్తుడ్ని నిర్మలభావమనే ఆచ్ఛాదనతో సంరక్షిస్తూ వుంటుంది. ఏ విధంగా మాతృమూర్తి పాత్రలో పాలుగుడిపి బిడ్డ యొక్క ఆకలిని పోగొడుతుందో, భక్తిజనని భగవచ్చరితామృత పానంతో అనగా, ఉపనిషద్వాక్యామృత పానంతో మనోగతమైన వికారాలను పోగొడుతుంది. భక్తి, భక్తునిచే రుద్రాక్షధారణ గావింపచేసి, భస్మధారణ చేయించి, అంగరక్ష గావిస్తుంది. జనని బిడ్డను మంచముపైన పరుండబెట్టి కాపాడునట్లు, భక్తిజనని భక్తుని ఈశ్వరధారణాపర్యంకమున ప్రవేశింపచేసి, సేదతీర్చి, పాలిస్తుంది. ఆహా! ఎంతటి రక్షణ కల్పిస్తున్నదీ భక్తి! అనగా భక్తరక్షకము భక్తి గాక వేరొకటి లేదని తెలియచెప్తుతున్నాను. మీ మనస్సు అవిచ్ఛిన్నంగా, నిర్విరామంగా, నిరాటంకముగా, సర్వకాల సర్వావస్థలయందు, దేశ కాలమాన పాత్రభేదములందును ఈశ్వర పాదారవింద ధ్యానమగ్నులైయుండాలి అని గ్రహించండి. దీనికి మౌనాన్ని పాటించండి.

**39) మేము ఎటువంటి మౌనాన్ని పాటించాలి స్వామి?**

మౌనాన్ని పాటించాలంటే, కొన్ని భావాలు మీ మనసులో ప్రస్ఫుటంగా వుండాలి. అవి చెబుతాను.

1. మౌనంగా జీవించడమంటే, అటువంటి జీవితం సాధ్యం కావాలంటే, మిమ్మల్ని మీరు రహస్యంగా ప్రేమించినప్పుడే సాధ్యమవుతుంది.
2. కెరటాలను అధిగమించి లోనికి ప్రవేశిస్తే, సముద్రమూ ప్రశాంతంగా, గంభీరంగా వుంటుంది.
3. మౌనంతో జీవితసాగరాన్ని అధిగమిస్తే, జీవితం కూడా ప్రశాంతంగా, గంభీరంగా వుంటుంది.
4. ఈ జీవితం ఏదో ఒకనాడు స్తంభిస్తుంది. అప్పుడే జీవితాన్ని ఎదుర్కోవాలి. మౌనంతో అప్పుడే ఆలోచించటానికి ఆస్కారం వస్తుంది.

5. పచ్చని గోరింటాకులో ఎరుపు దాగివున్నట్లు, మీ జీవితాన్ని పండించేది మౌనమే.
6. మెరుపు అదురు. ఆకాశానికి తెలిసినా దానిని భరిస్తుంది మౌనంగా.
7. జీవితాన్ని పదును పెట్టేదీ మౌనమే, మెదడును పదునెక్కించేదీ మౌనమే.
8. గొంగళి నుండి రూపు మారిన సీతాకోకచిలుకలాంటిదీ జీవితం అని నిరూపించేది మౌనమే.
9. మౌనం కొబ్బరిచెట్టు లాంటిది. ఉప్పునీరు త్రాగి, తియ్యటినీరు ఇస్తుంది. ఎంతటి విచారించదగ్గ విషయమైనా, దిగమింగుతూ తియ్యటి మాటలు చెబుతుంది మౌనం.
10. ఆకులు రాలుతాయి, చిగురిస్తాయి మౌనంగానే.
11. జ్ఞానం వచ్చేది, వేదాంతం తెలిసేది మౌనంలోనే.
12. గుండెల్లో మానులంత బరువుని నింపుకుని విషాదచ్ఛాయలు కనబడనివ్వదు మౌనం.
13. ఎందర్నో నిరాశల నుంచి ఆశల పల్లకీలోకి ఎక్కించేది మౌనం.
14. మబ్బుల్లో చినుకులు దాగినట్లు, కళ్ళల్లో ఎన్ని బాధలైనా దాచి వుంచగలదు మౌనం.
15. ముత్యపుచిప్పలా, అనేక దుఃఖాలను ముత్యాల్లా మార్చుతుంది మౌనం.
16. ఈ మౌనం నుంచి వచ్చిన జ్ఞానం, మరొక జీవితానికి ఉపయోగపడితే, మీ జీవితం ధన్యం.
17. మనిషి మరో మనిషికి ఉదయపు వెలుగులు చూపేది మౌనంతోనే.
18. ఆనంద-విషాదాల కలయికలో జీవితం అందమైనదని తెలియచెప్పేది మౌనం.
19. పచ్చటి మొక్కలు మొలిచే భూమి, మండే సూర్యుడు ఎప్పుడూ ఒకేలా వుండరు. లోతైన హృదయం మాత్రం ఎప్పుడూ ఒకేలా ఉండగల్గేది మౌనం వల్లనే.
20. చెరకుగడను సుతారంగా తినగల్గితే పొందిన తీపి మౌనం.
21. అందమైన వెన్నెలలో పచ్చటి కొండలంత అందమైనది మౌనం.

*భగవంతుడు చిక్కడు వ్రతముల క్రతువుల*
*చిక్కడు దానముల శౌచ శీల తపములన్*
*చిక్కడు యుక్తిని భక్తిని చిక్కిన క్రియతోనచ్యుతుండు సిద్ధముసుండీ!*
*(అచ్యుతుడు సిద్ధముకండి)*

*వివిధ వ్రతములగానీ, యజ్ఞయాగాదుల వలన గానీ, దానధర్మాదుల వలన గాని,*
*జపతపాదుల వలన గానీ, వాదోపవాదాల వలన గానీ పరమేశ్వరుడు లభించడు.*
*పవిత్రమైన ప్రేమ చేతనే భగవంతుడు బంధించపడ్డాడు.*

**నా కళ్ళల్లో మీరుంటారు, నా కన్నీళ్ళలో మీరుంటారు**
**నాకున్న ఓదార్పు మీరే, సహనం మీరే**
**నాకున్న సంతోష తరంగం మీరే**

***అందుకే అందరికన్నా కలకాలం నా మనస్సులో నిలచివున్నారు***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***
***మరి***
***మీ కళ్ళల్లో నేనెపుడుంటాను?  మీ కన్నీళ్ళల్లో నేనెపుడుంటాను?***
***మీకున్న ఓదార్పు నేనే ఎప్పుడవుతాను?  సహనాన్ని ఎప్పుడవుతాను?***
***మీకున్న సంతోషతరంగంగా ఎప్పుడవుతాను నేను?***
***అందరికన్నా కలకాలం మీ మనస్సులో నిలచి వుండేది ఎప్పుడు?***
***సమాధానం కోసం ఆచరణలో చూపించమని***
***ప్రాధేయపడ్తున్న  ఈ పవనకుమారుని  ప్రణతులు ఈ జీవులందుకొని***
***పృథ్వియందు నిలవండి  ప్రేమమయులై, సాధకులై,  సేవకులై, ముముక్షువులై,  మౌనులై,***
***మారుతిబిడ్డలై  నిలవండి***
***నా చిన్నారి  ముద్దుబిడ్డలారా!***

ఓం

**29-01-2020** 09:15 AM

**40) మేము ఎటువంటి సాధన చేయాలి స్వామి?**

*వాస్తవానికి సాధన అంటే ఏమిటి?  ఏదో ఒకటి చేయడమా?  ఏమీ చేయకుండా వుండటమా? ఏదో ఒకటి చేయడమంటే అది కర్మ అవుతుంది.  కర్మ జరుగుతుందంటే, మనస్సు పనిచేస్తుంది.  మనస్సు పని చేస్తుందంటే తప్పక శక్తి ఖర్చు అవ్వడమే కాక, ఆ కర్మ మరొక కర్మకు బీజమవుతుంది, కర్మఫలం ఏర్పడుతుంది.  ఏదో ఒకటి చేయడమనేది ప్రాథమిక దశ.  ఏమీ చేయకుండా వుండటమనేది పరాకాష్టస్థితి. ఎవరైనా కొంతకాలం జీవించిన తర్వాత చరమాంకంలో జీవనచర్యలు స్థంభించిపోయి, మరణం సంభవిస్తుంది.  అంటే కర్మలు జరిగిన తర్వాతనే కర్మరాహిత్యం ఏర్పడుతుంది.  అంటే, కర్మ నుండి అకర్మపు స్థితికి చేరి జీవితం ముగుస్తుంది.  అదే సూత్రాన్ని ధ్యానానికి కూడా ఉపయోగించవలసి వుంటుంది. ధారణ, ధ్యాన, సమాధి అనేవి అతి సూక్ష్మమైన ప్రక్రియలు.  ధారణ అంటే, ఒక అంశాన్ని ఎన్నుకోవడం, దానితో ప్రారంభించడం.  ధ్యానమంటే దానిని పదేపదే మననం చేసుకోవడం.  సమాధి అంటే అటువంటి మననం పూర్తిగా ఆగిపోవటం.  ధారణ, ధ్యానాలు రెండూ చర్యలు అవుతాయి.  సమాధి అనేది ఏమీ చేయకుండా వుండే నైష్కర్మస్థితి అవుతుంది.  ముందు ఏదో ఒకటి చేయడంతో ప్రారంభించాలి – ఏమీ చేయవలసిన అవసరం లేదనే స్థితికి చేరాలి.  ఎవరైనా ధ్యానం కోసం కళ్ళు మూసుకున్నప్పుడు ప్రారంభంలో ఏదో ఒకటి చేయడం జరుగుతుంది.  ఆ చర్య దశలవారీగా తగ్గిపోతూ, అంతిమంగా ఆగిపోతుంది. చర్యతో ప్రారంభించబడినప్పుడు, అది క్రమేపీ పెరిగితే అశాస్త్రీయమవుతుంది.  అలాగాక తగ్గడం జరిగితే, శాస్త్రీయమవుతుంది.  అశాస్త్రీయ విధానం ద్వారా దుష్ఫలితం వస్తుంది, సశాస్త్రీయం ద్వారా సత్ఫలితం వస్తుంది.  దీనిని మీ మానవజీవితానికి కూడా అన్వయించవచ్చు.  మనిషికి వయసు పెరిగే కొలది,*

సంస్కారాల మోతాదు తగ్గాలి, పెరగకూడదు. అయితే, అసలు ఎవరికైనా సంస్కారాలు ఎందుకు పెరుగుతాయి? అందుకు మూలకారణమేమిటి? ఎవరికైతే జీవితంపట్ల చక్కని అవగాహన వుంటుందో, వారు భౌతిక ప్రపంచంపట్ల, అందలి సంఘటనలపట్ల ఎటువంటి ఆసక్తిని కనబరచరు. జీవితాన్ని గురించి సరియైన అవగాహన లేకపోతే, కనిపించే స్థూలజగత్తు, ప్రపంచం వాస్తవమనుకుని వాని వెంట పరుగులు తీస్తుంటారు. ప్రపంచం ముఖ్యం అనుకునేవారు ఏదో సాధించాలి, మార్చాలి, సరిచేయాలి అనే భావనలతో వుంటారు. కోరికల విషవలయంలో చిక్కుకుంటారు. జీవితాన్ని అన్ని విధాలా దుర్వినియోగపరచుకుంటారు. వాస్తవానికి కనిపించే స్థూలజగత్తును వాస్తవమని భావించడమంత ప్రమాదం మరొకటి లేదు. అటువంటివారే కర్మబంధంలో ఇరుక్కుంటారు. ప్రపంచం నుండి ఆశిస్తారు, ప్రపంచాన్ని తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తారు. అంతరంగంలో తీవ్రమైన అసంతృప్తి వుండి, దానిని కరగించుకోవడం కోసం పరుగులు తీస్తూ, కర్మలు పెంచుకుంటారు. ఫలితంగా శారీరకంగా, మానసికంగా బలహీనపడతారు. ప్రస్తుతం భౌతికవాదపు మత్తు తారాస్థాయిలో వుంది కాబట్టి, మనిషి కనీస అవసరాల కోసం పరుగులు తీయవలసిన అవసరం ఎంతైనా వుంది. అయితే, ఆ కర్మలను ఆచరించడమనేది కళాత్మకంగా వుండాలి, నిష్కామంగా వుండాలి, ఫలితాన్ని ఆశించే విధంగా వుండకూడదు. ఫలితాన్ని ఆశించడమంటే, అదనంగా కర్మలను పెంచుకోవడమే. అయితే, ఫలితాన్ని ఆశించకుండా కర్మలు చేయడం సాధ్యం కాదేమో అని భావన కలగవచ్చు. ఆశించి కర్మలు చేసేవారే ఫలితాన్ని కోరుకుంటారు. జ్ఞానపరంగా ఎదగడమంటే, ఫలితాన్ని ఆశించకుండా కర్మలు చేసే స్థాయికి చేరడమే. వాస్తవానికి ఆశించినంత మాత్రాన ఎక్కువరాదు, ఆశించకపోతే తగ్గే ప్రసక్తీ లెదు. కర్మ జరుగుతున్నప్పుడే, దాని ప్రభావం జీవుని చేరి, అంతరంగంలో సంస్కారం ఏర్పడుతుంది. కర్మరహస్యాన్ని గురించి అవగాహన లేకపోతే, జీవిత పరమార్థాన్ని అందుకోలేరు.

***సుదూర లక్ష్యాలను ఛేదించాలని, ఉన్నత శిఖరాలను తాకాలని వుంటే,***
***మీ కోర్కెల రహదారిపై నడువవద్దు***
***మీలోని నన్ను విడిచి, మీలో మీరు పరాయివారు కాకండి.***
***మీ కాంక్షల చట్రంలో ఇముడ్చుకోవాలని, ఆంక్షల పంజరంలో బందీ కాకండి***
***మీకు మీరుగా జీవించండి***
***జీవితం ఒక అందమైన బహుమతి***
***జపతపాదులతో ఎదగనివ్వండి***
***సుడులు తిరుగుతున్న మీ హృదయసముద్రంలో ఆర్ద్రతతో స్పృశించే అమృతపు చినుకవ్వండి***
***అద్భుతమైన జీవితాన్ని మంత్రమయం చేసుకుని, మీ ఆలోచనలతో ఎదుగుతూ,***
***సహజంగా వికసించే పూవులై, జీవితాన్ని పరిమళభరితం చేసుకుని***
***సంస్కారవంతులై ఊహలలో తేలియాడిన స్వప్నాలెన్నో***
***వాటి సాకారానికై సతమతమవుతూ, గమ్యాన్ని నిర్దేశించుకుంటూ,***
***గగనకుసుమమైన గమ్యాన్ని ఘడియలో చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**30-01-2020** 08:55 AM

**41) సాధనకు మనస్సు సహకరించదు. ఎందుకని స్వామి?**

*ముందుగా మనిషి ప్రపంచంలో దేనికోసం ఆరాటపడుతున్నాడో గమనించాలి. ప్రతివ్యక్తి ఆనందం కోసమే ఆరాటపడతాడు. అదే అతని జీవిత పరమావధి. అంతకు మించి వేరొక కార్యక్రమమంటూ ఉండదు. అటువంటి ఆనందమనేది సంస్కారశుద్ధి ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. అంతరంగం సమూలంగా శుద్ధిగావించబడితే, సంపూర్ణస్వేచ్ఛను పొంది ఆత్మస్థితికి చేరి ఆనందాన్ని అనుభవించే అవకాశముంది. భౌతిక ప్రపంచమందలి ఏ అంశమూ ఆనందాన్ని ఇవ్వకపోగా, దానిని హరించివేస్తుంది. ప్రస్తుతం ప్రపంచంలో ఏమి జరుగుతుందో గమనించండి. మానవజాతిలో శారీరకసుఖమనే అంశం బలీయంగా వుండి, అభద్రతాభావంతో అవసరానికి మించి వనరులను సేకరించుకోవడం జరుగుతుంది. వనరుల సేకరణ కోసం మనిషి రూపొందించుకొని అమలు జరుపుతున్న ప్రణాళికలు, పథకాలు అన్నీ చెడు కర్మఫలాన్ని పెంచుతాయి. కర్మఫలమనేది చెడుకర్మల ద్వారా సమకూరితే, అది భారమవుతుంది. ఉత్తమకర్మఫలంతో జీవించేవారి అంతరంగం ప్రశాంతంగా వుంటుంది. అదే చెడుకర్మఫలమైతే, అసంతృప్తిగా వుంటుంది. అసంతృప్తి ఎక్కువగా వుండి సాధనలో కూర్చుంటే ఏమవుతుంది? శరీరమంతా బంధించబడి జీవుడు బలోపేతమై, ఆలోచనల వేగం ఇంకా పెరుగుతుంది. అందువలన శరీరం అసౌకర్యానికి, మనసు అలజడికి గురి అవుతాయి. కాబట్టి, మానసికంగా సంసిద్ధం కాకుండా, సాధన చేయడం అతి ప్రమాదకరం. జ్ఞానపరంగా పరిణతి చెందడమంటే, జీవితం సంతృప్తిగా కొనసాగడమే. ఏదో ఒకటి సాధించాలి, మార్చాలి, అనే భావనలు బలీయంగా వుంటే, అంతరంగంలో అసంతృప్తి తారాస్థాయిలో వున్నట్లే కదా. అటువంటి స్థితిలో జీవుడిని, శరీరాన్ని బంధిస్తే ఏమవుతుంది? ఆ అసంతృప్తి ఇంకా పెరుగుతుందే తప్ప తగ్గే అవకాశమే లేదు. అట్టి స్థితిలో సాధన చేస్తే, కాలాన్ని వృధా చేయడమే తప్ప, ఎటువంటి ఫలితము వుండదు. మీరు ఏదైనా ఒక ప్రయోగం చేసేటప్పుడు ప్రయోగ విధానాన్ని, మూలసూత్రాన్ని గురించిన పూర్తి అవగాహన వుండాలి. సిద్ధాంతపరంగా అవగాహన లేకుండా ప్రయోగం చేయటం ద్వారా దుష్ఫలితం సంభవించే అవకాశముంది. అసలు ప్రయోగము చేయకపోయినా ఫర్వాలేదు గాని, చేసి నష్టపోవడమెందుకు? అంతరంగం నిండుకుండలా వుంటే, అసలు సాధన యొక్క అవసరమేముంటుంది? అంతరంగం అసంతృప్తిగా వుంటే, సాధన చేయడం వలన ప్రయోజనేమిటి? శాస్త్రీయత అంటే, మనసును సంసిద్ధం చేసి సాధనను కొనసాగించడం. అశాస్త్రీయత అంటే, మానసికంగా అలజడిగా వుండి సాధన చేయడం. మానసికంగా అలజడిగా వున్నప్పుడు, దానిని తగ్గించి, ఆ తదుపరి సాధనకు ఉపక్రమించాలి. ఎవరైతే ప్రపంచంతో బలీయమైన విడరాని సంబంధమేర్పర్చుకుంటారో, వారిని సాధనకు ప్రోత్సహించడం సమంజసం కాదు. జ్ఞానపరంగా పరిణతి చెందితేనే అంతరంగం ప్రశాంతంగా వుంటుంది. అందునా, వైరాగ్యాన్ని పెంపొందించే జ్ఞానం అత్యంత అవసరం. వైరాగ్యంతో జీవించే వ్యక్తి కఠోర సాధనలు చేయవలసిన అవసరం లేదు. వైరాగ్యం లేనివారు, సాధన చేయడం అతి*

ప్రమాదకరం. అందుకు పరిపూర్ణ అద్వైత బ్రహ్మజ్ఞానం అత్యంత ఆవశ్యకం. అందుకే "పరిపూర్ణ బ్రహ్మజ్ఞానమే పరమౌషధం" అంటాను. అటువంటి పరిపూర్ణజ్ఞానం, పూర్ణత్వం సిద్ధించిన ఋషుల అంతర్వాణి నుండి వెల్లడైంది. ఋషులు ఆత్మస్థితికి చేరి, సత్యదర్శనం గావించుకొని అందించిన ఆత్మజ్ఞానం స్వచ్ఛమైంది. అది మీకు ఉపనిషత్తుల ద్వారా లభ్యమైంది. అటువంటి జ్ఞానాన్ని సద్గురువుల ద్వారా మాత్రమే పొందాలి తప్ప, కేవలం పాండిత్యాన్ని అందించేవారి వలన ఎటువంటి ప్రయోజనము వుండదు. ప్రస్తుత కాలమాన పరిస్థితులలో ఉపనిషత్తుల సారాన్ని అందించేవారు, అందుకోవాలని పరితపించేవారు లేరని చెప్పవచ్చు. మీ అదృష్టం కొద్దీ ఈ సద్గురువు ఆంజనేయుడు మీకు బోధించుటకై దిగి వచ్చాడు. అయితే, దానిని తెలుసుకోవడం వలన అంతా తెలిసిందన్న అహంకారం పెరుగుతుంది. అది ఇంకా ప్రమాదకరము. కావున అజాగ్రత్త అనవసరము – జాగ్రత్త అవసరము.

***ప్రస్తుత మీ జీవన విధానం***
***చదువు ఎక్కువ - జ్ఞానం తక్కువ***
***పెద్ద ఇల్లు - చిన్న కుటుంబం***
***జీతం ఎక్కువ - మనశ్శాంతి తక్కువ***
***అత్యుత్తమ వైద్యవిద్య - కాని, అనారోగ్యం***
***చంద్రుడ్ని తాకినా - పక్కింటోడు ఎవరో తెలియదు***
***తెలివి ఎక్కువ - మమకారం తక్కువ***
***మత్తుమందు ఎక్కువ - మంచినీళ్ళు తక్కువ***
***మనుషులు ఎక్కువ - మానవత్వం తక్కువ***
***ఖరీదైన వాచీ - కానీ, సమయం తక్కువ***
***ఆంజనేయుని బోధలు ఎక్కువ - అంతరంగశుద్ధి తక్కువ***
***అంతమొందించుకోవలసినవి ఎక్కువ - అది చేసేది తక్కువ***
***భగవంతుని ప్రేమను పొందుతున్నది ఎక్కువ - దానిని నిలుపుకునేది తక్కువ***
***ఎక్కువతక్కువుల లెఖ్ఖలోకి తీసుకొనని ఈ ఆంజనేయుని అంతులేని ప్రేమకు నోచుకున్న***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

వినయం లేని విద్య వికారాలకు బానిస అవుతుంది

ॐ

**31-01-2020** 08:55 AM

**42) మరణానంతరం జీవుడు ఏమవుతాడు స్వామి?**

మరణం అంటే స్థూలశరీరాన్ని విడిచిపెట్టడమే. ఎవరు విడిచిపెడ్తున్నారు? సూక్ష్మశరీరం,

కారణశరీరం – ఈ రెండింటితో కూడిన జీవుడు విడిచిపెడుతున్నాడు. సూక్ష్మశరీరం అంటే మనోబుద్ధులే. ఈ మనోబుద్ధుల ప్రకారమే ఇంతకాలం స్థూలశరీరం పనిచేసింది. ఇప్పుడా మనోబుద్ధులు, ఇక ఈ స్థూలశరీరం తమ అనుభవాలకు పనికిరాదని వదిలేసి వెళుతున్నాయి. అయితే ఏ మార్గాన వెళుతున్నాయి అనే విషయం తేలాలి. దేనినిబట్టి తేలుతుంది? ఇప్పటి స్థూలశరీరాన్ని విడిచిపెట్టి వెళ్ళే సమయంలో ఈ మనోబుద్ధులు ఏ ఆలోచనలు చేస్తున్నాయో, ఎట్టి స్థితిలో వున్నాయో, ఎట్టి సంకల్పాలు చేస్తున్నాయో, దానిని బట్టే వాటి ప్రయాణం, దానిని బట్టే మరుజన్మ. ఒక డాక్టరు ఒక క్షణంలో లాయరుగా మారి కోర్టులో వాదించలేడు. ఒక లాయరు డాక్టరుగా మారి మందులిచ్చి జబ్బు నయం చేయలేడు. ఏం చేయాలన్నా ఆయా వృత్తులలో, విషయాలలో కొంతకాలంపాటు సాధనలు చేయాలి. అంటే, మనసుకు కొంతకాలం ఆయా రంగాలలో శిక్షణ ఇవ్వాలి. అప్పుడే ఆ మనసు ఆ రంగంలో పనిచేస్తుంది. అలాగే, మనసు ఏ సంకల్పాలు చేస్తున్నప్పుడు దేహాన్ని విడిచిపెడుతుందో, ఆ సంకల్పాలను నెరవేర్చుకొనుటకే ఆ తర్వాత ప్రయత్నిస్తుంది. అందుకొరకు తగిన దేహాన్ని తెచ్చుకుంటుంది. ఇప్పుడు ఇక్కడ కూర్చుని ఆధ్యాత్మికమైన దానిని వింటున్నారు. ఇక్కడి నుండి వెళ్ళేటప్పుడు "అయ్యో! వంట చెయ్యలేదే" అనుకుంటారు. మరొకరు "నేను చెన్నై వెళ్ళటానికి బస్సు 7 గంటలకే కదా" అనుకుంటారు. ఒకరు "ఈ రోజెందుకో నిద్ర తూలుతున్నది" అనుకుంటారు. ఇప్పుడు వంట చేయలేదనుకున్నవారు వంటగదిలోనికి అడుగుపెడ్తారు, మద్రాసు వెళ్ళాలనుకున్నవారు బస్‌స్టాండ్‌కు వెళతారు, ఆకలి అనుకున్నవారు కంచం దగ్గరికి, నిద్ర తూలుతున్నదనుకున్నవారు మంచం దగ్గరకు వెళతారు. ఇంతకన్నా బయటి పనులు వున్నవారు స్కూటర్ దగ్గరకు వెళతారు. అలాగే, ఈ జన్మ చివరిలో దేహాన్ని విడిచి వెళ్ళేటప్పుడు ఏ సంకల్పాలు వున్నాయో, దాని ప్రకారమే తర్వాత జన్మ. అంటే ఇప్పటి ఈ జన్మ పూర్వజన్మలో శరీరాన్ని వదిలిపెట్టేటప్పటి మనోస్థితి యొక్క కొనసాగింపే. అలాగే, ఈ జన్మ చివరిలో మీ మనోస్థితి యొక్క కొనసాగింపే వచ్చే జన్మలో. కనుక, మరణంతో అంతా ముగిసిపోయినట్లు కాదు. జీవుడితో పాటుగా అతడి ఆలోచనలు, సంకల్పాలు, పాపపుణ్యాలు ప్రయాణం సాగిస్తాయి. ఆ దేహం వదిలిపోవటంతో, ఆ ఆలోచనలు, సంకల్పాలు వ్యక్తం కావటానికి తగిన దేహంలో తిరిగి రావాలి. మీకు జన్మతోపాటుగా కొన్ని అవకాశాలు లభించటమో, లభించకపోవటమో జరుగుతుంది. జన్మ రావటమనేది కేవలం ఛాన్సు కాదు. జీవుడు ముందుజన్మలో చేసిన ప్రయత్నాన్ని బట్టే, సంకల్పాలను బట్టే వుంటుంది. ముందుజన్మలలో దేహం రాలిపోయేటప్పుడు ఇచ్చిన మలుపే ఈ జన్మకు కారణం.

**43) సత్త్వగుణ సంబంధమైన ఆలోచనలతో మరణం పొందితే ఎలాంటి జన్మ వస్తుంది స్వామి?**

దేహం వదిలే సమయంలో సత్త్వగుణం అధికంగా వుంటే, అంటే భగవత్ సంబంధమైన జ్ఞానం, ఆలోచనలు, మోక్షసంబంధమైన ఆలోచనలు వున్నట్లైతే, ఉత్తమజ్ఞానుల లోకాలను, నిర్మల లోకాలను చేరుతారు. అంటే లోకాలంటే దేహాలు, జన్మలు అని అర్థం. కనుక ఉత్తమ జ్ఞానుల లోకాలంటే జ్ఞానులుగా జన్మిస్తారు అని. అలాగే, నిర్మలలోకాలంటే ప్రశాంత జీవనాన్ని గడిపే నిర్మల మనోబుద్ధులు గలవారు అని అర్థం. కనుక, జ్ఞానుల ఇండ్లలో తత్త్వవేత్తల గృహాలలో, సహృదయుల ఇళ్ళల్లో జన్మిస్తారు.

అయితే సత్త్వగుణం అప్పటికప్పుడు అలవడేది కాదు. అంత్యకాలంలో అలవరచుకుందామంటే కుదిరే పనికాదు. అసలు అంత్యకాలం ఎప్పుడో ఎవ్వరికీ తెలియదు. కనుక జీవితమంతా ప్రయత్నించాలి, సాధన చెయ్యాలి. అప్పుడు సత్త్వగుణం సహజగుణంగా మారుతుంది, అది చివరిదాకా వుంటుంది.

***దేవుడు మనిషిని సృష్టించాడు - మనిషి దేవుడిని కనిపెట్టాడు***
***శివుడిగా మారేవరకూ శిలరాయి అన్న గుర్తింపు పోదు***
***సకామభక్తి స్వర్గాది ఫలముల కొరకు - నిష్కామభక్తి జన్మరాహిత్యం కొరకు***
***అహేతుకభక్తి ఈశ్వరుని పొందుటకేనన్నది***
***సర్వసంపద ముంగిట వాలినా చాలుననే ఆశ చావదు***
***ఆశ ఎక్కడుండునో పాపఫలితం అక్కడుండును***
***పాపమునే అనుసరించి దుఃఖముండుటే సంసారము***
***జపమెందుకు? ధ్యానమెందుకు? పూజలెందుకు? ప్రార్థనలెందుకు?***
***హనుమతో అనుసంధానమైన దానికన్నా***
***నాలుక స్తుతించిన వానినే మనసు ధ్యానించాలి***
***శిరస్సు మొక్కిన వానికే ప్రదక్షిణ చేయాలి***
***చేతులు పూజించిన వానినే కన్నులు దర్శించాలి***
***లేగదూడ ఆవుని చేరినట్లు, తీగ చెట్టుకు చుట్టుకున్నట్లు***
***భక్తుడు భగవంతుని పొందాలన్న తపన, తాపత్రయం మెండుగా నింపుకుని***
***హనుమ భక్తి సత్సంగమే చేయండి, సాలోక్యముక్తిని పొందండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**01-02-2020** 08:55 AM

**44) అయితే, మరణసమయంలో జీవుడి యొక్క మానసికస్థితియే మరుజన్మను నిర్ణయిస్తుందా స్వామి?**

రజోగుణం వున్నప్పుడు మరణించినవాడు కర్మాసక్తులగు వారియందు జన్మిస్తాడు. అలాగే, తమస్సులో మరణిస్తే మూఢయోనులలో జన్మిస్తాడు. జీవితంలో ఎక్కువకాలం సత్త్వగుణంలో గడిపిన వాడైనా, అలాకాక తమోగుణంలో అజ్ఞానిగా, మూఢునిగా, సోమరిపోతుగా గడిపినవాడైనా, మరణసమయంలో రజోగుణంలో నిలిస్తే, అతడు పొందే జన్మ కర్మాసక్తుల జన్మయే. అంటే నిరంతరం కర్మలు చేయుటయందే ఆసక్తి కలిగి వుంటాడు. ఒక్క క్షణం కూడా ప్రశాంతంగా, నిశ్చింతగా కూర్చోలేడు. అలాంటి జన్మయే వస్తుంది. అలాగే ఒకరు సత్త్వగుణం కలిగి వుండి, జ్ఞానాన్ని ఆర్జిస్తూ, జపం ధ్యానం మొదలైన సాధనలు చేస్తూ, శ్రవణ మనన విచారణలను కొనసాగించినా, లేక రజోగుణ ప్రాబల్యంతో నిరంతరం కర్మలలో మునిగిపోయిన వారైనా, ఏ కారణం చేతనైనా మరణసమయంలో తమోగుణం

ప్రవేశించిందా... అదే ప్రాబల్యం వహించిందా... అతడు మూఢయోనులందు జన్మిస్తాడు. అంటే, బుద్ధిలేని జంతువులుగానో, పశుపక్ష్యాదులుగానో, క్రిమికీటకాదులుగానో, నీచ నికృష్ట జన్మలెత్తాలి. అలాకాక, ఒకవేళ మానవజన్మ వచ్చినా, బుద్ధిమాంద్యం గలవాడుగా, పిచ్చివాడుగా, తెలివితక్కువవాడిగా జన్మిస్తాడు. అతడు మూఢుడుగానే జీవితాన్ని గడుపుతాడు. కనుక జీవితమంతా ఎలా గడిపినా, శరీరాన్ని విడిచే సమయంలోని ఆలోచనలు, సంకల్పాలే ముఖ్యం. కొందరు ప్రారంభంలో పూర్వజన్మ సుకృతం వల్ల ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశించినా, జీవితంలో ఎదురయ్యే సంఘటనల వల్లనో, కష్టనష్టాల వల్లనో మనసు మార్చుకుని, "దేవుడు దేవుడు అని కూర్చుంటే ప్రయోజనం లేదు. ముందు మన కష్టాలు, బాధలు తీరాలి" అని కర్మరంగంలోకి ప్రవేశించి కోరికలతో, ఆశలతో కర్మలు చేస్తూ, తీరినకొద్దీ ఇంకా ఇంకా ఆశలు పెరిగి, వాటిని తృప్తి పరచుటకు కర్మలలో మునిగిపోతే, కర్మరంగంలో ఇరుక్కుపోతాడు. రజోగుణం వృద్ధి అవుతుంది. అప్పుడు మరణం సంభవిస్తే, "అయ్యో! నేను అది చేద్దాం, ఇది చేద్దాం అనుకున్నాను. ఏదీ పూర్తిగా చెయ్యకుండానే వెళ్ళిపోతున్నానే" అనే చింతలో ప్రాణం విడిస్తే, అతడు తిరిగి అలాంటి కర్మలు చేయుటకు తగిన దేహాన్నే తెచ్చుకుంటాడు, కర్మలలో నిమగ్నుడవుతాడు. అదే కర్మసంగులతో జన్మించుట. అలా జన్మించి, ఈ వాసనల కారణంగా నిరంతరం లౌకిక విషయాల గురించే ఆలోచిస్తూ, లౌకిక కర్మలనే చేస్తూ, ఈ సంసారబంధంలో చిక్కుకుని, అనేక యాతనలను అనుభవిస్తూ, అశాంతితో జీవిస్తారు. ఇక కొందరు, జీవితమంతా ఎలా ప్రవర్తించినా, ఎలాంటి సత్కర్మలు చేసినా, జ్ఞానాన్ని సంపాదించినా అంత్యదశలో కుమారుల వల్లనో, కోడళ్ళవల్లనో, వ్యాధులవల్లనో జీవితం మీద విరక్తి చెంది, ఏ కుక్కలనో, పందులనో, పశువులనో చూచి, "నాకంటే అవే నయం. హాయిగా తింటూ, తిరుగుతూ స్వేచ్ఛగా జీవిస్తున్నాయి. నా బ్రతుకే హీనాతిహీనంగా అయిపోయింది. ఎలా బ్రతికాను! ఎంత గౌరవాన్ని పొందాను! చివరకు వీళ్ళ చేతుల్లోపడి అవమానాలు పొందాల్సివచ్చింది" అనుకుంటూ వుంటారు. అలాగే మీకు ఎంతటి వివేకమున్నా, దాని విలువను మర్చిపోయి ఏ పిచ్చివాడ్నో చూచి, "మా కంటే వాడే నయం. వాడికి ఏ బాధా తెలియదు, ఏ దిగులూ లేదు" అని వాడ్ని చూచి కూడా అసూయపడతారు. "బుద్ధిగల మానవజన్మ కన్నా, బుద్ధిలేని జన్మలే నయం" అనుకుంటూ ఉన్నప్పుడు ప్రాణం పోతే, దేహాన్ని విడిచిన మనోబుద్ధులు, ఆ దిశలోనే ప్రయాణం చేసి, అలాంటి బుద్ధిహీన జన్మలనే పొందటం జరుగుతుంది. మూఢయోనులందు, పశుపక్ష్యాదులుగా జన్మించటం జరుగుతుంది. లేదా పిచ్చివాడుగానూ, మొద్దుబారిన వాడుగా పుట్టడం జరుగుతుంది. ఆ జన్మలలోని బాధ అప్పుడు అనుభవానికి వస్తుంది. ఇది తమోగుణ ప్రభావం వల్ల కలిగే జన్మ. ఇలాంటి నీచ నికృష్ట జన్మలు కలగకుండా మీలో రజోగుణ, తమోగుణాలు తలెత్తకుండా చూసుకోవాలి. అందునా, అంత్యకాలంలో ఈ రజోగుణం, తమోగుణం లేకుండా నిరంతరం జ్ఞానసంబంధ విషయాలనే విచారణ చేస్తూ వుండాలి. భగవంతుని పట్ల భక్తి, ప్రాపంచిక విషయ వైరాగ్యం, భగవన్నామ స్మరణ, శ్రవణ, మనన, నిధిధ్యాసలు, జపం లేదా సర్వవ్యాపక ఆనందస్వరూప ఆత్మ అనే భావన నిరంతరం కలిగివుండాలి. అప్పుడే, లభించిన ఈ మానవజన్మకు సార్థకత. అయితే, ఇప్పుడు ఒక సందేహం. అంత్యకాలంలో స్మరణ చెయ్యాలంటే జీవితమంతా అలా భగవత్ స్మరణ చేయాలి అన్నారు కదా. అలా భగవత్ స్మరణ జీవితమంతా కొనసాగించే

*వారికి ఇంకా భయమెందుకు? అని సందేహం. నిజంగా జీవితమంతా చివరి శ్వాస వరకూ భగవంతుని తలచుకొనేవారికి భయం లేదు. కానీ, చాలాకాలం ఆచరణ చేసి, మధ్యలో ఏ కారణం చేతనైనా దారి తప్పితేనే ఈ భయం. కనుక, ఎన్ని అవాంతరాలు వచ్చినా, ఎన్ని కష్టాలు వచ్చినా భగవచ్చింతనను వదిలిపెట్టరాదు. శ్రవణ మననాలను వదలరాదు. సాధనలను మధ్యలో ఆపివేయరాదు. కష్టాలకు భయపడక, ఆటంకాలు తొలగిపోక, జీవితంలో ఎదురయ్యే సంఘటనలకు చలించక, వాటినన్నింటినీ అల్పమైనవిగా భావించి, త్రోసివేసి, ఏ క్షణంలో దేహం రాలిపోతుందో తెలియదు గనుక, ప్రతిక్షణం సత్త్వగుణంలో వుండాలి. ఆత్మభావనలో వుండాలి. లేదా, భగవంతుని స్మరణలో వుండాలి. ఇంకా, ఈ ఆంజనేయుని బోధలు నిరంతరం మననం చెయ్యాలి.*

***ఈ జన్మ గతజన్మ కర్మఫలాలను అనుభవించటానికే వచ్చినది***
***అవి సుఖాలో దుఃఖాలో, కష్టాలో భోగాలో అనుభవించటానికే.***
***అనుభవించే శరీరానికి అది జీవితం లేదా బ్రతుకు అంటారు.***
***ఈ జన్మలో అనుభవించగా మిగిలిన కర్మఫలాన్ని మోసుకెళ్తుంది తనతో మరుజన్మకు బ్యాలెన్స్‌గా.***
***బ్యాలన్స్‌ను బట్టేకదా నీ జీవితం జరుగుతుంది***
***కావున, మస్తిష్కాలను రగిలించి పదుగురికీ పరోపకారులై***
***జీవనసాఫల్యానికి చిరునామాలుగా జీవితాన్ని తీర్చిదిద్దుకుని***
***సత్త్వగుణమే శాశ్వతబంధంగా, జ్ఞానోద్దీపన దిశలో సాగి, ఆత్మానందాన్ని పెంపొందింప చేసుకుని,***
***ఆంజనేయుని భావం అర్థం చేసుకున్న జీవులు ఉద్ధరించబడటం***
***ఈ జన్మలోనే సాధ్యం, అంటే సుసాధ్యం***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**02-02-2020** 09:00 AM

**45) పూర్వజన్మలలో ఆచరించిన కర్మలు రాబోవు జన్మలను ఏ విధంగా ప్రభావితం చేస్తాయి స్వామి?**

*ఏ గుణాలు ప్రబలంగా ఉన్నప్పుడు మరణిస్తే, ఎలాంటి జన్మలు వస్తాయో ఇంతవరకు చెప్పాను. ఐతే, ఉత్తమజన్మలు పొందినవారంతా ఎప్పుడూ సుఖాలే అనుభవిస్తారా? నీచజన్మలు పొందినవారు ఎప్పుడూ దుఃఖాలే అనుభవిస్తారా? కానీ, మీ అనుభవంలో దుర్గార్గులు, నీచజన్మలెత్తినవారు సుఖాలు అనుభవించడం, భక్తులు జ్ఞానులు అయినవారు దుఃఖాలు అనుభవించడం చూస్తూనే వున్నారు కదా. దీనికి కారణం ఏమిటి? పుణ్యకర్మలకు, మంచిపనులకు, సాత్త్వికమైన నిర్మలమైన ఫలం లభిస్తుంది. రజోగుణకర్మలకు దుఃఖమే ఫలం, తమోగుణ కర్మలకు అజ్ఞానం ఫలం. జీవితం ఒక పొలం లాంటిది. పొలంలో ఏ విత్తనం వేస్తే, ఆ పంట వచ్చినట్లు, ఈ జీవితమనే పొలంలో ఏ గుణ సంబంధమైన కర్మను చేస్తే, దానికి తగిన ఫలమే వస్తుంది. వివేకవంతుడు జీవితాన్ని మలచుకుంటాడు. వివేకహీనుడు,*

ఆలోచనారహితుడు జీవితాన్ని దుఃఖమయం చేసుకుంటాడు. గోడ కట్టేవాడు పైకిపోతాడు, బావి త్రవ్వేవాడు క్రిందికి పోతాడు. చేసిన కర్మ ఊరికే పోదు. ఫలితాన్ని ఇచ్చే తీరుతుంది. పుణ్యకర్మలు చేసినవారికి నిర్మలఫలం, అంటే చిత్తశుద్ధియే. అతడు తన మనసును పెడదారులకు పోనీయడు. తాను ఉద్ధారమవుతూ, ఇతరులకు మార్గదర్శకంగా వుంటాడు. ఇక ఆశ, లోభం, అహంకారం, కీర్తిప్రతిష్ఠలు, పదవులు వీటికి లోబడి కర్మలు చేసేవాడు చేజేతులా కర్మబంధంలో ఇరుక్కుని, దుఃఖాలను నెత్తిమీదకు తెచ్చుకుంటాడు. విషయాల వైపుకు ఆకర్షించబడతాడు. వీరు రజోగుణ కర్మఫలం అనుభవించేవారు. అలాగే, తామస కర్మఫలంగా ఏమరుపాటు, సోమరితనం, నిద్ర, అజ్ఞానం మొదలైన లక్షణాలతో స్థబ్దుగా వుంటారు. వీరు జ్ఞానశూన్యులు. కనుక మంచిగాని, చెడుగానీ ఏది పండించుకోవాలన్నా మీ చేతుల్లోనే వుంది, మీ చేతల్లోనే వుంటుంది. ఉత్తమకర్మలకే ఉత్తమఫలితం. ఐతే, ఉత్తముల ఇళ్ళల్లో, జ్ఞానుల ఇళ్ళల్లో జన్మించిన వారంతా సుఖపడతారని, మధ్యముల, అధముల ఇళ్ళల్లో పుట్టినవారు దుఃఖాలు పొందుతారని అనుకునే వీలులేదు. మీ సుఖదుఃఖాలకు కారణం మీరు పూర్వంలో చేసిన కర్మలే. పూర్వజన్మలో చేసిన కర్మలు సంచితాలై, మీ వెంట వస్తాయి. అందులో సాత్త్వికభావంతో చేసిన పుణ్యకర్మలూ వుంటాయి, రజోగుణంతో చేసిన స్వార్థపూరిత కర్మలూ వుంటాయి, తమోగుణంతో చేసిన విపరీతకర్మలూ, నిషిద్ధకర్మలూ వుంటాయి. ఆ కర్మలన్నింటిలోనుండి ఏవి అనుభవించటానికి సిద్ధంగా పక్వానికి వచ్చి వుంటాయో, వాటినే ప్రారబ్ధకర్మలు అంటారు. ఆ ప్రారబ్ధాన్ని ఎవరైనా తప్పక అనుభవించి తీరవలసిందే. కనుక మంచి పుట్టుక అయినా, చెడు పుట్టుక అయినా, సుఖదుఃఖాలు మాత్రం ప్రారబ్ధాన్ని బట్టి అనుభవించవలసిందే. దీనిని బట్టి అంత్యకాలంలోని ఆలోచనలు, సంకల్పాలు, గుణప్రభావాన్ని బట్టి తగిన జన్మ వస్తుంది. ఆ జన్మలో అనుభవించే సుఖదుఃఖాలు మాత్రం అంతకు ముందు జన్మలలో చేసి వెంటతెచ్చుకున్న సంచిత కర్మలలో నుండి పక్వానికి వచ్చిన ప్రారబ్ధకర్మలను బట్టే అనుభవించాలి అని గ్రహించండి. కనుక ఇప్పుడు సుఖపడే వాళ్ళంతా, పూర్వజన్మలలో సాత్త్వికగుణంతో కర్మలు చేసినవారని, ఇప్పుడు దుఃఖాలు అనుభవించే వారందరూ పూర్వం రజోగుణంతో స్వార్థపూరిత కర్మలు చేసినవారని, ఇప్పుడు అజ్ఞానంలో మునిగిపోయి సోమరిపోతుల్లా, తెలివితక్కువ దద్దమ్మల్లా, పిచ్చివాళ్ళల్లా జీవితాలను వ్యర్థం చేసుకునే వారంతా తమోగుణంతో నిషిద్ధకర్మలను, విపరీత కర్మలను చేసినవారని గ్రహించాలి. ఇంత తెలుసుకున్న తర్వాత, రాబోయే జన్మలలోనైనా దుఃఖాలు లేని, అజ్ఞానం లేని ఉత్తమజన్మలు రావాలంటే రజోగుణ, తమోగుణ కర్మలు చేయకూడదని, సత్త్వగుణంతో కూడిన సత్కార్యాలు, దైవకార్యాలు చేస్తూ, ఆత్మజ్ఞానంపై ఆసక్తితో శ్రవణ, మనన, విచారణలతో జీవితాన్ని గడపాలని గ్రహించి మీ ఆచరణలను, ఆలోచనలను సరిదిద్దుకోవాలి. మీరు మీ ప్రారబ్ధం ప్రకారం సుఖదుఃఖాలు అనుభవించి తీరాల్సిందే. తప్పించుకునే వీలులేదు. కనుక, దానిని గురించి పట్టించుకొని ప్రయోజనం లేదు. కానీ, ఏదైనా సాధించాలంటే మాత్రం పురుషార్థం ముఖ్యం. పుట్టుక అంటే జన్మ ముఖ్యం. ఎలాంటి జన్మలను పొందటానికి ఎలాంటి గుణాలను వృద్ధి చేసుకోవాలని అన్నట్లయితే, సత్త్వగుణం వల్ల జ్ఞానం వస్తుంది. రజోగుణం వల్ల లోభం కలుగుతుంది. తమస్సు వల్ల ఏమరుపాటు, భ్రాంతి, అజ్ఞానం కలుగుతాయి. ప్రపంచంలో కొందరు జ్ఞానులుగా వుండి, గౌరవమర్యాదలు పొందుతూ వుంటారు. కొందరు స్వార్థబుద్ధి గలవారుగా, లోభులుగా వుంటారు. మరికొందరు అజ్ఞానులుగా, అయోమయ అవతారాలుగా వుంటారు. ఎందుకిలా జరుగుతున్నది? ఆ స్వభావాలు వారికి ఎలా

వచ్చినవి? పూర్వంలో వారు చేసిన కర్మలు, వారి ఆలోచనలు, ఆచరణయే కారణం. సత్త్వగుణంలో వుండి చేసిన కర్మల ఫలితంగా వారు జ్ఞానులుగా పుడతారు. వారి వాసనలే వారి స్వభావంగా మారి, జ్ఞానము నుండే వారి మనసు నిలుస్తుంది ఈ జన్మలో. అందుకే జ్ఞానార్జన వారి స్వభావమవుతుంది. రజోగుణంతో కర్మలు చేసినవారు నిరంతరం కోరికలతో, ఆశలతో, స్వార్ధంతో కర్మలు చేస్తూ, కర్మలయందే ఆసక్తి కలవారవుతారు. వారి వాసనలే వారి స్వభావంగా మారి, ఒక్కక్షణం ప్రశాంతంగా వుండనివ్వవు. వాసనలన్నీ పూర్వజన్మలకు సంబంధించినవే. అవే ఈ జన్మలో పురుషార్ధానికి పెట్టుబడి. ఒక్క విషయాన్ని గుర్తించండి. మీరు చేసిన కర్మల కారణంగా, మీకు వచ్చే జన్మను, కర్మఫలాలైన సుఖదుఃఖాలను మార్చుకోలేరు. కాని, వాసనలను మాత్రం మార్చుకునేందుకు పురుషార్ధాన్ని సమర్ధవంతంగా నెరవేర్చుకునేందుకు అవకాశమున్నది. కనుక, మానవజన్మ మీరు బాగుపడేందుకు వచ్చిన ఒక సువర్ణావకాశం. ఈ ఛాన్స్‌ను వదులుకున్నారా... సమీప భవిష్యత్తులో మానవజన్మ రాదు, నీచజన్మలే గతి. హెచ్చరిస్తున్నాను. దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి. ఈ ఆంజనేయుడు సద్గురువై, చెంత వున్నప్పుడే సరిచేసుకోండి. ఈ విషయాలను పదేపదే పొల్లుపోకుండా చెబుతున్నాను. అర్ధం చేసుకొని అర్ధవంతం చేసుకోండి.

***ప్రపంచం నిరంతరం మారుతూ వుంటుంది***
***ప్రాపంచిక విషయవాంఛలు మాయకు ప్రతిరూపాలు***
***ప్రపంచంలో జీవించడం మనిషికి తప్పక అవసరమే***
***ప్రాపంచిక విషయాలలో బంధించబడటం ప్రమాదం***
***ప్రపంచంలో ప్రలోభపెట్టే అంశాలు ఎన్నో వుంటయి***
***ప్రలోభాలకు లొంగి తివా... సమూలంగా పతనమవుతావు***
***ప్రపంచం ముఖ్యం అనుకునేవారే, దానికి ప్రలోభపడతారు***
***ప్రపంచాన్ని జయించినవారే పరమోన్నత పురుషులవుతారు***
***ప్రపంచంలో ఎక్కడా ఆనందమనేది లేదు... లేనేలేదు***
***ప్రపంచం నుండి ఆనందం పొందడం అసాధ్యం***
***ప్రాపంచిక విషయాలు కొంత తృప్తిని ఇవ్వవచ్చు***
***పారమార్ధికం కొండంత సంతృప్తిని ఇస్తుంది***
***పవనకుమారుని బోధలు మిమ్ములను ప్రపంచం అనే మత్తు నుండి బయటపడవేసి,***
***బాగుపడాలన్న ఆలోచనను అందించి,***
***అత్యుత్తమమైన జీవనసారాన్ని బోధిస్తున్న ఈ ఆంజనేయుని ఆధ్యాత్మిక బోధలు విని***
***సత్కర్మలు చేస్తూ, అత్యుత్తమ ధర్మాలను ఆచరిస్తూ,***
***ఆశించకుండా, శాశించకుండా ఆదర్శధర్మాన్ని పాటిస్తూ,***
***ప్రణతులర్పిస్తూ, పావనమార్గాన్ని అనుసరించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**03-02-2020** 08:55 AM

**46) కర్మల ఫలితంగా జననమరణ చక్రంలో చిక్కుకోకుండా ఉండాలంటే ఏమి చేయాలి స్వామి?**

*పశుపక్ష్యాదులు, క్రిమికీటకాదులు, క్రూర-సాధు జన్మలు ఏవైనా కానీ, 60 వేల జన్మల అనంతరం మానవజన్మనెత్తటానికి అర్హతను సంపాదించుకుంటాడు జీవుడు. అది తెలుసుకోవాలి జీవుడు. ఈ జన్మలోనే అటువంటి విచక్షణా జ్ఞానాన్ని ఈ సద్గురువు ప్రసాదిస్తున్నాడని తెలుసుకోండి. అయితే అందుకు ప్రతిగా ఈ సద్గురువు పట్ల కృతజ్ఞతాభావాన్ని ఏ సందర్భంలోనైనా ఇసుమంత కూడా మీరు వ్యక్తపర్చటం లేదు. ఈ ప్రపంచమంతా మీదిగానే భావిస్తున్నారు. ఈ బంధాలు, అనుబంధాలు శాశ్వితమని, భోగభాగ్యాలతోనే జీవితం ముడిపడి వుందని తలపోస్తూ పరమాత్మకు దూరమవుతున్నారు, సద్గురువు సన్నిధిని కోల్పోతున్నారు. దుష్కర్మలు చేస్తూ జీవితాన్ని గడుపుతున్నారు. ఆవుటెద్దులా స్వేచ్ఛగా తిరుగుతున్నారు. అంతేగాక, భగవంతుడు ఆడుతున్న ఈ క్రీడలో మీరంతా పావులని, క్రీడాకారులని గుర్తించలేకపోతున్నారు. ఈ దొంగాటలో అరిషడ్వర్గాలనే దొంగలకు దొరికిపోయి, తల్లి చెంతకు చేరుకోలేకపోతున్నారు. విధి ఆడుతున్న ఈ వింత క్రీడలో మీరు చేయగలిగిందల్లా ఒక్కటే. సద్బుద్ధిని పెంపొందించుకోవటం, పరుగు పెట్టే మనసుని కళ్ళెం వేసి నిలబెట్టడం. అందుకు మీరేం చేయాలి? ప్రకృతినంతా పరిశీలన చేయాలి. అవగాహనను రూపొందించుకోవాలి. హరినామం ఉచ్ఛరించని జిహ్వాని నిరంతరం అభ్యాసంతో హరినామమే శ్వాసగా జీవించడం అలవాటు చెయ్యాలి. మకిలి అంటుకోకుండా మనసుని పవిత్రంగా తయారుచేసుకోవాలి. బుద్ధితో మనసుకు దారి చూపాలి. అంతర్యామిగా మీలో విరాజిల్లుతున్నది ఆ భగవంతుడేనన్న స్ఫురణతో జీవించగలగాలి. ఈ సాధనా ప్రక్రియలో భగవంతునిపై మనసు లగ్నం చేయండి. జపాలు, హోమాలు, పూజలు చేయగలిగినన్ని చేస్తూ, భగవంతునిపై మనసు లగ్నం చేయండి. ఒక్కొక్క నీటిచుక్క కలిస్తే, కుంభవృష్టి వర్షం అవుతుంది. వేలమైళ్ళ గమ్యమైనా, ఒక్క అడుగుతోనే మొదలవుతుంది. ఇంతకన్నా ఎక్కువ చెప్పనక్కరలేదనుకుంటాను. జపతపాదులు చేయలేనివారు ఆ హరినామస్మరణలోనే జీవించే అలవాటు చేసుకోండి. నిరంతరం ఈ అభ్యాసం చేస్తూ, పరమాత్మ చెంతకు చేరుకునేలా మనసుకు ప్రబోధం చేస్తూ, బుద్ధిని శీఘ్రంగా నిలిపినట్లయితే, భగవంతుని సన్నిధికి చేరువవుతున్నట్లే. ఏ క్షణమైతే మనసంతా భగవంతునిమయం అవుతుందో, ఆ మరుక్షణం నుండి మిమ్ములను నడిపేది ఆ భగవంతుడే. అప్పుడు నిర్ణయాలు మీవి కావు. నాది నాది అనే భావం మీలో మాయమైపోతుంది. అందరిలో 'నాది' అనే స్థానంలో 'మనది' అనేది పురుడు పోసుకుంటుంది. అరిషడ్వర్గాలు మీ నుండి దూరంగా పారిపోయి, మిమ్మల్ని పునీతుల్ని చేస్తుంది. కష్టాలకు కృంగిపోని, సుఖాలకు పొంగిపోని సమత్వస్థితికి మీ మనసు చేరుకుంటుంది. జీవన్ముక్తులై మోక్షానికి అర్హతను పొందుతారు. పరిపూర్ణ జీవన్ముక్తిస్థితిని పొందినవారి మనసు నిండా ఆనందమే. అదే మీకు కావలసింది. అందుకే కోరికలను త్యజించి, నువ్వే కావాలంటూ భగవంతుడ్ని ప్రార్థించండి. సంకల్పం బలంగా వుంటే, అప్పుడు భగవంతుడే దిగి వచ్చి, మిమ్మల్ని తనవారుగా చేసుకుంటాడు. ఏకాత్మస్థితిని అనుగ్రహించి, అందలం ఎక్కిస్తాడు. సత్యమేవ సత్యమిది. మీరు భగవంతుని శక్తి కోసం ప్రార్థిస్తే,*

ఆయన కష్టాలనిస్తాడు. వివేకం కోసం ప్రార్ధిస్తే, సమస్యలనిస్తాడు. ధైర్యం కోసం ప్రార్ధిస్తే, సమస్యలనిస్తాడు పోరాడమని. సిరిసంపదల కోసం ప్రార్ధిస్తే, శ్రమించమని శక్తినిస్తాడు. అండ కోసం ప్రార్ధిస్తే, ఈ ఆంజనేయుని పంపి అనుగ్రహాన్ని అందించాడు. ఆంజనేయుని సన్నిధిని ప్రసాదించాడు. ఎంతో బోధించేటట్లు చేశాడు. మీరు చేస్తున్న కృషి కన్నా లక్షరెట్లు మిమ్మల్ని లక్ష్యం వైపు నడిపించాలన్న తపన ఈ పవనకుమారుడిది. నేను కోరుకున్నది దక్కలేదు గానీ, మీరు కోరుకుంటున్నవన్నీ మీకు లభిస్తున్నాయి. ఇది భగవంతుడి గొప్పదనం! భగవంతుడ్ని మీరు ఎన్నో కోరుకుంటారు. కానీ, ఆయన మీరు కోరుకున్నవన్నీ అందించడు. కానీ, మీకు అవసరమైనవి మాత్రమే సమకూరుస్తాడు. అందువలన, భగవంతుని కోరుకోవడం కాదు, ఆయన పట్ల సంపూర్ణ విశ్వాసం, శరణాగతితో జీవించగలిగితే చాలు. ఈ ఆంజనేయునికి దానిని మాత్రమే అందించండి. ఇంతవరకూ అర్ధించడం చేతకాని ఈ అంజనీపుత్రుడు, రెండు చేతులూ చాచి అర్ధిస్తున్నాడు. అర్ధవంతమైన భిక్షను అనుగ్రహించండి.

**ఆగమర్థంతు దేవానాం గమనార్థంతు రాక్షసామ్ ।**
**కురు ఘంటారవంచైనం దేవతా విధ్వన మాచరేత్ ॥**

గుడిలో గంట కూడా మీలో చేతనత్వాన్ని తెస్తుంది. గంట మ్రోగించినప్పుడు వచ్చే నాదతంత్రులు పవిత్రభావాన్ని, ఏకాగ్రతను ఏర్పరుస్తాయి. దాని నుండి వచ్చే ప్రతిధ్వని ఏడు సెకండ్లు మీ సప్తచక్రాల్ని కదిలిస్తుంది. సరిగ్గా గమనిస్తే, గంట మ్రోగినప్పుడు ఓం అనే శబ్దం వినిపిస్తుంది.

***మనిషి ఎదగడమంటే, మానవత్వాన్ని పెంపొందించుకోవటమే***
***మనిషి పతనం కావడమంటే, దానిని పూర్తిగా విస్మరించడమే***
***మనిషి తనలోని మానవత్వాన్ని గుర్తించగలగడమే సాధన***
***మనిషి మానవత్వాన్ని కోల్పోతే, దానవుడిగా మారతాడు***
***మానవత్వం అనే పుస్తకం కంటే, వేరే ఉత్తమ గ్రంథం మరొకటి మీకు ఏముంటుంది?***
***ఆచరణ లేని పుస్తకపఠనం అతి ప్రమాదకరం***
***నీతులు చెప్పటం వల్ల పెద్దగా లాభం ఏమీ లేదు***
***వాటిని ఆచరించినప్పుడే ఆ మనిషికి విలువ పెరుగుతుంది***
***ఎందుకంటే,***
***వీధిలోని గోడల మీద కూడా ఇలాంటి రాతలు ఎన్నో, ఎన్నెన్నో కనబడతాయి.***
***అప్పుడు వీధిలోని గోడకు, ఇక్కడ కూర్చున్న మీకు పెద్దగా తేడా లేనట్లే అని***
***ఈ అంజనీకుమారుడు చెబుతున్న వైనాన్ని గుర్తించి,***
***కాలం ఆగకుండా పరిగెడుతుందని,***
***దానిని పట్టుకొనకపోతే, మీరు చేరవలసిన లక్ష్యం కష్టమైనా చేరమని చెబుతూ,***
***మీ వెంట మీ సద్గురువు చూపిన బాట వున్నదన్న నమ్మకం గొప్పగా పెంచుకుని***
***నాతో నా స్వామి వున్నాడన్న భరోసాతో ముందుకు సాగండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం


**04-02-2020** 09:10 AM

**47) సమయం యొక్క ప్రభావం ఎట్టిది స్వామి? ఏ సమయంలో ఎట్టి పనులు చేయాలి స్వామి?**

*ఏదైనా సాధించాలంటే, సాధనం బాగుండాలి. తుప్పుపట్టిన కత్తితో ఏ సైనికుడు యుద్ధం చేయలేడు. అందుకే యుద్ధానికి వెళ్ళేవాడు కత్తికి పదును పెట్టుకోవాలి. అలాగే ఏదైనా ధర్మకార్యం చేయాలన్నా, జీవిత పరమార్ధాన్ని తెలుసుకోవాలన్నా అందుకు సాధనమైన శరీరాన్ని అనుకూలంగా సిద్ధం చేసుకోవాలి. ఈ లక్ష్యసాధనలో భాగంగా మీకు నేను అందించదలుచుకున్న మార్గమే సదాచారం. నిద్రలేవటంతోనే మీ దైనందిన జీవితం ఆరంభమవుతుంది. సదాచారంలో మొదటి అంశం నిద్ర. నిద్రలేచే విషయంలో ఒకే మాటగా చెబుతాను. "బ్రాహ్మీ ముహూర్తే బుద్ధేత" అని. అలాగే, "బ్రాహ్మీ ముహూర్తే చింతయేదాత్మనో హితం" అంటే, ఆయురారోగ్యాలతోపాటు ధర్మాచరణకు బ్రాహ్మీముహూర్తంలో నిద్రలేవాలి. సూర్యోదయానికి ముందున్న ముహూర్తాన్ని 'రౌద్ర' అంటారు. దీనికి ముందున్నదే బ్రాహ్మీముహూర్తం. అనగా, సూర్యోదయానికి సుమారు గంటన్నర ముందుండే సమయం. ఈ సమయంలో నిద్రలేవటంలో, వైజ్ఞానిక రహస్యం ఇమిడి వుంది. భూమి తన చుట్టూ తాను తిరగటం వలన రాత్రి-పగలు ఏర్పడుతాయి. బ్రాహ్మీముహూర్తం నుంచి మధ్యాహ్నం వరకూ వుండే సమయం ఉత్తేజం కలిగించే సమయం. ఈ సమయంలో దేహంలో అన్ని రకాల శక్తులు వృద్ధి పొందుతాయి, చురుగ్గా పనిచేస్తాయి. దీనిని 'ఆదాన సమయం' అంటారు. మధ్యాహ్నం నుండి మధ్యరాత్రి దాటే వరకు శిథిలతనిచ్చు సమయం. ఈ సమయంలో అలసట స్వభావం ఏర్పడుతుంది. శరీరంలోని అన్ని అవయవాల శక్తులు సన్నగిల్లుతాయి. దేహం విశ్రాంతిని కోరుకుంటుంది. దీనిని 'విసర్గ సమయం' అంటారు. ఆదాన సమయంలో నిద్రపోవటం, విసర్గ సమయంలో మెలకువగా వుండటం శారీరకంగానూ, మానసికంగానూ అనారోగ్యకరమైంది. దీంతో బుద్ధి చురుకుదనం కోల్పోతుంది. లౌకిక వ్యవహారాలకే ప్రాధాన్యతనిచ్చేవారు ఈ వ్యత్యాసం గుర్తించరు, గుర్తించలేరు కూడా. ఇలాంటివారు తమ ఆధ్యాత్మిక దృష్టిని వికశింప చేసుకునే అవకాశాలను చాలావరకూ కోల్పోతారు. అయితే, ఇలాంటివారికి అవసరమైన శాంతస్థితి చేకూరదు. దీంతో వీరు నిజమైన సుఖశాంతులకు దూరం అవుతారు. ఈ ప్రవృత్తిని 'నిశాచర ప్రవృత్తి' గా పిలుస్తారు. వేకువ ఝామున నిద్రలేచే విషయంలో పసిపిల్లలే సదాచారపరులు. చిన్నారులు తల్లిదండ్రులకంటే ముందే, బ్రాహ్మీముహూర్తాన్నే నిద్ర లేస్తారు, వాళ్ళను నిద్ర లేపుతారు. పసిపిల్లలు నిద్రలేచే ఈ ప్రవృత్తి, ప్రకృతిసిద్ధం. బ్రాహ్మీముహూర్తంలో పక్షులు కిలకిలారావాలు వినిపిస్తాయి. పశుపక్ష్యాదులు కూడా బ్రాహ్మీముహూర్తంలో నిద్రలేస్తాయి. అంతేకాదు, సకల పుష్పాలు ఈ ముహూర్తంలోనే పరిమళాలను వెదజల్లుతాయి. అలాగే, ఈ ముహూర్తంలో నిద్ర లేస్తే, మీ బుద్ధి కూడా వికశించి, ఉత్తమ సమాలోచనలు పొందుతుంది. అందుకే, అది బ్రహ్మముహూర్తమైంది. బ్రాహ్మీ అంటే, సరస్వతి. బ్రాహ్మీముహూర్తాన లేచిన వెంటనే చల్లని*

నీటితో కళ్ళు తుడుచుకోవాలి. కొన్ని గంటలుగా కాంతిని నిరోధించిన కళ్ళకు హఠాత్తుగా వెలుగు చూపటం దోషం. అందుకొరకై, ఇలా చన్నీటితో తుడుచుకోవాలి. ఆ తర్వాత **సముద్రవసనే దేవీ పర్వతస్తనమండలే । విష్ణుపత్నీ నమస్తుభ్యం, పాదస్పర్శం క్షమస్వమే ॥** అని భూదేవికి నమస్కరించిన తర్వాతే పాదం భూమిపై మోపాలి. మీరు దైనందిన జీవితమంతా సకల దుష్ట విసర్జనలతో సహా ఈ భూమి మీదే చేస్తారు. కాబట్టే మీకు తిండిని ప్రసాదించి జీవితాంతం మిమ్ములను భరించే ఈ భూమికి క్షమాపణ చెప్పుకొని, భూమి మీద కాలుపెట్టడం కనీస కర్తవ్యం. కాలు తగిలితే, "సారీ!" చెప్పుకునే నాగరికత చూస్తున్న మీరు, భూదేవిని క్షమించమని ప్రార్థనను చేయలేరా? నిద్ర లేవగానే ఎదురుగా భగవంతుని రూపాన్ని దర్శించుకొని లేచినట్లయితే, ఆ రోజు జీవితంపై అది ప్రభావం చూపుతుంది. అరచేతిలో శ్రీరామనామాన్ని వ్రాసుకుని ఆ అరచేయి కళ్ళకద్దుకుని లేవండి. నిద్రలేవగానే ఏ విధంగానైనా దైవదర్శనం అయ్యేటట్లు చేసుకోవడం మంచిది. దైవప్రార్థన తర్వాత ముఖం, కాళ్ళూ, చేతులు కడుగుకుని పుక్కిలించి వుమ్మివేయాలి. అనంతరం జలపానం చేయాలి. ప్రాతఃకాల జలపానం ఎంతో ఆరోగ్యప్రదం. రాత్రి నిద్రకు ముందు రాగి, వెండి, కంచు, మట్టి పాత్రలయందు మంచినీరుంచి, ప్రాతఃకాలంలో త్రాగితే, సకలదోషాలు హరించుకుపోయి, ఆరోగ్యం చేకూరుతుంది. వాత, పిత్త, కఫ ప్రకోపాలు తొలగటమే కాకుండా, హృద్రోగము, శ్వాస, క్షయ, ఆస్మ, మూత్రంలో రాళ్ళు, రక్త విరేచనాలు, అతిసార, అతిమూత్రం మొదలైన ఎన్నో వ్యాధులు క్రమంగా ఉపశమిస్తాయి. అంతేగాక, సంతోషం, బలం, ఆయుర్వృద్ధి, వీర్యవృద్ధి, ఆరోగ్యం కలుగుతాయి. జలపానం చేశాక కొద్దిసేపు నడవడం మలబద్ధకాన్ని పోగొడుతుంది. బ్రాహ్మీముహూర్తంలో ప్రాతఃస్మరణతో పుణ్యం, సంస్కారం చేకూరుతాయి. ఈ ఆంజనేయుని బోధలు బాగా విని ఆచరణలో పెట్టినట్లయితే, బాగుపడటం మీ వంతు అవుతుంది.

***బుద్ధిగా పదిమంది మెచ్చుకొనంగా, మీరు కోరిన జీవితానికి స్వాగతం పలకండి***
***జీవితానికి వెలుగుబాటలు వేసి, గెలుపుదిశగా!***
***సమయమెంతో విలువైనదని గుర్తించి, ఆడ్డంకులు అడుగడుగునా ఎదురైనా,***
***వృధా చేస్తే తప్పదు మూల్యం***
***సమయమంతా సద్వినియోగ పరచుకొనుటకై, సాధనా దిశగా సంకల్పమొనరించి***
***ఆత్మస్థైర్యంతో ఆంజనేయుని అడుగులలో అడుగులు వేస్తూ,***
***అది-అంతం దైవసొంతంగా గుర్తించాలి***
***లేకుంటే, లేదు అర్థం అని గ్రహించి***
***పోరాడి గెలిస్తేనే విజయం***
***ఇదియే జీవనసత్యంగా గుర్తించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***




## పై చిత్రం గూర్చి

*ప్రేమ, శాంతి అను బావి. అది జీవుడి యొక్క అంతరంగము. అదే దైవస్థానము. జీవుడు బాహ్యదృష్టి కలిగి వుంటే, ప్రకృతితో కూడిన దుర్గుణాలైన అసహనము, అహంకారము, అభిమానము, క్రోధము, మమకారము మరియు మోహము వంటి దుర్గుణాలను కనబరుస్తూ, తన అంతరంగాన్ని అశాంతిగా మార్చుకుంటున్నాడు. సద్గురువు అనుగ్రహాన్ని పొందిన జీవుడిని ఈ సద్గురువైన ఆంజనేయుడు మీ అహంకారాన్ని ఒక మొట్టు మొట్టి, జీవుడ్ని అంతర్ముఖం కావిస్తాడు.*

*మాటలో మంచితనం. కరుకుదనాన్ని వీడాలి. మాటతో కంటిలో చల్లనినీరు ప్రవహించాలి. కఠినత్వంతో వేడినీరు ప్రవహించకూడదు.*

*ప్రేమతో వ్యవహరించడం. చల్లదనాన్ని తన చూపులో చూపించడం, జీవులపట్ల మమకారాన్ని ప్రదర్శించడం, అలౌకిక శాంతి, దయ, ప్రేమ మీ సొంతం కావాలి. నాతో మాట్లాడినట్లు జీవులతో మాట్లాడగలగాలి. మీ తప్పులను నా ముందు వ్యక్తపరిచినట్లు మీ తప్పులను జీవుల ముందు సమర్పించగలగాలి.*

*మీముందు వున్నది ఫోటో కాదు, స్వామి రూపం. ఆ రూపం సర్వజీవుల యందు వున్నది. ఉన్నదానిని తెలుసుకునే ప్రయత్నంలో అప్రయత్నంగా మీలో చేరి, మిమ్ములను బాధిస్తున్న వాటిని కూకటివ్రేళ్ళతో ప్రయత్నపూర్వకంగా పెకిలించివేయగలగాలి. మీది అనుకున్నది నా వద్ద వున్నది. దానిని నా వద్దకు వచ్చినట్లైతే నేనివ్వగలను. కానీ, నా వద్దకు చేరటానికి ఎన్నో ముళ్ళు, కంకర వంటివి దారిలో వున్నాయి. వాటిని తొలగించుకోనన్నా తొలగించుకొవాలి, లేదా ప్రయత్నపూర్వకంగా దానిపై నున్నటి మట్టిని దిట్టంగా వేసుకున్నట్లయితే, సునాయాసంగా నడిచిరాగలరు. ఆ నున్నటి మట్టియే ప్రేమ, శాంతి, దయ. వీటితో చేరినట్లయితే మిమ్మల్ని అమృతతుల్యులుగా నేను తీర్చిదిద్దుతాను. ఇది మీ లాంటి మాట కాదు. దైవం నుంచి విడివడిన ఒక అమృతపథం. ఆంజనేయుని పథం. పదాలు పలుకుట కాదు, పథాన్ని గట్టిగా పట్టుకోవాలి!*

ॐ

**19-02-2020** 08:55 AM

**48) ఆనందంగా ఎలా జీవించవచ్చును స్వామి?**

అంతరంగమందలి అసంతృప్తి నుండి పూర్తిగా బయటపడాలంటే, ఆనందానిచ్చే మార్గం అత్యంత అవసరం. ప్రస్తుతం మానవజాతిలో అది జరగడం లేదు. అంటే, వారు విచక్షణను, వివేచనను కోల్పోయారు. ఏది రాళ్ళబాటో, ఏది ముళ్ళబాటో, ఏది నీళ్ళబాటో, ఏది గతుకులబాటో, ఏది పూలబాటో తెలుసుకోవడంలేదు. ఒక గ్రుడ్డివాడు, మరొక గ్రుడ్డివానికి మార్గం చూపించలేడు. కళ్ళున్న వ్యక్తి మాత్రమే గ్రుడ్డివానిని కాపాడగలుగుతాడు. ప్రస్తుతం కళ్ళున్న మేథావివర్గమంతా గ్రుడ్డివారే. అందుకే, వారంతా బలహీనమై, చుట్టూ వున్నవారిని బలహీనపరుస్తున్నారు. పూలబాటను ఎన్నుకున్న వ్యక్తి జీవితం ఎలా వుంటుంది? రాళ్ళబాటను ఎన్నుకున్న జీవితం ఎలా వుంటుంది? కొంచెం విశ్లేషించుకోండి. ఒక వ్యక్తి ఆనందంగా జీవిస్తున్నాడనటానికి ప్రబల నిదర్శనం అతడు ఆరోగ్యంగా, సుదీర్ఘ ఆయువుతో, ప్రశాంతంగా, ఆనందంగా జీవించడమే. మీలో ఆనందమనేది వుంటే, అంతరంగం ఇంత కలుషితమవుతుందా? సమస్యలు రోజురోజుకూ తీవ్రతరమవుతున్నాయంటే, ఆనందం ఆవిరి అయిపోతున్నట్లే, గమనించండి. దానిలో అనుమానమే లేదు అని చెబుతున్నాను. విచక్షణ కోల్పోయిన వ్యక్తికి తనను గురించిన అవగాహన వుండదు. పిచ్చివాని చేతిలో రాయి వుంటే ఏమవుతుంది? హంతకుని చేతిలో కత్తి వుంటే ఏమవుతుంది? దుర్మార్గుని చేతిలో మారణాయుధముంటే ఏమవుతుంది? అదే విధంగా విచక్షణ కోల్పోయి, వక్రమార్గంలో జీవించే మేథావికి అధికారమిస్తే ఏమవుతుంది? తనకు తెలిసిందే వేదమంటాడు. దానినే అందరూ ఆచరించాలని శాసిస్తాడు. చివరకు తానే సమస్యగా మారతాడు. శారీరక సుఖానికి – ఆనందానికి మధ్య వ్యత్యాసం తెలియకపోతే, వారు నలుగురికీ ఏ విధంగా ఉపయోగపడతారు? ఏ విధంగా న్యాయం చేయగలుగుతారు? ఆనందమనేది మీ అంతరంగంలోనే వుంది. దాని కోసం బయట ప్రపంచంలో ఎటువంటి అన్వేషణ చేయనవసరం లేదు. విచక్షణతో జీవించే వ్యక్తికి మాత్రమే ఈ సత్యం అవగాహన అవుతుంది. అది లేని వ్యక్తి ఆనందం కోసం బాహ్య ప్రపంచంలో పరుగులు తీస్తుంటాడు. ఆనందం లేని చోట ఆనందాన్ని వెతకడమంటే, దానిని ఏమంటారు? అజ్ఞానం కాదా? అజ్ఞానంతో జీవించేవారు నలుగురికీ ఏ రకంగా న్యాయం చేయగలుగుతారు? అందుకే గమనించండి. రోజురోజుకూ సమస్యలు ఇంకా పెరుగుతున్నాయే తప్ప, తగ్గడం లేదు. సమస్యలతో జీవించే వ్యక్తి నలుగురికీ సమస్యలనే అందించగలడు గానీ, పరిష్కారాన్ని చూపలేడు. అందుకు విచక్షణ అనే అంశమే మిమ్మలను సమూలంగా మారుస్తుంది. అది లేనివారు తాను బలహీనపడి నలుగురినీ బలహీనపరుస్తాడు. తన అంతరంగంలో వున్న చెడునే అందరికీ ప్రసరింపచేస్తాడు. జీవితాన్ని నరకకూపంలోకి మళ్ళించుకుంటాడు. అలాకాక, ఎవరైతే ఆధ్యాత్మిక మార్గాన్ని ఎన్నుకొని, దానిలో పట్టు సాధించేంతవరకూ తన దృష్టిని వేరే అంశాల మీదకు మళ్ళించకుండా క్రమం తప్పకుండా సాధన చేస్తారో, వారిలో విచక్షణ వున్నట్లే. కొందరిని గమనించండి. మంచి మార్గాన్ని ఎన్నుకున్నప్పటికీ, మధ్యలో దానినుండి విరమించుకుంటున్నారంటే, వారు విచక్షణను కోల్పోయినట్లే. అసలు తనను గురించి తాను తెలుసుకోకుండా ప్రపంచాన్ని, అందలి వ్యక్తులను గురించి ఆలోచించడమంత మూర్ఖత్వం మరేముంటుంది? అత్యంత సూక్ష్మమైన మార్గం ఒక్క ఆధ్యాత్మికతయే, మరొకటి లేదు. ఎందుకంటే, దానికోసం తాను ఎక్కడికీ వెళ్ళనవసరం లేదు, ఏమీ చేయవలసిన అవసరం లేదు. సరిచేయవలసింది, సాధించవలసింది ఏమీ లేదు అనే అంశాన్ని అనుభవంలోకి పొందటమే. ఎవరైన జీవితాన్ని క్లిష్టతరం చేసుకుంటున్నారంటే,

వారు తప్పక విచక్షణను కోల్పోయినట్లే. ఒక కొవ్వొత్తి మరొక కొవ్వొత్తిని వెలిగించగలదు కానీ, ఒక బల్బు మరొక బల్బును వెలిగించగలదా? విచక్షణతో జీవించేవారంతా కొవ్వొత్తి వంటివారు, విచక్షణ కోల్పోయిన వారంతా ఎలక్ట్రిక్ బల్బులవంటివారు. ఖరీదైన జీవితం కోసం పాటుపడే వారెవరైనా, ఆనందం కోసం ప్రయత్నించరు, పరితపించరు. కాబట్టి, బాహ్యప్రపంచం నుండి ఏదో పొందాలన్న భావంతో జీవించేవారంతా అజ్ఞానంలో జీవిస్తున్నట్లే. మీరు ఎవరినీ ఉద్ధరించవలసిన అవసరం లేదు. మిమ్మల్ని మీరు ఉద్ధరించుకోగలిగితే చాలు. తనను తాను ఉద్ధరించుకోలేని వ్యక్తి మరొకరిని ఎలా ఉద్ధరించగలడు? అసలు తనను గురించి తాను తెలుసుకోలేకపోతే, ఇతరుల గురించి ఏమి తెలుసుకుంటాడు? తనను తాను జయించిన వ్యక్తి సమస్తాన్ని జయించగలుగుతాడు. అందుకు విచక్షణ అనేది అత్యంత ఆవశ్యకం. అది మనిషిని మహోన్నతంగా తీర్చిదిద్దుతుంది. ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది. జీవితాన్ని సక్రమమైన పంథాలోకి మళ్ళిస్తుంది, దానిని సార్థకం చేస్తుంది.

శిల ఉలితో శిల్పంగా మారినట్లే,
ఉత్తమ కర్మల ద్వారా మనిషి మహనీయుడవుతాడు

***ఏ వాడలో ఏ కులంవారున్నారో పరిగణించక***
***సహజంగా అంతటా వీచే గాలిని పీల్చుకుంటున్న మీరు***
***ఏ దిక్కున ఏ వర్గం వుందో లెఖ్ఖించక***
***సమంగా కురిసే వాననీటిని వాడుకుంటున్న మీరు***
***ఎవరు పైకెక్కి కోసినా ఏ మాత్రం కాదనక***
***వినయంగా వంగి ఫలాలనిచ్చే వృక్ష వితరణననుభవిస్తున్న మీరు***
***ఏ వ్యక్తి పితికినా అడ్డుచెప్పక***
***క్షీరధారలను అందించే పశువుల పాలను త్రాగుతున్న మీరు***
***ఇన్ని నిజాలు కళ్ళ ముందున్నా***
***వివక్షతను వీడరెందుకు?***
***జీవితం మూణ్ణాళ్ళ ముచ్చటని తెలుసుకున్నా మీలోని మురికిని కడగరెందుకు?***
***మనిషి శరీరానికి వచ్చే హెచ్.ఐ.వి., షుగర్, క్యాన్సర్ జబ్బులకంటే,***
***మనిషి మనసుకు వచ్చే ద్వేషం, ఈర్ష్య, పగ, గర్వం అనే జబ్బులు మహా భయంకరం***
***రాలే ఆకు, విరిసే పువ్వు, వెలిగే దీపం,***
***అభయమిచ్చే ఆంజనేయుడు***
***అన్నీ ఒకటే చెబుతాయి***
***ఏదీ శాశ్వతం కాదని!***
***దోచుకోలేని మంచితనాన్ని, దాచుకోలేని ఆనందాన్ని పెంచుకుని***
***మారుతి మంచిబిడ్డలుగా ఎదగండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**20-02-2020** 09:00 AM

**49) స్వామీ! మీ సాంగత్యానికి నోచుకున్న మేము ఎంతో అదృష్టవంతులము స్వామీ? కృతజ్ఞతలు స్వామి!**

*ఎప్పుడైతే మానవుడు మానవత్వం మరచిపోతాడో, అన్యాయం ప్రబలుతుందో, అరాచకత్వం పెరుగుతుందో, దాన్ని కాలరాయటానికి భగవంతుడు తనకు తానుగా బోధించటానికి సమాయత్తమవుతాడు. ఒకవేళ మానవుడు మానవత్వంతో మెలిగితే, వారినే దేవుడని సంభావించవచ్చు. ఇంకొక విధంగా చెప్పుకోవాలంటే, అలాంటి పరిస్థితులలో భగవంతుని యొక్క ఆవశ్యకతే వుండదు. దీనికి ఏకైక మార్గం, మీరంతా భక్తిపరాయణులు కావడమే. తద్వారా దైవప్రీతి, పాపభీతి వుంటుంది. మీలో మానవత్వం అంకురించటానికి ఇదే ఆరంభంగా తీసుకోండి. నేటి ఈ పరిస్థితులలో మరల మరల ధర్మస్థాపన కొరకు, మిమ్మల్ని మరలా ఋజుమార్గంలో ప్రవేశపెట్టడానికి ఈ పవనకుమారుడు రావటం తప్పనిసరి అయినది. భగవంతుడే భువిపైకి వచ్చినా, గుర్తించలేకపోయారు. ఈనాడు ఈ ఆంజనేయుడు మీ సన్నిధిన కూర్చుని సమూలంగా బోధిస్తున్నా గుర్తించలేకపోతున్నారు. అటువంటి మీకు మార్గదర్శకమైన ఒక సూత్రాన్ని చెబుతాను. ఏ వస్తువు ప్రకాశవంతంగానూ, ఐశ్వర్యవంతంగానూ, కాంతియుతమైనదిగానూ, దృఢమైనదిగానూ ఉన్నదో, అలాంటిది భగవంతుని తేజస్సు వలన కలిగినదని తెలుసుకోండి. అట్టి లక్షణాలు కలిగినవారు భగవత్‌స్వరూపులు. భగవంతుని వైభవం తెలియకపోతే, భగవంతుడే ముందు నిలుచున్నా, మీ అహంకారం మిమ్మల్ని సన్మార్గం వైపు పోనివ్వదు. గతయుగాలలో కంసుడు, శిశుపాలుడు, భస్మాసురుడు, రావణాసురుడు, దుర్యోధనుడు మొదలగువారు పరమాత్మనే ముందు పెట్టుకున్నా, వారు గ్రహించలేక, వినాశనాన్ని కొనితెచ్చుకున్నారు. ఇలనాడు మీరు సాక్షాత్తు ఈ ఆంజనేయుడే సద్గురువై బోధిస్తున్న బోధలు వింటూ కూడా అహంకారాన్ని ప్రదర్శిస్తూ, జీవితపు విలువను పోగొట్టుకుంటున్నారు. మీలో ఏ వైభవమూ లేకపోయినా, ఉన్నవారిని గుర్తించగలగటం కూడా ఒక వైభవమే, పూర్వజన్మ సుకృతమే. రత్నాన్ని గాజుముక్క అనుకునేవారు, దారిచూపే గురువులకు, సద్గురువులకు దూరమవుతారు. కనుక, భగవంతుని వైభవాన్ని, బోధలను వినటం, ఆచరించడం, గుర్తించడం, దర్శించడం అనేది సులభమైన కార్యం కాదు. అది కూడా ఒక యశస్సే. దేహమునకు శ్వాస ఎంత ముఖ్యమో, ఆధ్యాత్మికతకు ఈ ఆంజనేయుని బోధలు వినటం, ఆచరించడం, విన్నదానిపై విశ్వాసముంచడం అంతే ప్రధానం. సర్వులయందు దైవమే ఆత్మస్వరూపుడై, ప్రేమస్వరూపుడై వుంటున్నా, "ఏకం సత్ విప్రాః బహుదా వదన్తి", "ఏకాత్మా సర్వభూతాంతరాత్మ" ఆ ఎరుక లేనివారు సాధారణ మానవులు – అట్టి భావము కల్గి ఆచరణలో చూపేవారే భగవత్ స్వరూపులు!*

*మీమీద ప్రేమతో మీ అవసరాలను తీర్చాను, తీరుస్తున్నాను. మానసిక రుగ్మతలను తీసివేస్తున్నాను, ఆర్థికబాధలు లేకుండా చేస్తున్నాను. ముముక్షువులైన మీకు జ్ఞానోదయం కలిగించే ప్రయత్నం చేస్తున్నాను. జ్ఞానులైన వారికి బ్రహ్మసాక్షాత్కారం కలిగించాను, కలిగిస్తాను. మరి మీరు నాకేమి ఇస్తారు? సమాధానం*

ప్రశ్నార్ధముఖమే. మీరు నిజంగా బాగుపడాలని వుంటే, బాగుపడదామన్న ఆలోచన మీలో కలిగి సమాయత్తమైతే, అటువంటి వారిని రక్షించటానికి, మంచిబుద్ధిని ఇవ్వటానికి భగవంతుడే సిద్ధంగా వుంటాడు. మానవసేవే మాధవసేవ – ఇది జగమెరిగిన సత్యం. ఒకరికోసం ఒకరు నిలబడాలి. మీరు ఎంత తెలుసుకున్నా, ఎంత చదివినా అంతర్లీనంగా వుండే సత్యమిదే. మీరు చేసిన నేరములు – దానికి వేయదగు శిక్ష, సాధించిన మంచి కార్యక్రమములు – అందుకు ఇవ్వవలసిన బహుమతి ఇవ్వన్నియూ భగవంతునికి అవగతములే కాబట్టి, కనికరమున్ననూ, ఏది న్యాయమో అదే జరిపింతును. కొందరు మొదట భక్తులవలే ప్రవర్తిస్తుంటారు. తర్వాత చెప్పేదొకటి, చేసేదొకటి – ఈ విధంగా మోనోయాక్షన్ ప్రారంభిస్తే, భగవంతుడు కూడా మౌనంయాక్టింగ్ ప్రారంభిస్తాడు. ప్రార్ధనలు, ప్రవర్తనలు వేరు కాకూడదు.

*"వ్రాత చూసి గానీ వరమివ్వడు దైవంబు, చేతజూసి గానీ వ్రాతజనడు.*
*చేతలకు మనుజుడు కర్త, వ్రాతకు తా కర్త"*

చేతలను బట్టే నొసటివ్రాతలు వ్రాస్తాడు దైవం. ఆ నొసటివ్రాతను బట్టే వరాలిస్తాడు దైవం. కనుక, చేతలకు, తద్వారా నొసటి వ్రాతలకు మానవుడే కర్త. మృతి చెందువాడు బాధలు భరించలేక నన్ను త్వరగా మీ చెంతకు చేర్చుకోమని ప్రార్ధిస్తుంటాడు. అతని వియోగమును భరించలేక శోకించువారు వానిని బ్రతికించమని ప్రార్ధిస్తుంటారు. మరి భగవంతుడు ఎవరి కోరిక తీర్చాలి? వైద్యులకు అలవికాని విధంగా, సంపూర్ణ ఆరోగ్యవంతునిగా కూడా మార్చగల శక్తి భగవంతునికున్నది. అది మీకు నమ్మశక్యం కాని విషయం. వెన్న చేతిలో పెట్టుకున్నంత మాత్రాన వెన్న కరుగుతుందా? వేడి చూపాలి కదా! భగవంతుని హృదయం వెన్న వంటిదే అయినప్పటికీ, భక్తిప్రపత్తులనే వేడి చూపితేనే అది కరుగుతుంది. భక్తునిలో ఆర్తి గాఢతను బట్టే, నా కరుణ ప్రసరిస్తుంది. మీ జవాబును బట్టే కదా, నా మార్కులు. మీ ప్రార్ధన, నిజాయితీలను బట్టే నా సంకల్పము రూపుదిద్దుకుంటుంది. ఊరికే బెదిరించను, ఉత్తగా ప్రశ్నలు వేయను. అంతరంగమందు అలజడి రేపి చూస్తాను. ఆగావా... నేను ఆగుతాను. మీరు పాడే పాటకు అదే అర్ధము. ఆగుమా... ఆగుమా... ఆంజనేయా! మరి ఆగాను మీ ప్రార్ధనతో. ఆసనం వేయండి, కూర్చుంటాను. పిలిచిన తర్వాత ఆసనం వెయ్యకపోతే ఇలా నిలబడి ఆసనం సిద్ధం చేయించుకుంటాను. మరి దీనికి బెదిరించి ఎదురుగా నిలచి, సామ–దాన–భేద–దండోపాయాలతో మిమ్ములను మార్చుటకే ఈ ఆగమనం, ఈ రాక, ఈ ఆగటం. ఇదంతా మీ కొరకే!

***వాదులాడుచునుంటే ఏమీ రాదు, లేకుంటే ఏమీ పోదు***
***రమ్మంటే సుఖము రాదు, పొమ్మంటే పోదు***
***రాని పోని ఈ వాదభేదములు కలచివేయునిక***
***కాయమునంతయు పాయునుపాయము గానకుంటే***
***అపవాదు ఉంటేనే లోకములో వింత. లేకుంటే, మానదొక చింత***
***రోసీనపాయు జనమంతా, ఇది ఏమి వింత భగవంతా?***
***అంతకింతయై, ఇంతకంతయై, అంత, ఇంత, మరియంతౌనో***
***శాంతి లేదు రవ్వంతయైన - ఇక గంతే***

***అన్నాదమ్ములు ఎందరున్నా, పిల్లలెందరిని కన్నా, తల్లీ తండ్రి బంధువులున్నా***
***వెంటెవ్వరూ రాబోరన్నా***
***అన్నీ విడిచి నువ్వన్నది తెల్సితే,***
***ఉన్నది ఒక్కటే మన్నన తోడుత***
***అన్నది, విన్నది, కన్నదంతా ఇక సున్నా***
***ఇది తెలుసుకున్నాను హనుమా***
***నీతోనే నా ప్రయాణము ఆగుమా***
***ఆగుమా ఆంజనేయ అంటూ***
***నాతో ప్రయాణము కండి నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***
***ఆగుటకు నేను సిద్ధము - పిలుచుటకు మీరు సిద్ధమా?***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

*నేటి మీ జీవితానికి నిన్నటి కర్మలే సాక్ష్యమైతే*
*రేపటి జీవితానికి నేటి కర్మలు ఆధారమవుతాయి!*

*అవసరం ఉన్నప్పుడే పలకరిస్తారని ఎవరిని గురించీ బాధపడవద్దు*
*వారు చీకట్లో వున్నప్పుడే నువ్వు వెలుగులా గుర్తొస్తావని సంతోషించు!*

ఓం

**21-02-2020** 09:15 AM

**50) పని ఒత్తిడికి, అసంతృప్తికి కారణం ఏమిటి స్వామీ? అది ఎలా అధిగమించాలి స్వామీ?**

ఒకరాజు ఒక జ్ఞాని వద్దకు వెళ్ళి, "నేను ప్రశాంతంగా వుండలేకపోతున్నాను. కారణమేమిటో ఎంత ఆలోచించినా అంతుపట్టడం లేదు" అన్నాడు. ఆ మాట విన్న జ్ఞాని, "నువ్వు నీ బాధ్యతలు సరిగ్గా నిర్వహించడం లేదేమో! ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకో" అన్నాడు. ఆ మాటకి రాజు, "మా రాజ్యానికి శత్రుభయం, దొంగభయం వంటివి లేవు. మా రాజ్యంలో పన్నులు తక్కువే. న్యాయవ్యవస్థ కూడా బావుంది. ఎక్కడా ఎవరికీ అన్యాయం జరగదు. ప్రజలందరూ ఆనందంగా వుంటున్నారు. కానీ, నాకే ఎందుకో ప్రశాంతత లేదు. నేనేం చేయాలి?" ప్రశ్నించాడు రాజు. ఆ మాటకి జ్ఞాని, "నీ బాధ అర్థమైంది. నీ సమస్యకు సరియైన పరిష్కారం నీవు నీ రాజ్యాన్ని విడిచిపెట్టడమే" అన్నాడు. ఆ మాట విన్న రాజు, "అలా చేస్తే రాజ్యం పాలకుడు లేక అరాచకం ప్రబలి, ప్రజలు సుఖశాంతులు కరువై, అనేక కష్టాలు ఎదుర్కోవలసి వస్తుంది. అదీగాక, ప్రజలను అర్ధాంతర పరిస్థితుల్లోకి పడేయటం మంచి ప్రభువు లక్షణం కాదు" అన్నాడు. ఆ మాటకు జ్ఞాని కాసేపు ఆలోచించి, "నీ రాజ్యాన్ని నాకు ఇచ్చేయి. అలా చేస్తే, అప్పుడు నేను వారికి పాలకుడనవుతాను. ఫలితంగా ప్రజలు అనాథలు కారు" అన్నాడు. తన

*సమస్యకి ఇంత సులువుగా పరిష్కారం దొరికినందుకు ఆనందించి, రాజు "మహానుభావా! ఇంతకన్నా ఇంకేం కావాలి, తీసుకోండి. ఈ క్షణమే నా రాజ్యాన్ని ఇచ్చేస్తున్నాను" అని చెప్పాడు. ఇచ్చిపుచ్చుకోవడాలు జరిగిన అనంతరం రాజుని జ్ఞాని, "రాజ్యాన్ని నాకిచ్చావు గదా. ఇప్పుడు నువ్వేం చేద్దామనుకుంటున్నావు?" అని అడిగాడు. "నేను ఎక్కడికైనా వెళ్ళి ఏదో ఒక పని చేసుకుంటూ వచ్చిన జీతంతో ప్రశాంతంగా బ్రతుకుతాను" అన్నాడు రాజు. "అలాగైతే, ఎక్కడికో వెళ్ళడం ఎందుకు? ఆ పని నా దగ్గరే చేయి. నువ్వు కోరిన జీతం నేనే ఇస్తాను. నువ్వు చెయ్యవలసిందల్లా, ఈ రాజ్యంలో నా ప్రతినిధిగా వుండి, నా తరఫున పరిపాలన చెయ్యడం. ఎందుకంటే, నీకు పరిపాలన తెలుసు, చెయ్యగల సమర్ధుడివి. ఓ ఏడాది తర్వాత వచ్చి లెక్కలు వగైరా చూస్తాను" అన్నాడు జ్ఞాని. సరేనన్నాడు రాజు. ఒక సంవత్సరం గడిచింది. జ్ఞాని రాజుని చూడటానికి వచ్చాడు. రాజు మొహంలో ఆనందం తాండవిస్తోంది. ఎక్కడా ఆవగింజంతైనా దిగులు కన్పించలేదు. జ్ఞానిని సాదరంగా ఆహ్వానించి, సపర్యలు చేసి, లెక్కలు చూపించాడు రాజు. అంతా అయిన తర్వాత, "ఆ లెక్కలు సరేగానీ, నువ్వు ఇప్పుడు ఎలా వున్నావు?" అడిగాడు జ్ఞాని. ఆ మాటకి రాజు, "హాయిగా వున్నాను. కావలసినంత ప్రశాంతత దొరికింది. మునుపెన్నడూ ఇంత హాయిగా లేదు. మీకు నా ధన్యవాదములు" అన్నాడు. "సరే గానీ, పూర్వం నీవు చేసిన పనులకి, ఇప్పుడు నీవు చేస్తున్న పనులకు ఏదైనా తేడాలున్నాయా?" అని అడిగాడు జ్ఞాని. "లేదు. అప్పుడు చేసే పనులే ఇప్పుడు కూడా చేస్తున్నాను" సమాధానమిచ్చాడు రాజు. "మరి అప్పుడెందుకు మానసిక ఒత్తిడికి లోనయ్యావు? ఇప్పుడు ఆ ఒత్తిడి ఏమయ్యింది?" అని జ్ఞాని అడిగాడు. ఆ ప్రశ్నలోని ఆంతర్యం గ్రహించిన రాజు, జ్ఞాని వంక చూశాడు. అప్పుడు జ్ఞాని చిరునవ్వు నవ్వి, ఇలా అన్నాడు. "అప్పుడు నువ్వు ఇది నా పని, నా బాధ్యత అని ఆలోచించావు. ఇప్పుడు నువ్వు ఇది నాది కాదు. నేనిక్కడ కేవలం ఒక ప్రతినిధిని మాత్రమే అనుకున్నావు. మనసే అన్నింటికీ మూలం. ఆలోచనా విధానం ప్రధానం. నేను అనే ఆలోచన వచ్చేటప్పుడల్లా, అన్ని ఒత్తిడులూ, అన్ని సమస్యలూ నీ చుట్టూ సుడులు తిరుగుతుంటాయి. అలా కాకుండా ఈ ప్రపంచం నాది కాదు, ఈ దేహం నాది కాదు, ఈ ఊపిరి నాది కాదు. ఇవ్వన్నీ నాకు వచ్చినవే తప్ప ఏవీ నా సొంతం కాదు అని గ్రహిస్తే, సమస్యలు, బాధలు అన్నీ పారిపోతాయి. ఈ మానసికస్థితితోనే నీ రాజ్యాన్ని నీవు పరిపాలించు, నీ విధులు నువ్వు కొనసాగించు. నీకు కావలసినంత ప్రశాంతత లభిస్తుంది" అని చెప్పాడు. అప్పుడు రాజుకి జ్ఞానోదయమైంది. ఇప్పుడు మీరు చేస్తున్న పని ఇదే. ఇంచ్ ఇంచ్ నాది, దీనిని నివాసయోగ్యంగా మీకివ్వటం జరిగింది. దీని సొంతదారుగా మీరు ఊహించుకోవటమే అహంకారానికి మూలం. ఈ శరీరమనే ఈ క్షేత్రం కూడా నాదే. ఏదీ లేనప్పుడు, ఏమీ లేనప్పుడు ఎందుకు, దేని కోసం ఈ అహంకారం? ఈ అహంకార, అభిమానాలు ఆంజనేయునికుండాలి. మరి మీకెందుకున్నాయి? గట్టిగా ప్రశ్నించుకోండి – ఈ పవనకుమారునికి జవాబునివ్వండి.*

***గాలికి లేదు మతభేదం. నీటికి లేదు కులభేదం***

***భూమికి లేదు జాతిభేదం. నిప్పుకు లేదు వర్ణభేదం. ఆకాశానికి లేదు ప్రాంతభేదం.***

***పంచభూతాలకు లేని భేదం, నీకెందుకు మనిషీ ఈ విభేదం?***
***గాలిలో పుడతారు, గాలి పోతే పోతారు***
***భూమి నుంచి వస్తారు, భూమిలో కలిసిపోతారు***
***నీటిలోనే వుంటారు, నీరు లేకపోతే ఛస్తారు***
***నిప్పుతోనే వుంటారు, నిప్పులోనే కలిసిపోతారు***
***ఆకాశాన్నుంచి వస్తారు, ఆకాశంలోనే కలిసిపోతారు***
***వాటికి లేని ఈ భేదం, మీకెందుకు ఈ విభేదం?***
***స్వర్గసుఖాలకై లోకమంతా వెతుకుతారు***
***మోక్షప్రాప్తికై క్షేత్రాలన్నీ తిరుగుతారు***
***ముక్తి కోరి దానాలు, ధర్మాలు చేస్తారు***
***పుణ్యం కోసం యోగాలు, యజ్ఞాలు చేస్తారు***
***పవనకుమారుని సన్నిధికి చేర్చే గుణాలను మార్చుకోకపోతే,***
***మారుతి అభయం దొరికేదెలా, మోక్షం ఎలా సిద్ధిస్తుంది***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

*అపరాధం చేసి దేవుని ఆరాధించినా,*
*ఆశించిన ఫలితం ఎట్టి పరిస్థితులలోనూ లభించదు*
*ఆనందానికి లోటు రానీయవద్దు.*
*మనశ్శాంతికి చేటు రానీయవద్దు.*

ॐ

**22-02-2020** 08:55 AM

**51) గుణాతీత స్థితి ఎట్టిది స్వామీ?**

*దేనికీ చలించనివాడే గుణాతీతుడు. ఇక్కడ జరిగే సమస్తమూ గుణాల కారణంగానే జరిగిపోతున్నాయి. వాటిని నేను కేవలంగా, కేవలసాక్షిగా చూసేవాడ్ని మాత్రమే అని భావించువాడు దేనికీ చలించకుండా, ధృడంగా వుండిపోతాడు. ఎందుకంటే, గుణాలు, వాటి పనులు అవి చేసుకుంటూ ఉంటే, గుణాలకు వేరుగా వున్న గుణాతీతుడు, వేరుగా ఉన్నానని నిరంతరం గుర్తుంచుకున్న గుణాతీతుడు దేనికీ చలించకుండా నిర్లిప్తంగా వుండిపోతాడు. రోజూ మేడ మీద వరండాలో నిలబడి చూస్తున్నవాడికి నీటికుళాయి దగ్గర జరిగే తంతు వినోదంగా వుంటుంది. నేను ముందు వచ్చానని ఒకరంటే, నేను నీకంటే ముందే బిందె ఇక్కడ పెట్టి వెళ్ళానని కనుక ముందు నేను పట్టుకోవాలంటుంది వేరొకావిడ. బిందెలు పెట్టిపోతే కుదరదు, ఎవరు ముందొస్తే వారే ముందు పట్టుకోవాలంటుంది రెండవ ఆమె.*

ఈరోజు ముందు వచ్చిన వారే ముందు పట్టుకోవాలి అన్న ఆమె, రేపు ఆలస్యంగా వస్తుంది. కానీ, ముందు వెళ్ళి పట్టుకోబోతుంది. అప్పుడు ఇవతల ఉన్నవారు తగాదా పెట్టుకుంటారు. అప్పుడామె అంటుంది, ముందు వచ్చినంత మాత్రాన ముందు పట్టుకుంటావా? అదేం కుదరదు. ఇళ్ళ వరుసలో పట్టుకోవాలి. మా ఇల్లు ముందున్నది కనుక నేనే ముందు పట్టుకోవాలి. దాంతో పెద్ద గొడవ. చేతులు కలుస్తాయి. ఇదంతా దూరంగా వుండి చూస్తున్నవాడికి ఎవరి మీద కోపం వస్తుంది? ఎవరిపట్ల సద్భావం కలుగుతుంది? అన్నింటినీ వినోదంగా తిలకిస్తాడు. వీళ్ళు ఇంతేలే అనుకుంటాడు. తాను అందులో పాత్రధారి కాదు గనుక, కేవలసాక్షి గనుక, అందులో తనవారెవరూ లేరు గనుక వినోదంగా తిలకిస్తాడు. వీళ్ళు ఇంతేలే అని అనుకుంటాడు. తాను తటస్థంగా వుంటాడు. తాను అందులో పాత్రధారి కాదు గనుక వినోదంగా తిలకిస్తాడు. అలాగే, గుణాతీతుడు గుణాల కన్నా వేరుగా వుండి, తనను తాను ఆత్మగా గుర్తించి గుణాల యొక్క కార్యాలను వినోదంగా తిలకిస్తాడు. ఈ త్రిగుణాల యొక్క పోరాటాన్ని చూస్తూ శాంతి, సమత్వాల నుండి చలించడు. ఎప్పుడూ తన దివ్యత్వంలోనే వుండిపోతాడు. సుఖదుఃఖాలలో సమంగా వుంటూ ఆత్మలో నిలచి, మట్టి-రాయి-బంగారాలను ఒక్కటిగా చూస్తూ, ప్రియ-అప్రియములందు, దూషణ-భూషణలయందు సమంగా ప్రవర్తిస్తారు. ఈ ప్రపంచం ఎప్పుడూ మార్పులతో కూడివుంటుంది. మీరు కోరుకున్నట్లు వుండదు. మీరు కోరుకున్నంత మాత్రాన అల్లకల్లోలాలు తొలగిపోవు.

అనేక వికారాల మధ్య యోగి ఎలా సమత్వంతో ఉండాలో వివరించాను. సామాన్యుడు సుఖదుఃఖాలతో, రాగద్వేషాలతో, ప్రియ-అప్రియాలతో, నిందాస్తుతులతో నిరంతరం చలించిపోతూ వుంటాడు. అయితే గుణాతీతుడు ధీరుడు, స్వస్థుడు అయివుంటాడు గనుక, అతడు ఈ వికారాలకు అతీతంతా వుంటాడు. ఇవేవీ అతడ్ని చలింపచేయలేవు. ఎందుకంటే, అతడు స్వస్థతతో అంటే, తన స్థితిలో, ఆత్మస్థితిలో వుంటాడు గనుక, అతడిది సమబుద్ధి. అన్నింటిపట్ల సమభావంతో నిర్లిప్తంగా, తటస్థంగా వుండగలుగుతాడు. దేనికీ చలించడు. అతడికి ఆనందం లోపల నుంచే వస్తుంది. ఈ ప్రపంచం నుండి ఆనందాన్ని తెచ్చుకోవలసిన పనిలేదు. గుణాలలో కూర్చున్నవాడ్ని ఆ గుణవికారాలు చలింపచేస్తాయి. ఆత్మలో కూర్చునవాడ్ని ఆ గుణవికారాలు చలింపచేయలేవు. పడవలో కూర్చున్నవాడ్ని ఆటుపోట్లు చలింపచేస్తాయి. ఒడ్డున కూర్చుని చూస్తున్నవాడ్ని ఆటుపోట్లు ఏమీ చేయలేవు. స్వప్నంలో వున్నవాడిని స్వప్న విషయాలు చలింపచేస్తాయి. మెలకువలో వున్నవాడ్ని స్వప్న విషయాలేవీ చలింపచేయలేవు. అలాగే గుణాలలో బంధించబడ్డ వాడిని గుణవికారాలు చలింపచేస్తాయి గానీ, గుణాలకు అతీతంగా వేరుగా ఆత్మలో స్థితుడైన ఈ గుణాతీతుడ్ని ఈ గుణవికారాలు ఎలా చలింపచేస్తాయి? చేయలేవు. కనుకనే, గుణాతీతుడు ఏ వికారాలకు, మార్పులకు చలించడు. ఈ వికారాలపట్ల, మార్పులపట్ల గుణాతీతుడు ఎలా వ్యవహరిస్తాడో ఇప్పటివరకూ చెప్పాను. అంతేకాక, సుఖదుఃఖాలపట్ల సమత్వం కలిగి వుంటాడు. ఇంద్రియాల ద్వారా బయటి విషయాలను గ్రహించి, వాటిని పూర్వ అనుభవంతో విలువ కట్టగానే సుఖమో దుఃఖమో వస్తుంది. ఈరోజు మీ ఆదాయం వందరూపాయలు. ఇంత వరకూ ఎప్పుడూ 50 రూపాయలు దాటలేదు. అప్పుడు సుఖం. అలాగాక, ఎప్పుడూ 200 రూపాయలకు తగ్గలేదు. ఈ రోజే

50 రూపాయలు వచ్చాయి. ఇప్పుడు దుఃఖం. ఈరోజు కాలునొప్పి. ఇంతకు ముందు ఎప్పుడూ నొప్పి లేదు. ఇప్పుడు దుఃఖం. డాక్టర్ దగ్గరకు వెళ్తే 50 రూ॥ ఫీజు, 20 రూ॥ మందులూ. ఇప్పుడూ దుఃఖమే. మందులు కొనక ముందే నొప్పి తగ్గిపోయింది. ఇప్పుడు సుఖం. కొందరి సుఖం, మరికొందరికి దుఃఖం అవుతుంది. ప్రక్కింటి వ్యక్తి కారు కొన్నాడు. హాయిగా దానిలో ప్రయాణం చేసి వస్తున్నాడు. వాడికి సుఖం – మీకు దుఃఖం. ఒకప్పటి సుఖం మరొకప్పుడు దుఃఖంగా కూడా మారిపోతుంది. పెళ్ళి చేసుకునేటప్పుడు గొప్ప సుఖం, ఆనందం. వంశోద్ధారకుడు పుట్టి, మనశ్శాంతి లేకుండా చేస్తున్నాడు. భార్యపోరు ఎక్కువైంది. ఇప్పుడు దుఃఖం. కనుక, సుఖదుఃఖాలనేవి స్థిరం కాదు. అసలు నిజంగా అక్కడ సుఖంగానీ, దుఃఖంగానీ లేవు. వాటిని చూసే నీ దృష్టి వల్లనే సుఖమో, దుఃఖమో అనుకుంటున్నావు. మనోబుద్ధులనే రంగుటద్దాల ద్వారా ఈ ప్రపంచాన్ని చూస్తున్నప్పుడు, సుఖమో దుఃఖమో కలుగుతున్నాయి. ఆ అద్దాలను తొలగించి చూస్తే, ఉన్నది ఉన్నట్లుగా కనిపిస్తుంది. సుఖదుఃఖాలు కేవలం మిథ్యామాత్రాలు. కనుకనే, గుణాతీతుడు ఈ సుఖదుఃఖాలను సమంగా ఒక్కటిగా భావించి సుఖానికి పొంగడు, దుఃఖానికి కృంగడు. వాటికి ఏమాత్రమూ చలించడు. వాటిని సమంగా చూస్తాడు.

***మళ్ళీ మళ్ళీ పుట్టడం మళ్ళీ మళ్ళీ చావడం***
***జననమరణ బంధము అంతులేని అనుబంధం***
***పెరిగేటప్పుడు ఏడుపు, సంసారం ఈదలేక ఏడుపు***
***కోరిక తీరకుంటే ఏడుపు, నాది దూరమైతే ఏడుపు***
***నా అనుకున్నవాళ్ళు చీదరిస్తే ఏడుపు, రోగాలొస్తే ఏడుపు***
***ముసలితనమొస్తే ఏడుపు, చివరకు మరణించేటప్పుడు ఏడుపు***
***అందరినీ వదిలిపోతున్నాననే ఏడుపు,***
***ఎందుకు ఈ ఏడుపు?***
***ఈ ఏడుపుల బదులు, వేడికోలు వుంటే ఎంత బాగుండు!***
***జననమరణ చక్రం నుండి విడుదల కావాలంటే, పరమాత్మను శరణు కోరండి.***
***జీవన్ముక్తులు అవ్వండి***
***ఇదే ఇదే తరుణోపాయం, ముక్తికి మార్గం***
***మారుతి బోధలతో మనిషిగా మహిలో వెలగాలంటే,***
***మనిషిగా మంచిని పెంచే కార్యాలనెన్నింటినో కర్తవ్యంగా తలచి***
***నిరంతరం నిర్వహిస్తూ వుండాలి***
***మనిషిగా భువిని నిలవాలంటే, స్నేహహస్తం చాచి, అందరినీ ఆదుకోవాలి***
***ఈ హనుమతోటి చెలిమి హాయిహాయిగా కొనసాగించి***
***కొలువై వున్న హనుమతో సాగండి, సుఖించండి***
***నా ఈ చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**24-02-2020** 09:00 AM

**52) భక్తిమార్గంలో వేటిని పెంపొందించుకోవాలి మరియు వేటిని వదులుకోవాలి స్వామీ?**

*భక్తిని గురించి చెప్పాలంటే, భగవదనురక్తియే భక్తి. ఈ భక్తి లోపలే భుక్తి, రక్తి, యుక్తి, అనురక్తి, విరక్తి, ముక్తి అన్నీ కూడి వుంటాయి. భుక్తి అనగా ఆహారం కావాలి. కర్మలనాచరించటానికి, శరీరపోషణకు ఆహారం కావాలి. రక్తి – భగవంతుడిపై రక్తి, కోరిక కావాలి. మూడవది యుక్తి – ప్రపంచంలో బ్రతకాలంటే యుక్తి కూడా పొందాలి. అనురక్తి – అందరినీ ప్రేమించాలి. విరక్తి, ముక్తి – వీటన్నింటిలో 'క్తి' శబ్దం ప్రధానం. భగవంతునిలో 'భ' మిగిలిన అన్నింటిలోనూ చేరిన 'క్తి' ఈ రెండింటినీ కలిపితే భక్తి అవుతుంది. కనుక భక్తి వుంటే, భగవంతుడే వీటన్నింటినీ భక్తునికి అందిస్తాడు. కేవలం పూజలు చేయటం, హారతులివ్వటం మాత్రమే కాదు. భగవంతునికి అర్పితం అవ్వటమే భక్తి. ఎన్ని చదివినా, ఎన్ని విన్నా, ఈ రోజుల్లో సగటు మనిషి 'ఆశ' వీడలేకున్నాడని ఒక ఉదాహరణ చెబుతాను. ఒక పండితుడు రామాయణం ప్రవచనాలు చాలా రోజులు జరిపి, ప్రవచనాలను వింటూ కన్నీళ్ళు పెట్టుకున్న భక్తులను పరీక్షించదలచి, చివరి రోజు అందరూ ప్రసాదం తీసుకొని వెళ్ళమని చెప్పాడు. అయితే, ఆ ప్రసాదం మనోపుష్టికి, మానసిక ఉల్లాసానికి, ఆధ్యాత్మిక పురోగతికి దోహదపడుతుందని చెప్పి, ఆ రోజు ఒక వరుసలో రాముని విగ్రహాలు, రెండవ వరుసలో రావణుని విగ్రహాలు పెట్టి, వీటిని ప్రసాదంగా ఇవ్వబడతాయి. ఎవరికి కావాల్సిన విగ్రహం వారు తీసుకెళ్ళవచ్చు అని ప్రకటించాడు. ఎవరైనా రాముడి విగ్రహాలు పెట్టుకుంటారు గానీ, రావణుని విగ్రహం పెట్టుకుంటారా? ఈ పండితుడికి రామాయణం చెప్పి చెప్పి మతిపోయిందనుకున్నారు. వచ్చిన వారంతా లైనులో అందరూ మొదట రాముని విగ్రహాలున్న వరుసలో నిలబడ్డారు కానీ, విగ్రహం వద్దకు వెళ్ళగానే మెల్లగా, రావణాసురుడి విగ్రహాలున్న వరుసలోకి మళ్ళుతున్నారు. కారణం రాముని విగ్రహాలు మట్టితో చేయబడ్డాయి, రావణుని విగ్రహాలు బంగారంతో చేసి వున్నాయి. ఆనాటి అయోధ్యావాసులు రాముడే కావాలనుకున్నారు. రాముడితోనే వుండాలనుకున్నారు. కానీ, నేడు రాముడితో వుండాలనుకుంటూ, రావణుని మార్గాన్ని అనుసరిస్తూ మాటల్లో మాత్రం రాముడు ప్రతిధ్వనిస్తున్నాడు – చేతలు మాత్రం రావణుని ప్రతిబింబిస్తున్నాయి. అత్యాశకు పోయి, ఉన్నత విద్యను అభ్యసించిన అధికారులు సైతం, అవినీతి పంకిలం అంటించుకోవటం జరుగుతుంది. నిరక్షరాస్యులు సైతం చదువుకున్నారు ఎందుకు... దండగ అంటున్నారు. సంస్కారవంతులు హీనంగా, హీనులుగా, దీనులుగా వుండటానికి ఇష్టపడరు. అతిపేదవాడైన కుచేలుడు కృష్ణుని ముందు చేయి చాపడానికి సంస్కారం అడ్డుపడింది. అదే, సంస్కారహీనత ఎలాంటి విపరీత పరిణామాలకు దారి తీస్తుందో కర్ణ, కీచక, దుర్యోధన జీవితాలు పరిశీలిస్తే తెలుస్తుంది. దుర్యోధనుడు మాయాజూదంలో ధర్మజుని ఓడించడం, దుశ్శాసనుడు ద్రౌపదిని జుట్టు పట్టుకుని ఈడ్చుకురావడం, సైగ చేసి దుర్యోధనుడు తన తొడపై కూర్చోమనటం, చివరకు వస్త్రాపహరణకు తెగపడటం ఇవ్వన్నీ కౌరవుల కుసంస్కారాన్ని చాటుతున్నాయి. వీరేమైనా విద్యాహీనులా? కాదు. కౌరవులు, పాండవులు అందరూ భీష్మ, ద్రోణుల వద్ద విద్యను అభ్యసించినవారే. చదువు వేరు – సంస్కారం వేరు. ఉన్నతస్థాయిలో వున్నా కీచకుడు సంస్కారహీనత*

వల్ల ఎలాంటి దుర్గతి పాలయ్యాడో తెలిసిందే. ఎటువంటి విద్య లేని కపిజాతిలో పుట్టిన ఈ హనుమకు ఇచ్చిన స్థానం మీకు తెలిసిందే. విద్య వుండీ, ప్రయోజనం లేదు. సంస్కరించబడిన గుణం అవసరం. విద్య లేనివాడు వింతపశువు. మరి సంస్కారం లేని విద్యావంతుడ్ని ఏమనాలి? ఎవరి భాషలో వారు, ఎవరి భావంలో వారు అనుకోవచ్చు!

***నోరు లేక, ఊరు లేక, పోరు చేయు శక్తి లేక,***
***అక్కున చేర్చుకొని ఆడించే ఆత్మీయులు లేక, ఆలనా పాలనా లేక,***
***మౌనంగా రోదిస్తూ, దీనంగా ఎదురు చూస్తూ, భారంగా బ్రతుకును మోస్తూ,***
***దిక్కుతోచక, దిక్కుమాలిన బ్రతుకులను వెళ్ళదీస్తూ***
***ఒంటరులై కృంగిపోతూ, తుంటరులై రాలిపోతూ,***
***అపనిందలను భరిస్తూ, అవమానాలను సహిస్తూ***
***కనుపించని దేవుని స్మరిస్తూ వుంటే,***
***ఈ పవమానుడు అవమానాలను దూరం చేయుటకు***
***జాలి చూపులతో మానవత్వానికి నమస్కరించండి***
***మీ గుణాలను సంస్కరించుకొని, నమస్కారయోగ్యులుగా తయారుకండి అని,***
***సుమాలలాంటి సద్బోధాసుమాలను అందించి యోగ్యులుగా తయారుచేస్తున్న***
***ఈ ఆంజనేయుని అమృతవాక్కులు మదిలో దాచుకుని***
***మారుతి మాటలు మారు తప్పకుండా ఆచరించి***
***అందుకొనెడు ఆశీస్సులను వృధాపరచకండి***
***నా ఈ చిన్నారి ముద్దుబిడ్డలారా!***

*దేహం నేను అనుకుంటే బ్రతుకంతా జీరో*
*ఆత్మాభిమానిగా వుంటే జీవితమంతా హీరో*
*ఈ హీరో ప్రక్కన ఆ జీరో చేరితే, నీ స్థానం పది అంటే పదిలము!*

ॐ

**25-02-2020** 09:00 AM

### 53) భక్తుడు ఎట్టివాడు స్వామీ?

*భక్తుడైన వానిని చూచి లోకం భయపడాల్సిన అవసరం లేదు. అతడు ఇతరులను భయపెట్టడు. ఒక పరిపూర్ణ పురుషుని చుట్టూ ప్రశాంత వాతావరణం బయటకు వ్యాపించి, అశాంతితో అలమటించేవారు అతడి దగ్గరకు పరిగెత్తుకుని వచ్చినప్పుడు, వారి అశాంతిని కూడా పోగొడుతుంది. అందుకే జీవనపోరాటంలో మునిగివున్నవారు ప్రశాంతత కోసం వారి సన్నిధికి వెడుతూవుంటారు. కనుక, లోకం అతడిని చూచి భయపడే ప్రసక్తే వుండదు. పైగా, అతడి సాన్నిధ్యం శాంతిని ప్రసాదిస్తుంది. సాధారణంగా*

భక్తుడు సర్వభారాన్ని భగవంతునిపై వేసి, నిర్లిప్తంగా వుండేవాడు. కనుక, అతడు ఈ లోకంలో ఎవరితోనూ, దేని కొరకూ పోటీపడేవాడు కాదు. తన లోకంలో తాను వుండిపోతాడు. కొందరిని చూస్తే చాలు, భయం కలుగుతుంది. మీ గురించి అక్కడా ఇక్కడా ప్రచారం చేస్తుంటారు. అది సర్పలక్షణం. పామును చూస్తే ఎలా భయం కలుగుతుందో, వారిని చూచినా అంతే భయం. కొందరితో మాట్లాడాలంటే భయం. ఎందుకంటే, ఏమి మాట్లాడినా అపార్థం చేసుకొని, అందులోని తప్పులను వెదికి మీ మీదకు విజృంభిస్తారు. అలాగే, అటువంటివాళ్ళు కొందరు, తగాదాకు వచ్చేవాళ్ళు మరి కొందరు. ఇది మృగలక్షణం. కొందరితో స్నేహం చేయటానికి కూడా భయపడాలి. ఎందుకు? ఎప్పుడు ఏ ఎత్తులు, జిత్తులు వేసి మిమ్మల్ని మోసం చేస్తారో అని. ఇది నక్క లక్షణం. ఇలాంటి లక్షణాలు కలవారు ఎంతటి భక్తులైనా, వారు భగవంతునికి ఇష్టులు కాలేరు. అసలు నిజమైన భక్తుడు కూడా కాలేడు. చర్యలద్వారా, మాటలద్వారా ఎవరినీ భయపెట్టనివారే నిజమైన భక్తులు. లోకం వల్ల ఎవరు భయపడరో, భయపడని వాడే భక్తుడు. భక్తుడు భయపెట్టడు, భయపడడు. మంచి మార్గంలో నడిచేవాడు, భగవంతునితో సంబంధం పెట్టుకున్నవాడు, లోకుల యొక్క నిందాస్తుతులను పట్టించుకోడు. అందుకే భయపడడు. లోకంలో ఎన్ని ఉపద్రవాలు జరుగుతున్నా, ఎన్ని మార్పులు జరుగుతున్నా, లోకులు వారిని నిందిస్తున్నా పట్టించుకోడు. అతడి మనసు వీటిని పట్టించుకునే స్థితిలో వుండదు. అతని మనసెప్పుడూ భగవంతునితోనే వుంటుంది. భగవంతునితో తాదాత్మ్యం చెంది వుంటుంది. ఆయన స్మరణలో, పూజలో, ఆయన సేవలో, ఆయన కీర్తనలో అతడు తన్మయత్వం చెందుతూ వుంటాడు. కనుక, ఇవేవీ పట్టించుకోడు. అందుకనే, అతడి మనసు నిశ్చలస్థితిలో వుంటుంది. కనుక భయం లేదు. నదిలో నీటిపై తేలియాడే కొయ్యముక్కలు అటూఇటూ చలించిపోతూంటాయి. కానీ, నదిలోని నీరు పరవళ్ళు త్రొక్కి ప్రవహిస్తున్నా, దీపస్తంభం మాత్రం కదలకుండా స్థిరంగా వుంటుంది. అలాగే, పరమభక్తుడు, మహాత్ముడు అయినవాడు నిరంతరం భగవంతునితో సంబంధం పెట్టుకొని వుండటం వల్ల, ఈ అల్పమైన, అనిత్యమైన బాహ్యవిషయాలను పట్టించుకోడు. కనుక, దేనికీ చలించడు. దీనినిబట్టి భక్తుడైనవాడు భయపడడు, భయపెట్టడు. భయపడటం పశులక్షణం – భయపెట్టడం మృగలక్షణం. తన చుట్టూ భగవంతుడు కవచంగా వుండి రక్షిస్తుంటే, అతడు దేనికి భయపడాలి? కనుక భయపడడు. తనలోని జలచరాలు, మొసళ్ళు మొదలైనవి ఎంతెంత అలజడి సృష్టిస్తున్నా, తనకేమీ పట్టనట్లుగా వుంటుంది సముద్రం. దానికి నిరంతరం తన ప్రణవగానం తప్ప మరేమీ పట్టదు. సముద్రతీరంలో నిలచినప్పుడు మీకు వినిపించే శబ్దం ప్రణవనాదమే. అందుకనే అది జలచరాల విజృంభణకు భయపడదు. హర్షం, అమర్షం, భయం, ఉద్వేగం వీటి నుండి విడువబడినవాడే భక్తుడు. హర్షం:– తనకి ఏదో వస్తువు కొరతగా వున్నది, లేదా ఒక వస్తువుపై మోజుతో కావాలనుకున్నాడు. అది లభిస్తే ఎంత బాగుంటుంది అనుకున్నాడు. అప్పుడా వస్తువు లభిస్తుంది. అప్పుడు కలిగేది హర్షం (సంతోషం). అమర్షం:– తనకు కొరతగా వున్న వస్తువు, తాను కోరుకుంటున్న విషయం తనకు లభించకుండా ఎదుటివాడి పరమైంది, లేదా తనకన్నా ఎదుటివాడు పైచేయిగా వున్నాడు. అప్పుడు కలిగేది అమర్షం (అసూయ). భయం:– తనకు లభించిన వస్తువు ఇక తన చెయ్యి జారిపోతుందేమోనని ఆలోచన వచ్చింది. అప్పుడు కలిగేది భయం లేదా, ఎవరివల్లనైనా తనకు ఆపద కలుగుతుందేమోనని ఆలోచన వస్తుంది. అప్పుడూ భయమే. తన భవిష్యత్తు ఎలా వుండబోతోందో అనే ఆలోచన కలిగింది. అప్పుడు కలిగేది

భయం. ఉద్వేగం:- తాను కోరుకున్న వస్తువు కోసం ప్రయత్నం చేసేటప్పుడు, ఆ వస్తువు లభిస్తుందో లేదో అనుకున్నప్పుడు, తలపెట్టిన కార్యం జయప్రదమవుతుందో లేదో అనుకున్నప్పుడు కలిగేది ఉద్వేగం. ఇవేవీ భక్తునిలో వుండరాదు, వుండవు. ఇవ్వన్నీ కలగటానికి ఏవేవో కొరతలుండాలి. ప్రాపంచిక విషయాలపట్ల, వస్తువులపట్ల ఆసక్తి, వ్యామోహం వుండాలి. పెద్దపెద్ద ఆశలుండాలి. ఎల్లప్పుడూ తనతో ఇతరులను పోల్చుకుంటూ వుండే స్వభావం వుండాలి. ఇలా వున్న వారందరికీ సహజంగానే ఈ లక్షణాలు వుంటాయి. అలాంటివారు నిజమైన భక్తులు కాలేరు. అయితే, భక్తులైనవారికి, నిజమైన భక్తులైనవారికి ఈ లక్షణాలు వుండే అవకాశం లేదు. ఎందుకంటే, అతడు ఈ లోకంలోని వస్తువులయొక్క స్వభావం తెలిసినవాడు. ఈ లోకంలోని సమస్త వస్తువులు, విషయాలు, భోగాలు అన్నీ అనిత్యమైనవి, అశాశ్వితమైనవి, తన వెంట రానివి. అంతేకాదు, ఈ అనిత్యమైన విషయాల ద్వారా కలిగే సుఖం కూడా శాశ్వితమైనది కాదు, తాత్కాలికమైనదే. నిత్యమైన వస్తువు, భగవంతుడు మాత్రమే. కనుక, నిత్యమైన సుఖం, ఆనందం కావాలంటే, నిత్యమైన పరమాత్మను ఆశ్రయించడం ద్వారా మాత్రమే లభిస్తుందనే విషయం తెలిసినవాడు. అందుకే అనిత్య విషయాల కోసం అర్రులు చాచడు, వాటి కోసం పరుగులు తీయడు. అందువల్ల అతడిలో ఈ హర్షం, అమర్షం, భయం, ఉద్వేగం ఏవీ వుండవు. అతడు ప్రశాంతమైన మనసుతో వుంటాడు. ఎల్లప్పుడూ భగవంతుని స్మరణలో వుంటాడు. అంటే, అతడిలో అనిత్యమైన వస్తువులకు స్థానం లేదు. కేవలం భగవంతునికి మాత్రమే స్థానం వుంటుంది. అందుకే అతడు నిజమైన భక్తుడు.

***క్షణం ఆలస్యమైనా, యుగాలు వెనక్కు వెళ్ళినట్లు,***
***ఎక్కుపెట్టిన బాణమై వగరుస్తూ, పరుగులు తీస్తూ,***
***శక్తినంతా కూడగట్టుకొని, చాకచక్యంగా దినచర్య ప్రారంభించి,***
***ఆత్మీయతా పరిమళ జల్లులై, జీవిత పద్మవ్యూహంలో రేపటి పూలబాటలను వెదుకుతూ,***
***ఆంజనేయుని అక్షర సమూహంలో కాస్త తొంగిచూచి,***
***బహుశా ఏ అక్షరముతోనైనా జీవితం ప్రారంభిస్తే,***
***అప్పటి వరకు అసహనంగా నడిచిన నడకలు,***
***ఒక్కసారిగా చేతనమవుతాయి***
***ఆశలెన్నో ఆరాటపడుతున్నా,***
***జీవితమంటే రాజీపడటమేనని***
***నిన్నటిదాకా ఆడిపాడిన మీరు***
***ఉషోదయం లోపే అలసట ఎరుగని యోధుడిలా***
***మీకు మీరే స్వాంతన పొందుతూ***
***పవనకుమారుడు అందించిన బోధలతో***
***ఒడ్డుకు చేరి గట్టు ఎక్కుట సాధ్యమవుతుంది***
***నా ఈ చిన్నారి బిడ్డలారా!***

*మీరందరూ "ఛీ కుక్కా" అంటే, "ఏం అక్కా" అనేట్లు వుండాలి!*

ఓం

**26-02-2020** 06:40 AM

### 54) ఆశ మరియు ఆశయం మధ్య ఉన్న వ్యత్యాసం ఏమిటి స్వామీ?

*కోరికకు ఆశ పర్యాయపదం. పొందాలి అని భావిస్తే దాన్ని ఆశ అంటారు. సకారాత్మక ఆలోచనలతో ఆశ అవసరం కానీ, అత్యాశ, దురాశ అనవసరం. ఇవి దుఃఖానికి దారితీస్తాయి. విజేత కావాలన్న ఆశ ఆశయమైతే, గమ్యం "విజయీభవ!" గా మారుతుంది. మానవుని మేధస్సుతో అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలమన్నది సత్యం. మీరు గమనిస్తే, ఆదిమానవునికి, నేటి ఆధునిక మానవునికి ఎంతో వ్యత్యాసం. ఈ వ్యత్యాసం గోచరించటానికి మానవుడు తనలో దాగివున్న మేధోసంపత్తిని వెలికి తీసి ఉపయోగించుకోవటమే. నాడు మానవుడు మోటు – నేడు మానవుడు రిమోటు. నాడు వండడం తెలియదు – కానీ నేడు వండినది సీల్ చేసి సంవత్సరాల తరబడి తింటున్నాడు. ఆశకు పర్యాయపదం కోరిక. పరిస్థితులను బట్టి కోరిక ఉద్భవిస్తుంది. ఆశ అనేది మానవునికున్న సహజమైన గుణం. శరీరంలో నిర్లిప్తమైన గుణాలలో ఆశ ప్రథమగుణం. ఆశకు అంతముండదు. ఒక కోరిక తీర్చుకున్న తర్వాత ఇంకొక కోరిక మొదలవుతుంది. ఇది మానవనైజం. తృప్తి, సంతృప్తి మనిషికి చాలా తక్కువ. ప్రాపంచికంగా, భౌతికంగా మానవుని ఎదుగుదల ఆశ వుండటం వల్లనే జరుగుతుంది. అనంతమైన దాగివున్న శక్తిని ఆశ మాత్రమే వెలికి తీస్తుంది. ఆశలోనే ఆశయం చిగురిస్తుంది. ఆధునిక సాంకేతిక నిపుణతకు ఆశయే విత్తనం. పరిస్థితులను బట్టి మానవుడు తనకు అనువైన ఆలోచనలను ఆశల రూపంలో విడుదల చేసుకుంటూ, తన భౌతిక శక్తిసామర్థ్యాలతో వాటిని పొందగలుగుతున్నాడు. పాత రాతియుగం నుంచి నేటి కంప్యూటర్ యుగం వరకు మానవుని ఆశ అభివృద్ధికి నాందీ పలికింది. ఆశ, ఆశయంగా మారినప్పుడు, పట్టుదల పెరిగి అనూహ్యమైన శక్తి మానవుడ్ని ముందుకు తీసుకుపోయి గమ్యాన్ని చేర్చుతుంది. అనంతమైన శక్తి తనలోనే నిర్లిప్తమై వుందన్న విషయాన్ని గ్రహించటానికి మానవునికి ఎంతో కాలం పట్టింది. మానవప్రయత్నం అప్రయత్నంగా ముందుకు సాగడం సహజం. పరిణామ పరిస్థితులను బట్టి జరుగుతుందన్న విషయమూ విదితమే. ఆశ పరిణామాన్ని కోరుకుంటుంది. ఆశయం పరిణామంతో పరిపక్వస్థితిని సిద్ధించుకుని, చరిత్రను సృష్టించుకుంటుంది. న ఆశ న జీవితం. న ఆశయం న గమ్యం. ఆశ లేకపోతే జీవితం లేదు. ఆశయం లేకపోతే గమ్యం లేదు, చేరలేరు. నావ ఒక్కటే ఏరు దాటలేదు. నావకు తెడ్డు అవసరం. నావ ఆశ్రయాన్నిస్తే, తెడ్డు దిశ–దశలను నిర్దేశిస్తుంది. అదే విధంగా ఆశ నావైతే, ఆశయం తెడ్డుగా పనిచేసి దిశ దశలను సూచిస్తుంది. జీవితం ముందుకు సాగటానికి ఆశ జీవితం లాంటిది. మీరు గమనించినట్లైతే, ఆదిమానవుడు ఆశతో, ఆధునిక వైజ్ఞానిక వైతాళికుడు కాగలిగాడు. వ్యక్తి ఆశయం వ్యక్తిత్వాన్ని వికసింపచేసి, దాగివున్న జ్ఞాననిధిని ఛేదించి, సృజనాత్మక శక్తిని వెలికి తీసి, శాస్త్రవేత్తగా, పరిశోధకుడిగా మలుస్తుంది. భౌతికావసరాలు తీర్చుకోవటానికి సహజసిద్ధంగానే మనిషికి కోరిక ఆశ రూపంలో పుడుతుంది. ప్రతి మనిషీ ఏదో ఒకనాడు అంతర్మథనంతో తన్ను తాను తెలుసుకోగలడు. ఇది ధర్మం. ఇదే వేదం. మనిషిలోని మనిషి అంతర్మథనం చెందినప్పుడు,*

వెలికి వస్తాడు. అప్పుడే ఆశయం ఉద్భవిస్తుంది. ఆశయసాధనకు మానవుడు కార్యోన్ముఖుడు కాగలడు. తనలోని అనంతశక్తిని తెలుసుకుని, దాన్ని వినియోగించుకుంటాడు. ఆశయసిద్ధికి మానవుడు అహర్నిశలు శ్రమిస్తాడు, విశ్రాంతిని మరుస్తాడు. విధినైనా ఎదిరిస్తాడు, విశ్వానికి ఆదర్శమవుతాడు. ఆశయంలో చిన్నా గొప్ప తేడాలు వుండవన్నది గమనించండి. ఆశయాన్ని ఆశ్రయించాలంటే, ఏ వ్యక్తి అయినా తనలో దాగివున్న అనంతశక్తిని వెలికి తీయటానికి సిద్ధమై ముందుకు దూసుకొని వెళ్తాడు. ఎన్ని అడ్డంకులు వచ్చినా, ఎన్ని అవాంతరాలు ఎదురైనా ముందుకు వెళ్ళి గమ్యాన్ని ఛేదిస్తాడు. ఇది సత్యం. నేటి కలికాలంలో ప్రేమ, ధర్మం, సత్యం, అహింసలు నాలుగు వేదాలు. ఆశ ధర్మబద్ధంగా వున్నప్పుడు, ఆశయం మహోన్నతంగా వుండి, ఏ వ్యక్తినైనా ఆదర్శంగా, ఆదర్శశక్తిగా మార్చుతుంది. భౌతికమైన అవసరాలను పొందటానికి ప్రతి మనిషి ఆశను కలిగి వుంటాడు. ఆశ సహజం. ఆశయం ప్రత్యేకం. ఆశయం అంకురార్పణలో గమ్యం చేరుకుంటారు. గమ్యాన్ని చేరుకోవాలంటే, ఆశయాన్ని సిద్ధించుకోవాలి. ఆశయాన్ని సిద్ధించుకోవాలంటే అనూహ్యమైన ఒడిదుడుకులను, కష్టనష్టాలను భరించుకోవాలి. సహనంతో ముందుకు వెళ్ళాలి. గమనించినప్పుడు ప్రతి రేణువు, పరమాణువు పరమాత్మ స్వరూపమే. గమనిస్తే గమ్యం. నిన్ను నీవు గమనించుకుంటే వేదాంతం – నీలోకి నీవు ప్రయాణం చేయడం వేదం. నర్మగర్భమైన జ్ఞాననిధి ప్రతి మనిషి మది. వజ్రాన్ని రాళ్ళ నుంచి వేరుచేసి, సాన పెట్టినప్పుడు మాత్రమే వజ్రం విలువ తెలుస్తుంది. ప్రతి మానవుని మది, వజ్రం కన్నా విలువైనది. వజ్రమును సానబెట్టినట్లు, మానవుని ఆశను సానబెడితే, ఆశయం జనించి అద్భుతమైన మార్పు చెందుతాడు మానవుడు. జాలి, దయ, కరుణ, ప్రేమ, సేవ, అహింస లాంటి దైవగుణాలు అందరిలో వున్నా, వాటిని వెలికి తీయటానికి ఆశయం అత్యంతావశ్యకం. ప్రతి జీవితానికి జీవితాశయం వుంటుంది. మానవజన్మ సార్ధకతకు ఆశయమే ముఖ్యం. "మందడుగు కాదు, ముందడుగు కావాలి." ఆశయసిద్ధికి, ఆశయస్ఫూర్తికి వెసులుబాటు కాదు, సిసలైన కట్టుబాటు కావాలి. ఆశయసాధనకు అర్ధాన్ని విశ్లేషించి పరమార్ధాన్ని గ్రహించాలి. అప్పుడే వస్తువు నుంచి వాస్తవానికి, పదార్ధం నుండి యదార్ధానికి రాగలరు. సంకుచితత్వం నుండి విశాలతత్వానికి మారడానికి మనిషి మనుగడలోనూ, ఆశాదృక్పథంలోనూ పరిణామం చోటు చేసుకుంటుంది. నకారాత్మకత నుంచి నిరాశ, నిస్పృహ, అభద్రతా భావాలు జనిస్తాయి. ఆశ సకారాత్మకతను ప్రోత్సహిస్తే, నిరాశ నకారాత్మకతను, నిట్టూర్పును ప్రోత్సహిస్తుంది. ఆశయం గొప్పదైతే, చరిత్రను తిరుగరాయవచ్చు. ఆశయం వ్యక్తిలోని విశాలదృక్పథాన్ని, వ్యక్తిత్వాన్ని తెలుపుతుంది. ఆశయానికి పరిస్థితులు అనుకూలిస్తే, గమ్యం సులభం. పరిస్థితులు ప్రతికూలిస్తే, గమ్యం చేరటానికి నిదర్శనంగా మిగులుతుంది అనుభవం. ఆశయసిద్ధి కోసం ధర్మం ఆయుధం కావాలి. నీతి నిజాయితీ ఆయుధాలుగా ఆశయసిద్ధికి ఉపక్రమించిన ఈ ఆంజనేయుడినే ఉదాహరణంగా తీసుకోండి. చరిత్రను సృష్టించాడు. అలలు సాగరంలో సర్వసాధారణం. ఆశయసిద్ధి అనే సాగరంలో ఒడిదుడుకులనే అలలు అత్యధికం. అలసత్వముంటే ఏదీ సాధించలేరు. అలసత్వమంటే సోమరితనం. అందమైన శిల్పానికి ఉలిదెబ్బలెన్నో. ఆశయసిద్ధిలో కష్టనష్టాలెన్నో, ఆటుపోట్లు ఎన్నెన్నో. సాగరమథనం జరిగితే గానీ అమృతం బహిర్గతం కాలేదు. వడిగా అడుగులున్నా తడబాటు లేకుంటే గమ్యం చేరటం సులభతరము. ప్రయత్నలోపం లేకుంటే ఆశయసిద్ధి నల్లేరు మీద

నడకలాంటిది. అధమునికి ప్రయత్నముండదు, ఆశయం అసలే వుండదు. మధ్యమునికి ఆశయమున్నా ప్రయత్నసాధనకు పట్టుదల వుండదు. ఉత్తమునికి ఆశయముండి, అంకితభావమనే వెలుతురును సూచికగా చేసుకొని గమ్యాన్ని అలవోకగా అందుకోగలడు. అరమరికలున్న వాటిని అధిగమిస్తూ, విజేతగా చరిత్రను సృష్టిస్తాడు. ఆశయం గొప్పదైనప్పుడు, చరిత్ర సృష్టించగలిగితే, అలవోకగా ఆశయసిద్ధిని పొందాలంటే క్రమశిక్షణ, అంకితభావం, ధృఢసంకల్పము వుండాలి. చరిత్రను తిరుగరాయాలన్నా, చరిత్రను సృష్టించాలన్నా, గమ్యాన్ని ఛేదించాలన్నా ప్రతి మానవుడు దశ, దిశ నిర్దేశించుకుని ముందుకు వెళ్ళాలి కదా! ఆది నుండి నేటి వరకు మానవుని జీవనపయనం పరిణామాలతో ముడిపడి, అనూహ్యమైన అభివృద్ధిలో సాగుతున్నదనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఈ జీవనయానం ఆశతో మొదలై, ఆశయాన్ని ఏర్పర్చుకొని వినూత్నరీతిలో విశ్వాసాన్ని ఊపిరిగా మలచుకుంటూ, గమ్యం వైపు ప్రయాణాన్ని సాగిస్తున్నాడు మానవుడు. ఆదిమానవుడు అత్యాధునిక మానవుడిగా మలచబడటానికి హేతువు చిన్నిచిన్ని ఆశే. మనిషి తన మథస్సుతో ప్రాపంచిక విషయాలలో అనూహ్యమైన అభివృద్ధిని సొంతం చేసుకుంటూనే వున్నాడు. మర్రివిత్తు నుంచి మహావటవృక్షం తయారవుతున్నట్లు, మానవుని చిన్న మెదడు నుంచి, ఆశ అనే చిన్న విత్తు నుంచి ఎన్నెన్నో ప్రణాళికలు. నేటి అభివృద్ధిని గమనిస్తే మానవుడు తనకున్న కోరికను ఆశతో ప్రారంభించి ఆశయంగా మార్చుకొని, మహోన్నతస్థితికి చేరుకుంటున్నాడు. ఈ సృష్టి మార్పుకి మూలం. పరిణామమనేది సృష్టిధర్మం. మార్పే వేదాంతం. పట్టుక, గిట్టుక మధ్య మార్పును గమనిస్తే, ఈ మార్పు ప్రాకృతిక ధర్మం. ఈ మార్పు కొనసాగితేనే ఎదుగుదలను గమనిస్తారు. ఆశ మొదలైతే మార్పును ఆహ్వానిస్తుంది. ఆశకు ఆశయం తోడైతే వచ్చే మార్పు అనంతం, అసమాన్యం. ఆంజనేయుని ఆశీస్సులు తోడవుతాయి ఆశయసిద్ధికి.

***మీ పూజ్య సద్గురువు ఆంజనేయునిది మహా గొప్పలక్ష్యం***
***ఆయన జ్ఞానం విశ్వానికి మహారక్షణ నొసంగు***
***ఆధ్యాత్మిక శిక్షణను అందించు బహునేర్పరితనం మిమ్ములను మార్చుటకే***
***ఎటువంటి దక్షిణ స్వీకరించని ఈ వాయునందనుడు***
***ఆధ్యాత్మిక వాయువును మీకందిస్తూ***
***మారండి. మారితే అందుతుంది మోక్షమని గట్టిగా, అతి గట్టిగా చెబుతూ***
***ఆశయసిద్ధికి ఆంజనేయుని ఆలింగనము చేసుకుని***
***ఆశ, ఆశయాల పల్లకిలో ఈ పవమానసుతుని పరీక్షలలో ఎదుర్కొంటున్న***
***సమస్యలను సావధానంగా సాలోకించి పరికించి***
***వాటిని దురము చేయుటకే మీ ముందు ప్రత్యక్షమై***
***దేవదేవుడిచే పంపబడ్డ ఈ హనుమ ప్రత్యక్షంగా బాగుపరచుటకే విచక్షణతో***
***నష్టపర్చేది నిర్లక్ష్యమని***
***అవసరం లేదు లక్షలు, లక్ష్యముంటే చాలని***
***విచ్చుకోవాలి జ్ఞానచక్షువులవి***

***జీవితం ఎన్నో వసంతాల వృక్షమని***
***అశాంతి పావురాలను పారద్రోలుటకై***
***ఈ పవమానసుతుడు ప్రక్కన చేరి***
***పరుగు లంఘించుటకై సాయమందిస్తున్నాడు***
***నా ఈ చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**28-02-2020** 09:00 AM

**55) మేము చేసే నిత్యకర్మలను భగవత్‌కర్మలుగా ఎలా మార్చుకోవచ్చును స్వామీ?**

*కర్మలు చేస్తున్నారు అంటే, అవి మనలను బంధంలో పడేస్తాయి. కర్మబంధం నుండి తప్పించుకోవాలంటే, కర్తృత్వబుద్ధిని విడిచిపెట్టాల్సిందే. మీ దృష్టిని భగవంతునిపై నిలిపి ఏ రకం కర్మను చేసినా, ఎన్ని కర్మలు చేసినా అవ్వన్నీ భగవత్పరమైన కర్మలే అవుతాయి. ఎలా అవుతాయి అని మీరు అడిగినట్లయితే, ఒక రాజుగారు చాలా కాలం రాజ్యపాలన చేసి మరణించాడు. ఆయనకు సంతానం లేదు. మంత్రులు, సేనాధిపతులు అందరూ కలిసి ఆ దేశ ఆచారం ప్రకారం పట్టపుటేనుగుకు పూలదండను అమర్చి, అది ఆ దండను ఎవరి మెడలో వేస్తుందో వారే కాబోయే మహారాజు అని ప్రకటించారు. ఎందరో సామంతులు, శ్రీమంతులు, మేధావులు ఎదురుగా వచ్చారు. కానీ, ఎవరి మెడలోనూ పూలదండ వేయలేదు. ఆ ఏనుగు చాలా ఊళ్ళు, పట్టణాలు, అరణ్యాలు దాటి ఒక గ్రామం వెలుపల కౌపీనధారియైన ఒక సన్యాసి తపస్సు చేసుకుంటూ వుంటే, అతడి మెడలో వేసింది దండను. అందరూ హర్షధ్వానాలు చేస్తున్నారు. ఆ సన్యాసికి విషయాన్ని తెలియచేశారు. అతడు, "నాకెందుకూ ఈ రాజ్యం, ఈ భోగాలు? నేను సర్వసంగపరిత్యాగిని, నిరంతరం భగవంతుని కోసం తపస్సు చేసుకుంటూ వున్నాను" అన్నాడు. రాజ్యాధికారాన్ని స్వీకరించటానికి అతడు ససేమిరా అన్నాడు. అయినప్పటికీ, మంత్రులు, సేనాధిపతులు అనేక విధాల నచ్చచెప్పారు. ఇది రాజాజ్ఞ అన్నారు. దీనిని తప్పటానికి ఎవ్వరికీ అధికారం లేదన్నారు. బలవంతంగా అతడ్ని రాజభవనానికి తీసుకెళ్ళి, రాజుగా పట్టాభిషిక్తుడ్ని చేసి, సింహాసనాన్ని అలంకరింపచేశారు. అతడు మాత్రం నిర్లిప్తంగా అన్నింటినీ చూస్తున్నాడు. ఆ తర్వాత ఆ సాధువు గొప్పగొప్ప వస్తువులు దాచే ఒక బీరువాను చూసి, అందులోని వస్తువులనన్నింటినీ ఖాళీ చేయించి, అందులో తన కౌపీనాన్ని దాచిపెట్టాడు. తన వైరాగ్యానికి గుర్తుగా ప్రతిరోజూ దానిని చూస్తూ వుండేవాడు. తన వైరాగ్యదశను స్మరిస్తూ రాజ్యపాలన చేస్తున్నాడు. 4 సంవత్సరాలు రాజ్యపాలన గావించాడు. రాజభవనాల్లో తిరిగుతున్నా, హంసతూలికా తల్పాలపై పరుండినా, రాజలాంఛనాలు, కిరీటం ధరించినా, అధికారం చెలాయిస్తున్నా తన కౌపీనాన్ని, వైరాగ్యాన్ని, దైవభక్తిని, భగవంతుని స్మరణను మరచిపోలేదు. దేహం వ్యవహారాలలో వున్నా, చిత్తం మాత్రం దైవం మీదనే నిత్యం, నిరంతరం వున్నది. అతడు నిర్లిప్తంగా రాజ్యకార్య వ్యవహారాలను చూస్తున్నాడేగానీ ఏ మాత్రం ఆసక్తిగానీ, ఆశగానీ లేదు. కొంతకాలానికి*

శత్రువులు ఆ రాజ్యాన్ని ముట్టడించారు. సైన్యాధికారి యుద్ధానికి సైన్యాన్ని సిద్ధం చేసి యుద్ధ సన్నద్ధుడై రాజుగారి వద్దకు వచ్చి అనుమతిని కోరాడు. రాజు అన్నాడు, "మనం 4 సంవత్సరాలు పరిపాలించాము గదా, వారిని కూడా కొంత సమయం పరిపాలించనీ" అన్నాడు. వెంటనే బీరువా దగ్గరకు వెళ్ళి తన కౌపీనాన్ని ధరించి ఎటో వెళ్ళిపోయాడు. మంత్రులు, ఇతర అధికారులు, సేనానులు పారిపోగా, రాజ్యం శత్రువుల వశం అయింది. సాధువు రాజ్యవ్యవహారాలు, లోకవ్యవహారాలు చూస్తున్నప్పటికీ, తన దృష్టి మాత్రం నిరంతరం పరమాత్మ మీదనే వున్నది. తన వైరాగ్యాన్ని, భగవంతుడ్ని మర్చిపోలేదు. నిరంతరం స్మరిస్తూనే వున్నాడు. అలాగే మీరు కూడా ఇక్కడ ఎన్ని వ్యవహారాలు చేస్తున్నా, భగవత్‌స్మరణను విడిచిపెట్టకూడదు. మీ దృష్టిని భగవంతునిపై నిలిపి మీరు ఏ కర్మలు చేసినాసరే, అవి భగవత్‌కర్మలే అవుతాయి, భగవంతుని కోసం చేసిన కర్మలే అవుతాయి అని గ్రహించాలి.

**ఉల్కా హస్తో యథా కశ్చిత్ ద్రవ్యమాలోక్యతాం త్యజేత్ ।**
**జ్ఞానేన జ్ఞేయమాలోక్యం పశ్యాత్ జ్ఞానం పరిత్యజ ॥**

చీకటిలో ఉన్న వస్తువును దీపం సహాయంతో తీసుకుని దీపాన్ని వదిలినట్లు,
జ్ఞానం ద్వారా జ్ఞేయాన్ని తెలుసుకుని, ఆ తెలుసుకున్న జ్ఞానాన్ని వదిలివేయమని అర్థం.

***ఏ కార్యక్రమమైనా ముందడుగు మీదే***
***తనువును చీల్చినా, మారణాయుధాలతో మోడువార్చినా***
***నీ కోసం నీవు తపిస్తూ, చివరి క్షణం వరకూ పోరాడు***
***సాధనను మించిన సాధకుడవవుతావు***
***కాలుష్యాన్ని మింగే గరళకంఠుడవై***
***మెట్టు మెట్టు అధిరోహిస్తూ***
***ఆంజనేయునిలా ఎదగాలని***
***ఉన్నత శిఖరాలనందుకోవాలని***
***చేతులు చాచి చల్లదనాన్ని అందిస్తూ***
***జ్ఞానబోధ చేస్తూనే వుంటాను***
***మీబ్రతుకులో ఒక భాగమై,***
***కంటికి రెప్పనై కాచుకుంటూ***
***అవివేకాన్ని అంతమొందించి,***
***భూలోకవేల్పు ఈ ఆంజనేయుని పదసన్నిధి చేరండి***
***నా ఈ చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**27-05-2020** 07:00 PM

## 56) మేము ఎట్టి సాధన చేయవలెను స్వామీ?

మనస్సును పీడించే గొప్ప శత్రువు అభిమానమే. మీకు గొప్ప ప్రబలశత్రువు ఈ అభిమానమే. దీని వేరు సహితం పెకిలించివేయడమే మీ ప్రధాన కర్తవ్యం. జ్ఞానదృష్టిని సంపాదించుకుంటే, ఇది మాయమైపోతుంది. భగవంతుని దృష్టిలో అందరూ సమానులే. పాపాత్ములు, పుణ్యాత్ములు, విద్వాంసులు, పామరులు, వీరంతా భగవంతుని దృష్టిలో ఏకమే. విద్వాంసుల బుద్ధియందు విద్వత్ సంబంధమైన ఆలోచనలు ఉన్నంత మాత్రాన వారు పరమాత్ముని సాన్నిధ్యంలో ఉంటారని తెలియకూడదు. విద్య నేర్చుకున్న వారేమి, విద్యలేనివారేమి – వీరిద్దరిలో కొంపముంచేటంతటి అభిమానం వుంటుంది. విద్వాంసులనేవారు తమ ఆయుష్షును అభిమానంతో వృధా చేసుకుంటారు, సామాన్యులు నామస్మరణతో సులభంగా జన్మ సార్ధకం చేసుకుంటారు. ప్రతి ఒక్క భక్తుడూ, సాధనాదశలో కష్టాన్ని భరించేతీరాలి. గురువు ఎంత గొప్పవాడైననూ, పరమార్ధజ్ఞానం కోసం సాధన చేయకపోతే ఏం లాభం? మీ మనస్సును, మీ హృదయాన్ని మీరే పరిశీలించుకోవాలి. సాధనాదశలో ఎదురయ్యే ఇబ్బందుల్ని మీరే ప్రశాంత మనస్సుతో ఎదుర్కోవాలి. సకల సాధనాల రహస్యం భగవంతుని స్మరణయే. భగవదనుగ్రహమే అతని అనుగ్రహం. అది లేకనే, సాధకుడు ముందడుగు వేయలేడు, ప్రగతిని సాధించలేడు. తీవ్ర ప్రయత్నము అత్యవసరము. భగవంతుని కోసం, భగవంతుడే కావాలనే ఉద్దేశ్యంతో సాధన చేసేవాళ్ళు నూటికో కోటికో ఒకరుంటారు. అహంకార మమకారాలు విడువనిదే ఎంత గొప్పగా భగవంతుని సేవ లేక సద్గురువు సేవ చేసినా భక్తుడు కానేరడు, భగవంతుని అనుగ్రహమునకు పాత్రుడు కానేరడు. ప్రపంచాన్ని త్యజించి, వైరాగ్యం ధరించి, ఆశ్రమం లేక మఠం కట్టుకోవడమంటే, సంసారబంధనంలో చిక్కుకోవడమే. ప్రపంచాన్ని త్యజించింది ఎందుకు? మమకారాన్ని పెంచుకునేందుకు కాదుగదా? పరమాత్మజ్ఞానం సంపాదించుకోవడం కోసమే కదా? గొప్పగొప్ప కార్యములు సాధించినప్పుడు కూడా అహంకార మమకారములు తోడుంటాయి. ఇవే పరమాత్మ దర్శనానికి ప్రతిబంధకం అవుతాయి. మహాత్ములెవరు? నిజమైన సాధుసత్పురుషులకు మరణభయం వుండదు. సంసారబంధము నుండి విడుదల చేయని గురువుతో మీకేమి ప్రయోజనం? ఎవరు జీవన్ముక్తులో, ఎవరు పరమాత్మయందు నిష్ఠ కలిగియుంటారో, ఎవరికి పునర్జన్మ లేదో, ఎవరి దృష్టిలో పరమాత్మ కంటే అన్యమైన ద్వితీయ వస్తువు లేనేలేదో, వారే నిజమైన సాధుసత్పురుషులు, మహాత్ములు, మాట్లాడే మరియు సంచరించే దేవతలు. వారిలో దేహాత్మబుద్ధి నశించి వుంటుంది. గురుశిష్యుల హృదయంలో నిత్యచైతన్య స్వరూపుడై ప్రకాశించే పరమాత్మ తానొక్కడే. గురువాజ్ఞను శిరసావహించడమే నిజమైన గురుసేవ. గురుశిష్యుల శరీరాలు వేరు – ఆత్మ ఒక్కటే. జీవ–జగత్తుల ఆత్మ కూడా అదే. ఆత్మ అద్వితీయమైనది. అఖండ సచ్చిదానంద స్వరూపుడు. ఈ ఆంజనేయుని గుండెల్లో రాముడు. మరి మీ గుండెల్లో? చెప్పండి!

***వ్యామోహాలు, బంధాలు సత్యంవైపు చూడనివ్వవు***

***అందుకోసమే మనిషి తనను తాను జాగ్రతపరచుకోవాలి***
***బాల్యంలో ఆటపాటల మీద ఆసక్తితో గడిచిపోతుంది***
***యవ్వనమంతా స్త్రీ వ్యామోహంతో, వార్ధక్యం సంసారం మీద ఆలోచనలతో గడిచిపోతుంది.***
***ధనం, యవ్వనం, పరివారం వీటిని చూసి గర్వించడం, విర్రవీగడం అసురత్వం***
***ఇవ్వన్నీ మాయాకల్పితాలు. ఏనాటికైనా నశించేవే.***
***అందుకనే ఓ మనిషీ! దివ్యమంగళస్వరూపుడైన ఆ దేవదేవుని స్మరించి, ధ్యానించి***
***జ్ఞానులు మహానుభావుల సాంగత్యం కోరుకో!***
***అప్పుడు మనసులో వున్న కల్మషాలన్నీ తొలగి, బుద్ధి నిశ్చలస్థితికి చేరుకుంటుంది***
***మనసు పరమేశ్వరుని మీద కేంద్రీకృతమవుతుంది***
***అంతిమంగా జీవన్ముక్తి లభిస్తుంది.***
***మారుతి ఆశీస్సులు దండిగా దొరుకుతాయి సాధనా పరితప్తులైన నా చిన్నారి ముద్దుబిడ్డలకు.***
***అది మీరే ఎందుకు కాకూడదు?***

*మనిషి సుఖపడకపోవటానికి మూలకారణం*
*ఉన్నదానిపై నిర్లక్ష్యం, లేనిదాని కోసం ఆరాటం*

ॐ

**28-05-2020** 05:45 PM

**57) ఎంతో గొప్ప అదృష్టాన్ని అందిస్తున్న మీకు మేము ఏ విధంగా కృతజ్ఞతలు అందించగలము స్వామీ?**

*ఎన్ని జన్మల పుణ్యమో, ఎంతటి అదృష్టమో మీరు నా వద్దకు చేరడం, నా సమక్షంలో గడపటం. ఇప్పటికి నా చరణాల సన్నిధికి చేరారు. ఇది ఇప్పుడు మీకు తెలియదు కానీ, ముమ్ముందు నా తత్త్వము మీకు బాగా తెలుస్తుంది. ఎక్కడో ఎవ్వరికో గానీ ప్రాప్తించని అదృష్టము మీకు లభించింది. కానీ, దీనిని సులభంగా మీరు వదిలిపెట్టుకుంటున్నారు. నేను చెప్పిన దేనినీ మీరు ఆచరించడం లేదు. చీమ సముద్రపు లోతును తెలుసుకోవాలని ప్రయత్నం చేసిందట. ఒక్క అల వస్తే చీమ కొట్టుకొనిపోతుంది. అటువంటి చీమ సముద్రపు లోతులను తెలుసుకోగలదా? అదే విధంగా ఈ ఆంజనేయుని హృదయపు లోతును ఏ మాత్రము తెలుసుకొనలేరు. మీకు చిక్కిన ఈ అవకాశాన్ని అనుభవించండి, ఆనందించండి, ఆస్వాదించండి, అద్భుతంగా మారండి. ఈ మారుతి ఎదుట అందరూ విద్యార్థులే. నా ఆదేశాలను అమలు చెయ్యలేని వారందరూ దురదృష్టవంతులే. నా ప్రేమతత్త్వాన్ని అర్థం చేసుకోలేని వారందరూ అజ్ఞానులే. మానవులై పుట్టినందుకు ప్రలోభాలకు లొంగక, ధనవ్యామోహానికి బందీలుగాక, కేవలం దేహభావంతో జీవితాన్ని వ్యర్థం చేసుకోకండి. సన్మార్గంలో నడిచి సత్కీర్తిని స్వంతం చేసుకొమ్మని హెచ్చరిస్తున్నాను. మీపైన అంతులేని అనురాగం. అందుకే మిమ్ములను ఉద్దేశించి బోధనలు చేస్తూ వున్నాను. ఇచ్చిన దానిని పుచ్చుకుని, దానినే మరలా తిరిగి ఇవ్వవచ్చును. అంటే, నేను మీకు అందిస్తున్న*

ప్రేమను యథాతథంగా తిరిగి నాకందిచ్చవచ్చును. అదీ చేతకావట్లేదు. పాలల్లో నీరు కలిపినట్లుగా, నేనందిస్తున్న ప్రేమలో విషపూరితమైన ఆలోచనలను, అహంకారాన్ని, అభిమానాన్ని, ఆవేశాలను కలిపి ముఖముపై చిరునవ్వుతో అందిస్తే ఎలా? దానిని చిటికెలో పట్టుకొనగలడు ఈ మారుతి. మానవులై పుట్టినందుకు, సత్కీర్తిని సంపాదించండి. అదే చాలు! కట్టకడపటికి దేహం వుండదు, ధనమూ వుండదు. మృతి చెందేటప్పటికి నిలిచేది కీర్తి మాత్రమే. అట్టి కీర్తిని సంపాదించండి. మీరు రావణాసురులు కాకండి, రాములు కండి. ఎంతో మంది టాటాలైపోవాలని ఆశిస్తుంటారు. తాతా కావడంలో గొప్పదనమేముంది. గడ్డం నెరిస్తే తాతలైపోతారు. డబ్బుతో తెచ్చుకునే కీర్తి క్షణభంగురమైనది. డబ్బు కోసం మీరు అమ్ముడుపోవద్దు. డబ్బు సంపాదించండి. కానీ, సద్వినియోగం చెయ్యండి. పాపపు సొమ్ము మీ వద్ద ఎంతమాత్రమైనా నిలవదు. దొంగలైనా ఎత్తుకుపోతారు, టాక్స్ అధికారులైనా తీసుకుపోతారు, అగ్నియైనా కాల్చివేస్తుంది, రోగాలైనా అపహరిస్తాయి. కనుక, నలుగురూ వచ్చి దోచుకోకపూర్వమే డబ్బును సద్వినియోగం చెయ్యండి. ధర్మాచరణకే ఈ శరీరం వచ్చింది. అంతేగాని, తుచ్ఛమైన భోగభాగ్యాల కోసం కాదు. మహాచక్రవర్తి అంతఃపురంలో సుఖాన్ని అనుభవిస్తూ వుంటాడు. అదే సుఖాన్ని వీధుల్లోని జంతువులు కూడా అనుభవిస్తూ వుంటాయి. ఇదేనా సుఖమంటే? కాదు గదా? ఈశ్వరానుగ్రహాన్ని సంపాదించాలి. అదే నిజమైన సుఖము. అయితే, అటువంటి స్థితి వచ్చేవరకూ నీతిగా నిజాయితీగా వుండండి. పారమార్థిక దృష్టితో ప్రకృతిని అనుభవిస్తూ వుండాలి, బ్రతకాలి. ఇదే నేను మీకు ఇచ్చే సందేశము. మీరు ప్రకృతిని వదిలిపెట్టనక్కరలేదు. ఉన్న ఉద్యోగాలకు రాజీనామా చెయ్యనక్కరలేదు. ఉన్న ఉద్యోగాలను చేసుకోండి. మీ కుటుంబాలను పోషించుకోండి. కానీ, లక్ష్యాన్ని మాత్రం దైవం పైన పెట్టండి. దుస్సంగాన్ని దుడ్డు పెట్టుకొనైనా దూరం చేసుకోండి, సత్సంగాన్ని మాత్రం ప్రాణమిచ్చైనా కాపాడుకోండి. దైవాన్ని నమ్మండి. అతనే మీకు అన్నివిధాలా రక్షణగా నిలుస్తాడు. అందరూ దైవాన్ని వెతుకుతున్నామంటారు. అయితే, దైవాన్వేషణ ఎక్కడా జరగటం లేదు. నిజమైన మానవుని కోసం దైవమే వెతుకుతున్నాడు. మానవుడు లోపల ఒకరకంగా, బయట మరొకరకంగా వుంటున్నాడు. దివ్యత్వం లోపల, బయటా ఒకటిగానే వుండాలి. అట్టి మానవుని కోసమే అన్వేషణ, దైవాన్వేషణ జరుగుతోంది. అలా స్వచ్ఛంగా మారగలిగితే, దైవమే మీ దగ్గరకు వెతుక్కుంటూ వస్తాడు. అసలు భగవంతుని మీరు ఎందుకు వెతుకుతున్నారు? మీలో పవిత్రత లేకపోవటం చేతనే, మీలో కరుణ లేకపోవటం చేతనే కరుణామయుని కోసం వెదుకుతున్నారు. భగవంతుడు మీ వెంటనే వున్నాడు. అంతర్యామిగా వున్నాడు. అంగుళమంత అహంకారం, అపరిమితమైన ఆత్మను తెలుసుకోలేకపోతున్నది. దేహము, ఇంద్రియములు కేవలం పనిముట్లు మాత్రమే. నీవే దైవమన్న స్థితికి చేరుకోవాలి. అదే నిజమైన శివతత్త్వము. నీయందే వున్న శివతత్త్వాన్ని గుర్తుంచుకోలేక, నిరంతరమూ అమంగళముతోనే జీవించడం అనర్థహేతువు సుమా! ఇది నా ఉవాచ, హెచ్చరిక!

నేను బిందెను. మీరు త్రాడు. మీరు లాగితే నేను వస్తాను.

**ప్రారబ్ధవశమున పీడితులగువారు నన్ను తలచిన క్షేమమొందుదురు.**
**సంపదలుడిగిన సంకోచమొందక త్వరగా నన్ను తలచిన తిరిగివచ్చు**

***విద్యలో దిగజారి వెతగొన్న సమయాన, హనుమా! అని యన్న పెంపు అగును***
***పయనించు వేళలా పతనమగుచునుండ, పవనపుత్రాయని పిలిచిన శుభము కలుగు***
***శక్తిమాలి పిరికి సంభవించిన వేళ, పుష్టి కలుగు నా దృష్టి వలన***
***దైవీకభావాలు తలపు రానపుడు, జై అంజనేయ అనినంత శాంతి కలుగు***
***దుష్ట గుణంబులు దొంతర్లు అగుచుండ, జై హనుమ అంటే చాలు చల్లబడును***
***కోర్కెలధికమగుచు కొండయైనపుడు, తలపు సంజీవరాయుని తగ్గిపోవు***
***ఒంటరితనములో నొరిగియున్నప్పుడు, ఆంజనేయుని కూటమి హాయి చేరనిచ్చు***
***మలిన భావనలెల్లయు మార్పు చేయుటకై, అవని జొచ్చెను ఈ మారుతి భువిని***
***విశ్వసించుము సతతము వీడకుండా పొంచియున్నాడు మీకై ఈ పవనపుత్రుడు***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**29-05-2020** 05:45 PM

**58) మేము దివ్యాత్మస్వరూపులమన్న స్వామి సంబోధనను మేము ఎందుకని ఆచరించి అనుభవించలేకున్నాము స్వామీ? అట్టి స్థితిని గుర్తించుటకు మేము ఏమి చేయాలి స్వామీ?**

*అణువు లేని పదార్థం జగత్తులో కానరాదు. అణువులయొక్క చేరికయే ఘన స్వరూపాన్ని ధరిస్తుంది. ఆయనే ఆత్మస్వరూపం. ఆయనే బ్రహ్మస్వరూపం. అట్టి బ్రహ్మాభావమును విస్మరించి, జగద్భావమును విశ్వసించి, మానవుడు దుఃఖములకు గురి అవుతున్నాడు. జగద్భావములో మునిగినవాడు, సరియైన ఆనందమును పొందలేడు. ఈ సత్యాన్ని పురస్కరించుకొనియే చెబుతాను సర్వం దుఃఖం దుఃఖం, సర్వం క్షణికం క్షణికం, సర్వం శూన్యం శూన్యం అని. సర్పము దంతములలో విషమున్నది. కానీ, అది సర్పమునేమాత్రమూ బాధించదు. తేలుయొక్క కొండినందే విషమున్నది. కానీ, అది తేలునేమాత్రమూ బాధించదు, హింసించదు. అదే విధముగానే, బ్రహ్మాయందు ఈ ప్రకృతి ఉన్నది. కానీ, నిత్యసత్యమైన బ్రహ్మతత్త్వమును ఏదీ బాధించలేదు. ఈ జగత్తులో సర్వం అణుమయం, సర్వం ఆత్మమయం, సర్వం బ్రహ్మమయం. అలాంటి పరిస్థితుల్లో బాధకు, దుఃఖమునకు అవకాశమెక్కడున్నది? కానీ, ఈనాటి మానవుడు దుఃఖములో క్రుంగిపోతున్నాడు. కారణమేమిటి? తనయందున్న ప్రకృతిని పరమాత్మగా భావించలేకపోవటమే. పరమాత్మను కూడా ప్రకృతిగా భావిస్తున్నాడు. భగవత్ స్వరూపమైన ప్రకృతిని చూస్తున్నప్పటికీ, మూఢుడు ఇంకా భగవంతుని చూడాలి, భగవంతుని చూడాలి అని ఆశిస్తున్నాడు. ప్రకృతి భగవత్తత్త్వం కాదా? ప్రకృతి కార్యము – భగవంతుడు కారణము. కార్యకారణ స్వరూపమే ఈ జగత్తు. ప్రపంచమంతయు దైవత్వము యొక్క స్వరూపమే. మానవదేహము పరిశుద్ధమైన అద్దము వంటిది. అది వివిధ రూపములలో కన్పించినప్పటికీ, అన్నింటి యందు, ప్రతిబింబించేది తానేనని తెలుసుకోలేకపోతున్నాడనీ, సర్వాంతర్యామి తత్త్వమును తెలుసుకొనితీరాలనీ హెచ్చరిస్తున్నాను. అందరి*

యందు వున్నది ఒకే భగవంతుడు. కనుకనే ఇలా చెబుతున్నాను. ధర్మాచరణ నిమిత్తమై మానవుడు తన బుద్ధిని సంఘంలో ప్రవేశపెట్టి, జీవితమును సార్థకం చేసుకోవాలి. బుద్ధి వుండికూడానూ సంఘంలో ప్రవేశపెట్టకపోతే, ధర్మమును ఉద్ధరించడానికి వీలుకాదు. ఈ శరీరంతో ధర్మమును ఆచరించాలి. మనిషి జీవితమంతయూ ధర్మము చేత కట్టుబడి వుండాలి. ఈనాడు ఏదో పూజలు చేస్తున్నారు, భజనలు చేస్తున్నారు, సేవలు చేస్తున్నారు కాని, శాంతి లభించడం లేదు. తనువును తాను దండించిన, విషయభోగములు అణుగునా? ఆకలిదప్పులు మానిన ఆత్మజ్ఞాని కాగలడా? తానెవరో తెలియకున్న తత్త్వజ్ఞానమెట్లు కుదురును? నిన్ను నీవు తెలుసుకోలేకపోతే, ఎన్ని సాధనలు చేసినా ప్రయోజనం లేదు. బుద్ధి ఒక పదునైన ఆయుధం కనుక, మంచిచెడ్డలు దీని వినియోగ విధానముపై ఆధారపడి వుంటుంది. అహింస గురించి ఎంతగా బోధించినా ఈ అహింసను త్రికరణశుద్ధిగా ఎందరు పాటిస్తున్నారు? అసలు అహింసకు అర్థం తెలుసుకుని ప్రవర్తిస్తున్నారా? హింస అంటే కేవలం చేతులతోనో, ఆయుధములతోనో ఇతరులను బాధించటం మాత్రమే కాదు. మనసులో ఇతరులపైన దుష్టభావములు రావటం కూడా హింసయే. వాక్కులతో ఇతరులను బాధించడం కూడా హింసయే. ఈనాడు మీరు వినరాని మాటలను వింటున్నారు, కనరాని దృశ్యాలను చూస్తున్నారు, చేయరాని పనులను చేస్తున్నారు. అందుకనే శాంతి మీకు లభించడం లేదు. ఎన్ని పవిత్రమైన బోధలు వింటున్నప్పటికీ మానసిక పరివర్తన కలగటం లేదు, హృదయం పరిశుద్ధం కావటం లేదు. ఇంక ఎందుకోసం వినాలి, ఎందుకోసం భజనలు చేయాలి? సత్సంగంలో చేరినా దుర్భాషలు విడువకపోతే, ప్రయోజనమేమున్నది? కొన్ని విషయాలు చెడ్డవని తెలిసినప్పటికీ, అందులోకే ప్రవేశిస్తున్నారు. ఇది ఎంతమాత్రమూ మంచిది కాదు. అనేక జన్మల పుణ్యఫలంతో మీరు కోరుకున్న జీవితమే ఈ మానవజీవితం. దీనిని కేవలం లౌకిక వాంఛలకు అంకితం చేసి, దుర్వినియోగం చేసుకోరాదు. లోకములో చెలరేగిన అశాంతిని, అధర్మమును పారద్రోలి, దివ్యత్వమును ఆవిర్భవింపచేయడమే ఈ ఆంజనేయుని ప్రధానకర్తవ్యం, నా లక్షణము కూడా. త్రికరణశుద్ధితో చేసే ప్రతి పని కూడానూ ధర్మమే. కానీ, ఈ విషయమును ఎవ్వరూ అర్థం చేసుకోవటం లేదు. మీ కొరకై ఏతెంచిన ఈ ఆంజనేయుని ద్వారా ధర్మబోధలను వినటం మీరు చేసుకున్న జన్మజన్మల అదృష్టం. సాక్షాత్తు ఆ విరాట్స్వరూపుని దర్శించగలగటం మీ పూర్వజన్మల పుణ్యఫలం. స్వామి బోధలను ఆచరిస్తూ, ఈ ఆంజనేయుని బోధలను వింటూ ధన్యులు కావాలి కానీ, ఇది ఏమిటి? మీ పరిస్థితి ఏమిటి? ఒక చిన్న కథ చెబుతాను. ఒక నగరానికి దగ్గరలో వున్న అరణ్యంలో ఒక పెద్ద జలపాతం వుండేది. ఆ నీటి ఒరవడిని, ఆ ప్రకృతి సోయగాలని తిలకించడానికి వందలకొద్దీ పర్యాటకులు నిత్యం అక్కడికి వస్తుపోతూ వుండేవారు. ఒకరోజు ఒక వ్యక్తి అక్కడకు వచ్చాడు. అతను ఒక త్రాడు తీసుకువచ్చాడు. జలపాతానికి అటుప్రక్కన వున్న చెట్టుకు త్రాడును కట్టాడు. రెండవ కొనని జలపాతానికి ఇటుప్రక్కన వున్న ఇంకొక చెట్టుకు కట్టాడు. అందరూ చూస్తున్నారు. కానీ, ఎవ్వరికీ ఏమీ అర్థం కాలేదు. జనాన్ని ఉద్దేశించి అతను, "నేను దేవుడిని పూర్తిగా నమ్ముతాను. నేను ఆ త్రాడును పట్టుకుని ఇటునుంచి అటువైపుకి వెళ్తాను. నాకు ఏ ప్రమాదమూ జరగదు" అన్నాడు. అందరూ భయం భయంగా చూస్తున్నారు. అందరి గుండెలూ దడదడా కొట్టుకోవటం మొదలుపెట్టాయి. చూస్తుండగానే అతను క్షేమంగా అవతలివైపుకు

చేరుకున్నాడు. అందరూ కేరింతలు కొట్టారు. అతను దిగి వచ్చాడు. అందరూ అతని ధైర్యాన్ని, దేవునిపై అతనికి గల ధృడవిశ్వాసాన్ని మెచ్చుకున్నారు. అతను జనాన్ని ఉద్దేశించి, "మీ అందరికీ దేవునిపై నమ్మకం ఉన్నదా?" అన్నాడు. "ఉన్నది" అని ముక్తకంఠంతో అందరూ పలికారు. "అయితే, ఎవరైనా నా భుజం మీద కూర్చోండి. నేను క్షేమంగా అవతలవైపుకి తీసుకువెళతాను" అన్న అతని మాటకి అందరూ మౌనం వహించారు. ఎవరి ప్రాణభయం వారిది. ఎవ్వరూ ముందుకు రాలేదు. అప్పుడు అతను అక్కడే వున్న తన పది సంవత్సరాలు కొడుకును భుజంపై కూర్చోబెట్టుకుని మళ్ళీ బయలుదేరాడు. ఈసారి జనం ఇంకా భయపడ్డారు. అయిపోయింది... ఇప్పుడో, ఇంకాసేపట్లో. కానీ, రెండవసారి కూడా అతను క్షేమంగా రావటంతో చప్పట్లు మారుమ్రోగాయి. అతను అందరి ముందు కొడుకును ప్రశ్నించాడు. "నాన్నా! నీకు పడతానని భయం వెయ్యలేదా?" అడిగాడు. కొడుకు జవాబు, "నాన్నా! నాకు నీమీద నమ్మకం వుంది. నువ్వు నన్ను పడనీయవు". ఆ పదేళ్ళ కుర్రాడికి వున్న నమ్మకం మీకు నా మీద వుందా? నేను మీకు రక్షణగా వుంటానని చెబుతున్నా, మీరు మీ కోటా, మీ వాటాకి చెందిన భయాన్ని పడుతూనే వుంటారు కదా! ఎవరైనా "మేము అలాకాదు" అన్నారంటే, వారు నిజంగా నా కోటాలో, నా వాటాలోని వారే. వారే నా బిడ్డలు!

***ఒక కోవెల మునివాకిట పూలతోట ఒకటి కలదు***
***రంగురంగుల పూలెన్నో విరగబూసి పూయుచుండే***
***పూలకేమో సూది గ్రుచ్చి, పూజారులు దండచేయ,***
***సూదిపోటు తప్పకొనుటకై పూలు కొన్ని జారిపోయె***
***దండలైన పూలన్నీ దేవుని మెడలో వుండగా,***
***జారినట్టి పూలన్నీ చెల్లాచెదురయ్యెనచట***
***దేవుని మెడలోని పూలు హారముగా కడు మోదమొంద ఆ పూవులు పరవశించెను.***
***నేలపడిన పూలన్నీ మిగుల బాధపడుచున్నవి***
***తమకు జరుగు అన్యాయం గూర్చి దేవునినిట్లు అడిగె***
***అలా అడిగిన పూలను కని దేవుడు చిరునవ్వు నవ్వి,***
***వాటిని ఓదార్చదలచి ఈ రీతిగా ఇట్లు పలికె***
***దైవానికి చేరువగా దండలుగా వుండుటకై***
***గుండె నుండి సూదిపోవ ఆ బాధను అవి ఓర్చెను***
***పూర్వపుణ్యఫలము వలన గుడిముంగిట పుట్టి కూడా***
***బాధలకు వెరచి మీరు నేలపాలు అయిపోయిరి***
***ఆ మాటలు విని పూవులు ఆ పలుకుల మర్మమెరిగి***
***మారుమాట పలుకకుండా సిగ్గుతోడ తలలు వంచె***
***ఈ మారుతి భావం అర్థమైన దనుకుంటా***
***నా ఈ చిన్నారి ముద్దుబిడ్డలకు!***

*ఆంజనేయం మహావీరం బ్రహ్మావిష్ణు శివాత్మకం ।*
*తరుణార్క ప్రభో శాంతం రామదూతం నమామ్యహం ॥*

ఓం

**30-05-2020** 05:45 PM

**59) కష్టకాలంలో భగవంతుడు ఏ విధంగా చేయూతని అందిస్తాడు స్వామీ?**

*అప్పటి వరకూ అంతా బాగానే ఉన్నట్లుంటుంది. మీ చుట్టూ ప్రకృతి కూడా ప్రశాంతంగానే వుంటుంది. ఉన్నట్లుండి ఒక అలజడి, మనిషి బ్రతుకులోనూ, ప్రకృతి లక్షణంలోనూ అప్పుడప్పుడు మీరు ఎదుర్కోవలసి వచ్చే విషమ సంఘటనలు, అపుడా విపత్కర సమయంలో ధైర్యం చెప్పి చేయూతనిచ్చే తోడ్పాటు కావాలి. ఆర్తులైనవాళ్ళ కన్నీళ్ళు తుడిచి, సహాయం అందించే దయాహృదయం కావాలి. అందుకే అప్పు ఇచ్చేవాడు, వైద్యుడు, ఎడతెగకపారే నీరు ఉన్న ఊళ్ళోనే వుండమనీ, అవి లేని ఊళ్ళో వుండవద్దని చెబుతారు. మతం ఏదైనా, మీరంతా కొలుచుకునే భగవంతుడు ఆర్తత్రాణ పరాయణుడే. ఋషిప్రోక్తమైన మీ ఆధ్యాత్మిక భావభూమికలో మీరు ఆరాధించుకునే భగవంతుడు కేవలం సృష్టికారకుడు మాత్రమే కాదు. సృష్టిలోని సర్వ జీవరాసుల్ని కాపాడే, రక్షించే ప్రభువు. ఆర్తితో తనను శరణుకోరిన వారిని ఉద్ధరించే ఆపద్బంధువు. అసలు భగవదవతార లక్ష్యమే ఆపదలో వున్న సజ్జనులను ఆదుకొని, రక్ష కలిగించడం, వారికి ఆ ఆపదను కలిగించిన దుర్జనులను శిక్షించడం. వినడానికి అంతా బాగానే వుంది. ఈ కథలన్నీ పురాణకాలం వాటివి కదా అని అనుకున్నట్లయితే, మరి మీ కాలంనాటి మాట ఏమిటి? మీరు ఎంతగా పూజించి వేడ్కొన్నా, ఆపద్బాంధవుడైన ఆ భగవంతుడు ఎప్పుడూ కంటికి కనబడడే? ఆయన ఆర్తత్రాణ పరాయణత్వం అంతా ఆ యుగధర్మానికి పరిమితమైనదా? ఇటువంటి సందేహాలు మీకు కలుగవచ్చు. మీకు అందుకు సమాధానం ఒక్కటే. అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ వుండేది ఒకే భగవత్‌తత్త్వం. అది కారుణ్యతత్త్వం. ఆపన్నులను కాపాడటానికి భగవంతుడు అవతారరూపంలోనే రావలసిన అవసరం వుండదు. ఆపన్నుల కష్టాన్ని తీర్చాలని ఇచ్ఛను, శక్తిని, ప్రేరణను ఆయన మరెవరిలోనో కలిగించి, ఆ పనిని చేయించవచ్చు. ఆ పని ఎవరు చేసినా, అది భగవత్‌కార్యమే అవుతుంది. పరోపకార బుద్ధితో, తోటివారి కష్టాన్ని తీర్చి, ఆదుకునే ఆపద్బాంధవులంతా, భగవంతుని ప్రతిరూపాలే. వారు మానవాకృతిలో మీతో కలిసి తిరిగే భగవత్‌రూపాలే. ఆర్తత్రాణ పరాయణులైన ఆపద్బాంధవులకు కలిగే సంతృప్తి అంతా ఇంతా కాదు. విపత్తులలో చిక్కుకున్న దుఃఖార్తులను ఆదుకొని, వారి కష్టాన్ని తీర్చడంలో కలిగే సౌఖ్యం, మనస్తృప్తి, స్వర్గలోకంలోనైనా, బ్రహ్మలోకంలోనైనా లభించదు. జనజీవితాన్ని ఒక్క కుదుపు కుదిపే విపత్కర సంఘటనలూ అప్పుడప్పుడు సంభవించవచ్చు. ఇప్పటి కరోనా, వరదలు, కరువుకాటకాలు, భూకంపాలు వంటి ప్రకృతి భీభత్సాలు వాటిల్లినప్పుడు కలిగే కష్టనష్టాలు జాతికంతటికీ కలిగే ఘోరమైన విపత్తులు. అటువంటి సంక్లిష్ట సమయాలలో దుఃఖితులైన వారికి చేయూతనందించే దయార్ద్రహృదయులంతా ఆపద్బాంధవులే. అటువంటి ఆపద్బాంధవుల అంతరంగం ఇలా వుంటుంది.*

**సత్వహం కామయే రాజ్యం  న స్వర్గం నా పునర్భవం ।**
**కామయే దుఃఖతప్తానా ప్రాణినామార్తి నాశనమ్ ॥**

నాకు రాజ్యం వద్దు, స్వర్గమూ వద్దు, మోక్షం కూడా కోరను. నేను కోరుకునేది ఒక్కటే. దుఃఖతప్తులైన ప్రాణుల ఆర్తినాశనం!

**60) సాధకులు ఎటువంటి విశ్లేషణ చేసుకోవాలి స్వామీ?**

సాధారణంగా మీలో చాలామంది యంత్రాల్లా పనిచేయటమే తప్ప, ఆ పని తమపై ఎలాంటి ప్రభావం చూపుతుందో ఆలోచించరు. కేవలం పని, దాని వలన వచ్చే ఫలితం ఈ రెండే తప్ప తమలో ఆంతరంగికంగా కలిగే పరిణామాలపై ఎలాంటి దృష్టి పెట్టరు. అందుకే ఇలాంటివారు వ్యక్తిత్వపరంగా ఎలాంటి ఎదుగుదల లేకుండా కొన్నాళ్ళకు పనియంత్రాల్లా మారి, తమ సహజత్వాన్ని, ప్రశాంతతను కోల్పోతారు. మరికొందరు పని చేసి చేసి, కాలక్రమంలో మానసిక రుగ్మతలతో బాధపడుతూ వుంటారు. పని పరమార్థం ఏమిటో తెలుసుకోకుండా, పని పరిణామాలపై ఆత్మ విశ్లేషణ చేసుకోకుండా యథాలాపంగా చేస్తూండటం వల్లే ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తుంటాయి. పని చేస్తున్నప్పుడు కానీ, తరువాత గానీ ఈ కార్యసాధనల వల్ల నా మనస్సు మరింత ఉన్నతస్థితికి చేరుతుందా? మరింత పవిత్రమవుతుందా? అని పరిశీలించుకుంటూ వుంటే, అంతేగాక, మనస్సు తన మూలస్థానమైన ఆత్మకు దగ్గరవుతుందా అని కూడా పరిశీలించుకుంటూ వుంటే, పని మీపై సానుకూలమైన ప్రభావాన్ని చూపుతుందో, ప్రతికూలమైన ప్రభావాన్ని చూపుతుందో అర్థమవుతుంది. ముఖ్యంగా మీరు ఎంచుకునే పని, దాని ప్రవృత్తి కూడా మీ వ్యక్తిత్వాన్ని, నడవడికను ఎంతో ప్రభావితం చేస్తాయి. అందుకే వ్యక్తి నిర్వర్తించే పనిని బట్టి అతని స్వభావాన్ని అంచనా వేయవచ్చు. కార్యక్షేత్రాన్ని బట్టి మనిషి ఆలోచనలను అంచనా వేయవచ్చు. నైతికపరంగా, ఆధ్యాత్మికపరంగా సమర్థనీయం కాని పనులవల్ల మీ మనస్సు ఒత్తిడికి, ఆందోళనకు, అలజడికి గురి అవుతుంది. మీకు తెలియకుండగానే మీ మనోప్రవృత్తులను మార్చేస్తుంది. మీ ఆలోచనల్ని ప్రభావితం చేసే కార్యాల విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వుండాలి. కార్యాంతంలో మీ మనోప్రవృత్తుల్ని, వాటి ప్రేరణతో మీరు నిత్యజీవనంలో నెరపుతున్న మానవసంబంధాలను పరిశీలించుకుంటూ వుండాలి. అలాంటి విశ్లేషణ కొరవడిననాడు, మీ కార్యాలు, వృత్తి వ్యవహారాలే చివరకు మీ వ్యక్తిత్వ నిర్మాణానికి ప్రతిబంధకాలవుతాయి. కార్యసాధనవల్ల సిరిసంపదలు, సౌకర్యాలు పొందవచ్చు. కానీ, మానసిక వికాసం సాధించలేకపోతే, ఆంతరంగిక శాంతి, ఆధ్యాత్మిక ఉన్నతి మచ్చుకైనా సాధ్యపడవని ఈ మారుతి వక్కాణించి చెబుతున్నాడు.

***ఆదిలో ఎనభైనాల్గు కోట్ల జీవరాసులలో నరుడు ఒక జీవరాశి***
***ఆనాటి నరుడు నరమాంసభక్షకుడు***
***నరుడ్ని మనిషిగా మార్చింది నాగరికత***
***మనిషి మానవత్వం పొంది మానవుడయ్యాడు***
***మానవత్వం ఒక మతం కాదు, ఒక కులం కాదు***

***మానవత్వం మనిషిలోని దివ్యత్వం***
***మానవత్వం నుండి దైవత్వం ఆవిర్భవిస్తుంది***
***మానవుడే మాధవుడవ్వాలి***
***మానవత్వం లేని మనిషి దానవుడు***
***మానవత్వం మానవ సంఘాన్ని పటిష్టం చేయాలి***
***ప్రతిమానవుడు సంపూర్ణ మానవత్వంతో దైవత్వం పొందాలని,***
***అటువంటి దైవత్వభావనతో కర్మలనాచరించి, తోటివారికి సహాయపడుతూ,***
***ఆ సహాయకులే నా సహసైన్యంగా పిలువబడుతూ***
***పవనకుమారుని బిడ్డలుగా వుండాలని చెబుతున్నాను***
***నా ఈ చిన్నారి ముద్దుబిడ్డలకు!***

*మూలనిర్మాణం మారాలంటే, ఆత్మస్థితి నుండి కర్మలు చేయవలసిందే!*

ॐ

**31-05-2020** 05:45 PM

**61) సంతోషం సగం బలం అంటారు కదా స్వామి. సంతోషంగా ఎలా ఉండాలి స్వామీ?**

కోరుకున్నది సాధించాలని, నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ప్రతిఒక్కరూ ఆశిస్తారు, ఆకాంక్షిస్తారు. కానీ, కొండంత కోరికకు కనీసం అణువంత ఆచరణ కూడా ముఖ్యమని కొందరు మాత్రమే గుర్తిస్తారు. అట్టివారే ఆచరణలో ముందు వుంటారు. వాస్తవానికి ఆచరణకు అండగా వుండేది సంతోషం. కార్యాచరణలో ఎప్పుడూ సహకరిస్తూ అడుగు ముందుక వేసేలా ప్రోత్సహించేది సంతోషం. అందుకే సంతోషం సహం బలం అంటారు. సంతోషం ఆనందానికి పైమెట్టు. ఆనందానికి ఎవరు ఎన్ని నిర్వచనాలు ఇచ్చినా, కర్తవ్యనిర్వహణలోనే నిజమైన ఆనందం ఇమిడివుంది. అందుకే చేయవలసిన పని వాయిదా వెయ్యకూడదు. ఉత్సాహంతో పనిచేయాలి, సృజనాత్మకత కలిగి వుండాలి. అప్పుడే నిజమైన ఆనందాన్ని పొందగలరు. ఫలితాన్ని పరికించి చూస్తే కలిగేది సంతోషం. ఆ సంతోషతరంగాలే మిమ్మల్ని ప్రగతివైపు నడిపిస్తాయి. మంచుబిందువు కన్నా సున్నితమైన సంతోషం. ఏ క్షణంలో నిష్క్రమిస్తుందో చెప్పలేరు. అందుకే సంతోషాన్ని ఓ కంట కనిపెడుతూ వుండాలి. ఎందుకంటే, మీ ఆనందాన్ని దూరం చేసే వ్యక్తులు, మీ సంతోషాన్ని ఛిన్నాభిన్నం చేసే పరిస్థితులూ ఎప్పుడూ మీ చుట్టూ వుంటాయి. కాబట్టి వాటినన్నింటినీ గమనిస్తూ మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించాలి. చేస్తున్న పనిలో ఉత్సాహం వుండాలి. సృజనాత్మకతతో వ్యవహరించాలి. నూతన పోకడలను అనుసరిస్తూ వుండాలి. అలసట, బద్ధకం, భయం ఇవ్వన్నీ మీ బలహీనతలు. వీటిని జయించే ఆయుధం ఒక్కటే. అదే సంతోషం! దాని కోసమే మీరు ఎప్పుడూ ప్రయత్నించాలి. మీలో కలిగే వ్యతిరేకభావాలను దూరం చేసుకొని సానుకూల దృక్పథంతో వుండాలి. ఇతరుల వ్యవహారాలలో అనవసర జోక్యాన్ని తగ్గించుకుని, అవసరమైన సమయాలలో

సేవాభావంతో ఆపన్నహస్తం అందించాలి. అపుడే సంతోషంగా వుండగలరు. చాలామంది తమ సంతోషం కోసం అది చేస్తున్నాం, ఇది చేస్తున్నాం అని చెబుతూ వుంటారు. నిస్వార్థంగా చేస్తున్నట్లు పైకి కనబడుతూ, లోపల మాత్రం సంతోషం కోసం వెదుకులాట ప్రారంభిస్తారు. నిజానికి మీరు ఏ పని చేసినా అంకితభావంతో పనిచేస్తే, మీరు కోరుకున్న సంతోషం మీకు లభిస్తుంది. ఇతరుల కోసం పనిచేసేవారు ఎప్పుడూ నిజమైన సంతోషాన్ని పొందలేరు. నిర్విరామంగా పనిచేస్తున్నప్పుడు, మధ్యలో విరామం దొరికితే సంతోషంగా వుంటుంది. కానీ, అది నిజమైన సంతోషం కాదు. మీలోని అసంతృప్తి నుంచి పుట్టింది ఆ సంతోషం. నిజమైన సంతోషం మీరు పనిచేస్తున్నప్పుడు లభించే ఆనందం నుంచి మాత్రమే లభిస్తుంది. అందుకే చేయవలసిన, చేస్తున్న పనిని రూపొందించుకున్న ప్రణాళికను భయాలకు, అనుమానాలకు దూరంగా పెట్టి శ్రద్ధగా అనుసరించాలి, మనస్ఫూర్తిగా చేయాలి. అప్పుడే నిజమైన సంతోషం మీ సొంతం అవుతుంది. లక్ష్యానికి చేరువగా వెళ్ళగలుగుతారు. మీ సంతోషం కోసం ఇతరుల ఆనందాన్ని ముక్కలు చేయకూడదు.

విజయం కోసం చేసే యుద్ధం కన్నా
విలువల కోసం చేసే పోరాటం చాలా గొప్పది

***పూజాసమయం మించిపోతుందని భయంతో అన్నివైపులా పరిగెత్తకు***
***అసలు నీకోసం నిన్ను నీవే మరచిపోయావు***
***నీ పూజకన్నా మరో కార్యం వేచివుందని మరచిపోయి,***
***మూర్ఖంగా మారిపోయావు.***
***ఇప్పుడు తెలుసుకో, నీవు చేయవలసిన పనులు చాలా వున్నాయనీ,***
***మనిషిగా మనుషుల్ని ప్రేమించాలని, మాధవసేవ కన్నా మానవసేవ మిన్నయని***
***ఇప్పుడే తెలుసుకోండి***
***ఇంకా ఇంకా చాలా వ్యవధి వుందని, చాలా పనులు ఎదురుచూస్తున్నాయని,***
***ఇంకా ఇంకా కాలం మిగిలి వుందని తెలుసుకోండి***
***మానవులుగా మీ దౌర్భాగ్యం ఆలస్యాన్ని సహించరు, వ్యవధి లేదనుకుంటారు***
***కాలం కలసి రాలేదనుకుంటారు, తొందరగా ఫలితం ఆశిస్తారు***
***విత్తగానే మొగ్గ రావాలని, రాగానే పరిమళించాలని కోరి, పేచీ పెట్టుకుంటారు***
***అందుకే ఈ కోతి గోచీ పెట్టుకుని గోలను ఆపుటకై ఆప్తుడై***
***సకల జీవనసారమును బోధించుటకై ఏతెంచెను***
***తన చిన్నారి ముద్దుబిడ్డల చెంతకు!***

ॐ

**01-06-2020** 05:45 PM

**62)** లక్ష్యాన్ని చేరుకొనుటకు మేము పాటించవలసినవి ఏవి స్వామీ?

*విజయం ఏ ఒక్కరి సొత్తూ కాదు. విజయాన్ని సాధించాలని కోరుకునేవారు నిరంతరం కృషి చేస్తూనే వుండాలి. విజయసాధనకు అవసరమైన ప్రతిభను పెంపొందించుకుంటూ బలాన్ని పెంచుకోవాలి. బలహీనతలను దూరం చేసుకోవాలి. గెలుపు వైపు నడిపించే ఆయుధాలు ప్రతివ్యక్తిలోనూ వుంటాయి. వాటిని గుర్తించి ఉపయోగించడం నేర్చుకుంటేనే విజయం మీ సొంతం అవుతుంది. చాలామంది ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ వుంటారు. కొంతమంది తమ బలాలను గుర్తించక, తమకంటే ఎవరైనా విజయం సాధించినా, ఎక్కువ ప్రతిభ కనబరచినా అట్టివారి గురించి చులకనగా మాట్లాడుతారు. పైపైచ్చు అదేమంత గొప్ప విషయం కాదనీ, తామైతే ఇంకా ఏదో ఏదో చేసేవారమనీ చెబుతారు. వాస్తవానికి మీరెంత గొప్పవారైనా, ఆ గొప్పతనాన్ని ఇతరులు గుర్తించినప్పుడే రాణింపు అనేది లభిస్తుంది. లేకపోతే, ఏ గుర్తింపూ లేక మరుగున పడిపోతారు. వ్యక్తులను గొప్పస్థాయిలో నిలబెట్టేది చిన్నచిన్న సంఘటనలే. ఆ సమయంలో మీరు ఎలా స్పందించారు, ఏ విధంగా ప్రవర్తించారు అన్నదానిపైనే నలుగురిలో మీ గుర్తింపు ఆధారపడివుంటుంది. ఎవరైనా విజయం సాధిస్తే, మనస్ఫూర్తిగా అభినందించాలి. మీలోని అహంకారాన్ని ప్రక్కనబెట్టి, "బాగా చేశావు, చాలా బావుంది" అని అభినందించాలి. వాళ్ళ సంతోషాన్ని మీతో పంచుకుంటున్నప్పుడు అందులో పాజిటివ్స్‌ను గుర్తించాలి. మీరు కూడా వాటిని అనుసరించటానికి ప్రయత్నించాలి. అన్నీ మీరు చేయలేరు, అన్నింటిలో ఉన్న మంచిచెడ్డలు స్వయంగా మీ అనుభవాల ద్వారా తెలుసుకోలేరు. అందుకే ఇతరుల అనుభవాలు వినాలి, వారిలోని గొప్పదనాన్ని గుర్తించాలి, అభినందించాలి. తద్వారా మీలో సహృదయత పెరుగుతుంది. ఉన్నత వ్యక్తిత్వం అభివృద్ధి చెందుతుంది. అందరిలోనూ మీకు ఒక గుర్తింపు వుంటుంది. అందుకు కావలసింది సహనం. ఆ సహనం ఉన్నప్పుడే మీకు మీలోని విచక్షణాజ్ఞానం పనిచేయడం ప్రారంభమవుతుంది. మీ అవసరానికి అవసరమైన జ్ఞానాన్ని ఎక్కడ దొరుకుతుందో తెలుసుకోవటం, దాన్ని సొంతం చేసుకోవడం తెలివిగలవారు చేసేపని. అట్టివారు ఇతరుల అనుభవాల నుంచి, విజయాల నుంచి పాఠాలు నేర్చుకుంటారు. కాలం కలసిరావాలి, అదృష్టం వుండాలి, పూర్వజన్మ సుకృతం వుండాలి వంటి మాటలతో కాలాన్ని వ్యర్థం చెయ్యరు. ఈర్ష్య, అసూయ, ద్వేషం వంటి వాటిని ప్రక్కనబెట్టి, మనస్ఫూర్తిగా విజయసాధకులను అభినందిస్తారు. వారిలో వున్న గొప్పదనాన్ని గుర్తిస్తారు. అందుకు కావలసింది సహృదయత మాత్రమే. వ్యక్తులను ఉన్నతస్థానంలో నిలిపేది వారు సాధించే విజయాలే అయినా, ఆ విషయం వెనుక వున్న వారి వ్యక్తిత్వమే ప్రధానం. అందుకే విజయం కోసం కృషి చేస్తూనే, వ్యక్తిత్వాన్ని కూడా తీర్చిదిద్దుకోవాలి. అపుడే పరిణతిని సాధించగలరు. అందులో ఒకటి, ఎక్కడ ఎవరిలో గొప్పదనం వున్నా గుర్తించడం, అభినందించడం – దాన్ని మీరు అలవరచుకోవాలి!*

*మేధావులు ఆలోచనల గురించి, తెలివైనవాళ్ళు సంఘటనల గురించి,*
*తెలివితక్కువవాళ్ళు మనుషుల గురించి చర్చిస్తారు!*

***పాపం కృత్వాహి మన్యేత వాహమస్మీతి పూరుషః ।***
***తం తుదేహాః ప్రపశ్యంతి స్వసైవాః తర పూరుషః ॥***

*ఎవడు పాపకార్యములను చేసి కూడా, నేను పాపిని కాను అని తలుస్తాడో, వాడు భ్రమపడినవాడే.*

ఎందుకంటే, అతడు చేస్తున్న పాపాలను దేవతలు, అతని అంతరాత్మ చూస్తూనే ఉన్నారు కదా!

***భక్తితోడ మనసు భగవాన్ పాదాలు పట్టి వీడకున్న పరమసుఖము***
***తీపియన్న అదియే, తేనెకన్నా రుచి. దానిని పొందువారే ధన్యులు!***
***'నేను' దేహమందు దేనితో కలియదు, తానే వేరుగా నుండు***
***కానీ, మనిషి ఒడలు నేనే యనుచు, తొడగొట్టి మాట్లాడు***
***ఇట్టి మాయ నీకు నశ్వరంబు***
***అంతులేకయున్న ఆకాశమును బోలి అంతరంగమందు శాంతియున్న***
***లోకమంతా తానై ఏకత్వమున నుండు***
***బాధకుందు వారినాదుకో చేదుకో***
***నీకు తగ్గరీతి సాకుము***
***దేహమందు నిల్చి, యూహతో నున్నంత వరకూ సేవచేసెడి వరము గనుము***
***జగము నందు మేను శాశ్వతమ్మా? కాదు కాదు!***
***దేవులాడుటింక దేని కొరకు?***
***ధర్మమార్గమందు చరియించి, తృప్తియైన బ్రతుకు సాగించి***
***సాగిలపడి సంతృప్తిని పొంది, సాధనోన్ముఖులై***
***సాక్షిగానున్న ఈ పవనకుమారుని చెంత చేరి***
***ఈ పావనమార్గమును అవలంభించి దరిచేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**02-06-2020** 05:45 PM

**63)** క్రోధాన్ని జయించడమెలా స్వామీ?

*తమను తాము ఈ విధంగా ప్రశ్నించుకునేవారు చాలా అరుదుగా వుంటారు. అసలు ప్రశ్న ఉదయిస్తేనే గదా, సమాధానం వెతికే ప్రయత్నం చేస్తారు. "కోపం వస్తే రానీ, ప్రకటించేద్దాం" అనేవారితో ఈ విషయప్రస్తావన అవసరము. కోపం ఒక మానసిక బలహీనత. ఆ కోపంలో నుండి బయటకు రావడానికి ఆ వ్యక్తి ఇష్టపడకపోవుటయే, కారణం గనుక బయటకు రాడు. కోపం హానికరమైనదని గ్రహించాలి. దానిని గ్రహించకపోవటం, దానిని జయించాలని ఏ మాత్రం కోరుకోకపోవటం. ఒక్కోసారి, నష్టం వాటిల్లినా దాని ద్వారా నష్టం కలిగిందని ఒప్పుకోవటానికి కూడా మీలోని అహం అడ్డు వస్తుంది. మీరు ప్రతి పనినీ లాభనష్టాలు బేరీజు వేసుకుని చేస్తారు కదా! మరి కోపం విషయంలో కూడా ఒకసారి అలా అంచనా వేసుకుంటారా? ముందుగా కోపం వలన మీకు కలిగే లాభాల చిట్టా. 1) మీ మనసులోని వ్యతిరేకత, అక్కసు, ద్వేషం, అసమ్మతి మీరు ప్రకటిస్తారు. 2) మిమ్మల్ని ఎదిరించారు, మిమ్ములను*

కాదన్నారు అనే భావన మిమ్ములను కృంగదీస్తుంది కనుక, మీరు ఆ ఆత్మన్యూనతాభావాన్ని పోగొట్టుకోవడానికి కోపం వెళ్ళగక్కుతారు. *3) ఎదుటివారు మిమ్మల్ని చూసి భయపడితే, మీకు ఏ మూలనో తృప్తి. కాబట్టి, వారిని మీ అదుపులో ఉంచుకోవడానికి నడుమ నడుమ అంటే, టెర్రరిస్టులు బాంబు దాడులు చేసి, వారి ఉనికిని గుర్తు చేస్తున్నట్లుగా కోపగించుకుంటారు. 4) పిల్లలతో, విద్యార్థులతో, క్రింది ఉద్యోగులతో మరీ ప్రేమగా మాట్లాడితే అలుసుగా తీసుకుంటారు కాబట్టి, మీ హోదా నిలబెట్టుకోవడానికి క్రోధం సహకరిస్తుంది. 5) కోపాన్ని మనసులో దాచుకుంటే, అది పెరిగి పెరిగి విస్ఫోటనం జరిగే అవకాశం వుంది కాబట్టి, అప్పుడప్పుడు దానిని వ్యక్తపరిస్తే, మానసిక ఒత్తిడి తగ్గవచ్చు. ఇలా మిమ్మల్ని మీరు సమర్థించుకోవడం ఎంతవరకు సమంజసమో గమనించండి. మొదటిది వ్యతిరేకత ప్రకటించడం. దానికి రెండు మార్గాలున్నాయి. సౌమ్యంగా ప్రకటించడం. "క్షమించండి, మీమాటలతో నేను ఏకీభవించలేను. నా అభిప్రాయం ఏమిటంటే... ". రెండవది, "అసలు మీరు ఏం మాట్లాడుతున్నారు? మీకు అర్థమవుతుందా? బుద్ధి, జ్ఞానం ఏమైనా వుందా? కడుపులోకి అన్నం తింటున్నారా, గడ్డి తింటున్నారా?" వగైరా వగైరా ఇంకా పరుషంగా, పదునుగా వాగ్బాణాలు వస్తాయి. రెండవది, "నన్నే ఎదిరిస్తారా?" అనే ఉక్రోషం. ఇది అహంకి ప్రతీక. కాబట్టి, ఎటువంటి పరిస్థితిలోనూ సమర్థనీయం కాదు. మూడవది ఎదుటివారు మిమ్మల్ని చూసి భయపడాలనుకోవటం శాడిజం కాక మరేమిటి చెప్పండి? ఈ తర్కం సరియైనది కాదంటే, కాదు కదా. నాల్గవది క్రింది వారిపై హోదా ప్రదర్శించటానికి అకారణంగా తీవ్రపదజాలం ప్రయోగించడం చాలా చౌకబారు ఉపాయం అనిపిస్తుంది. కాదంటారా? చివరగా కోపం దాచుకుంటే, మానసిక ఒత్తిడి పెరుగుతుందని అనిపిస్తే, ఎప్పటికప్పుడు సౌమ్యంగా ప్రకటిస్తూ వుండండి. విస్ఫోటనం అనే సమస్యకి పునాది ఏర్పడదు. ఇప్పుడు ఒక ముఖ్యమైన సందేహం ఎవరికైనా కలుగవచ్చు. ఎవరైనా పొరపాటు చేస్తే, వారిని దండించవద్దా? వారు దానిని అలసటగా తీసుకుని ఇంకా ఇంకా నేరాలు చేస్తారు కదా? నిజమే. ముమ్మాటికీ నిజమే. కానీ, కోపం ప్రకటించే మీ విధానం ఎలాంటిదో పరిశీలించుకోండి. కొన్ని గమనించదగ్గ వాటిని పరిశీలించండి. కోపం తుఫానువంటిది. శాంతించిన తర్వాతే ఎంత నష్టం వాటిల్లిందో మీకు అర్థమవుతుంది. ప్రేమ కేవలం మాటల్లోనే కాదు, చేతల్లో చూపించాలి. కోపం కేవలం మాటల్లోనే చూపించాలి, చేతల్లో కాదు. మీపై కోపాన్ని ప్రయోగిస్తే, అది మీకు నచ్చదు కానీ, ఇతరులపై ప్రయోగించడం ఒక పరిష్కారమని మీరు అనుకుంటారు. మనిషికి కోపం వుండవచ్చు గానీ, బంధాన్ని కోల్పోయేటంత కోపం ఉండకూడదు. కోపగించుకోవటం అంటే, మీరు విషం మ్రింగి, అవతలి వ్యక్తి మరణించాలని కోరుకోవటం లాంటిది.*

***గృధ్ర దృష్టిర్బకాలీపః శ్వచేష్ట సింహ విక్రమః ।***
***అనుద్విగ్నః కాకశఙ్కీ భుజంగ చరితం చరేత్ ॥***

*కార్యసాధకుడు విచారముతో కూర్చుండడు. అతడు గ్రద్దకున్న దూరదృష్టిని, కొంగకున్న నిశ్చలతను, కుక్కకున్న సావధానతను, సింహమునకున్న పరాక్రమమును పొందును. కాకి వలే ఆపదల విషయమున శంకించుచుండును. పాము వలె సాధనములను ప్రయోగించుకొనుచుండును (పాము చీమలు పెట్టిన పుట్టను తనకై ఉపయోగించుకొనునట్లు, ఇతడు శత్రువుల సాధనములను తనకై ఉపయోగించుకొనును).*

***జీవితం అంటే అర్థము తెలియక, జీలుగు బెండగ నిలిచే మీకు***
***జీవం పోసి, కదలిక నిచ్చి, జారుతున్న కాలానికి తగ్గ***
***కాయం, మోహం క్రమక్రమంగా మార్పులు చెందుతూ పెరుగుతూ వుంటే,***
***గమ్యం తెలియక కలత చెందు మీకు దారి చూపి నా దరికి నడుపుకొనుచూ***
***తెలివితెచ్చి, ఆ వెలుగును నింపి నడకలు నేర్పి అయినా మరుభూమి వైపుగా***
***పో...దారన్నది ముందునబెట్టి, ముందుకు త్రోసే తెలివి నడిపేటట్లు***
***తెలియక తికమక పడుచుంటిరి, మేరువు మించి మెరిసే దేవుడిగా***
***నా చరణాల కడ పడియుండే ఆ దారి చూపి, నా దారికి నడుపుతూ***
***సత్యాసత్యము నెఱుకపరచిననూ, ఇంకనూ లేదన్నదే ఉందనిపిస్తుంది మీకు***
***కనిపించేదే గట్టిగా పట్టి, నాది అన్నదే జీవితమైతే, నమ్మి నడచుటే శ్రేయస్సు.***
***అట్టి శ్రేయస్సు నా బిడ్డలకిచ్చి***
***శుద్ధమైన నా దివ్యచరణములు దారిచూపి, నా దరికి నడుపుకొనుచూ అఖండ తేజో విరాజమానమై***
***ప్రకాశించుచున్న ఈ అంజనీతనయుని ఆశీస్సులొంది, మీ వందనములు అందించి దరిచేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఆగ్రహమనేది వివేక శూన్యతతో ప్రారంభమై, పశ్చాత్తాపంతో ముగుస్తుంది

ॐ

**03-06-2020** 05:45 PM

**64) తృప్తికరమైన జీవితాన్ని ఎలా అనుభవించవచ్చు స్వామీ?**

తృప్తి వుంటేనే గెలుపు. ఒక వేటగాడు అవసరానికి తన గుర్రాన్ని అమ్మడానికి సంతకు వెళ్ళాడు. గుర్రానికి సరియైన బేరం కుదరక, గుర్రాన్నిచ్చి ఆవును మారకం వేశాడు. మరొకరి సలహా తీసుకుని ఆవునిచ్చి గాడిదకు మారకం వేశాడు. గాడిదనిచ్చి బూట్లు తీసుకున్నాడు. చివరకు బూట్లిచ్చి ఒక టోపీ తీసుకున్నాడు. ఆ టోపీతో ఇంటికి వస్తూ దారిలో వంతెన మీద నడుస్తుంటే, రాయి తగిలి బోర్లాపడ్డాడు. టోపీ కాస్తా నదిలో పడింది. ఎంతో దిగులుగా అటే చూస్తూ కూర్చున్నాడు. అదే దారిలో వచ్చే ఇద్దరు బాటసారులు విషయం అడిగి తెలుసుకున్నారు. "అయ్యో పాపం!" అని బాధపడ్డారు. "నీకివాళ ఉపవాసమే" అన్నాడొకడు. "పెళ్ళాంతో బడితపూజ తప్పదు" అన్నాడింకొకడు. "నా పెళ్ళాం అలాంటిది కాదు. ఏమీ అవదు" అని వేటగాడు బాటసారులతో పందెం కట్టాడు. బాటసారులిరువురూ వేటగాడింటికి వెళ్ళారు. వేటగాడు గుమ్మంలో నుంచి భార్యను పిలిచాడు. వాడి పెళ్ళాం ఎదురుగా వచ్చి, "మావా! వచ్చినావా!" అంది ఆప్యాయంగా. వేటగాడు జరిగింది భార్యతో చెప్పడం మొదలుపెట్టాడు.

వేటగాడు: గుర్రం ధరకు పలుకకపోతే, ఆవుకి మారకం వేశా అన్నాడు

భార్య: మంచిపని చేశావు మావా! పాలు త్రాగవచ్చు

*వేటగాడు:* *ఆవుని కూడా గాడిదకు మారకం వేశా.*

*భార్య:* *కట్టెలు అడవి నుండి మోసుకు వస్తుందిలే అంది తృప్తిగా*

*వేటగాడు:* *గాడిదను అమ్మేసి చెప్పులు తీసుకొన్నా*

*భార్య:* *అడవుల్లో రాళ్ళురప్పలు తగలకుండా వుంటుందిలే మావా!*

*వేటగాడు:* *అవి కూడా వుంచుకోలేక టోపీకి మారకం వేశా*

*భార్య:* *సరేలే మావా! ఆ టోపీలో అందంగా వుంటావు*

*వేటగాడు:* *కానీ, వస్తావుంటే, నేను వంతెన మీద పడితే, టోపీ నదిలో పడ్డది జారి అన్నాడు*

*భార్య:* *పోతే పోయిందిలే మావా! నీవు పడిపోకుండా వున్నావు. అంతా అడవితల్లి దయ అని తృప్తిగా ముద్దుపెట్టుకుంది. గుర్రాన్ని నష్టపోయి వచ్చినందుకు భర్తను విమర్శించకుండా, ఎత్తిపొడుపు మాటలు అనకుండా భర్త క్షేమంగా ఇంటికి వచ్చినందుకు అడవి తల్లికి కృతజ్ఞతలు తెలుపుకుంది. ఎగతాళి చేద్దామనుకున్న బాటసారులు ఆ వేటగాడి భార్య మంచి మనసుకు సిగ్గుతో తలదించుకుని వెళ్ళిపోయారు. మానవుని యొక్క అన్ని బంధాలు వ్యాపార సంబంధాలుగా పరిణమిస్తున్న ఈ రోజులలో ఇలాంటి సంభాషణ వినగలరా? కరుగుతున్న క్షణానికి, జరుగుతున్న కాలానికి, అంతరించే వయసుకి, చివరకు మరపురాని జ్ఞాపకాలుగా మిగిలేవి జీవితంలో జరిగే కొన్ని మంచి సందర్భాలే. అందుకే ఏ ఒక్కరినీ తొందరపడి ఏమీ అనకండి. కన్ను చెదిరితే గురి మాత్రమే తప్పుతుంది. మనస్సు చెదిరితే జీవితమే దారి తప్పుతుంది. ఎగతాళి చేసేవారికి కాలమే సమాధానం చెబుతుంది.*

*భగవత్ కథనమైన సత్సంగాన్ని కర్షక వృత్తితో పోల్చవచ్చు.*
*క్షేత్రంలోని కలుపును తీసి, విత్తులు నాటి, నీరు పోసి, ఎరువు వేసి,*
*కంచెనేర్పరుస్తాడు కర్షకుడు.*
*అయితే, భగవత్ కథాసుధను అందించే వ్యక్తి, లేక సద్గురువు*
*నామమనే విత్తులను నాటగలడు.*
*కానీ, సజ్జన సాంగత్యమనే ఎరువు వేయడం, సాధన అనే కంచెనేర్పర్చడం,*
*దుర్భావములనే కలుపు తీయడం మాత్రం భక్తుడు స్వయంగా చేసుకొనవలసినవే.*
*ఎన్ని సత్సంగాలు విన్నప్పటికీ,*
*ఆశించిన పరివర్తన, ఫలసాయం అందినట్లు కనిపించకపోవటానికి కారణాలు*
*వ్యక్తిగత స్థాయిలో భక్తులు సాధనల విషయంలో తడబడటమే అని అర్థం చేసుకోవాలి.*
*ఈ తడబాటు సరిదిద్దబడితే, భక్తిప్రయాణం పరమానందభరితంగా వుంటుంది!*

**ఉపకారోపి నీచానా మపకారో హి జాయతే ।**
**పయః పానం భుజఙ్గానాం కేవలం విషవర్ధనమ్ ॥**

నీచులకు ఉపకారము చేసిన, తిరిగి వారు అపకారమునే చేయుదురు.
పాములకు పాలుపోసినా, అది విషమునే వృద్ధి పొందించును.

***కాలం క్షణాల కూర్పు, కాలం క్షణాల మార్పు***
***అవి కదిలిపోతుంది, జ్ఞాపకాల్ని వదిలిపోతుంది.***
***ఏది వద్దనుకుంటారో, అదే కావాలనిపిస్తుంది***
***మనసు చేసే గారడి, మనిషిని మైమరిపిస్తుంది***
***సాధనలన్నీ మనశ్శోధనకైతే, బాధలన్నీ దూదిపింజల్లా ఎగిరిపోతాయి ఎటో***
***ఎన్నాళ్ళున్నా, ఏదో ఒకరోజు వెళ్ళిపోవలసిందే***
***కథగా మిగిలేదెవరో, కలగా ముగిసేదెవరో***
***జననమరణ బంధము విడిపించేది గురువు***
***అట్టి గురువు పరమాత్మ చరణములను అందించే ప్రభువు***
***అహంబ్రహ్మ, అయమాత్మాబ్రహ్మ అని తెలిపినవాడే సద్గురువు***
***అట్టి సద్గురువును ఆశ్రయించి, అణుమాత్ర సాధన సల్పి,***
***అండయిచ్చిన ఈ ఆంజనేయుని చేరి, అఖండమైన జ్ఞాననిధులు కండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**04-06-2020** 05:45 PM

**65)** భక్తునికి ఉండవలసిన లక్షణాలు ఏమిటి స్వామీ?

*సాధారణంగా ఆధ్యాత్మిక జీవిత పరమార్థాన్ని గ్రహించిన ఆస్తికులం మేము. పూజలు, వ్రతాలు, భజనలు, ధ్యానం మొదలైన ఆధ్యాత్మిక సాధనలు ఎంతో భక్తిశ్రద్ధలతో చేస్తూవుంటాం. ఆ సాధనలు నిరంతరాయంగా చేయగలిగితే, "ఎంత చక్కని సాధన చేస్తున్నాం. భక్తులుగా మా విద్యుక్త ధర్మాన్ని ఎంత బాగా నిర్వహిస్తున్నాం" అని పొంగిపోతారు. "ఇతరుల కన్నా మేము దైవానికి ఎంత సన్నిహితులుగా మెలుగుతున్నాం" అని మరికాస్త ఆనందపడతారు. తిరునామమో విభూతిరేఖలో ధరించి, తులసి మాలతోనో రుద్రాక్ష మాలతోనో జపాలు చేస్తుంటారు. "భక్తులు అంతకన్నా ఏం చేయాలి" అనుకుంటారు. "దైవానుగ్రహం పొందటానికి ఈ సాధనలు చాలవా?" అని భావిస్తారు. అప్పుడప్పుడు దానధర్మాలు చేస్తారు. "ఎంత నిస్వార్థంగా సేవచేస్తున్నాం!" అని గర్వపడతారు. ఇవి భక్తికి లక్షణాలని భావిస్తారు. అయితే, భక్తి అంటే ఈ సాధనలు మాత్రమే కాదని, దైవాన్ని ప్రేమించే మనస్సు, క్షణమైనా తనని మరువని తలపు, అహరహమూ నాలుకపై నాట్యమాడే వారి దివ్యనామము, కనులు మూస్తే చాలు కనిపించే వారి దివ్యమంగళ స్వరూపము తన భక్తుడికి ఉండాలని దైవం ఆశిస్తాడని మీరు ఆలోచించరు. కానీ, దైవానుగ్రహాన్ని పొందటానికి భక్తునికి అవసరమైన లక్షణాలు ఇవేనని చెబుతున్నాను. నిత్యసత్యమైన*

*భగవంతుడ్ని ఒక్కడ్ని మాత్రమే మీరు ప్రేమించండి. వారి అవతార కథలను వర్ణించే కథలే మీకు ఇష్టం కావాలి. మృదుమధురంగా వినిపించే హరినామమొక్కటే మీకు ప్రీతి కావాలి. ఏ ఇతర ఆలోచనలు లేకుండా మీ మనసులో కేవలం భగవంతుని దివ్య రూపనామాలు మాత్రమే ఉంటాయని, ఆ నామమే మృదుమధురమైనదని, ఆ గానమే మీకు ప్రీతికరమని, ఎవరేమనుకున్నా భగవంతుని మాత్రమే మేము ప్రేమిస్తాం అని అచంచల భక్తివిశ్వాసాలని, ధృఢమైన మనస్సుతో, అంకితభావంతో చెప్పగలగాలి. ఈ మనస్సనేది ఎంత విచిత్రమైనదంటే, "దమ్ముంటే నన్ను పట్టుకోగలవా?" అని ఛాలెంజ్ చేస్తుంది. ఎంతటి వారికైనా కూడా నూటికొక్కరో, కోటికొక్కరో కాటికి చేరే వరకూ కూడా ఆ మనసును జయించినవాడు లేడంటే అతిశయోక్తి కాదు. మరి మీలాంటి సామాన్య మానవులకు ఈ మనస్సు లొంగటం అంత సామాన్యమైనది కాదు. దీనిని పట్టుకుందామని మీరు ఎంత తెలివిగా ప్రయత్నించినా, అంతకన్నా ఎక్కువ తెలివిగా అది మీ పట్టునుండి జారిపోతుంది. అది జారిపోయిన విషయం కూడా తెలియనివ్వకుండా జారిపోతుంది. కొంతసేపటికి మీరే దాని వెంటబడి పరిగెత్తి తర్వాత "అయ్యో! నేను దానితో పోతున్నానేమిటి?" అనే స్పృహ వచ్చి ఆలోచిస్తే, అది అప్పటికే ఏ స్వర్గానికో, నరకానికో వెళ్ళి విహరిస్తూ, మిమ్ములను వెక్కిరించి, ఉడికించి, పిడికిలి బిగించేలా చేస్తుంది. అంతకన్నా మీరు ఏమి చేయగలరు? "చేపపిల్లలా జారిపోయే" అనే దానికంటే, "పాదరసం" అనటం సబబు. అరే! కుదురుగా కూర్చుని ధ్యానం చేద్దామనుకుంటే, అప్పుడే ఎక్కడలేనన్ని విచిత్రమైన ఎప్పటివో, ఏనాటివో సంఘటనలు మీ ముందుకు వచ్చి మీరు ఆనాటి సంఘటనలతో జీవించేలా చేస్తుంది. అరే, ఇదేమిటీ అనుకుని మళ్ళీ ధ్యానంపై నిలిపితే, ఒక్క సెకను... అంతే! మళ్ళీ ఎక్కడికో వింత వింత ఆలోచనలలోకి తీసుకువెళ్తుంది. అయ్యో! దీనిని ఎలా అదుపులో పెట్టగలమురా భగవంతుడా! అని విచారించితే, ముందుగా నేను చెప్పినట్లు భగవంతుని దివ్యమంగళరూపాన్ని మదిలో నిలుపుకుని, దివ్యనామస్మరణ మరువకుండా నాలుకపై నాట్యమాడిస్తూ, సదా భగవంతుని సేవలో తరించండి.*

***న్యాయోపేతా గుణోపేతాః సర్వలోక హితైషిణీః ।***
***సంతః స్వర్గజితః సన్నివిష్టాశ్చ సత్పథే ॥***

*న్యాయపరాయణులు, సద్గుణ సంపన్నులు, సర్వజన హితైషులు, అహింసాపరులు,*
*సన్మార్గంలో నడిచేవారు అయిన సజ్జనులు స్వర్గాన్ని జయిస్తారు.*

***పురాణేతిహాసాలతో ఆపాదమస్తకం మనసును మృదులం చేసుకున్నది మనిషే***
***జ్ఞానసముపార్జనతో అహర్నిశం శ్రమిస్తూ వజ్రదేహియై సృష్టికి ప్రతిసృష్టి చేసేది మనిషే***
***తానేంటో తెలుసుకోవాలనుకునే కాంక్ష ఒకరిది***
***తానేంటో జగతికి చూపించాలనుకునే తపన ఒకరిది***
***మనిషే ఆధ్యాత్మిక బాటలో మోక్షగామి***
***శ్రామికబాటలో ఒళ్ళంతా పనిముట్లు వున్న మరమనిషి***
***మనిషే నామాన్ని నింపుకున్న నాదధరుడు***

***ధర్మాన్ని నింపుకున్న ధరాతలుడు***
***సర్వమూ తానేనని తెలుసుకోనలేని సాధారణ మానవుడు***
***అందుకే సాక్షాత్తు ఈ ఆంజనేయుడు సావధానంగా సామీప్యముగా వచ్చి,***
***మీ బంగారు భవితకు బాట చూపి, జ్ఞానదీపము వెలిగించి***
***అజ్ఞానతిమిరమును తరిమిగొట్టు ఈ ఆంజనేయుని ప్రేమకు పాత్రులైన***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

*ఇదే ఆఖరిరోజు అన్న భావంతో జీవించగలిగితే,*
*ఎల్లప్పుడూ జీవించి వుండగలుగుతారు*

ॐ

**05-06-2020** 05:45 PM

**66)** **మనిషి పాపమెందుకు చేస్తాడు స్వామీ?**

*ఇష్టం లేకపోయినా, మనుషులు బలాత్కారం చేయించినట్లు, పాపం చేస్తారెందుకు? పాపాచరణకు కారణం బాహ్యమా? అంతరంగికమా? అని మీరు ప్రశ్నించుకుంటే, రజోగుణ కార్యమైన కామం, అది విఫలమైనప్పుడు జనించే క్రోధం, పాపాచరణకు ముఖ్య హేతువులు. దానం చేయడం, మంచి చేసికూడా మౌనంగా ఉండటం వంటివి ఎవరో చెబితే ఆచరించేవి కావు. తమ పనుల్ని సైతం పరహితం కోసం త్యాగం చేసే ప్రవృత్తి గలవారు, పరహింస, పరధన కాంక్ష, స్త్రీవాంఛ, అసత్యం వంటి దుర్గుణాల్ని తమ స్వచ్ఛమైన తమ ప్రవర్తనతో దరిచేరనివ్వరు. మనోవాక్కాయాలనే త్రికరణాలతో పుణ్యానికి ప్రతీకగా నిలుస్తారు. సాధకుడు తనకు కల్గిన అరిషడ్వర్గాల ఆటంకాల్ని మనోనిబ్బరంతో ఎదుర్కోవాలి. అడుగడుగునా ఎదురై బాధించే కష్టాలతో భయపడి, వెనుదిరిగి పరిగెత్తరాదు. భగవంతుని జగద్రక్షకునిగా భావించి ధ్యానిస్తే, పాపరహితుడై పరమేశ్వర సాన్నిధ్యం చేరుకోగలడు. కీర్తి అంటే యశస్సు, కండూతి అంటే దురద. ఈ కీర్తికండూతితో కొట్టుమిట్టాడే వాళ్ళు నానాపాట్లూ పడుతుంటారు. ప్రచారం ప్రధానోద్దేశంగా దానధర్మాలు చేస్తుంటారు. మీకు ఇలాంటివాళ్ళు నిత్యజీవితంలో ఎందరో తారసపడుతుంటారు. వీళ్ళు ధనమిచ్చి బిరుదులు, గౌరవాలు, కొనుక్కుంటూ వుంటారు. సన్మానాలు, సత్కారాలు చేయించుకుంటూ వుంటారు. తమది ఘనతగా భావించడం కూడా ఒక రకంగా పాపహేతువే. అనంతమైన విజ్ఞానసాగరాన్ని ఔపోశన పట్టగలమనీ, పట్టామని భావించడం కన్నా మూర్ఖత్వం మరొకటి వుండదు. భగవద్దత్తంగా లభించిన స్వల్ప విజ్ఞానాన్ని అధికంగా భావించి, అహంకరించడం మహాపాపం. లభించిన కొద్దిపాటి జ్ఞానాన్ని పదిమందికీ పంచి, విజ్ఞానతేజాన్ని వర్ధిల్లజేయాలి. ఒకరి మీద వచ్చిన కోపాన్ని గానీ, ద్వేషాన్ని గానీ బహిర్గతం చేయడం ఎంతో తేలిక. అది ఒక రకంగా పాపహేతువే. దాన్ని బయటపెట్టకుండా, ఒక మాటైనా పరుషంగా మాట్లాడకుండా ఓర్పు వహించడం మహనీయతత్త్వం అనిపించుకుంటుంది.*

**67) గృహస్థాశ్రమ జీవనం ప్రశాంతంగా ఉండాలంటే, ఏమి చేయాలి స్వామీ?**

*గృహం ఆదర్శంగా వుండలంటే, గృహస్థులు నీతిమంతులు కావాలి. గృహంలో ధార్మికపరమైన జ్ఞానచర్చలు జరుగుతూ వుంటే, పిల్లలు పాపమార్గంలోకి వెళ్లరు. స్వర్గ–నరకాలనేవి ఎక్కడో దూరతీరాల్లో లేవు. అవి పుణ్య–పాప జనితాలే. అవి మీలో, మీ గృహంలో, పరిసరాల్లోనే ఉంటాయి. మాటలో మర్యాద కన్పించాలి. అది ఇతరుల్ని ఆకర్షిస్తుంది. తద్వారా సమాజంలో గౌరవం లభిస్తుంది. అప్పుడే మీ సంస్కారమేమిటో ఎదుటివారికి బోధపడుతుంది. అమర్యాదలో అహంకారమనే పాపం ఇమిడి వుంటుంది. సభ్యసమాజంలో అది పాపహేతువవుతుంది. సృష్టిలోని అన్ని ప్రాణులపట్ల ప్రేమ, కరుణ కలిగి వుండి, సమదృష్టితో చూస్తూ, వారిని సేవిస్తేనే పరమపదం చేరే మార్గం సుగమం అవుతుంది. అందుకు భిన్నంగా నడిస్తే పాపాత్ములు. మీకు తెలిసో తెలియకో దైవానికి ఇష్టం లేని కార్యాలు, పాపాలు చేస్తూనే వుంటారు. మీకు నచ్చని పనిచేసిన వ్యక్తిపై మీరు తిరస్కారభావం పెంచుకున్న రీతిలో, దైవానికి ప్రీతిపాత్రం కానిపని చేసినప్పుడు మీపై కూడా దైవం ద్వేషం పెంచుకోవాలి. తాను సృష్టించిన ఏ ప్రాణిపైన కూడా దైవానికి ద్వేషం వుండదు. మనిషి సప్తవ్యసనాలకు దూరంగా వుండాలి. తన–పర భేదభావాలు లేక, రాగద్వేషాలను తెలుసుకొని ప్రవర్తించాలి. సుఖాలు కావాలనుకునేవారు సుఖాలను త్యజించాలి. మానవుడు తన సుదీర్ఘ జీవనయాత్రను ఏమాత్రం అలసట, అవినీతి లేకుండా చేసుకోవాలి. అలా సాగిస్తే, పాపరహితుడవుతాడు. శ్రద్ధ, నిర్మలమైన మనస్సు, చిత్తశుద్ధి, ఇంద్రియనిగ్రహం కల్గినవారు తామున్నచోటునే ఈశ్వరోపాసనకు అనుకూలంగా చేసుకోగలరు. సుఖమయ జీవనం కోసం ఏ మనిషైనా పంచజ్ఞానేంద్రియాలను వశపరచుకోవాలి. అలా ముందుగా తనను తాను సంస్కరించుకొని, పదిమందినీ ముందుకు తీసుకొనివెళ్ళడానికి పాపరహిత ఆలోచనలతో ఆధ్యాత్మిక చింతనతో "అపద్వైదీభావ సమాశ్రయాలు" అనే వాటి గురించి బాగా తెలుసుకోవాలి. మీరు అంతర్గతంగా ఉన్న దైవాన్ని గుర్తించలేక, ఎక్కడెక్కడో అతని కోసం వెతుక్కుంటూ వృధాగా కాలక్షేపం చేస్తూ చివరకు ఏమీ సాధించకుండానే జీవితాన్ని ముగిస్తుంటారు. అంతరాత్మగా వున్న అంతర్యామిని ముందుగా గ్రహించండి. అంతరాత్మ అగుపించాలంటే, ఈ ఆంజనేయుడు చెబుతున్న అంతర్భావాన్ని గ్రహించి అగుపించేదంతా బ్రహ్మమయంగా ప్రేమభావంతో ఒకరినొకరు గౌరవించుకుంటూ, మీ ఎదుట కూర్చున్న నాకు గౌరవాన్ని ఇచ్చి మీరు పుచ్చుకుంటూ భగవత్ ప్రేమకు పాత్రులుకండి.*

*ప్రశ్న ఏదైనాసరే, ప్రేమతో బదులిస్తే,<br>మీరు గడిపే ప్రతిరోజూ ఇంకొంచెం ఆనందంగా అందంగా వుంటుంది.*

**అవలిప్తేషు మూర్ఖేషు, రౌద్ర సాహసికేషు చ ।<br>తథైవాపేత ధర్మేషు న మైత్రీమాచరేత్ బుధః ॥**

అభిమానులు, మూర్ఖులు, రౌద్రస్వభావులు, సాహసికులు, ధర్మభ్రష్టులు<br>వీరితో పండితుడైనవాడు స్నేహం చేయరాదు.

***ఎవ్వాని చూడ్కులు వెన్నెలలు కురిపించు***
***ఎవ్వాని మహిమలు అచ్చెరువు కల్గించు***
***ఎవ్వాని వదనము శృంగారముగా నుండు***
***ఎవ్వాని నామంబు కష్టముల బోద్రోచు***
***ఎవ్వాని దర్శనమున మేను పులకించు***
***ఎవ్వాని కరుణచే నిత్యజీవనము సాగు***
***అవ్వాని కీర్తింతురు ఆంజనేయునిన్***
***ఎవ్వండు హవరూపి హవరూపియై వెలుగు***
***నెవ్వండు హవభోక్త హవరక్షకుడై వెలుగు***
***నెవ్వండు హృదయేశు ఓ విశ్వభవన ప్రభాస్వు డెవ్వండు***
***హృదయేసు సకల జీవజనుల సౌఖ్యప్రదాత***
***ఎవ్వాని పాదాంఘ్రి సదసద్వివేక చతురతగల్గు***
***అవ్వాని దివ్య పదాంబుజాల జనులెల్ల***
***ప్రణతులిడు అవ్వానినే ముక్తి నర్థింతు***
***దైవమగు ఈ ఆంజనేయుని అని మదిన్ తల్పరే***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**06-06-2020** 05:45 PM

**68) దృష్టిని బట్టి సృష్టి అంటారు కదా స్వామీ?**

సర్వేంద్రియాణాం నయనం ప్రధానం. కన్ను లేకపోతే లోకమే లేదు. అందుకే సకలజీవులకు సృష్టికర్త కళ్ళను ప్రసాదించాడు. కానీ, మనుషులకు కళ్ళున్నా కొంతమందికి అహంభావంతో కళ్ళు కనిపించవు. అలాంటివారికి కళ్ళు నెత్తికెక్కాయంటారు. కామాంధుల కళ్ళకు వావీవరసలు కన్పించవు. ఏ గడ్డి కరిచైనా, పదిరాళ్ళు కూడబెట్టినవాడికి ఎదుటివాడు కన్పించడు. కన్పించినా, చాలా అల్పుడిగా అగుపిస్తాడు. మనుషులందరూ కళ్ళతోనే చూసినా, ఒకే వస్తువు, ఒకే దృశ్యం అందరికీ తలో విధంగానూ గోచరించవచ్చును. అందుకు కారణం వారివారి దృక్కోణం అంటే, ఆ మనిషి ఆ దృశ్యాన్ని ఏ మానసిక భావనతో, దృక్కోణముతో చూస్తాడో, దాన్నిబట్టి అర్థం చేసుకుంటాడు. ఒక చెట్టుమీద పక్షిజంట సరస సల్లాపాలతో కేరింతలు కొడ్తున్నాయి. బోయవాడు ఆ జంటను చూచి, ఆనందించాల్సిందిపోయి, గురిచూసి పోతుపిట్టపై బాణాన్ని సంధించాడు. వెంటనే అది నేలకూలింది. ఆ దృశ్యాన్ని చూచిన వాల్మీకి హృదయం ద్రవించిపోయింది. ఆ వేదనలోనే,

మానిషాద ప్రతిష్ఠాం త్వ మగమః శాశ్వతీః స్సమాః ।
యత్క్రౌంచ మిథునాదేకమ్ అవధీః కామమోహితమ్ ॥

అనే శోకరసభరిత శ్లోకమే, అప్రయత్నంగా ఆయన నోటివెంట వెలువడింది.

**69) ధనగర్వము సాధకునకు ఏ విధముగా ప్రతిబంధకము స్వామీ?**

ఒక సంపన్నుడు జ్ఞానార్జన చేయాలనే సంకల్పంతో ఒక పండితుని దగ్గరకు వెళ్ళాడు. ఆ పండితుడు అతని జ్ఞానతృష్ణకు సంతసించి, ఆదరించాడు. ఉపదేశించడం కన్నా ప్రయోగపూర్వకంగా తెలియచెప్పాలని తలంచాడు. "ఈ గాజు కిటికీలోంచి బయటకు చూస్తే, నీకు ఏం కనబడుతోంది?" అంటూ ప్రశ్నించాడు పండితుడు. "స్వామీ! మనుషులు, జంతువులు, వాహనాలు ఇలా ఎన్నెన్నో కనిపిస్తున్నాయి" అన్నాడు ఆ సంపన్నుడు. అక్కడ్నుంచి ఒక గదిలోకి తీసుకెళ్ళాడు. గోడకు బిగించిన అద్దమునకెదురుగా నిలబడి చూసి కనబడుతుందేమో చెప్పమన్నాడు. "స్వామీ! అద్దంలో నాకు నేనే కన్పిస్తున్నాను వేరే ఏదీ కన్పించుటలేదు" అన్నాడు ఆ ధనికుడు. "చూశావా! అక్కడ కిటికీకి గాజుపలకే వుంది, ఇక్కడ అద్దానికీ గాజుపలకే వుంది. కానీ, అక్కడ ఎన్నో కన్పడ్డాయి, ఇక్కడ నీకు నువ్వే కనబడుతున్నావు. కారణం చెప్పగలవా?" అని ప్రశ్నించాడు. ఆ సంపన్నుడు అర్థం కాక పిచ్చిమొహం, బిక్కమొహం వేశాడు. "అద్దానికున్న గాజుపలకకు వెండిపూత పూయబడింది. వెండిపూత ఎప్పుడైతే చేరిందో, అప్పుడే నీవు నిన్ను తప్ప ఇంకెవరినీ చూడలేకపోతున్నావు. అవునా?" "చిత్తం! అంతే స్వామి!" అన్నాడు నమ్రతతో. "నీకు, ఇతరులకు ఆ వెండిపూత అడ్డుగోడలా నిలిచింది. అలాగే, సంపద చేరేసరికి ఆ కలిమి ఇతరులను చూడనీయదు. అంతమాత్రాన, ధనం మీకవసరం లేదని చెప్పను. మీ అవసరాలను తీర్చగల సాధనం అదే. అయితే, ధనమే సర్వకార్యసాధనం అని మీరు భ్రమపడుతున్నారు. ఆ భ్రమలోనే కోర్కెలన్నీ తీర్చుకోవాలనే స్వార్థబుద్ధితో ఆ ధనసంపాదన కోసమే మనిషి తాపత్రయపడిపోతున్నాడు. అనేక అకృత్యాలకు కూడా పాల్పడుతున్నాడు. ఆ సమయంలో సాటి మనుషుల అవసరాలను గుర్తించలేనంత గుడ్డివాడైపోతున్నాడు. అందుకనే, ధనాన్ని మీ కనీస అవసరాలను తీర్చే సాధనంగానే పరిగణించాలి. ఆ దృక్కోణంలో చూస్తే ఇతరుల అవసరాలకు, సేవలకు కూడా దానిని వినియోగించే అవకాశం లభిస్తుంది. అప్పుడు మనిషి అవినీతి పంథాలో పయనించి అప్రతిష్ఠపాలయ్యే అవసరమే కలుగదు. అలా జరిగిననాడు మీలో ఉన్న అసమానతలు తొలగిపోతాయి. తద్వారా దైవం సృష్టించిన మనిషి కన్నా, మనిషి సృష్టించిన ధనం విలువ ఎక్కువనే అపప్రథ తొలగిపోతుంది" అని బోధించాడు పండితుడు. ఈ ఆంజనేయుని మదిలో అదే భావముంది. మరి మీరూ ఆలోచించండి, ఈ సత్యాన్ని కాదంటారా?

***ఈ జన్మలో వ్యర్థంగా ఎంతోదూరం నడిచారు***
***ఎండమావుల వెంట పరిగెత్తారు***
***మబ్బులు కమ్మిన ఆకాశంలా***
***నాచు కమ్మిన నీటి చెలమలాగా***
***అనుక్షణం ఓ మాయలో పడి,***
***ఆ మాయే జీవితమనుకుంటూ,***
***చాలాదూరం నడిచారు***

***కానీ, స్వామీ!***
***నాకు  నాకు మోక్షం కావాలి అని అడగరా?***
***ఎందుకంటే,***
***పసితనం నుంచి తెలియని అజ్ఞానంలో జీవించాను***
***పరమాత్మ సేవను మరిచాను***
***ప్రేమతో జీవించటం చేతకాలేదు***
***ఇప్పుడే, ఇప్పుడే ఇప్పుడే***
***మీ సేవకుడిగా మీ కనుసన్నలలో మెలగాలని***
***తనివితీరా మిమ్మల్ని సేవించుకోవాలని***
***నరనరాన మీ నామం ప్రతిధ్వనించాలని***
***నా చెవులకు అనుక్షణమూ మీ స్వరమే వినిపించాలని***
***మీ దర్శనంతో నా కనులు తటాకాలై***
***ఆనందభాష్పాలు ఉప్పొంగాలనీ***
***నా శిరస్సు సదా మీ పాదాలను స్పృశించాలని***
***మీ పాదపద్మాల సాక్షిగా ఇదే నా ఏకైక కోరిక అని***
***మీరు ఎప్పుడు కోరుకుంటారా అని ఎదురుచూస్తున్న***
***ఈ ఆంజనేయుని కోర్కె తీర్చండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

పుస్తకంలో ఒక పేజీని పదేపదే చదువుతుంటే, ఎప్పటికీ చివరి పేజీ పూర్తిచేయలేరు.
జీవితం కూడా అంతే!
నిన్నటి చేదు జ్ఞాపకాలను తలచుకుంటూ కూర్చుంటే,
అందమైన ఈ రోజును ఆస్వాదించలేరు, ముందుకు సాగలేరు.

ॐ

**07-06-2020** 06:00 PM

**70)** **భగవంతుడ్ని ఏ విధంగా పిలవాలి స్వామీ?**

ఒక రాజు సైన్యాలు యుద్ధంలో శత్రురాజు సైన్యాన్ని తరుముకుంటూపోయి, ఒక అడవిలో ప్రవేశించాయి. శత్రుసైన్యాన్ని వెన్నంటి తరమడంలో సైనికులు నలుమూలలా చెదిరిపోయారు. ఒకడు తోటి సైనికులను కనుక్కునే ప్రయత్నంలో వుండగా, ఒక అంధుడు కన్పించాడు. సైనికుడు "ఓరి గ్రుడ్డివాడా! ఇటువైపు సైన్యము వచ్చిందేమో తెలుసునా?" అన్నాడు. అంధుడు తెలియదన్నాడు. కొంతసేపటికి సైన్యాధిపతి అక్కడికి వచ్చి, "అయ్యా సూరదాసూ! ఇటువైపు సైన్యము వచ్చిందేమో

*తెలుసునా?" అని అడిగాడు. అంధుడు తెలియదని చెప్పాడు. మరికొంతసేపటికి మంత్రి అటువైపు వచ్చి, "సోదరా! మా సైన్యం ఇటువైపు వచ్చెనా?" అని ప్రశ్నించాడు. అంధుడు తెలియదన్నాడు. తర్వాత మహారాజే అక్కడికి వచ్చి, "నాయనా బిడ్డా! మా సైన్యం ఇటువైపు వచ్చిందా?" అని అడిగాడు. అంధుడు "మహాప్రభూ! సైన్యం ఎటుపోయిందో తెలియదు గానీ, కొద్దిసేపటి క్రిందట ఒక సైనికుడు, సైన్యాధిపతి, మంత్రి ఒకరి తర్వాత ఒకరు ఇక్కడకు వచ్చి వెళ్ళారు" అన్నాడు. మహారాజు ఆశ్చర్యపడి, "నాయనా! నీవు అంధుడవు. మరి నేను రాజునని, ఇంతకు ముందు వచ్చినవారిలో ఒకరు సైనికుడని, ఇంకొకరు సైన్యాధిపతి అని, మరొకరు మంత్రి అని ఎలా తెలుసుకోగలిగావు?" అని ప్రశ్నించాడు. అప్పుడా అంధుడు, "మహాప్రభూ! మీరు నలుగురూ నన్ను పలుకరించిన తీరునుబట్టి మీమీ యోగ్యతలను తెలుసుకోగలిగాను. మొదటివాడు సంస్కారహీనుడు, అధముడు కావున 'ఓరి గ్రుడ్డివాడా' అని నన్ను సంబోధించాడు. అందుచేత అతను సామాన్యమైన సైనికుడని గ్రహించాను. రెండవవ్యక్తి నన్ను 'సూరదాసూ' అని పిలిచారు. సంస్కారంలో అతడూ సామాన్యుడే అయినా, ఉన్నత పదవిలో ఉండవచ్చునీ, సైన్యాధిపతి అయివుంటాడని ఊహించాను. మూడవవ్యక్తి సంస్కారములో మధ్యముడు కనుక, 'సోదరా' అని నన్ను సంబోధించాడు. అందుచేత అతడు మంత్రి అయివుంటాడని భావించాను. నాల్గవవారు మీరు నన్ను 'బిడ్డా' అని పిలిచారు. కనుక ఉత్తమమైన సంస్కారము కలవారు ప్రభువులైవుంటారని గ్రహించాను" అని జవాబిచ్చాడు. మనిషి విలువ అంచనా వేయడానికి మొదటి గీటురాయి అతని మాటతీరు. "అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్" అన్న వ్యాక్య ప్రాధాన్యాన్ని తెలియచెబుదామనుకున్నాను. పిలుపులోని విలువ తెలుసుకున్న అంధుడే ఎదురుగా వున్న వారిని గుర్తించినప్పుడు, సర్వత్రా నిండివున్న పరమాత్మ ఏ కనులతో మిమ్ము వీక్షించాలి? నీవు పిలిచే పిలుపులోని మాధుర్యంతో మీ దరికి ఏతెంచి మిమ్ములను బ్రోచెడివాడు పరమాత్మ. సాధన – ప్రేమ సర్వవిధములైన సాధనలకు ప్రేమయే ప్రధానమైన ప్రాణము. పూర్ణ ప్రేమయందే పుట్టును దైవంబు. దైవాన్ని పొందడం ఎంత సులభమో మీకు తెలియదు. పూరేకును నలపడం కొంత కష్టమవుతుందేమో గానీ, దైవాన్ని పొందటం అంతకంటే సులభం. వెన్నను చేతిలో నలపడం కొంత్ర శ్రమతో కూడుకున్నదేమో గానీ దైవాన్ని చూడటం అంతకంటే సులభం. ప్రేమను పెంచుకోండి. ఆ ప్రేమతో రాజులై దైవాన్ని సహితం ప్రేమగా సంబోధించండి. ఆ నామంతో భగవంతుడు కరిగిపోవాలి. మీ సంబోధనతో మీ ముందునుండి కదలలేని పరిస్థితి భగవంతునికి కలిగించండి.*

**మాతృవ త్పరధారాంశ్చ పరద్రవ్యాణి లోష్టవత్ ।**
**ఆత్మవ త్పర భూతాని వీక్షంతే ధర్మ బుద్ధయః ॥**

ధర్మబుద్ధిగలవారు పరస్త్రీలను తల్లులుగాను, పరద్రవ్యమును మట్టిగాను,
ఇతర ప్రాణులను తమవలెను చూతురు.

***ఐదు రకాలైన స్నేహితులను జీవితంలో సంపాదించుకోవాలి***
***విశ్వాసియైనవాడు మీరు పూర్తిగా నమ్మదగిన వ్యక్తి***
***ధైర్యశాలియైనవాడు త్వరగా నిర్ణయాలు తీసుకుంటాడు***
***విదూషకుడైనవాడు నవ్విస్తూ నిన్ను ఆనందపరుస్తాడు***

***మార్గదర్శియైనవాడు జీవితపాఠాల్ని నేర్పిస్తాడు***
***పృచ్ఛకుడైనవాడు మిమ్మల్ని ఎప్పుడూ ప్రశ్నిస్తూ వుంటాడు***
***చెట్టుకి డబ్బుకి మాటలొస్తే, అవి చెప్పేమాటలు ఒక్కటే***
***ఈరోజు నన్ను కాపాడుకో, రేపు నిన్ను కాపాడుతాను***
***స్వామీ! ఆంజనేయా అని ప్రేమగా సంబోధించండి***
***మీ భారమంతా ఈ క్షణం నుండే భరిస్తాను***
***అని ముమ్మారు చెబుతున్నాడు ఈ పవమానసుతుడు***
***ఈ చిన్నారి ముద్దుబిడ్డలకు***
***అందుకోండి సుమా!***

ॐ

**08-06-2020** 05:45 PM

**71) భగవంతుడ్ని ఆరాధించడం అంటే ఏమిటి స్వామీ?**

*ప్రతి పనిని దైవకార్యంగా భావిస్తే, లౌకికమైన పనంటూ మీకు ప్రత్యేకంగా ఏమీ వుండదు. అప్పుడు దానికోసం సమయం కేటాయించాల్సిన అవసరమూ వుండదు. విష్ణువును 'విశ్వం' అంటూ మొదటి నామంతోనే విశ్వాన్ని విష్ణువుగా నిర్ధారింపచేసింది విష్ణుసహస్రనామము. ఇలాంటి విశ్వంలో ఏ పని చేసినా అది విష్ణుకార్యమే అవుతుంది, విష్ణ్వారాధనే అవుతుంది. ఈ మర్మం తెలియక మీరు విష్ణువు నుంచి విశ్వాన్ని వేరుచేసి సహజమైన, అత్యంత సులభసాధ్యమైన సాధనను, ఆరాధనను అత్యంత క్లిష్టతరము, కష్టతరము చేసుకుంటున్నారు. భగవంతుడ్ని సర్వాంతర్యామిగా అవగాహన చేసుకున్నప్పుడు, అలా అని అంగీకరించబడినప్పుడు, ఎవరితో ఏ వ్యవహారమైనా, అణువణువునా నిండి నిబిడీకృతమైన దైవంతో చేసే వ్యవహారాలను లోకేశుడి ఆరాధననూ ఏకరూపంగా మారుస్తుంది. అదే నిరంతర స్మరణ, సాధన. "నేను చేస్తున్నాను" అని భావిస్తే కర్మ – "పరమాత్మ నా ద్వారా చేయిస్తున్నాడు, నేను నిమిత్తమాత్రుడను" అని అనుకుంటే అది కర్మయోగము. అప్పుడు ఫలితాలు ఎలాగున్నా ప్రసాదంగా స్వీకరించవచ్చు. తలపెట్టిన కార్యం ఏదైనా సఫలీకృతం కావాలన్నా, సత్ఫలితాలు ఇవ్వాలన్నా మీరు శక్తివంచన లేకుండా కృషి చేయాలి, తదుపరి దైవం పైన భారం వేయాలి.*

**72) మేము ఆచరించే కర్మలను భగవంతుడు ఏ విధంగా గమనిస్తూ తగిన ఫలితాలను అందిస్తాడు స్వామీ?**

*"నేను ఒక్కడ్నే వున్నాను. నన్ను ఎవరూ గమనించడం లేదు" అని మనిషి అనుకోవడం చాలా పొరపాటు అని అంటుంది మహాభారతం. మానవుడు ఏ పని చేసినా నిశితంగా పరిశీలించేవి ఒకటీరెండూ కాదు, పద్దెనిమిది ఉన్నాయని ఆదిపర్వం హెచ్చరిస్తుంది. వాటిని మహాపదార్థాలు అంటారు. అవి ఏమిటంటే, నాలుగు వేదాలు, పంచభూతాలు, ధర్మం, ఉభయసంధ్యలు, అంతరాత్మ, యముడు, సూర్యచంద్రులు మరియు పగలు, రాత్రి ఇలా మొత్తం పద్దెనిమిది మహాపదార్థాలు మనిషిని అనుక్షణం*

పర్యవేక్షిస్తుంటాయి. వాటి గమనిక నుంచి అతడు తప్పించుకోలేడు, తప్పించుకోవడం అసాధ్యం. భారతంలో పేర్కొన్న ఈ మహాపదార్థాలు మనిషి యొక్క ప్రతిచర్యనూ నమోదు చేసి, వాటిని సత్కర్మలుగా, దుష్కర్మలుగా విడదీసి, ఒక నివేదిక తయారుచేసి విధికి చేరవేస్తాయి. ఇది నిరంతరం సాగిపోయే సృష్టి పరిణామక్రమం. మహాపదార్థాన్ని చైతన్యస్వరూపులుగా గుర్తించినవారు వివేకులు, వివేకవంతులు. భీష్ముడు పంచభూతాల సాక్షిగా భీషణప్రతిజ్ఞ చేశాడంటే, వాటి ఉనికిని ఆయన గుర్తించినట్లే కదా! మరియు, వాటికి సంబంధించిన జ్ఞానం ఆయనకున్నట్లే కదా! తక్కిన వాటిమాట ఎలావున్నా, అంతరాత్మ అనేది ఒకటుందని మనిషికి తెలుసు. అది ఎప్పుడూ నిలదీయటం – తాను సిగ్గుపడటం ప్రతి మనిషికీ అలవాటే. అంతరాత్మ నిజమైనప్పుడు, తక్కిన పదిహేడూ వాస్తవమేనని అతడు గ్రహించడమే వివేకం. మహాపదార్థాలు గమనిస్తున్నాయంటే, ఎవరు చూడాలో వారే చూస్తున్నారని అర్థం. ఈ ఎరుక కలిగినప్పుడు, ఏ మనిషీ చెడ్డపనులకు తెగించడు. ఎవరు చూసినా చూడకున్నా, మంచిగా బ్రతకడం అలవాటు చేసుకోవాలి. అప్పుడే భగవత్ కృపకు పాత్రుడవుతాడు. మీరందరూ ఆరాధించే భగవంతుళ్ళందరూ మీ కష్టాలు తీర్చటానికి రాలేదు. వీరు మీ దుఃఖాలను తొలగించుకునే మార్గాన్ని చూపటానికి మాత్రమే వచ్చారని తెలుసుకోవాలి. దారితప్పి ఏమి చేయాలో తెలియని స్థితిలో వున్న మానవాళిని సరియైన మార్గంలో నడిపించటానికి అవతారాలు ఎన్నో వచ్చాయి. మీరు ఎలా జీవించాలో జీవించి చూపించిన అవతారం మీ కళ్ళముందే కదలాడి, కనుమరుగైనది. మానవజీవితం యొక్క గొప్పదనం, మీరు తల్చుకుంటే సాధించలేనిది ఏదీ లేదని చెబుతున్నాను. ఎన్నో బోధలు చేస్తున్నాను, ఎన్నో సందేహాలు తీరుస్తున్నాను. అయినా, మీరు అశాంతితో అలమటిస్తున్నారంటే, నేను బోధ చేసేది ఒకటైతే, మీరు ఆచరించేది ఇంకొకటి. ముఖ్యంగా నేను చెప్పేది ఆచరించకుండా నన్ను ఆరాధించటానికి అలవాటుపడటమే. హృదయం పవిత్రంగా వుండాలంటే, అచటకు భగవంతుడు ప్రవేశించాలంటే మీలోని అరిషడ్వర్గాలు, దుర్విచారం, దురాచారం, అమానుషత్వం మరియు అహంకారమనే దశవికారాలను రూపుమాపండి.

**న్యాయాగతస్య ద్రవ్యస్య బోద్ధాక్యా ద్వాపతిక్రమౌ ।**
**అపాత్రే ప్రతి పత్తిశ్చ పాత్రేచా ప్రతిపాదనమ్ ॥**

న్యాయముగా సంపాదించిన ధనమును దుర్వినియోగము చేయు మార్గములు రెండు.
అనర్హునికి ఇచ్చుట, అర్హునికి ఇవ్వకుండుట.

***ధనమే దైవంబయ్యే దర్పంబే మతమయ్యే***
***స్వార్థమే బుద్ధికి స్థానమయ్యే అహము శ్వాసంబయ్యే ఆశలందంబయ్యే***
***ధర్మంబు వమ్మయ్యే ధాత్రిలోన దయయు హీనంబయ్యే నయము శూన్యంబయ్యే***
***కపటమే జీవితకాంతులయ్యే ప్రేమానురాగముల్ రోగాలపాలయ్యే***
***కామాంధులుగా చేసె కలిని చదువు బ్రతుకు బరువయ్యే మతులకు గతులు దప్పె***
***జాగు చేసిన జగతికే గతియు నౌనో విద్యయందున విధిగా నైతికము జేర్చి***
***ఇంతకన్నా వేరెద్ది ఎఱుకపరతును సత్యాసత్యములు ఎరుకపడిననూ***

***తికమకపడుచున్న తరుణంలో  దారిచూపి దరికి ఏతెంచమని***
***సద్గురువుగా దరిచేరి  బోధలు సల్పుచుంటి***
***నా ఈ చిన్నారి ముద్దుబిడ్డలకు ప్రేమతో !***

*అజ్ఞానం మాట్లాడిన తర్వాత ఆలోచిస్తుంది*
*జ్ఞానం ఆలోచించాక మాట్లాడుతుంది*
*మాట అనేది మరణించేవాడిని కూడా బ్రతికించేలా ఉండాలి గానీ,*
*బ్రతికివున్నవాడిని మానసికంగా చంపేలా వుండకూడదు*

ॐ

**09-06-2020** 05:45 PM

**73) మా జీవితంలో జరిగే మార్పులను మేము ఎట్టి దృష్టితో చూడాలి స్వామీ?**

*విజయం కోసం ప్రయత్నించే వారందరూ పరిస్థితులు తమ అదుపులో ఉన్నాయని భావిస్తారు. పైపైచ్చు, తాము కోరుకున్నట్లుగా గెలుపును సాధించగలమని చెబుతూ వుంటారు. ఈ రకమైన ఆలోచన ఆశావహదృక్పథమే అయినప్పటికీ, అప్పుడప్పుడు కొన్ని సమస్యలకు కారణమవుతుంది. కొన్ని సందర్భాలలో నిరాసక్తతకు, నిర్లిప్తతకు గురి చేస్తుంది. కారణం, గెలుపు కోరుకునేవారు మార్పుకు సిద్ధంగా లేకపోవడమే. ఒక స్థితి నుండి మరొక స్థితికి ప్రయాణమే మార్పు. ఆ మార్పును స్వాగతించడానికి విజయం కోరుకునే ప్రతి వ్యక్తి సిద్ధంగా వుండాలి. అందుకు మనస్సు, శరీరం ఎప్పుడూ ఎదురుచూస్తూ వుండాలి. ఎందుకంటే, ప్రతిరోజూ కొంత నేర్చుకోవాలి, జ్ఞానాన్ని సంపాదించాలి. చిత్రంగా అదే సమయంలో ఎంతోకొంత వదులుకోవటానికి తయారుగా ఉండాలి. అట్టివారే విజేతలుగా నిలుస్తారు, అనుకున్నది సాధించగలుగుతారు. కోరుకున్నది సాధించటానికి అవసరమైన విజ్ఞానాన్ని సంపాదిస్తూ, కొందరు తమ చుట్టూ స్థిరమైన అభిప్రాయాలను ఏర్పరుచుకుంటారు. ప్రగాఢంగా వాటిని విశ్వసిస్తూ, అనుసరిస్తూ కూడా వున్నారు. పైపైచ్చు, ఏం మారాలి? అంతా బాగానే వుందిగా? అని ఎదురుప్రశ్న వేస్తారు, మార్పును వ్యతిరేకిస్తారు. ఇట్టివారు వాస్తవ విషయాలను కూడా తమ దృష్టితోనే చూస్తారు. మార్పులను గమనించరు, అంగీకరించరు. ఒకప్పటి తమ ఆలోచనా విధానమే ఇప్పటికీ సరిపోతుందని భావిస్తూ, క్రొత్తదనాన్ని వ్యతిరేకిస్తారు. నిజానికి తెలివైనవారు అందరికన్నా ముందు తాము మారతారు. గెలుపు నిచ్చెన మెట్లు చకచకా ఎక్కేసి, ఉన్నతస్థితికి చేరుకోగలుగుతారు. అది మీరెందుకు కాకూడదు? చిత్రం ఏమిటంటే, మీ దృక్పథంలో మార్పు రానంతకాలం, మీకు తెలియనివి, నచ్చనివి ఎప్పుడూ తప్పుగానే కన్పిస్తాయి. ఫలితంగా మార్పును త్వరగా ఒప్పుకోరు. కారణం మార్పు అంటే విజయమే కాదు, అపజయం కూడా. అయితే, కొన్ని మార్పులు గెలుపుకు స్వాగతం చెబుతాయి. విలువలు పాటిస్తూ ఏ కరమైన మార్పును కోరుకుంటున్నారు? అన్నది వ్యక్తుల వ్యక్తిత్వంపై ఆధారపడి వుంటుంది. ఎందుకంటే, మార్పు విజ్ఞానాన్ని ఇస్తుంది. బలహీనతలను దూరం చేసి, బలాన్ని పెంచుతుంది. మార్పు వల్ల సమస్యలు*

కూడా వస్తాయి. యుక్తిగా వాటిని అధిగమించాలి. అవరోధాలు, అడ్డంకులు ఎదురౌతాయి. ధైర్యంగా వాటిని దాటి ముందుకు వెళ్ళాలి. ప్రతి మార్పుకి సొంత తెలివితేటలు జోడిస్తే, విజ్ఞానం పెరుగుతుంది. నూతన ఉత్సాహం ఉరకలు వేస్తుంది. చైతన్యం కలుగచేసి ఆశయసాధనకు సహకరిస్తుంది. అందుకే మార్పును ఎప్పుడూ స్వాగతించాలి. అందుకు పాత దృక్పథాలను వదులుకోవాలి. అలవాట్లలో, ఆలోచనలలో మార్పులు తీసుకురావాలి. నిరంతరం నేర్చుకుంటూనే క్రొత్తదనానికి స్వాగతం చెప్పాలి. అప్పుడే వ్యక్తులు, వ్యక్తిత్వాలు ఉన్నతంగా తీర్చిదిద్దబడతాయి. పరిస్థితులు మారవు. వాతావరణం మారదు. చుట్టూ వుండే మనుష్యులు మారరు. సమాజం మారదు. ఇవ్వన్నీ మారాలంటే ముందు మీ ఆలోచనలలో మార్పు రావాలి. మీ ప్రవర్తనలో మార్పు రావాలి. అందుకే మీరు మార్పుకి స్వాగతం చెప్పాలి. మారుతి మాటలను అంగీకరించాలి, అనుసరించాలి, అభయాన్ని అందుకోవాలి.

***మీరు నడుస్తున్న దారి ఎటు తీసుకువెళ్తే అటు వెళ్ళిపోవద్దు.***
***మీరు కోరుకున్న దాన్ని సాధించటానికి అవసరమైన దానిని వెతుక్కుంటూ వెళ్ళండి.***

ధర్మ ఏవహతో హన్తి ధర్మో రక్షతి రక్షితః ।
తస్మా ధర్మో నహః తన్యో మనోధర్మో హతోవధీత్ ॥
ధర్మమును మీరు చంపిన, అది మిమ్ములను చంపును
దానిని మీరు రక్షించిన అది మిమ్ములను రక్షించును
కనుక ధర్మమును విడువరాదు
అది నశించిన మీరునూ నశించినట్లే అని తలంచవలెను.

***కాలప్రవాహం ఆపగలవారెవ్వరు?***
***కాలం నీ చేతలగుండా ప్రవహిస్తుంది***
***అది అనంతం కానీ, నీకు క్షణికం***
***భూచక్రం తిరుగుతూనే వుంది, రాత్రింబవళ్ళు గడుస్తూనే వున్నాయి***
***విత్తనాలు మొలకెత్తుతున్నాయి, మొగ్గలు విప్పారుతున్నాయి***
***కాయలు కాస్తున్నాయి, విత్తనాలు రాలుతున్నాయి***
***యుగయుగాలిలాగే వికసించి వాడిపోతున్నాయి***
***ఎంతకాలమో ఈ కార్యాల మధ్య నిరీక్షణ***
***మీకు తెలుసు ఈ కాలాన్ని ఎలా వేచి చూడాలో***
***మీకు తెలుసు వాటి సోయగాలు, మాధుర్యాలు ఎలా ఆనందించాలో,***
***ఆ చిన్నిపూవు, పూవు పరిణామమే ఈ యుగయుగాల సృష్టి రహస్యం***
***కానీ, మానవులైన మీ దౌర్భాగ్యం ఆలస్యాన్ని సహించలేక***
***వ్యవధి లేదనుకుంటూ కాలం కలిసి రాలేదనుకుంటూ***
***తొందరగా ఫలితాన్ని ఆశిస్తూ.....***

**కానీ మీరు చేయవలసినవి చాలా వున్నాయని,**
**అవి,**
**మదిలో దయ, కరుణ, జాలి ఇత్యాది సద్గుణాలను పెంచుకుంటూ**
**మూఢత్వం, మూర్ఖత్వం వదిలి, మమతానురాగాలు వృద్ధినొందించుకుని**
**ఈ వానరవీరుడు చెబుతున్న నగ్నసత్యాలను, మర్మగర్భాలను తెలుసుకుని**
**తేటతెల్లము చేస్తున్న మారుతికి ముద్దుబిడ్డలై నడవండి**
**నా చిన్నారి ముద్దుబిడ్డలారా!**

ॐ

**10-06-2020** 09:00 AM

**74) సాధన అనగా ఏమిటి స్వామీ? మేము ఎటువంటి సాధన చేయాలి స్వామీ?**

ఈనాడు జగత్తులో పాపభీతి సన్నగిల్లిపోయినది. ఇలలో దుష్కృతములు పరిపాటి అయినవి. వివరింపగలేని దురంతకృత్యములు దాపురించినవి. భగవంతుని యెడల భక్తి క్షీణించినది. ఇట్టి పరిస్థితులలో ఆ భగవంతుని నామచింతనమే మీకు సుఖమును చేకూర్చగలదని గుర్తించండి. అనేక పుస్తకములు పఠించాను, ఎన్నో విద్యలు నేర్చాను, సర్వశాస్త్రములు పూర్తిగా అభ్యసించాను అని గర్వపడకండి. పరమాత్ముని భక్తితో కొల్వకున్నచో, మీ విద్యలన్నియూ నిరర్ధకమే కదా! మీ జానెడు పొట్టను నింపుకొనుట కోసం ఎన్నియో శ్రమలకోర్చి, కోటి విద్యలను నేర్చినప్పటికీ, పరిపూర్ణ సుఖమును పొందలేక దుఃఖముతో క్రుంగుట దేనికి? శ్రీపరాత్పరుడు తనను ధ్యానము చేయు భక్తుల దుఃఖములను పోగొట్టి, సుఖశాంతులను చేకూర్చును కదా! దివ్యత్వమును పొందే నిమిత్తమై, మానవుడు ఎన్నో ప్రయత్నాలు, ఎన్నో విధాలుగా చేస్తున్నాడు, సాధనలు చేస్తున్నాడే కానీ సాధనల యొక్క నిజమైన అర్థాన్ని గ్రహించలేకపోతున్నాడు. సాధన అనగా ఏమిటి? ఈ సాధన యొక్క పరిణామము, గమ్యము ఏమిటి? ఇంతకు మునుపు చెప్పాను. మరలమరలా కూడా చెబుతాను అక్షరం పొల్లుపోకుండా. జపధ్యానములు, భజనలు ఇత్యాది సత్కర్మలు సాధనలనబడవు. చెడును మంచిగా మార్చుకోవడమే నిజమైన సాధన. చెడు లేక మంచిరాదు. దుఃఖము లేకుండా సుఖము రాదు, లేదు. మంచి-చెడుల మధ్య నిరంతరం సంగ్రామము జరుగుతూనే వుంటుంది. వీటిని విడదీయుట ఎవ్వరి తరమూ కాదు. అట్లే కష్టసుఖములు రెండూ అవినాభావ సంబంధములై, అన్యోన్యాశ్రయములై వుంటాయి. ఒకటి ఆది - రెండవది అంత్యము. కేవలం ఆద్యంతరహితుడైన దైవత్వమునకు తప్ప, లోకసంబంధమైన వస్తువులకు, విషయములకు, వ్యక్తులకు ఆద్యంతములు ఉన్నవి. సాధనల చేత అల్పత్వమును, అధికత్వముగా మార్చుకొనవచ్చు. సాధనల ద్వారా విలువ పెరుగుతుంది. మీ దగ్గర ఒక తక్కువ విలువ గల డైమండ్ ఉందనుకోండి, దానిని అనేక విధములుగా కోసి సంస్కరించబడినప్పుడే, దాని విలువ పెరుగుతుంది. అంతేకాదు, పుట్టిన తక్షణమే ఏ వ్యక్తి గొప్పపండితుడు కాలేదు. క్రమక్రమేణా తాను కొన్ని సాధనలు సల్పితే, తానొక గొప్ప విద్యాపండితుడుగా

రూపొందగలడు. ఈ జగత్తులో అన్నింటినీ తట్టుకొని ముందుకు సాగినప్పుడే దివ్యమైన స్థితిని మీరు పొందగలరు. అట్లుకాక అన్నిటికీ బెదురుతూ, సాధనల చేత సరియైన మార్గములో ప్రవేశించలేకపోతే, జీవితమే వ్యర్థమైపోతుంది. ఈ జీవితములో అనేక ఆటంకములు కలుగుతూ వుంటాయి. ఈ ఆటంకములే లేకపోతే మానవత్వానికే విలువ లేదు. కష్టేఫలే! కష్టమే లేకపోతే, ఏ విధమైన ఫలితాన్ని మీరు పొందలేరు. సాధనమున పనులు సమకూరు ధరలోన. అంటే, దీనికి మనస్సు అత్యవసరము. మనిషి అంటే మనస్సే. మనస్సు అంటే సంకల్పముల చేరికయే. వర్ణనాతీతమైనది మనస్సు యొక్క స్వభావం. క్షణంలో సర్వత్రా వ్యాపించిపోతుంది, క్షణంలో స్తంభించిపోతుంది. క్షణంలో వికసిస్తుంది, క్షణంలో ముకుళించుకుపోతుంది. "మనోమూలమిదం జగత్". మనస్సు చేతనే జగము బంధించబడుతున్నది. అంతేకాదు, మీరు భుజించిన ఆహారం జీర్ణించబడి, దేహానికి పుష్టిని, సంతుష్టిని అందిస్తోందని మీరు అనుకుంటారు. మీకు పుష్టినీ, సంతుష్టినీ కలిగించేది మనస్సేగానీ, ఆహారం కాదు. మీరు భుజించే సమయంలో మనస్సు ఉల్లాసంగా, ఆనందంగా లేకపోతే, తినేదంతా విషంగా మారిపోతుంది. కనుక, మానవత్వానికి పవిత్రమైన దివ్యత్వాన్ని చేకూర్చునది మనస్సే కనుక ఏది చేసినా, ఏది చూసినా, ఏది చెప్పినా, ఏది తలంచినా అంతయూ పవిత్రంగా వుండాలి. మనస్సంకల్పముల ప్రభావమే జీవితంలో సుఖసంతోషాలకు మూలం. అనర్థాలకు అహంకారమే కారణం. ఈనాటి మానవుడు భుజబల, బుద్ధిబల, ధనబలములను చూసుకుని అహంకారపడుతున్నాడు. ఈ అహంకారమనే పెనుభూతం మానవుని ఎప్పుడు పడవేస్తుందో గుర్తించటానికి మాత్రం ప్రయత్నించుటలేదు. శతమానం భవతి అని ప్రతిమానవుడు తాను నూరు సంవత్సరములు జీవించాలని ఆశీర్వాదం పొందుతూ వుంటాడు. కానీ, ఈనాడు మధ్యకాలంలోనే మరణించే వారెందరో, ఎందరినో చూస్తున్నారు. శతవర్షముల దాకా మితం చెప్పినా, నమ్మరాదామాట. నూరు సంవత్సరముల దాకా పూర్తిగా జీవించవలసిన మానవుడు మధ్యలోనే పోవటానికి కారణం అతనియందు ఆవిర్భవించే అహంకారము, అసూయ మొదలైన దుర్భావములే. మానవుడు అహంకారము వీడి ఆత్మవిశ్వాసమును , భగవద్భక్తినీ పెంచుకోవాలి. తనను తాను నమ్మలేనివాడు, ఎవరిని నమ్మగలడు? గ్రుడ్డివాడు సూర్యుని చూడలేనట్లే, అహంకారి ఆత్మను చూడలేడు. అందుకనే, జీవితములో అహంకారమునకు ఎటువంటి అవకాశమూ ఇవ్వరాదు. పదవులూ, విద్యలూ, సిరిసంపదలూ అన్నీ అన్నీ అన్నీ అన్నీ అన్నీ కదిలిపోయే మేఘములవంటివి. ఈనాటి మానవజీవితం అనేక సమస్యల తోరణంగా తయారవుతున్నది. నిత్యానిత్య విషయ పరిశీలనాశక్తిని కోల్పోతున్నాడు. నమ్మరానివాటిని నమ్ముతున్నాడు, నమ్మదగినవాటిని నమ్మటంలేదు. దీనికి కారణం స్వార్థమే. మానవుడు తన జీవితంలో అర్ధభాగం ధనసంపాదనకై వినియోగిస్తున్నాడు. కానీ, కొంత కాలమునైనా ఆధ్యాత్మికమార్గంలో ప్రవేశపెట్టడంలేదు, పరోపకార సంబంధమైన కార్యములపై ఉపయోగించుటలేదు. ఏ వ్యక్తిని ప్రేమించినప్పటికీ, తన స్వార్థము నిమిత్తమై ప్రేమిస్తున్నాడే కానీ, ఆ వ్యక్తి నిమిత్తమై కాదు. ఈ అర్థములేని స్వార్థమును ఆధారము చేసుకొని, అనంతమైన ఆత్మతత్త్వమును విస్మరిస్తున్నాడు. నిత్యానిత్య విషయ పరిశీలన చేసే సమత్వమును అభివృద్ధి చేసుకోవాలి.

**శ్రాద్ధం పితృభ్యో న దదాతి దైవతాని చార్చతి ।**
**సుహృన్మిత్రం న లభతే తమాహుర్మూఢ చేతనమ్ ॥**

ఎవరు పితరులకు శ్రాద్ధమును ఇవ్వడో, దేవతలను పూజింపడో, మంచి మనస్సుగల స్నేహితులను పొందకున్నాడో, అట్టి వానిని మూర్ఖమైన ఆలోచన గలవాడు అని చెబుతాను!

దేవుడు మీకు రెండు చేతులిచ్చాడు. ఎందుకో తెలుసా?
ఒకటి తీసుకోవటానికి, రెండవది ఇవ్వటానికి

***మనిషిగా మహిలో వెలగాలంటే,***
***మనిషిగా మంచిని పెంచే కార్యాలెన్నింటినో కర్తవ్యంగా తలచి,***
***నిరంతరం నిర్వహిస్తూ వుండాలి.***
***మనిషిగా భువిని నిలవాలంటే,***
***స్నేహహస్తం చాచి, అందర్నీ ఆదుకోవాలి, చేదుకోవాలి***
***ఆప్తునివై హృదయానికి హత్తుకోవాలి***
***మనిషిగా అవనిలో జీవించాలంటే,***
***నీలోని మలినాల్ని తొలగించుకోవాలి, జ్ఞానజ్యోతిని హృదిలో వెలిగించుకోవాలి***
***అమృతమూర్తివై ఆపన్నులకు వెలుగుబాటను చూపగలగాలి***
***పరమాత్మను శరణు కోరండి***
***అహంకారాన్ని వీడండి***
***ఆంజనేయుని బోధల సారాంశమును గ్రహించండి***
***పట్టిన గ్రహణాన్ని విడిపించుకోండి***
***నిశ్చల ప్రశాంతతను, ఆనందమును అందించే ఆత్మతత్త్వములో కూర్చొనండి***
***అప్పుడే ఈ ఆంజనేయుని ముద్దుబిడ్డలుగా నిలిచి***
***ఈ పవనపుత్రుని ప్రేమకు పాత్రులవుతారు***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**11-06-2020** 09:00 AM

**75) భక్తులు మరియు యోగులు మాకు ఏ విధంగా ఆదర్శవంతులు స్వామీ?**

*భక్తుడియొక్క భక్తికీ, యోగియొక్క ఆధ్యాత్మిక సాధనకీ వారు తట్టుకోగలిగిన దుర్భరమైన కష్టాలు, ఆవేదనలే గీటురాళ్ళు. భరించలేని కష్టాలు కూడా చిరునవ్వుతో భరించగలవాడే నిజమైన భక్తుడు. దుర్భరమైన ఆవేదల్ని సహిస్తూ కూడా, మౌనంగా దైవాన్ని చేరుకునే సాధనను నిర్విరామంగా కొనసాగించగలిగినవాడే నిజమైన యోగి. ఇలా తమ భక్తినీ, ఆధ్యాత్మిక సాధననీ కొనసాగించే శక్తియుక్తులు వారికి ఎలా కలిగాయి? తాను నమ్మిన దైవం సర్వసృష్టికీ ఆధారభూతుడైన సర్వేశ్వరుడు, ఈ చరాచర*

*జగత్తును నడిపిస్తున్నది అతడే. అతడి ఆజ్ఞ లేనిదే ఆకైనా కదలదు, చీమైనా కుట్టదు. ప్రచండ ప్రభంజనమైనా మిమ్ములను కదల్చలేదు. సర్వశాస్త్రాస్త్ర సంపన్నుడైనా, మిమ్మల్ని ఏమీ చేయలేదు అన్న అచంచల విశ్వాసం వల్ల మాత్రమే. అందుకే భగవద్విశ్వాసమే శ్వాసగా జీవించే భక్తుడుగానీ, యోగిగానీ భయమన్నది ఎరుగరు. సర్వశక్తిమయుడైన భగవంతుడు మిమ్ములను అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుతాడు. ప్రతిక్షణం మిమ్ములను విడిచిపెట్టకుండా మీ చేయిపట్టి నడిపిస్తాడన్న నమ్మకమే మీ బలం – దేవుని బలహీనత. ఇనుప దిమ్మమీద వజ్రాన్ని పెట్టి, బరువైన సుత్తితో బలంగా దెబ్బలు కొట్టినా, వజ్రం ముక్కలవ్వదు. అదే అసలైన వజ్రం. నకిలీ వజ్రాలు, గాజులా పగిలి ముక్కలవుతాయి. ఇదే వాటి నకిలీతత్త్వాన్ని తెలియచేస్తుంది. దేని సాంగత్యం వల్ల తాడు కూడా ఎంత వేడినైనా కాలిపోకుండా భరించగలదో, అదే నిజమైన వజ్రం. అలాగే ఎంతటి కష్టాన్నైనా భరించగలవాడే నిజమైన యోగి. ఈనాడు మానవులు గడుపుతున్న యాంత్రిక జీవితాన్ని చూస్తే, మానవజీవిత పరమార్థంపట్ల ఏ అవగాహనా లేకుండా, ఆ విషయం గురించి కనీస పరిజ్ఞానం లేకుండా, నీతి నిజాయితీలు లేకుండా, స్వార్థమే పరమార్థంగా జీవించడం మీరు చూస్తున్నారు. తత్ఫలితంగా మానవజాతి ఎన్ని అన్యాయాలకి, అక్రమాలకి గురి అవుతున్నదో కూడా చూస్తున్నారు. విశ్వమానవాళికి మనశ్శాంతి, సుఖసంతోషాలు లేకుండా దుర్భరమైన మనోవేదనను అనుభవిస్తున్నారు. కొంతమంది దైవానుగ్రహం ఎలా జీవిస్తే లభిస్తుందో తెలుసుకోకుండా గుళ్ళు, గోపురాలకు తీర్థయాత్రలు చేస్తారు. పూజలు, వ్రతాలు, ఉత్సవాలు చేస్తారు. అయినా, తమ కష్టాల నుండి గట్టెక్కలేక, దైవాన్ని నిందిస్తూ వుంటారు. ఇదంతా ఆధ్యాత్మిక జీవితం గడపటానికి, దైవానుగ్రహం పొందటానికి అవసరమైన కనీస సాధన చేయడానికి అవసరమైన కనీస పరిజ్ఞానం లేకుండాపోవటం వల్ల జరుగుతోంది. మరి ఈ పరిజ్ఞానం ఎలా లభిస్తుంది? వేదవేదాంగాలు, మతగ్రంథాలు చదవటం వల్ల లభిస్తుందా? నిశ్చయంగా లభించదు. దీనికి నేను చెప్పే మార్గమొక్కటే శరణ్యం. అదే, జీవితమంతా ఎన్నో కష్టాలకు, నష్టాలకు ఓర్చుకుని, నిరంతర సాధనతో దైవానుగ్రహం పొందిన మహనీయుల బోధలు వినడం వల్ల మాత్రమే లభిస్తుంది. ఎందుచేతనంటే, అది ఆధ్యాత్మిక అనుభవనీరాజనం. మానవజీవితంలో సుఖాలు ఆవిసిగింజల్లా చిన్నవిగానూ, దుఃఖాలు పర్వతాలుగా పెద్దవిగానూ కనుపిస్తాయి. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని నిరంతర సాధుసత్పురుషుల బోధనలను అనుసరించాలి. జీవితం దీర్ఘమైనది కాదు. ఎందుచేతనంటే, మీ జీవితం సగం నిద్రలోనూ, ఎక్కువ కాలం బాల్యంలోనూ, వృద్ధాప్యంలోనూ, ఆదివ్యాధుల్లోనూ గడిచిపోతుంది. అందుకనే, మూర్ఖుడా! అని సంబోధిస్తాను. మేలుకోండి! భక్తిమార్గాన్ని అనుసరించండి. లేకపోతే, జీవితం అనే కాడికి బంధించబడి వుండిపోతారు.*

**కృతజ్ఞం ధార్మికం సత్యం అక్షుద్రం ధృఢ భక్తికమ్ ।**
**జితేంద్రియం స్థితం స్థిత్యాం మిత్రమత్యాగి చేష్యతే ॥**

*కృతజ్ఞుడు, ధార్మికుడు, సత్యవంతుడు, నీచుడు కానివాడు (ఉదారుడు), ధృఢమైన అనురాగము గలవాడు, జితేంద్రియుడు, మర్యాదను ఉల్లంఘింపనివాడు, స్నేహమును వీడనివాడునూ మిత్రుడిగా అంగీకరించబడతాడు.*

*జీవితం అనే విందు తర్వాత మృత్యువు అనే పానీయం సేవించక తప్పదు*

***అందరికోసం అందుబాటులో ఉండాలి***
***ప్రేమభావము పెంపు చేసుకోవాలి***
***భజనచేయు విధము నేర్చుకోవాలి***
***భక్తిభావము భద్రపరచుకోవాలి***
***దీనజనులకు తగిన సేవ చేస్తూ వుండాలి***
***త్యాగభావము తెలుసుకొని వుండాలి***
***సేవాభావాలు నేర్చుకొని వుండాలి***
***ఇన్ని భావములు నేర్పిన భగవంతునిపట్ల***
***నాల్గు భావాలు నేర్పిన ఓ నళినసేత్రా!***
***ఏమి చెప్పను నీ ప్రభావంబు, ఎంతదని చెప్పను***
***అహము వదిలేసి, ఆత్మగా ఉండునటుల మార్చగలిగిన సద్భోధలు***
***సద్గురు నోటవిని, నిన్ను నీవు మార్చుకున్న యెడల***
***కృతజ్ఞత నీది, కృప నాది***
***రెండూ కలిస్తే, కృతకృత్యుడవు నీవు అవుతావు***
***అదే ఆంజనేయుడు తన ముద్దుబిడ్డలకు ఒసగే ఆశీర్వాదం అందుకోండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**12-06-2020** 09:00 AM

**76) స్వామీ! భక్తుల యొక్క భక్తి ఎట్టిదో తెలుసుకోవాలని ఉన్నది స్వామి.**

ఎందుకు సాధుసత్పురుషుల, మహాభక్తుల బోధనలు చక్కగా విని ఎందుకు ఆనుసరించమన్నానో ఒక్కమారు పరిశీలిద్దాం. తొంభై ఆరు కోట్ల రామనామాన్ని జపించి, రామతారక మంత్ర స్మరణే ప్రాణంగా జీవించి, ధనాన్ని తృణీకరించి, రామభక్తి సామ్రాజ్యాన్ని స్థాపించి, రాజాధిరాజుగా శ్రీరామావతార వైభవాన్ని వర్ణించడమే గాక, భక్తులుగా మీరు ఏ మార్గాన్ని అనుసరిస్తే రామానుగ్రహం లభిస్తుందో, తన స్వీయ అనుభవంతో కీర్తనలుగా రచించి మీకందించాడు సద్గురు శ్రీత్యాగరాజస్వామి. ధనమే దైవంగా జీవించే నేటివారికి కనువిప్పు కలిగించడానికి **"నిధి చాలా సుఖమా, రాముని సన్నిధి సేవ సుఖమా?"** అంటూ, ధనం కంటే దైవసన్నిధి సుఖమని, దైవం వైపు మీ దృష్టిని మళ్ళించాడు త్యాగరాజు. శాంతము లేక సౌఖ్యము లేదు, ధారసుతులు, ధనధాన్యములుండిన, సారెకు జపతప సంపద కల్గిన, ఆగమశాస్త్రములు అన్నియు జదివిన, యాగాది కర్మములన్నియు చేసినా, ఇలా ఎన్ని వున్నా శాంతము లేకపోతే, కోపతాపాదులను అదుపులో పెట్టుకోకపోతే, సుఖముండదని, అలాగే రామభక్తి సామ్రాజ్యమే మానవుల

*కబ్బెనో, ఆ మానవుల సందర్శనమత్యంత బ్రహ్మానందమే కావున దైవభక్తి కలిగి, దైవభావనలో ఉండేవారిని దర్శించడమే మహాభాగ్యం. అందుకనే, మహాత్ముల గొప్పదనాన్ని వర్ణిస్తున్నాను. త్యాగరాజు, **"భజనసేయవే మనసా పరమభక్తితో"** అని, **"బంటురీతి కొలువీయవయ్యా రామా"** అని చెప్పి పరమభక్తితో రామభజన చేసి, నన్ను ఉదాహరణగా అంటే హనుమలా రామబంటుగా వారి సేవ చేసి రామానుగ్రహం పొందమని బోధిస్తాడు త్యాగయ్య. అలాగే, గోదావరి తీరాన రామచంద్ర ప్రభువుకు గుడి కట్టించిన మహాభక్తుడు రామదాసు, **"తక్కువేమి మనకు రాముండొక్కడుండు వరకు ప్రక్కతోడుగా భగవంతుడు తన చక్రధారియై చెంతనే యుండగా"** అని శ్రీరాముడ్ని నమ్ముకున్న భక్తుడు. రాముడు తన ప్రక్కనుండగా మనకే భయమూ లేదంటాడు. ఇక, **"ఓ రామా! నీ నామమేమి రుచిరా. కదళీ ఖర్జూరాది ఫలములకధికమూ, నవరసములు నవనీతముల కంటే, పనస జంబూ ద్రాక్ష ఫలరసముల కంటే, ఓ రామా నీ నామమేమి రుచిరా"** అని రామనామ మాధుర్యాన్ని తెలియచేసి రామతారక మంత్రాన్ని జపించి రామానుగ్రహం పొందమన్నాడు రామదాసు. **"కాలుని దూతల పాలిట మృత్యువు"** అంటే యమదూతల పాలిట మృత్యువు రామనామం. రామనామ స్మరణ చేస్తే యమదూతల గురించి భయపడనవసరం లేదు. శ్రీవేంకటేశ్వరుని భక్తుడైన అన్నమయ్య మరొక్క అడుగు ముందుకేసి భగవద్భక్తుడికి ఎలాంటి ధైర్యస్థైర్యాలు ఉంటాయో ఈ కీర్తనలో చెబుతాడు. **"ఎక్కడి నరకము, ఎక్కడి మృత్యువు మాకు దక్కె, నీ దివ్యనామామృతము చూరగొంటిమి. నీ దివ్యనామామృతము చూరగొంటిమి".** నీ దివ్యనామాన్ని స్మరిస్తున్నాం. ఇంకెక్కడి నరకం, ఇంకెక్కడి మరణం? వాటి గురించి ఆలోచించాల్సిన అవసరమే లేదంటాడు అన్నమయ్య. ఇంకా, **"సకల కర్మముల చేత సాధ్యముగాని నీవి ఒక ఇంచుకంత భక్తి కొగి లోనైతి"** – ఎన్ని పుణ్యకార్యములు చేసినా సాధ్యంకాని నీ అనుగ్రహము కొంచెం భక్తికి లొంగిపోతావు అని భక్తి వల్ల మాత్రమే తప్ప పూజలు, ఉత్సవాల వంటి ఆడంబరాలకు లొంగడు అని భక్తిమార్గాన్ని అనుసరించమంటాడు అన్నమయ్య. **"హరిదాసుడగుటచే యది తపము, పరమార్గము ఫలమే లేదు"** అంటే, భగవంతుని సేవకుడిగా ఉండటం తప్ప మానవుడు తరించటానికి, తన మానవజన్మ సార్ధకం చేసుకోవడానికి మరొక మార్గం లేదని స్పష్టంగా చెప్పాడు. **"అదివో అల్లదివో శ్రీహరివాసము. పదివేలశేషుల పడగలమయము"** అని తిరుమలను కీర్తిస్తాడు. పదివేలశేషుల పడగలతో శోభించే శ్రీవైకుంఠమే తిరుమల అన్న భావం మనసు నిండా నింపుకుని, తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాక్షాత్తు శ్రీమహావిష్ణువుగా దర్శించాలి అని సూచించాడు. అలాగే, భగవంతుడు దర్శనమీయడం లేదని తపించే భక్తులకు అద్భుతమైన సాధనను సూచించాడు రామభక్తుడైన కబీరు. **"గురుకృపాంజన పాయో మేరే భాయీ! రామబినా కఛు మానతా నాహి. అందర్ రామా బాహర్ రామా జహాఁ దేఖే వహాఁ రాజారామా!"** అని సద్గురువును ఆశ్రయించి గురుకృప అనే కాటుక సంపాదించుకుని, నీ కనులకు పెట్టుకో. అప్పుడు రాముడు తప్ప ఇక ఏదీ నీకు కన్పించదు అని చెప్తాడు. వేదవేదాంగ కోవిదుడైన శంకరభగవత్పాదుల సూక్తులు తెలుసుకోండి. సర్వవేదాంత సారాన్ని ద్వాదశమంజరికా స్తోత్రంలో పొందుపరిచాడు. **"భజగోవిందం, భజగోవిందం గోవిందం భజ మూఢమతే సంప్రాప్తే సన్నిహితే కాలే నహినహి రక్షతి డుకృఞ్ కరణే"** అంటే ఓ మూర్ఖమైన మనసా! గోవిందుడ్ని భజించు. ఎందుచేతనంటే, తప్పనిసరియై మృత్యువు సమీపించినప్పుడు, ఈ వ్యాకరణసూత్రాలు, నిన్ను*

రక్షించవు. ***"మూఢజహీహి ధనాగమ కృష్ణా, కురు సద్బుద్ధిం మనసివి తృష్ణా. యల్లభసే నిజకర్మోపాత్తం, విత్తం తేన వినోదయ చిత్తమ్"*** ఓ మూఢుడా! ధనం రావాలన్న దురాశ విడిచిపెట్టు. ఆశాపీడితం కాని మనస్సులో సత్‌పదార్ధాలను నింపుకో. నీ కర్మననుసరించి లభించే ధనంతో తృప్తిపడి, మనస్సును ఆనందింపచేసుకో. ప్రాపంచిక సుఖాలు, సంపదలు నిన్ను కాపాడవు. గోవిందుని పాదాలే నమ్ముకో అని బోధించాడు. ఇందరు మహానుభావులు చెప్పింది విన్నారు. చివరకు మీముందు కూర్చున్న సేవకుడు తాను పట్టిన శ్రీరామచరణముల చెంత తనువు, మనస్సు అర్పణ చేసి, రామసేవకుడిగా నడిచినవాడే. ఆ ఫలితమే ఈ సద్గురు స్థానాన్ని ప్రసాదించింది. అందుకే నేటి మానవుని బుద్ధి దైవం వైపు మళ్ళి, లోకకళ్యాణ కారకంగా మీ జీవితాన్ని గడుపుకుని, సమస్తలోకాః సుఖినోభవంతు అని ప్రార్ధిస్తూ, సమస్త మానవాళి సుఖసంతోషాలతో వర్ధిల్లడానికి కృషి చేయండి. ఆ మార్పుకు కేవలం సాధన సలపాలి. సాధుసత్పురుషుల, మహాభక్తుల బోధనలవల్లే సాధ్యపడుతుంది. అందుకే కొందరు సాధుసత్పురుషుల గురించి చెప్పాను.

***ఉపేక్షితం క్షీణబలోపి శత్రుః ప్రమాదోషాత్పురుషై ర్మదాంధైః ।***
***సాధోపి భూత్వా ప్రథమం తతో సౌ అసాధ్యతాం వ్యాధిరివ ప్రయాతి ॥***

పురుషులు మదాంధులై పొరపాటునైననూ బలహీనుడు గదాయని శత్రువును ఉపేక్షించరాదు. అట్లు ఉపేక్షించినచో, మొదట సాధ్యపడనివాడు కూడా తదుపరి క్రమంగా బలపడి, ముదిరిన వ్యాధివలే, అసాధ్యుడగును. గోటితో పోవు దానికి గొడ్డలినుపయోగించవలసిన దుస్థితి వచ్చును.

తినుట కొరకు జీవించువాడు బద్ధుడు
జీవించుట కొరకు తినువాడు ముక్తుడు

***ఆధ్యాత్మికత లేకపోతే, జన్మ లేదురా***
***జన్మ లేనిదే జగతి లేదురా***
***ఆంజనేయుని మాటలు సుధరా!***
***ఆధ్యాత్మికమంటే కమ్మని పలుకురా!***
***ఆధ్యాత్మికమంటే అనురాగ ఆప్యాయతలకు రూపురా!***
***ఇన్ని బోధలు బోధించి మీ కడకు ఏతెంచి, నా శ్వాసను మీ బోధకుపయోగించి***
***మీ ఉన్నతిని కాంక్షించే అమృతమూర్తి***
***మీ ఆంజనేయునిచే బోధించే ఆధ్యాత్మికత***
***దయకు మారుపేరుగా***
***క్షమకు మరో రూపుగా***
***ఆ రాముడిని అందుకొనే దర్శనభాగ్యము పొందే సాధనలను మీకు విశదముగా అందించు***
***అవ్యాజ కరుణామూర్తి హనుమ ముద్దుబిడ్డలైన***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**14-06-2020** 09:25 AM

**77) భగవదనుగ్రహానికి మేము ఏ విధముగా పాత్రులము కావచ్చును స్వామీ?**

*మనిషి తన జీవితం ఆనందంగా గడపాలని వుంటే, ఆరు సూత్రాల్ని పాటించి తీరాలి. ఏ కులంవాడైనా, ఏ మతంవాడైనా, సంపన్నుడైనా, నిరుపేద అయినా, ఉన్నతోద్యోగి అయినా, కూలివాడైనా <u>మీకంటే పెద్దవారిని గౌరవించాలి.</u> చేస్తున్న వృత్తి ఉద్యోగాలను మీ కన్నతల్లిగా భావించాలి. భక్తి మీ నరనరాల్లో ప్రవహించాలి. అన్యాయం, అక్రమం, అవినీతికి ఎప్పుడూ పాల్పడకుండా ఉండటం, ఎప్పుడూ చిరునవ్వు చిందిస్తు ఉండటం, ధనం వెనుక పరుగులు పెట్టకుండా వుండటం, అన్నింటినీ మించి దైవాన్ని విస్మరించకపోవడం ఈ విషయాలు పాటిస్తే, ఖచ్చితంగా మనిషి సుఖశాంతులతో జీవించగలడు. ఇందులో ఏ విధమైన సందేహమూ లేదు. అయితే ఈ నియమాలు పాటించడం సాధ్యమేనా? అనే ప్రశ్న మీకు తలెత్తవచ్చు. సాధ్యమే! సాధ్యమే అయితే ఎప్పుడూ? అంటే, దైవాన్ని విస్మరించకుండా నిరంతరం దైవనామస్మరణలో జీవించడం వల్ల దుఃఖనివృత్తి, ఆనందప్రాప్తి కలుగుతాయి. హృదయానికి పట్టిన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే కాలుష్యం తొలగిపోతుంది. దివ్యత్వం పొందటానికి, దైవానుగ్రహం ప్రాప్తించటానికి అచంచల భక్తివిశ్వాసాలతో, నామస్మరణతో దైవానికి దగ్గరగా వుంటే, మీరు తరిస్తారు, మీ సాటివారూ, తోటివారూ కూడా తరిస్తారు. మీరు జాగ్రత్తపడలేదు. అందుకే, మీ సంక్షేమానికి దూరంగా పెరిగారు. ప్రభు నామస్మరణ మరచిపోయారు. ప్రాపంచిక ధర్మాల్లో మునిగిపోయి పెరిగారు. అసత్యప్రచారం మీపై పడటం వల్ల, దారితప్పి, ప్రభువుకు దూరమైపోయారు. ఇప్పుడు మీకు భక్తి అనే నావ దొరికింది. నెమ్మదిగా ప్రభువును చేరుకుంటారు. పసితనం నుంచి దైవభావనతో జీవించి వుంటే, మీ సంక్షేమం దైవం చూసుకునేవాడు. ఆయన్ని మరచిపోవటం చేత లౌకిక ప్రాపంచిక విషయాల్లో, కుటుంబ వ్యవస్థల్లో కొట్టుమిట్టాడుతూ పెరిగారు. సుఖశాంతుల్ని కోల్పోయారు. మిథ్యాజీవితంలో పడిపోయి దైవాన్ని మరచిపోవడం వల్ల దైవానికి దూరమైపోయారు. ఈనాటికి సద్గురుకృప వల్ల దైవభక్తి అనే నావ దొరికింది. హాయిగా ఏ చీకూ చింతా లేకుండా ప్రశాంతంగా ప్రయాణించి, భగవంతుని సన్నిధికి చేరుకోండి. జీవన మలిసంధ్యలో కనీసం దైవానుగ్రహానికి పాత్రులయ్యాము అని ముందు బాధపడినా, చివరకు సంతృప్తినీ, ఆనందాన్నీ పొందుతారు. దైవానికి సన్నిహితులు కండి. మీ జీవితాలు ధన్యం చేసుకోండి అని హెచ్చరిస్తున్నాను.*

*పద్మపురాణంలో ఒక కథ వుంది. తులాధారుడనే వైశ్యుడు ఎంతో నీతి నిజాయితీలతో వ్యాపారం చేసుకుంటూ వుండేవాడు. అయితే, ఎంత వ్యాపార వత్తిడిలో వున్నా భగవంతుని తలవడం మాత్రం మానలేదు. తన వ్యాపారాన్ని కూడా దైవకార్యక్రమంగానే భావిస్తూ వుండేవాడు. ఒకరోజు నరోత్తముడనే బ్రాహ్మణుడు తులాధారుడి దగ్గరకు వచ్చి అతనితో మాట్లాడే అవకాశం ఇమ్మన్నాడు. అయితే, తులాధారుడు "బ్రాహ్మణోత్తమా! రాత్రి తొలిఝాము గడిచేవరకూ నా వ్యాపారం నిర్విరామంగా సాగుతుంది. బేరగాళ్ళకు సరుకులమ్మే పని వుంటుంది. ఆ తరువాతే నాతో మాట్లాడటానికి అవకాశం వుంటుంది. అందుచేత,*

అంతవరకూ మీరు వేచి వుండలేరు కనుక, అద్రోహకుడనే సజ్జనుడు వున్నాడు. అతని దగ్గరకు వెళ్ళండి. మీవల్ల ఒక కొంగ చనిపోయింది. మీ ధోవతి ఆకాశంలో ఆరకుండా వుంది. మీకు వీటి రహస్యం, ఆ తర్వాత తెలుస్తుందిలెండి" అన్నాడు. నరోత్తమునితో కూడా బ్రాహ్మణరూపంలో వున్న భగవంతుడు, "పదండి. అద్రోహకుని దగ్గరకు వెళదాం" అని అక్కడి నుండి అద్రోహకుడి దగ్గరకు బయలుదేరారు. మధ్యదారిలో నా వల్ల కొంగ చనిపోయిందని తులాధారుడికెట్లు తెలుసు?" అని నరోత్తముడు బ్రాహ్మణుడ్ని అడిగాడు. "క్రయవిక్రయాలతో వ్యవహరిస్తాడు. తన వ్యాపారం దైవకార్యంగా భావించి, దైవసమర్పణ భావంతో చేస్తాడు. అందుకే అతనికి త్రికాలజ్ఞానం అబ్బింది" అన్నాడు. చివరకు తులాధారుని ఇంటిలో బ్రాహ్మణుడిగా వుంటున్న భగవంతుడు విమానంలో ఎక్కి తులాధారునితో సహా, పరమపథానికి వెళ్ళిపోయారు. ఇక్కడ గ్రహించవలసింది ఏమిటంటే, మానవుడు చేసేపని ఎంత చిన్నదైనా కావచ్చు, విలువలేనిదిగా అనిపించవచ్చు. కాని, తాము చేసే పనిలో భగవచ్చింతన, స్వార్థత్యాగము, నిజాయితీ, నమ్మకము మరియు సమానమైన వ్యవహారశైలి కారణంగా ఎంతో ఉన్నతమైన పరమపదాన్ని సులభంగా పొందే అర్హత లభించింది. అందుచేత, భగవంతుడు భావప్రియుడుగానీ, బాహ్యప్రియుడు కాదని గ్రహించండి.

త్రేతాయుగంలో ఒక మహర్షి వుండేవాడు. అతడు నిరంతరం రామతారక మంత్రాన్ని జపించేవాడు. రామనామంపట్ల గొప్ప నిష్ఠ కలిగివుండేవాడు. ఒకరోజు మహర్షి ఒక యజ్ఞానికి వెళుతూ, తన శిష్యుడికి ఎవరైనా వస్తే, గౌరవించి పంపాలని చెప్పిమరీ వెళ్ళాడు. మరునాడు ఒక మహారాజు ఆశ్రమానికి వచ్చి, మహర్షి దర్శనం కోసం అడిగాడు. అప్పుడు శిష్యుడు "మహారాజా! మహర్షి యజ్ఞానికి వెళ్ళారు. ఏదైనా అవసరం వుంటే చెప్పండి. నేను చేయగలిగితే చేసిపెడతాను" అని అన్నాడు. అప్పుడు ఆ మహారాజు, "అయ్యా! నా కుమారుడు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతడు రోగవిముక్తుడు కావటానికి ఉపాయం చెప్పండి" అన్నాడు. అప్పుడు శిష్యుడు "మహారాజా! ఇంత చిన్న విషయానికి మా గురువుగారెందుకూ? నేను చెప్పగలను. మూడుసార్లు రామనామ స్మరణ చేసి, నైవేద్యం పెట్టిన తీర్థాన్ని త్రాగించండి, త్వరగా కోలుకుంటాడు" అని సలహా ఇచ్చాడు. దీంతో నయమవుతుందో లేదో అని సందేహం వ్యక్తపరిచాడు మహారాజుగారు. అప్పుడు శిష్యుడు "రామనామ రహస్యం చెబుతాను, వినండి. ఓం నమో నారాయణాయ అన్న అష్టాక్షరీ మహామంత్రంలో 'రా' బీజాక్షరం. రా అనే అక్షరం లేకపోతే నామం అర్థరహితమవుతుంది. అదే విధంగా ఓం నమశ్శివాయ అను పంచాక్షరీ మంత్రంలోని 'మ' జీజాక్షరం. ఈ రెండు మహామంత్రాల్లోని బీజాక్షరాలు రెండూ కలిపితే, 'రామ' నామమైంది. త్రేతాయుగంలో రామనామంతోనే భగవంతుడు అవతరించి, రాక్షస సంహారం చేస్తాడని మా గురువుగారు చెప్పారు. అందుచేత, నేను చెప్పినటుల చేయండి. మీ కుమారుడు ఆరోగ్యంగా వుంటాడు" అని సెలవిచ్చాడు. మహారాజు కృతజ్ఞత తెలియచేసి సెలవు తీసుకున్నాడు. మరికొన్ని రోజులకు మహర్షి ఆశ్రమానికి తిరిగి వచ్చి, తాను లేనప్పుడు ఎవరైనా వచ్చారా? అని అడిగాడు. అప్పుడు శిష్యుడు రాజు

రావడం, తన కుమారుని అనారోగ్యం గురించి చెప్పడం, తాను రామనామాన్ని మూడుమార్లు జపించి, ఆ తీర్థాన్ని కుమారుడికి ఇవ్వమనటం, రాజుగారు తిరిగి వెళ్ళిపోవడం అన్నీ వివరంగా గురువుగారికి చెప్పాడు. అప్పుడు కోపోద్రిక్తుడై మహర్షి, "ఇంత తెలివిహీనుడివి నిన్ను నా శిష్యుడని చెప్పుకోవటానికి సిగ్గుగా వుందిరా" అన్నారు. "నేను చేసిన పొరపాటేమిటి గురువుగారూ?" అని శిష్యుడు గురువుగారి పాదాలపై పడ్డాడు. అప్పుడు దయామయుడైన మహర్షి రామనామము ఒక్కసారి జపిస్తేనే సర్వపాపాలు నశిస్తాయి కదా! మరి నువ్వు మూడుసార్లు రామనామం ఎందుకు జపించమన్నావు? అది అజ్ఞానం కాదా? అందుకే నువ్వు మళ్ళీ కిరాతకుడిగా జన్మించు. రాముడ్ని సేవించి రామసేవకుడిగా రామనామ విలువ తెలుసుకో!" అని ప్రేమపూర్వకంగా శాపమిచ్చాడు. అతడే గుహునిగా త్రేతాయుగంలో పుట్టి, రామనామం స్మరించి, గంగ దాటించే ముందు శ్రీరామపాదాల్ని కడిగే సౌభాగ్యాన్ని పొంది రామభక్తుడైన నిషాదరాజుగా అదృష్టం లభించింది. అందుచేత, భగవన్నామం యొక్క విలువ గ్రహించి దైవనామస్మరణ నిత్యం చేసే అలవాటు చేసుకోండి. అలా చేస్తే, మహాభక్తులుగా తీర్చిదిద్దబడతారు. ప్రతి పనినీ దైవకార్యంగా భావించి చేయగలిగితే, భగవదనుగ్రహాన్ని పొందుతారు.

***కాకి, కోయిల రెండూ అరుస్తాయి. కానీ కాకిది గోల అంటారు, కోయిలది పాటంటారు. ఆలోచించండి ఎందుకో! బదులిచ్చే విధానంతోనే సగం ప్రపంచాన్ని గెలవవచ్చు!***

సతాం ధర్మేణ వర్తేత క్రియాం శిష్టావదాచరేత్ ।
అసంక్లేశేన లోకస్య వృత్తిం లిప్సేత వైద్విజ ॥

మానవుడు సజ్జనధర్మాన్ని పరిపాలించాలి. శిష్టులవలే కర్మలనాచరించాలి.
లోకానికి నష్టం కలిగించని రీతిలో తన జీవికను నిర్వహించుకోవడానికి ఉత్సాహపడాలి.

***న్యాయం గెలుస్తుందన్న మాట నిజమే గానీ, గెలిచిందంతా న్యాయం కాదు***
***అభ్యాసం లేని విద్య జీర్ణం కాని భోజనం వంటిది***
***మంచి-చెడు రెండూ కూడా రెండక్షరాల పదాలే***
***మంచి చేసేవారికి లోకమంతా తోడుంటుంది***
***చెడు చేసేవారికి చావు ఒక్కటే తోడుంటుంది***
***సంతృప్తిపడే వ్యక్తి ఏనాటికీ పేదవాడు కాడు***
***అలాగే అసంతృప్తి చెందే వ్యక్తి ఎన్నటికీ సంపన్నుడు కాలేడు.***
***ఒంటరులై కృంగిపోతూ, తుంటరులై రాలిపోతూ, అపనిందలను భరిస్తూ,***
***అవమానాలను సహిస్తూ, చేయని తప్పులకు జ్వలిస్తూ, కనుపించని దేవుని స్మరిస్తూ***
***కాలం గడుపుతూ, అసంతృప్తితో అసహనంతో జీవించవద్దని***
***ఆంజనేయుడు తన అతి సహజమైన ప్రేమతో హెచ్చరిస్తున్నాడు***
***తన చిన్నారి ముద్దుబిడ్డలకు!***

ఓం

**24-06-2020** 09:00 AM

**78) ప్రతి ఒక్కరూ ఆచరించవలసిన క్రియలు ఏవి స్వామీ?**

*ప్రతి గృహస్థు నిత్యజీవితంలో తమ ప్రమేయం లేకుండా చేయు దోషములను పంచశూనములు అంటారు. అనగా కత్తిపీట, సన్నెకల్లు (మిక్సీ), పొయ్యి, నీటికుండ, చీపురుకట్ట ఈ సాధనముల చేత స్త్రీలు హింస చేయుచున్నారు. ఇండ్లలో ఏ ప్రక్కనో వుండు అగ్నిని విద్యావంతులు సైతం జేబుల్లోకి ఎక్కించుకుంటున్నారు. తల్లిదండ్రుల మరణానంతరం వారి పేరుమీద శ్రాద్ధకర్మ జరుపుట కొద్దిమంది మాత్రమే చేస్తున్నారు. ఒకవేళ చేసినా శాస్త్రోక్తంగా కాక, తమ సమయానుకూలంగా పెడుతున్నారు. ఇక మనుష్యయజ్ఞం. పూర్వం ఇంటికి ఎవరైనా అభ్యాగతులు వస్తారేమో అని వేచి వుండేవారు. ఈనాడు ఉదయం 6 గంటలకే శ్రోత్రీయులు సైతం కాఫీదాసులయ్యారు. పాతరోజుల్లో ముగ్గు అనే పేరుతో నూకలపిండి కలిపి చీమలకు వేసేవారు. ఇప్పుడు రంగవల్లులు, చాక్‌పీస్, ముగ్గు స్టిక్కర్లు వేస్తున్నారు. గీతాపారాయణం, సుందరకాండ చదువుతున్నదెక్కడ? తినే పదార్థం దేవునికి అర్పించక తినవలదని, అట్లే రక్తమాంసాదులు తినకూడదని గీత చెబుతున్నది. ఒకవేళ హింస చేయవలయునన్న ఉద్దేశ్యంతో కాక, అమితమైన ఆకలిచే బాధపడుచున్నప్పుడు హింస చేసి తిన్నా క్షమిస్తానన్నాడు భగవంతుడు. కానీ, అందుకు భిన్నంగా రోజుకో హింస జరుగుతూనే వుంది. వజ్రాలు ఇచ్చి వంకాయలు కొన్నట్లు, ఈనాడు ఆయుష్షు, ఆరోగ్యము ఇచ్చి మానవులు ఆశలను తీర్చుకుంటున్నారు. ఆశల వలన మొదట మానసికంగానూ, తర్వాత శారీరకంగానూ బలహీనపడుతున్నారు. ఆశలు అదుపు చేసుకుంటే, ఆనందం వున్నది. ఆనందానికి మించిన ఆయుష్షు లేదు. ప్రతివారు తప్పనిసరిగా నిర్వర్తించవలసినవి ఐదు రకాల యజ్ఞాలు. అవి బ్రహ్మయజ్ఞం, పితృయజ్ఞం, దేవయజ్ఞం, భూత, మనుష్య యజ్ఞాలు. బ్రహ్మయజ్ఞమంటే, వేదాధ్యయనం, గీతాధ్యయనం చేయుట, రామాయణ భారత భాగవత భగవద్గీతలు చదువుతున్నట్లయితే బ్రహ్మయజ్ఞం క్రిందకు వస్తుంది. ఋషియజ్ఞమంటే కూడా ఇదే. మీ తల్లిదండ్రులు, తాతముత్తాలు, మీ పితృదేవతలు సదా పూజనీయులు. తల్లిదండ్రులు మరణిస్తే ఆ తిథిని గుర్తుపెట్టుకొని ఆబ్దీకం జరిపి బంధుమిత్రాదులకు భోజనం పెట్టడం వలన వారి ఆత్మలు తృప్తిచెందుతాయి. ఇది పితృయజ్ఞం. దేవయజ్ఞమనగా నిత్యాగ్నిహోత్రము చేయుట, హోమగుండాన్ని నిర్మించి అరణను మథించి మంత్రపూర్వకంగా హవిస్సులు పేర్చటం అందరికీ అందుబాటులో ఉండదు. దాని బదులుగా నిత్యం దేవునికి పూజచేసి, హారతి ఇవ్వడం వల్ల దేవతలు తృప్తి చెందుతారు. ఇది దేవయజ్ఞం. భూమి మీద అసంఖ్యాకమైన పశు పక్షి క్రిమి కీటకాలు అనేక జీవరాసులున్నాయి. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మీ మనుగడకు ఉపయోగపడుతున్నాయి. పంచయజ్ఞాలంటే క్లిష్టమైనవి అనుకుంటారు కానీ, అవి ఆచరించడం సులభం. ఆచరించినందువల్ల ఆయాదేవతలు సంతోషపడి కుటుంబానికి, సమాజానికి శ్రేయస్సును అందిస్తారు. అయితే, ఫలాపేక్షరహితుడై చేయవలెను. మూర్ఖులు ఐదు లక్షణాలను కలిగివుంటారని నేను చెబుతాను. అవి ఏమిటంటే, గర్వంతో విర్రవీగటం, నోరు విప్పితే చాలు చెత్తమాటలు, ప్రతిదానికీ కోపం తెచ్చుకోవటం, పిడివాదం, ఎదుటివారు*

*చెప్పేది వినకపోవటం, కొందరు జీవితం అనుకూలించనప్పుడు మాత్రమే దైవాన్ని ఆశ్రయించే ప్రయత్నం చేస్తారు. కానీ, భక్తి అంటే సమర్పణ, శరణాగతి, వినయం. దైవాన్ని సగుణంగానూ, నిర్గుణంగానూ ఉపాసించడం, వేదాలు శాస్త్రాలు పురాణాలు ఎంత అధ్యయనం చేసినా, సన్యాసం స్వీకరించినా భగవంతుడ్ని పొందటానికి భక్తిభావనే బలీయమైన సాధన. మీరు కారులో మద్రాసు బయలుదేరారనుకోండి, కొంతసేపటికి మద్రాసు వచ్చిందంటారు. అయితే మద్రాసు మీ దగ్గరకు వచ్చిందా? లేక మీరు మద్రాసు దగ్గరకు వచ్చారా? మీరే మద్రాసు దగ్గరకు వచ్చారు. మద్రాసు ఉన్నచోటునే వుంది. అదే విధంగా దైవం మీకు సమీపంగా వచ్చాడని భావించండి. దూరమవుతున్నాడని భావించడం పొరపాటు. దైవం మీకు దూరమవ్వటం లేదు, దగ్గరవ్వటం లేదు. ఎప్పుడూ మీ వెంటనే ఉంటున్నాడు. ఈ సత్యాన్ని మీరు సంపూర్ణంగా విశ్వసించాలి. కానీ, అటువంటి సద్భావనలు క్షణక్షణానికీ తగ్గిపోతున్నాయి. మీరు భగవంతుడంటే భయంభయంగా ఉండటంవల్ల ప్రయోజనం లేదు. భగవానుని మీ పాతస్నేహితునిగా భావించి స్వేచ్ఛగా మెలగాలి. మీలో పాపభీతి వుండాలి కాని, దైవభీతి వుండకూడదు. వాల్మీకి వంశమేమిటి? నందుడి కులమేది? ఈ ఆంజనేయుని జాతి ఏమిటి? కుచేలుని ధనమెంత? గజరాజు విద్య ఏమిటి? ధ్రువుని వయసెంత? శబరి శక్తి ఏమిటి? విదురుడు ఎంత దానం చేశాడు? తిమ్మన తెలివి ఏమిటి? వీరంతా హృదయపరిశుద్ధత వలననే భగవంతుని సన్నిధికి చేరగలిగారు. ఈరోజు మీరు నా సాన్నిధ్యంలో కూర్చుని వినగలుగుతున్నారు ఆంజనేయుని వాణిని. ఇది తక్కువగా అంచనా వేయకండి. అద్భుతమైన, ఆనందమైన, అనుభవేకవైద్యమైన, అఖండ జ్ఞానసంపన్నమైన సద్గురువు సన్నిధిలో జీవితాన్ని మలచుకుని, మలుపు మలుపులో అమృతాన్ని నింపుకొని ఆంజనేయుని మదిని దోచుకోండి. నా సాన్నిధ్యంలో మీరు పొందాలి ఈ భావన!*

*నీ మందహాసాన ఏ మహిమ వున్నదో, నా పాషాణ హృదయంబు పరవశించు*
*నీ హస్తస్పర్శలో ఏ చలువ వున్నదో, తనువు పులకరించి ధన్యమగును*
*నీ పాదయుగళిలో ఏ మహిమ వున్నదో, ఆత్మతత్త్వంబు మాకు అర్థమగును*

*నీ హృదిలో స్థానమేర్పర్చుకున్న మీ బిడ్డలుగా తీరాన్ని దరిచేరాము ఆంజనేయుని అఖండ దయతో.*
*మీ సంయోగములో ఉన్నది జన్మరహస్యము. అదియే మా జీవితాలకు జన్మరాహిత్యము.*

**యది సప్తం సేవతి యద్య సన్తం తపస్వినం యది వాస్తనమేవ ।**
**వాసో యథా రంగవశం ప్రయాతి తథా సతేషాం వశమభ్యుపైతి ॥**

*ఏ రంగున ముంచబడిన వస్త్రము ఆ రంగును పొందునట్లుగా, సత్పురుషుడు, దుష్టుడు, తపస్వి లేక దొంగ వీరిలో ఎవరి సాహచర్యమున గడుపునో, వారి గుణములే వారికి అబ్బును.*

***సమస్యంటే ఆవకాశం.***
***యోచిస్తే సానుకూలమయ్యే విషయం, గడ్డు సమస్యకు పరిష్కారం,***
***అసామాన్యుని అసహనం ఆత్మహత్యతో సమానమని చెబుతాను వీటిని***
***తామరాకుపై నీటిబిందువు***

***మీరు నేర్చుకున్న విజ్ఞానం అదే నేర్పిందా? గుండె నిండా నిండివుండే అధైర్యం?***
***మార్గాలను అన్వేషిస్తే దొరికేను సిసలైన సజీవన పరిష్కారం***
***భక్తుడిగా కెరీర్, సాధకుడిగా సాధనాపరుడివై నీకు నువ్వే గైడ్‌గా***
***పిడికిట రాయి పట్టి, రేపటి రూపు వుండకుండా సూర్యునిపై విసిరినట్లుగా,***
***మహాకల్పవృక్షాన్ని చెదపురుగులు నిశ్శబ్దంగా తొలచి కూల్చినట్లుగా,***
***తలక్రిందుల తలగడకు మల్లే ఘోషించే ఉప్పు సముద్రం చేరినట్లుగా***
***బ్రహ్మజెముడు మెదడున మొలచి మొదలంటా తెగ కొరికేసినట్లుగా***
***నీ చావుతో ముగియదు చూడు చూడు భూగోళం చుట్టూ కొరకరాని కొయ్యలు***
***పలు సమస్యలెన్నో అమరిన ఈ మానవజన్మకు పునర్జన్మ***
***పిల్లో, ఎలుకో, కుక్కో, పందో.***
***ఉన్నది ఒకటే - అదే ప్రాణయోగం***
***పిచ్చివాడి చేతిలో రాయి పరాయిగా సానుకూల సామాజిక దృక్పథముండదు***
***పరితపించు రోదశ శోభిత వేదన వీడు***
***వాస్తవికతకు పట్టం కడితే అర్థం***
***అల్పమైనవి కోరుకోవటమే అజ్ఞానం***
***అధికమైనవి పొందటమే విజ్ఞానం***
***అందుకు ఆధ్యాత్మికతే శరణ్యం***
***అదే అదే అంతర్ముఖ ప్రయాణం***
***ఆంజనేయుని అండలో చేరటం***
***తెలుసుకోండి నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

*చదువుతో జ్ఞానం, సాధనతో నైపుణ్యం, సత్ప్రవర్తనతో సంస్కారం లభిస్తాయి.*

ॐ

**25-06-2020** 09:10 AM

**79)** సృష్టి రహస్యం ఏమిటి స్వామీ?

*నరుడు నారాయణుడయ్యేది జ్ఞానంతోనే. ఇట్టి జ్ఞానమహిమను సృష్టిని గురించి చెప్పబోతున్నాను. గుణాల గురించి చెప్పబోయే ముందు ఆ గుణాల యొక్క వంశవృక్షాన్ని తెలుసుకోవాలి. కనుక, వాటి పుట్టుపూర్వోత్తరాలను తెలుసుకొనుటకు వీలుగా సృష్టి రహస్యాలను తెలియచెబుతాను. ఈ సృష్టిలో ఏదైనా ఒక ప్రాణి పుట్టుక జరగాలంటే, తల్లియోని, తండ్రిబీజం రెండూ వుండాలి. ఈ రెండింటి కలయికతోనే శిశువు జననం. ఈ విషయం తెలియనిది ఎవరికి? అందరికీ తెలిసినదే. ఇది రహస్యమెలా అవుతుంది? మరి, తల్లిదండ్రుల కారణంగా ఒక శరీరం, అవయవాలు వస్తున్నాయి. అంతేనా? పుట్టిన*

వారందరికీ మనోబుద్ధులు కూడా వుంటాయి. వాటిల్లో అనేక తేడాలుంటాయి. ఒక్కొక్కరూ ఒక్కొక్క విధంగా ప్రవర్తిస్తూ వుంటారు. ఒక్కొక్కరిదీ ఒక్కొక్క స్వభావం. అలా వుండటానికి కారణం వారివారి గుణాలలోని భేదాలే. ఈ గుణాలు ఎక్కడి నుండి వస్తున్నాయి? వీటిని కూడా తల్లిదండ్రులే సృష్టిస్తున్నారా? లేదు. ఇవి వాసనల కారణంగా వచ్చినవి. ఈ వాసనలెక్కడివి? పూర్వంలో ఆయా జీవుళ్ళు చేసిన ఆలోచనలు, కోరిన కోరికలు, భావాల నుండి వచ్చినవి. ఇవే వాసనలు. ఈ వాసనలతో కూడిన దానినే కారణశరీరం అంటారు. అంటే పైకి కన్పించే స్థూలశరీరం, వేరువేరు మనోబుద్ధులతో కూడిన సూక్ష్మశరీరం, దీనికి కారణమైన వాసనలతో కూడిన కారణశరీరం – ఈ మూడు శరీరాలతో కూడిన వానినే జీవుడు అంటారు. మరి ఈ మూడు శరీరాలు తల్లిదండ్రుల కలయిక కారణంగానే వస్తున్నాయా? అంటే కాదు అనే చెప్పాలి. అందుకే మానవులు అంటూవుంటారు, "మనం బిడ్డలను కనగలం గానీ, వారి తలరాతల్ని కంటామా?" అని. అంటే స్థూలశరీరం మాత్రమే తల్లిదండ్రుల కలయిక ద్వారా వస్తున్నది. సూక్ష్మ–కారణ శరీరాలు మాత్రం మరేదో కారణంవల్ల వస్తున్నాయి. దానినే ఇక్కడ చెబుతున్నాను. "ఈ సర్వానికీ జన్మస్థానం 'మహత్ బ్రహ్మ' అని చెప్పబడే నా యోని. అందులో నేను బీజాన్ని వుంచుతున్నాను. దాని వల్లనే సర్వభూతాలు జనిస్తున్నాయి" అని భగవానుడంటున్నాడు. నా యోని అంటున్నాడు కనుక యోని (ప్రకృతి) భగవంతుని ఆధీనంలో వుంటుంది. ఇక మహత్‌బ్రహ్మ అంటే చాలా గొప్పది, పెద్దది, బృహత్తరమైనది, ఎక్కువగా ఎదిగేది అని అర్థం. భగవంతుని వ్యష్టి వాసనలు ఎదిగి వ్యక్తిగా, అతడు చూచే ప్రపంచంగా మారుతాయి. సమిష్టి వాసనలు ఎదిగి మొత్తం ప్రాణులుగా, అవి చూచే ప్రపంచంగా మారుతాయి. అందుకే మహత్‌బ్రహ్మగా చెబుతాను. ఇక అన్ని జీవరాశుల సృష్టికీ యోనిస్థానమైన ఈ ప్రకృతి, ఎలా భగవంతుని ఆధీనంలో ఉన్నదని చెప్పటం? ప్రళయకాలంలో స్థూలశరీరాలన్నీ నశించిపోతాయి. ఇక మిగిలిన సూక్ష్మశరీరాలు, కారణశరీరాలు అన్నీ కలిసి అంతటా ఉన్న నిరాకార, నిర్గుణ, సూక్ష్మాతిసూక్ష్మ, సర్వవ్యాపక చైతన్యమైన భగవంతునిలో వుండిపోతాయి. అలా సమిష్టి కారణశరీరం అనే ప్రకృతి, మాయ, యోని భగవంతుని ఆధీనంలో వుంటుంది. ఇదే మమయోని అని భగవంతునిచే చెప్పబడింది. అందులో ఆయన బీజాన్ని వుంచుతాడు. బీజాన్ని వుంచడమంటే ఏమిటి? సృష్టి ప్రారంభంలో "కోకోహం బహుస్యాం ప్రజాయేమ్". ఒక్కటిగా వున్న నేను, అనేకంగా అవుతాను అని సంకల్పం చేయడమే బీజాన్నుంచడం. అంటే భగవంతుని చైతన్యం సమిష్టి కారణశరీరమైన యోనిలో ప్రకృతిలో ప్రసరిస్తుందన్న మాట. అప్పుడా ప్రకృతి పరవశిస్తుంది, పులకిస్తుంది. ఇలా సమిష్టి కారణశరీరం అనే యోనిలో పరమాత్మ బీజం పడగానే, సమిష్టి సూక్ష్మశరీరాభిమాని హిరణ్యగర్భుడు అంటే చతుర్ముఖబ్రహ్మ జన్మిస్తాడు. అతడే సృష్టికార్యాన్ని నెరవేర్చే, నిర్వర్తించే సృష్టికర్త. కనుక, బ్రహ్మదేవుడు స్థూలశరీరంలో వుండేవాడు కాదు. ఇప్పుడా బ్రహ్మ, ఒక్కొక్క వ్యష్టి వాసనకు అనుగుణంగా వ్యష్టి సూక్ష్మశరీరంతో జీవుడ్ని తయారుచేస్తాడు. ఈ జీవుడు పురుషుని వీర్యకణం ద్వారా స్త్రీగర్భంలో ప్రవేశించి, అండంతో కలిసి పిండంగా ఏర్పడుతాడు. ఆ పిండం తల్లిగర్భంలో 9 నెలలపాటు పెరిగి, అన్ని అవయవాలతో కూడిన స్థూలశరీరంతో జన్మిస్తాడు. ఇలా వేరువేరు కారణ, సూక్ష్మశరీరాలతో కూడిన జీవుళ్ళు, వేరువేరు చోట్ల తగిన స్థూలశరీరాలతో తల్లిగర్భాల నుండి జన్మిస్తారు. కనుక, సమస్త జీవులయొక్క సమిష్టికారణశరీరమే

యోని. భగవంతుడు సృష్టి చేయాలని సంకల్పించడమే యోనియందు వుంచుట. ఈ కారణంగా మొదట జన్మించిన జీవుడే, హిరణ్యగర్భుడు. ఆ పదవికి తగిన అర్హతలు గల అదృష్టవంతుడే అలా సృష్టికర్తగా జన్మిస్తాడు. ఆ బ్రహ్మయే ఇతర జీవుళ్ళకు తగిన స్థూలశరీరాలను సమకూర్చడానికి వారిని పురష వీర్యకణాలలో ప్రవేశపెడ్తాడు. దానితో, మూడు శరీరాలతో కూడిన ప్రాణికోటి తల్లిగర్భము నుండి ఉద్భవించడం జరుగుతుంది. ఇలా సమస్త ప్రాణికోటి అవ్యక్తం నుండి వ్యక్తానికి రావడం జరుగుతుంది. సర్వయోనుల నుండి జన్మించే అన్ని ప్రాణులకు తల్లి ప్రకృతి, తండ్రి పరమాత్మ అయితే, ఇక్కడి తల్లిదండ్రులెవరు? ఈ లోకంలో మానవులే గాక, పశువులు, పక్షులు, మృగాలు, సర్పాలు, క్రిమికీటకాలు ఇలా ఎన్నో విధాలైన ప్రాణులున్నాయి. ఇవ్వన్నీ ఎలా పుడుతున్నాయి? వాటి వాటి తల్లిదండ్రుల కలయిక ద్వారా పుడుతున్నాయి. మరి అందరూ వారివారి తల్లిదండ్రుల కలయిక ద్వారా పుడుతున్నట్లు మీకు తెలుస్తూ వుంటే, ఇక్కడ ఈయనేమో అందరికీ తల్లి ప్రకృతి అని, తండ్రి భగవంతుడని అంటున్నాడే? ఇంతకూ తల్లీ, తండ్రీ వేరువేరుగా మీకు తెలిసినవారా? లేక, అందరికీ తల్లి, తండ్రి మూకుమ్మడిగా ప్రకృతి, పరమాత్మా? పురుషుని నుండి వీర్యకణాలు స్త్రీగర్భంలో ప్రవేశించినప్పుడు, అందులో ఏదో ఒక్క వీర్యకణం మాత్రమే స్త్రీగర్భంలోని అండాన్ని తలచుకొని అండంతో కలిసి పిండంగా మారుతుంది. ఆ తర్వాత క్రమక్రమంగా శిశువుగా ఎదిగి, స్త్రీగర్భం నుండి బయటపడుతుంది. అంటే, స్త్రీ గర్భవతి కావాలంటే, ఒక వీర్యకణానికి అండాన్ని తొలచుకొని లోపలికి ప్రవేశించే శక్తి కావాలి. ఆ శక్తి ఒక్క వీర్యకణానికి మాత్రమే ఎక్కడి నుండి వస్తుంది? ఆ దంపతులకు పుట్టి, తన కర్మఫలాలకు తగిన సుఖదుఃఖాలను అనుభవించవలసిన జీవుడు ఆ వీర్యకణం లోనికి ప్రవేశించాలి. అలా ప్రవేశించటానికి పరమాత్మ సంకల్పమే కారణం. ఏ తల్లిదండ్రులకు ఏ జీవుడు జన్మించాలో, ఆ ఏర్పాటును భగవంతుడే చేస్తాడు. అందుకే భగవంతుడ్ని బీజప్రదాత అంటారు. అంటే తండ్రి అని అర్థం. దీనినిబట్టి, జీవుడి యొక్క సూక్ష్మ, కారణ శరీరాలు మహత్‌బ్రహ్మ అనబడే తల్లి నుండి, పరమాత్మ చైతన్యం అనే తండ్రి నుండి వస్తుంటే, స్థూలశరీరం మాత్రం ఇక్కడి భౌతిక తల్లిదండ్రుల నుండి వస్తుంది. అంటే, జీవుని యొక్క స్థూలశరీరానికి తల్లిదండ్రులు ఇక్కడి తల్లిదండ్రులైతే, జీవుని యొక్క సూక్ష్మ, కారణ శరీరాలకు తల్లిదండ్రులు ప్రకృతి, పరమాత్మలే. ఇంకా చెప్పాలంటే, ప్రకృతిలో ప్రతిఫలించిన పరమాత్మ, ఆ ప్రకృతి గుణాలచే కట్టివేయబడి జీవుడై, ఆ జీవుడే ఇక్కడి తల్లిదండ్రుల ద్వారా స్థూలశరీరంతో వ్యక్తమవుతున్నాడు. కనుక, ఈ తల్లిదండ్రులు నిమిత్తమాత్రులే. ఎప్పుడు కావాలంటే అప్పుడు బిడ్డను పుట్టించే శక్తి వీరికి లేనేలేదు. దీనిని బట్టి, ఆలోచనలు, మనోబుద్ధులు, సుఖదుఃఖాలు ఇవ్వన్నీ భౌతిక తల్లిదండ్రుల వల్ల వచ్చినవి కావు, వారివారి ప్రకృతి (వాసనలను) బట్టి వచ్చినవే. దేహం కొద్దికాలం వుండిపోయేది. అది కేవలం పరికరం లాంటిది. పరికరాన్ని ఉపయోగించే తెలివితేటలు మనోబుద్ధులవి. ఒక వ్యక్తి జీవితాన్ని చదివినప్పుడు, "ఆహా! ఎంత గొప్ప కలం వ్రాసిందో ఈ కవిత్వాన్ని" అని ఆశ్చర్యపోరు. "ఆహా! ఈ కవిత్వాన్ని వ్రాసిన కవి ఎంత గొప్పవాడో!" అంటారు. కలం ఒక పరికరం మాత్రమే. గొప్పదనమంతా వ్రాసిన వాడిదే. కనుక, సూక్ష్మ-కారణ శరీరాలకు తల్లిదండ్రులైన ప్రకృతి-పరమాత్మలే మీ అందరి తల్లిదండ్రులు. మీరందరూ సోదరులే. మంచి-చెడ్డ జన్మలకు కారణం గుణాలతో సంగభావమే.

***సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ న బ్రూయాత్ సత్యమప్రియం ।***
***ప్రియం చ నానృతం బ్రూయాత్ ఏష ధర్మ స్సనాతనః ॥***

సత్యమును పలుకవలెను. ప్రియమైన దానిని చెప్పవలెను. సత్యమైననూ, అప్రియంగా చెప్పరాదు. ప్రియముగదా అని అసత్యమైనచో చెప్పరాదు. ఇది సనాతనమైన ధర్మము.

ఒక పనిలో పూర్తిగా నిమగ్నమైతే,
ఎన్నో అనవసరపు ఆలోచనలకు దూరమవుతారు

***ఉప్పెనలాంటి కవిత్వంతో ఉగ్రూతలూగించి***
***కవిత నీరాజనాలర్పించిన మానవతావాదులై***
***సమానత్వం కాంక్షించిన మేరుపర్వతమై***
***పదాల పదునుతో, విజ్ఞాన ఫిరంగులు మ్రోగించి***
***ముత్యాలసరం కూర్చిన అపర మేధావులై***
***సాధనకు దశదిశలను నిర్దేశం చేసుకుని, సాధనోన్ముఖులై***
***భువన భవన బావుటాలై, ఆకాశమార్గంలో విహరించి***
***ఆంజనేయుని చేతిలో ఇమిడిపోయి***
***ఆయన పదబంధాలు మీకు పంచప్రాణాలై***
***ఈ ఆంజనేయుని పదాలే మీకు సందేశమై***
***స్ఫూర్తిదాయకమై, సాధనా జగమే నీదై నీదై***
***నీ హృది రణరంగమై, విజయపతాకాన్ని ఎగురవేయుటకై***
***వీరాంజనేయుని బాహువులలో చిక్కి***
***అనితరసాధ్యమైన ఆత్మతత్త్వాన్ని ఆవులించినంత సులభంగా అందుకోండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**26-06-2020** 09:25 AM

**80) గుణాలు జీవుడ్ని ఏ విధంగా బంధిస్తాయి స్వామీ?**

*సత్త్వం, రజస్సు, తమస్సు అనే గుణాలు ప్రకృతి నుండి పుట్టినవి. అవి అవ్యయమైన దేహిని (జీవుడ్ని) దేహంలో బంధిస్తున్నాయి. సమిష్టి వాసనలతో (ప్రకృతి) ఉండే పరమాత్మకు ఏ భ్రాంతికానీ, బంధంగానీ లేవు. వ్యక్తిగా పుట్టిన జీవుడికే అన్ని భ్రమలు, బంధాలు ఎలా కలుగుతున్నాయి? గుణాల వల్లనే. ఏమిటా గుణాలు అంటారా? సత్త్వం, రజః, తమః ఇతి గుణాః. గుణాలు 3. అవి సత్త్వగుణం, రజోగుణం, తమోగుణం. వీటిని గుర్తించడం ఎలా? సత్త్వగుణం తేజస్సు, ప్రకాశంతో*

గుర్తించవచ్చు–తెలుపురంగు. రజోగుణం దుమ్ము, ధూళి, మలినంతో గుర్తించాలి–ఎరుపురంగు. తమోగుణం చీకటి, అజ్ఞానంతో గుర్తించవచ్చు–నలుపురంగు. ఈ మూడు గుణాలు ఎక్కడి నుండి వచ్చాయి? వాటి జన్మస్థానం ఏది? ఇవి ప్రకృతి నుండి పుట్టినవి. అంటే కారణశరీరంలోనే ఈ గుణాలుంటాయి. ప్రకృతిలో ఆత్మ ప్రతిఫలించగానే, ఈ గుణాలు ఆత్మను బంధించివేస్తున్నాయి. ఎక్కడ? అవ్యయమైన దేహిని (ప్రకృతిలో ప్రతిఫలించిన ఆత్మను) దేహంతో శరీరంలో బంధించివేస్తున్నాయి. బంధించడమంటే ఏమిటి? జీవుడు వేరు, దేహం వేరు. అయినా ఆ వివేకాన్ని మరుగుపరచి, దేహంతో తాదాత్మ్యం కలిగించుటే బంధంలో పడవేయుట. దేహంలో బందీయైన జీవుడ్ని తమ వికారాలతో ఆకర్షించి, తన నిజస్వరూపాన్ని మరిచేటట్లు చేసి, సుఖదుఃఖ మోహాలలో ముంచివేస్తుంటాయి. నేను ఆత్మను, పరమాత్మను, ఆనందస్వరూపుడను, జ్ఞానస్వరూపుడను, శాశ్వితుడను అనే సత్యాలను మరచిపోయి, మోహంలో అజ్ఞానంలో పడిపోయి, ఈ దేహమే నేను అనే అభిమానంతో తాదాత్మ్యంతో సుఖదుఃఖాలు అనుభవిస్తున్నాను, అజ్ఞానంలో వున్నాను, పరిమితుడ్ని అనే భావంలో ఉండిపోతున్నాడు. దీనికంతటికీ కారణం మూడు గుణాలే. కనుక, ఈ మూడు గుణాలే జీవుడ్ని దేహంలో బంధించివేస్తున్నాయి. ఇక్కడ మీకు ఒక సందేహం కలగవచ్చు. ఈ క్షేత్రంలోని క్షేత్రజ్ఞుని గురించి చెబుతూ, క్షేత్రజ్ఞుడు ఈ శరీరంలో వుండి కూడా దేనినీ అంటడు అని చెప్పి, ఇక్కడ క్షేత్రజ్ఞుడు శరీరంలో బంధించబడి గుణాల వికారాలకు లొంగి సుఖదుఃఖాలు అనుభవిస్తాడు అని చెబుతున్నారు. ఇందులో ఏది నిజం? అని మీరడిగినట్లయితే, రెండూ నిజమే అంటాను. స్వరూపతః అంటే, ఉన్నది ఉన్నట్లుగా చూచే దృష్ట్యా, క్షేత్రజ్ఞుడు నిర్వికారుడు. అయినా మాయా ప్రభావంతో దేహంలో బంధింపబడి, దేహంతో తాదాత్మ్యం చెంది, నేను, నాది అంటూ అభిమానానికి లోనై, జననమరణరూప సంసారానికి బద్ధుడైపోతున్నాడు. దీనిని చిన్న ఉపమానంతో పరిశీలించండి. చిలుకను పట్టుకోవటానికి వేటగాడు ఒక గిలకను తయారుచేస్తాడు. దానినొక చెట్టుమీద ఉంచుతాడు. దానిపై తినుబండారాలు పెడతాడు. ఆ తినుబండారాలకు ఆశపడి, చిలుక వచ్చి ఆ గిలక మీద కూర్చుంటుంది. ఆ చిలుక బరువుకు గిలక గిర్రున తిరగటం ప్రారంభిస్తుంది. ఆ వేగానికి బుద్ధిలేని ఆ చిలుక పడిపోతాననే భయంతో ఆ గిలకను కరచిపట్టుకుంటుంది. దానితో వేటగాడు ఆ చిలుకను పట్టుకుంటాడు. గిలక తిరగటానికి కారణం చిలుక బరువే. తనకు ఎగిరిపోయేందుకు రెక్కలున్నాయి గదా! కానీ, భయంతో దాని బుద్ధి అప్పుడు పనిచేయదు. అంటే, అజ్ఞానబంధంలో పడిపోయి, వేటగానికి చిక్కిందన్నమాట. జీవుడి విషయం కూడా అంతే. గుణాలు జడం – తాను చైతన్యం. జడమైనవి చైతన్యపురుషుని ఆధీనంలో వుంటాయి. కనుక, అవెలా బంధించగలవు? ఈమాత్రం జ్ఞానం లేక, జడమైన గుణాలకు లొంగిపోయి, ఈ జీవుడు సంసారబంధంలో చిక్కుకుంటున్నాడు. ఇదంతా స్వయంకృతాపరాధమే. నిజంగా క్షేత్రజ్ఞుడైన పురుషుడికి ఎప్పుడూ ఎలాంటి వికారాలు అంటవు. కానీ, అధ్యాసతో, భ్రమతో, మోహంతో, అజ్ఞానంతో, వికారాలతో కూడినట్లుగా కన్పిస్తాడు. అలా కన్పించటమే గానీ, నిజం కాదు. బకెట్‌లోని నీరు కదులుతుంటే అందులోని సూర్యబింబం కదులుతున్నట్లు, మేఘాలు కదులుతుంటే చంద్రుడు కదులుతున్నట్లు, రైలు ముందుకు వెళుతుంటే ప్రక్కనున్న చెట్లు వెనుకకు పరిగెత్తుతున్నట్లు కనిపించినప్పటికీ, అవేవీ నిజం కావు. అలాగే, క్షేత్రజ్ఞునికి ఈ గుణాలతో సంబంధం

లేదు. ఆ సంబంధం కూడా మాయయే, భ్రమయే. నిజం కాదు. గీతలో కృష్ణుడు చాలా తెలివిగా సంబోధించి చెబుతాడు ఇది. అర్జునునికి మాత్రమే కాదు, సమస్త సృష్టిని సంబోధించి ఇలా చెబుతాడు. "నీవు గొప్ప బాహువులు గలవాడవు. ఇది నీకు శుభచిహ్నం. నీ భుజాలతో, భుజబలంతో బందీలను విడిపించగలవు. ఇప్పుడు నీ దేహమనే బంధిఖానాలో బందీయైన దేహిని (ఆత్మను) బంధవిముక్తిని గావించు. గుణాలను జయించి, ఆత్మను ఉద్ధరించగల పరాక్రమశాలివి. నీకే గాదు, మానవులందరికీ ఆ హక్కు వున్నది" అని ఒక విధంగానూ. మరొక విధంగా, "నీ భుజాలను చూచుకొని మురిసిపోతుంటావు గదా! అజేయులైన శత్రువులనెందరినో జయించావు గదా! ఏదీ చూద్దాం, ఈ గుణాల పట్టు నుండి విడిపించుకో!" అని వ్యంగ్యంగా అని, ఛాలెంజ్ చేస్తాడు. మరి ఈ ఆంజనేయుడు కూడా అదే ఛాలెంజ్ చేస్తున్నాడు.

జీవుడు వీడిన దేహంబు అగ్నిపాలు
ఎదను కప్పిన వస్త్రంబు కాటిపాలు
కొడుకు వేసిన పిండంబు కాకిపాలు
నీవు చేసుకున్న పుణ్యంబు నీపాలు
పొల్లుపోకుండా విని ఆచరించినది ఆంజనేయుడు నీకిచ్చు పాలు

**యస్త్వయా సహ స స్వర్గః నిరయో యస్త్వయా వినా ।**
**ఇతి జానన్పరాం ప్రీతిం గచ్ఛ రామ మయా సహ ॥**

నీతో గూడా వుండుటయే నాకు స్వర్గము. నిన్ను విడిచి వుండుటయే నాకు నరకము.
కావున, నా ప్రేమను తెలుసుకుని నన్ను కూడా నీతో తీసికొనిపొమ్ము
(సీతాదేవి రామునితో అన్నమాట)

***గురువుకు దండం పెట్టండి***
***గురుపాదాల వద్ద తల వంచండి***
***గురువే నీ ప్రాణము గురువే మీ దైవము***
***గురువు నరుడు కాదు, ఈశ్వరుడని తెలుసుకోండి***
***గురుతెరిగి నడిచినచో, గుణవంతుడవు నీవే***
***జననమరణ బంధము నుండి నిన్ను విడిపించేది గురువురా***
***పరమాత్ముని చరణములను అందించేది గురువురా***
***ప్రభువుగా అహంబ్రహ్మ, అయమాత్మాబ్రహ్మ తెలిపినవారే సద్గురువురా***
***నిర్మలహృదయులు, నిత్యసాధకులుగా మీరు మారవలెనురా***
***గురు నిర్దేశించిన దిశానిర్దేశంతో***
***గురుముఖతః వడ్డించిన జ్ఞానంతో***
***ఈ అందమైన జీవితాన్ని మలచుకుని***

**సుజ్ఞానులై, సజ్జనులై, సత్‌ప్రవర్తనాపరులై దరిచేరండి**
**నా చిన్నారి ముద్దుబిడ్డలారా!**

**ఓం**

**27-06-2020** 09:05 AM

**81) సత్త్వగుణ స్వభావమెట్టిది స్వామీ?**

*మూడు గుణాలలోనూ సత్త్వగుణం నిర్మలమైనది కనుక ప్రకాశవంతంగ, స్వచ్ఛంగా వుంటుంది. ఇంద్రియ సుఖాలతోనూ, జ్ఞానంతోనూ ముడిపెట్టి జీవుడ్ని బంధిస్తుంది. ప్రకృతి నుండి పుట్టిన గుణాలు అవ్యయుడైన పరమాత్మను దేహంలో బంధిస్తున్నాయి. దీనిని బట్టి పరమాత్మ ఎక్కడో లేడని, ఈ దేహంలోనే ఉన్నాడని అర్థమవుతుంది. కనుక, పరమాత్మను ఈ దేహంలోనే వెదకాలి. ఈ దేహంలోనే సాక్షాత్కరింపచేసుకోవాలి. ఆయన "నేనే" అని గ్రహించి అనుభూతి చెందాలి. ఆయన ఈ దేహంలోనే ఉన్నా, మూడు గుణాలు బంధించివేస్తున్నాయి. ఇందులో సత్త్వగుణం తెల్లని గాజు చిమ్నీ లాంటిది. రజోగుణం ఎర్రని రంగుగల గాజు చిమ్నీ వంటిది. తమోగుణం బాగా పొగబారి నల్లని మసితో కూడిన గాజు చిమ్నీ వంటిది. దీపం చుట్టూ నల్లని పొగబారిన చిమ్నీ ఉంటే, ఆ దీపం యొక్క కాంతి అసలు కన్పించదు. ఎర్రని గాజు చిమ్నీ ఉన్నప్పుడు, రంగుమారి, కాంతి తగ్గి కన్పిస్తుంది. అదే తెల్లని నిర్మలమైన గాజు చిమ్నీ అయితే, కాంతి స్పష్టంగా కన్పిస్తుంది. అయినా సరే, ఉన్నది ఉన్నట్లు కన్పించదు. ఇప్పుడు సత్త్వగుణం నిర్మలమైనది గనుక, స్వచ్ఛమైన గాజు చిమ్నీ లాంటిది గనుక ప్రకాశాన్ని కలుగచేసేది, దుఃఖాలు, ఉపద్రవాలు లేకుండా చేసేది. ఏదైనా ఒక వస్తువును మీరు గుర్తించాలంటే, ఆ వస్తువును వర్ణించి చెబితే గుర్తించగలరు. ఏదైనా జబ్బును గుర్తించాలన్నా, ఆ జబ్బు వల్ల కలిగే మార్పులను, ఆ లక్షణాలను విశ్లేషించి చూసి, డాక్టరు ఆ జబ్బు ఏమిటో నిర్ధారణ చేస్తాడు. అలాగే, మనసును బంధించే గుణం ఏదో తెలుసుకోవాలంటే, ఆ గుణం వల్ల మీ మనసులో కలిగే ఆలోచనలను బట్టి ఆ గుణం ఏదో, ఎలాంటిదో తెలుసుకుంటారు. కనుక మీ ఆలోచనలనుబట్టి, ఆచరణనుబట్టి, ఏ గుణం మీలో ప్రబలంగా ఉందో తెలుసుకుంటారు. మీరు ప్రశాంతంగా, సంతోషంగా, ఉత్తమ జ్ఞానంతో ఉంటే, మీరు సత్త్వగుణంలో ఉన్నట్లే. సత్త్వగుణం నిర్మలమైనదైనా, స్వచ్ఛమైనదైనా అది కూడా బంధించేదే. ఎందుకంటే, అది కూడా ఒక ఆవరణమే గదా! అయితే, అది రజోగుణంలాగా ఉన్నదాన్ని మరొక రకంగా చూపేది కాదు. తమోగుణంలాగా అసలు కనబడకుండా చేసేదీ కాదు. బాగా ప్రకాశవంతంగా చూపే మంచి గుణం సత్త్వగుణం. అయితే, ఎంత మంచి గుణమైనా అహంకారానికి, అభిమానానికి దారి చూపిందా... బంధానికి కారణమై కూర్చుంటుంది. నేను సుఖంగా వున్నాను, ప్రశాంతంగా వున్నాను, వివేకం గలవాడను, వికారాలు లేనివాడను, జ్ఞానిని అని అహంకారం కలిగిందా... బంధమే! మరి ఎలా వుంటే సత్త్వగుణం ప్రభావం వల్ల భగవంతునిపై భక్తి వుంటుంది? దానితో పూజలు, వ్రతాలు, యజ్ఞయాగాదులు, పారాయణలు, జపధ్యానాలు చేస్తారు. వీటివల్ల మనసు ప్రశాంతంగా, ఆలోచనలు లేకుండా, సుఖంగా ఉన్నట్లు అన్పిస్తుంది.*

ఈ సుఖాన్ని దూరం చేసుకోవటం ఇష్టంలేక, భగవత్‌కార్యాలలో నిమగ్నమవుతూ, అందులోనే మునిగిపోతారు. భగవంతుని సంబంధించిన జ్ఞానాన్ని పొందటానికి తపిస్తారు. రామాయణ, భారత, భాగవతాలనో, వేదాంత గ్రంథాలనో, పురాణాలనో చదవాలని, వినాలని, తెలుసుకోవాలని ప్రయత్నిస్తూ వుంటారు. పెద్దలను, మహాత్ములను, గురువులను ఆశ్రయిస్తూ, పూజిస్తూ వుంటారు. శాస్త్ర శ్రవణం చేస్తూ, ఆత్మజ్ఞానాన్ని పొందుతూ వుంటారు. దీనితో, వారిలో తేజస్సు వృద్ధి అవుతుంది. హృదయంలో ఒక రకమైన సంతృప్తి కలుగుతుంది. దీనితో ఇంకా ఇంకా జ్ఞానసముపార్జన చేయాలనే ఆసక్తి కలిగి, అందులో మునిగిపోతుంటారు. ప్రశంసలకు లొంగి, అందులోనే వుంటారు. ఇలా సత్త్వగుణంలో వుండేవారు సుఖాన్ని పొందుతూ, జ్ఞానాన్ని పొందుతూ అందులోనే వుండిపోతారు. అదే జీవుడు దేహానికి బంధించబడటం. సత్త్వగుణం ప్రభావంవల్ల కలిగే ఈ సుఖంగానీ, జ్ఞానంగానీ ఈ రెండూ కూడా అంతఃకరణ ధర్మాలే గానీ, ఆత్మధర్మాలు మాత్రం కాదు. ఆత్మధర్మాలైతే, ఇక బంధం అనేది లేనేలేదు. అంతఃకరణంలో కలిగిన దుఃఖాన్ని నాది అనుకోవటం ఎలా అజ్ఞానమో, అలాగే అంతఃకరణంలో కలిగే సుఖాన్ని నాది అనుకోవడం కూడా అంతే అజ్ఞానం. కనుక, సత్త్వగుణంవల్ల కలిగే సుఖం దేహేంద్రియాలకు సంబంధించినదే గాని, ఆత్మకు సంబంధించినది కాదు. మనసులో అలజడులు తగ్గటంవల్ల వచ్చిందే ఈ సుఖం. ఇలా దేహేంద్రియ మనోబుద్ధులు సుఖంలో ఉండటంవల్ల సుఖాన్ని వదులుకోలేక, దానిమీద ఆసక్తితో అటువంటి సుఖాన్ని ఇంకా ఇంకా పొందాలని, అలాగే శాస్త్రజ్ఞానాన్ని పాండిత్యాన్ని ఇంకా ఇంకా సంపాదించి పదిమందిలో గొప్పగా వుండాలని, గౌరవం పొందాలని సంగభావం పెట్టుకుంటారు, వీటిలోనే మునిగిపోతుంటారు. ఇలా చేస్తే బంధం ఏమిటీ? అని మీరంటే, తాను దేహాన్ని కాదని, ఆత్మననీ తెలియక, లేదా తెలిసినా ఆత్మతో తాదాత్మ్యం చెంది ఆత్మగా, బ్రహ్మంగా ఉండేందుకు సాధనలు చేయక, తన స్థితిలో నిలచి ఈ జననమరణ రూప సంసారం నుంచి బయటపడక, మళ్ళీమళ్ళీ పుడుతూ, మళ్ళీమళ్ళీ ఛస్తూ, మళ్ళీమళ్ళీ తల్లిగర్భంలో ప్రవేశిస్తూ జన్మలను కొనసాగించడమే బంధం. క్షేత్రసుఖంలో బంధించబడటమే బంధం. పాపాలు చేయనివాడే సత్త్వగుణంలో వున్నవాడు. పాపియైనవాడు సుఖంగా వుండలేడు, జ్ఞానాన్ని పొందలేడు. ముందుగా పాపరహితుడవై, ఆ తర్వాత బంధం నుండి, సత్త్వగుణబంధం నుండి విముక్తుడవు లేక విడుదల పొందేందుకు ప్రయత్నించాలి.

**యద్వినా భరతం త్వాం చ శత్రుఘ్నం వాపి మానద ।**
**భవేన్మమ సుఖం కించిత్ భస్మ తత్కురుతాం ॥**

భరతుడుగానీ, శత్రుఘ్నుడుగాని, లక్ష్మణుడుగాని లేకుండగ నేను ఎట్టి అల్పసుఖమును కోరినను, అగ్నిహోత్రుడు దానిని భస్మము చేయుగాక!

(శ్రీరామచంద్రుడు చేసిన శపథము)

## తస్మాత్ జాగ్రత్త

మీరు ఖర్చుపెట్టే ప్రతి పైసాలో అపారమైన శ్రమశక్తి అంతర్లీనంగా దాగివుంటుంది. శ్రమశక్తిని దోచుకున్నారా, ప్రకృతి మిమ్మ తప్పక శిక్షిస్తుంది. అది ముందు హెచ్చరిస్తుంది. ఆ తదుపరి మిమ్ములను

శిక్షిస్తుంది. అయినా సరే, పరివర్తన చెందకపోతే, తప్పక భక్షిస్తుంది. ప్రస్తుతం అందరూ శ్రమశక్తిని దోచుకుంటూ, అతి భయంకరమైన వ్యాధులకు గురియై, నరకయాతన పడుతున్నారు. ఇది ముమ్మాటికీ మీ స్వయంకృతాపరాధమే!

***గురువు లేని జీవితం పద్మవ్యూహంలాంటిది***
***గురువు లేని జీవితం గాఢాంధకారంలాంటిది***
***గురువు లేని జీవితం చుక్కానిలేని నావలాంటిది***
***గురువు లేని జీవితం కారడవిలాంటిది***
***మానవజీవితం గురువును సంపాదించటానికే***
***గురువు కొరకు అన్వేషించాలి***
***గురువు కొరకు తపించాలి, తపస్సు చేయాలి***
***గురువు కొరకు రోదించాలి***
***సచ్చిదానందుడే నిజమైన గురువు***
***అట్టి గురువే సద్గురువు***
***గురువులకే గురువు, అందరికీ గురువు జగద్గురువు***
***అట్టివాడే ఈ ఆంజనేయుడు***
***అట్టి ఆంజనేయునికి శిష్యుడు కాగలవాడే గురువు కాగలడు***
***కలకాలం శిష్యునిగా ఉండాలని ఆశించేవాడే***
***కలకాలం గురువుగా నిలవగలడు***
***ఉత్తమ శిష్యుడు, గురువూ ఇద్దరూ ఒక్కటే***
***గురువును పొందినవారి జీవితం ధన్యం***
***సర్వస్య శరణాగతి చేసిన వారికే గురువనుగ్రహం లభిస్తుంది***
***లోపల దైవాన్ని దర్శించినవారే బయట దైవాన్ని దర్శించగలరు***
***గురువు లేనిదే చదువు రాదు***
***చదువు లేనిదే వినయం రాదు***
***వినయం లేనిదే సాధన జరుగదు***
***సాధన లేనిదే గౌరవం రాదు***
***గౌరవం లేనిదే ఉన్నతస్థానం రాదు***
***ఉన్నతస్థానం లేనిదే పథం దొరకదు***
***పథం లేనిదే ఆత్మతత్త్వంపై మక్కువ రాదు***
***మక్కువ లేనిదే మజిలీ చేరలేరు***
***మజిలీ చేరాలంటే, మారుతి మాటలు మన్నించాలి***

***ఎంత మన్నన వుంటే, అంత త్వరలో***
***మన్నిక కలిగిన ఎన్నుకున్న మార్గాన్ని సొంతం చేసుకుని***
***సద్గురువు పాదరేణువులై మనగలరు***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**28-06-2020** 09:00 AM

**82) రజోగుణం స్వభావం ఎట్టిది స్వామీ? అది జీవుడ్ని ఎలా బంధిస్తుంది స్వామీ?**

*రజోగుణం దృశ్యవిషయాలపై ఆసక్తిని కలిగించి, కోరికలను, సంగభావాన్ని కలిగిస్తుంది. అది కర్మలయందు ఆసక్తిని కలిగించి, ఆత్మను దేహంలో బంధిస్తుంది. రాగాత్మకం అంటే రంజన స్వభావంగలది అని అర్థం. మనస్సుపై ప్రభావం చూపినప్పుడు, కంటిద్వారా విషయవస్తువులను చూచినప్పుడుగానీ, చెవిద్వారా విన్నప్పుడుగానీ, లేదా మనసులో స్మరించినప్పుడుగానీ ఆ విషయాలపై, వస్తువులపై ప్రీతి కలుగుతుంది. ఇదే రాగం. అందుకే రజోగుణం రాగాత్మకం. ఈ రాగప్రవృత్తి వల్ల జీవుడు తన స్వస్వరూపం నుండి దిగజారి, దృశ్యవిషయాలపై, వస్తువిషయములపై వ్యామోహం చెందుతాడు. ఇక్కడ రాగం అనే మాటలో ద్వేషం కూడా ఇమిడి వుంటుంది. కనుక రాగద్వేషాలు రెండూ రజోగుణం యొక్క స్వభావాలే. ఈ రాగంవల్ల ఏమి జరుగుతుంది? రాగంవల్ల వస్తువులపై కోరిక కలుగుతుంది. కోరికవల్ల వాటిని పొందాలని, వాటిని సంపాదించుకోవాలని, భోగించాలని అన్పిస్తుంది. అంటే, రజోగుణం భోగాసక్తిని కలిగిస్తుంది. దాని కారణంగా దుఃఖాలు పడాల్సివస్తుంది. కోరిక తీరకపోతే దుఃఖం. తీరితే సుఖమేగానీ, మళ్ళీ క్రొత్త కోరిక పుడుతుంది. పనసతొనల మాధుర్యాన్ని చవిచూడాలని ఈగ ఆ తొనల లోనికి ప్రవేశిస్తుంది. దాని శరీరానికి, రెక్కలకు జిగురు అంటుకుంటుంది. ఆ మాధుర్యాన్ని ఈగ తింటుందో లేదోగానీ, ఆ మాధుర్యం మాత్రం ఈగను తింటుంది. "మశకం మాధుర్యంలో హత హతం". ఈ రజోగుణం తృష్ణను, సంగభావాన్ని కల్గిస్తుంది. తృష్ణ అంటే లేనిదాన్ని సంపాదించుకోవాలని ఆశ, కోరిక. సంగం అంటే ఉన్నదానిపై మమకారాన్ని పెంచుకొని, దానిని మీ నుండి జారిపోకుండా ఆసక్తిని పెంచుకోవటం. ఈ కారణంగా, ఆ వస్తువులకు మీరు బానిసలైపోతారు. తృష్ణ అంటే దప్పిక. దాహం అనే అర్థం కూడా ఉన్నది. ఉప్పునీరు ఎంత త్రాగినా దప్పిక తీరదు. అలాగే, విషయభోగాలను ఎన్ని అనుభవించినా తృష్ణ తీరదు. ఆశకు అంతం వుండదు. ఆశకు ఆకాశమంత నోరు, సముద్రమంత పొట్ట. ఆశను తృప్తి పరచినవాడు ఇంతవరకూ పుట్టలేదు. చూచినవన్నీ కావాలి, విన్నవన్నీ కావాలి, తలచినవన్నీ కావాలి. ధనం మీద తృష్ణ, సంపదల మీద తృష్ణ, ఇల్లూవాకిళ్ళ మీద తృష్ణ, భార్యాబిడ్డల మీద తృష్ణ, విషయాల మీద తృష్ణ, భోగాలమీద తృష్ణ, పదవుల మీద తృష్ణ, కీర్తిప్రతిష్ఠల మీద తృష్ణ. ఈ తృష్ణ వదిలితేగానీ ప్రగతి లేదు. అందుకే శంకరులవారు, "మూఢ జహీహి ధనాగమ తృష్ణాం" అని భజగోవిందంలో తృష్ణపై మొదట్లోనే అస్త్రాన్ని ప్రయోగించారు. దారేషణ–భార్యపై మక్కువ, ధనేషణ–ధనంపై*

మక్కువ, పుత్రేషణ–బిడ్డలపై మక్కువ అనేవి ఈషణత్రయాలు. దారేషణ పక్షులలోనూ, ధనేషణ మానవులలోనూ, పుత్రేషణ జంతువులలోనూ చాలా ఎక్కువగా వుంటుంది. అందుకే "ధనాగమ తృష్ణాం జహీహి" అంటూ మానవుడ్ని "మూఢా!" అని దాడి ప్రారంభించారు శంకరులవారు. ఈ రజోగుణం వల్ల తృష్ణతోబాటు సంగభావం ఉద్భవిస్తుంది. సంగం అంటే ఆసక్తి. దొరికిన ప్రతి వస్తువు మీద విశేషమైన ప్రీతి. దానికి కాలం చెల్లినా సరే, రక్షించుకోవాలనే పట్టుదల. ఇదే ఆసక్తి, సంగభావం. ఈ తృష్ణ, సంగభావాల వల్ల జీవుడు ఎలా బంధించబడుతున్నాడు? తృష్ణతో ఆశలు, కోరికలతో ఉన్నవాడు దేనిపైన కోరికతో వుంటాడో వాటిని సంపాదించుకోవటం కోసం కర్మరంగంలోకి దిగుతాడు. డబ్బు మీద తృష్ణ వుంటే వృత్తి, వ్యాపారం, ఉద్యోగం, పరిశ్రమలు, మోసాలు, గూండాయిజం ఇలా ఏదో వ్యవహారంలోకి దిగుతాడు. ఇలాగే మిగిలినవన్నీ. ఆశ అనేది మనిషిని ఊరకే ప్రశాంతంగా ఉండనివ్వదు. దప్పికతో ఉన్నవాడు ఊరికే వుంటాడా? దప్పికతో వున్న గజేంద్రుడు వనమంతా తిరిగి చివరకు సరోవరంలోనికి దిగాడు గదా! అలాగే, ఆశతో ఉన్నవాడు అది చేయాలి, ఇది చేయాలి అంటూ కాడిమాను తన మెడ మీద తానే వేసుకుంటాడు, ఈగలాగా కొట్టుకుంటాడు, పాదరసంలాగా పారాడుతాడు. కనుక రజోగుణం మనిషిని ప్రశాంతంగా ఉండనివ్వదు. ఈ రజోగుణం కర్మలపై ఆసక్తిని పెంచి ఆత్మను దేహంలో బంధిస్తుంది. ఆత్మ ఏ కర్మలు చేసేది కాదు. అయితే రజోగుణం కారణంగా ఆశలు, కోరికలు పుట్టి, కర్మలు చేస్తూ, అవి చేస్తున్నది నేనే అంటూ ఈ దేహంలో బంధించబడుతున్నాడు మానవుడు. ఇదీ కర్మసంగం! ఈ పనులు నేను చేస్తున్నాను అనేది కర్మసంగం. ఈ ఫలితం మీకే రావాలి అనేది ఫలసంగం. ఇలా కర్మలలో మునిగిపోయి, మీ స్థితిని మరచి, మీ స్వరూపస్థితి నుండి దిగజారి, జీవుడిగా జననమరణ రూప సంసారంలో ఇరుక్కుపోతున్నారు. కోటి కోటి జన్మలకు కారణం ఈ రజోగుణమే. ఇలా రజోగుణం కర్మలలో దింపి, మీ స్వరూపాన్ని మీరు మరచేటట్లు చేసి, ఆ దేహమే నేనను భ్రమను కల్పించి బంధిస్తున్నది. రజోగుణంవల్ల కర్మలు, కర్మలవల్ల కర్మఫలాలు, వాటిని అనుభవించుటకు జన్మలు, ఆ జన్మలలో మళ్ళీ కర్మలు, కర్మఫలాలు, తిరిగి జన్మలు... ఇలా కర్మ–జన్మ వలయంలో తిరుగుతూ మీ నిజస్థితిని, ఆత్మస్థితిని మరుగున పడవేసుకుంటున్నారు. దీనికి కారణం రజోగుణమే. కృష్ణపరమాత్మ 'బధ్నాతి' అనకుండా 'నిబధ్నాతి' అనడం వల్ల రజోగుణం బాగా గట్టిగా బంధిస్తుంది అని చెబుతాను.

**స్నేహం దయాం చ సౌఖ్యం చ యది వా జానకీమపి ।**
**ఆరాధనాయ లోకస్య ముఞ్చతో నాస్తి మే వ్యథా ॥**

లోకముయొక్క సేవ కొరకు స్నేహమును, దయను, సుఖమును
ఒకవేళ జానకినైనను కూడా విడుచుటకు నాకు బాధ లేదు.
(పట్టాభిషేక సమయంలో ప్రజలకు రామచంద్రుడు అందించిన బాస)

అక్రమ సంపాదన, అక్రమ సంబంధాలు అతి ప్రమాదకరమని గుర్తుంచుకోండి.
అక్రమముందంటే, సక్రమం లేనట్లే గదా!
అక్రమాన్ని సక్రమంగా మార్చుకోండి చాలు. ఆనందం ఎప్పుడూ మీ సొంతమవుతుంది.

***గురుబ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః।***
***గురుస్సాక్షాత్ పరబ్రహ్మా తస్మైశ్రీ గురవేనమః॥***

***గురువు చెప్పే మాట, గురువు బోధించే పాఠం,***
***గురువు నడిపే బాట, గురువు కొట్టే దెబ్బ***
***గురువు పెట్టే భయం, గురువు చేసే లాలన,***
***గురువు పంచే ప్రేమ, గురువు సవరించే తప్పులు,***
***గురువు నోట నీతిమాటలు, గురువు నోట కమ్మని స్వరాలు,***
***గురువు చెప్పిడి కథలు, గురువు అందించే ప్రేరణ,***
***గురువు పెంచే వ్యక్తిత్వం, గురువు అలవరిచే విలువలు,***
***గురువు చూపే దిశానిర్దేశం, గురువు ఇచ్చే మార్గదర్శకత్వం***
***గురువు వడ్డించే జ్ఞానం***
***ఇవ్వన్నీ మీరు అణువణువూ జ్ఞాపకముంచుకుంటే,***
***ఆ జ్ఞాపకాల సమాహారమే అందమైన సాధనా జీవితం***
***ఆ సాధనే సాగే జీవితంలో సద్గురువైన ఈ ఆంజనేయుడికి అంకితమిచ్చి***
***మీ ఋణం తీర్చుకోండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**29-06-2020** 09:00 AM

**83) తమోగుణ స్వభావం ఎట్టిది స్వామీ? అది జీవుడ్ని ఎలా బంధిస్తుంది స్వామీ?**

*తమస్సు అనేది అజ్ఞానం నుండి పుట్టి, అన్ని ప్రాణులను మోహంలో పడవేస్తుందని తెలుసుకోండి. ఏమరుపాటు, బద్ధకం (సోమరితనం), నిద్రలతో జీవుడ్ని ఈ తమోగుణం గట్టిగా బంధిస్తుంది. తమోగుణం అజ్ఞానం నుండి పుట్టినది. జ్ఞానం వ్యక్తం లేకపోవటమే అజ్ఞానం. మేఘాలు సూర్యుని కప్పివేసినట్లు, నల్లగా పొగచూరిన గాజుచిమ్నీ దీపాన్ని కప్పినట్లు, తమోగుణం జ్ఞానాన్ని కప్పివేస్తుంది. అందుకే అట్టి గుణం గలవారు "తనకు తోచదు, ఎవరైనా చెబితే వినరు" అన్నట్లుగా వుంటారు. తమోగుణం అజ్ఞానం నుండి పుట్టి, అజ్ఞానాన్ని వృద్ధి చేస్తుంది. కృష్ణభగవానుడు గీతలో "తమః తు" అని 'తు' ప్రయోగం చేశారు. అంటే, "తమోగుణమైతేనో" అని అర్థం. అంటే, "ఇంతవరకూ చెప్పిన సత్త్వరజో గుణాలవంటిది కాదు, ఇది వాటికన్నా దోషపూరితమైనది" అని చెప్పటానికే ఈ 'తు' ప్రయోగం. ఈ గుణం ఏమి చేస్తుందంటే, మానవులందరినీ మోహంలో పడవేస్తుంది. మోక్షాన్ని పొందాలనే మానవుడి దివ్యభావనను కప్పివేసి, ఈ తమోగుణం సోమరితనంలో, నిద్రలో ముంచివేస్తుంది. లోకంలో చాలామందిని గమనించండి. మేము ఎందుకు పుట్టాం? ఈ జన్మకు పరమార్థం ఏమిటి? అనే ఆలోచనే లేకుండా జీవితానికి ఒక*

ఉన్నత లక్ష్యంగాని, చేసే పనిలో ఉదాత్తత గానీ లేకుండా ఎలాగో జీవితాన్ని గడి పేసి వెళ్ళిపోతూ వుంటారు. ఈ తమోగుణం ఇలా వారిని ఆలోచించుకోనివ్వకుండా, అందరినీ మోహంలో పడవేస్తుంది. విచక్షణా జ్ఞానాన్ని నశింపచేస్తుంది. ఏ కొద్దిమందో వివేకవంతులు ఆత్మజ్ఞాన సంపన్నులు తప్ప, అందరినీ పడవేస్తుంది. అందుకే "సర్వదేహినాం" అన్నాడు కృష్ణుడు. ఈ తమోగుణం జీవుడ్ని ఎలా బంధిస్తుంది? 'ప్రమాద' అంటే ఏమరుపాటు, మతిమరుపు, పరాకు, కర్తవ్యాన్ని మరచిపోవటం. 'ఆలస్య' అంటే సోమరితనం, బద్ధకం, జ్ఞాపకమున్నా చేయాలని అన్పించకపోవటం. 'నిద్ర' అంటే అతిగా నిద్రపోవటం, ఎప్పుడూ నిద్రలో జోగుతూ మత్తులో వుండిపోవటం. ఈ మూడు లక్షణాలు ఆత్మను తెలుసుకోనివ్వకుండా, తన స్వరూపాన్ని తాను మరచేటట్లుగా చేసి, జీవుడ్ని బంధిస్తున్నవి. ఈ మూడు లక్షణాలతో జీవుడు వాటినే తన స్వస్వరూపంగా భావించి, బంధానికి గురి అవుతున్నాడు. చేయవలసినవి చేయకపోవటం, చెయ్యకూడనివి చెయ్యటం, వ్యర్థమైన పనులు చేయటం ప్రమాద లక్షణాలు. ఎల్లప్పుడూ గోళ్ళు గిల్లుకోవటం, పుల్లలు విరచడం ఇలాంటి పనులే. ఒకడు కూర్చున్న చోటనే గడ్డిపోచలను ముక్కలు ముక్కలుగా చేస్తూ, పెద్ద కుప్పను చేశాడు. ఆ దారిన పోతున్న ఒక మహాత్ముడు, "అయ్యా! ఈ గడ్డిని ఆవు తిని పాలు ఇస్తుంది. ఆ పాలు త్రాగితే రక్తంగా మారుతుంది. ఆ రక్తం మనకు పుష్టినిస్తుంది. ఇప్పుడు నీవు చేసిన పని ఎంత ప్రమాదమో గుర్తించావా?" అన్నాడు. ఇలా వ్యర్థమైన పనులు చేస్తుంటారు. కొందరు వ్యర్థమైన ఆలోచనలు చేస్తుంటారు. గాలిలో మేడలు కడతారు. లాటరీలో లక్ష రూపాయలు వస్తే, ఇల్లు కొంటాను, పెళ్ళి చేసుకుంటాను, వ్యాపారం చేస్తాను, బాగా లాభాలు వస్తాయి, ఆ డబ్బుతో పరిశ్రమను స్థాపిస్తా. పెద్ద పేరు వస్తుంది. ఎమ్. ఎల్. ఏ.గా పోటీ చేస్తా, గెలిచి మంత్రినవుతా, అప్పుడు నా దర్జా, హంగు, ఆర్భాటం... ఆహా! అనుకుంటూ ఎప్పుడో ఈ ప్రపంచం లోనికి వచ్చిపడతాడు. ఉన్నచోటనే ఉసూరు మంటుంటాడు. ఇలా ప్రమాదంలో పడిపోయి, వ్యర్థ జీవితాన్ని గడుపుతాడు. తామస ప్రవృత్తిగల మూఢులు ఇలా ప్రవర్తిస్తూ వుంటారు. సోమరితనం, బద్ధకం అంటే, ఆ! రేపు చేద్దాంలే అంటూ పనులను వాయిదా వేసుకుంటూపోవటం ఆలస్య లక్షణం. రేపు రేపు రేపు అంటాడే గాని, వాడికి ఆ రేపు అనేది ఎప్పటికీ రాదు. ఏమి అడిగినా, చూద్దాం, చేద్దాం అంటూ వుంటారు. అయితే, వీరు సోమరితనంవల్ల కాదు, ప్రయోజనం లేదని తప్పించుకొనుటకు ఇలా అంటూ వుంటారు. అయితే సోమరులెలా వుంటారో చూడండి. ఇద్దరు వ్యక్తులు నేరేడు చెట్టు క్రింద పడుకున్నారు. ఆ దారిన సైకిల్‌పై ఒక వ్యక్తి వెడుతున్నాడు. "అయ్యా అయ్యా!" అని ఒకడు కేక వేశాడు. "ఏమిటి?" అని అతడు వచ్చి అడిగాడు. దానికి వాడన్నాడు, "ఆ ఏమీ లేదు. నేరేడుపండు నా పొట్టమీద పడ్డది. కాస్త దానిని తీసి నా నోట్లో పెట్టండి" అన్నాడుట. దానితో ఆ వచ్చినవాడు కోపంతో కర్ర తీసుకొని నాలుగు వడ్డించాడు. అది చూచి ప్రక్కనున్నవాడు అంటున్నాడు, "అంతే కావాలి. సోమరిపోతు వెధవ. నా ముఖం మీద కుక్క మూత్రం పోస్తుంటే, అరగంట నుండి దానిని తోలకుండా చూస్తూ ఉన్నాడు వెధవ!" అని అన్నాడట. వాడు సోమరి, వీడు మహాసోమరి. అభాగ్యుడికి ఆకలి ఎక్కువ, నిర్భాగ్యుడికి నిద్ర ఎక్కువ. కూర్చున్నా, పడుకున్నా, పుస్తకం చదువుతున్నా, పురాణం వింటున్నా, బస్సులో ప్రయాణం చేస్తున్నా, ధ్యానం చేస్తున్నా, జపం చేస్తున్నా పిలవకుండానే వస్తుంది నిద్ర. దీనివల్ల ఇంద్రియాలలో జడత్వం కల్గుతుంది. మనసు మొద్దుబారుతుంది.

*ఆవలింతలు వస్తాయి. ఒళ్ళు విరుచుకుంటారు. నిద్రపడితే స్వర్గంలో ఉన్నట్లుగా భావిస్తారు. నిద్రపోయే సమయంలో ఎవరైనా ఒక దేవుడు వచ్చి, "ఇదిగో అమృతం తీసుకో" అంటే, "ఇప్పుడు కుదరదు, రేపురా! నిద్రపోవటానికే అసలు టైం చాలటం లేదు" అంటాడు. ఇలాంటి తమోగుణలక్షణాలు గలవారు ముక్తికి, ముక్తిసాధనలకు దూరమైపోతారు. అసలు భగవంతుడే జ్ఞాపకం రాడు, తలుచుకోడు. అట్టివాడికి మళ్ళీజన్మలు నీచజన్మలే. ఈ ప్రకారంగా తమోగుణం ప్రమాద (ఏమరపాటు), ఆలస్యం (సోమరితనం), నిద్రలతో జీవుళ్ళను ఈ లోకానికి బంధించే ఈ 3 గుణాలు చాలా గట్టిగా బంధించివేస్తుంది. అట్టివారికి ఉద్ధారికమే లేదు. ఇలా తమోగుణం ఆత్మను మరుగున పడేస్తుంది. జీవుడ్ని దేహంలో బంధిస్తుంది. జీవుడ్ని బంధించే ఈ 3 గుణాలు ఎలా వృద్ధి పొందుతాయంటే, సత్త్వగుణం ఇంద్రియ సుఖాలను కలుగచేసి, రజోగుణం కర్మలయందు ఆసక్తి కలిగించి, తమోగుణమేమో జ్ఞానాన్ని కప్పివేసి ఏమరుపాటును కల్గించి వృద్ధి చెందుతాయి. ఎంత ఆశ్చర్యమో చూడండి. సత్త్వగుణం జీవుడ్ని సుఖంలో ఆసక్తుడ్ని చేసి బంధిస్తుంది. రజోగుణం కర్మలయందు ఆసక్తిని కల్గించి బంధిస్తుంది. తమోగుణం జ్ఞానాన్ని కప్పివేసి మరపు, బద్ధకం కల్గించి బంధిస్తుంది. అందుకనే, నేను చెబుతాను. జీవుడ్ని సత్త్వగుణం ఆవరిస్తే దీపంపై గాజుచిమ్నీ బోర్లించినట్లు, జీవుడ్ని రజోగుణం ఆవరిస్తే దీపంపై అలకని గంపను బోర్లించినట్లు, జీవుడ్ని తమోగుణం ఆవరిస్తే దీపంపై కుండను బోర్లించినట్లు వుంటుందని చెబుతాను. కనుక, మూడు గుణాలు ఆత్మ (జ్ఞానం) అనే దీపాన్ని కప్పువేసేవే. అందువల్ల, మూడు గుణాలనూ దాటి, ఆత్మ అనే దీపాన్ని చేరుకోవాలి, దర్శించాలి. అందువల్ల గుణాతీతునికే ఆత్మదర్శనం. ఈ మూడు గుణాలు జీవుడ్ని బంధించే విధానం భగవంతునికే ఆశ్చర్యం కలిగిస్తుంది.*

***ప్రయాహి జానామి రణార్ధి తే స్త్వం, ప్రవిశ్య రాత్రిం చరరాజ లంకామ్ ।***
***అశ్వాస్య నిర్యాహి రథీ చ ధన్వీ, తథా బలం ప్రేక్ష్యసిమే రథస్థః ॥***

*"ఓ రావణా! నీవు లంకకు పొమ్ము. యుద్ధమున అలసితివి. లంకలో ప్రవేశించి, కొంత అలసట తీర్చుకొని, తిరిగి రథారూఢుడవై, ధనస్సును ధరించి యుద్ధమునకు రమ్ము. అప్పుడు నా పరాక్రమమును చూచెదవు గాక!" అని శ్రీరాముడు లంకలో రావణునితో అన్న మాటలు.*

గుడిలో గంట కూడా మీలో చేతనత్వాన్ని తెస్తుంది.
జింక్, కాపర్, కాడ్మియం వంటి లోహమిశ్రమంతో సరియైన నిష్పత్తితో
తయారయ్యే గంట మ్రోగించినప్పుడు వచ్చే నాదతంత్రులు
పవిత్రభావాన్ని, ఏకాగ్రతను ఏర్పరుస్తాయి.
దాని నుండి వచ్చే ప్రతిధ్వని ఏడు సెకన్లు మీ సప్తచక్రాల్ని కదిలిస్తుంది.
సరిగ్గా గమనిస్తే, గంట మ్రోగినప్పుడు
'ఓం' అనే శబ్దం వినిపిస్తుంది.

***సాధన అంటే సాధించటం కానే కాదు***
***సాధించాలి అనే భావనను వదలటమే!***

***సాదించాలి అనేది అసంతృప్తికి చిహ్నం***
***సాధించవలసినది లేదు అనేది సంతృప్తి***
***సాధనలో అసంతృప్తి అనేది ఉండకూడదు***
***సాధించలేకపోవటమే అహంకారం***
***సాధించవలసింది లేదు అనే భావనే సాధనలోని అత్యంత కీలకాంశం***
***కావున, సాధనలో వుండటమే మీ ధ్యేయంగా***
***దేనిని వదలాలో, దేనిని పట్టుకోవాలో***
***ఈ పవనకుమారుడు పరిపరి విధాల బోధించాడు***
***బోధనలు బాధకల్గించినా, భజరంగభళి***
***బాధ్యతాయుతమైన సద్గురు స్థానాన్ని అధిష్ఠించి***
***అంతరంగ బోధన చేశాడు***
***దీనిని అంతర్యుద్ధంగా జరిపి అంతిమంగా విజయాన్ని అందుకోండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**30-06-2020** 06:50 AM

**84)** రజస్సు మరియు తమస్సులను అధిగమించి, సత్త్వగుణాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలి స్వామీ?

*"బలవంతమైన సర్పము చలిచీమల చేత చిక్కి చావదె సుమతీ!" అని సుమతీ శతకకారుడు కూడా చెప్పాడు గదా! నిజంగా ఎంత ఆశ్చర్యమో చూడండి. పాము యొక్క బలం ఎంత, చలిచీమల బలం ఎంత? అందుకే ఆశ్చర్యం. అలాగే, అంతటి ఆత్మ, సచ్చిదానంద స్వరూప ఆత్మ, జడమైన ఈ ప్రకృతి యొక్క గుణాల చేత బంధించబడటం ఆశ్చర్యం గాక మరేమిటి? సత్త్వం సుఖంలో వృద్ధి చెందుతుంది. రజస్సు కర్మలు చేస్తుంటే వృద్ధి చెందుతుంది. తమస్సు ఏమరుపాటులో జ్ఞానాన్ని కప్పి వృద్ధి చెందుతుంది. ఇది తెలిస్తే, మీకేమిటి ప్రయోజనం? మూడు గుణాలు పుట్టుకతోనే అందరిలో వుంటాయి. అయితే, అవి ఎప్పుడూ ఒకేలా వుండవు. మీరు చేసే పనులను బట్టి, మీరు నివసించే పరిస్థితులను బట్టి మారిపోతూ వుంటాయి. ఈ విషయం మీకు తెలిస్తే ప్రయత్నంతో, అక్కరలేనివాటిని తగ్గించుకోవచ్చు, అవసరమనుకున్న దానిని పెంచుకోవచ్చు. మీరు సత్త్వాన్ని పెంచుకోవాలి. రజోగుణ, తమోగుణాలను వదిలించుకోవాలి. అయితే, సత్త్వాన్ని పెంచుకోవడం ఎలా? సుఖంగా వుంటే సత్త్వగుణం పెరుగుతుంది. సుఖంగా ఎప్పుడుంటారు? మనసులో ఏ ఆందోళన, భయం, అలజడి, ఆరాటం లేనప్పుడు. మీకు ఏదైనా కోరిక కల్గిందనుకోండి, ఆ కోరిక తీరేదాకా ఒకటే ఆరాటం. తీరితే ఆరాటం పోతుంది. అప్పుడు సుఖంగా వున్నది అంటారు. దీనిని బట్టి సుఖం ఎలా వస్తున్నది? అని పరిశీలించుకుంటే, మనసులోని తీరని కోరిక తీరిపోయినప్పుడు, మనసులో ఆరాటం, ఆందోళన తొలగి*

*మనస్సు స్థిమితపడుతుంది. అప్పుడు సుఖంగా ఉన్నది అంటారు. అంటే, స్థిమితంగా ఉన్న మనసు వెనుక సుఖం ఉన్నదన్నమాట. కాబట్టి, బాహ్య పరిస్థితులు ఎలావున్నా, మనసు చెదరకుండా, శాంతంగా నిలుపుకోగలిగితే సుఖం వస్తుంది. అప్పుడు సత్త్వగుణం వృద్ధి అవుతుంది. సత్త్వం వృద్ధి చెందినకొద్దీ సుఖం వస్తూనే వుంటుంది. సుఖం వస్తున్నకొద్దీ సత్త్వం వృద్ధి చెందుతుంది. కనుక, మనసుకు సర్ది చెప్పుకుంటూ, ఆందోళనలను తగ్గించుకుంటూ, సుఖాన్ని పొందుతూ, సత్త్వగుణాన్ని పెంచుకోవాలి. రజోగుణం ఎప్పుడు పెరుగుతుంది? జాగ్రత్తగా ఆలోచించి కర్మలు చేస్తుంటే, రజోగుణం పెరుగుతుంది. తమోగుణాన్ని తగ్గించుకోవటానికి, వదిలించుకోవటానికే రజోగుణాన్ని పెంచుకోవాలి. అంటే, తమోగుణంలో ఉన్నవారు ఆ తమోగుణాన్ని తగ్గించుకోవటానికి కోరికలను పెంచుకొని, ఆ కోరికలు తీర్చుకోవటానికి కర్మలు చేయాలి. ఆ కర్మలను ఆలోచనలతో జాగ్రత్తగా, నైపుణ్యంతో చేయాలి. అప్పుడే రజోగుణం పెరుగుతుంది. ఆ తర్వాత ఈ రజోగుణాన్ని కూడా తగ్గించుకుని, సత్త్వంలో నిలవటానికి నిష్కామకర్మలు, భగవత్‌కర్మలు, కర్తృత్వరహిత కర్మలు చేయాలి. భగవంతునిపై భక్తిని పెంచుకుంటూ, ప్రశాంతంగా ఉండటానికి ప్రయత్నించాలి. అప్పుడే సత్త్వగుణం పెరిగేది. తమోగుణాన్ని ఎలా వదిలించుకోవాలి? సోమరితనంతో పనులు చేయకుండా! మతిమరుపుతో వుంటే తమోగుణం పెరుగుతుందని తెలుసుకున్నారు. తమోగుణాన్ని అణచాలంటే, రజోగుణాన్ని పట్టుకొని అణచాలి. అందుకు ఆలోచించి జాగ్రత్తగా కర్మలు చేయాలి. కర్మలు చేస్తున్నకొద్దీ రజోగుణం పెరిగి, తమోగుణం వదిలిపోతుంది. కనుక, జ్ఞానమునందు ఆసక్తి గలవారై, ఈ గుణాలను అధిగమించండి అని సూచన ఇస్తున్నాను. ఈ రజోగుణాన్ని దాటాలి కనుక, ఆధ్యాత్మిక రంగంలో వుండే మీరందరూ జ్ఞానమునందు ఆసక్తి కలవారై, ఈ త్రిగుణాలయొక్క బంధం నుండి విడివడాలి. ఆత్మానుభూతిని, ఆత్మసాక్షాత్కారాన్ని పొందాలి. ఈరోజు ఒక కథ చెప్పాలని వుంది. దీనికి సంబంధించినది కాదు. మీరు గుణాలతోటే చాలా ఇబ్బందిపడుతూ, వాటిని వదలలేక, ఇంకొకదాన్ని పట్టుకుంటున్నారు. అదే గణాంకం. గణానికి చిన్న కొమ్ము తగిలిస్తే గుణాంకమవుతుంది. దాని కొరకే ఈ కథ. ఒక లాయరుగారికి ప్రాక్టీసు నడవక, డాక్టర్‌గా క్లినిక్ పెట్టుకున్నాడు. జనాల్ని ఆకర్షించటానికి బయట ఒక బోర్డు పెట్టాడు. "ట్రీట్‌మెంటు ఫీజు 300 రూ॥. జబ్బు నయం కాకపోతే, 1000 రూ॥ ఇవ్వబడును". ఒక రోగి ఆ బోర్డును చూచి, తనకు వెయ్యిరూపాయలు సంపాదించే అవకాశం వచ్చిందని సంబరపడుతూ ఆ క్లినిక్ లోనికి వెళ్ళాడు, మీకు లాగానే.*

*పేషెంట్:* *డాక్టరుగారూ! నా నాలుక రుచి కోల్పోయింది.*

*డాక్టర్:* *నర్స్! 22వ బాక్స్‌లో వున్న మందు తీసుకొచ్చి 3 చుక్కలు అతని నోట్లో వెయ్యి.*

*పేషెంట్:* *ఛీ! ఇది పెట్రోలు కదా డాక్టర్?*

*డాక్టర్:* *కంగ్రాట్స్. నీ నాలుకకు రుచి తెలుస్తోంది. 300 ఫీజు ఇచ్చి వెళ్ళండి.*

*పేషెంట్‌కు కోపం వచ్చింది. 300 రూ॥ ఫీజు ఇచ్చి అక్కడి నుండి వెళ్ళిపోయాడు. ఇది కూడా మీకు లాగానే. కొన్ని రోజులకు తాను పోగొట్టుకున్న డబ్బులు తిరిగి సంపాదించుకుందామని మళ్ళీ క్లినిక్‌కు వెళ్ళాడు.*

పేషెంట్: డాక్టర్! ఈ మధ్య నాకు ఏమీ గుర్తుండటం లేదు.

డాక్టర్: నర్స్! 22వ బాక్స్‌లో వున్న మందు తీసుకొచ్చి 3 చుక్కలు వెయ్యండి.

పేషెంట్: డాక్టర్! అది నాలుకకు రుచి తెప్పించే మందు కదా?

డాక్టర్: కంగ్రాట్స్! నీ మతిమరుపు పోయింది. 300 రూ॥ ఫీజు ఇచ్చి వెళ్ళండి.
పేషెంట్‌కు మరింత కోపం, పట్టుదల పెరిగి కొన్ని రోజుల తర్వాత మళ్ళీ వచ్చాడు.

పేషెంట్: డాక్టర్! నా కళ్ళు ఈ మధ్య సరిగా కనబడటం లేదు.

డాక్టర్: హు, నా దగ్గర దీనికి మందులేదు. కాబట్టి, ఈ వెయ్యి రూపాయలు తీసుకో.

పేషెంట్: డాక్టర్! ఇది 10 రూ॥ల నోటే గదా?

డాక్టర్: వావ్, కంగ్రాట్స్! నీ చూపు తిరిగి వచ్చింది. 300 రూ॥ ఫీజు ఇచ్చి కదులు.
దటీజ్ లాయర్-కమ్-డాక్టర్ మరియు జీవుడు-కమ్-దేవుడు.

**తత్సాధుమన్యే సురవర్య! దేహినాం సముద్విగ్నధియా మసద్గ్రహాత్ ।**
**హిత్వా త్మ పాతం గృహమంధకూపం వసంగతో యద్దరి మా శ్రేయత ॥**

సామాన్యంగా శరీరమంటూ వచ్చిన తర్వాత గతజన్మ వాసనలన్నీ వచ్చి చేరుకుంటాయి. అప్పుడు స్వ-పర భేదమేర్పడుతుంది. అహంకార మమకారాలు తీవ్రంగా పనిచేస్తాయి. మనసు స్వేచ్ఛగా ప్రవర్తిస్తుంది. ఇంద్రియాలన్నీ చూచిన విషయాల మీదకెల్లా పరిగెడుతాయి. ఈ శరీరమే నేను, ఈ ఇంద్రియ సంఘాతమే నేను అనే భావం బలపడుతుంది. ప్రతి శరీరానికి నా అంతటివాడు లేడని విర్రవీగుతాడు. అంతేగాక, ఈ స్థలాలు, ఈ పొలాలు నేనే సంపాదించాననుకుంటాడు. ఈ ఇల్లూవాకిలి, భార్యాపిల్లలు, సర్వసంపదలూ నావే అని అహంకరిస్తాడు.

కెరటం మీకు ఆదర్శం కావాలి
ఎందుకంటే, అది లేచిపడుతున్నందుకు కాదు, పడినా లేస్తున్నందుకు

**చిల్లర డబ్బులు నాలుగుంటే చాలు, ఘల్లుఘల్లుమని ఒకటే మోత**
**మిడిమిడి జ్ఞానంలా కోట్లకొద్దీ వున్నా, నోట్ల సవ్వడి విన్పించదు**
**పరమహంస చిద్విలాసంలా,**
**అవ్యక్తభావనలోనే ఊహకు ఆస్కారముంది**
**ఊహలోనే జీవనమాధుర్యముంది**
**తెలుసుకోవటానికి, తెలియచేయడానికి అంతమంటూ వుండదు**
**అంతుంది (అంత వుంది) మరి విషయం**
**అంతా సంతోషంగా ఉంటే, కొంతమందికి ఎంతో నష్టం**
**చీకట్లో దోచుకునే వాళ్ళకు వెన్నెలంటే మంటే కదా!**

***అరిషడ్వర్గములు చీకట్లోనే దాక్కుంటాయి***
***దాపురించేవి ఎప్పుడూ కష్టమే అందుకే***
***కష్టమే ముఖ్యమనుకోండి, కష్టమే గమ్యమనుకోండి***
***కష్టమే లక్ష్యమనుకోండి, కష్టమే ఆశయమనుకోండి***
***కష్టంలోనే అదృష్టముంది, కష్టంలోనే సాధన వుంది***
***కష్టపడుతూ జీవించండి, కష్టాలను అధిగమించండి***
***ఆంజనేయుడి బోధలు విని ఆవరించిన అజ్ఞానాంధకారాల్ని దూరం చేసుకుని***
***ఆధ్యాత్మిక జ్ఞానశక్తితో, మహోన్నతులుగా, సంస్కారవంతులుగా తీర్చిదిద్దిబడి,***
***ప్రేమామృతులై దరిచేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**22-07-2020** 09:10 AM

**85) సాధకునకు ఉండవలసిన గుణాలు ఏవి స్వామీ? ఎంతకాలం సాధన చేయాలి స్వామీ?**

*సాధనకుపక్రమించే ప్రతి సాధకుడు, విధిగా పాటించవలసినవి, 1) వినయం 2) విధేయత 3) వినమ్రత 4) వివిధక్రియలు. వివిధ విధానాలో ఈ మూడింటినీ పాటిస్తూ, సమయ నియమనిబద్ధతలతో జీవనయానం కొనసాగించగలగాలి. అందరూ పోయేవాళ్ళే. కాకపోతే, కాస ముందూ-వెనుక అంతే. ఎంతోమంది సేవామూర్తులుగా సమాజానికి ఎంతో, ఎంతెంతో, మరెంతో సేవలు చేస్తున్నారు. సైనికులు, డాక్టర్లు, పోలీసులు ప్రాణాలు సైతం అర్పిస్తున్నారు. ఇంతమంది సేవామూర్తుల గుణం మీలో ఒక్కసారైనా కనిపించకపోతే, అది మానవత్వమెలా అవుతుంది? ఎంతటి దానవుడిలోనైనా, మానవత్వం తొంగిచూడాలి. అయినవారు, పరాయివారు అనే భేదం ఉండకూడదు. మనిషిలో మార్పు రావాలి. ఆపదలో ఆదుకునేది ఆపద్ధర్మంగా భావించాలి. ఈ కరోనా వచ్చి, మీకు ఎన్నో అనుభవాలను నేర్పింది. కాదంటారా? కాదనటానికి వీల్లేదు. ఎందుకంటే, విలాసవంతమైన జీవితం కోరుకునే మానవునికి సాధారణ జీవితం కొనసాగించవచ్చు అని తెలియచేసింది. పరిస్థితులకు అనుగుణంగా జీవించటం నేర్పింది. ఆడంబరాలు, వస్తువాహన వినియోగం లేకుండా కూడా ఈ ఆధునిక మానవుడు జీవించగలడు అని రుజువుచేసింది. ఇది ప్రకృతి మీచేత చేయించి చూపించింది తప్ప, మీకు మీరుగా చేసే స్థితిలో లేరని మానవునికి నేర్పించింది. మీకు తెలియని ఒక శక్తి ఈ భూమండలాన్ని నడిపిస్తూ వుందని తెలియచేసింది. అందుకే సాధన ద్వారా పైన చెప్పిన గుణాలు మీ సొంతమైతే, సాధ్యం కానిది ఏదీ లేదు. అంతా సుసాధ్యమే. అంతా సుగుణాలే. అంతా శరణాగతే. అలా ఈ సాధన ఎంతకాలం సాగాలని మీరడిగితే, నేను చెప్పేదొక్కటే. రోడ్డు ప్రక్కన పెద్ద వృక్షాలను చూస్తుంటారు. అల్లంత దూరంలో వరిపైరు ఉంది. పెద్ద వృక్షాలకు నీరు అందించాల్సిన అవసరం లేదు. వాటి వేళ్ళు విస్తారంగా భూమిలోనికి వ్యాపించి వుంటాయి నీటిమట్టం వరకు. కానీ,*

*వరిపైరుకు నీరు అందుతుందో లేదోనని నిత్యం చూడాల్సిందే. తరచూ నీళ్ళు పెట్టాల్సిందే. లేకుంటే వాడిపోతుంది. వాటి వేళ్ళు పైపైన 3, 4 అంగుళాల వరకు దిగివుంటాయి. కనుక, ఈ ఉదాహరణ మాదిరిగా, విశ్వాసం అనే వేర్లు హృదయాంతరాళల్లో చేరి, మనస్సును కదలక మెదలక, అదరక బెదరక ఎన్ని కష్టాలు ఎదురైనా భరించగల శక్తి ఓపిక వచ్చే వరకూ ఆధ్యాత్మిక సాధన కొనసాగించవలసిందే. సామాన్యులైన మీ భక్తివిశ్వాసాలు వరిపైరు మాదిరిగానే ఉంటాయి. నిత్యం నీళ్ళు పెట్టినట్లే, నిత్యసాధన లేకుంటే, మీ భక్తివిశ్వాసాలు క్షీణించిపోతాయి. భగవదనుగ్రహానికి పాత్రులు కాలేరు, చేరువ కాలేరు. దేవుడు కరుణ చూపలేదు అని పరితపిస్తారు. కానీ, మీరు దేవాలయంలో ఉన్నా, మనసు మార్కెట్లో తిరుగుతుంది. అయినా, మనసుని నిగ్రహించే ప్రయత్నంలో భాగమే ఆధ్యాత్మిక సాధన. ఆఫీస్ వర్క్‌లో ఉన్నప్పుడు, కారు నడుపుతున్నప్పుడు, పుస్తకం చదువుతూ విషయాలు గ్రహిస్తున్నప్పుడు ఏకాగ్రతతో ఉంటే, మరే ఆలోచనా రాదు. వేరే ఆలోచన్లలో వుంటే, మరే ఆలోచనా రాదు. వేరే ఆలోచన్లలో వుంటే ప్రమాదాల్లో పడతారని అంతరాత్మ బోధిస్తుంది. ఆధ్యాత్మిక సాధనల్లో కూడా అదే విధంగా ఆలోచించాలి.*

***గడచిన కాలం సుఖదుఃఖాల చేదుజ్ఞాపకాలు మిగలగా,***
***జీవితమనే చదరంగపు క్రీడలో జయాపజయాలు దాటిన వేళ,***
***పొందిన అనుభవాలు, అనుభూతులు స్మృతిపథాన కదులుచుండగా,***
***ఆత్మీయుల ఆలంబనతో ఆనందంగా గడపాలనుకునే ఆరాటంతో,***
***అందరూ తనవారే అనే ఆలోచనలతో అలసిపోయిన వార్ధక్యం***
***జీవనయాత్రలో చివరి మజిలీ చేరుకుని,***
***ఎవరూ నిరాదరణ చేయకూడదని చింతిస్తూ,***
***చిరంజీవి హనుమ మాటలు జ్ఞప్తికి తెచ్చుకుంటూ,***
***ఆధ్యాత్మిక సాధనలో సాగుతూ,***
***అడుగు అడుగు అంతరంగంలో అంతర్‌శోధన జరుపుతూ,***
***ఆంజనేయుని పథంలో అడుగు వేస్తూ, అతిత్వరలో నన్ను చేరండి***
***నా చిన్నారి ముద్దు బిడ్డలారా!***

అందాన్ని అందరూ ఆశిస్తారు : ఆదర్శాన్ని కొందరే శాసిస్తారు

ॐ

**01-09-2020** 09:10 AM

**86) జీవిత పరమార్థాన్ని సాధించే దిశలో ఆధ్యాత్మిక మార్గము మాకు అందించే సూచనలు ఏవి స్వామీ?**

*మానవజీవిత పరమార్థమేమిటంటే, జీవభావాన్ని సమూలంగా తీసివేసుకుని, సంపూర్ణస్వేచ్ఛను అనుభవిస్తూ, అంతిమంగా విశ్వంలో సునాయాసంగా కలిసిపోగలగాలి, కలిసిపోవాలి. అందుకు మీరు*

*ఆధ్యాత్మిక మార్గాన్ని, సద్గురువు బోధించే తీరులో అనుసరించాలి. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనబడే అరిషడ్వర్గాలు ఆధిక్యతను సంతరించుకుంటే, మానసిక అశాంతి, అంతరంగంలో అసంతృప్తి తారాస్థాయికి చేరి, జీవితంలో అతి భయంకరమైన సమస్యలు ఉత్పన్నమై, జీవితకాలం కుంచించుకుపోతుంది. జీవితం బంధాలతో కొనసాగుతుంది. కర్మలు, జన్మలు పొడిగించబడతాయి. వాస్తవానికి బంధాలే బాధలకు మూలం కదా! మీరు ఎవరిపట్లనైనా వ్యతిరేకతను, ద్వేషాన్ని ఏర్పర్చుకుంటున్నారంటే, అందుకు మూలకారణమేమిటి? వారి ద్వారా మీకు ఏదో కష్టమో, నష్టమో, అపకారమో జరిగిందని భావిస్తున్నట్లే కదా. అది కేవలం మీ వ్యక్తిగత అభిప్రాయమే. వాస్తవానికి మీ ఎదుగుదలకు, పతనానికి మీరే బాధ్యులు తప్ప, అందులో వేరే మరెవ్వరి ప్రమేయమూ ఉండదు. భగవంతునికి కూడా సంబంధముండదు. ఒక వ్యక్తి ద్వారా నష్టం జరిగింది అనేది కేవలం మీ భావనే. ఎందుకంటే, నష్టంలో లాభముంటుంది, అపజయంలో విజయం వుంటుంది, అపకారంలో ఉపకారం వుంటుంది. మానసికంగా ఎదగనివారు జీవితాన్ని ఒకే కోణంలో పాక్షికంగా చూస్తారు. పరిణతి చెందినవారు రెండింటినీ కలిపి చూస్తారు. అందువలన ఎవరో మీకు అపకారం చేశారని వారిపట్ల వ్యతిరేకతను ఏర్పర్చుకోవడం ద్వారా వారికి ప్రమాదం లేదు, మీరే బలహీనపడి, అతి భయంకరమైన మనోరుగ్మతలకు గురి కావలసి వస్తుంది. ప్రత్యక్షంగా అపకారం జరిగినా, పరోక్షంగా ఉపకారం జరిగిందని భావించినప్పుడు, మీరు వారికి కృతజ్ఞతలు తెలియచేసి మనస్ఫూర్తిగా క్షమించి వదిలివేయగలగాలి. అలాగే, ఎవరి వలనైనా ఉపకారం జరిగిందని భావించడం కూడా అజ్ఞానమే. ఎందువలనంటే, ఉపకారంలో తప్పక అపకారం కూడా వుంటుంది. ఏదో పోయిందని బాధపడకూడదు, వచ్చిందని పొంగిపోకూడదు. ఇటువంటివన్నీ అందరూ తెలుసుకోవల్సిన జీవితసత్యాలు. అలాగే త్యాగమంటే సంపదను అందరికీ పంచటం కానేకాదు. అరిషడ్వర్గాలను త్యాగం చేయగలగాలి. చెడును విదిలించుకోగలగాలి. క్షమాగుణాన్ని అలవర్చుకోగలిగితే <u>ప్రేమతత్త్వం</u> ఉద్భవిస్తుంది. దానినే మేము మీ నుండి కోరేది. అది అందించినట్లయితే, జీవితం తప్పక ఆనందమయమవుతుంది. వాస్తవానికి అసంతృప్తిగా ఉన్నవారే బాహ్యప్రపంచమందలి అల్పమైన అంశాలకు ప్రాధాన్యమిస్తూ వానికోసం వెంపర్లాడుతూ వుంటారు. అయితే ఆనందం పొందే విషయాలను గురించి సద్గురువుల బోధలను అవగాహన గావించుకొని ఆచరించగలిగితే, జీవితం అన్ని విధాలా సార్థకమవుతుంది. తెలివి, మేథోసంపత్తి అధికంగా వున్నవారే శారీరక, ఇంద్రియ, మానసిక, బుద్ధులను సంతృప్తిపరిచే విధానాలను అనుసరిస్తూ, బుద్ధి పరిధిని మూసివేస్తారు. కాబట్టి, మనిషే తన స్వస్వరూపాన్ని తెలుసుకోగలగాలి. తనను గురించి తాను ఆలోచించగలగాలి. తనలోకి తాను పయనించగలగాలి. తనను తాను సంస్కరించుకోగలగాలి. సమూలంగా శుద్ధిగావించుకోగలగాలి. అందుకు పరివర్తన, పశ్చాత్తాపాన్ని మించింది లేదు. దీన్ని మించిన సాధన మరొకటి లేదు. కాబట్టి, ఇకనైనా మేల్కొంచి, అహంకారాన్ని సమూలంగా నాశనం చేసికొని, ఆనందాన్ని అనుభవిస్తూ, జీవితపరమార్థం నెరవేర్చుకోవాలని ఆశిస్తున్నాను. అభయంతో ఎదురుచూస్తున్నాను. అడుగు ముందుకా? వెనక్కా?*

**న్యాయోపేతా గుణోపేతాః సర్వలోక హితైషిణీః ।**
**సంతః స్వర్గచితః శుక్లాః సన్నివిష్టాశ్చ సత్పథే ॥**

న్యాయపరాయణులు, సద్గుణ సంపన్నులు, సర్వజన హితైషులు, అహింసాపరులు, సన్మార్గంలో నడిచేవారు అయిన సజ్జనులు స్వర్గాన్ని జయిస్తారు.

***పురాణేతిహాసాలతో ఆపాదమస్తకం***
***మనసును మృదులం చేసుకోవల్సింది మనిషే***
***జ్ఞానసముపార్జనతో అహర్నిశం శ్రమిస్తూ***
***వజ్రదేహియై సృష్టికి ప్రతిసృష్టి చేయవలసింది మనిషే***
***తానేంటో తెలుసుకోవాలన్న కాంక్ష ఒకరిది***
***తానేమిటో జగతికి చూపించాలనుకునేది మనిషే***
***ఆధ్యాత్మిక బాటలో మోక్షగామిగా మారవలసింది మానవుడే***
***మార్గాలెన్నో చూపాడు ఈ మారుతి***
***మార్గాన్ని అనుసరించవలసింది మానవుడే***
***మార్గం సున్నితంగా చేసుకుని***
***అడ్డుపడిన అరిషడ్వర్గాలను దాటుతూ***
***దారిలో దాక్కున్న వాటిని పొంచి చూసి వాటిని జయిస్తూ***
***ప్రేమ అనే విజయకిరీటం ధరించి***
***ప్రేమామృతుడైన ఈ పవనకుమారుని సన్నిధి చేరి సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**02-09-2020** 08:55 AM

**87)** భగవంతుడు మా నుంచి ఏమి ఆశిస్తాడు స్వామీ?

సకల జీవరాశులలోకెల్లా ఉన్నతమైన జీవి మనిషి. అందువలన జీవితపయనం ముగించే లోపల, తుచ్ఛమైన దుష్టబుద్ధులు విడిచి, ధర్మబద్ధంగా గడిపి, జన్మను సార్థకం చేసుకోవాలి. కొండంత పరమాత్మునికి కొండంత పూలు అవసరం లేదు. భగవంతుడు భక్తుని హృదయ పవిత్రతను మాత్రమే చూస్తాడు. అతని సిరిసంపదలను, పదవులను, శక్తిసామర్థ్యాలను చూడడు. పరమాత్మునికి మీ భావం ముఖ్యం తప్ప పూజలు, కానుకలు ముఖ్యం కాదు. మీ పెద్దరికాన్ని కాపాడుకోండి. పెద్దతనంలో మీ పరువును కాపాడుకోవటం పూర్తిగా పూర్తిగా మీ చేతుల్లోనే వుంది అని చెబుతాను. అనవసరపు విషయాల్లో జోక్యం చేసుకోకుండా, మితభాషులుగా వుంటూ, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ అన్నింటికన్నా ముఖ్యవిషయం, నన్ను ఎవరూ గౌరవించటంలేదు అనే ఆత్మన్యూనతాభావం దరిచేరకుండా జాగ్రత్తపడండి. భవబంధాలు అంత తేలికగా తగ్గించుకోలేరు. కనీసం కొన్ని విషయాలను వదిలివేయండి. పాజిటివ్‌గా చూడండి. మీరు ఎక్కడికీ పరిగెత్తాల్సిన అవసరం లేదు. సంపాదించాల్సిన అవసరం లేదు. మొత్తం సంసారాన్ని

లాగే బాధ్యత లేదు. హాయిగా పూజలు చేసుకోవచ్చు, భగవద్గీత, భాగవతం చదువుకోవచ్చు, దైవదర్శనాలు చేసుకోవచ్చు. ఎన్నో సత్కార్యాలు చేసుకుంటూ జీవనం కొనసాగించవచ్చు.

**88) భగవద్గీత యొక్క విశిష్ఠత ఏమిటి స్వామీ?**

భగవద్గీత అనేది భగవంతుడు భారతీయులకు ప్రసాదించిన మహత్తర కానుక. ఒక దేశంలో పరిపాలన సజావుగా కొనసాగటానికి రాజ్యాంగం ఎంత అవసరమో, మానవజీవిత పరిపూర్ణత్వం నెరవేరడానికి భగవద్గీత అంతే అవసరం. వేదవ్యాస భగవానులవారు నాలుగు వేదాల సారాంశాన్ని, ఉపనిషత్తుల విషయాన్నంతటినీ పద్దెనిమిది అధ్యాయాలుగా భగవద్గీత రూపంలో అందించటం జరిగింది. భగవద్గీత సర్వమత సమన్వయం, సర్వవేద సమన్వయం, సర్వయోగ సమన్వయంగా అర్థం చేసుకోవాలి. భగవద్గీత యందలి మొదటి ఆరు అధ్యాయాలు కర్మషట్కంగా, మధ్యలో ఆరు అధ్యాయాలు భక్తిషట్కంగా, చివరి ఆరు అధ్యాయాలు జ్ఞానషట్కంగా విభజింపబడినవి. భగవద్గీతను సమూలంగా అధ్యయనం చేయగలిగితే, ఇక జీవితంలో తెలుసుకోవాల్సింది ఏమీ వుండదు. అందులో ప్రతి శ్లోకం ఎంతో విలువైనది.

**89) ధర్మం అంటే ఏమిటి స్వామీ?**

విశ్వమంతా ఏకత్వంతో కూడివుంటుంది. అటువంటి ఏకత్వాన్ని సత్యం అనుకుంటే, దాని నుండి భిన్నత్వంతో కూడిన భౌతికజగత్తు ఆవిర్భవించింది. కనుక, ఆ భిన్నత్వమే ధర్మం అవుతుంది. సత్యం నుండి ధర్మం ఆవిర్భవించి, అది తిరిగి మరలా సత్యంలో ఐక్యం చెందుతుంది. మీరు సూక్ష్మంగా విశ్లేషించుకున్నట్లయితే, సత్యం నుండి ధర్మం ఆవిర్భవించి, తిరిగి మరలా దానిలోనే లయం చెందుతున్నప్పుడు ఇక ధర్మం కూడా సత్యమే కదా! అటువంటి సత్యమే భగవంతుడు. భగవంతుడు ఏకత్వం కాబట్టి, దానికి ఎటువంటి సమాచారము వుండదు. భిన్నత్వం కానిదానినంతటినీ ఏకత్వంగా భావించటం జరుగుతుంది. అనంతమైన సృష్టిలో పంచభూతాలు, నక్షత్రమండలాలు, గ్రహాలు, ఉపగ్రహాలు, పాలపుంతలు, వృక్షాలు, జంతువులు, జీవులు, నిర్జీవుల వంటివన్నీ భగవంతుని ఆదేశాలకు అనుగుణంగా ఆవిర్భవించి కొంతకాలం కొనసాగి, ఆ తదుపరి లయం చెందుతాయి. ఇవ్వన్నీ ధర్మానికి అనుగుణంగానే మనుగడను సాగిస్తాయి. అగ్నికి ఒక ధర్మం వుంటుంది, నీటికి ఒక ధర్మం వుంటుంది. వృక్షాలకు ఒక ధర్మం వుంటుంది, జంతువులకు మరొక ధర్మం వుంటుంది. ఒకటి మరొకదానికి ఉపయోగపడ్తుంది. ఒకటి మరొకదానికి ఆధారమవుతుంది. అన్నీ వేరుగా కన్పిస్తున్నా, వాటి మధ్య సహజీవనం, సహచర్యం, సామరస్యం, సహకారం అనేవి వుంటాయి. సమాజం కూడా భిన్నత్వంతో కూడివుండిన మానవులంతా ఎవరి ధర్మాన్ని వారు ఆచరించడం జరుగుతుంది. వాస్తవానికి ధర్మం యొక్క మూలం మాత్రం మారదు, బాహ్యంగా మాత్రం అనేక రూపాలుగా వుంటుంది. అసలు విషయం ఏమిటంటే, భిన్నత్వానికే జ్ఞానముంటుంది. సమాచారమనేది ద్వంద్వాలతో కూడి వుంటుంది. అది నిరంతరం మార్పులకు లోనవుతూ వుంటుంది. మారేది ఏదైనా, ఎటువంటిదైనా సత్యం కానేకాదు, మాయకు ప్రతిరూపమే. మీరు జాగ్రత్తగా విశ్లేషించుకున్నట్లయితే, కాలాన్నిబట్టి, సందర్భాన్నిబట్టి, ప్రాంతాన్నిబట్టి, అక్కడి పరిస్థితినిబట్టి, ధర్మం మారుతూ వుంటుంది. ఒకరికి ఒకటి ధర్మమైతే, అది మరొకరికి అధర్మమవుతుంది.

అంతరంగమందలి మూలం ఒకటైనప్పటికీ, ఆచరణకు వచ్చేసరికి వేరుగా వుంటుంది. మీరు చూసే కోణాన్నిబట్టి అది మారుతూ వుంటుంది. అందునా భౌతిక జీవితంలో ధర్మాన్ని ఒక్కొక్కరూ ఒక్కొక్క రకంగా వ్యక్తీకరించడం జరుగుతుంది. భిన్నత్వాన్ని ఆచరించడం బహు కష్టతరం. అందునా, మారేదానిని అనుసరించడం ఎంతో ఇబ్బందికరంగా వుంటుంది. భిన్నత్వాన్ని పట్టుకున్న వ్యక్తి ఏకత్వాన్ని అందుకోలేడు. మాయ ఆవహించినట్లయితే, సత్యదర్శనం కాదు. అంతేగాక, కులాన్నిబట్టి, మతాన్నిబట్టి, కాలాన్నిబట్టి ఎన్నో రకాల ధర్మాలుంటాయి. అన్నింటినీ ఆచరించడం సాధ్యం కాదు కదా! అంతేగాక, నియమం అనేది మనసును నియంత్రించి స్వేచ్ఛను హరించివేస్తుంది. ఒకరు ఒకరకంగా ఆదేశిస్తే, మరొకరు మరొకరకంగా పాటించమంటారు. ఇదంతా ఒక రకంగా "ముందు నుయ్యి, వెనుక గొయ్యి" అన్నట్లుగా వుంటుంది. అయితే, అందరూ తెలుసుకోవాల్సిన నగ్నసత్యమేమిటంటే, కర్మ అనేది ఏదైనా, ఎటువంటిదైనా సంస్కారం యొక్క ప్రేరణే. దానిని ఆచరించడం ద్వారా అది అనుభవంగా మారి, మరొక కర్మకు బీజమవుతుంది. ఆ విధంగా కర్మబంధం కొనసాగుతుంటే, ఇక స్వేచ్ఛకు అవకాశం ఎక్కడిది? కాబట్టి, ధర్మాచరణమనేది ఏ కోణం నుండి చూచినా అది బంధమే తప్ప మోక్షానికి అవకాశమే లేదు. అందువలన అటువంటి విషవలయం నుండి బయటపడాలంటే, భగవంతుని ఆశ్రయించడం, శరణువేడటం ఒక్కటే పరిష్కారం.

తెలిసినతనం, తెలియనితనం
రెండూ తెలియనితనం లోనివే అని తెలుసుకున్నప్పుడు
అదే తెలిసినతనం

***ఎప్పుడో అప్పుడు, ఎక్కడో అక్కడ,***
***ఎలాగో అలాగ, ఇలాగో మరెలాగో***
***చూడగానే కొట్టుకుంటుంది గుండె వేగంగా***
***ఎవరో, ఎప్పుడో, ఎలాగో అలాగ***
***ఈ రోజో, మరో రోజో దోచుకుపోతారు దాన్ని***
***కానీ, అందాకా పవిత్రంగా, పదిలంగా, స్వచ్ఛంగా, సహజంగా ఉంచాలి దాన్ని***
***ఇది రక్తనిధి. అర్థాల అందాల సరోవరం***
***శరీరం సజీవం కోసమే***
***మరి అంతేకాదు, నవరసభరిత పుష్పం***
***పవిత్ర దేవాలయం. పరిపూర్ణ ఆనందనిలయం***
***అర్పించటానికి, అర్చించటానికే***
***ప్రణయమో, ప్రణవమో, ప్రమాదమో, ప్రమోదమో***
***నీవే నిర్ణయించుకోవాలి***
***జీవితం చిన్నది, మరి ఆశ పెద్దది***
***ప్రేమ అనేది ఒక అగాధమైన జలనిధి***

***ఆరాధనాపూర్వకమైన మహోన్నత శిఖరం***
***వీటన్నింటినీ అంతర్లీనం చేసుకుని***
***ముదముతో పరిభాషించినా, మనసుతో పరిహాసించినా***
***స్వాదీనముతో స్పందించినా, అలజడుల మధ్య అలసిపోయినా***
***మనిషి బ్రతుకు అరుణోదయం***
***అది నిజం***
***గాయమైనా, గేయమైనా***
***అమృతరసమైనా, హాలాహలమైనా***
***సుమధురభరితం చేసుకుని***
***నా సాన్నిధ్యాన్ని చేరుట అనేది అక్షరాలా నిజం***
***ఇది సువర్ణాక్షరాల మాల***
***ఈ మాలలో చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**03-09-2020** 09:00 AM

**90–**A) **శరణాగతి అంటే ఏమిటి స్వామీ?**

*మోక్షపదవిని పొందాలంటే, భగవంతుని అనుగ్రహం కావాలి. అందుకు భగవంతుని శరణు పొందాలనే శుభేచ్ఛ కలగాలి. ఎంతో పుణ్యం చేసుకున్నవారికి మాత్రమే అటువంటి శుభేచ్ఛ కలుగుతుంది. పూర్వజన్మలలో భగవత్ సంబంధమైన చింతన ఎంతో కొంత చేసి వుంటేనే, భగవత్ సంబంధమైన పూజాదికాలు యజ్ఞయాగాదులు కొన్నైనా చేస్తేనే, భగవంతుని స్మరిస్తూ జపధ్యానాదులు సాగిస్తేనే భగవంతుని శరణుపొందాలనే కోరిక కలుగుతుంది. సాధారణంగా ప్రతివారు తన సంసారానికి, తన పాండిత్యానికి, తన గొప్పదనానికి, తన సంపదకు, తన పదవికి, తన కీర్తికి, తన ఠీవికి, తన ప్రతాపానికి, తన తెలివితేటలకు శరణాగతుడు అవుతాడే గాని, భగవంతునికి శరణుపొందాలనే సద్బుద్ధి నూటికో కోటికో ఏ ఒక్కరికో తప్ప అందరికీ కలగదు. అయితే, నిజమైన శరణాగతి ఏది అని అడిగేటట్లయితే, సర్వమూ భగవంతుడేనని, తనదేమీ లేదని, తాను కేవలం నిమిత్తమాత్రుడేనని, సర్వమూ ఆయన ఇచ్ఛ ప్రకారమే జరుగుతున్నదనే విశ్వాసం వుండాలి. మీకు ఏ ఇష్టాయిష్టాలు వుండకూడదు. భగవంతుడు ఏది అనుగ్రహిస్తే దానితో సంతుష్టులుకావాలి. ఇదీ శరణాగతి, ఇదే శరణాగతి! అభిమానం, అవివేకం లేనివారు, ఆసక్తిని వదిలినవారు, నిత్యమూ ఆధ్యాత్మిక జ్ఞానంలో వున్నవారు, కోరికలను పూర్తిగా వదిలినవారు, సుఖదుఃఖాలనే ద్వంద్వాల నుండి విడుదల పొందినవారు, మూఢత్వం తొలగి ఆ అవ్యయమైన బ్రహ్మపదాన్ని చేరుకుంటారు. బ్రహ్మప్రాప్తి పరమజ్ఞానికే. అట్టి జ్ఞానిగా కావాలంటే, భగవంతుని శరణుపొందాలి.*

**90–B) శరణాగతిని సాధించుటకు ఎట్టి సాధన చేయాలి స్వామీ?**

*శరణాగతి సాధించుటకు అయిదు సాధనలు కావాలి. 1) అభిమానం లేకుండుట 2) మోహం లేకుండుట 3) సంగదోషం లేకుండుట 4) కోరికలు లేకుండుట 5) ద్వంద్వభావన లేకుండుట.*

*1) అభిమానం:– వివేకం లేనివాడు అంటే, అభిమానము జ్ఞానానికి విరోధి. నేను గొప్ప అనే అహంకారమే అభిమానం. మహాభారతంలో దుర్యోధనుడు తన అభిమానం గురించి తానే చెప్పుకున్నాడు, "మానధనాడ్యుడైన భూపతి సహియింపనోపునే సపత్నుల వృద్ధియు, ఆత్మహానియున్" అని. అంతటి మానధనాడ్యుడు గనుకనే, మయసభలో పరాభవం పాలయ్యాడు. పరుల ధనాన్ని అపహరించాలని కపటజూదం ఆడించి, భగవంతునికి విరోధి అయ్యాడు. నేను ధనవంతుడ్ని, నేను అందగాడిని, నేను గొప్ప బుద్ధిమంతుడ్ని ఇలా భావించేవారంతా అభిమానధనులే, దురభిమానులే. ఈ అభిమానమే అవివేకులను చేస్తుంది. కనుక, అభిమానాన్ని వదిలి నమ్రత నేర్చుకోవాలి. అందుకే లంకకు వెళ్ళి సీతాదేవిని చూచిన తర్వాత రావణునితో మాట్లాడుతూ, సుగ్రీవుని వద్ద నాకన్నా తక్కువ కోతి లేదన్నాను. ఇదీ అభిమానరాహిత్యం అంటే అని చెప్పుకొనవచ్చు. ఇది అహంకారంతో చెప్పుకొనుటలేదు, సందర్భం గుర్తుకువచ్చి అవసరానికి అనువుగా చెప్పాను. అందుకే భక్తుల దృష్టిలో భక్తాగ్రగణ్యుడనయ్యాను.*

*2) మోహం:– అంటే అవివేకం. "ఈ దేహం నేను" అనుకోవటం, "ఈ జగత్తు సత్యం" అనుకోవటం, "ఇక్కడి వస్తువులు, విషయాలతో నేను సుఖిస్తున్నాను" అనుకోవటం మోహం. మోహం మోక్షానికి పెద్ద ప్రతిబంధకము. అసలు మోక్షం అంటే* ***మో****హాన్ని* ***క్ష****యం చేసుకోవటం అని అర్థం.*

*3) సంగం:– అంటే అతుక్కుపోవటం. చేసే పనితో, కలిసే వ్యక్తులతో, సుఖాన్నిచ్చే వస్తువులతో, తిరిగే రంగంతో అతుక్కుపోవటమే సంగం. "ఇవి లేకపోతే నేను బ్రతకలేను" అనే భావనయే సంగదోషం. సంగదోషం తొలగితేనే భగవత్ప్రాప్తి. సంగం మహాదోషం. భూమ్యాకర్షణశక్తి కన్నా, విద్యుచ్ఛక్తి కన్నా, అయస్కాంతశక్తి కన్నా ఈ సంగశక్తి చాలా బలమైనది, ప్రమాదకరమైనది. పట్టుకుంటే వదలదు. ఈ సంగదోషం మానవుడ్ని సర్వనాశనం చేసి వదిలిపెడ్తుంది. భార్యాబిడ్డలు, ఇల్లువాకిళ్ళు, ధనం, సంపదలు ఇవ్వన్నీ నావి నావి అనేది మమత్వసంగం. కర్మలన్నింటికీ కర్తను నేను. నేను కాబట్టి ఇంత బాగా చేశాను అనేది కర్తృత్వసంగం. ఈ రెండింటినీ జయించినవారే జితసంగదోషులు. అట్టివారు ఏ వస్తువుల మధ్య వున్నా, ఎవరి మధ్యన వున్నా రాగద్వేషాలు లేకుండా వుండగలుగుతారు. అట్టివారే భగవత్ప్రాప్తికి అర్హులవుతారు. నిత్యము ఆత్మజ్ఞానంలో ఉన్నవారే భగవంతుని చేరుకోగలుగుతారు. భగవంతునితో సంగం పెట్టుకున్నవారు మిగిలిన సంగదోషాలన్నింటినీ తొలగించుకోగలుగుతారు. కనుక నిరంతరం ఆత్మజ్ఞానం, ఆత్మవిచారణ, శ్రవణ, మనన, నిధిధ్యాసలతో వుండేవారు భగవంతుని చేరుకొనుటకు అర్హులు. ఆత్మజ్ఞానాన్ని సద్గురువుల బోధల ద్వారా తెలుసుకోవాలి. నిత్యమూ పరమాత్ముని చింతనలో, ఆత్మజ్ఞానంలో వుంటే, పూర్తి అర్హత సాధించవచ్చు. కొంత ఆత్మజ్ఞానం మీద, కొంత ప్రాపంచిక చింతనలోనూ వుంటే ఎప్పటికైనా అర్హతను సంపాదించగలుగుతారు. అసలు ఆత్మచింతనే లేక లౌకిక జీవితం గడిపేవారికి అసలు భగవంతుని చేరుకొనే అర్హత, అవకాశం ఉండనే వుండదు. నిత్యమూ ఆధ్యాత్మిక చింతనలో*

*ఉండలేకపోతే, కాచుకుని కూర్చున్న మాయ అజ్ఞానంలోకి నెట్టివేస్తుంది. కనుక, నిత్యమూ ఆత్మజ్ఞానంలో, ఆధ్యాత్మిక చింతనలో రమిస్తూ వుండాలి.*

*4) కోరిక:– నిత్యమూ ఆత్మజ్ఞానంలోనే, భగవత్ చింతనలోనే వుంటే కోరికలన్నీ వాటంతట అవే తొలగిపోతాయి. వస్తువులపై కోరిక వుంటే, మనసు వాటివైపుకు పరుగులు తీస్తుంది. అంటే, భగవంతునికి దూరమైపోతుంది. కోరికలు నశిస్తే, మనసు అంతర్ముఖమై, భగవానునికి దగ్గర అవుతుంది. కనుక, నిత్యం పరమాత్మస్మరణలో వుండి, కోరికలను త్యజించాలి. రాముడున్న చోట కాముడుండడు. కనుక అన్ని కోరికలను నివృత్తి గావించుకోవాలి. మోక్షం కావాలంటే, దాన్ని ఒక్కదానినే పట్టుకొని, మిగతా అన్నింటినీ వదలాలి. చివరకు ఆ మోక్షం కావాలనే కోరిక కూడా ఫలితంలోనే కలిసిపోయి, మోక్షం సిద్ధిస్తుంది.*

*5) ద్వంద్వాలు:– సంసారం ఒక సాగరం. ఈ సాగరంలో ద్వంద్వాలనే అలలు నిరంతరం వస్తూనే వుంటాయి. అవి సుఖదుఃఖాలను, శీతోష్ణాలను, లాభనష్టాలను, జయాపజయాలను, మానావమానాలను ఇలా అనేక ద్వంద్వాలను కలిగిస్తూనే వుంటాయి. వీటివల్ల మనసు ఆందోళనలతో అల్లకల్లోలమవుతుంది.*

***అడవిలో వుండేవారికి క్రూరమృగాల బెడద తప్పదు***
***సంతలో కాపురం ఉన్నవారికి సంతగోల తప్పదు***
***గొంగట్లో కూర్చుని తినేవాడికి పురుగుల బాధ తప్పదు***

*అలాగే, ఈ ప్రపంచంలో జీవించేవారికి ఈ ద్వంద్వాల బాధ తప్పదు. సామాన్యమానవుడు వీటి దెబ్బలకు గోడగడియారంలోని పెండ్యులం లాగా అటూ ఇటూ కంపించిపోతాడు. వివేకం గలవాడు సముద్రతరంగాలను తట్టుకొని స్థిరంగా నిలిచే గండశిలలాగా నిబ్బరంగా, నిశ్చలంగా ఉండగలుగుతాడు. అట్టివాడే పరమాత్మను చేరుకొనుటకు అర్హుడు. ఈ ఐదు లక్షణాలు కలవారు అవ్యయమైన నాశరహితమైన, ఉన్నతోన్నతమైన, తత్పదాన్ని, ఆ పరమాత్మపదాన్ని, పరంధామాన్ని చేరుకోగలరు. ఎలా అని అడిగితే, అమూఢులై, అంటే మూఢత్వాన్ని పై సాధనల ద్వారా వదిలించుకొని జ్ఞానులై, ఆ పరమపదాన్ని చేరుకుంటారు. ఈ ప్రపంచంపట్ల వైరాగ్యంతో దుఃఖనివృత్తిని పైన చెప్పిన ఐదు లక్షణాలతో అవ్యయ పరమాత్మను అందుకుని, ఆనందప్రాప్తిని సాధించగలరు. ఈ దుఃఖనివృత్తి, ఆనందప్రాప్తియే మోక్షం, కైవల్యం!*

ప్రపంచంలో ఎన్ని భయంకరమైన జబ్బులు వచ్చి ప్రాణాలు తీస్తున్నా,
వారికి ఏదో ఒకరోజు మందును కనిపెట్టి ప్రాణాలను కాపాడవచ్చు.
కానీ, ఎదుటి వ్యక్తిని ముంచి తాను ఎదగాలి అనే జబ్బుకు
ఎన్ని యుగాలైనా మందు కనిపెట్టడం సాధ్యం కాదు.

***తన చుట్టూ తాను తిరిగితే భ్రమణం***
***గుడి చుట్టూ తిరిగితే పరిభ్రమణం***
***మాట్లాడటానికి శక్తి, పనిచేయటానికి బలం***
***గంటకు ఎంత పని చేస్తావో, అది సామర్థ్యం***

***వింటున్నావంటే అది శబ్దం. చూస్తున్నావంటే అది వెలుగు***
***రంగులన్నీ వర్ణపటం***
***ఆహారం అరగటం జీవక్రియ***
***అరిగిన ఆహారం శక్తిగా మారటం రసాయనక్రియ***
***బ్రతుకుల్లో లేనిది ఏముంది శాస్త్రాల్లో?***
***సరిగా అర్థం చేసుకుంటే మీ బ్రతుకే ఒక శాస్త్రం***
***మనిషినీ, ఇతర ప్రాణుల్నీ, ప్రకృతిని గురించి తెలుసుకోవటం తప్ప***
***భయమెందుకు మీకు?***
***మీకంటే ప్రపంచంలో ఎవరు గొప్ప?***
***తెలుసుకోండి పదిలంగా***
***నేర్చుకోండి సులభంగా***
***చేరుకోండి పవనకుమారుని త్వరితంగా***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**04-09-2020** 07:10 PM

**91)** **పరంధామం అంటే ఏమిటి స్వామీ?**

*పరమాత్మపదం అవ్యయం. దానిని సూర్యుడు వెలిగించలేడు, చంద్రుడు వెలిగించలేడు, అగ్ని కూడా వెలిగించలేదు. ఎక్కడికి వెడితే, వచ్చే పని లేదో, అదియే నీ పరంధామం, పరమపదం. అదియే నా పరంధామం, పరమపదం అని చెబుతాను (ఇక్కడ 'నా' అంటే భగవంతుని పరంధామం, పరమపదం అని అర్థం). 'ధామం' అంటే "ప్రకాశించేది" అని అర్థం. అన్నింటికన్నా గొప్పది" అని కూడా అర్థం. ఏ కాలంలోనైనా, ఎన్నింటిలోనైనా అదే గొప్పది. అన్నింటినీ ప్రకాశింపచేసే శక్తి కలది అని. ఐతే, నా పరంధామం అంటే పరమాత్మ కన్నా వేరుగా ఉన్న ఒక లోకమా? ఒక భవనమా? ఇలా పరంధామం పరమాత్మ కన్నా వేరైనదని ద్వైతులు భావిస్తూ వుంటారు. వైకుంఠం విష్ణువుదని, కైలాసం శివునిదని, సత్యలోకం బ్రహ్మదని భావిస్తుంటారు. ఇదంతా ద్వైతబుద్ధి. ఐతే, పరంధామం, పరమాత్మ వేరు కాదు. పరమాత్మే పరంధామం, పరంధామమే పరమాత్మ. మీరు అడుగవచ్చు, అదేమిటి? నా ఇల్లు అంటే నేను వేరు, ఇల్లు వేరు అని కదా అని. మరి నా పరంధామం అంటే నేను వేరు, పరంధామం వేరు కదా అని సందేహం రావచ్చు. రాహువు తల అంటే రాహువు వేరు, తల వేరు కాదు గదా? ఎందుకంటే, రాహువుకు తల తప్ప మొండెం లేదు. అలాగే నిరాకార పరమత్మయే పరంధామం. పరమాత్మ సూక్ష్మము, సర్వవ్యాపకము, స్వయంప్రకాశం. పరంధామం కూడా సూక్ష్మాతిసూక్ష్మం, సర్వవ్యాపకం, స్వయం ప్రకాశం గనుక, నా పరంధామం అంటే నేనే పరంధామం అని అర్థం.*

మీరు ఏ మార్గాన్ని అనుసరించినా, మీ గురువు ఎవరైనా
మనోనాశనం అత్యంత ముఖ్యం.
మనసు నశించకుండా స్వరూపానుభూతి కలగదు.
గంగానదిలో స్నానం చేస్తే పాపాలు పోతాయి అంటారు.
కానీ, గురువు అనుగ్రహానికి పాపపుణ్యాలు చేశాననే కర్తృత్వబుద్ధిని పోగొట్టే శక్తి వుంది.
సద్గురువు ముక్తిప్రదాత.
గురువు చేయి లేనిదే, సద్గురువు చేయి పనిచేయదు.

***బడికి పోయాక, అంటే మొదలయ్యాక తెలిసింది ఆటల విలువ***
***కాలేజీలో చేరిన తర్వాత తెలిసింది స్కూలు విలువ***
***ఉద్యోగానికి వెళ్ళిన తర్వాత తెలిసింది చదువు విలువ***
***పదవీ విరమణ చేసిన తర్వాత తెలిసింది ఉద్యోగం విలువ***
***మరణానికి దగ్గర అవుతున్నప్పుడు తెలిసింది జీవితం విలువ***
***తీవ్రమైన ఆర్థిక కొరత ఏర్పడినప్పుడు తెలిసింది డబ్బు విలువ***
***పూర్తిగా దయ, కరుణ నశించినప్పుడే కరోనా వచ్చింది***
***ఎంతో మంది మృతులైనా, మీలోని లోపం గుర్తించుటలేదు***
***ఏదైనా మీ చేతిలో ఉన్నప్పుడు తెలియదు దాని విలువ, అసలు విలువ***
***జీవితాన్ని గురించి ఉపరితలంలో చూడటం వేరు, లోతుగా అధ్యయనం చేయటం వేరు.***
***అధ్యయనం చేసినప్పుడే విలువ తెలుస్తుంది. విలువ తెలుసుకోవాలంటే మీలోనున్న కారాలను***
***కొన్ని తగ్గించుకోవాలి. ఆ కారం ఏమిటంటే,***
***గర్వంతో వచ్చే కారం అహంకారం***
***వద్దని త్రిప్పికొట్టే కారం తిరస్కారం***
***వేళాకోళంలో కారం వెటకారం***
***పదవితో వచ్చే కారం అధికారం***
***భయంతో చేసే కారం హాహాకారం***
***ఎదిరించే కారం ధిక్కారం***
***కీడు చేసే కారం అపకారం***
***చీదరించుకునే కారం ఛీత్కారం***
***పగ తీర్చుకునే కారం ప్రతీకారం***
***పైత్యంతో వచ్చే కారం వికారం***
***మదంతో చేసే కారం హూంకారం***
***ఇన్ని కారాలను మీలో ఇముడ్చుకుని, పైపైన చక్కెర కోటింగు వేస్తే,***
***చిన్మయులై, చరితార్థులై, చిరంజీవిని ఎలా చేరి సుఖిస్తారు నా చిన్నారి ముద్దుబిడ్డలారా?***

***ఆ సంబోధనతోనే సన్నిధి చేరగలరు***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**05-09-2020** 09:05 AM

### 92) పరమాత్మను ఏ విధంగా దర్శించవచ్చును స్వామీ?

ఆ పరమాత్మ స్వరూపం ఎంతటి వెలుగు గలదీ అంటే, సూర్యుడుగానీ, చంద్రుడుగానీ, అగ్నిగానీ, ఏదీ దానిని వెలిగించి చూపదు. ప్రపంచంలోని అన్ని వస్తువులను వెలిగించి చూపేవి సూర్య, చంద్ర, అగ్నులే. అన్నింటిలోకీ సూర్యుడు గొప్ప వెలుగు. మీరు అన్నింటినీ ఆ సూర్యకాంతిలోనే చూస్తున్నారు. అయితే, అంతటి వెలుగు గల సూర్యుడు కూడా పరమాత్మను వెలిగించి చూపలేడు. ఒక క్యాండిల్, ట్యూబ్‌లైట్ వెలుగును ఎలా చూపలేదో, ఒక దీపం సూర్యుడ్ని ఎలా వెలిగించి చూపలేదో, అలాగే సూర్యుడు పరమాత్మను వెలిగించి చూపలేడు. ఎందుకంటే, ఈ సూర్యుని వెలుగు అంతా ఆ పరమాత్మ నుండి వచ్చినదే. చంద్రుడు వెన్నెల సాయంతో చీకటిలో మీకు వస్తువులను చూపుతున్నాడు. అయితే, అది ఆ చంద్రుని స్వయం ప్రకాశం కాదు. అది సూర్యుని నుండి గ్రహించిన ప్రకాశమే. కనుకనే, తనకు ప్రకాశాన్ని ఇచ్చిన సూర్యుని మాత్రం చంద్రుడు వెలిగించి చూపలేడు. అలాగే, పరమాత్మ నుండి శక్తిని, కాంతిని పొందిన సూర్యుడు ఆ పరమాత్మను వెలిగించి చూపలేడు. పరమాత్మది కోటిసూర్యుల సమప్రభా తేజం. ఆ తేజం ముందు అన్ని వెలుగులు దిగదుడుపే. ఈ బ్రహ్మాండములోని సూర్యుడే పిండాండములోని కన్ను. బ్రహ్మాండములోని చంద్రుడే మనసు. బ్రహ్మాండములోని అగ్నియే పిండాండములోని వాక్కు. కన్ను, మనసు, వాక్కు ఇవి ఇంద్రియాలు. సూర్యుడు, చంద్రుడు, అగ్ని ఇవి ఇంద్రియ అధిష్ఠాన దేవతలు. కన్ను, మనసు, వాక్కు జీవపురుషుని ఇంద్రియాలైతే, సూర్య, చంద్ర, అగ్నులు బ్రహ్మాండపురుషుని ఇంద్రియాలు. సూర్యుడు పరమాత్మను ప్రకాశింపచేయలేడు అంటే, కన్ను ఆత్మను చూడలేదు అని. కన్ను జ్ఞానేంద్రియాలకు ప్రతినిధి. కనుక, జ్ఞానేంద్రియాల ద్వారా ఆత్మను తెలుసుకునే వీలు లేదు అని అర్థం. చంద్రుడు పరమాత్మను ప్రకాశింపచేయలేడు అంటే, మనసుతో ఆత్మను తెలుసుకోలేరు అని. మనసు అంతఃకరణాలకు ప్రతినిధి. కనుక, అంతఃకరణాలైన మనో బుద్ధి చిత్త అహంకారాలు ఆత్మను తెలుసుకోలేవు అని. అగ్ని పరమాత్మను ప్రకాశింపచేయలేడు అంటే, వాక్కుకు ఆత్మ అందేది కాదు అని. వాక్కు కర్మేంద్రియాలకు ప్రతినిధి కనుక కర్మేంద్రియాలు ఆత్మను తెలుసుకోలేవు అని అర్థం. ఇక సూర్యుడు, కన్ను ప్రత్యక్ష ప్రమాణానికి సంకేతాలు. కనుక, ప్రత్యక్ష ప్రమాణంతో ఆత్మ తెలియబడేది కాదు. చంద్రుడు, మనసు అనుమాన ప్రమాణానికి సంకేతాలు. కనుక, ప్రత్యక్ష ప్రమాణంతో అంటే ఊహించి తెలుసుకోవటం ద్వారా ఆత్మ తెలియబడేది కాదు. అగ్ని, వాక్కు, శబ్ద ప్రమాణానికి సంకేతాలు. కనుక, శబ్ద ప్రమాణంతో అంటే వినటంద్వారా ఆత్మ తెలియబడేది కాదు. పరమాత్మను వాక్కు ద్వారా తెలుసుకునే వీలులేదు అని తెలిసిన తర్వాత మీకొక సందేహం కలుగుతుంది. పరమాత్మను తెలుసుకొనుటకు ఈ ఉపన్యాసాలు,

ఉపదేశాలు, ప్రవచనాలు దండగే కదా అని అన్పించవచ్చు. వాక్కులు రెండు రకాలు. 1) లౌకిక వాక్కు 2) అలౌకిక వాక్కు. లౌకిక వాక్కులు పరమాత్మను తెలుపుటకు అస్సలు పనికిరావు. ఇక అలౌకిక వాక్కులైన శాస్త్రాలు, ఉపనిషత్తులు కూడా పరమాత్మను సాక్షాత్తుగా తెలుపలేవు. సాక్షాత్తుగా తెలిపితే పరమాత్మ దృశ్యవస్తువైపోతుంది. దృశ్యం నశించిపోతుంది. నశించేది పరమాత్మ కాదు. కనుక, పరమాత్మను సాక్షాత్తుగా తెలుపకుండా, పరమాత్మకు వేరైన అనాత్మ పదార్థాలను నిషేధించడం ద్వారా సార్థకమవుతాయి. పరమాత్మ స్వయంప్రకాశం కనుక, ఇతర సహాయం లేకుండానే తనకు తానుగా వ్యక్తమవుతాడు. ఇలా తెలియబడే ఆ పరమాత్మను, పరంధామాన్ని చేరుకున్నవారు తిరిగి జననమరణ రూప సంసారంలో ఇరుక్కునే ప్రశ్నే లేదు, ఏ లోకానికి వెళ్ళి రావల్సిన అవసరమూ లేదు. బ్రహ్మలోకం వరకు గల లోకాలన్నీ, తిరిగి వచ్చేవే. ఒక్క పరమాత్మపదమే తిరిగి రానిది, శాశ్వితమైనది. అందుకే అది పరమశ్రేష్ఠం. సమస్తజీవులు చేరుకోవలసిన గమ్యస్థానం అదే. ఎందుకంటే, జీవుడు స్వతహాగా పరమాత్మే. జీవుడనేది ఒక భ్రమ మాత్రమే. భ్రమ తొలగితే, తాను పరమాత్మననే అనుభూతి కల్గుతుంది, శాశ్వితంగా పరమాత్మగా వుండిపోతాడు. సనాతనమైన పరమాత్మ అంశయే జీవలోకంలో జీవుడిగా మారి, ప్రకృతి యందున్న మనసుతో కూడిన ఆరు ఇంద్రియాలను ఆకర్షిస్తున్నది. పరమాత్మ అంశయే ఈ లోకంలో జీవుడిగా వున్నది. రాజుగారికి ఒక కుమారుడు కలిగాడు. జ్యోతిష్యులు అతడ్ని చూచి తండ్రి గండంతో పుట్టాడన్నారు. రాజు వాడ్ని అడవిలో వదిలి రమ్మని భటుడ్ని ఆజ్ఞాపించగా, భటుడు అలాగే చేశాడు. ఆ దారిన వెళ్తున్న చాకలి ఆ బాలుడ్ని తీసుకువెళ్ళి పెంచుకున్నాడు. వాడు పెద్దవాడై, కులవృత్తినిబట్టి గాడిదలను కాచుకుంటున్నాడు. ఒకసారి ఒక మహాత్ముడు వీడ్ని చూచి వీడిలోని రాజలక్షణాలను గమనించి, వాడి జన్మస్థానం గురించి తెలుసుకున్నాడు. ఆ తర్వాత అతడ్ని తండ్రి దగ్గరకు చేర్చాడు. ఇప్పుడా రాజు తన కుమారుడ్ని పట్టాభిషిక్తుడ్ని చేశాడు. ఇంతవరకు వాడు గాడిదలు కాచుకున్నాడు. ఇప్పుడు రాజ్యపాలన చేస్తున్నాడు. వాడు నిజంగా రాజకుమారుడు. కానీ, అజ్ఞానంవల్ల, తెలియనితనంవల్ల, చాకలి ఇంటి సాంగత్యంవల్ల, చాకలి అయ్యాడు, గాడిదలను కాచుకున్నాడు. అయతే, గాడిదలు కాచేటప్పుడు కూడా యదార్థంగా రాజకుమారుడే. అయితే ఆ విషయం అతడికి తెలియదు. అతడిప్పుడు క్రొత్తగా రాజకుమారుడు కావలసిన పనిలేదు. అజ్ఞానం తొలగించుకుంటే చాలు. అలాగే, జీవుడిగా వ్యవహరించేటప్పుడు కూడా అతడు పరమాత్మయే. అయితే, జీవుడను భ్రమ తొలగించుకుంటే చాలు. పరమాత్మను తెలుసుకుంటే చాలు.

ఆంజనేయస్వామి అంటే భక్తి, గౌరవం అన్నీ వున్నాయి.
కానీ, ఆయన చెప్పింది వింటున్నదెక్కడ? ఆయన చూపిన మార్గంలో నడిచిందెక్కడ?
నీవు ఆయన్ని చూడకపోయినా ఫర్వాలేదు. ఆయన్ని దర్శించకపోయినా ఫర్వాలేదు.
కానీ, ఆయన చెప్పిన మాటను గౌరవిస్తే, ఆయన ఆనందపడిపోతారు.
చెప్పిన పని చెయ్యకుండా, కాళ్ళు మొక్కుతూ వుంటే, నేను మాత్రం ఏం చేస్తాను?
బయటకు వెళ్ళి ఏదో ఒక పని చేయమని మీరు మీ బిడ్డకు చెప్పారనుకోండి.
వాళ్ళు వెళ్ళకుండా నమస్కారాలు పెడుతూ కూర్చునివుంటే, ఎలా వుంటుంది?
చెప్పిన పని చేయలేదని బెత్తం పట్టుకుంటారా?

లేక నమస్కారాలు పెడుతున్నారని ఆనందపడతారా?
ఆలోచించండి!

***జన్మనిచ్చేది ఆయనే, ఈ జన్మను కడతేర్చేది ఆయనే.***
***కష్టాలు కల్పించేది ఆయనే, సుఖాలు ప్రసాదించేది ఆయనే.***
***ఇంకెవరూ... ఆ పరమాత్మే!***
***ఉన్నదానితో తృప్తి చెందు, లేనిదానికై, రానిదానికై నిరీక్షించకు, ఆశపడకు***
***ఎదురు చూసి నిరాశ చెందకు***
***రాత్రనక, పగలనక, సర్వవేళలా***
***సృష్టి స్థితి లయకారకుడైన పరమ పావనమూర్తి***
***జన్మకారకుడు సర్వ చరాచరసృష్టిని రక్షించి శిక్షించేది ఆయనే!***
***కాలం ఎంతో వుందని, జీవితం నూరేళ్ళని,***
***అంతా నీవారేనని, అంతా నీదేనని భ్రమకు లోనుకాకు.***
***కొబ్బరిచిప్పలో నీరులా, ఊరించేది, హరించేది ఆ పరమాత్మే***
***మోహంకు లోను కాకండి, భ్రాంతి చెందకండి***
***ఈ జగత్తు కలలా కరిగిపోయే మాయ***
***ఇదంతా మాయ మాయ మాయ***
***ఈ మాయను దాటుటకై మారుతి మాటలు వేదంగా తీసుకుని***
***వెల్లువలై పారుతున్న ఈ ఆధ్యాత్మిక బీజాలకు***
***సాధన అనే నీరుపోసి, నాణ్యమైన పంటను పొంది,***
***అనుభవమనే సుఖాన్ని పొంది దరిచేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**06-09-2020** 09:00 AM

**93)** గురువు, సద్గురువు ఎట్టివారు స్వామీ?

*ఈశ్వరో గురురాత్మేతి, మూర్తిభేద విభాగినే ।*
*విశ్వేమవత్ వ్యాప్యదేహాయ దక్షిణామూర్తయే నమః ॥*

దైవం, గురువు, ఆత్మ ఈ మూడు తత్త్వపరంగా ఏకవస్తువే. చిదాకాశస్వరూపమే. గురువు అంటే ఒక శరీరం కాదు, ఒక వ్యక్తి కాదు, రూపుదాల్చిన చైతన్యం. ఆత్మ అనంతం కాబట్టి దేవుడు, గురువు, జీవుడు, ద్రష్ట, దృశ్యం మున్నగు సకలమూ ఆత్మే. మీకు ఆదిగురువు శివుడే. సద్గురువు అంటే

*అనంత చిత్‌సాగరం, అమృతస్థితి, పరమశాంతి, నిధులన్నింటినీ మించిన పెన్నిధి మరియు ఈ సృష్టిలో అమూల్యజ్ఞానరత్నం. సకల వేదములు, ఉపనిషత్తులు ఏ పరమ సత్యమును గురించైతే వివరిస్తున్నాయో, ఆ సత్యాన్ని బుద్ధిపరంగా కాక, స్వరూపంగా అనగా 'నేను' గా అనుభవైకవేద్యం చేసుకున్నవారే గురువు. అట్టి విశిష్ఠ వ్యక్తులు అనగా సద్గురువులు ఈ భువిపై అవతరిస్తూనే వుంటారు. జీవుడు తన స్వస్థితికి చేరే ప్రయాణంలో అవరోధాలను తొలగించి, ప్రయాణాన్ని తేలికచేసి, గమ్యాన్ని సుగమం చేసే అద్భుతశక్తే సద్గురువు. పూర్ణమైన ఎరుకయే సద్గురువు స్వరూపం. మీ ఆధ్యాత్మిక ప్రయాణంలో ప్రతిక్షణం మార్గదర్శిగా నిలుస్తూ, అజ్ఞాన జనితమైన జననమరణ సంసారచక్రం నుండి విడుదల పొందుటకు మార్గాన్ని చూపి, మృత్యువును నివారించి, స్వస్వరూప అమృతస్థితిలోకి శిష్యుని గొనిపోయే మహిత వరమే సద్గురువు.*

## 94) అవధూత స్థితి ఎట్టిది స్వామీ?

*వాస్తవానికి, పరిపూర్ణస్థితి అంటే ఏమిటి? ద్వంద్వాలకు అతీతమైన శూన్య స్థితి, భావాతీత స్థితి, ఆలోచనారహిత స్థితి. భగవంతుడు ద్వంద్వాలలో ఒక భాగమే. అటువంటి ద్వంద్వాలను వదిలివేసినప్పుడు, శూన్యంలో జీవించగలుగుతారు. అటువంటి వారినే అవధూతలు అంటారు. వీరు ప్రపంచంలో అరుదుగా వుంటారు. వాస్తవానికి జ్ఞానం, అనుభవం రెండూ లేకపోతే అసలు శరీరం వుండదు, జీవితం వుండదు, సమాజం, ప్రపంచం, ప్రకృతిలకు కూడా అవకాశమే వుండదు. వీరు అన్నీ తెలిసినా ఏమీ తెలియనట్లు కనిపించే అమాయకులు. వాస్తవానికి బోధన అనేది ఎప్పుడు అవసరమవుతుంది? అనుభవం వుంటేనే గదా! అసలు అనుభవమే మాయ అనుకున్నప్పుడు, ఇక బోధన యొక్క అవసరమేముంటుంది? వీరి అంతరంగం స్వచ్ఛమైన తెల్లకాగితం వలె వుంటుంది.*

## 95) మౌనం, సంపూర్ణమౌనం మధ్య వ్యత్యాసం ఏమిటి స్వామీ?

*మాటలు, ఇంద్రియాల చర్యలకు ప్రతిరూపాలు. అటువంటి ఇంద్రియాలు కరిగిపోతే ఇక మాటలెందుకుంటాయి? దానినే సంపూర్ణమౌనం అంటారు. మౌనానికి–సంపూర్ణమౌనానికి మధ్య స్పష్టమైన వ్యత్యాసముంటుంది. ఏ శబ్దం లేకుండా పెదిమలు రెండూ మూసుకుని ఉంచి, నోటికి తాళం వేస్తే, అది మౌనమవుతుంది. అలా కాకుండా అంతరంగం సమూలంగా శుద్ధి అయిందనుకోండి, మాటలను అణిచివేయటం వుండదు, వదిలివేయడమే వుంటుంది. మాటలు వుంటేనే అక్కడ ఘర్షణ వుంటుంది. సంపూర్ణ మౌనంలో ఎటువంటి ఘర్షణ వుండదు.*

## 96) అంతరంగ శుద్ధి యొక్క ఆవశ్యకత ఏమిటి స్వామీ?

*ఆనందంగా జీవించాలంటే అది అంతరంగశుద్ధి ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. జ్ఞానం మరియు అనుభవం రెండూ ఆత్మస్థితికి చేరడానికి అవరోధాలే. సంస్కారశుద్ధి జరగాలంటే భౌతిక ప్రపంచంలో ఎన్నో సంఘటనలు జరుగుతున్నప్పటికీ, వానిపట్ల చర్య–ప్రతిచర్యలు లేకుండా వుండాలంటే, అంతరంగం '0' కావాలి. అంతరంగం తెల్లకాగితమైతే, ప్రపంచం అంతా స్వచ్ఛంగా కనబడుతుంది. ఆత్మస్థితికి చేరినవారికి అంతటా ఆత్మే కనిపిస్తుంది. అదే మానవజీవిత పరమార్థం. అలా కనబడాలంటే,*

నెయ్యి వంటి మనసు కావాలి. పాలను బాధపెడితే పెరుగు వస్తుంది. పెరుగును సతాయిస్తే వెన్న వస్తుంది. వెన్నను కాచితే నెయ్యి వస్తుంది. పాలకంటే పెరుగు విలువ ఎక్కువ, పెరుగుకంటే వెన్న విలువ ఎక్కువ, వెన్నకంటే నెయ్యి విలువ ఎక్కువ. కానీ, ఈ నాలుగింటి రంగు తెలుపే. దీని అర్థం ఏమిటంటే, మాటిమాటికీ దుఃఖం ఎలాంటి పరిస్థితులు వచ్చినా కూడా ఏ వ్యక్తి రంగు మారదో, సమాజంలో ఆ వ్యక్తికే విలువ ఎక్కువ వుంటుంది. పాలు ఉపయోగపడేవే. కానీ ఒక్కరోజు కోసమే. తర్వాత అవి పాడైపోతాయి. పాలల్లో ఒక్క చుక్క మజ్జిగ వేస్తే అది పెరుగు అవుతుంది. కానీ, రెండు రోజులే వుంటుంది. పెరుగును చిలకడంతో వెన్న వస్తుంది. ఇది కూడా రెండు లేక మూడు రోజులే వుంటుంది. వెన్నని కాచినప్పుడు నెయ్యి వస్తుంది. నెయ్యి మాత్రం ఎప్పుడూ పాడవదు. ఒక్కరోజులో పాడయ్యే పాలలో ఎప్పుడూ పాడవని నెయ్యి దాగివుంది. ఇదే విధంగా మీ మనసు లెఖ్ఖలేనన్ని శక్తులతో నిండివుంది. దానిలో మంచి ఆలోచనలను నిండి, మీకు మీరే చింతన చేయండి. ఏ సమస్య వచ్చినా ఇలాగే విశ్లేషించి చూడండి. మీరు ఎప్పుడూ ఓడిపోరు. ధైర్యశాలులవుతారు. ఆంజనేయుని మది దోచుకునే ముద్దుబిడ్డలవుతారు.

*కప్పు రోజంతా అరచినా ఎవరూ పట్టించుకోరు.*
*కానీ, కోడి కూస్తే మాత్రం తెల్లవారిందని అందరూ లేస్తారు.*
*దీనినిబట్టి ఎంత మాట్లాడాం అనే దానికంటే,*
*మాట్లాడిన దాంట్లో ఎంత పనికొస్తుంది అనేదే ముఖ్యం.*
*పనికిరాని మాటలు పూర్తిగా వ్యర్థమవుతాయి!*

***నెత్తిమీద నీలితెర (అకాశం) కాలి క్రింద ధూళిపొర (భూమి)***
***పగలు పోరాటాలతో కాలం గడిపేరు***
***చీకటి తెరలలోనుంచి బయటకు రండి***
***తవ్వుతారు గోతులు అందరి ముందర***
***మీ వెనుక చూస్తే అంతా అబద్ధాల కంకరే***
***కల్గితే తింటారు పదిరకాలు***
***లేకపోతే పస్తులతో నిరాహారముంటారు***
***ఒక్కరికి కడుపునిండా ఆహారమెట్టరు***
***ఎటు చూచినా స్వార్థాల దొంతరే***
***ప్రణాళికలు లేక ఎప్పుడూ తొందరే***
***మనిషి బ్రతుకే ఆశల పరంపర***
***నోరు తెరిస్తే శాపాల తుంపర***
***పూజలు ఎన్నో పాపాల పరిహారం కొరకు***
***తనను తాను తెలుసుకోలేకపోయినప్పుడు, పరిహారమెందులకు?***

***బంధాలు తెంపుకోలేని పాశాలనార***
***కుళ్ళు కుంతంత్రాలు కమ్ముకుని ఉన్నాయి***
***మంచిమాటలు వినబడని బధిరులు మీరు***
***ఎటుపోయినా చెప్పేది ఏముంది?***
***మనిషి బ్రతుకే మూన్నాళ్ళ జాతర***
***ఈ జాతర సంతలలో నుండి బయటపడి***
***సంత్‌లుగా తయారుకండి***
***సన్మార్గమే మార్గముగా***
***మారుతి మాటలే బోధలుగా***
***సద్గురువు సావాసంతో***
***సవ్యదిశలో ప్రయాణించి గమ్యం చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**07-09-2020** 09:25 AM

**97)** ఏది పరమధర్మం స్వామీ? దానిని ఏ విధంగా అవలంభించవచ్చు స్వామీ?

*ఇతరులు ఏది చేస్తే తనకు (నీకు) అప్రియంగా వుంటుందో ఆ పనిని తాను (నీవు) ఇతరులకు చేయరాదు. అదే పరమధర్మం. ఆ ధర్మాన్ని ప్రతిఒక్కరూ పాటిస్తే సమాజంలో ఎటువంటి అపకారాలు, కాలుష్యం వంటివి ఉండవు. ఉదాహరణకు రోడ్డు మీద వెళ్తూ అరటిపండు తిని ఆ తొక్కను రోడ్డుమీద పడేస్తారు. మీ వెనకాల వచ్చేవారు దానిమీదే కాలువేస్తే జారిపడతారని కూడా ఆలోచించరు. ఇతరులతో పరుషంగా మాట్లాడి, వారి మనసును బాధపెడ్తారు. వారి మానసిక ప్రశాంతతను కోల్పోతారు. ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర అందరినీ దాటుకుంటూ మీరు ముందుకు వెళ్ళాలనుకుంటారే గాని, దాని వలన ఇతరులకు ఎంత ఇబ్బంది కలుగుతుందోనని ఆలోచించరు. అవే ఇబ్బందులు మీకు కలిగితే ఎలా వుంటుంది? నిబద్ధతతో ధర్మబద్ధంగా జీవించగలగాలి. దైవత్వం సిద్ధించడమంటే ఇతరులకు మేలు చేయలేకపోయినా, కనీసం కీడు చేయకుండా వుండటమే. అదే మానవత్వం. ఈ మానవత్వం అలవడకుండా దైవత్వం సిద్ధించడం కల్ల. అంటే నిస్వార్థతే దైవం. ఆస్తికులైనా, నాస్తికులైనా మొదట నేర్చుకోవలసినది ఈ పాఠమే. మనసులోని స్వార్థాన్ని వీడకుండా ఎన్ని గుడులూగోపురాలు తిరిగినా, ఎన్ని పూజాపునస్కారాలు చేసినా ఆధ్యాత్మిక పురోగతి సాధ్యం కాదు. మనిషిలో ఈ స్వార్థబుద్ధి పోవాలంటే దేవాలయాలలో ఉన్న ఆ దేవుని ప్రతిరూపాలే బయట నడయాడుతున్న సకలజీవులు. అందరిలోనూ ఆ పరమాత్ముడు వసిస్తున్నాడనే దృక్పథం అలవడాలి. ఈ విషయాన్నే భాగవతంలో జీవులయందు నెలకొనియున్న భగవంతుడ్ని విస్మరించి, కేవలం విగ్రహాలనే పూజించడం అవివేకం. జీవసేవయే శివసేవ. ఈ బోధనను మీరంతా ఆచరిస్తే,*

కేవలం ఒక్క దేవాలయమే కాదు, గృహాలయం, కార్యాలయం, వైద్యాలయం, విద్యాలయం ఇలా అన్నీ దైవాలయాలుగా మారిపోతాయి. ఈ సృష్టి అంతా భగవంతునితో నిండివుంది. మీరు ఈ విషయాన్ని అనుక్షణం గుర్తుపెట్టుకుని మసలుకోవాలి. తోటివారికి సహాయపడటం ద్వారా మీరు ఆ పరమాత్మకే సేవ చేస్తున్నారు. అంతేగాక, సేవ చేయటం ద్వారా మీకు మీరే సేవ చేసుకున్నవారవుతారు. నేను చెబుతాను సరదాగా, మీరు పుణ్యస్నానం కోసం గంగానదికి వెళ్ళగానే, మీ పాపాలన్నీ ఆ చెట్టుపైకెక్కి కూర్చుంటాయి. ఆ నీళ్ళల్లో మునిగి ఒడ్డుకు రాగానే, మళ్ళీ మీలోకి వచ్చిచేరతాయి. ఇది సరదాగానే చెప్పాను. ఎంత ప్రయత్నించినా మా మనసు భగవంతునిపై నిలుచుట లేదు అని అంటుంటారు. దీనికి ఒకే ఒక మార్గం – అభ్యాసం! పసిబిడ్డలకు ప్రారంభంలో అన్నంపై ఆశ వుండదు. తినే అలవాటు చేస్తే, అన్నంపై రుచిపుట్టి, ఆశతో తినుట మొదలుపెడ్తారు. రోగికి ఔషధము మొట్టమొదట రుచించదు. తన జబ్బు నయమయ్యేకొద్దీ, దానిని ప్రీతితో సేవనం చేయును. అట్లే పట్టుదలతో నామస్మరణ చేసిన, మనశ్శాంతి లభించును. విషయసుఖము నుంచి మనసును మరల్చితే, చిత్తము భద్రముగా నిలుచును.

### 98) సాధన ఎంతకాలం కొనసాగాలి స్వామీ?

భగవంతుడి అనుగ్రహం పొందటానికి ఎంత సాధన కావాలి అని మీరు అడిగేటట్లయితే, ఈ సాధన ఎంతకాలం కొనసాగాలంటే, రోడ్డు ప్రక్కన పెద్ద వృక్షాలకు చూస్తుంటారు. అల్లంత దూరంలో వరిపైరు వుంటుంది. పెద్దవృక్షాలకు నీరు అందించాల్సిన పనిలేదు. వాటి వేళ్ళు విస్తారంగా భూమిలోనికి వ్యాపించి వుంటాయి నీటిమట్టం వరకూ. కానీ వరిపైరుకు నీరు అందుతుందో లేదో అని నిత్యం చూడాల్సిందే. తరచూ నీళ్ళు పెట్టాల్సిందే. లేకుంటే వాడిపోతుంది. వాటి వేళ్ళు పైపైన 3,4 అంగుళాల వరకే దిగి వుంటాయి. కనుక, ఈ ఉదాహరణ మాదిరిగానే, విశ్వాసం అనే వేర్లు హృదయాంతరాళంలో చేరి, మనసును కదలక మెదలక, అదరక బెదరక ఎన్ని కష్టాలు ఎదురైనా భరించగల శక్తి, ఓపిక వచ్చేవరకూ ఆధ్యాత్మిక సాధన కొనసాగవలసిందే. సామాన్యులైన మీరు, మీ భక్తి విశ్వాసాలు వరిపైరు మాదిరిగానే వుంటుంది. నిత్యం నీళ్ళు పెట్టినట్లు, నిత్యసాధన లేకుంటే, మీ భక్తివిశ్వాసాలు క్షీణించిపోతాయి. భగవదనుగ్రహానికి చేరువ కాలేరు. మనస్సుని నిగ్రహించే ప్రయత్నంలో భాగమే ఆధ్యాత్మిక సాధన. ఏకాగ్రతతో ఉంటే, మరో ఆలోచన రాదు. వేరే ఆలోచనల్లో వుంటే ప్రమాదాల్లో పడతారని అంతరాత్మ బోధిస్తుంది. ఆధ్యాత్మిక సాధనలో కూడా అదే విధంగా ఆలోచించాలి.

### 99) ఏది నిజమైన త్యాగం స్వామీ?

యోగవాశిష్టంలో ఒక కథ వుంది. ఒక బ్రహ్మచారి తనకున్నదంతా త్యాగం చేసి, ఒక కౌపీనం, ఒక ఆసనం, ఒక కమండలం ఇవే అతనికి మిగిలిన ఆస్తి. వారి గురువుగారు "నువ్వు ఏమీ త్యాగం చేయలేదని నాకు అన్పిస్తుంది" అన్నారు. తనకున్న ఈ మూడు వస్తువులను కూడా త్యజించమని గురువుగారి అభిప్రాయమేమో అని చితి పేర్చి, ఆ మూడింటినీ అగ్నిలో వేశాడు. "ఈ వస్తువులన్నీ ప్రకృతికి చెందినవే కదా! సొంతానివి నీవి ఏమి త్యాగం చేశావు?" అన్నారు గురువుగారు. "ఇక నా దగ్గర ఏమున్నది? ఉన్నదేమిటి, శరీరం. దీనిని కూడా అగ్నికి ఆహుతి చేస్తాను" అనుకున్నాడు. ఆ బ్రహ్మచారి అగ్నిలోకి

*దూకపోతుంటే, గురువుగారు, "క్షణం ఆగు నాయనా! ఈ శరీరం నీదా? కొంచెం ఆలోచించు" అన్నారు. వెంటనే తన తప్పును తెలుసుకుని, ఈ అనర్థానికి మూలకారణం తన అహంకారమే. అహంకార త్యాగమే నిజమైన త్యాగం అని గ్రహించాడు. కాబట్టి, ఈ ప్రపంచం అంతా సర్వేశ్వరుడి ఇచ్ఛానుసారం జరుగుతున్నదని గ్రహించిననాడు, ఎవరైతే సంపూర్ణ శరణాగతి భావనను అలవర్చుకుంటారో, వారికి ఇక అహంకారానికి ఆస్కారమే లేదు. నేను ఈ లోకానికి ఎందుకు వచ్చాను? నా జీవితాన్ని ఏ విధంగా గడుపుతున్నాను? అని ఆత్మపరిశీలన చేసుకోకపోతే, మనసు మిమ్మల్ని మోసం చేస్తుంది. తింటున్నా, కూర్చున్నా, లేచినా, నడుస్తున్నా, పనిచేస్తున్నా, ఎల్లవేళలా భగవత్‌చింతన మానరాదు. కష్టములకు లొంగిపోవటం, బాధలకు కృంగిపోవటం ఇవ్వన్నీ బలహీనతలు. బలహీనులైనవారు క్షణక్షణమునకు అడుగడుగునకు మరణిస్తూనే వుంటారు. జగతియందు పుణ్యపురుషులు లేకుండిన జగములెట్లు వెలుగు?*

| | | | |
|---|---|---|---|
| *వచ్చేవి, పోయేవి మూడు:* | *1) పేదరికం* | *2) డబ్బు* | *3) జబ్బు* |
| | *1) కీర్తి* | *2) జ్ఞానం* | *3) విద్య* |
| *పోతే రానివి మూడు:* | *1) కాలం* | *2) యవ్వనం* | *3) పరువు* |
| *వెంట వచ్చేవి మూడు:* | *1) పాపం* | *2) పుణ్యం* | *3) నీడ* |
| *తృప్తిపడాల్సినవి మూడు:* | *1) భార్య* | *2) భోజనం* | *3) ధనం* |
| *తీర్చాల్సిన ఋణాలు మూడు:* | *1) గురువు* | *2) ఋషి* | *3) దైవఋణం* |

***మనస్సు వికసిస్తే జీవితం మధురాతి మధురమవుతుంది***
***మనస్సు కుంచించుకుంటే శరీరమంతా విషపూరితమవుతుంది***
***మనస్సే జీవితంలో అత్యంత కీలకపాత్ర పోషిస్తుంది***
***మనస్సు ఘర్షణకు గురైతే జీవితం అన్ని విధాలా సమస్య అవుతుంది***
***మనసును వికసింపచేసే మహోన్నత విధానమే ఆధ్యాత్మిక మార్గం***
***మానవునిగా దానిని గురించి తెలుసుకుని ఆచరించటమే ధర్మం***
***మానవుడు మాధవుడిగా మారితేనే ప్రపంచం అతనిని పూజిస్తుంది***
***మానవజీవిత పరమార్థం తెలియకపోతే మనిషి వ్యర్థుడవుతాడు***
***మార్పు అనేది నీలోనికి నీవు పయనించడం ద్వారానే సాధ్యం***
***మనిషి అంతరంగశుద్ధి అయితేనే మానవత్వం వికసిస్తుంది***
***మనసు మారడమంటే, మనసును ప్రక్షాళన గావించుకోవటమే***
***మానవుడు మాధవుడిగా మారితేనే జీవితం సార్ధకమని తెలుసుకోవాలి***
***మారుతి మాటలు మన్నన చేసినట్లయితే, మహోన్నతులుగా అవుతారు***
***మహోన్నతులుగా మారిన వెంటనే ముద్దులొలుకు ముద్దుబిడ్డలై***
***ఈ హనుమ ఆలింగనంలో చిక్కుకునే చిన్నారి ముద్దుబిడ్డలౌతారు***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**07-09-2020** 09:20 PM

**100) అన్యాయంగా సంపాదించిన ధనము నిలవదు అంటారు కదా స్వామీ?**

*ఒక ఊళ్ళో ఇద్దరు సోదరులు నివసిస్తూ వచ్చారు. కావడానికి బ్రాహ్మణ కులానికి చెందినవారే. అయినప్పటికీ, వారు విద్యాధికులు కారు. దాంతో వారు కటిక దారిద్ర్యంపట్ల విసిగిపోయినవారై, ఆ సోదరులు ఇల్లు వదిలిపెట్టి బయలుదేరారు. సంపదను వెతికే ఉద్దేశ్యంతో వారు చివరకు సముద్రతీరానికి వచ్చారు. అది మత్స్యకారులు నివసించే ప్రాంతం. ఆ ఇద్దరు సోదరులు పెద్ద తలపాగా, చందనబొట్టు, చేత పుస్తకాల దొంతర మొదలైన వాటితో వెళ్ళి మత్స్యకారుల మధ్యలో తమ జ్యోతిష్య పాండిత్యాన్ని ప్రదర్శించారు. పాపం! ఆ పేద మత్స్యకారులు వీరిద్దరినీ జ్యోతిష్యంలో ఉద్దండ పండితులని నమ్మారు. తాము అతి కష్టం మీద పొదుపు చేసుకున్న ధనమంతా వీరికి ధారాదత్తం చేయడంతోపాటు, వీరి మాటను వేదవాక్యంగా పరిగణించసాగారు. మంత్రతంత్రాలంటూ, తాంత్రికమంటూ ఆ సోదరులు హడావుడి చేస్తూ, ఏమీ తెలియని అమాయక మత్స్యకారులను బాగా మోసగించారు. కొద్దికాలంలోనే బోలెడంత ధనం మూటగట్టుకోవడంతో, ఆ ఇద్దరు సోదరులు ఇంటికి బయలుదేరారు. చేతనున్న ధనం ఎక్కువగా ఉండటంతో దాన్నంతా బంగారు కాసులుగా మార్చి, ఒక సంచీలో వేసుకుని నడవసాగారు. దారిలో వెళ్తున్నప్పుడు బంగారుకాసుల సంచిని, ఒకరు మార్చి ఒకరు మోసుకునిపోసాగారు. అప్పుడు వారి మనోస్థితి బహుచిత్రంగా తయారయ్యింది. ఎవరివద్ద ఆ బంగారు కాసులసంచి వుందో అతడి మనసులో "నేనే ఈ మొత్తం సంపాదన సొంతం చేసుకుంటే, ఎలా వుంటుంది? అందు నిమిత్తం నా సోదరుడ్ని చంపితే మటుకూ ఏం?" అనే ఆలోచన మెదిలింది. అమాయకులైన మత్స్యకారులను మోసం చేసి సంపాదించిన పాపపు సొమ్మే కదా అని వారి ఇద్దరి ఆలోచన. వారు కష్టపడి సంపాదించింది కాదు కదా, తమ తెలివితేటలతో సంపాదించినది కాదు కదా అని ఇద్దరి మనసులో ఆలోచిస్తూ నడవసాగారు. ఈ విధంగా ఆలోచిస్తూ నడుస్తున్న ఆ సోదరుల నడుమ అదే దారిలో ప్రయాణిస్తున్న ఒక పిచ్చివాడు ఆ బంగారుకాసుల మూటని ఆ సోదరుల నుండి పరిగ్రహించి పరిగెత్తాడు. ఆ బంగారుకాసుల మూటను ఆ పిచ్చివాడు ఎత్తుకెళ్ళిపోవటంతో, ఆ సోదరులిరువురూ ఆ పిచ్చివాడి వెంటపడి పరిగెత్తారు. ఆ బంగారుకాసుల మూటతో పరిగెత్తిన పిచ్చివాడు గోదావరి తీరాన ఉన్న ఒక పెద్ద మర్రివృక్షం పైకి ఎగబ్రాకాడు. ఆ సోదరులిరువురు ఆ బంగారుకాసుల మూటను తమకు ఇచ్చివేయమని ఆ పిచ్చివాడ్ని బెదిరించి, తరువాత పలుమార్లు బ్రతిమలాడుకున్నారు. ఆ పిచ్చివాడు ఆ మూటను ఇవ్వనంటే ఇవ్వనని భీష్మించుకున్నాడు. మాయమాటలు చెప్పి మత్స్యకారుల నుండి తాము సంపాదించిన సొమ్ము మొత్తం ఆ పిచ్చివాడి చేతిలో ఉన్నందుకు ఆ అన్నదమ్ములిద్దరూ తలలు పట్టుకుని కూర్చున్నారు. ఆ బంగారుకాసుల మూటను విప్పదీసి, మిలమిలా మెరుస్తున్న బంగారాన్ని చూసిన ఆ పిచ్చివాడు చేతికందిన బంగారు కాసులను కొన్ని గోదావరిలోకి, మరికొన్ని గట్టుపైకి విసిరివేయసాగాడు. తమ కష్టం మాత్రం గట్టుమీదికి, పాపం చేసిన సొమ్ము గోదావరిలోకి వేయబడింది. తాము అన్ని రోజులు కష్టపడి సంపాదించిన సొమ్ము*

మొత్తం పిచ్చివాడి చేతిద్వారా గంగలో కలపబడిన విధానం చూసిన ఆ సోదరులిద్దరూ తలల మీద చేతులుంచుకుని, అక్కడే కూలబడిపోయారు. పాపంతో కూడబెట్టే సొమ్ము ఏ నిముషంలోనైనా ఎవరికైనా సరే ఈ విధమైన ఫలితాన్నే ఇస్తుంది. కాబట్టి, సన్మార్గంలో సొమ్ము గడించి జీవించడమే క్షేమకరము, శ్రేయస్కరమూను!

***నేను ఎన్నో చెప్పాను, ఇంకా ఎన్నెన్నో చెబుతున్నాను***
***ఒక్కమాట విన్నారా? ఆచరించారా? లేదే... అదే బాధ!***
***మానవసేవే మాధవసేవ అన్నాను. ఆర్తులకు సాయం చేస్తున్నారా?***
***అవసరానికి మించి దాచినా దోచినా***
***కడకు చిల్లిగవ్వ కూడా దక్కదన్నాను, విన్నారా?***
***ఇన్ని వ్రతాలు, పూజలు, ఆర్భాటాలు చేయమన్నానా?***
***ఆకో, పువ్వో, నీళ్ళో, చాలునన్నాను కదా?***
***ఇన్ని ఆర్భాటాలు చేస్తున్నారు***
***నా గుడులు మీరే కట్టారు,***
***నా రూపాలు మీరే చెక్కారు,***
***నా దర్శనాలు మీరే వ్రాశారు.***
***ధర్మంగా వుంటే ప్రతిరోజూ మంచిరోజే***
***మంచి మనసుంటే ప్రతిరోజూ పండుగరోజే***
***మంచి తిథియని, పండుగరోజని కాదు.***
***భగవంతుని చరణాల సన్నిధి చేరినరోజే, అసలైన పండుగ***
***పవనకుమారుని మాటలు విని, ఆచరించిన రోజే పండుగ***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

మంచితనంతో జీవించేవారికి ప్రతిక్షణం పండుగలాగే వుంటుంది

ॐ

**08-09-2020** 09:30 AM

**101) విజయాన్ని పొందుటకు గమనించుకోవలసినవి ఏవి స్వామీ?**

ఏ రంగంలోనైనా, ఏ విద్యలోనైనా, ఏ కళలోనైనా విజయం సాధించాలనుకుంటే, ప్రయత్నం చాలా ముందుగానే మొదలుపెట్టాలి. ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి. సిద్ధం చేసుకున్న ప్రణాళిక ప్రకారం నిరంతరం శ్రమించాలి. ఈ ప్రయత్నంలో ఎప్పటికప్పుడు, పనితీరు మెరుగుపర్చుకోవాలి. మానవత్వానికి ఎప్పుడూ స్వాగతం చెప్పటానికి సిద్ధంగా వుండాలి. అప్పుడే విజయాన్ని సాధించగలరు.

వర్తమానాన్ని శాసిస్తూ భవిష్యత్తును నిర్ణయించేది వ్యక్తుల పనితీరు. విజేతలుగా నిలిచినవారు విజయాన్ని సాధించటానికి అవసరమైన స్ఫూర్తిని మాత్రమే అందించగలరు. గమ్యాన్ని చేరుకోవటానికి మార్గాన్ని మీకు మీరే నిర్మించుకోవాలి. అందుకు అనుభవజ్ఞుల సలహాలు, సూచనలు కొంతవరకు సహకరిస్తాయి. కార్యాచరణ మాత్రం మీదే కావాలి కనుక, చేస్తున్న పనిలో ప్రొడక్టివిటీ ఎంత? అని ఎప్పటికప్పుడు బేరీజు వేసుకోవాలి. మీ యొక్క పనితీరు మీ ఆశలకు, ఆశయాలకు అనుగుణంగా ఉన్నదా, లేదా అన్నది మీకు మీరే తరచి చూచుకోవాలి. ఎప్పుడూ నిన్నటి కంటే ఈరోజు మెరుగైన పనితీరు కలిగి వుండాలి. ప్రతివ్యక్తికీ తాను పూర్తిచేయవలసిన పనులు, వాటి కోసం అనుసరించవలసిన విధివిధానాలు వుంటాయి. అయినప్పటికీ, అలసత్వం, బద్ధకం కారణంగా వాయిదా వేస్తూ వుంటారు. లేకపోతే, మొక్కుబడిగా పూర్తిచేసి అయిందనిపిస్తారు. కొద్దిగా కష్టపడి పనిచేసే మనిషి రోజుకు పది నుంచి పదకొండు గంటలు పనిచేయగలడు. ఆరోగ్యవంతుడైన ప్రతివ్యక్తికీ ఆ శక్తి స్వభావసిద్ధంగా వుంటుంది. కాబట్టి, మీకున్న శక్తిసామర్థ్యాలను సంపూర్ణంగా వినియోగించుకోవాలి. చేస్తున్న పనిపై మనస్సు లగ్నం చేయాలి. ఇతర సమస్యలు, చికాకులను పనిలోకి జొరబడకుండా చూసుకోవాలి. మీ మెదడు కంపార్ట్‌మెంటలైజేషన్ జరగాలి. పనిచేస్తూ వుంటే అలసిపోవటం అన్నది వుండదు. ఎందుకంటే, ఆ పని చేయకపోతే దానికి బదులు వేరొకపని చేస్తారు. కాబట్టి, పనిచేస్తూ ఎవరూ అలసిపోరు. పనితీరు యాంత్రికమైనప్పుడు కలిగే భావన అలసట. దానిని దూరం చేయటానికే మీ పనితీరు మెరుగుపరుచుకోవాలి. క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా పనిచేసేవారు, చేస్తున్నపనిలో ఎక్కువ ఆనందాన్ని అనుభవించగలరు. ఇట్టివారిలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతూ వుంటుంది. వీరు ఇంకొంచెం శ్రద్ధ వహిస్తే, మరింతగా రాణించగలరు. ఆ విధంగా మీరు కూడా ఉండాలంటే, ఉన్నత వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలి.

*కలవడానికి, విడిపోవటానికి చూపించే తొందర*
*అర్థం చేసుకోవడానికి, దగ్గరవడానికి చూపిస్తే,*
*ప్రతి బంధం ఆనందంగానే వుంటుంది!*

***ఫోటోలను చూస్తే మనుషులందరూ మహానటులే అన్పించరూ?***
***కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు, ఎవరైతేనేం***
***ఆ కాసేపూ కస్సుబుస్సులు ప్రక్కన బెట్టి,***
***శాంతి సామరస్యాలు వెల్లివిరుస్తున్నట్లు ఎంత చక్కగా అభినయిస్తారు!***
***పెళ్ళిళ్ళు, శుభకార్యాల ఫోటోలు చూస్తుంటే,***
***స్వర్గంలో దేవతల సమూహాన్ని క్లిక్ మనిపించినట్లు అనిపించదూ?***
***ఫోటోలకు పోజివ్వటానికి రసాలన్నీ విడిచి శాంతిరసాన్ని అద్భుతంగా పండిస్తారు***
***డబ్బిచ్చి ఫోటో తీయించుకుంటారు కాబట్టి***
***ప్రశాంతత మీ ముఖంలో ప్రతిఫలించే దాకా***
***ఫోటోగ్రాఫర్ ఓపిగ్గా నిరీక్షిస్తాడు***
***గోడలకు వేళ్ళాడేవన్నీ నిజం కాకపోవచ్చు***

*మహాశయులారా! దయచేసి ఫోటోలను చూచి మనుషులను అంచనా వేసి మోసపోకండి*
*లోపల వున్నదానిని ఫోటో తీసి చూడండి, బాధపడకుండా వుండలేరు*
*కరోనా సోకితే నీవు, నీ చుట్టుప్రక్కలవారు బాధపడాలి*
*కరుణ లేకపోతే నీవు, నిన్ను పుట్టించిన భగవంతుడు కూడా బాధపడాలి*
*కావున బాగుపడండి*
*నా చిన్నారి ముద్దుబిడ్డలారా!*

**08-09-2020** 05:30 PM

**నేను చెప్పినట్లు మీరు మౌనాన్ని ఆచరించినట్లయితే,**
**మీరు అనుభవించేది ఒక ఆనంద నిశ్శబ్ద ప్రవాహం.**
**అది మీ జీవితాల్లో అనంతమైన ప్రశాంతతను నింపివేస్తుంది!**

**మీలో ఉన్నది ఒక పిశాచం. దాన్నే కోపం అంటారు.**
**కోపస్వభావమేమిటంటే, మీరు కోపగించుకున్న కొద్దీ,**
**అది రెట్టింపు శక్తితో మిమ్మల్ని బాధిస్తుంది.**
**కోపం రాకుండా నిగ్రహించుకుంటే, అది బలహీనపడుతుంది!**

**మీరు జీవితంలో ఏ చిన్నకష్టం, అవమానం, విమర్శ ఎదురైనా**
**మనోనిశ్చలతను కోల్పోతారు.**
**ఎలాంటి పరిస్థితిలోనైనా, సమతుల్యాన్ని కాపాడుకోవాలి!**

**మీలోని ప్రతి అణువణువూ నువ్వే కావాలి.**
**నాకు కావలసిందల్లా నువ్వే నువ్వే నువ్వే అని అరుస్తూ వుండండి.**
**అటువంటి ప్రగాఢమైన పిలుపు ఎప్పుడో ఒకప్పటికి**
**ఆ పరమ ప్రేమమూర్తికి చేరకపోదు, ఆ పిలుపును అందుకొని**
**ఆ పరమపాదం మీ దరిచేరకుండా ఉండలేదు!**

**బాహ్యవస్తువుల సంపర్కంలో ఆనందాన్ని పొందటానికి ప్రయత్నించకుండా,**
**ఆత్మసుఖాన్ని పొందిన వ్యక్తి తరిగిపోని బ్రహ్మసుఖాన్ని అనుభవిస్తాడు!**

**తమ పరిమితమైన ప్రపంచంలో పరిభ్రమిస్తున్న వారి చెంతకు**
**అంత త్వరగా పారలౌకికమైన పరిమళం ప్రసరించదు!**

**ఒకసారి రాముడు ప్రశ్నించినప్పుడు, నేనీ విధంగా జవాబు చెప్పాను.**
**నన్ను నేను అర్పించుకుందామంటే, ఒక్కరూ కనబడలేదు.**

**లోకమంతా ఎవరి చితుల్లో వాళ్ళు దగ్ధమవుతున్నారు అని.**
**నిజమేనంటారా?**

**మీరు నలుగురితో కలిసి పనిచేసేటప్పుడు, నాలుగింతల సమస్యలు ఎదురవుతాయి.**
**పరిస్థితులు ఎలా మారిపోతున్నా**
**అనుకున్న పని మీద నుంచి మీ దృష్టి మరలిపోకుండా ఉంచుకోవడమే గాక,**
**మీ ప్రక్కన వున్నవారి మీద, మిగిలినవారి దృష్టి కూడా ఆ పని మీద మరల్చి,**
**చేపట్టిన పనిని కొనసాగించాలి!**

ॐ

**09-09-2020** 09:15 AM

**102) భగవంతుని నమ్మినాగానీ కష్టాలు తీరవెందుకు స్వామీ?**

*అందరూ అనుకుంటారు భూమి, ఆకాశం ఎప్పుడూ కలవవని. వాళ్ళకు తెలియనిది ఏమిటంటే, ఒకటి లేకపోతే రెండవది ఉండదని. కొన్ని బంధాలు కూడా అంతే. మనుషులే భౌతికంగా దూరమవుతారు తప్ప, వారి మనస్సులు దూరం కావు. అందులో బాల్యం నుంచి ఉండే స్నేహాలు అపురూపాలు. ఎన్ని పూజలు చేస్తారో, ఎన్ని నోములు నోస్తారో. అయినా దేవుడు కనికరించడం లేదు అని చాలా మంది చాలా బాధపడ్తూ వుంటారు. ఒక్కొక్కరిదీ ఒక్కొక్క రకం బాధ. కష్టంలో ఉన్నానని దేవుడి దగ్గరకు వెళ్ళి మొరపెట్టుకుంటే, ఇంకా కష్టాలు ఎక్కువయ్యాయి అని మరికొందరు బాధపడుతూ వుంటారు. అవును మరి! ఒక్కొక్కరిదీ ఒక్కోరకం కష్టం. ఏమిటో ఈ బాధలు స్వామీ! మా బాధలకు మేమే, మా కర్మలే కారణం అని, పాపం నీ తప్పు ఏమీలేదు అని మీరు ఎప్పుడు తెలుసుకుంటారో? మళ్ళీ చోద్యం ఏమిటంటే, కొందరు కష్టాలు, బాధలు తీరటం లేదని పూజలు కూడా ఆపేస్తారు. ఆ తండ్రి పరమాత్మ మీద నమ్మకం పోగొట్టుకుంటారు. ఇంకా మరీమరీ చోద్యం ఏమిటంటే, కొందరు సుఖాల కోసం మతాలు మారుతారు. వీళ్ళు ఖచ్చితంగా కొంచెం కష్టాల్లో బాధతో వున్నప్పుడు, "మీ దేవుడు రాయి. మా దేవుడే నిజం. మా మతం తీసుకోండి" అని ఎర వేసి పట్టుకుంటారు. మరి ఆ మతంలో కష్టాలు, బాధలు లేవా? మరి కష్టాలు లేనప్పుడు జబ్బులు ఎందుకు వస్తున్నాయి? మనిషి ప్రాణం ఎందుకు పోతోంది? అంటే సమాధానం వాళ్ళకే తెలియదు. వాళ్ళ మతంలోకి లాక్కెళ్తే ఇంతకు ముందు చైన్ లింక్ లాంటి కొన్ని స్కీములు పెట్టారు. మతంలోకి మారేవారు పెరిగితే, మార్చినవారికీ డబ్బులు వస్తూ వుంటాయి. ఆ డబ్బు కోసం కక్కుర్తిపడి, అమాయకులను వెదికి పట్టుకొని, కష్టంలో వున్నాడని అనుకోగానే మనస్సుని మాటలతో మార్చి, మతం మారుస్తున్నారు. ఇదో రకం పిచ్చి. ఇంచుమించు అలాంటి పిచ్చి ఆలోచనలు కలిగిన పాత్ర ఉన్న ఒక కథ చెబుతాను.*

*ఒక అడవిలో కొంతమంది ఆటవికులు ఒక గుడి కట్టుకున్నారు. వారికి రాతి విగ్రహాలు దొరకవు కనుక, ఒక చెక్కదుంగని విగ్రహంలా చేసి, పసుపు కుంకుమలు అదిమి, వస్త్రం కప్పి, దానికే పూజలు*

*చేసేవారు. అమ్మవారు కూడా ప్రసన్నమై, కోరిన కోర్కెలు తీర్చేది. ఆ గుడికి ఒక పూజారిని మాట్లాడి, నిత్యం పూజలు చేయించేవారు. అతడు అక్కడికి 5 మైళ్ళ దూరం నుండి రోజూ వచ్చి పూజలు చేసి వెళ్తూ వుండేవాడు. ఒక్కనాడు కూడా విసుక్కోలేదు. ఇది ఇలా జరుగుతూ వుండగా, ఒకనాడు భోరున వర్షం కురిసింది. కుంభవృష్టిలా మారింది. ఆ రోజు ఆ గుడికి దగ్గర్లోకి కట్టెలు కొట్టుకునేవాడు ఒకడు వచ్చాడు. వర్షం కురుస్తూ వుండటం వలన, నిలవడానికి నీడ లేక చుట్టూ వెదికితే, దగ్గరలో ఈ గుడి కనబడింది. వెంటనే గుడిలోకి వెళ్ళాడు. ఎదురుగా చూస్తే, పెద్ద దుంగ కనబడింది. వెంటనే, "ఆహా! వర్షం వల్ల చెట్లన్నీ తడిసిపోయాయి. ఈ రోజు కడుపుకు తిప్పలే అనుకుంటున్న తరుణంలో ఎదురుగా ఇంత పెద్ద దుంగ దొరకటం అదృష్టం" అనుకుని, ఆటవికులు పూజించే ఆ దుంగని కొట్టబోయాడు. వెంటనే, "ఒరేయ్! నన్ను కొట్టకు" అంది అందులో వున్న అమ్మ. వీడు దేవుడు, దెయ్యం అంటే ఏమిటో తెలియని నిషాదుడు కనుక, "ఎవర్రా దుంగ వెనుక దాక్కొని మాట్లాడుతున్నది? రండి బయటకు" అన్నాడు, అమ్మవారు అని తెలియని అజ్ఞానంతో. అప్పుడు ఆ దుంగ నుండి అమ్మవారు బయటకు వచ్చి, "నేను అమ్మని. నన్ను కొట్టకు" అనగానే, "ఐతే నిన్ను కొట్టకపోతే, నా కడుపు సంగతి ఏంటి?" అంటే, "ఇదిగో. నీకు వంద బంగారు నాణేలు ఇస్తాను" అని ఒక మూట అక్కడ పడేసి మాయమైంది. ఆ మూటలో వున్న బంగారు నాణేలు చూసేసరికి, చేతిలో వున్న గొడ్డలి అక్కడ పడేసి, మూట తీసుకుని వేగంగా అక్కడి నుండి వెళ్ళిపోయాడు. అప్పుడే అక్కడికి వచ్చి ఇదంతా చూస్తున్న పూజారికి ఒక సందేహం వచ్చింది. "రోజూ నేను అంత దూరం నుండి వచ్చి పూజలు చేస్తుంటే నాకు మాత్రం ఏమీ ఇవ్వదా, గొడ్డలితో కొట్టబోయే ఆ బోయవాడ్ని కనికరించిందా?" అని గొడ్డలితో నరకబోయాడు. గొడ్డలి పట్టాడో లేదో కళ్ళు పోయాయి, చూపు పోయింది. "అమ్మా! ఎంత అపచారం చేశాను. తల్లీ! నన్ను క్షమించు" అనగానే అమ్మవారు ప్రత్యక్షమై, "వాడు అజ్ఞాని. దేవుడంటే ఏమిటో తెలియదు. నన్ను చూసి ఒట్టి కట్టెముక్క అనుకుని కొట్టబోయాడు. నువ్వు జ్ఞానివి. నిత్యం నన్ను పూజిస్తున్నావు. అజ్ఞాని నరకబోగా కనికరించాను అని నువ్వు అనుకొని, నువ్వు కూడా అదే పని చేయబోయావు. ఏమీ తెలియని అజ్ఞాని చేసిన పని, అన్నీ తెలిసిన నువ్వు చేస్తే ఎలా? పైపెచ్చు, దేవతగా కొలిచే నన్నే నువ్వు నరకబోయావు. అందుకు కళ్ళు మాత్రమే తీసేశాను. చూపు తీయకపోతే, నువ్వు పూర్తిగా సర్వనాశనం అయిపోతావు" అనగానే, "అమ్మా! క్షమించు. మరొకసారి ఇలాంటి పొరపాటు చేయను. దయచేసి చూపు ప్రసాదించు తల్లీ!" అనగా, అమ్మ కనుక, కనికరించి చూపు ఇచ్చి, "వాడికి సంపద దొరికిందని నువ్వు పొరపాటు పడ్తున్నావు. అకారణంగా వచ్చే సంపాదన ఉపయోగపడదు. అక్కడ ఏమి జరుగుతుందో నీకు తెలియదు. వెళ్ళు. వెళ్ళి అక్కడ ఏమి జరుగుతుందో చూడు!" అనగానే ఆ బోయవాడిని అనుసరిస్తూ వెనకే వెళ్ళాడు పూజారి. బోయవాడు తన ఇంటికి చేరుకొని, భార్యని పిలిచాడు. జరిగింది చెప్పి, "ఇదిగో ఈ 100 బంగరు నాణేలు" అని చూపించగానే, భార్యకు బంగారం మీద ఆశపుట్టి, నాకు వడ్డాణం చేయించు, ఉంగరం చేయించు, బొంగరం చేయించు... అని భర్తను అడిగింది. భర్త వినలేదు. ఇంతలో కొడుకు వచ్చాడు. వాడు వ్యసనపరుడు. రోజూ ఆరంగా ఆరంగా త్రాగుతూనే వుంటాడు. అప్పటికే బాగా త్రాగి వున్నాడు. ఆ బంగారు నాణేలు చూసి "నాన్నా! అవి నాకు ఇవ్వు. నేను జూదమాడాలి. బాగా త్రాగాలి"*

అని అడిగాడు. భార్యని, కొడుకుని బయటకు గెంటి, లోపల దాచాడు. భార్య లోపలకు వచ్చింది. ఇద్దరికీ వాదోపవాదాలు బాగా జరుగుతున్నాయి. ఇంతలో కొడుకు ఒక గొడ్డలి తీసుకువచ్చి, తల్లిదండ్రులను ఇద్దరినీ నరికివేసి, ఆ బంగారు నాణేల సంచి తీసుకెళ్ళిపోయాడు. అకారణంగా వచ్చిన సంపద అకారణంగానే పోయింది. ఆ సంపదతో పాటు ప్రాణాలు కూడా పోయాయి. అది చూసి చలించిపోయిన పూజారి వెంటనే గుడికి వెళ్ళి అమ్మ పాదాలపై పడి క్షమాపణలు కోరుకున్నాడు.

చూశారా! నిత్యం పూజలు చేస్తూ, మధ్యలో నాస్తికవాదంలోకి మారితే ఇలాంటి ప్రమాదాలే వస్తాయి. దేవుడిని వేడుకోక ముందు కష్టాలు వున్నాయి. వేడుకున్న తర్వాత కూడా కష్టాలు వస్తున్నాయంటే, మీరు చేసిన పాపాలు ముందుగా తీసేస్తున్నాడని అర్థం. అంతేగానీ, అడిగిన వెంటనే సుఖం ఇచ్చి, కోరిన కోర్కెలు తీరిస్తే సుఖంగానే వుంటుంది. కానీ, మళ్ళీ ఏదో ఒక సమయంలో కష్టాలు చుట్టుముడతాయి. మళ్ళీ జన్మ ఎత్తాలి. అప్పుడు మళ్ళీమళ్ళీ పరుగులు పెట్టాలి. అవసరమా ఆ గోల అంతా? అదే మీరు చేసిన పాపాలు ముందుగా ప్రక్షాళన అయిపోతే, చివరివరకూ సుఖంగా జీవిస్తావు. అలాగే మీరు కోరుకునే కోరిక కూడా మీకు తగినది అవునా, కాదా అనేది కూడా తెలుసుకుని కోరుకోవాలి. కొందరు ఎంత వేడుకున్నా కోరికలు జీవితంలో తీరవు. ఎందుకంటే, దానికి వాడు అర్హుడు కాదు. నేను సి.ఎం. అవ్వాలి అనుకుంటే అయిపోతాడా? అవ్వడు. ఎందుకంటే, మీరు దానికి అర్హులు కారు కాబట్టి ఆ కోర్కె తీరదు. కష్టపడతాను, సాధిస్తాను అంటే జీవితాంతం కష్టపడుతూనే వుంటావు. కోట్ల మందిలో ఒక్కడికి మాత్రమే అవకాశం వస్తుంది. అది నేను ఎందుకు కాకూడదు అని పిడివాదం చేస్తే, నాస్తికుడిలా మారిపోతావు. చివరకు భ్రష్టత్వం వస్తుంది. మీకు ఏది కావాలో మీకు తెలియదు. మిమ్మల్ని సృష్టించిన పరమాత్మకు మీకు ఎప్పుడు ఏది ఇవ్వాలో తెలుసు. పరమాత్మని కొలిచేటప్పుడు కష్టం రావచ్చు. కానీ, నువ్వు చేసిన పూజ మెచ్యూరిటీ వచ్చే వరకు వేచి చూడాల్సిందే. ఏదో ఒకరోజు ఫలం వచ్చి తీరుతుంది. ఫలితం రాకుండా మాత్రం వుండదు. మీరు పూజలు చేసినన్ని రోజులూ కష్టాలు పడి, నాస్తికవాదంలోకి మారిపోగానే కలసివచ్చిందనుకోవడం అజ్ఞానం. నువ్వు చేసిన వ్రతఫలం అనుభవిస్తున్నావు. ఆ విషయాన్ని మీరు గ్రహించుటలేదంతే. ఎందుకంటే, అప్పటికే నాస్తికవాదంలో కూరుకుపోయారు. దీని ఫలితం కూడా అనుభవించాల్సిందే. పాపానికి కూడా మెచ్యూరిటీ రావాలి కదా! భక్తియైనా, నాస్తికవాదమైనా పుట్టుకతో వస్తే, దానిని అలా చనిపోయే వరకూ తీసుకువెళ్ళాలి. నాస్తికవాదం నుండి భక్తిలోకి వస్తే ఫర్వాలేదు గానీ, భక్తి నుండి నాస్తికవాదంలోకి వెడితే, వంశాలకు వంశాలు సర్వనాశనం అవుతాయి. కాబట్టి, చేసిన పూజకు ఏనాటికైనా ఫలితం తప్పక వస్తుంది. రాలేదని నాస్తికవాదంలోకి వెళ్ళకండి. సహనమే ప్రధానం. దైవానికి ఎవరి మీదా పక్షపాతం వుండదు. చేసే ప్రతి పనికీ ఫలితమిస్తాడు. నువ్వు పరిపూర్ణుడవు కావాలంటే, ముందుగా నువ్వు శుద్ధం కావాలి. బంగారానికి పుటం పెట్టిన తర్వాత ఎంత అద్భుతంగా తయారవుతుందో, చేసిన పాపాలు ప్రక్షాళన అయ్యేవరకూ కష్టాలు పడుతున్నట్లు అనిపిస్తుంది. ఒక్కసారి కర్మ శుద్ధం అవగానే, పరిపూర్ణత్వం వస్తుంది. అప్పుడు ఎంచక్కా ప్రతీక్షణం ఒకే స్థితి. ఆనందమే ఆనందం! ఆ తండ్రి పాదాల చెంత చేరేవరకూ అందరినీ చల్లగా చూడమని భగవంతుడ్ని ప్రార్థించండి.

వ్యక్తిత్వం అనేది వెలుగుతున్న దీపంలా వుండాలి. ఎందుకంటే, దీపం పూరిగుడిసెలో అయినా, ఇంద్రభవనంలో అయినా ఒకేలా వెలుగునిస్తుంది.

***జననమరణ కాల గమనంలో విలువలు మరచిన వెర్రితనంతో,***
***కాసుల బంధంలో కాలమెరుగక, క్రొత్త దారులకు పుంతలు తొక్కుతుంటే,***
***అనుబంధాల వాకిళ్ళు తెరిచి ఎన్నాళ్ళయింది? ఆత్మీయతా భోజనాలెక్కడ?***
***అనురాగాల పిలుపులు ఎక్కడ? అంతా నాదే, నాకే అనుకొని,***
***మనం అన్నది మరచి ఎన్నాళ్ళయిందో, ఎవరికి వారే రసవత్తరంగా***
***రకరకాల పాత్రలు పోషిస్తూంటే, ఎవరు మిమ్ము కాపాడుతారు?***
***మనుషుల మధ్యనే కాదు దూరం, మనసుల మధ్యా పెరిగింది***
***ఒకచోట కలిసి ఉన్నా, భిన్న ధృవాల్లా ఎంతకాలం మనుగడ సాగిస్తారు?***
***ఒక్కసారి మనసు విప్పి చూడండి దేహతంత్రులు ఎన్ని రాగాలు ఒలికిస్తాయో?***
***విశ్వానికి కాంతిరేఖలు మీరు***
***ఇకనైనా జాగృతులు కండి***
***పవనకుమారుని పవనం మిమ్ములను తాకిన వెంటనే పావనపుత్రులుగా మారి,***
***పల్లవినందుకొని, పల్లకిలో కూర్చుని పాదసన్నిధి చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**11-09-2020** 09:55 AM

**103)** వినయం యొక్క విశిష్ఠత ఎట్టిది స్వామీ?

ఒకసారి సముద్రుడికి పెద్ద సందేహం కల్గింది. గంగానదిని అడిగాడు, "నువ్వు నా దగ్గరకు పెద్దపెద్ద చెట్లను మోసుకొస్తుంటావు కదా. గడ్డిపరకల్ని ఎందుకు తీసుకురావు?" అని. అప్పుడు గంగానది ఇలా సమాధానం చెప్పింది. "చెట్లు వంగవు. అవి కఠినంగా వుంటాయి. అందుకే వాటిని వేళ్ళతో సహా పెళ్ళగిస్తూ వుంటాను. గడ్డిపరకలు వేరు. వాటికి అణకువ తెలుసు. నేను మహోధృతంగా ప్రవహిస్తున్నప్పుడు నా వేగానికి, బలానికి అవి వినయంగా తల వంచుతాయి. అప్పుడు నా వేగమూ, శక్తి ఓడిపోతాయి. నా వరద తగ్గిన వెంటనే గడ్డిపరకలు మళ్ళీ తలెత్తుతాయి". అలాగే, ఇతరులతో సర్దుకోవడం చేతకాక, అహంకారంతో, అతిశయంతో మిడిసిపడేవారు తమకంటే బలమైన శక్తులకు ఓడిపోయి నశిస్తారు. వినయంతో ఇతరులతో సామరస్య భావనతో జీవించేవారు ఎటువంటి ప్రతికూల పరిస్థితులనైనా తట్టుకుంటూ పదికాలాలపాటు జీవిస్తారు అని చెబుతాను. ఒక చిన్న విషయాన్ని చెబుతాను. దానికి సమాధానం ఆలోచించండి. ఒక సమావేశంలో మాట్లాడే వ్యక్తి 30 ఏళ్ళ వ్యక్తిని నిలబడమని అడిగారు, "మీరు హైదరాబాదులోని నెక్లెస్‌రోడ్డులో నడుస్తున్నారు. మీ ముందు నుండి ఒక అందమైన

*అమ్మాయి వస్తున్నట్లయితే, మీరు ఏమి చేస్తారు?" అని. యువకుడు, "ఆమెనే చూస్తాను" అన్నాడు. వక్త అడిగారు, "అమ్మాయి ముందుకు కదిలితే, మీరు వెనక్కి తిరిగి చూస్తారా?" అని. యువకుడు, "అవును. నా భార్య నా వెంట లేకపోతే (సమావేశంలో అందరూ నవ్వులు). వక్త అప్పుడు అడిగారు, "ఆ అందమైన ముఖాన్ని మీరు ఎంతకాలం గుర్తుంచుకుంటారో చెప్పండి (మరో అందమైన ముఖం కన్పించేంత వరకూ). ఆ యువకుడు "5, 10 నిముషాలు" అన్నాడు. వక్త యువకుడితో, "ఇప్పుడు ఆలోచించండి. మీరు భద్రాచలం నుండి హైదరాబాదుకు వెళ్తున్నప్పుడు, నేను మీకు ఒక ప్యాకెట్ పుస్తకాలను ఇచ్చి, ఈ ప్యాకెట్‌ను హైదరాబాద్‌లోని ఒక గొప్ప వ్యక్తికి అందజేయమని చెప్పాను. మీరు ప్యాకెట్ ఇవ్వటానికి హైదరాబాద్‌లోని అతని ఇంటికి వెళ్ళారు. మీరు అతని ఇంటిని చూచినప్పుడు అతడు పెద్ద బిలియనీర్ అని మీకు తెలిసింది. 10 కార్లు, 5 గురు చౌకీదార్లు ఇంటి బయట నిలబడి వున్నారు. మీరు ప్యాకెట్ యొక్క సమాచారాన్ని లోపలకు పంపితే, అప్పుడు వారు స్వయంగా బయటకు వచ్చారు. మీ నుండి ప్యాకెట్ తీసుకున్నారు. మీరు బయలుదేరటానికి సిద్ధమైనప్పుడు, మిమ్మల్ని ఆయన పట్టుబట్టి ఇంటిలోనికి తీసుకువెళ్ళారు. మీ దగ్గర కూర్చుని వేడి ఆహారాన్ని వడ్డించారు. బయలుదేరేటప్పుడు మిమ్మల్ని అడిగారు, "మీరు దేనిలో వచ్చారు?" అని. మీరు స్థానిక రైలులో వచ్చానని చెప్పగా, అతను డ్రైవరుతో మిమ్మల్ని గమ్యస్థానానికి తీసుకువెళ్ళమని చెప్పారు. మీరు మీ గమ్యం చేరుకోగానే ఆ బిలియనీర్ నుండి ఫోన్, "సోదరా! మీరు హాయిగా చేరుకున్నారా?" అని. ఇప్పుడు చెప్పండి. ఆ ప్రముఖుడిని మీరు ఎంతకాలం గుర్తుంచుకుంటారు? యువకుడు అన్నాడు, "ఆ వ్యక్తి చనిపోయే వరకూ మేము మరచిపోలేం". ఆ వక్త, యువకుడి ద్వారా సభను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఇది జీవిత వాస్తవికత. అందమైన ముఖం కొద్దిసేపు మాత్రమే గుర్తుంటుంది. కానీ, మీ అందమైన ప్రవర్తన జీవితకాలం గుర్తుంటుంది. మీ అందమైన ముఖం కాదు, అందమైన ప్రవర్తన కావాలి.*

**104) శరణాగతిని సాధించాలంటే మా విశ్వాసం ఎలా ఉండాలి స్వామీ?**

*ఈ రోజు ఇచ్చట చేరిన మీ గురించి ఒక విషయాన్ని చెబుతాను. ఎవరిని వారే పరీక్షించుకోండి. ఒక వ్యక్తి భూస్వామితో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాడు. సాయంత్రం వరకూ పనిచేస్తే, 100 రూ॥ కూలి ఇచ్చేటట్లు. అంగీకరించి, పని ప్రారంభించాడు. మరొక వ్యక్తి మధ్యాహ్నం తర్వాత వచ్చి పనిలోకి దిగి, మీకు ఇష్టం వచ్చినంత ఇవ్వండి అని సాయంత్రం వరకూ పనిచేశాడు. పని పూర్తయ్యాక, యజమాని వారిద్దరికీ చెరి 100 రూ॥ ఇచ్చి పంపించారు. అయితే, ప్రొద్దున నుండి సాయంత్రం వరకూ పనిచేసిన వ్యక్తి ఈ సమాన వేతనానికి అంగీకరించలేదు. అప్పుడు యజమాని ఇలా అంటాడు, "మన ఇద్దరి ఒప్పందం ప్రకారం నీకు 100 రూ॥ ఇచ్చాను. ఇక నీవు వెళ్ళవచ్చు. రెండవవానికి 100 రూ॥ ఇవ్వడమనేది నా స్వఇచ్ఛ. దానిని అడగటానికి నీవు ఎవరవు? నా డబ్బు మీద నీ పెత్తనం ఏమిటి?" అన్నాడు.*

*దీనిని ఆధ్యాత్మికంగా పరిశీలించినట్లయితే, మొదటివాడు "సాధన వలన మోక్షం" అన్న ఇచ్ఛతో ముందుకు సాగాడు. రెండవ వ్యక్తి భగవంతునికి శరణాగతి పొందాడు. ఒక రకంగా మొదటివ్యక్తి కర్మయోగి అవుతాడు, రెండవవాడు భక్తియోగి అవుతాడు. భగవంతుడు మాత్రం ఇద్దరిపై సమదృష్టి*

*కలిగివుంటాడు. మార్గాలు వేరైనా, ఇద్దరూ మోక్షమనే వేతనాన్ని పొందారు. ఒక్కొక్కరూ ఒక్కొక్క ప్రవృత్తితో పుడతారు. వారివారి ప్రవృత్తులను అనుసరించి, మోక్షసాధనలో ముందుకు వెళ్తారు. వాళ్ళను, వీళ్ళను పోల్చి చూచుకోకుండా, నీ ప్రవృత్తికి ఏది ప్రియమో, దానిని అనుసరించి ప్రవర్తించి తరించాలి. అయితే, సాధనకు శ్రద్ధ సరిపోవడం లేదు, శరణాగతికి విశ్వాసం కుదరటం లేదు. శరణాగతులం అయ్యామంటారు, నేను చెప్పిన మాటలపై విశ్వాసం వుండుటలేదు. సరే కదా అని, ఎన్నో చమత్కారాలు చేస్తాము. అయినా, దానిని విశ్వసించాలా? అని పెద్ద ప్రశ్న మీ ముందు వుంటుంది. మీ ముందునుండి ఆ పాత్రను (అవిశ్వాసం) దూరం చేస్తే, అపాత్ర అనే అవిశ్వాసం మీ నుండి దూరమై, విశ్వాసమనే పాత్ర మిగులుతుంది. భక్తి అనేది మీకు–భగవంతునికి సంబంధించిన ఒక చక్కటి హృదయబంధం. ఇప్పుడు మీ గురించే ఒక నిజం చెబుతాను. మీరు స్వామి పూజ చేసి, ప్రసాదం పెట్టి, "స్వామీ! మీరు తినాలి" అని అలాగే కూర్చున్నారు. ఆ ప్రసాదం స్వామి స్వీకరించలేదు. అప్పుడు మీరు నా పూజలో ఏం లోటు జరిగిందోనని ఏడుస్తారు. మీ ఏడ్పు వినలేక ఎవరినైనా పంపిస్తాను. కానీ, మీ ఏడుపు మానరు. వచ్చినవాడు భగవంతుడు కాదు. నా రూపం కావాలి. మీలో భక్తి వుంది. కావాల్సినంత విశ్వాసం లేదు. ఎందుకంటే, ఇప్పటికీ నైవేద్యం పెట్టి స్వీకరించమని మంకుపట్టు పడుతున్నావా? నీ ఏడుపు భరించలేక ఎన్నోమార్లు వచ్చి నీ ప్రసాదాన్ని స్వీకరించాను. మూర్ఖత్వపు ఛాందసంతో నీవు ఇబ్బంది పడి, అస్తమానూ చుట్టూ వున్నవారినీ ఇబ్బంది పెట్టవద్దు. ఎదుటివారిలో అసహనం కలగచేయకూడదు. భక్తి అనేది నీవు ఆరాధించే దైవానికి సంబంధించిన చక్కని హృదయబంధం. దానిని మనసులో వుంచుకోవాలే తప్ప, బయట పడకూడదు. నా మందలింపు కన్నా ప్రేమను తీసుకున్నట్లయితే, మీ నుండి ప్రసాదాన్ని స్వీకరించాను అన్న ఆనందంతో మీ కళ్ళు చెమ్మగిల్లాలి.*

### *నేను తక్కువ వాడ్ని కాను తెలుసా?*

***పుల్లమామిడి, నిమ్మ, ఉసిరి, ఉప్పు, కారం మొ॥ సృష్టించాను.***
***ఊరగాయ పెట్టుకునే తెలివి ఇచ్చాను.***
***కానీ, ఆశపడి తింటే అల్సర్, బీపీ బహుమతిగా ఇచ్చాను.***
***నేను తక్కువవాడిని కాను!***

***పంచదార, బెల్లం, తియ్యటిపళ్ళు ఇచ్చాను.***
***కానీ ఆత్రుతపడి తింటే, షుగరువ్యాధి బహుమతిగా ఇచ్చాను.***
***నేను తక్కువవాడిని కాను!***

***మీ కాలిగోటికి సరిపడని దోమలను సృష్టించాను.***
***శుచి, శుభ్రత లేకపోతే, మీ చెమటవాసనతోనే మిమ్ములను గుర్తుపట్టి,***
***మీ నెత్తురు త్రాగుతూ, మీకు నిద్రపట్టని స్థితి కల్పించాను.***
***నేను తక్కువవాడిని కాను!***

***సంపదలు, ఆస్తులు మీచేత కల్పించి,***

***మీలో మీరు తన్నుకునేటట్లు, చంపుకునేటట్లు చేశాను.***
***నేను తక్కువవాడిని కాను!***

***వేల ఎకరాల స్థలాలు ఆక్రమించిన ఆసామి,***
***దేహాన్ని వదలగానే ఆరు అడుగుల స్థలాన్ని మాత్రమే మిగులుస్తాను.***
***నేను తక్కువవాడిని కాను!***

***ఆప్తమిత్రులకు, అన్నదమ్ములకు, భార్యాభర్తలకు ఎడబాటు కల్పిస్తున్నాను.***
***నేను కాషాయం కట్టిస్తాను. ఆస్తులపై భ్రమ కల్పిస్తాను.***
***ఆఖరికి భ్రష్టుపట్టిస్తాను.***
***నేను, నేను అనే అహం కల్గిస్తాను.***
***అది వదిలితే గానీ దగ్గరకు రానీయనంటాను.***
***నేను తక్కువవాడిని కాను!***

***ముప్పైమూడు కోట్ల దేవతలను సృష్టించి,***
***నీవొక్కడినే పూజించమంటాను నేను.***
***ఇంద్రియాలను ఇచ్చాను. వాటికి రుచులు పుట్టించాను.***
***అన్నింటినీ వదిలితే కానీ, దగ్గరకు రానీయనన్నాను.***
***నేను తక్కువవాడిని కాను!***

***అన్నింటినీ వదలటం మీ వల్లకాదు.***
***నా పాదాలు పడితే నేనే నిన్ను నా చెంత చేర్చుకుంటాను.***
***నేను తక్కువవాడిని కాను!***

***ఇది ముమ్మాటికీ నిజం నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

తొందరపాటు నిర్ణయం ఏదైనా, జీవితాన్ని చిందరవందర చేస్తుంది

ఓం

**15-09-2020** 09:25 AM

**105) దుఃఖనివారణకు మార్గమేది స్వామీ?**

ప్రపంచంలో ప్రతి మానవుడు కోరుకునేది దుఃఖనివృత్తి, ఆనందప్రాప్తి. మానవుడే కాదు, ప్రతిప్రాణీ దుఃఖం పోవాలని, సుఖం రావాలని కోరుకుంటుంది. అందుకే ప్రతివ్యక్తీ ఈ లోకంలో ఏదో ఒకపని చేస్తూనే వుంటాడు. వ్యాపారం చేసినా, ఉద్యోగం చేసినా, వృత్తిని చేసినా అన్నింటి ఆశయం ఇదే. అలాగే, పూజలు చేసినా, వ్రతాలు చేసినా, యజ్ఞయాగాదులు చేసినా అన్నింటి ఆశయం ఇదే. ఇప్పుడు వచ్చిన ఈ కష్టం, ఈ దుఃఖం తొలగిపోతే చాలు, భగవంతునికి, భగవంతుడా! నీకు 100 కొబ్బరికాయలు

కొడతాను, సహస్రనామార్చన చేయిస్తాను, ప్రసాదం నైవేద్యం పెడతాను అంటారు. ఆ దుఃఖం కాస్తా తొలగిపోయిందనుకోండి, ఊరుకుంటారా? భగవంతుడా! నీవు ఎంతో దయామయుడవు. నా కష్టాన్ని తొలగించావు. ఆ చేత్తోనే మా అబ్బాయికి మంచి ఉద్యోగం వేయించు. లాటరీ తగిలేటట్లు చేయి అంటూ కోరికల మూటను విప్పుతారు. కనుక, మీ అందరికీ కావలసింది దుఃఖనివృత్తి, దానితోపాటే ఆనందప్రాప్తి. మోక్షం అనే పదాన్ని అందరూ వాడుతుంటారు. కానీ, అదేమిటో చాలామందికి తెలియదు. చచ్చిన తర్వాత వెళ్ళే స్వర్గలోకమే మోక్షమని చాలామంది అభిప్రాయం. కానీ, అది నిజం కాదు. మోక్షమంటే, అత్యంతిక దుఃఖనివృత్తి, శాశ్విత ఆనందప్రాప్తి. ఈ రెండింటినీ కలిపి, ఒకేమాటగా మోక్షం అంటారు. ఈ దుఃఖనివృత్తిని, ఆనందప్రాప్తిని సాధించుటకు మీరు ఎన్నో పనులు చేస్తుంటారు. వృత్తి, ఉద్యోగం, వ్యాపారాల ద్వారా డబ్బు సంపాదిస్తుంటారు. కొందరు జనులను మోసం చేసి లంచాలు తీసుకొని, తప్పుడు పనులు చేసి, దొంగతనాలు చేసి, సంపాదిస్తుంటారు. ఇలా రకరకాల వేషాలతో రకరకాల పనులు చేసి దుఃఖాలను తొలగించుకోవాలని, ఆనందం పొందాలని ప్రయత్నిస్తుంటారు కానీ, ఎవ్వరూ నిజమైన, నిత్యమైన ఆనందాన్ని పొందుటలేదు. ఎందుకని? ఎందుకంటే, తాత్కాలికంగా దుఃఖాన్ని తొలగించుకునేందుకు, ఆనందాన్ని పొందేందుకు తొందరపడుతున్నారే గానీ, శాశ్విత పరిష్కారం కోసం ప్రయత్నించుటలేదు. అసలు దుఃఖం ఎందుకొస్తున్నదో మూలకారణాన్ని గురించి శోధించటంలేదు. అందుకే సిద్ధి లభించుటలేదు. ప్రతి మానవుని పరిస్థితి అంతే. ఇలా విఫలప్రయత్నం చేసున్న మానవులను ఉద్ధరించటానికి, వారికి సరియైన మార్గాన్ని చూపటానికే భగవంతుడు హితోపదేశం చేస్తున్నాడు. సంసారభ్రమ వల్లనే దుఃఖం కలుగుతున్నదని ఆ సంసారత్యాగం, వైరాగ్యంతో సాధించాలని ఇంతవరకు చెప్పాను. సంసారత్యాగం వల్లనే దుఃఖనివృత్తి. అయితే, దుఃఖనివృత్తి కలిగితే చాలదు, ఆనందం కలగాలి. గాఢనిద్రలో ఆనందం ఉన్నదనుకుంటారు. అది దుఃఖం లేని అభావస్థితి మాత్రమే. మీకు పెద్ద కష్టం వచ్చి క్రిందమీదులైన తర్వాత అది తొలగిపోతే, గుండెల మిద బరువు తొలగినట్లు ఆనందిస్తారు. అది నిజమైన ఆనందం కాదు. కష్టం తొలగినస్థితి మాత్రమే. నెత్తిమీద కట్టెలమోపు పెట్టుకుని ప్రక్కఊరికి ప్రయాణమయ్యావు. నడిచినడిచి ఆ బరువుతో ఏడుపు వస్తున్నది. ఆకలి దంచేస్తున్నది. అలాగే ఏడుస్తూ నడుస్తున్నావు. ఆ మోపును దించితే, మళ్ళీ ఎత్తటానికి మనిషి కావాలి. అందుకనే అలాగే మోస్తూ నడుస్తున్నావు. ఇంతలో ఒక వ్యక్తి తరసపడి, మీ బాధను చూచి మోపును క్రిందకు దింపాడు. దీనితో బరువు తీరిపోయింది, హాయిగా వుంది. కానీ, ఆకలి మాత్రం అలాగే వుంది. కనుక దుఃఖనివృత్తే కాదు, ఆనందప్రాప్తి కూడా మీ లక్ష్యం కావాలి. అందుకే దుఃఖనివృత్తికి సంసారవృక్షాన్ని, వైరాగ్యమనే ఆయుధంతో ఛేదించాలని చెప్పి, ఇప్పుడు ఆనందప్రాప్తికి మార్గం చెప్పాను. నిష్కాముడైన సాధకుడు ఉన్నతోన్నతమైన పదవిని చేరుకోవాలి. ఎలాంటిది ఆ పదవి? ఈ సంసారానికి ఆధారమైనది, అధిష్టానమైనట్టిది. అదే పరమాత్మపదం. లోకంలో పదాలన్ని అనిత్యమైనవి, సామాన్యమైనవి. కానీ, పరమాత్మపదం మాత్రం నిత్యమైనది, శాశ్వితమైనది, చాలా గొప్పది. దానికన్నా ఉన్నతపదం మరొకటి లేదు. ఒకసారి ఆ పదవిలో కూర్చున్న తరువాత, ఇక పదవీవియోగం వుండదు. అక్కడి నుండి జారిపడే ప్రసక్తే లేదు. ఉప్పుబొమ్మ సముద్రం లోతు చూడాలని సముద్రంలొ దిగింది. అలా దిగి సముద్రపు లోతును చూస్తున్నది.

కానీ, ఎంతసేపైనా ఇక తిరిగి వచ్చే అవకాశమే లేదు. ఎందుకంటే, అది సముద్రస్వరూపమే అయిపోయింది. జీవుడూ అంతే. అన్ని బంధాలు వదిలించుకొని, సంపూర్ణ వైరాగ్యంతో ఆ పరమాత్మపదంలో పరమపదంలో ప్రవేశిస్తే, అతడు పరమాత్మస్వరూపుడే అవుతాడు. ఇక తిరిగి వచ్చే ప్రసక్తే లేదు. తిరిగి జన్మించే వీలు లేదు. ఈ బ్రహ్మాండంలో ఎక్కడికి వెళ్ళినా, తిరిగి రావల్సిందే. స్వర్గలోకం, చంద్రలోకం, పితృలోకం, వరుణలోకం... ఏ లోకం వెళ్ళినా అక్కడి అనుభవాలు పూర్తి అయిన తర్వాత తిరిగి ఈ మానవలోకానికి తిరిగి రావల్సిందే. అయితే బ్రహ్మప్రాప్తి, పురుషోత్తమప్రాప్తితో ఇక తిరిగి రావలసిన అవసరం లేదు. పిల్ల గ్రుడ్డు కానట్టుగా, ముత్యం తిరిగి నీరు కానట్లుగా, బ్రహ్మభావం పొందిన జీవుడికి ఇక తిరిగి జన్మలేదు. సముద్రరూపాన్ని ధరించిన ఉప్పుబొమ్మ తిరిగి ఉప్పుబొమ్మ రూపాన్ని పొందలేదు. దేనిని పొందిన తర్వాత తిరిగి వచ్చేపని లేదో, అంటే ఇదే. ఇదే మోక్షస్థితి. భగవంతుని అనుగ్రహంతో, గురువు యొక్క అనుగ్రహంతో, అనేక జన్మల సుకృతంగా, ఈ జన్మలో చేసిన తీవ్రప్రయత్నం కారణంగా ఒక్కసారి ఆ పదవిని, ఆ పరంధామాన్ని అందుకున్నారా, తిరిగి జారిపోయే ప్రసక్తే లేదు. ఐతే, ఆ మోక్షపదవిని పొందాలనుకున్నవారు, భగవంతుని శరణుకోరాలి. సంపూర్ణ శరణాగతులు కావాలి. కేవలం ప్రయత్నం చాలదు. పరమాత్మ అనుగ్రహం తప్పకుండా కావాలి. తన పురుషార్ధం అంతా, తన ప్రయత్నం అంతా ఆ పదవిని పొందటానికి పూర్వరంగాన్ని సిద్ధం చేసుకొనుట కొరకే. కావలసిన సామాగ్రిని, సంపదను సిద్ధం చేసుకొనేందుకే అన్ని సాధనలూ చేయాలి, ప్రయత్నాలు చేయాలి. ఎన్నికలలో గెలిచి ఎం.ఎల్.ఎ. పదవినో, ఎం.పి. పదవినో సాధించాలంటే ముందుగా మీ ప్రయత్నాలు కావాలి. ముఖ్యంగా డబ్బు సమకూర్చుకోవాలి. బ్యానర్లు, జెండాలు సమకూర్చుకోవాలి, కొందరు పెద్దలను కలుసుకుని సహాయం అర్ధించాలి. రౌడీలను, గూండాలను మేపుతూ వుండాలి. అధిష్టానం అనుగ్రహం సంపాదించుకోవాలి. కొన్ని ప్రాంతాలలో బాంబులను సమకూర్చుకోవాలి. కార్లు, రిక్షాలు, ఆటోలు మొ॥ వాటిని సమకూర్చుకోవాలి. ఇదంతా పూర్వరంగం. ఇక ఎన్నికల రోజున కావలసింది ఓటర్ల అనుగ్రహం. వారి అనుగ్రహం ఉంటేనే నీవు ఎన్ని ప్రయత్నాలు చేసినా పదవి లభించేది. వారి అనుగ్రహం లేకపోతే, అంతా వృధాయే. అలాగే, మోక్షపదవిని పొందాలంటే, భగవంతుని అనుగ్రహం కావాలి. అందుకు భగవంతుని శరణు పొందాలనే శుభేచ్ఛ కలగాలి. ఎంతో పుణ్యం చేసుకున్నవారికి మాత్రమే అటువంటి శుభేచ్ఛ కలుగుతుంది. పూర్వజన్మలలో భగవత్‌సంబంధమైన చింతన ఎంతోకొంత చేసివుంటేనే, పూజాదికాలు, యజ్ఞయాగాదులు కొన్నైనా చేస్తేనే, భగవంతుని స్మరిస్తూ జపధ్యానాదులు సాగిస్తేనే భగవంతుని శరణుపొందాలనే కోరిక కలుగుతుంది. సాధారణంగా ప్రతివారూ తన సంసారానికి, తన పాండిత్యానికి, తన గొప్పదనానికి, తన సంపదకు, తన పదవికి, తన కీర్తికి, తన ఠీవికి, తన ప్రతాపానికి, తన తెలివితేటలకు శరణాగతుడు అవుతాడే కానీ, భగవంతుని శరణుపొందాలనే సద్బుద్ధి నూటికో కోటికో ఏ ఒక్కరికో తప్ప అందరికీ కలగదు. అయితే, నిజమైన శరణాగతి ఏది? సర్వమూ భగవంతుడేనని, తనదేమీ లేదని, తాను కేవలం నిమిత్తమాత్రుడనని, సర్వమూ భగవంతుని ఇచ్ఛ ప్రకారమే జరుగుతున్నదనే విశ్వాసం వుండాలి. మీకు ఏ ఇష్టాయిష్టాలు వుండకూడదు. భగవంతుడు ఏది అనుగ్రహిస్తే దానితో సంతుష్టులు కావాలి. ఇదే శరణాగతి అంటే.

మానవునికి సంసారం కంటి అద్దాలవలె వుండవలయును.
కంటి అద్దాలు దృష్టిని అభివృద్ధి చేయునే గానీ, అడ్డము రావు గదా!
అటులనే, సంసారజీవితం భగవత్‌దృష్టిని అభివృద్ధి చేయవలయును గాని,
దానిని తగ్గించేదిగా ఉండకూడదు.
కళ్ళకు అడ్డమయ్యే అద్దాలు వేసుకొని తిరిగేవాడు అమాయకుడే కదా!

***మీ జీవితంలోనివి, మీరనుభవించేవి, కష్టాలు కావు***
***భగవంతుడు మీకిచ్చిన వరాలు***
***మీరు శక్తిని అడిగారు***
***కానీ, భగవంతుడు మీకు కష్టాన్ని ఇచ్చి, శక్తిని పొందమన్నాడు***
***మీరు సంపదను అడిగారు***
***కానీ, భగవంతుడు మీకు మట్టిని ఇచ్చి, బంగారం చేసుకోమన్నాడు***
***మీరు ధైర్యాన్ని అడిగారు***
***కానీ, భగవంతుడు మీకు ప్రమాదాలు ఇచ్చి, ధైర్యం వహించమన్నాడు***
***మీరు వరాలు అడిగారు***
***కానీ, భగవంతుడు మీకు అవకాశాలను ఇచ్చాడు***
***మీరు ఆయన ప్రేమను అడిగారు***
***కానీ, భగవంతుడు ఆపదల్లో ఉన్నవారి చెంతకు మిమ్ము పంపించాడు***
***మీరు జ్ఞానాన్ని అడిగారు***
***కానీ, భగవంతుడు సమస్యల్ని ఇచ్చి, పరిష్కరించమన్నాడు***
***మీరు పురోగతి అడిగారు***
***కానీ, భగవంతుడు మీకు అవరోధాలు కల్పించి అధిగమించమన్నాడు***
***మీరు లోకానికి మంచి చేయాలని అడిగారు***
***కానీ, భగవంతుడు ఇబ్బందులు కల్పించి అధిగమించమన్నాడు***
***మీరు ఆయన్ని మరువకూడదని అడిగారు***
***కానీ, భగవంతుడు బాధలు ఇచ్చి, ఆయన్ని గుర్తుంచుకోమన్నాడు***
***మీరు పాపాలను క్షమించమని అడిగారు***
***కానీ, భగవంతుడు ధ్యాన సాధన చేసుకోమన్నాడు***
***అలా జీవితంలో మీరు కోరుకున్నవేవీ పొందలేదు***
***కానీ, మీకు కావలసిందే మీరు పొందారు***
***ఈ విధంగా జీవితంలో జరిగే ప్రతీ సంఘటన నుండి***
***మీకు అవసరమైనది పొందటం మీరు నేర్చుకున్నారు***
***చివరకు ఏది జరిగినా, మీ మంచికే అని అర్థం చేసుకున్నారు***

***జరిగేది అంతా మీ మంచికే అని ఈ మారుతి***
***మాయాజాలన్ని ఛేదించి మరువకూడని మాటను***
***అందలమెక్కించే మోక్షపదవికి అడ్డుగానున్న అహంకారగోడను పగులగొట్టి,***
***పవనసుతుని పవిత్రభావాలను భావోద్వేగంతో ఆచరించి***
***ఆంజనేయుని అనుంగు బిడ్డలుగా మారండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**16-09-2020** 09:10 AM

**106) నిత్యానిత్య విచక్షణను చేయలేకపోవటానికి కారణం ఏమిటి స్వామీ?**

*జ్ఞానులకు, అజ్ఞానులకు ఈ ప్రపంచం కనిపిస్తూనే వుంటుంది. కానీ, అజ్ఞానులు దీని ఆకర్షణకు లొంగిపోయి, మోసపోయి కష్టాలపాలవుతారు. జ్ఞానులు ఇది సత్యం కాదని తెలుసుకొని మోసపోరు, కష్టాలపాలు కారు. ఎండమావులు వివేకంలేని జంతువులను మోసం చేస్తాయిగానీ, వివేకంగల మానవులను మోసం చేయలేవు. కలలోని వస్తువులు లేనివే అయినా కనిపిస్తున్నాయి, సుఖదుఃఖాలను కలిగిస్తున్నాయి. అంతమాత్రాన అవి నిజమా? కాదు. నిద్రించినప్పుడు మనసులో ఎలాగైతే స్వప్నప్రపంచం కల్పించబడ్డదో, అలాగే పరమాత్మలో ఈ జాగృత్‌ప్రపంచం కల్పించబడింది. త్రాడు త్రాడుగానే వుండి, భ్రాంతి వల్ల పామై కనిపించినట్లు, పరమాత్మ పరమాత్మగానే ఉండి, అజ్ఞానులకు ప్రపంచంగా కన్పిస్తుంది. శాస్త్రాలలో సృష్టిని గురించి అనేక విధాలుగా చెప్పారు. ఇదంతా ఎందుకంటే, ఈ సృష్టి మొత్తం మిథ్య అని చెప్పటానికే. ఒక భగవంతుని ఇంటిలో వైభవంగా వివాహము జరుగుతున్నది. మేజువాణి వేడుకకు బాణాసంచా తెప్పించారు. ఒక పెద్ద ఏనుగును తయారుచేసి, దానిలోపల ప్రేలుడు పదార్థాలను కూర్చారు. ఇక నిప్పు అంటించడమే తరువాయి. ఏనుగు ఆకాశంలో ప్రేలిపోతుంది. ఈ వింత చూడటానికి జనం దాని చుట్టూ మూగారు. అందుకో ఒకడన్నాడూ, "అంతా బాగానే వుంది గానీ, దాని చెవులు చాలా చిన్నవిగా వున్నాయి" అన్నాడు. మరొకడు "తోక మరీ చిన్నదిగా వుందే?" అన్నాడు. ఇలా ఒక్కొక్కరూ ఒక్కొక్క లోపాన్ని చెబుతున్నారు. అంతలో మరొకడన్నాడు, "అది స్థిరంగా ఇంట్లో పెట్టుకుని, చూచుకొనేదైతే, మీరు చెప్పిన మాటలు నిజమే గానీ, ఇంకొక నిముషంలో కాలి బూడిదైపోయేది ఎలా వుంటేనేమి?" అన్నాడు. సృష్టి గురించి అనేకమంది అనేక విధాలుగా చెప్పటం కూడా ఇంతే. అది మిథ్య అని చెప్పటానికే. మానవుడికి కావలసింది ప్రపంచ జిజ్ఞాస కాదు, బ్రహ్మజిజ్ఞాస. "అథాతో బ్రహ్మజిజ్ఞాస" అని బ్రహ్మసూత్రాలలో మొదటి సూత్రంగా చెప్పినది ఇదే. అయితే లోకంలో అందరికీ బ్రహ్మజిజ్ఞాస కన్నా ప్రపంచజిజ్ఞాసయే ఎక్కువ. అందరూ ప్రాపంచిక వ్యామోహాలకే ప్రాధాన్యతనిస్తారు. వాటి కోసమే జీవిస్తారు. ఈ ప్రపంచం మిమ్ములను మోసగించేదని, పరమాత్మను చేరుకునేందుకు అడ్డు వస్తుందని, పరమాత్మకు మిమ్ములను దూరం చేస్తున్నదని అజ్ఞానంలో ఉన్న మీరు తెలుసుకోలేకపోతున్నారు. అలా*

*తెలుసుకోలేకపోవటం వల్లనే ఈ ప్రపంచం వెంటపడి ఏవేవో సుఖాలు పొందాలని భావిస్తూ పరమాత్మకు దూరమైపోతున్నారు, మోసపోతున్నారు. మరి ఎందుకు తెలుసుకోలేకపోతున్నారు? వ్యామోహంలో మునిగిపోవటం వల్లనే. చీకటిలో ఉన్నవాడికి వస్తువులు కన్పించవు. అలాగే, అజ్ఞానాంధకారంలో ఉన్న వారికి ఈ ప్రపంచ లక్షణం, తత్త్వం తెలియదు. ఇంటికి పునాదులు ఆధారంగా ఉంటాయి. ఇంటిమీద వ్యామోహంతో ఇంట్లో కూర్చున్నవారికి పునాదులు కన్పించవు. వ్యామోహం తీరి బయటకు వచ్చి, త్రవ్వి చూస్తే పునాదులు కన్పిస్తాయి. అలాగే, ప్రపంచ వ్యామోహంలో మునిగిపోయి, ఇక్కడి వస్తువులతో సంగభావం పెట్టుకుని, వాటిలోనే తిరిగేవారికి ప్రపంచానికి ఆధారమైన పరమాత్మ కన్పించడు. కనుక, వ్యామోహాన్ని విడిచి విషయవిరక్తితో విచారణ చేస్తే, సూక్ష్మబుద్ధితో విశ్లేషణ చేస్తే పరమాత్మ కన్పిస్తాడు. అందుకే ఈ సంసార వృక్షాన్ని ఛేదించాలని చెబుతూ, ఆ సంసారవృక్షాన్ని ఛేదించటానికి ఎలాంటి ఆయుధము కావాలో చెబుతాను. ఈ సంసారవృక్షాన్ని దృఢమైన వైరాగ్యమనే గొడ్డలితో నరికివేయాలి. ఈ సంసారవృక్షం అనేక కోట్ల జన్మల నుండి వ్యాపించి వున్నది. శాఖోపశాఖలుగా అంతటా విస్తరించుకొనియున్నది. వ్రేళ్ళు బాగా తన్నుకొని బలంగా లోపలకు చొచ్చుకొనిపోయి వున్నాయి. అందుకే దీనిని "సువిరూఢమూలం" అంటారు. గట్టిగా పాతుకొనిపోయి వున్నది కనుక, దీనిని ఛేదించాలంటే, పదునైన గట్టి ఆయుధమే కావాలి. వైరాగ్యమనే గొడ్డలి కావాలి. దానితోనే ఛేదించాలి. వైరాగ్యం లేనిదే ఈ సంసారాన్ని ఛేదించటం అసాధ్యం. అంతేకాదు, ఈ వైరాగ్యం వివేకంతో కూడుకున్నదై వుండాలి. వస్తువులో వున్న దోషాన్ని చూడటమే విజ్ఞానం, వివేకం. నీవు ఎంతో ఇష్టపడే స్వీటును ఎవరో తెచ్చి ఇచ్చారు. దానిని ఎంతో ఇష్టంతో తినబోతున్నావు. అంతలో ఒకరు వచ్చి దానిలో విషం కలిసింది అన్నారు. అయితే అయిందిలే ఈ స్వీటు నాకెంతో ఇష్టం అని తింటావా? తినవుగదా? ఈ ప్రపంచంలో ప్రతి విషయం దోషాలతో కూడుకునే వుంటుంది. ముఖ్యంగా మూడు దోషాలున్నాయి. అవే క్షయ, సాతిశయ, పతన దోషాలు. ఈలోకంలోనే కాదు, స్వర్గలోకంలోని భోగాలలో కూడా ఈ 3 దోషాలు వున్నాయి. ఎన్నికలలో బాగా ఖర్చుపెట్టి ఎం.ఎల్.ఎ. అయ్యారు. అక్కడ హంగ్ అసెంబ్లీ ఏర్పడి, తంతే బూరెలబుట్టలో పడ్డట్టు, మంత్రిపదవి కూడా వచ్చింది. ఎంత సంతోషమో! తన జీవితలక్ష్యం నెరవేరింది. ఒక సంవత్సరకాలం ఆనందంలో గడిచిపోయింది. ఆ తర్వాత ఆలోచనలో పడ్డారు. ఈ ప్రభుత్వం పూర్తిగా వుంటే 5 సం॥లు. అప్పుడే ఒక సం॥ గడిచిపోయింది. ఇక నాలుగేళ్ళే. ఇదే క్షయ దోషం. ఇప్పుడు తాను సహాయమంత్రి. కేబినెట్ మంత్రిని చూస్తే కడుపుమంట. తనకన్నా వాడు ఏమి గొప్పని, వాడికి పెద్ద పదవి? అని. ఇది సాతిశయ దోషం. ఇక ఆ ప్రభుత్వం అవిశ్వాస తీర్మానం నెగ్గటంతో 3 సం॥లకే పడిపోయింది. దానితో తన మంత్రిపదవి ఊడిపోయింది. ఇప్పుడు పలుకరించే దిక్కులేదు. పైగా మంత్రిపదవిలో వుండి దోచుకున్న దానికి సి.బి.ఐ.వారు సంజాయిషీ అడుగుతున్నారు. ఎఫ్.ఐ.ఆర్. వ్రాసి అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఇది పతన దోషం. స్వర్గలోకంలో కూడా ఈ దోషాలే. వెయ్యి సంవత్సరాలు భోగాలనుభవించడానికి స్వర్గానికి వచ్చారు. 100 సం॥లు గడిచింది. ఇక 900 సం॥లు మాత్రమే. ఇదే క్షయ దోషం. ఇక్కడి సుఖాలకన్నా సత్యలోకంలో ఇంకా బాగున్నాయి. ఇది సాతిశయ దోషం. 1000 సం॥లు పూర్తి అయి, కుక్కజన్మ వచ్చింది. ఇది పతన దోషం. ఇదంతా జాగ్రత్తగా*

*గమనించినవాడు వివేకి అయినవాడు ఇకలోక, పరలోక సుఖాలపై ఆసక్తిని విడిచిపెట్టి, పరబ్రహ్మప్రాప్తికి ప్రయత్నం చేస్తాడు. అందుకనే వైరాగ్యమనే గొడ్డలిని చేత ధరించాలి. సంగం అంటే రాగం. అసంగం అంటే వైరాగ్యం. వైరాగ్యమనే శస్త్రంతో ఈ సంసారవృక్షాన్ని ఖండించాలి. ఆ వైరాగ్యం దృఢంగా వుండాలి. కత్తిని వదులుగా పట్టుకుంటే పెన్సిల్ కూడా చెక్కటానికి పనికిరాదు. అదే గట్టిగా పట్టుకుంటే తలకాయలు కూడా తెగిపోతాయి. నేను ఆత్మను, అసంగస్వరూపుడను అనే భావన సంసారతాపం నుండి తప్పిస్తుంది. ఇది సామాన్యులకు అర్థం కాదు. ఒక సాధువు ధనవంతుని ఇంటికి భిక్షకు వెళ్ళాడు. ఆ మహాత్మునికి షడ్రసోపేతమైన భోజనం పెట్టించాడు ధనవంతుడు. తరువాత విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు, యజమాని ఆ సాధువుతో స్వామీ! భోజనం ఎలా వుంది? తమకు తృప్తిగా వున్నదా? అన్నాడు. అందుకు సాదువు, నన్నెందుకయ్యా అడుగుతావు? తిన్నవాడ్ని అడుగు అన్నాడు. ఆత్మ, అసంగమనే పాఠం చేప్పాడు సాధువు. అది సిద్ధావస్థకు చెందిన అసంగస్థితి. అది లభించేవరకూ నేను అసంగ రూపాత్మను, నేను అకర్తను, అభోక్తను అనే భావన చేస్తూ రావాలి. అప్పుడు కలిగే వైరాగ్యమే పూర్ణవైరాగ్యం.*

మోసేది బరువనుకుంటే, దింపేయాలనిపిస్తుంది
బాధ్యత అనుకుంటే ఇంకా మోయాలనిపిస్తుంది
నీవు విజయం సాధిస్తే, నీ శ్రేయోభిలాషులకు నీవు ఏమిటో తెలుస్తుంది
ఒకవేళ పరాజయం పాలైతే, నీ శ్రేయోభిలాషులెవరో నీకు తెలుస్తుంది

***ఆకులు తింటేనే బ్రహ్మజ్ఞానం వస్తే***
***అందరికన్నా ముందు మేకలే జ్ఞానులు కావాలి***
***స్నానాలతోనే పాపాలు పోయేటట్లయితే***
***ముందు చేపలే పాపవిముక్తులు కావాలి***
***తలక్రిందులుగా తపస్సు చేస్తేనే పరమాత్ముడు ప్రత్యక్షమైతే***
***ముందు గబ్బిలాలకే ఆ వరం దక్కాలి***
***ఈ విశ్వమంతా పరమాత్మలో వుంది***
***నీలో వున్న పరమాత్మను వదిలి పరుగులు పెడితే ప్రయోజనం లేదు***
***నీలో లేనిది బయట ఏమీ లేదు***
***అందరినీ ప్రేమించండి    అందరినీ సేవించండి***
***అప్పుడు పరమాత్మయే నీ వద్దకు వస్తాడు***
***ఎదుటివారికి చేసే సేవలో ఉన్నటువంటి ఆనందం***
***మరెక్కడా కన్పించదు***
***ఇంతకన్నా మరెద్ది మంచిని తెలుపను***
***అని మారుతి మిమ్ములను అడుగుతున్నాడు***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**17-09-2020** 09:30 AM

**107) మేము ఏ విధంగా మాట్లాడాలి స్వామీ?**

ఒంటరిగా ఉన్నప్పుడు ఆలోచనలను, నలుగురితో ఉన్నప్పుడు నాలుకను అదుపులో ఉంచుకొనగలిగితే, మీ జీవితం అదుపు తప్పకుండా వుంటుంది. నాలుకను అదుపు చేసుకోగల విద్య తెలిస్తే, అనేక విద్యలు అవలీలగా వంటబడతాయి. నోటిని అదుపులో పెట్టుకుని అందరితో మర్యాదగా మాట్లాడుతూ, పద్ధతిగా నడుచుకుంటూ వుంటే ఎప్పుడైనా, ఎక్కడైనా మంచే జరుగుతుంది. చెట్టు సారం, పండులో వ్యక్తమైనట్లుగా, మనిషి సారం అతడి మాటలలో తొంగిచూస్తూ వుంటుంది. మంగళకరమైన మాటతీరు, మనిషి సంస్కారానికి గీటురాయి. మనిషికి నిజమైన అలంకారం అతడి మాటతీరే. వాగ్భూషణం ఒక్కటే మనిషికి సుభూషణం. సంభాషణం – హితభాషణం, స్మితభాషణం, ప్రియభాషణం, పూర్వభాషణం, సత్యభాషణం అయినప్పుడు, అంతకన్నా భూషణం మరొకటి లేదు. మితంగా, హితంగా మాట్లాడాలి. మనిషికి గౌరవం తెచ్చేవి ఇవే. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ మాట్లాడుతూ వుండాలి. ఆ సందర్భంలో కూడా ఎదుటి మనిషిని నొప్పించకుండా నవ్వించగలగాలి. మధురభాషణం వలన మర్యాద లభిస్తుంది. నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది కదా! ప్రియంగా మాట్లాడాలి. ఎదుటివారిని ముందుగా మీరే పలుకరించడం పూర్వభాషణం. సత్యమే సర్వోన్నతమైంది. కనుక నిర్భయంగా సత్యాన్ని పలకండి. ఆ సత్యాన్ని నేర్పుగా, ఓర్పుగా, ప్రేమగా, మర్యాదగా, హుందాగా మాట్లాడాలి. ఆలోచించకుండా మాట్లాడటం గురి చూడకుండా బాణం వేయడం లాంటిది. మాట్లాడిన తర్వాత ఆలోచించాల్సిన అవసరం రాకూడదు. కాబట్టి, ఆలోచించి, ఆచితూచి మాట్లాడాలి. తాను ఏం మాట్లాడాలో తెలిసినవాడు తెలివైనవాడు. తాను ఏం మాట్లాడకూడదో తెలుసుకోగలిగినవాడు వివేకవంతుడు. ఎవరైతే తమ మాటలవల్ల, చేతలవల్ల ఇతరులను బాధ కల్గించకుండా ఉంటారో, వారే ఉత్తములు. ఆచరిస్తూ చెప్పే మాటలకు ఆదరణ ఎక్కువ. ఆచరణపూర్వకంగా చెప్పే మాటలకు ఆదరణ ఎక్కువ. ఆకట్టుకునేలా మాట్లాడటం ఒక కళ. అయితే, ఆ మాటలను ఎప్పుడు మొదలెట్టాలో, ఎప్పుడు ఆపాలో తెలియటం మరీ గొప్ప కళ. మాటలే మంత్రాలు, చెట్లే ఔషధాలు. మాటలు చాలా మధురమైనవి కనుక జాగ్రత్తగా వాడాలి. అనగా మాటలు చాలా పదునైనవి కనుక జాగ్రత్తగా వాడాలి. బలమైనవి కనుక సున్నితంగా వాడాలి. ఖరీదైనవి కనుక పొదుపుగా వాడాలి. మాట్లాడటం అందరూ చేస్తారు. అయితే, అందరిలాగా నోటితో మాట్లాడితే సరిపోదు. మరింత ప్రభావాన్వితంగా ఉండాలంటే, మనసుతో శరీరంతో మాట్లాడాలి. మాటే సంపదలకు, మానవసంబంధాలకు మూలం. మాటే స్నేహితులను సంపాదించిపెడుతుంది, శత్రువుల్ని తయారుచేస్తుంది. నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు. అలాంటివారికి శత్రువులే వుండరు. మాటలు గాయపరచగలవు, గాయాన్ని నయం చేయగలవు. సరియైన మాటతీరు చంపటానికి వచ్చిన శత్రువు మనసునైనా మార్చగలదు. మాటల మధ్యలో సందర్భానుసారంగా సామెతలు, ఛలోక్తులు వాడితే, పాయసంలో జీడిపప్పులా మరింత మధురంగా,

వినసొంపుగా అన్పిస్తుంది. సంభాషణ, సరస చతురత కలిగి వుండాలి. ఎవరితో, ఎప్పుడు, ఎలా మాట్లాడాలో తెలిసివుండాలి. మనిషికి భావవ్యక్తీకరణ గొప్ప ఆస్తి. ఏం చెప్పారనే దానికన్నా, ఎలా చెప్పారన్న దానినిబట్టే భావవ్యక్తీకరణ మరింత ఆకర్షణీయంగా వుంటుంది. భావవ్యక్తీకరణ ఎంత గొప్పగా ఉంటే, ఫలితం అంత మహత్తరంగా వుంటుంది. ఉద్యోగులైనా, అధికారులైనా, గురువులైనా, సామాన్యులైనా, కన్న తల్లిదండ్రులైనా ఎవ్వరినీ నొప్పించకుండా, శాంతియుతంగా, మధురంగా మాట్లాడాలి.

చూసేవాళ్ళు చుట్టూ లేకున్నాసరే, పుష్పం వికసించక మానదు
నీ పని నీవు నిశ్శబ్దంగా చేసుకుంటూ వెళ్ళు,
నిన్ను ఇష్టపడేవాళ్ళు దారి వెతుక్కుంటూ నీ దగ్గరకు వస్తారు

***సుదూర లక్ష్యాలను ఛేదించాలని***
***ఉన్నత శిఖరాలను తాకాలని అనుకుంటే,***
***మీ కోర్కెల రహదారిపై నడవకండి***
***మీలోని నన్ను విడిచి మీలోని నన్ను పరాయివాడిని చెయ్యకండి***
***మీకు మీరుగా జీవించండి***
***సుడులు తిరుగుతున్న మీ హృదయసంద్రంలో***
***ఆర్ద్రతతో స్పృశించే అమృతపు చినుకుకండి***
***అద్భుతమైన జీవితాన్ని యంత్రమయం చేసుకోకండి***
***మంత్రమయమైన ఈ మారుతి మాటలతో***
***సహజంగా వికసించాలి పూవులై***
***జీవితాన్ని పరిమళభరితం కావించుకుని***
***మీ ఆలోచనలతో ఎదుగుతూ***
***ఆంజనేయుని అనురాగ సంగమంతో జతకట్టి,***
***ఏకాంతాన ఆవిర్భవించిన అంకురములై సమాజం మెచ్చే***
***సంస్కారవంతులై దరిచేరుటకు వచ్చిన మిమ్ము గాంచి***
***ఆంజనేయునికి దరహాసము చిందును***
***మీ కనులలో వెలుగుతాయి వేయి దివ్వెలు***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**18-09-2020** 09:25 AM

**108)** మాయను జయించటం అసాధ్యం అనిపిస్తుంది స్వామీ?

*పశుపక్ష్యాదులు, క్రిమికీటకాలు, క్రూర-సాధు జన్మల (60 వేలు) అనంతరం మాత్రమే మానవజన్మ*

ఎత్తుతారని, ఈ జన్మలోనే ఆ విచక్షణా జ్ఞానాన్ని ఆ పరమాత్మ ప్రసాదించాడని మీకు తెలుసు. అయితే, అందుకు ప్రతిగా ఆ ఈశ్వరునిపట్ల కృతజ్ఞతాభావాన్ని ఏ సందర్భంలోనైనా ఇసుమంత కూడా మీరు వ్యక్తపర్చుటలేదు. ఈ ప్రపంచమంతా మీదిగానే భావిస్తున్నారు. ఈ బంధాలు, అనుబంధాలు శాశ్వతమని, భోగభాగ్యాలతోనే జీవితం ముడిపడి ఉందని తలపోస్తూ, పరమాత్మకు దూరమవుతున్నారు. దుష్కర్మలు చేస్తూ జీవితాన్ని గడిపేస్తున్నారు. ఆవుటెద్దులా స్వేచ్ఛగా తిరుగుతున్నారు. అంతేగాక, దేవుడు ఆడుతున్న ఈ క్రీడలో మీరంతా పావులని, క్రీడాకారులనీ గుర్తించలేకపోతున్నారు. ఈ దొంగాటలో అరిషడ్వర్గాలనే దొంగలకు దొరికిపోయి, తల్లి చెంతకు చేరుకోలేకపోతున్నారు. విధి ఆడుతున్న ఈ వింత క్రీడలో మీరు చేయవలసిందల్లా ఒక్కటే. సద్బుద్ధిని పెంపొందించుకోవటం, పరిగెట్టే మనసుని కళ్ళెం వేసి నిలబెట్టడం. అందుకు మీరేమి చేయాలి? ప్రకృతినంతా పరిశీలన చేయాలి. అవగాహనను రూపొందించుకోవాలి. హరినామం ఉచ్ఛరించని జిహ్వని నిరంతర అభ్యాసంతో హరినామమే శ్వాసగా జీవించడం అలవాటు చేసుకోవాలి. మకిలి అంటుకోకుండా మనసుని పవిత్రంగా తయారుచేసుకోవాలి. బుద్ధితో మనసుకి దారి చూపాలి. అంతర్యామిగా మీలో విరాజిల్లుతున్నది ఈశ్వరుడేనన్న స్ఫురణతో జీవించగలగాలి. ఈ సాధనా ప్రక్రియలో పూజలు, జపాలు, హోమాలు చేయగలిగినన్ని చేస్తూ, ఆ భగవంతుడిపై మనసును లగ్నం చేయాలి. జపతపాదులు చేయలేనివారు ఆ హరిస్మరణలో జీవించే అలవాటును చేసుకోవాలి, చేసుకోగలగాలి. నిరంతరం ఈ అభ్యాసం చేస్తూ, పరమాత్మ చెంతకు చేరుకునేలా మనసుని ప్రబోధం చేస్తూ, బుద్ధిని శీఘ్రంగా నిలిపినట్లయితే, ఈశ్వరుడి చెంతకు చేరుకున్నట్లే. ఏ క్షణమైతే మనసంతా భగవంతునిమయం అవుతుందో, ఆ మరుక్షణం నుండి, నిన్ను నడిపేది ఆ పరమాత్ముడే. అప్పుడు నిర్ణయాలు నీవి కావు. నాది నాది నాది అనే భావం మాయమైపోతుంది. మనది అనే సద్భావం పురుడు పోసుకుంటుంది. అరిషడ్వర్గాలు నీ నుండి దూరంగా పారిపోయి నిన్ను పునీతుడ్ని చేస్తాయి. కష్టాలకు కృంగిపోని, సుఖాలకు పొంగిపోని సమత్వస్థితికి నీ మనసు చేరుకుంటుంది. జీవన్ముక్తుడవై మోక్షానికి అర్హతను పొందుతారు. పరిపూర్ణ జీవన్ముక్తి స్థితిని పొందిననాడు, నీ మనసు నిండా ఆనందమే. ఇదే మీకు కావలసింది. అందుకే కోరికలను త్యజించి నువ్వే కావాలంటూ భగవంతుడ్ని ప్రార్థించండి. సంకల్పం బలంగా వుంటే, అప్పుడు మీ దేవుడే దిగివచ్చి మిమ్ములను తనవాడిగా చేసుకుంటాడు. ఏకాత్మస్థితిని అనుగ్రహించి అందలం ఎక్కిస్తాడు. ఇది సత్యమేవ సత్యం అని ఈ ఆంజనేయుడు అందలం ఎక్కిస్తానని అభయమిస్తున్నాడు. కోరికలు తీరటం లేదని, కష్టాలు వదలటం లేదని దేవుని నిందించటం తగదు. ఎందుకంటే ఒక పిల్లవాడు, తళతళమని మెరిసే కత్తిని ఆటవస్తువని భావించి అది కావాలని తల్లితో పదేపదే మారాం చేస్తూ వుంటాడు. పిల్లవాడు అడుగుతున్నాడు గదా అని తల్లి కత్తిని ఇస్తుందా? మీరైతే మాత్రం ఇస్తారా? తల్లి అవసరమైతే పిల్లవాడ్ని దండిస్తుంది కానీ, కత్తిని అందించదు. ఎందుకంటే, కత్తి వలన కలిగే ప్రమాదం పిల్లవాడికి తెలియదు. అదేదో ఆటవస్తువన్న భ్రమలో ఉంటాడు. కానీ, తల్లికి దానివలన కలిగే ప్రమాదం తెలుసు. కనుక, తన పిల్లవాడు ఆ కత్తితో తనకు తానుగా ఎక్కడ గాయపరచుకుంటాడో అని ఆ తల్లి దానిని దూరంగా దాచేస్తుంది. మరి ఈ జన్మకు, కేవలం ఈ దేహానికి మాత్రమే తల్లిగా వుండే మానవ స్త్రీయే తన బిడ్డలపట్ల అంత జాగ్రత్తగా ఉంటే, జన్మజన్మల నుండి మీతో

వుంటూ, మీ ఆత్మకు తల్లీ తండ్రీ తానుగా వుండి మిమ్ములను సదా కాచుకు కూర్చుంటున్న ఆ భగవంతుడు ఆయనకి పిల్లలైన మీపై ఇంకెంత జాగ్రత్త వుంటుంది? మీరు కోరుకునే వస్తువు వలన కలిగే దుష్పరిణామాలు మీకు తెలియవు. కానీ, భగవంతునికి సదా ఎరుకయే. భగవంతుడు మీరు అడిగిన ప్రతీదీ ఇవ్వకపోవచ్చు. ఇవ్వకపోవటానికి కారణం ఇదియే. భగవంతుని ప్రార్థించండి, అర్థించండి. ఫర్వాలేదు. ఇవ్వలేదని నిందించకండి. ఆయన మీకు కావాల్సిన ప్రతీదీ ఇవ్వకపోవచ్చు. కానీ మీకవసరమైన ప్రతీదీ ఇచ్చితీరుతాడు. కాబట్టి సందేహాలకు చోటివ్వక, విశ్వాసం పెంచుకోవాలి. భగవంతుడిపై విశ్వాసం ఉంచండి. చెప్పిన మాటలను అర్థం చేసుకోండి. అర్థం చేసుకొని ఆచరించండి.

*పసితనంలో దేన్నయినా పట్టుకొని నిలబడాలి*
*పెద్దయ్యాక దేన్నయినా తట్టుకొని నిలబడాలి*
*బుద్ధిహీనుడైన స్నేహితుని కన్నా బుద్ధిమంతుడైన శత్రువు మేలు*
*డబ్బు ఎప్పుడూ వుంటుంది. కానీ అది ఎల్లవేళలా జేబుల్లోనే వుండదు*
*అదే దాని బలం – బలహీనత!*

***అందరి సొమ్ము కొందరి పరమైతే, అందరి పాపం కొందరిదవుతుంది***
***అందరికీ చెందవలసింది కొందరిదైతే అందరి జీవితాలు అయోమయమే గదా***
***అందరి మేలు కోరటమే ఆధ్యాత్మికత అందరికీ సంపదను పంచటమే ఔన్నత్యం***
***అందరూ భగవంతుని ప్రతిరూపాలైతే***
***అందరిదీ కొందరు ఎందుకు పొందాలి? అంతకు మించిన దారుణం ఏముంటుంది?***
***అందరికీ పుష్కలంగా అందినట్లయితే అంతరంగం సంతృప్తిగా ఉంటుంది గదా!***
***అందరికీ కొందరిదైతే, అది ఘోషిస్తుంది***
***అంతరాత్మ ఘోషిస్తే శాపమేనని తెలుసుకోంది***
***అందలం ఎక్కాలని ఆరాటపడవద్దు***
***అందరికోసం మీరున్నారని భావించండి***
***అంతకు మించిన సాధనేముంటుంది?***
***అందరూ మీకు ప్రతిరూపాలని తెలుసుకోండి***
***అందరిలో మీరున్నారని భావించుకోండి***
***అదే ఆనందానికి పునాది అని తెలుసుకోండి***
***అంతకు మించిన ఆనందం లేదని గ్రహించుకోండి***
***ఆంజనేయుని మాటలే ఆనందగుళికలు***
***పవనసుతుని పలుకులే పటికబెల్లము***
***మారుతి మాటలే మార్గము***
***ఆనందకరమైన పటికబెల్లాన్ని తింటూ,***
***మార్గములో నడుస్తూ గమ్యం చేరండి***

***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

***పరేణ హి హతన్ బ్రహ్మద్ వరాహ మహిషానహమ్ ।***
***న స్వయం హన్మి విప్రర్షే విక్షీణామి సదా త్వహమ్ ॥***

*మీరు స్వయంగా ఏ జీవినీ చంపనక్కరలేదు.*
*ఇతరులు చంపిన పందులు దున్నలు వీటి మాంసాన్ని అమ్మినా, తిన్నా చాలు*
*ఆ పాపం మీరూ పాలుపంచుకుంటారు*

ॐ

**19-09-2020** 09:30 AM

**109) జీవితంలో మేము వేటికి ప్రాధాన్యతను ఇవ్వాలి, వేటికి ఇవ్వకూడదు స్వామీ?**

*అనంతమైన ప్రవాహాన్ని అరచేతితో ఆపగలరా? మండుతున్న సూర్యుడ్ని గొడుగుతో అడ్డుకోగలరా? ఆలోచించండి! కుంచించుకున్న వ్యక్తి, తాను బలహీనపడి సమాజాన్ని సైతం బలహీనపరుస్తాడు. అంతరంగంలో బలహీనతలు వుంటే, వానినే అంతటికీ విస్తరింపచేస్తాడు. తాను నిర్మించుకున్న స్వంత ప్రపంచమే తనకు అపారమైన సంపద అని మురిసిపోతున్నాడు. దాని నుండి బయటపడలేక, దానిలోకి ఇతరులను అనుమతించక, ఒంటరి జీవితాన్ని అనుభవిస్తూ శక్తిని కోల్పోతున్నాడు. ఇతరులకు సహాయం చేయక, ఇతరుల సహాయం కోసం పరితపిస్తూ, స్వార్థంగా తయారువుతున్నాడు. అనుకరించటానికి, అనుసరించటానికి మధ్య స్పష్టమైన వ్యత్యాసముంటుంది. అనుకరించడం అతి ప్రమాదకరం. అనుసరించడమే సమంజసం. అనుసరించే వ్యక్తి ఉన్నతంగా ఎదుగుతాడు. అనుకరించే వ్యక్తి బలహీనపడతాడు. మూలకారణాన్ని విశ్లేషించుకోగలిగితేనే పరిష్కారం అతి సులభమవుతుంది. ప్రభావాన్ని గురించి కలత చెందితే పరిష్కారం లభించే అవకాశమే ఉండదు. విషాన్ని అమృతంగా భ్రమించకూడదు. శారీరక సుఖాన్నే ఆనందంగా భావించకూడదు. భౌతికంగా ఎదగాలనే ఆరాటం ఉండకూడదు. మానసికంగా బలోపేతం కావటం కోసం ప్రయత్నించాలి. పొందిన దానిలో పోగొట్టుకున్నది ఉంటుంది. పోగొట్టుకున్న దానిలో పొందింది వుంటుంది. జీవితం జీరోనే. అందరు సమానమే. ఎవ్వరూ ఎక్కువ కాదు, తక్కువ కాదు. వచ్చిన దానికి పొంగిపోకూడదు, పోయిన దానికి కృంగిపోకూడదు. ప్రతీదీ నిరంతరం భర్తీ అవుతుంది. కాబట్టి, ఆనందాన్ని పొందే మార్గాలను గురించి అన్వేషించాలి. అసృంతృప్తిని పెంచే కార్యక్రమాలను ఆచరించకూడదు. జీవితాన్ని గురించి పైపైన ఆలోచించకూడదు, లోతుగా అధ్యయనం చేయగలగాలి. భౌతికసంపద యొక్క అవసరం లేదనే స్థాయికి, స్థితికి చేరడమే పరిపూర్ణత్వమవుతుంది. ఆనందమే జీవితపరమావధి అనే భావనను ఏర్పర్చుకోగలగాలి. ఆనందంగా జీవించే వ్యక్తికి భౌతిక సంపద యొక్క అవసరముండదు. ఎవరైనా భౌతిక సంపద కోసం ఆరాటపడుతున్నారంటే, వారు ఆనందాన్ని పోగొట్టుకుంటున్నట్లే. ఇతరుల గురించి అతిగా, అనవసరంగా ఆలోచించడమంటే తనను గురించి తాను తెలుసుకోలేకపోవటమే. తనను గురించి తాను తెలుసుకోగలిగితే,*

అందరిని గురించీ, అన్నింటి గురించీ తెలిసిపోతుంది. బాహ్యపరమైన అంశాలను గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి గలవారికి తనను గురించి తెలియదు, ఇతరుల గురించి కూడా తెలియదు. భూమండలమంతటిలో తనను గురించి తాను సంపూర్ణంగ అవగాహన గావించుకున్న వ్యక్తి మాత్రమే ఆనందంగా జీవించగలుగుతాడు. వేరే మరెవ్వరికీ అటువంటి అవకాశం వుండదు. తన విలువను తెలుసుకుంటే, భౌతికప్రపంచం విలువలేనిదిగా కన్పిస్తుంది. విలువలేని భౌతికప్రపంచానికి విలువనిచ్చే వారికి జీవితం విలువ తెలియదు. ధనం కోసం ఆరాటపడే వ్యక్తికి ధర్మాన్ని గురించిన అవగాహన వుండదు. ధర్మం లేనిచోట దివ్యత్వానికి అవకాశమే వుండదు. మనిషి ధర్మం కోసం పరితపించకుండా, ధనం కోసం ఆరాటపడుతూ, నేనేదో సాధించాను అని సంతృప్తి పడడమంత అజ్ఞానం మరొకటి వుండదు. అంతకు మించిన ఆత్మవంచన ఏముంటుంది? ధర్మాచరణే అద్భుతమైన సాధన అవుతుంది. అధర్మంగా జీవిస్తూ, సాధన చేయడం వలన ఒనగూడే ప్రయోజనమేమిటి? ఆనందమనే అమృతాన్ని గ్రోలిన వ్యక్తికి ప్రపంచం విలువ లేనిదిగా కనిపిస్తుంది. జీవితపరమార్ధం తెలుసుకున్న వ్యక్తికి జీవితం మధురాతిమధురమవుతుంది. జీవితాన్ని గురించిన అవగాహన లేకపోతే, అంతకుమించిన నరకమేముంటుంది? ఆలోచించండి! అందుకే జీవితాన్ని గురించి అన్ని కోణాలలో విశ్లేషించుకొని ఆనందమయం కావాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

వయసుతోపాటు జీవితంలో వచ్చే మార్పులను ఒకసారి జ్ఞప్తికి తెస్తాను. మానవ జీవితప్రయాణంలో మార్పులు అనేవి సర్వసాధారణమే. అయితే, వానిని అనుకూలంగా స్వీకరించగలిగితే, జీవితం సాఫీగా కొనసాగుతుంది.

40 ఏళ్ళ వయసులో: ఉన్నత విద్యావంతులు – సాధారణ విద్యావంతులు ఇద్దరూ సమానమే. సంపాదనలో ఎదుగుదలను మాత్రమే సమాజం గమనిస్తుంది.

50 ఏళ్ళ వయసులో: అందమైన దేహం – అందవిహీనం మధ్య తేడా చాలా స్వల్పం. శరీరం మీద మచ్చలు, ముడతలు దాచిపెట్టలేరు. ఇప్పటి వరకూ అందంతో వచ్చిన గౌరవాన్ని కాపాడుకోవడానికి తంటాలెన్నో పడాల్సివుంటుంది.

60 ఏళ్ళ వయసులో: ఉన్నతశ్రేణి జీవితం – సాధారణ జీవితం రెండూ ఒకటే. పదవీ విరమణ తర్వాత బంట్రోతు కూడా పలకరించకపోవచ్చు.

70 ఏళ్ళ వయసులో: విశాలమైన భవంతి – సాధారణ నివాసం రెండూ సమానమే. కీళ్ళ నొప్పులతో కదలలేని స్థితి, సేద తీరటానికి ఓ మూలన చిన్న స్థలం చాలు.

80 ఏళ్ళ వయసులో: ధనం వున్నా – లేకపోయినా ఫర్వాలేదు. ఎంత డబ్బున్నా స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఎక్కడా ఏమీ ఖర్చు పెట్టలేరు.

90 ఏళ్ళ వయసులో: నిద్ర – మెలకువ రెండూ ఒక్కటే. సూర్యోదయం, సూర్యాస్తమయం రెండింటినీ లెఖ్ఖించడం తప్ప ఏం చేయాలో కూడా తెలియదు. అందంతో వచ్చే మిడిసిపాటు, ఆస్తులతో వచ్చే అహంకారం, పదవులతో వచ్చే గౌరవాన్ని ఆశించడం కాలగమనంలో కళ్ళముందే కనుమరుగవ్వడం సత్యం.

***సుదీర్ఘ జీవన ప్రయాణంలో అందరూ సమానమే***
***అందుకే***
***ఒత్తిడులకు దూరంగా వుంటూ, అనుబంధాలను పదిలపర్చుకుంటూ***
***జీవనంలోని మాధుర్యాలను ఆస్వాదిస్తూ***
***మారుతి మాటలలోని ఆంతర్యాన్ని గమనించి***
***నిగూఢమైన రహస్యాలను గుర్తించి***
***మీకు నచ్చే అంశాలను***
***మీకు బాగా నచ్చుతుందని, మీకు పంచాలని,***
***ఈ పవనకుమారునికి అన్పించింది***
***ఎందుకంటే,***
***ఇది జీవిత సత్యం***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**20-09-2020** 09:05 AM

**జ్ఞానం - అనుభవం**

*భూమండలమంతటిలో మానవుడు అన్ని విధాలా ఉన్నతమైనవాడే. పరిణామక్రమంలో అన్ని జీవరాశుల కన్నా, మానవుడు ఉన్నతంగా ఉన్నాడని చెప్పవచ్చు. అందుకు మూలకారణమేమిటి? పంచభూతాలలో కేవలం జడచైతన్యం మాత్రమే వుంటుంది. వృక్షాలలో ఆ జడచైతన్యం జీవచైతన్యంగా రూపాంతరం చెందుతుంది. జంతువులలో అది ఇంద్రియచైతన్యం అవుతుంది. అదే మానవులను పరిశీలించండి. వారిలో ఆ ఇంద్రియచైతన్యం మనోచైతన్యంగానూ, అంతేగాక ఉన్నతశ్రేణికి చెందిన మానవులలో అది బుద్ధి చైతన్యంగా కూడా రూపాంతరం చెందుతుంది. మొత్తంమీద, పరిణామక్రమంలో మానవునిది అన్ని విధాలా ఉన్నతమైన స్థానమని చెప్పవచ్చు. దీనికి మూలకారణమేమిటి? మానవజాతిలో మెదడు, వెన్నుబాములు రెండూ కలిసి వుండటమే గాక, రెండు కాళ్ళతో సంచరిస్తూ భూమికి లంబకోణంలో ఉన్నాడు. దీని వలన మెదడు, వెన్నుబాముల మధ్య అనుసంధానమేర్పడి, మెదడునందలి 'మస్తిష్కద్రవం' వెన్నుబామునందలి 'మేరుద్రవం' కలిసినందువలన, వానియందలి నాడీ కణజాలమంతా అత్యంత చైతన్యవంతమైంది. అందువలన ఆలోచన, అవగాహన, స్పందన, చర్య, ప్రతిచర్యలు, అన్వేషణ, పరిశోధన, సృజనాత్మకత, కళాత్మకత వంటి ఎన్నో విశిష్టమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. వానితోపాటు అంతరంగమందు ఉత్పన్నమయ్యే ఆలోచనలకు అనుగుణంగా భాష కూడా వెలుగులోనికి వచ్చింది. తనయందు ఏమి జరుగుతుందో, పరిసరాలలో ఏమి జరుగుతుందో తెలుసుకోగలుగుతున్నాడు. అయితే, ఇదంతా దేనిద్వారా జరుగుతోంది? అదే ప్రాణశక్తి. మీ శరీరం నుండి ప్రాణశక్తి ప్రవాహం ఒక*

వస్తువుపైకి ప్రసరించినప్పుడు, దాని రూపం మనిషి అంతరంగంలోకి చేరుతుంది. దానిని సమాచారం అంటారు. మానవునితో పోలిస్తే, మిగిలిన జాతులలో సూక్ష్మత్వం తక్కువగా ఉన్నందువలన, అవి దూరంగా ఉన్న వస్తువులను గుర్తించలేవు. వాని రూపాలను అంతరంగంలోనికి స్వీకరించలేవు. మానవులకు మాత్రమే ఇటువంటి అవకాశం, అర్హత వుంటుంది. ఆ విధంగా పరిసరాలు, ప్రకృతి, విశ్వమందలి సమాచారం నిరంతరం లోపలికి ప్రవేశించి, మానవుని సూక్ష్మశరీరాన్ని తాకి, దానిలో నిల్వ ఉంచబడుతుంది. అటువంటి సమాచారాన్ని 'జ్ఞానం' అనుకుంటే, అది అంతరంగంలోకి ప్రవేశించి భద్రపర్చబడితే, దానిని 'విజ్ఞానం' అంటారు. బాహ్యప్రపంచం నుండి అంతరంగంలోనికి చేరిన సమాచారం సూక్ష్మశరీరాన్ని ప్రభావితం చేసినట్లయితే, అది 'అనుభవం' అవుతుంది. వేదాంతపరంగా దానినే 'సంస్కారం' అంటారు. ఈ విధంగా మానవులలో అనుభవాలన్నీ సంస్కారాలుగా రూపాంతరం చెందినట్లయితే, సూక్ష్మశరీరం అనవసరపు బాహ్యప్రపంచపు సమాచారంతో నిండిపోతుంది. జీవభావం బలోపేతం అవుతుంది. అహంకారం పెరుగుతుంది. మనిషి విశ్వం నుండి వేరవుతాడు. అందునా, కలుషితమైన సమాచారం ప్రవేశించినట్లయితే, అది లోతైన ముద్రలుగా మారి, సూక్ష్మశరీరం అన్ని విధాలా బలహీనపడుతుంది.

## ఇంద్రియాలే కీలకం

అయితే, ఈ సమాచారాన్ని లోపలకు స్వీకరించటానికి మానవునిలో ఐదు మార్గాలున్నాయి. అవే పంచ జ్ఞానేంద్రియాలైన కండ్లు, చెవులు, నాలుక, ముక్కు మరియు చర్మం. ఇవి మానవునిలో ఉన్నంత చైతన్యవంతంగా మరే జాతిలోనూ లేవు. అందువలన, వీని నుండి నాడీ తంతుల ద్వారా సమాచారం మెదడుకు చేరి, దానికి సంబంధించిన కేంద్రాలలో భద్రపర్చబడుతుంది. మనిషి తనయందున్న ఇటువంటి సమాచారం ద్వారా విశ్వం నుండి వేరుగా భావించడం వలన శక్తి పరిమితమవుతుంది. అందువలన, ఈ సంస్కారాలను కరిగించుకోవడం కోసం తప్పక కర్మలను ఆచరించవలసి వుంటుంది. అందుకు ఉపయోగపడేవే పంచ కర్మేంద్రియాలైన కాళ్ళు, చేతులు, నోరు, మలనాంగం మరియు జననాంగం. మీరు మానవజీవితాన్ని, జీవనవిధానాన్ని జాగ్రత్తగా విశ్లేషించుకున్నట్లయితే, జ్ఞానేంద్రియాల ద్వారా సమాచారం లోపలకు ప్రవేశిస్తుంది. కర్మేంద్రియాల ద్వారా పనులకు సంబంధించిన అనుభవం చేరుతుంది. జ్ఞానేంద్రియాలలో కండ్లు కీలకపాత్ర పోషిస్తాయి. కర్మేంద్రియాలలో సంతానోత్పత్తికి సంబంధించిన జననేంద్రియం ప్రధానమవుతుంది. కర్మలనాచరించడం ద్వారా పాత సంస్కారాలు కరిగిపోతాయి. అయితే, ఆ కర్మలద్వారా అనుభవాలు చేరి, అవి మరలా సంస్కారాలవుతాయి. ఈ విధంగా సంస్కారాల మోతాదును బలోపేతం చేయడంలో జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు మూలకారణమవుతాయి.

## మనసే నాయకుడు

అయితే, వీనినన్నింటినీ అనుసంధానం గావించి జీవనయానం కొనసాగించడంలో మనసు నాయకత్వం వహిస్తుంది. అయితే, మనస్సంటే ఏమిటి? అది ప్రాణశక్తి యొక్క రూపాంతరం, ఆలోచనాశక్తియే! అది కూడా సమాచారమే. గమనించండి. ఇటువంటి సమాచారం జ్ఞానేంద్రియాల ద్వారా కర్మేంద్రియాల ద్వారా నాడులను స్పందింపచేస్తూ, అంతిమంగా మెదడుకు చేరుతుంది. మెదడనేది

నాడీ కణజాలంతో కూడివుంటుంది. అది అత్యంత చైతన్యవంతమైన పదార్థం. మెదడు యొక్క కణజాలం ఆరోగ్యంగా, చైతన్యవంతంగా ఉండి, దానికి పుష్కలంగా పోషకపదార్థం అందినట్లయితే, శరీరమందలి అవయవాలు చురుకుగా పనిచేసి, ఆరోగ్యం సిద్ధించి జీవితం సాఫీగా కొనసాగుతుంది. అలాగాక, చెడు సమాచారం లోపలకు ప్రవేశించి, మెదడునందలి నాడీ కణజాలాన్ని కలుషితం చేసినట్లయితే, శరీర అవయవాలు బలహీనపడి, దీర్ఘకాలిక రుగ్మతలు సంభవించి ఆయువు కుదించుకుని, ఆరోగ్యం క్షీణించడానికి మూలకారణం జ్ఞానం లేక సమాచారం లేక అనుభవాల రూపంలో ఉన్న సంస్కారాలే.

**మీ అందరికీ కారాలంటే ఎంత ఇష్టమో కదా! ఈ కారాలను చూడండి:**

| | | |
|---|---|---|
| మొదలుపెట్టే కారం | : | శ్రీకారం |
| గౌరవించే కారం | : | సంస్కారం |
| ప్రేమలో కారం | : | మమకారం |
| పలకరించే కారం | : | నమస్కారం |
| పదవితో వచ్చే కారం | : | అధికారం |
| అది లేకుండాచేసే కారం | : | అనధికారం |
| వేళాకోళంలో కారం | : | వెటకారం |
| భయంతో చేసే కారం | : | హాహాకారం |
| బహుమతిలో కారం | : | పురస్కారం |
| ఎదిరించే కారం | : | ధిక్కారం |
| వద్దని తిప్పికొట్టే కారం | : | తిరస్కారం |
| లెక్కల్లో కారం | : | గుణకారం |
| గుణింతంలో కారం | : | నుడికారం |
| గర్వంతో వచ్చే కారం | : | అహంకారం |
| సమస్యలకు కారం | : | పరిష్కారం |
| ప్రయోగశాలలో కారం | : | ఆవిష్కారం |
| సంధులలో కారం | : | 'అ' కారం |
| సాయంలో కారం | : | సహకారం |
| స్త్రీలకు నచ్చే కారం | : | అలంకారం |
| మేలు చేసే కారం | : | ఉపకారం |
| కీడు చేసే కారం | : | అపకారం |
| శివునికి నచ్చే కారం | : | ఓంకారం |
| విష్ణువులో కారం | : | శాంతాకారం |
| ఏనుగులు చేసే కారం | : | ఘీంకారం |
| మదంతో చేసే కారం | : | హుంకారం |

పైత్యంతో వచ్చే కారం : వికారం
రూపంలో వచ్చే కారం : ఆకారం
ఇంటిచుట్టూ కట్టే కారం : ప్రాకారం
ఒప్పుకొనే కారం : అంగీకారం
చీదరించుకునే కారం : ఛీత్కారం
పగ తీర్చుకునే కారం : ప్రతీకారం

***ఇన్ని కారాల మధ్య రామాకారం నాకు నచ్చిన ఆకారం***
***ఆ ఆకారంతోనే ఈ ఆకారం ఆంజనేయుడయ్యాడు***
***ఈ ఆకారంతోనే సద్గురువు అయ్యాడు***
***ఆరాధ్యుడయ్యాడు అవనిలో***
***అందుకే ఆకారాన్ని పట్టుకుని***
***ఓంకార శాంతాకారాలతో***
***ఆవిష్కారం గావించుకున్న మూర్తికి నమస్కారంతో***
***పురస్కారం అందుకుని***
***పవనకుమారుని చేరి***
***మీ ప్రాకారాన్ని దాటి నా ప్రాకారాన్ని చేరుటకు***
***శ్రీకారం చుట్టండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

**ఆర్జనేవ వరం యుక్త మార్జవాత్ నవ్య వత్రపమ్ ।**
**అశక్తం మన్య మానాస్తు ధర్ష యన్తి కుబుద్ధయః ॥**

***సరళ స్వభావముగల పురుషుని, సరళ స్వభావము వలననే లజ్జాశీలుడైన వాడిని***
***దుష్టబుద్ధిగలవారు అశక్తునిగా తలచి అవమానించుచున్నారు.***

నేను ఒకసారి నా రామునితో,

"స్వామీ! నేను ఏం చెప్పినా, ఎంతసేపు చెప్పినా విసుక్కోకుండా వినే ఏకైక శ్రోత మీరు. నేను ఏ వంటకం చేసినా ఏనాడూ వంక పెట్టకుండా తినే ఏకైక భోక్త మీరు. నా తప్పుల్ని మన్నించి సర్వదా, సదా నా మేలుకోరే నా ఏకైక శ్రేయోభిలాషి మీరే ప్రభూ! నన్నుగా స్వీకరించింది మీరొక్కరే తండ్రీ! మీకు కృతజ్ఞతలు తెలుపుకోవటానికి మాటలు చాలవు స్వామీ!"

అని చెప్పగా, నా రాముడు ఆనందంగా అంగీకారం తెలిపి, తన అభయాన్ని అందించాడు.
'అ' కార, 'ఉ' కార, 'మ' కారాలతో కూడిన ఓంకార మంత్రం నుండి
అభయాన్ని ఎంత చెప్పినా తక్కువే అవుతుంది.
నా రామయ్య గురించి ఏమని చెప్పనూ! ఎంతని చెప్పనూ!

ఓం

**21-09-2020** 09:40 AM

## సంస్కారాలు లేక ముద్రలు

మానవజీవిత పరమార్థం ఏమిటంటే, అనుభవాలను సంస్కారాలను కరిగించుకోవాలి, పెంచుకొనకూడదు. పెంచుకోవడం ద్వారా, అహంకారం బలోపేతమవుతుంది. కరిగించుకోవడం ద్వారా అహంకారం బలహీనపడుతుంది. అప్పుడు మనిషి దివ్యత్వానికి చేరువవుతాడు. ఇదే ఆధ్యాత్మిక మార్గంలోని కీలకాంశం. ముక్తి లేక మోక్షమంటే సమాచారానికి, సంస్కారాలకు సంబంధించిన బంధాలను తొలగించుకొని, సంపూర్ణ స్వేచ్ఛను పొందటమే. మీరు పంచజ్ఞానేంద్రియాల ద్వారా సేకరించే సమాచారంగానీ, అనుభవాల ద్వారా సమకూరే సంస్కారాల మోతాదుగానీ రెండు రకాలుగా వుంటుంది. ఒకటి-ప్రకృతి సూత్రాలకు, విశ్వ కదలికలకు సంబంధించింది, దివ్యత్వాన్ని కలుగచేసేది. మరొకటి-ప్రకృతిని మార్చే సైన్సు, సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన సమాచారం ద్వారా ఏర్పడే సంస్కారాలు బలహీనంగా వుంటాయి. అవి ఉపరితలంలో కేంద్రీకృతమైఉండి, వెంటనే కరిగిపోతాయి. అందుకు భిన్నంగా ప్రకృతిని మార్చి వస్తు ఉత్పత్తికి సంబంధించినవన్నీ దివ్యత్వానికి విరుద్ధమైనవి. అవి సమత్వాన్ని, సమతుల్యతను కోల్పోయే విధంగా చేసి, మెదడులో లోతుగా రికార్డు అవుతాయి. ఫలితంగా మెదడునందలి సున్నితమైన నాడీ కణజాలం సమూలంగా దెబ్బతింటుంది. దాని నంతటినీ తమో-రజోగుణ సంబంధమైన చెడు సంస్కారాల సమూహం అంటారు. ఉత్తమ సంస్కారాలకు సంబంధించిన సమాచారం మనిషిని దివ్యత్వం వైపుకు మళ్ళిస్తుంది. చెడు సంస్కారాలకు సంబంధించినదైతే, అహంకారాన్ని బలోపేతం చేసి, దివ్యత్వాన్ని అణిచివేస్తుంది.

## సమాచారం ప్రమాదం

ప్రపంచవ్యాప్తంగా మానవులు సేకరించే సమాచారమంతా అతి ప్రమాదకరమైనదే. ముందు మెదడును, ఆ తర్వాత శరీరాన్ని సమూలంగా కలుషితం చేస్తుంది. దానివలన, అతిభయంకరమైన దీర్ఘకాలిక రుగ్మతలు సంభవించి, జీవితాన్ని అతి బలవంతంగా మధ్యలోనే ముగించవలసిన పరిస్థితులు ఉత్పన్నం కావడమే గాక, వారి మేధస్సుల నుండి విడుదలయ్యే వాసనాబీజాలనే ఆలోచనల ద్వారా పరిసరాలన్నీ కలుషితమవుతున్నాయి. అవి ఇతర మానవుల దేహాలలోనికి ప్రవేశించి ముద్రలుగా, సంస్కారాలుగా నిల్వ ఉంచబడతాయి. మానవజీవిత పరమార్థమేమిటంటే, జీవభావాన్ని సమూలంగా కరిగించుకుని, దివ్యత్వానికి చేరువ కావడమే. అందుకు పాతసంస్కారాలు సమూలంగా కరిగిపోవాలి. అదనంగా నూతన సంస్కారాలు చేరకుండా వుండాలి. అది ఎలా సాధ్యమవుతుంది? అందుకే, ఒకే ఒక పాశుపతాస్త్రం – పరిపూర్ణ అద్వైత బ్రహ్మజ్ఞానం. వేరే మరొక ప్రత్యామ్నాయం లేదు. పరిపూర్ణ అద్వైత బ్రహ్మజ్ఞానంలో గతజీవితపు జీవితకర్మలన్నీ సమూలంగా దగ్ధమవుతాయి. కర్మ, భక్తి, జ్ఞానయోగాలు మూడూ కీలకమైనప్పటికీ, జ్ఞానయోగమే అందుకు సమూల శాశ్వత పరిష్కారం. కర్మ, భక్తియోగాలకు సంబంధించిన అవగాహన గావించుకోవాలన్నా, జ్ఞానయోగమే కీలకం అవుతుంది. దానిని గురించిన స్పష్టత ఉంటే, ఆధ్యాత్మిక పురోభివృద్ధి అన్నివిధాలా సులభతరమవుతుంది. దానిని గురించి విశ్లేషించుకుందాం.

## కర్మలు – రకాలు

కర్మ రహస్యాన్ని ఛేదించగలిగితే, ఇక జీవితపరమార్థం నెరవేరినట్లే. వేదాంతపరంగా విశ్లేషించినట్లయితే, మానవులలో కర్మలు మూడు రకాలుగా ఉంటాయి. 1) తల్లిదండ్రుల ద్వారా బిడ్డలకు సంక్రమించిన వానిని 'సంచితకర్మలు' అంటారు. 2) పుట్టుక నుండి మరణం వరకూ మానవులు సేకరించిన, చేసిన కర్మల ద్వారా అదనంగా చేరే వానిని 'ప్రారబ్ధకర్మలు' అంటారు. 3) సంచిత ప్రారబ్ధాలలో పరిణతి చెంది, కర్మలకు ప్రేరేపించేవానిని 'ఆగామికర్మలు' అంటారు. అయితే కర్మలు ఏవైనా, ఎటువంటివైనా ప్రాణశక్తి యొక్క రూపాంతరమే. అవే దివ్యత్వానికి విరుద్ధమైన ఆలోచనల సమూహం. అవి దేహంలోనికి ప్రవేశించడం వలన, అనుభవాలుగా రూపాంతరం చెందడం వలన జీవభావం బలోపేతమవుతుంది. అందువలన, ప్రతివ్యక్తి వానిని తొలగించుకొనలేక, కరగించుకొనే ప్రయత్నం చేస్తాడు. తొలగించుకోవాలంటే కర్మలను ఆచరించాలి. కరగించుకోవాలంటే పూర్ణజ్ఞానం కావాలి. మీరు ఈ రెండు విధానాలను మిళితం చేసి అనుసరించగలిగితే, త్వరగా సంపూర్ణ స్వేచ్ఛను పొందగలుగుతారు. సంస్కారాలను కరగించుకోవాలంటే, అంతరంగం నుండి దానికి సంబంధించిన సమాచారం వెలుపలకు వచ్చి, కర్మల కోసం బలమైన ప్రేరణ కలుగుతుంది. అందువలన వానిని ఆచరించడం కోసం కర్మలు చేస్తారు. అయితే, అటువంటి కర్మల ద్వారా ఎటువంటి ప్రతిఫలాన్నీ ఆశించకూడదు. ప్రతిఫలాన్ని ఆశించడమంటే, అదనంగా కర్మలు పెంచుకోవడమే.

**రాజ్ఞాం నంధదనీత్యాహి సర్వే సిద్ధస్త్యు వక్రమాః ।**
**దణ్ణ ఏవ హి ధర్మాణాం శరణం పరమం స్మృతమ్ ॥**

రాజులకు దండనీతి వలననే సమాజసంబంధమగు సర్వకార్యములూ సిద్ధించుచున్నవి.
దండమే ధర్మములకు గొప్ప శరణ్యమని చెప్పుచున్నాను.

**అణోరణీయాన్మహతో మహీయాన్ ఆత్మాస్య జన్తోర్ని హితో గుహాయమ్ ।**
**తమక్రతుః పశ్యతి వీతంశోకో ధాతు ప్రసాదాన్మహిమాన మాత్మనః ॥**

జీవుని బద్ధస్థితిని గుర్తించి చెబుతున్న మాట.
పరమాత్మ ఎక్కడైతే ఉన్నాడో, ఆ పరమాత్మకు సమీపంగానే ఉంటూ కూడా,
ఈ జీవుడు ఆ పరమాత్మ వైపు చూడటం లేదు.
కారణం, రాగ ద్వేష అహంకార మమకారాల వ్యామోహానికి చిక్కుకుని ఉన్నాడు.
దుర్లభమైన మనుష్య శరీరాన్ని పొంది కూడా,
పశు పక్షి మృగాదుల వలె దివ్యమైన అవకాశాన్ని పోగొట్టుకుంటున్నారు.

**మనిషిని జీవింపచేసేవి నిగ్రహం, ప్రేమ, తృప్తి**
**మరి మనిషిని దహింపచేసేవి అసూయ, అత్యాశ, ప్రేమ**
**అంతేకాదు, జీవితంలో చెరుపు తెచ్చేవి కొన్ని ఉన్నాయి**

***అవి అధికారం, అహంకారం***
***ఆశించకూడనివి జీవితంలో కొన్ని ఉన్నాయి***
***ఎప్పటికీ చేయకూడదు అప్పు, యాచన***
***చేయకూడనివి కూడా కొన్ని ఉన్నాయి***
***అవి వంచన, పరదూషణ***
***జీవితాన్ని నేర్పరితనంతో నడుపుకొనుటకై***
***లక్ష్యం, సహనం, వినయం***
***వీటన్నింటి మధ్య, మీ కోసం మీరు త్రికరణశుద్ధిగా వెతకండి***
***మీ వెతుకులాటలో వెదకని ప్రదేశమే ఉండకూడదు***
***తిరగని ప్రదేశం ఉండకూడదు***
***ప్రపంచంలో ఎక్కడికెళ్ళినా, అనుక్షణం అణువణువునా***
***నీకోసం నీవు వెదుకులాట చేయి***
***ఎందుకంటే,***
***నీతో నీవు గడిపే క్షణాలు మధురక్షణాలు***
***అవి మీ నూరేళ్ళ జీవితానికి తీపి గురుతులు***
***నీవు లేని జీవితం శూన్యం***
***నీ ఒంటరి పోరాటానికి ఈ పవనసుతుడు తోడైతే***
***మీ దివ్యస్మృతులతో, మీ మోడువారిన జీవితాన్ని***
***ఈ మారుతి మధుర పదార్థంగా మలచి, తన దరికి చేర్చుకొంటానన్న మాటే***
***వరాలమూట ఇందుకు నిదర్శనమే***
***మీ సన్నిధిన కూర్చుండి, మీ పెన్నిధి తానే అయ్యి***
***ఆంజనేయుడు ఆశ్రితవత్సలుడు***
***అభయప్రదానం చేస్తున్నాడు సద్గురువై***
***తన ఈ చిన్నారి ముద్దుబిడ్డలకు.***

ॐ

**22-09-2020** 09:20 AM

*అంగీకరించడమే కీలకం*

*అయితే, అంతరంగంలో నుండి బలమైన ప్రేరణలు లావాలాగా ఉద్భృతంగా వస్తున్నప్పటికీ, వానిని వ్యతిరేకించకుండా అనుమతిస్తూ, అంగీకరిస్తూ, బయటకు విడుదల గావించినట్లయితే, క్రమేపీ వాని తీవ్రత తగ్గి సంస్కారం కరిగిపోతుంది. పూర్ణజ్ఞానికి ప్రపంచం, దానికి సంబంధించిన సమాచారం*

అంతరంగమందలి సంస్కారాలు సైతం మాయగా గోచరిస్తాయి. అందువలన వాటికి ఎటువంటి పట్టింపుగానీ, ప్రాధాన్యతను గానీ ఇవ్వడు. పట్టుంపునిస్తే అది బలోపేతమవుతుంది, వదిలివేస్తే కరిగిపోతుంది. అదే కర్మలనాచరించడంలోని కీలక రహస్యం. వ్యతిరేకించడమంటే ఒక రకంగా అదనంగా సృష్టించుకోవడమే – అంగీకరించడమంటే, దాని నుండి సమూలంగా విడుదలై సంపూర్ణస్వేచ్ఛను పొందడమే. సమాచారమనేది ఏదైనా, ఎటువంటిదైనా మనసుకు భారమే కదా! అందువలన, దానిని తొలగించుకోవాలి, తొలగించుకోగలగాలి. అప్పుడే అంతరంగం సమూలంగా శుద్ధి అవుతుంది, జీవభావం తొలగిపోతుంది. అందుకు పూర్ణజ్ఞానాన్ని గురించి సద్గురువు బోధించిన బోధలద్వారా అవగాహన పొందాలి. ద్వంద్వాల పట్ల ప్రతిచర్యను చూపకుండా ఉండగలగాలి. సమాచారమంతా భౌతిక ప్రపంచానికి సంబంధించిన మిథ్యాజ్ఞానమని భావించాలి, భావించగలగాలి. మిథ్యాజ్ఞానాన్ని వాస్తవంగా బావించడమే అజ్ఞానమవుతుంది. కనిపించే స్థూలజగత్తు అంతా నిరంతరం మార్పులకు లోనవుతూ వుంటుంది. కాబట్టి, మార్పులు చెందేది ఏదీ సత్యం కానేకాదు. అందుకే దానిని పట్టుకొనకూడదు. వదిలివేయగలగాలి. వాస్తవానికి సన్యాసం అంటే ఏమిటి? ద్వంద్వాలను వదిలివేయడమే. ద్వంద్వాలను వదిలివేస్తే, మనసు కరిగిపోతుంది. శూన్యస్థితి ఏర్పడుతుంది. కాబట్టి, భౌతికంగా ప్రపంచంలో ఉండాలి – దానిని మానసికంగా వదిలివేయాలి.

## జ్ఞానం + అనుభవం = మాయ

వాస్తవానికి జ్ఞానం నుండి అనుభవాన్ని వేరు చేయలేరు. జ్ఞానమే అనుభవంగా మారుతుంది. ఆ అనుభవం నుండి జ్ఞానం వస్తుంది. కర్మలనాచరించడం ద్వారా అనుభవం పెరుగుతుంది. జ్ఞానాన్ని గురించి సరియైన అవగాహనను ఏర్పరుచుకొని, కర్మలనాచరించడం ద్వారా అంతరంగశుద్ధి జరిగి మనిషి ఆత్మకు చేరువయ్యే అవకాశముంటుంది. అంతేగాక, అటువంటి జ్ఞానాన్ని బోధించడం ద్వారా పరిణతి చెంది, కొంతకాలానికి అది లోతైన మౌనంగా మారే అవకాశం లేకపోలేదు. ఆధ్యాత్మిక మార్గంలో పరిణతి చెందటానికి జ్ఞానంతో కూడిన అనుభవం, అనుభవంతో కూడిన జ్ఞానం రెండూ అవసరమే. అనుభవాన్ని వ్యక్తీకరించలేకపోవడం, అనుభవం లేకపోయినా వ్యక్తీకరించడం రెండు విధానాలూ అశాస్త్రీయమైనవే, మాయకు ప్రతిరూపమే. అనుభవాన్ని వ్యక్తీకరించలేకపోవడం ఒకరకంగా అపరిపక్వతే, అనుభవం లేకుండా వ్యక్తీకరించడం అసత్యమవుతుంది, ఊహ అవుతుంది. అలాగాక, అనుభవం, వ్యక్తీకరించడం రెండూ సమానస్థాయిలో ఉంటే, అది సహజత్వమవుతుంది. ఆధ్యాత్మిక చరిత్రను ఒకసారి నిశితంగా, లోతుగా అధ్యయనం చేయండి. కొందరిలో ఉత్తమ సంస్కారాల మోతాదు అధికంగా వుండి, సిద్ధులను ప్రదర్శించగలిగిన స్థాయిలో వుంటారు. అయితే, దానిని గురించి సశాస్త్రీయంగా వివరించలేరు. మరికొందరు ఇతరుల అనుభవాన్ని సేకరించి, క్రోఢీకరించి అద్భుతంగా వ్యక్తీకరించగలుగుతారు. అనుభవం లేకుండా వ్యక్తీకరించడం ఒక రకంగా ఆత్మవంచనే అవుతుంది. కాబట్టి, రెండింటి మధ్య సమత్వం, సమతుల్యత చాలా అవసరం. అయితే, జీవితానుభవం గానీ, ఆధ్యాత్మిక సాధనలు గానీ, జ్ఞానం గానీ ఇటువంటివన్నీ జీవభావానికి సంబంధించినవే, భౌతిక ప్రపంచానికి సంబంధించిన అంశాలే. అవ్వన్నీ

సంస్కారాలకు మూలాలే. కానీ, ఆధ్యాత్మిక అనుభవం మాత్రమే ఉత్తమ సంస్కారాలకు మూలమవుతుంది. అనుభవమే సమాచారం – సమాచారమే అనుభవమన్న నగ్నసత్యాన్ని విస్మరించకూడదు. అవ్వన్నీ బంధాలకు మూలం, మరియు స్వేచ్ఛకు అవరోధం. ఇటువంటిది ఏ కొంచెం మోతాదులో వున్నా, జీవభావం ఇంకా మిగిలి ఉన్నట్లే. సంస్కారం, అనుభవం, జ్ఞానం వంటివన్నీ ద్వంద్వాలే, జంటలే, సాక్షికాలే, అర్థభాగాలే. వానిని వదిలివేయడమే మోక్షం – పట్టుకోవడమే మోహం. అనుభవం కోసం ఆరాటపడకుండా, జ్ఞానం కోసం పరితపించకుండా జీవించడమే పరాకాష్టస్థితి. ఇదే పవనకుమారుడు బోధిస్తున్న స్థితి – అందుకోండి అడుగు ముందుకు వేసి.

*మీరు చేసే ప్రతి పనినీ అర్ధం చేసుకోండి.*
*మీ తల్లి మోక్షం కోరుతున్నది. మీ తండ్రి మోక్షం కోరుతున్నాడు.*
*వారిని కూడా ఎందుకు బలి ఇవ్వకూడదు?*
*మోక్షాన్ని కోరే వారికి మోక్షమివ్వకుండా,*
*ఈ మూగజీవులకు మోక్షం ఇవ్వడం ఎందుకు?*
*ఏ ప్రాణినీ హింసించకూడదు.*
*ఇంద్రియాలను అరికట్టాలి.*
*అదే నిజమైన సాధన. అదే మోక్షం!*

***చిరునవ్వుల జల్లులు కురిపిస్తూ, ఎంత మురిసిపోయేవారు!***
***ఉదయం, సాయంత్రం వేళ కబుర్లతో కాలక్షేపం చేస్తూ***
***పెళ్ళిళ్ళు, పేరంటాలు... ఒకటేమిటి?***
***ఏ కార్యక్రమమైనా అటెండ్ అవ్వవలసిందే!***
***కాలగర్భంలో వత్సరాలు గడిచిపోయినవి***
***అయినా,***
***అందరికీ ఆత్మబంధువైన ఈ ఆంజనేయుని మరచి***
***ప్రపంచీకరణ నేపథ్యంలో పతనం అంచుకు చేరకండి***
***ఆంజనేయుని అభయహస్తం క్రిందకు చేరండి, సేదతీరండి***
***ఎదురుచూస్తున్న చిరంజీవికి తెలుసు***
***మరలా మీరు ఇక్కడకు వస్తారని***
***ఆశగా ఎదురుచూస్తూనే వున్నాడు***
***మీకు జ్ఞాపకం ఉందా?***
***ఉంటే, వెనుకకు రండి***
***అదే ప్రగతి వైపు అడుగు వేయండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**30-09-2020** 09:30 AM

*మనిషిని సృష్టించిన దేవుడు ఎంత మీకు శక్తినిచ్చాడో తెలుసా? దేవుడు మనిషిని సృష్టించడం గురించి సైన్సు పరంగానే తెలుసుకోండి. మీరు, "ఏమీ ఇవ్వలేదు" అనటానికి వీలులేదు. మానవుని యొక్క మెదడులో 10 కోట్ల కణములున్నాయి. మానవుని కంటిలో 13 కోట్ల చిన్నచిన్న రాడ్ కణములు, 70 లక్షల కోన్ కణములు, 3 లక్షల నరములతో కలుపబడి ఉన్నవి. ఒక కన్ను తయారుచేయుటకు 2 లక్షల టెలివిజన్ ట్రాన్స్‌మిటర్లు, 2 లక్షల టెలివిజన్ రిసీవర్లు కావలెను. హార్మోనియంలో 45 కీలు, పియానోలో 88 కీలు ఉంటే, మానవుని చెవిలో 15,000 కీలు ఉన్నాయి. మానవుని శరీరంలో 1,00,000 మైళ్ళ పొడవైన రక్తనాళములు ఉన్నాయి. ప్రతి క్షణమునకు 20 లక్షల కణములు తయారగుచున్నవి. మానవుని హృదయము నిముషమునకు 72 సార్లు, రోజుకు ఇంచుమించు 1,00,000 సార్లు, సంవత్సరమునకు 4 కోట్ల సార్లు ఎటువంటి విశ్రాంతి లేకుండా కొట్టుకొనుచున్నది. మానవుని జీవితకాలంలో హృదయములోని ఒక చిన్న కండరం 30 కోట్ల సార్లు సంకోచ వ్యాకోచములు చెందును. మానవుని శరీరంలోని రసాయన పదార్ధములన్నీ కొనాలంటే, 2 కోట్ల 70 లక్షల రూపాయలు ఖర్చు అవుతుంది. మనిషి చనిపోయాక అమ్మితే 6 రూపాయల 45 పైసలు వస్తాయి. మనిషి నవ్వటానికి శరీరంలో 17 కండరములు, కోప్పడటానికి 43 కండరములు పనిచేస్తాయి. మనిషి చర్మములో 46 మైళ్ళ పొడవైన నాడులు ఉన్నాయి. మానవుని నాలుకపైన రుచిని తెలపటానికి 3,000 రకాల బుడిపెలు ఉంటాయి. ఆరోగ్యం గల మనిషి ఒక రోజులో 23,000 సార్లు శ్వాస పీల్చుకుంటాడు. మనిషి చేతివ్రేళ్ళ చర్మము మీద ప్రతి చదరపు అంగుళానికి 3,000 స్వేదగ్రంథులు ఉన్నాయి. మనిషి తలపై సగటున 1,00,000 వెంట్రుకలు ఉంటాయి. మానవుని పంటి దవడ 276 కేజీల కంటే ఎక్కువ బరువును ఆపగలదు. మనిషి శరీరంలో 206 ఎముకలు కలవు. మనిషి జీవితకాలంలో 16,000 గ్యాలన్ల నీరు త్రాగుతాడు. 35,000 కేజీల ఆహారం తింటాడు. మనిషి నోటిలో 2 నుండి 3 పాయింట్ల జీర్ణరసం ఏర్పడుతుంది. మనిషి జీవితకాలంలో గుండె 100 ఈత కొలనులను నింపగలిగినంత రక్తాన్ని పంప్ చేస్తుంది. మానవుని శరీరంలో నాలుకయే బలమైన కండరం. మానవుని శరీరంలో 100 ట్రిలియన్ల కణములు ఉంటాయి. మానవుని మెదడులో 80% నీరు వుంటుంది. మానవుని మెదడుకు నొప్పి తెలియదు. మానవుని శరీర బరువులో ఎముకల వంతు 14% వుంటుంది. మానవుని వ్రేళ్ళ కొనలకు ఈ శరీర బరువును మొత్తము ఆపగల శక్తి వుంటుంది. మానవుని ఎముకలు బయటకు గట్టిగానూ, లోపల మెత్తగానూ వుంటాయి. వీటిలో 75% నీరు వుంటుంది. తుమ్ము గంటకు 100 మైళ్ళ వేగముతో ప్రయాణిస్తుంది. చేతివ్రేళ్ళ గోళ్ళు, కాలివ్రేళ్ళ గోళ్ళ కన్నా 4 రెట్లు తొందరగా పెరుగును. స్త్రీ గుండె పురుషుని గుండె వేగం కన్నా ఎక్కువ వేగంగా కొట్టుకుంటుంది. మానవజీవిత పరమార్ధం జీవభావాన్ని కరిగించుకొని, స్వేచ్ఛాభావంతో జీవితాన్ని ముగించడమే కదా! తీసుకున్నది ఎక్కువగా వుండి, ఇచ్చేది తక్కువగా వుంటే, దానిని ఏమంటారు?*

***షడ్రుచుల ఉగాది పచ్చడిలా, పలురుచుల స్వరాలు వినిపిస్తూ***
***పడుచు హృదయాలను, ముసలి హృదయాలను కలచివేయాలి మీ స్వరం***
***పులకించి కులకాలి మీ మధురస్వరముతో***
***ప్రజావాహినిలో మానవత్వం వెల్లివిరిసేలా***
***మీ మధురస్వరముతో పారవశ్యంలో ముంచాలి***
***మీ పలుకులతో బాధను మైమరపించాలి***
***మీ రాకతో మా రామయ్యకు ఇష్టమైన విప్పపూలు విరబూయాలి***
***కారం తిన్న కాకిలా గొంతు చించుకుంటూ, ఎందుకలా గోల చేస్తూ అరుస్తారు?***
***మీ మాటకు ఒక ప్రత్యేకత ఉంది, లయబద్ధత ఉంది, మాధుర్యం ఉంది,***
***అంతకంటే అర్థం ఉంది***
***ప్రజావాహినిని పరవశింపచేస్తూ***
***నూతన వసంతాన్ని తీసుకువస్తుందని తెలుసుకోండి!***
***మీ మాటల తాకిడికి అతలాకుతలమవుతున్న నీ అంతరంగం సతమతమవుతుంటే,***
***నీ మృదుమధుర స్వరం ఎలా వినాలి?***
***దాని కోసమే నీ గాత్రానికి అర్థం, మాధుర్యం పొంచి ఉన్నవని గ్రహించి,***
***పవనసుతుని పలుకులవలే పారవశ్యంతో పరుగులు పెడుతూ***
***పరువును కాపాడుకుంటూ, పారమార్థికంగా ఎదుగుతూ దరిచేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

## <u>ఆరోగ్య సూక్తి</u>

కావాలి అన్నది కామం
సరిపోయింది అన్నది సంతృప్తి

**సర్వదేవ ప్రసన్నాయ తవాస్మీతి చ యాచతే ।**
**అభయం సర్వభూతేభ్యో దదామ్యే తద్వ్రతం మమ ॥**

ఒక్కసారి నన్ను శరణుపొంది, నేను నీవాడనని యాచించువానికి, సకల భూతముల నుండి నేను అభయప్రదానము చేయుచున్నాను. ఇది నా వ్రతము.

**(విభీషణునికి శ్రీరాముడు ఇచ్చిన అభయము)**

*దీని గురించి రేపు చిన్న కథ చెబుతాను.*

ॐ

**01-10-2020** 09:10 AM

**110) భగవంతుడు భక్తుడిని ఏ విధంగా కాపాడుతుంటాడు స్వామీ?**

*ఒకప్పుడు రఘుకుల తిలకుడైన శ్రీరాముడు, విభీషణుని గురించి కలత చెందడం సంభవించింది. తన పరమభక్తుడైన విభీషణుని కొందరు బ్రాహ్మణులు బంధించి ఉంచారన్న వార్త వినగానే, శ్రీరాముడు కలత చెందకుండా ఎలా ఉండగలడు? వెంటనే శ్రీరాముడు విభీషణుని వెతకడానికి తన వేగులను నాలుగు వైపులకూ పంపించాడు. కొంత ప్రయత్నం మీద విభీషణుని బంధించి ఉంచిన చోటు తెలియవచ్చింది. శ్రీరాముడే స్వయంగా అక్కడకు వెళ్ళాడు. అక్కడ ఆయన ఏం చూశాడు? బ్రాహ్మణులు విభీషణుని కాళ్ళూ చేతులూ కట్టేసి పాతాళ చెరసాలలో బంధించి ఉంచారు. భక్తశ్రేష్ఠుడు, సద్గుణ సంపన్నుడూ అయిన విభీషణుడి దుస్థితిని చూసి శ్రీరాముడు దిగ్భ్రాంతి చెందాడు. "విభీషణుడు చేసిన నేరం ఏమిటి?" అని అక్కడున్న బ్రాహ్మణులను అడిగాడు. శ్రీరామచంద్రమూర్తిని చూడగానే ఆ బ్రాహ్మణులు ఆయన పాదపద్మములకు నమస్కరించారు. సాదరంగా ఆహ్వానించి ఉపచరించారు. తదుపరి ఆయనతో ఇలా చెప్పారు. "స్వామీ! ఈ అరణ్య ప్రాంతంలో ఒకరోజు మా ఆశ్రమం సమీపానికి ఒక రాక్షసుడు రథారూఢుడై వచ్చాడు. ఆ సమయంలో మా ఆశ్రమవాసియైన ఒక వృద్ధ బ్రాహ్మణుడు దర్భలు సేకరించే నిమిత్తం అరణ్యంలోకి వెళ్ళాడు. ఆయన మౌనవ్రతం పాటిస్తున్న వ్యక్తి. ఆ రాక్షసుడు ఆ వృద్ధ బ్రాహ్మణుడ్ని దేన్ని గురించో అడిగాడు. మౌనవ్రతంలో ఉన్న ఆ వృద్ధుడు ఎలాంటి జవాబు ఇవ్వలేదు. దాంతో, పట్టరాని కోపంతో ఆ రాక్షసుడు వృద్ధుని కాలితో తన్నాడు. ఆ దెబ్బకు తమాయించుకోలేక వృద్ధుడు క్రిందపడి, క్షణాల్లో మరణించాడు. మాకు విషయం తెలిసి వెంటనే అక్కడకు వెళ్ళి, ఆ రాక్షసుడ్ని పట్టుకున్నాం. కానీ, మేం ఎంతగా కొట్టి తన్నినప్పటికీ, అతడు చావలేదు. మీరు ఇక్కడకు రావటం మా భాగ్యంగా భావిస్తున్నాము. మీరే ఈ హంతకునికి తగిన దండన విధించండి" అంటూ, బ్రాహ్మణులు విబీషణుడ్ని అదే స్థితిలో బందీగా తెచ్చి నిలబెట్టారు. శ్రీరాముని అక్కడ చూడగానే, విభీషణుడికి అవమానంతో తలకొట్టేసినట్లు అనిపించింది. విభీషణుడ్ని అటువంటి దయనీయ స్థితిలో చూడగానే శ్రీరాముడు కలత చెందాడు. తరువాత శ్రీరాముడు ఆ బ్రాహ్మణులను ఉద్దేశించి ఇలా అన్నాడు. నా రాముని గొప్పదనం ఎలాంటిదో చూడండి. "ఏ పనివారైనా సరే, ఒక తప్పు చేసినందుకు అతడి యజమానియే బాధ్యత వహించాలి. కనుక, మీరు ఈ విభీషణుడ్ని వదిలిపెట్టండి. నేను ఇతడికి కల్పాంతం వరకూ జీవించమని వరం ఇచ్చాను. లంకా రాజ్యాన్ని పాలిస్తూ ఉండమని అనుజ్ఞ ఇచ్చివున్నాను. ఇతడు నావాడు. కాబట్టి, ఇతడు చేసిన నేరం, నేను చేసినట్లే". నేను చెప్పినా వినక, మీరు కూడా ఎన్నో తప్పులు చేస్తున్నారు. కావున దండన విధిస్తే, నా సాయిరాముడు నాకే విధించాలి. ఇది నా రాముడు నాకు నేర్పించిన పాఠం. అలాగే, రాముడు కూడా "మీరు ఇతడికి ఏ దండన విధించాలని అభిలషిస్తున్నారో, దాన్ని నాకు విధించండి. నేను మనస్ఫూర్తిగా దాన్ని స్వీకరిస్తాను" అని అన్నాడు.*

*విబీషణుడు ఉద్దేశపూర్వకంగా ఆ వృద్ధుడ్ని చంపలేదు. ఆయన వృద్ధుడు, మౌనవ్రతంలో ఉన్నవాడు.*

ఈ విషయం విభీషణుడికి తెలియదు. ఆయనను చంపాలనే తలంపు విభీషణుడికి లేదు. కాబట్టి, తెలియక చేసిన నేరానికి గాను, విభీషణుడు ప్రాయశ్చిత్తం చేయాలని బ్రాహ్మణులు అభిప్రాయపడ్డారు. కానీ, విభీషణుడు ప్రాయశ్చిత్తం ఏదీ చెయ్యలేదు. అందుకు మారుగా శ్రీరాముడు తన భక్తుని కోసం తానే ప్రాయశ్చిత్తం చేసుకున్నాడు. ఇలా విభీషణునికి ఇచ్చిన అభయానికి, తన బలహీనతలకు సైతం ఆయన కాపుగా, దాపుగా ఉంటాడని గ్రహించాడు. శరణాగతిని పాలించుతూ చివరి శ్వాస వరకూ బలహీనతలను గుర్తించి, అదే సమయంలో బలాన్ని గుర్తించి, భక్తునికి ఇచ్చిన అభయానికి ప్రమాణానికి ప్రతీకగా వారిద్దరూ అందమైన భక్తి సామ్రాజ్యంలో దాచుకోవలసిన భక్తిపుస్తకాన్ని అందించారు. మీకీరోజు ఒక విషయాన్ని చెప్పదలుచుకున్నాను. నా ఆశీర్వాదం ఫలించిందని నా బోధలే మీలోని చైతన్యంగా గుర్తించి మీకు ఎవరు ఏ ఘనకీర్తి కట్టబెట్టినా, ఏ పద్మభూషణను అమర్చినా, అది మీ కార్యదక్షత అని పొగడినా అది మీ సద్గురుబోధ, ప్రతిభ, చైతన్యం అని మీరు గుర్తించాలి. అది సంస్కారంగా రూపుదిద్దుకొని, ఆంజనేయుని అభిమాన బిడ్డలుగా భువిపై నిలుస్తారు. నీవే నేను, నేనే నీవు. నేను నీలోని అంతర్భాగాన్ని–మీరు నాలోని అంతర్వాహినులు. ఈ తండ్రి చల్లని దీవెనలు ఈ బిడ్డల వెన్నంటి జీవితమంతా నడిపిస్తుంది అనటానికి, సాధిస్తున్న జీవన విజయాలు, సాగిస్తున్న మానవీయ జీవనయాత్రే నిదర్శనంగా, లోకానికి వరంగా ఈ సద్గురుబోధల సారాంశాన్ని అందించి అందుకున్న వాటిని ఆంజనేయుని అతి ప్రేమకు కానుకగా భావించి, అనంతమైన శాంతి సాగరంలో నిలవండి నా చిన్నారి ముద్దుబిడ్డలారా!

*నేను అనే దగ్గరే ఆగిపోతే,*
*అమ్మా నాన్నలు కూడా పరాయివాళ్ళుగా మిగిలిపోతారు.*
*మనం అన్న ఒక్కమాట మనుషులందరినీ కలుపుతుంది.*
*అందులో నువ్వు, నీ కుటుంబం, నేను, మీరందరూ కూడా ఉంటారు!*

**అన్నీ ఉన్నా, ఆనందం శూన్యం**
**ఎందుకంటే, మాయ మీ సొంతం గనుక**
**అపోహలన్నీ ముసురుకుంటే,**
**అడ్డంకులు అడుగడుగునా నిలచినట్లయితే,**
**నమ్మకం కనబడకపోగా, విశ్వాసం అడుగంటిపోతుంది**
**ఆత్మస్థైర్యం సంపాదించుకోండి**
**మానవత్వాన్ని ఆపాదించుకోండి**
**నీదు తత్వాన్ని నిలచి గెలవాలి**
**బుద్ధిగా పదిమందీ మెచ్చేలా ఆధ్యాత్మికమైన చదువు చదివి పైకెదగండి**
**మీరు కోరుకున్న జీవితానికి స్వాగతం**
**పలకండి పలుసార్లు రామ రామ రామ రామ రామ అని**
**సమయమెంతో అమూల్యం**

***బుర్రలన్నీ బరువు బండలు***
***వృథా చేస్తే తప్పదు మూల్యము***
***మూల్యాన్ని చెల్లించాలంటే మూలనిథిని కదిలించి***
***మారుతి చేతిలో చిక్కండి చిన్మయులై***
***ఆది అంతం దైవసొంతం***
***తెలియకుంటే లేదు అర్థం***
***పోరాడి గెలిస్తేనే విజయం***
***ఇదియే జీవితసత్యం అని తెలుసుకోండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

***సులభాః పురుషా రాజః సతతం ప్రియవాదినః ।***
***అప్రియస్య చ పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః ॥***

*ప్రియమగు పలుకులు పలుకువారలు కొల్లలుగా దొరుకుదురు.*
*కానీ, అప్రియమైననూ, మన హితమును గోరి పథ్యమగు మాటలు చెప్పువారు చెప్పిననూ,*
*వినువారలు లభించుట లోకమున అరుదు అని విభీషణుడు నాతో పలికిన పలుకులు.*

ఓం

**02-10-2020** 09:05 AM

## 111) గురువును ఎలా గుర్తించగలము స్వామీ?

*ఒకసారి జువేద్ అనే సూఫీ దైవాన్వేషి ఒక ముసలి ఫకీరు దగ్గరకు వెళ్ళి అతనితో, "నీకు అన్నీ తెలుసునని విన్నాను. నాకు మంచి మార్గం చూపించు" అని అడిగాడు. అప్పుడు ఆ ముసలి ఫకీరు, "నాకు తెలుసు అని నీవు కేవలం విన్నావు. కానీ, నాకు తెలుసు అని నీకు తెలియదు గదా! కాబట్టి, నన్ను చూసి అనుభూతి చెందు" అన్నాడు. అప్పుడు ఆ సూఫీ, "నాకు మిమ్ములను చూసి ఏ అనుభూతి కలగడంలేదు. మీరు ఒక పని చేయండి. నా గురువు ఎక్కడ దొరుకుతాడో, మార్గం చూపించండి" అన్నాడు. అప్పుడు ఆ ఫకీరు, "నీవు ముందు మక్కాకు వెళ్ళు. తీర్థయాత్రలు చేయి. ఒక మనిషి కోసం వెతుకు. ఆయన ఒక చెట్టు క్రింద కూర్చుని వుంటాడు. ఆయన కళ్ళు వెలుగులు విరజిమ్ముతూ ఉంటాయి. ఆయన చుట్టూ సుగంధం వ్యాపించి ఉంటుంది. అలాంటి మనిషి కోసం వెతుకు" అన్నాడు. జువేద్ ప్రయాణించాడు 20 సంవత్సరాలు. ఎక్కడైతే గురువు ఉన్నాడని విన్నాడో అక్కడికంతా వెళ్ళాడు. కానీ అక్కడ చెట్టు లేదు, సువాసన లేదు, కళ్ళల్లో కాంతి లేదు. ఆ ముసలి ఫకీరు చెప్పిన లక్షణాలు కల్గిన వ్యక్తి ఎవ్వరూ అక్కడ లేరు. అలాంటి వ్యక్తిని కనుక్కోలేకపోయాడు. జువేద్ దగ్గర ముందుగా గురువుకు సంబంధించిన ఊహాచిత్రం వుంది. అందుకే అతడు వెంటనే అతడు గురువు అవునా కాదా అని నిర్ణయించగలడు. ఇతడు నా గురువు కాదు అని తెలిసిన వెంటనే అక్కడి నుండి ముందుకు ప్రయాణించాడు.*

అలా 20 సం॥ ల తర్వాత అతడు ఒక చెట్టు క్రిందికి వచ్చాడు. గురువు అక్కడ ఉన్నాడు. గాలిలో సుగంధం అలా వ్యాపించి వుంది. మంచులా ఆయన చుట్టూ సుగంధం వ్యాపించి వుంది. కళ్ళు కాంతులీనుతున్నాయి. ఎర్రటి కాంతి అలా ఆయన కళ్ళల్లో నుండి ప్రవహిస్తోంది. వెంటనే జువేద్, "ఇతడే నా గురువు" అనుకొని, ఆయన కాళ్ళమీద పడి, 20 సంవత్సరాలుగా మీ కోసం వెతుకుతున్నాను గురువుగారూ!" అని అన్నాడు. అప్పుడు ఆ గురువు, "నేను కూడా నీ కోసం 20 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నాను. నన్ను మళ్ళీ చూడు" అన్నాడు. జువేద్ మళ్ళీ ఆయన్ను చూశాడు. ఆయన ఎవరో కాదు, 20 సంవత్సరాల క్రితం జువేద్‌ను గురువును వెతికేందుకు మార్గం చూపించిన ముసలి ఫకీర్ జువేద్. అప్పుడు అతడు ఏడవడం మొదలుపెట్టాడు. అతడు, "ఏంటిది? మీరు నా జీవితంతో ఆటలాడారు. 20 సంవత్సరాలు వ్యర్థం అయిపోయాయి. మీరు అప్పుడే ఎందుకు చెప్పలేదు, మీరే నా గురువు అని?" అన్నాడు. ఆ ఫకీరు "అది ఏమాత్రం సహాయం చేసేది కాదు. దానివల్ల పెద్దగా ప్రయోజనం లేదు. చూసే కళ్ళు నీకు లేనంత కాలం నీకు ఏమి చూపించినా ఎటువంటి ఫలితమూ వుండదు. ఎందుకంటే, చూడగలిగే కళ్ళు నీకు లేకపోతే, ప్రయోజనం ఏముంది? ఈ 20 సంవత్సరాలు నీకు నన్ను చూసేందుకు సహాయం చేశాయి. నేను అదే వ్యక్తిని, కానీ, 20 సంవత్సరాల క్రింతం నీకు నా ద్వారా ఏ అనుభూతి కలగడం లేదు అన్నావు. నేను అప్పటిలాగే ఉన్నాను. కానీ, నీవు ఈరోజు అనుభూతిని చెందగలుగుతున్నావు. నీవు మారావు. 20 సంవత్సరాలు నిన్ను పూర్తిగా మార్చివేశాయి. నీలో పేరుకున్న దుమ్ము, ధూళి మాయమైంది. నీ మనసు స్పష్టం అయింది. సుగంధం అప్పుడూ వుంది. అయితే, నీవు దాన్ని వాసన చూడలేకపోయావు. నీ ముక్కు మూసుకుపోయింది. నీ కళ్ళు పనిచేయలేదు. నీ గుండె నిజంగా కొట్టుకోలేదు. అందుకే అనుబంధం అసాధ్యమైంది" అన్నాడు. కాబట్టి, అన్వేషణ నిన్ను గురువు దగ్గరికి తీసుకువెళ్ళదు, అన్వేషణ నిన్ను సిద్ధం చేస్తుంది. నీవు చూడగలిగేలా సిద్ధం చేస్తుంది. మీ అంతరంగం కలుషితంగా ఉంటే, సువాసనలు, సుగంధాలు, దివ్యకాంతులు ఎలా అనుభవంలోకి వస్తాయి? అందువలన, అన్వేషణ కన్నా, అంతరంగశుద్ధి అత్యంత ఆవశ్యకం. కాలాన్ని వృధా చేసుకునేకంటే, అంతర్ముఖ ప్రయాణంలో ఆత్మస్థితికి చేరడమే అసలు సిసలైన రాచబాట. పదునైన ఆయుధం కంటే క్షణకాలంలో వచ్చే కోపమే అత్యంత ప్రమాదకరం. సమాజంలో మార్పు ఎందుకు రాదంటే, పేదవారికి 'ధైర్యం' లేక, మధ్యతరగతి వారికి 'సమయం' లేక, ధనవంతులకు 'అవసరం' లేక. ఆలోచనల్లో 'నిజాయితీ', వాక్కులో 'ధైర్యం', చేతల్లో 'నిబద్ధత' ఉన్నవారే నాకు అవసరం. లోకంలో అన్నింటికంటే తేలికైన పని సలహాలివ్వడం ఒక్కటే. అడిగితే వేయి చెబుతారు. అన్నింటికంటే కష్టమైనది సహాయం చేయడం. వేయి మందిని అడిగితే ఒక్కరు చేస్తారు. నేడు అనవసరమైన వస్తువు కొంటే, రేపు అవసరమైన వుస్తవు అమ్ముకోవాల్సి వస్తుంది. మీ వెంట నడిచే నీడ కూడా చీకటి పడగానే కన్పించకుండా పోతుంది. అలానే, మీరు నమ్మినవాళ్ళు కూడా వాళ్ళ అవసరం తీరగానే మీకు కన్పించకుండాపోతారు. మానసిక ప్రశాంతత ఉన్నప్పుడే జీవితం అన్ని విధాలా సద్వినియోగపడుతుంది. అందుకు అంతరంగశుద్ధే చక్కని రాచబాట. అంతరంగం పవిత్రంగా ఉంటే, అంతటా అదే ప్రతిబింబిస్తుంది. ఇందుకై జ్ఞానగురువు, సద్గురువు, పూర్ణగురువుల సాంగత్యం లభించాలి. అది చాలా అరుదు. పరిపూర్ణ అద్వైతజ్ఞానంతో

జీవిస్తూ, ధర్మాచరణే జీవితధ్యేయంగా త్రికరణ శుద్ధిగా కర్మలను ఆచరించాలి. సమాజ శ్రేయస్సుకు మీరు ప్రతిక్షణాన్నీ ఉపయోగిస్తూ, లోకకళ్యాణార్థం జీవితాలను త్రికరణ శుద్ధిగా అంకితం చేయాలి.

**దీనోవా రాజ్యహీ నోవా యోమే భర్తా నమే గురుః ।**
**తం నిత్యా మమ రక్తాస్మి యథా సూర్యం సువర్చలా ॥**

*దీనుడు గానీ, లేక రాజ్యహీనుడు గానీ, నా భర్తయే నాకు పూజ్యుడు.*
*సూర్యుని యందు సువర్చలవలె, నేనతని యందు నిత్యానురక్తయై యుందును*
*అని సీతాదేవి చెప్పిన వాక్కు!*

ఒక బాటసారి సముద్రంతో ఇలా అన్నాడు, "నది ఎంత సన్నగా వున్నా, దాని నీళ్ళు మాత్రం తియ్యగా వుంటాయి. నీవు ఎంతో విశాలంగా ఉంటావు గానీ, నీ నీళ్ళు మాత్రం చాలా ఉప్పగా వుంటాయి. దీనికి కారణం ఏమిటి?" అని అడిగాడు. అప్పుడు సముద్రం ఇలా అంది. "నది ఈ చేత్తో నీటిని తీసుకుని ఆ చేత్తో ఇతరులకు దానం చేస్తుంది. అందుకే ఆ నదిలోని నీరు తియ్యగా వుంటుంది. నేను మాత్రం తీసుకుంటానే గానీ, ఎవ్వరికీ ఇవ్వను. కాబట్టి నా నీరు ఉప్పగా వుంటుంది" అంది. అందుకే ఆ చేత్తో తీసుకుని ఈ చేత్తో ఇవ్వాలి. ఇవ్వనివారు జీవితంలో మాధుర్యాన్ని కోల్పోతారు.

***ఐశ్వర్యం కోసం ప్రాకులాడుతున్నారా?***
***ఎటువంటి ఐశ్వర్యం మీకు కావాలి?***
***లాకర్లలో పెట్టుకునే ఐశ్వర్యం కావాలా?***
***అది మీతో ఎప్పుడూ ఉండదు కదా!***
***నోట్లకట్టలు, తరాజులోని తులాల బంగారమా?***
***లేక అందరూ నిన్ను గుర్తించి గౌరవించాలనా?***
***అది ఐశ్వర్యము కాదే!***
***మరి ఎటువంటిది కావాలి?***
***ఇది కాదు, ఇది కాదు ఐశ్వర్యం***
***అవసరంలో ఆపదలో ఆదుకునే స్నేహితుడు ఐశ్వర్యం***
***క్రమశిక్షణగా, బుద్ధిగా నడుచుకునే బిడ్డలు ఐశ్వర్యం***
***ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండే శరీర సౌష్టవం ఐశ్వర్యం***
***సంపదకన్నా సంతృప్తిగా జీవించే మంచి మనసు ఐశ్వర్యం***
***లేతలేత పాలబుగ్గల చిన్నారుల చిరునవ్వు ఐశ్వర్యం***
***ప్రకృతి అందం, పెదవులు పండించే నవ్వు ఐశ్వర్యం***
***నిండుపున్నమి రోజున జాబిల్లి అందించే వెన్నెల ఐశ్వర్యం***
***నా ఇంటికి రాగానే ప్రేమతో ఆహ్వానించేవాడే అసలైన భక్తుడు, అదే గొప్ప ఐశ్వర్యం***
***ఆవకాయ పచ్చడిలా ద్వైతాన్ని అద్వైతాన్ని కలిపి***

***అంతరంగశుద్ధికై ఈ ఆంజనేయుడు అందించు ఆధ్యాత్మికము గొప్ప ఐశ్వర్యం***
***ఈ పవనకుమారుడు మీతో పల్లవిని అందుకుంటూ,***
***పారవశ్యంతో మీ వైపు చూచే చూపు, ఓరచూపు ఐశ్వర్యం***
***అంతే గానీ,***
***కాసులలో ఉన్నది ఐశ్వర్యం కాదు***
***కానే కాదు***
***క్యారెక్టర్‌లో ఉండేదే అసలు సిసలైన ఐశ్వర్యం***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ౘ

**03-10-2020** 06:20 AM

**112) ఇష్టం అన్నది భౌతికంగా మరియు ఆధ్యాత్మికంగా ఎలా వర్తిస్తుంది స్వామీ?**

మనసుకు నచ్చిన పనిని ఇష్టంగా చేస్తారు. ఎంత ఇష్టంగా అంటే త్రికరణశుద్ధిగా చేస్తారు. దానినే కొందరు 'మోజు' అంటారు. దానిని క్రొత్త మురిపెం అని నేను అంటాను. అంతవరకూ బాగానే వుంది. కానీ, మోజుకు తీరడం అంటూ వుంటుంది. కొందరిలో కొన్నాళ్ళు, కొందరిలో కొన్నేళ్ళపాటు మోజు కొనసాగుతుంది. అది తీరగానే, మనిషి అప్పటిదాకా ఇష్టపడి సొంతం చేసుకున్న వస్తువునో, లేదా వ్యాపకాన్నో వదిలించుకునే ప్రయత్నం చేస్తాడు. వస్తువు అయితే ఎవరికీ ఎలాంటి నష్టమూ వుండదు గానీ, మనసున్న మనిషిని వదిలించుకునే ప్రయత్నం జరిగితే బాధితుల క్షోభ వర్ణనాతీతంగా వుంటుంది. పని కుడిచేతితో చేసినంత పద్ధతిగా, సమర్థవంతంగా ఎడమచేత్తో చేయలేరు. పురచేతివాటం ఉన్నవాళ్ళు వాళ్ళ విషయం వేరు. రెండు చేతులతో సమానంగా పనులు నిర్వహించగలిగినవాడిని సవ్యసాచి అంటారు. కష్టసుఖాలను రెండు చేతులతో చక్కబెట్టగలిగితే, ఆ తీరేవేరు. అలాంటిస్థితిని స్థితప్రజ్ఞత అంటారు. సాధారణంగా స్థితప్రజ్ఞతను ఆధ్యాత్మిక కోణంలో దర్శిస్తారు. లౌకిక వ్యవహారాలలోనూ దానికి ప్రాధాన్యత వుంటుంది. ఆధ్యాత్మికం మోజు తీరాక వదిలేసే వ్యాపకం కాదు. ఆ సత్యాన్ని గ్రహించి కార్యదక్షత ప్రదర్శించి మనిషి దైవోన్ముఖుడు కావాలి. సమస్యలు మనిషికే కాదు, జంతువులకు, జలచరాలకు, ఖేచరాలకు కూడా వస్తాయి. సమస్య తీరితే సరి, లేదా అవి దానికి బలైపోతాయి. సాధారణంగా ప్రకృతి నుంచి కాక వాటికి మనుష్యుల నుండే చిక్కులు సంప్రాప్తిస్తాయి. పట్టుబడితే కడదాకా కృషి కొనసాగించగల సత్తా మనిషికి వుంటుంది. మనిషి ప్రకృతిపై, దానిలో అంతర్భాగంగా జీవించే సకలప్రాణులపై ఆధిపత్యం కలిగి వుండటం వల్ల, అతడి ప్రవర్తనతో ప్రకృతి సమతుల్యం దెబ్బతినటం చూస్తారు. ప్రకృతి న్యాయాల వర్తింపు వల్ల మనిషికి ఒకనాడు ప్రీతికరమైన ఓ అంశం, మరొకనాటికి విసుగు జనింపచేసేదవుతుంది. ఆ విసుగు ఐహిక విషయాలకు పరిమితమైతే విషయం వేరుగానీ, ఆధ్యాత్మికానికి విస్తరిస్తే, బ్రతుకు నిస్సారమవుతుంది. భగవద్భక్తి విసుగు జనించవలసిన విషయం

కాకూడదు. సూర్యచంద్రాదులు, నక్షత్రాలు విరామం లేకుండా తమ భ్రమణాన్ని కొనసాగిస్తాయి. అందులో లోక సంక్షేమం వుంది. ఆహారపానీయాలు మానటం ఎలా సాధ్యం కాదో, అలాగే ప్రకృతి వ్యాపకాలూ పునరావృతం కాకమానదు. పదార్థాల విషయంలో రుచి మార్పు చేసి వండుకొని, హితంగా భోంచేస్తారు. దైవం సృజించిన షడ్రచుల పరమార్థం ఇదే. మిశ్రమం చేస్తూ, క్రొత్త రుచులు సృజించి మనిషి ఆనందాన్ని విస్తరించుకుంటాడు. ఆధ్యాత్మిక వ్యాపకంలోనూ మనిషి నేర్పుతో, ఓర్పుతో దైవాభిరుచి పెంచుకోవలసిన అవసరం ఎంతైనా వుంది. పసిబిడ్డకు పరిశీలనా శక్తి ఎక్కువ. కనిపించే ప్రతి వస్తువునూ నిశితంగా చూపుడు వేలితో తాకి పరిశీలిస్తుంది. నోట్లో పెట్టుకునే ప్రయత్నం చేస్తుంది. నిజభక్తుడు కూడా కనిపించే ప్రతి జీవరాశిలోనూ భగవదంశ దర్శించేందుకు ప్రయత్నిస్తూ, ఆ విశేష అనుభవ సాకారానికి తన ప్రయత్నలోపం లేకుండా పరమాత్మ దివ్యనామాన్ని ఎదలో ప్రతిష్ఠించుకొని, చరితార్థుడు కావాలి. ఐహిక విషయాల అనురక్తిని మోజు అని పిలిచినా, ఆధ్యాత్మిక దివ్య వ్యాపకాన్ని ఆ పదానికి, ఆ అర్థానికి పరిమితం చేయలేరు. భగవంతుడిపై మనిషి వ్యక్తం చేసే దివ్యప్రేమను భక్తి అంటారు. లౌకిక విషయాల మోజు తీర్చుకుంటే తీరేది. కానీ, భక్తి అనుసరించే కొద్దీ అధికరించేది. పరమాత్మ దివ్యచరణాల మ్రోల అస్థిత్వం కోసం భక్తుడి మనసు పరితాపం చెందాలి. తీవ్ర తపస్సుగా పరిణతి చెందాలి. విష్ణులీలలు వినేకొద్దీ ఆధ్యాత్మిక దాహం తీరుతూ కామదాహం నశించాలి. లౌకిక అందాలు కాముకులకు మోజును పెంచుతాయి. దైవమే లక్ష్యంగా, పరమార్థంగా దివ్యప్రేమను అనుభవిస్తున్న పరమ భాగవతోత్తముల ప్రేమదాహం ఎన్నటికీ తీరేది కాదు. జీవితం అశాశ్వితం. ఎప్పుడైనా మృత్యువు ముంచుకు రావచ్చు. అస్తిత్వాన్ని కబళించవచ్చు. వయసు మీరినవాడా, ప్రాయంలోనివాడా అన్న తేడా యమపాశానికి ఉండదు. లౌకిక వ్యవహారాలలో మోజును కాక, భగవంతుడిపై మోజును పెంచుకునే భక్తుడు అమరభక్తి భావనామృత ఝరిలో మునిగి, పరమపావనుడైనప్పుడే అతడికి భవసాగరం నుండి విముక్తి.

***భుక్త్వా శతపథం గచ్ఛేత్, శనైస్తేన జాయతే***
***అన్న సంఘాత శైథిల్యం, గ్రీవా జానుకటీ సుఖమ్ ।***
***భుక్తోపవిశత స్తుందం, శయానస్య తు పుష్టతా***
***ఆయుశ్చంక్రమమాణస్య, మృత్యుర్ధావతి ధావతః ॥***

భోజనానంతరం నూరడుగులు నడిచిన అన్నం యుక్తస్థానమును చేరి మెడ, నడుం, మోకాళ్ళు, వీటియందు సుఖం కలుగును. భుజించిన తోడనే కదలక కూర్చున్నచో, పొట్ట పెరుగును. పడుకొన్నవారికి కొవ్వు పెరుగును. మెల్లగా అటునిటు తిరిగిన ఆయుర్వృద్ధి కలుగును. పరిగెత్తినచో ఆయుక్షీణం.

***మనసు మనిషికి ఒక దైవవరం***
***అది మరొకందుకు శాపం కూడానూ!***
***మనస్సు భావనలను సృజిస్తుంది***
***భావనలు బుద్ధులుగా మారి ఆచరణరూపం పొందుతాయి***

***సద్భావాలు సద్బుద్ధిని కల్గించి, సదాచరణలు గావిస్తాయి***
***సదాచరణలు సుఖానిస్తాయి, దురాచరణలు దుఃఖానిస్తాయి.***
***సదాచరణలు కల్గిన మనిషి దైవం, దురాచరణలు కల్గిన మనిషి దయ్యం***
***కానీ,***
***నీ జీవనరణానికి ముగింపు మరణమే కదా!***
***తీరిన ఋణానికి ప్రామిసరీ నోటు చింపివేయడమే కదా!***
***మరణమంటే భయమెందుకు? అనుభవమేగా మీకందరకూ!***
***నీ ఇష్టానికి నీవు పుట్టావా, నీ ఇష్టప్రకారమే చావడానికి?***
***చావుపుట్టుకలు చదరంగపు ఆటలే గదా!***
***మనిషి చనిపోతేనేం, ఆత్మ ఉంటుందిగా అనంతంగా!***
***చొక్కా చిరిగిపోతే మరో చొక్కా మార్చుకోరా?***
***ఎన్నాళ్ళని గడ్డికూడు తింటారు? ఎన్నేళ్ళని మట్టిగూట ఉంటారు?***
***పాడుపంజరం వీడి పవనసుతుని పదాలతో***
***పథాన్ని వీడక, పరమపదం పట్టరాదా?***
***అని అతి ప్రేమతో ఈ అంజనీసుతుడు ఆంజనేయుడు కోరిన దానికి***
***అంజలి ఘటించి, అడుగు ముందుకు వేసి***
***అమరపదాన్ని అందుకుని, అఖండ విజయులై***
***విలువల వలువలు ధరించి, ఉన్నతులుగా నా దరిచేరి సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

*మీలో ప్రతివారూ నాకంటే నూరురెట్లు గొప్పవారు కావాలి*
*మీలో ప్రతిఒక్కరూ ఒక వీరాధివీరుడు కావాలి.*
*విధేయత, సంసిద్ధత, పనిమీద శ్రద్ధాసక్తులు*
*ఈ మూడూ మీలో వుంటే, మిమ్మల్ని ఏ శక్తీ అడ్డుకోలేదు!*

ॐ

**04-10-2020** 09:40 AM

**113) అంతరంగశుద్ధిని సాధించే విషయంలో మేము తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి స్వామీ?**

*ఆధ్యాత్మికతలోని కీలకాంశాన్ని గురించి అవగాహన కలిగినట్లయితే, జీవిత పరమార్థం నెరవేరుతుంది. ఆధ్యాత్మికత అంటే, అంతరంగశుద్ధి. తనను తాను ఉద్ధరించుకోవడం, తనను గురించి*

తాను సంపూర్ణంగా అవగాహన కలిగి వుండటం, దానినే అంతర్ముఖ ప్రయాణం అంటారు. అందుకు పుట్టుక–మరణాల మధ్య జీవితాన్ని మాత్రమే పరిగణనలోనికి తీసుకోకుండా, దానికి ముందు, తర్వాత జీవితంపట్ల కూడా అవగాహన కల్గివుండాలి. తనను తాను ఉద్ధరించుకున్న వ్యక్తి, సమాజాన్ని ఉద్ధరించగలడు. తన ఉనికిని విస్మరించి సమాజాన్ని ఉద్ధరించాలనే భావనలోనే ప్రమాదం దాగివుంది. అటువంటివారు సంస్కారాల మోతాదును ఇంకా బలోపేతం గావించుకొని, సమతుల్యాన్ని కోల్పోయే ప్రమాదముంది. దానినే బాహ్యాముఖ ప్రయాణమంటారు. అదంతా ఆధ్యాత్మిక జీవనానికి పూర్తిగా విరుద్ధమే. ఎవరైతే సమాజాన్ని గురించి అతిగా, అనవసరంగా ఆలోచిస్తూ, దానిని సరిచేసే ప్రయత్నంలో నిమగ్నమవుతారో, వారు అంతరంగాన్ని గురించి ఆలోచించరు. అంతరంగశుద్ధికి బాహ్యాప్రపంచం, అందలి వ్యక్తులు అవరోధమే తప్ప ఎటువంటి ఉపయోగము వుండదు. తనను తాను ఉద్ధరించుకునే ప్రయత్నంలో సమాజాన్ని ఒక నిచ్చెనవలే ఉపయోగించుకోవాలే తప్ప, దానిలో ఇరుక్కుపోకూడదు. అంతరంగమందలి చెడు సంస్కారాల మోతాదు అధికంగా ఉన్నవారు, బాహ్యాపరమైన బంధాలను పెంచుకొని, సమాజాన్ని ఉద్ధరించే ప్రయత్నంలో నిమగ్నమై, అది సరికానందు వలన, తీవ్ర నిరాశా నిస్పృహలకు లోనవుతారు. భౌతిక ప్రపంచం, అందలి సంఘటనలు, వ్యక్తులు వారికి సంబంధించిన ఎటువంటి సమాచారమైనా 'మాయ' అని తెలిసినవారు మాత్రమే అంతర్ముఖంలో జీవించి, తమను తాము ఉద్ధరించుకోగలుగుతారు. సమాచారం ముఖ్యం కాదు – అనుభవం ముఖ్యం. సమాచారం అందించినందువలన ఒనగూడే ప్రయోజనమేమిటి? సమాచార సేకరణ అనేది మార్పుకు అవరోధమనే అంశాన్ని విస్మరించకూడదు. కేవలం బోధలవల్ల ప్రపంచంలో మార్పు సంభవించదు. అనుభవసారాన్ని అందించగలగాలి. ఆచరణ లేని బోధన అతి ప్రమాదకరం. పాండిత్యాన్ని మించిన ప్రమాదం మరొకటి వుండదు. తనను తాను సంపూర్ణంగా అవగాహన గావించుకున్న వ్యక్తి మాత్రమే ఇతరుల గురించి తెలుసుకోగలుగుతాడు. ప్రపంచాన్ని ఉద్ధరించాలనే బలమైన దృక్పథం అవసరమే. కానీ, అది ఎన్నటికీ నెరవేరదు. సాధ్యం కానేకాదు. ఎందుకంటే, అనంతమైన ప్రపంచాన్ని అల్పమైన జీవితంతో సరిచేయడం అసాధ్యమే. అంతరంగంలో అసంతృప్తి ఉన్న ప్రతివ్యక్తి ప్రపంచాన్ని సరిచేయాలని ఆరాటపడతాడు. అంతకు మించిన ప్రమాదం మరొకటి వుండదు. అంతరంగంలో ఏమి వుంటే, దానినే తిరిగి పొందుతారు. అందువలన, అసంతృప్తితో ఉన్నవారికి అది ఇంకా పెరుగుతుందే తప్ప, తగ్గే అవకాశమే వుండదు. ఆనందంగా జీవించే వ్యక్తి మాత్రమే ఆనందాన్ని పంచగలుగుతాడు. దానినే తిరిగి పొందుతాడు. కాబట్టి, ఇతరులను ఉద్ధరించే ప్రయత్నంలో నిమగ్నమై, అంతరంగశుద్ధిని విస్మరించకూడదు. అంతరంగంలో బలహీనతలున్నవారే బాహ్యాప్రపంచంలో పరుగులు తీస్తారు. వారే వైఫల్యం చెంది, ఆ అసంతృప్తిని ఇంకా పెంచుకుంటారు. అంతకు మించిన ఆత్మవంచన మరొకటి ఏముంటుంది? పూర్ణత్వంలో జీవించే వ్యక్తి, ప్రపంచాన్ని ప్రభావితం చేయగలడు గానీ, అసంతృప్తితో జీవించేవాడు ప్రపంచానికి ఎలా న్యాయం చేయగలడు? ఈ ఒక్క అంశంలో స్పష్టత కలిగిన వారికి తప్పక జ్ఞానోదయం కలుగుతుంది. ప్రపంచాన్ని మార్చాలి అని ప్రయత్నించిన ఏ వ్యక్తీ ఇంతవరకూ విజయవంతం కాలేదు, గమనించండి! అదే జరిగితే, ప్రపంచం ఎందుకు ఇంతగా బలహీనపడుతుంది? అసలు అజ్ఞానంలో ఉన్నవారే సమాజాన్ని గురించి

అతిగా, అనవసరంగా ఆరాటపడతారు. దానిని వారు మహోన్నతమైన సేవ అనుకుంటారు. వాస్తవానికి అంతకుమించిన బంధం మరొకటి ఏముంటుంది? బంధాలే బాధలకు మూలం కదా. దానిని కరగించుకోవటమే మోక్షం కదా! దానిని పెంచుకోవడమే మోహం కదా! ప్రస్తుతం అందరూ మోక్షాన్ని పోగొట్టుకుంటూ, మోహబంధాలను బలోపేతం చేసుకుంటున్నారు. తనను తాను సరిచేసుకున్న వ్యక్తికే ప్రపంచం దాసోహమంటుంది. వారి మాటలకే విలువనిస్తుంది. ఎందుకంటే, వారిది అనంతమైన, అపారమైన అనుభవమవుతుంది. అనుభవసారాన్ని పెంచుకున్న, పెంపొందించుకున్న వ్యక్తి ఉనికే సమాజానికి వరమవుతుంది. అటువంటి వ్యక్తి ఎవ్వరికీ ఎటువంటి బోధనలు చేయనవసరం లేదు. జీవితమే సందేశమవుతుంది. అసలు ప్రపంచంలోనికి ప్రవేశించడంలోనే బలహీనత దాగి వుంటుంది. ప్రపంచం తన వైపుకు మళ్ళే విధంగా తన అంతరంగం పవిత్రంగా వుండాలి. ప్రపంచంలోకి పరుగులు తీసే వారంతా బలహీనులే. వారి అవసరార్థం ప్రపంచాన్ని ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తారు. అందుకే వారిని ప్రపంచం స్వీకరించదు, తిరస్కరిస్తుంది. అంతకు మించిన దురదృష్టం ఏముంటుంది!

| | | |
|---|---|---|
| ఉపవాసం | – | జీర్ణకోశాన్ని శుద్ధి చేస్తుంది |
| స్నానం | – | దేహాన్ని శుద్ధి చేస్తుంది |
| ప్రార్థన | – | ఇంద్రియాలను శుద్ధి చేస్తుంది |
| దానం | – | సంపాదనను శుద్ధి చేస్తుంది |
| మౌనం | – | మనస్సును శుద్ధి చేస్తుంది |
| క్షమాపణ | – | సంబంధాలను శుద్ధి చేస్తుంది |

నీ గురించి పదిమందీ గొప్పగా చెప్పుకోవాలనుకుంటే,
ముందు నీవు వందమంది గొప్పవాళ్ళ గురించి తెలుసుకోవాలి!

**నైనాహం రాజ్యమిచ్ఛామి న సుఖం న చ మైథిలీమ్**
**నైవ సర్వాణి మాన్కా మావ్ న స్వర్గం నైవ జీవితమ్ ।**
**త్వామహం సత్యమిచ్ఛామి నావృతం పురుషర్షభ**
**ప్రత్యక్షం తవ సత్యేన సుకృతేవ చ తేశపే ॥**

నాకు రాజ్యముపైన గానీ, రాజ్యసుఖములపైన గానీ ఎట్టి లోభమూ లేదు.
నాకు రాజ్యము కంటెనూ, రాజ్యభోగముల కంటెనూ నా అర్ధాంగియగు మైథిలి కంటెనూ,
స్వర్గాది పుణ్యలోకముల కంటెనూ, నా జీవితము కంటే కూడా
సత్యమును పాలించుటే నాకు మిక్కిలి అభీష్టము.

***ధర్మబద్ధ కర్మలు చేస్తూ, నూరు సంవత్సరములు జీవించవచ్చు***
***నేను, నాదను దుష్కర్మ మీకు వలదు***
***ఇట్టి ఆచరణే మీకు ముఖ్యమగును***
***ఆత్మ తెలియని అజ్ఞానులు అంధకార బంధమందు, అసురులుగా లోకమందు చరింతురు.***

***అందుకే మీరు వెయ్యాలి ముందడుగు***
***ధరణి ధగధగలతో వెలిగేను***
***ఆనందంగా మీరు జీవించాలంటే,***
***ప్రాణధారి కల్పతరువు అయిన ఈ భజరంగభళి అందిస్తున్న ప్రబోధలతో***
***తలరాతను మార్చుకుని, అజేయులై, విజయపతాకమెగురవేసి***
***ఆవహించిన ఆనందాన్ని నిశ్శబ్దంగా స్వీకరించి***
***ఉల్లంబులు ఉల్లాసంగా శ్రద్ధతో అర్పణ చేసి, ఆంజనేయుని హృదిని తాకి,***
***సమున్నతంగా ఎదిగి నన్ను చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**05-10-2020** 09:10 AM

**114) జీవితంలో ఎదురయ్యే కష్టాలకు మేము ఏ విధంగా స్పందించాలి స్వామీ?**

*విక్రమార్కుడు ఒక అద్భుతమైన కార్యం చేసినప్పుడు, బ్రహ్మదేవుడు సంతోషించి ఒక వరం కోరుకోమన్నాడు. అప్పుడు విక్రమార్కుడు "మీరు ఒకసారి నా తలరాతను వ్రాశారు కదా. ఇప్పుడు మరలా వరం ఇస్తానంటున్నారు. మీరు నా తలరాతలో ఉన్నదే ఇస్తారా, లేక తలరాతను తుడిచి క్రొత్తగా రాస్తారా?" అని అడిగాడు. విక్రమార్కుని తెలివికి బ్రహ్మదేవుడు ఆశ్చర్యపడి, "అవునవును. తలరాతలో వున్నదే నీవు అడుగుతావు, క్రొత్తదానిని అడుగవు. ఉన్నది పోదు, లేనిది రాదు" అంటూ మాయమైనాడు బ్రహ్మ. మంచి పనులు చేసేవాడు కష్టాలుపడవచ్చు. చెడ్డపనులు చేసేవాడు భోగాలు అనుభవించవచ్చు. దీనికి మూలకారణం గతజన్మ కర్మఫలం. అయితే, ఆ కర్మలకు ప్రేరణ ఏది? మళ్ళీ దానికి, గతజన్మకు వెళ్ళాలి. అది ఎప్పటికీ ముగింపులేని ప్రయాణంగా మిగిలిపోతుందే గానీ, సమాధానం దొరకదు మీకు. ఒక్కొక్కరు ఒక్కొక్క ప్రవృత్తితో పుడతారు. వారివారి ప్రవృత్తులను అనుసరించి, మోక్షసాధనలో ముందుకు వెళ్తారు. వాళ్ళనూ వీళ్ళనూ పోల్చి చూసుకోకుండా, మీ ప్రవృత్తికి ఏది ప్రియమో, దానిని అనుసరించి ప్రవర్తించి తరించాలి. అయితే, సాధనకు శ్రద్ధ సరిపోవటం లేదు. శరణాగతికి విశ్వాసం కుదరటం లేదు. మానవజీవితంలో ఒడుదుడుకులు, ఆటుపోట్లు సహజం. అటువంటివి ఎదురైనప్పుడు, మానవులు రెండు రకాలుగా స్పందిస్తారు. కొందరు తమకు ఎదురైన ప్రతి అవకాశంలోనూ సమస్యలనే చూస్తారు. మరొకొందరు తమకు ఎదురైన ప్రతి సమస్యలోనూ తమ ప్రజ్ఞాపాటవాలు నిరూపించుకునేందుకు ఒక అవకాశంగా భావిస్తారు. ఈ రెండవ కోవకు చెందినవారి భావనను ఆశావహ దృక్పథం అంటారు. ఆశావహ దృక్పథానికి మార్గదర్శి, ఆలంబనా ఈ హనుమంతుడే. హనుమంతుడున్న చోట నిరాశానిస్పృహలు వుండవు, ఉత్సాహమే వుంటుంది. సంశయముండదు. ఆలోచన స్పష్టంగా వుంటుంది. ఆపదలు చుట్టుముట్టినా, విషాదం వుండదు. అధిగమించే స్థిరమైన ఆలోచన వుంటుంది. ఏ పని తలపెట్టినా,*

అపజయం వుండదు, విజయమే వుంటుంది. బుద్ధి, కీర్తి, బలము, ధైర్యము, నిర్భయత్వం, ఆరోగ్యం, జాడ్యం లేకపోవటం, వాక్కున పటుత్వం మొదలైనవి ప్రసాదిస్తూ, భూత ప్రేత పిశాచాల బారి నుండి కూడా మిమ్ములను రక్షిస్తూ, మానసిక రుగ్మతలను దూరం చేసి, ఆరోగ్యం చేకూరుస్తూ, సదా అనుక్షణం అండగా వుండి, మిమ్ములను మోక్షధామానికి చేరుస్తాను అని అభయమొసగుతున్నాడు ఈ అభయాంజనేయుడు!

**దృష్ట్వా ధనం కులం శీలం రూపం విద్యాం బలం వయః ।**
**కన్యాం ధద్యాదుత్త మంచే మైత్రీం కుర్యాదధాత్మనః ॥**

వరుని సంపద, వంశమర్యాద, గుణము, రూపము, విద్య, బలము, వయస్సు ఇవ్వన్నీ పరిశీలించి,
సమ్మతమైనచో కన్యను నీయవలెను. ఆ తరువాత వారి కుటుంబముతో జీవితపర్యంతమునూ
మైత్రీభావముతో మెలగుచుండవలెను.

***వెన్నెముక లేని వాస్తవ దృశ్యాలను, నేను ఎలా విప్పి చెప్పగలను మీకు?***
***మీ రాజకీయపు రంగుటద్దాలు నాకు మీ లోకాన్ని పచ్చపచ్చగా చూపుతాయి***
***స్వార్ధపు సుర్మా పూసుకున్న కళ్ళకి, చర్మపు రంగులు తప్ప***
***సమానత్వపు ఎర్రటి నెత్తురు ఎలా కన్పిస్తుంది?***
***గడ్డి మేసి బలిసిన గొంతుక నుండి***
***గార్ధభ స్వరం తప్ప గంధర్వగానం వినిపిస్తుందా?***
***పిచ్చిజనం లోకాన్ని ఆనందించినన్నాళ్ళూ***
***స్వార్ధపు బురఖా తొలగిపోనేపోదు***
***ద్వారాల్లేని ఇరుకు మనసులు,***
***ధనాకాంక్షాతప్తులైన మనుషులు***
***సమాజ చిత్రపటానికి పట్టిన చెదలు***
***అటువంటివారు మృగత్వం నుండి మానవులై,***
***మానవత్వం కలిగి దైవత్వం పొంది,***
***దేవతలుగా పూజించబడాలి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఏదైనా మీ చేతిలో ఉన్నప్పుడు, దగ్గరగా వున్నప్పుడు విలువ తెలియదు.
అస్సలు తెలియదు.
దాన్ని గురించి ఉపరితలంలో చూడటం వేరు,
లోతుగా అధ్యయనం చేయటం వేరు.
అధ్యయనం చేసినప్పుడే,
అధ్యయనం విలువ, సద్గురువు విలువ తెలుస్తుంది!

ఓం

**06-10-2020** 09:20 AM

**115) కష్టాలను ఏ విధంగా భావించాలి స్వామీ?**

*ఒక యువకుడు తన గురువు దగ్గరకెళ్ళి ఇలా చెప్పాడు. "స్వామీజీ! నా జీవితమంతా కష్టాలే. ఈ జీవితాన్ని భరించలేకపోతున్నాను. దయచేసి నా కష్టాలు తీరే మార్గం చెప్పండి". అప్పుడు గురువు ఆ యువకుడి వైపు చూశాడు. ఒక గ్లాసు నీటిలో ఒక పిడికెడు ఉప్పు వేయమన్నాడు. యువకుడు అలాగే చేశాడు. "ఇప్పుడు ఆ నీటిని త్రాగు" అన్నాడు గురువు. యువకుడు గ్లాసు పైకి ఎత్తాడు. ఆ నీటిని త్రాగాడు. వెంటనే ఉమ్మేశాడు. అబ్బ, భరించలేని ఉప్పు. ఇంకో పిడికెడు ఉప్పు తీసుకుని, ఆ యువకుడిని చెరువు దగ్గరకు తీసుకువెళ్ళాడు గురువు. "ఈ ఉప్పును ఈ చెరువులో వేసి ఆ నీళ్ళని త్రాగు" అని చెప్పాడు గురువు. ఆ యువకుడు చెరువులో నీటిని గడగడా త్రాగేశాడు. "ఎలా ఉన్నాయి ఈ నీళ్ళు" అడిగాడు గురువు. "నీరు తీయగా ఉంది" చెప్పాడు యువకుడు. "అదే పిడికెడు ఉప్పు అప్పుడెందుకు భరించలేకపోయావు? ఇప్పుడెలా భరించావు?" అడిగాడు గురువు. అప్పుడు ఆ యువకుడు ఇలా చెప్పాడు, "అది తక్కువ నీరు. గ్లాసుడు నీరు. అందుకే ఉప్పగా వుంది. ఇది చెరువు. అంటే ఎక్కువ నీరు. అందుకే ఉప్పదనం లేదు" అన్నాడు యువకుడు. అప్పుడు గురువు ఇలా చెప్పారు, "నాయనా! సమస్యలు పిడికెడు ఉప్పు లాంటివి. అది గ్లాసులోనూ పిడికెడే, చెరువులోనూ పిడికెడే. కానీ, నీ జీవితం గ్లాసులా ఉండాలా, చెరువులా వుండాలా అన్నది మాత్రం నీవే నిర్ణయించుకోవాలి. నీ ఆలోచనాశక్తి, సహనశక్తి పరిధి పెరిగితే, పిడికెడు ఉప్పు తక్కువవుతుంది. ఆ పరిధి సంకుచితమైతే పిడికెడు ఉప్పు, భరించలేనంత అవుతుంది" అన్నాడు గురువు. తన పరిస్థితిని అవగాహన చేసుకొని జీవితాన్ని నందనవనం చేసుకున్నాడు ఆ యువకుడు. ఆ గురువుగారు శిష్యునిపైన ఉన్న ప్రేమతో ఇంకా ఇలా చెప్పాడు. "కొందరు గృహస్థాశ్రమమునందు ఉండువారు, ఇంటిలో జగడాలు పెట్టుకొనియో, లేక మంద వైరాగ్యముతోనో, తీవ్ర వైరాగ్యంతోనో అకస్మాత్తుగా ఆశ్రమములకు, మఠములకు పరిగెత్తుకుని పోవుచుందురు. వారిలో ఎవరికి పుణ్యబలముండునో, అట్టి వారికి మాత్రమే ఆశ్రమములలో, ఏకాంత స్థలములలో ధ్యానినిష్ఠ చేసికొనుటకు అవకాశము ఉండును. తక్కినవారికి అనగా పుణ్యసంపద లేనివారిని మాయాదేవి ముక్కు, చెవులు, మెడపట్టి వెనుకకు లాగివైచి, మరలా సంసారకూపంలోనికే కూలద్రోయును. కావున మొదటనే గృహస్థాశ్రమములో నుండువారు, పాపనివృత్తికై పుణ్యకర్మలనాచరించవలయును. అట్టి పుణ్యాత్ములకే నేను చెప్పబడు ఈ పదకొండు విధములైన లక్షణాలు చేకూరుతాయి.*

**సానందం సదనం సుతాశ్చ సుధియః కాంతాన దుర్భాషిణీ ।**
**సన్మిత్రం సుధనం స్వయోషితరతిః చాజ్ఞాపరా స్సేవకాః ॥**

**ఆతిథ్యం శివపూజనం ప్రతిదినం, మృష్టాన్నపానం గృహే ।**
**సాధోస్సంగముపాసతేహి సతతం, ధన్యోగృహస్థాశ్రమః ॥**

*ఆనందంతో కూడుకున్నట్టి గృహం, బుద్ధిమంతులగు బిడ్డలు, ప్రియమును పలుకునట్టి భార్య,*

సన్మిత్రుడు, న్యాయార్జిత ధనం, స్వభార్యయందు రతియు, తన ఆజ్ఞను అతిక్రమించని సేవకులు, గృహంలో ప్రతిదినం అతిథి సేవనం, భగవంతుని పూజ, శుద్ధమగు ఆహారం, ఎల్లప్పుడూ సాధువులను సేవించుట

ఈ పదునొకండు చేకూరిన గృహస్థాశ్రమము యేదియో, అదియే ధన్యతను గాంచును. అట్టి గృహస్థులనే పవిత్రులని అంటారు. కావున నేను చెప్పిన పదకొండు లక్షణాలలో ఒక్కటైననూ సరిగా ఉన్నదా, నీవే యోచించుకొనుము. అట్లు లేకపోవుటకు కారణం పాపమే. ఈ పదకొండు లక్షణాలు ఏ గృహస్థుని ఇంటియందు వుండునో అతని పుణ్యమును వర్ణించుటకు ఈ ఆంజనేయునికైననూ తరమగునా? కావున ప్రతి గృహస్థుడు బహుపుణ్యము నార్జించుచూ, ఈ 11 లక్షణాలు కలిగియుండేలా ప్రయత్నించుచూ రావలయుననెడిదే ఆశయం.

ఇదే గృహస్థాశ్రమములోనివారికి ముఖ్యధర్మమని తెలియచెప్పుచున్నాను.

***ఓ బహుదూరపు ఆధ్యాత్మికపరుడా!***
***ఏది నీ ప్రయత్నం? ఎక్కడ నీ జీవిత పరమార్థం?***
***మంచిని కోరే ప్రతి చిన్నపని కూడా ఒక మహాయజ్ఞమే***
***ఆ చిరు ప్రయత్నమే నీకు దారి చూపిస్తుంది***
***ఎన్నాళ్ళు నీకు ఇష్టంలేని, నీ నైపుణ్యం కనబరచలేని, నీ సమయస్ఫూర్తిని వినియోగించుకోలేని,***
***నీ సృజనాత్మకతని బయటకు తీయలేని రంగంలో ఉండిపోతారు?***
***నీ చుట్టూ వున్న గిరిని చెరిపి, నీకున్న పరిధిలో, నీకున్న శక్తితో పోరాడి ప్రయత్నించండి***
***నీ పోరాటానికి విజయశంఖం పూరించండి***
***నీ ప్రయత్నపటిమకు అడ్డుకట్టలు తొలగించుకోండి***
***అంతేగానీ,***
***నాకు అవకాశం రాలేదు, నాకు కాలం కలిసి రాలేదు,***
***నాకు అవరోధాలెక్కువ, నాకు పరిస్థితులు అనుకూలించలేదు***
***నాకు అదృష్టం వరించలేదు, నాకు శక్తి సరిపోవటం లేదు***
***నన్ను చూసి అందరూ నవ్వుకుంటారు, నా చుట్టూ వున్న బంధాలను తెంచుకోలేను***
***అని అనుకుంటూ కూర్చుంటే,***
***నీవు చేయవలసిన పనులు మరుగున పడిపోయి,***
***నీ జీవితపరమార్థం వ్యర్థమైపోయి,***
***నీ గురించి వ్రాయవలసిన చరిత్ర కాగితం చెదలుపట్టడం తప్ప ఏమీ జరగదు***
***అంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది***
***ఆకాశం క్రింద వున్నది అంతా నీదే***
***లే! లే! లేచి ప్రయత్నించు!***

***వీలుంటే గెలుస్తావు, లేకపోతే గెలుపును ఎలా గెలవాలో నేర్చుకుంటారు***
***అని ఈ పవనపుత్రుడు పరిపరి విధాల బోధిస్తూ***
***తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నాడు నా ఈ చిన్నారిబిడ్డలను***
***చేయూతనిచ్చి ఈ చిరంజీవి ఆశయాన్ని తీర్చండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

*ధనార్జన కన్నా జ్ఞానార్జనే ప్రధానం*
*దానికై ఏ అరణ్యాలకో పోనక్కరలేదు*
*నిరాకారియైన భగవంతుడు మీ కోసం ప్రేమతో దిగి వస్తే,*
*మీరు అరణ్యాలకు పోయి ఏం సాధిస్తారు?*

ॐ

**07-10-2020** 09:10 AM

### 116) వేదాధ్యయనం వల్ల కలిగే ప్రయోజనం ఎట్టిది స్వామీ?

*మంత్ర ద్రష్టలైన మహనీయులు ఆవిర్భవింపచేసిన సత్యవాక్కు స్వరూపమే వేదం. వేదములు కేవలం ఉచ్ఛరించినంత మాత్రాన ఆనందం కలగదు. దానికి ఆచరణ తోడవ్వాలి. మధుర పదార్థముల పేర్లు ఉచ్ఛరించినా, పేర్లు విన్నా వాటి రుచిని అనుభవించలేరు. భుజిస్తేనే దాని మాధుర్యం తెలుస్తుంది. ఒకవేళ ఉచ్ఛరించలేకపోయినా వేదాధ్యయనం చేసేవారి దగ్గర మనఃపూర్వకంగా శ్రవణం చేసినా చాలు. వేదము వీరే ఉచ్ఛరించాలి – వారు ఉచ్ఛరించకూడదు, వీరే దీనికి అర్హులు – వారే దీనికి అర్హులు అనే భేదము వేదములలో ఏనాడూ లేదు. వేదములలో అక్షరములు తెలియకపోయినా, ఆ శబ్దం శ్రవణం చేస్తే చాలు, అందులోనే ఆనందముంది. చంటిబిడ్డను ఊయలలో వేసి, తల్లి కమ్మని కంఠంతో జోల పాడితే చంటిబిడ్డకు అర్థం తెలియకపోయినా రాగం వలన చక్కగా నిద్రిస్తుంది.*

### 117) గంట కొట్టుటలోని అంతరార్థమేమిటి స్వామీ?

*దేవాలయమునకు వెళ్ళినవారు ఒక్కసారి గంట కొడతారు. భగవంతుడు నిద్రపోతుంటాడని, ఆయనను మేల్కొల్పడానికి పెట్టింది కాదు. నాదమే వేదమని వినిపించుకుంటారు. అట్లే గంట కొట్టడం మీ విజిటింగ్ కార్డు. అప్పుడు భగవంతుడు ఎవర్రా బెల్ కొట్టారు? అని చూస్తాడు. అంటే ఆ శబ్దం ద్వారా భగవంతుని దృష్టిని మీపై మరల్చుకుంటున్నారు. అది కూడా ఇష్టం వచ్చినట్లు శబ్దం చేయకూడదు.* ***అ*** *కార –* ***ఉ*** *కార –* **మ** *కారములతో కూడిన* ***ఓం*** *కార నాదం రావాలి.*

### 118) ఓంకారము ఎలా ఉచ్ఛరించాలి స్వామీ?

***ఓం****కారమనే దానిని ఆ – ఊ – మ్ అని ఉచ్ఛరించరాదు.* ***అ*** *కారము నాభి నుండి,* ***ఉ*** *కారము నాలుక నుండి,* **మ** *కారము పెదవుల నుండి రావాలి. ఈ మూడూ ఏకం కావాలి. మధ్యలో గ్యాప్*

రాకూడదు. అదే అసలైన స్వరబద్ధమైన రాగం.

**119) యజ్ఞము ఎలా చేయాలి స్వామీ?**

యజ్ఞయాగాదులను గురించి చెబుతాను. యజ్ఞంలో నెయ్యి ధారాళంగా వాడాలి. "నెయ్యి ఎంతో ఖరీదైపోతుంటే, ఇంత నెయ్యి అగ్నిలో వేస్తున్నామే, ఎంత వ్యర్థమవుతున్నది!" అనుకుంటారు కొందరు మూర్ఖులు. అట్లే అన్నం లేక ఎంతోమంది అలమటిస్తుంటే, అన్నాన్ని కూడా అగ్నిలో వేస్తున్నారే అంటారు. ఉదాహరణకు రైతు భూమిని బాగా దున్ని, ఎరువు వేసి రెండు మూటల వడ్లు బురదలో చల్లుతాడు. ఈ వడ్లను చల్లితేనే గదా, తిరిగి నాలుగు నెలలకు 40 మూటల వడ్లు వచ్చేది. అట్లే సుగంధ ద్రవ్యములు, నెయ్యి, విలువైన అన్నము అగ్నిలో వేసినప్పుడు అవి వాతావరణంలో ఎంతో పవిత్రమైన కాంతిని విరజిమ్మి తద్వారా ప్రపంచానికి ఉపకారం జరుగుతుంది. అంతేగానీ, ఇంత ఖర్చు అవుతుందే అని పిసినారిభావం రాకూడదు.

సలహా ఇచ్చేటప్పుడు విచక్షణ పాటించాలి
స్వీకరించేటప్పుడు వినమ్రంగా ఉండాలి

**మంధా నా చల ధారణ హేతో దేవాసుర పరిపాల విభో ।**
**కూర్మాకార శరీర నమో భక్తం తే పరిపాలయమామ్ ॥**

సురాసురులు పాలసముద్రమును మంథరగిరితో మథించువేళ, వారి సౌకర్యమునకై కూర్మావతారమెత్తి, మంధరపర్వతమును మూపున దాల్చిన కూర్మావతారుడు విష్ణుమూర్తి!

***గురువు గురుడని గురుతుగా నెరిగిన శిష్యులకు***
***కాంతిదాత అతడు***
***శాంతి క్రాంతి ఆనంద మార్గదర్శిగాను***
***శిష్య శీల నిర్మాణ తోటమాలి***
***బాల్యమాదిగా, జ్ఞానబీజాలు వేసి***
***మనసు మాలిన్య మరకలు తుడిచి***
***జీవిత ధ్యేయానికి మార్గమును చూపు***
***విశ్వకళా క్షేత్రంలో విజ్ఞాన వీధులందు***
***పరము చేరునట్టి వివరంబు తెలిపి***
***విశ్వాత్ముని చేరు విజయపథము చూపు గురువు***
***అందుకే దైవమగును మీకు***
***ఈ పవనపుత్రుని పలుకులు విని పల్లవించాలి మీ మనసు***
***ప్రలోభాలకు లొంగారా, సమూలంగా పతనమవుతారు***
***ప్రపంచమనే మత్తు నుండి బయటపడి మార్గమును - మారుతిని అనుసరించి***
***కన్పించేదంతా భగవన్మయంగా భావించి***

***ఆశించకుండా, శాసించకుండా జీవిస్తూ***
***సమయం కొరకు వేచి చూడండి***
***ఆంజనేయుని రక్షణ కవచంలో బంధించబడ్డ***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**08-10-2020** 09:10 AM

**120) లక్ష్యం ఎట్టిదై ఉండాలి స్వామీ?**

*యాంత్రికంగా తమ పనేదో తాము చేసుకుపోయేవారు యథాతథ స్థితిలోనే మిగిలిపోతుంటారు. అందుకు భిన్నంగా ఎవరైనా తమ జీవితంలో ఒక లక్ష్యం ఎంచుకోగానే, ఒక అద్భుతం జరిగిపోతుంది. లక్ష్యం వ్యక్తిగతం కాకుండా, వ్యవస్థాగతమైనప్పుడు వంశంలోని ఒక వ్యక్తి కారణంగా వంశానికే చేటు వస్తుంటే, ఆ ఒక్క వ్యక్తిని వదులుకోవాలి. తన వంశం వల్ల గ్రామానికే చేటు వస్తుంటే, వంశాన్నే త్యాగం చేయాలి. తన గ్రామం వల్ల ఎన్నో జనపదాలకు నష్టం వాటిల్లుతుంటే, తన గ్రామాన్ని వదులుకోవాలి. తనను బ్రతికిస్తున్న ప్రభువు కోసం భూమినైనా వదులుకోవాలి. దైవదర్శనా లక్ష్యం కోసం వీటన్నింటినీ తృణప్రాయంగా త్యజించినవాడే మోక్షలక్ష్యసిద్ధి పొందుతాడు. విత్తనం భూమిలో విత్తి, నీళ్ళు పోసి, సూర్యరశ్మి కోసం ఎదురుచూడడం మీ పని అయితే, అది మొలకెత్తి, మొక్కై, వృక్షంగా ఎదిగి, ఫలపుష్పాలు ఇవ్వడం దాని పని. అలాగే మీరు ఒక మంచి లక్ష్యాన్ని మనోభూమిపై నాటుకొని, దానికి కావలసిన పోషకాల్ని త్రికరణశుద్ధిగా నెరవేరిస్తే, ఆ తర్వాత ఆ లక్ష్యసిద్ధి కోసం భగవంతుడు ఆశీస్సులందించి అనుగ్రహిస్తాడు. మంచి ఏదో, చెడు ఏదో తెలిసి కూడా, వాటికి ఫలితం అనుభవించక తప్పదని ఎరిగినవారు కూడా చెడ్డపనులు అప్పుడప్పుడు చేస్తుంటారు. అన్నీ మంచిపనులే చేసుకుని సుఖం, సత్ఫలితం పొందుతూ హాయిగా బ్రతకటానికి, మంచి లక్ష్యం ఏర్పర్చుకోవాలి. కేవలం తన కుటుంబాన్నే సంకుచితంగా అనుకుంటారు కొందరు. అదే తప్పు. కేవలం తన కుటుంబ సభ్యుల్ని, తన మిత్రుల్ని, తన హితుల్ని ప్రేమిస్తున్నానని, వారి శ్రేయస్సే ధ్యేయంగా చెప్పుకోవడం సంకుచిత లక్ష్యంగా చెబుతాను. ప్రపంచంలోని అధికులు అలాంటి లక్ష్యానికే అంకితమై వున్నారు. వృద్ధాప్యంలో దుర్బలులై తనవారే తనను నిర్లక్ష్యంగా, అగౌరవంగా, నీచంగా చూస్తున్నప్పుడు, పశ్చాత్తాపంతో కుమిలిపోతారు. లక్ష్యం ఓ అద్భుత ఆలయం వంటిది. కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, మనోబుద్ధి చిత్త అహంకారాలతో విరాజిల్లే ఆత్మసృష్టి, జన్మించినది మొదలు, పుడమిగర్భంలో కలిసిపోయే వరకూ, నిరంతరం చేతనాశక్తి ఇంధనంలా, లక్ష్యాన్ని నడుపుతున్న వైనం అబ్బురపరుస్తుంది. కోరుకున్నది లభించనప్పుడు, క్షణికావేశంతో అమూల్యమైన జీవితాన్ని అంతం చేసుకోకూడదు. నిదానంగా ఆలోచించి, ఉత్తమలక్ష్యాన్ని, ప్రత్యామ్నాయాన్ని వెదుక్కోవాలి. ఉన్న దాంతోనే సంతృప్తి చెందాలి. అప్పుడే జీవితం ఆనందంగా గడిచిపోతుంది. పరిణామశీల సృష్టిక్రమంలో మనిషిది ఉన్నతమైన, ఉత్తమమైన జన్మే కావచ్చు. ఆ ఔన్నత్యాన్ని ఉత్తమ లక్ష్యాత్మకంగా*

సద్వినియోగం చేసుకోలేనప్పుడు, ఆ ఔన్నత్యానికి ప్రయోజనమేముంది? ఎన్నో అల్పజీవులు మనుషుల కన్నా మిన్నగా దేవుణ్ని ప్రేమించాయి. లక్ష్యాలలో క్షణికమైనవి ఏవి? శాశ్వితమైనవి ఏవి? మంచివి ఏవి, చెడ్డవి ఏవి? అనే విషయాన్ని నిరంతరం బుద్ధి మనసుకి వివరిస్తూనే వుంటుంది. బుద్ధి చెప్పేదాన్ని మనస్సు సక్రమంగా స్వీకరిస్తే విజయం వైపు మానవుడు పయనిస్తాడు. ఉత్తమలక్ష్యాల నిర్మాణాలన్నీ ఏకాంతంలోనే జరుగుతాయి. గొప్ప ఆవిష్కరణలు, మహా ఆవిర్భావాలన్నీ ఏకాంతం నుంచే జనిస్తాయి. ప్రతి మహత్తర లక్ష్యమూ ఏకాంతం నుంచి సంభవించినదే. జీవనసత్యాన్ని, ఆత్మ సౌందర్యాన్ని, శివతత్త్వాన్ని దర్శించటానికి, లక్ష్యం ఏర్పర్చుకొనడానికి ఏకాంతమే తగిన సమయం. జీవితంలో నిమ్నోన్నతాలు తెలియాలి. జీవనలక్ష్యం వుండాలి. అందరూ కారణజన్ములు కారు. అందరూ మహాపురుషులు కాలేరు. అయినా, ఉన్నత లక్ష్య భావాలతో తనను తాను ఉద్ధరించుకోవాలి. లక్ష్యమంటే, తనను తాను తెలుసుకుంటూ, తన గురించి తాను ఆలోచించుకుంటూ, దైవంతో ఆత్మానుసంధానం చేసుకోవడానికి ఉపకరిస్తుంది. ఇది కమనీయమైనదే కాదు, కష్టతరమైన అనుభూతి కూడా. మిమ్మల్ని మీరు తరచి, అంతర్వీక్షణకు ఉపకరించే సాధనమవుతుంది. మీ సమాజంలో దుర్మార్గులు కూడా కొన్ని నిగూఢ లక్ష్యాలతో మంచిపనులు చేస్తూ కనిపిస్తారు. వారి పూర్వచరిత్రను లోకం అంత సులభంగా మరచిపోదు. ఒకవేళ పశ్చాత్తాపానికి లోనై అలాంటివారు మంచిపనులు చేస్తూపోతే, కొంత కాలానికి ప్రజలు వారి నిజస్థితిలోని మార్పులను సహర్షంగా స్వీకరించి, వారిని గౌరవించే అవకాశం లేకపోలేదు. లక్ష్యం వ్యసనం కాకూడదు. ఒక విషయం మీద మితిలేని ఆసక్తి, నియంత్రణలేని కోరిక, దానివల్ల మనిషి ఇంద్రియాలకు బానిసగా మారి, అవి నడిపినట్లు కీలుబొమ్మగా నడుస్తాడు. తనకు తానే తెలిసి తెలిసి హాని చేసుకుంటాడు. మానవ సంబంధాలను వాక్పారుష్యం తీవ్రంగా దెబ్బతీస్తుంది. పరుషమైన వాక్కు పదునైన కత్తి కంటే, విషం పూసిన బాణం కంటే ఎక్కువగా గాయపరచగలదు.

***శరీరస్య గుణానాంచ దూరమత్యన్త మన్తరమ్ ।***
***శరీరం క్షణ విధ్వంసి కల్పాన్తస్థాయినో గుణాః ॥***

*శరీరమునకు, గుణములకు చాలా భేదమున్నది.*
*శరీరము క్షణికము. అనగా త్వరలో నశించిపోవునది. గుణములు శాశ్వితంగా వుండునవి.*

***నీ చైతన్యం ఆరని అగ్నిశిఖ వలె ఎవరికీ అంతుచిక్కని***
***సుసంపన్న విలక్షణ వ్యక్తిత్వంతో అభిమాన శిఖరాన్ని అధిరోహించి,***
***ఎందరికో మీరు స్ఫూర్తి ప్రదాతలై***
***మీ ఆశయం, ఆలోచనలు ఎందరికో అనుసరణీయాలై***
***అటువంటి అర్హతను అందించిన ఘనత మీదై***
***మీ తపనకు జనం మంత్రముగ్ధులై***
***మీ మమతకు, మానవతకు శిరస్సు వంచి***
***ఆశయాల సోపానమధిరోహణలో అహర్నిశలూ అప్రమత్తంగా అడుగులేస్తూ***
***ఆంజనేయుని మదిలో మూర్తీభవించిన వ్యక్తిత్వంతో***

***ఎప్పుడైనా ఒంటరి పోరాటంతోనే సరిలేరు మీకెవ్వరూ అంటూ***
***ఇది ఎవరికీ దక్కని భాగ్యంగా గుర్తెరిగి***
***మీ కీర్తి అజరామరం చేసుకుని,***
***మీ చరిత్రను శాశ్వితం చేసుకుని***
***అందుకోండి అందరాని మోక్ష సంపదను***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

*జీవితాన్ని అనుభవించాలనుకోవడమే రోగం.*
*ఆనందంగా కొనసాగించుకోవాలనుకోవడమే యోగం.*

ఓం

**09-10-2020** 09:05 AM

*ఈ రోజు నా రాముడ్ని గురించి, ఆయన పరివారం గురించి, రామరావణ యుద్ధాన్ని గురించి చెప్పాలనుకుంటున్నాను. యుద్ధకాండ అనగానే, వ్యూహాలు, ప్రతివ్యూహాలు, యాంత్రిక విజయాలు, మరణభయాలు మాత్రమే వుంటాయని అనుకుంటారు మీరు. ఆ యుద్ధంలో కూడా అద్భుతమైన ప్రేమ దాగివుంది. అదీ ప్రారంభానికి ముందు ఒకనాటి వెన్నెలవేళ, ఆరుబయట కూర్చున్న రాముని శరీరానికి ఒక చల్లటిగాలి కెరటం అలా తగిలి ఇలా వెళ్ళిపోయింది. అప్పుడు రాముని నోట వచ్చిన శ్లోకం ఆలూమగలుల పవిత్రప్రేమకు, ఆర్ద్రతకు దర్పణం లాంటిది.*

***వాహివాత యతః కాంతాం తాం స్పృష్ట్వా మామపి స్పృశ ।***
***త్వయితే గాత్ర సంస్పర్శః చంద్రే దృష్టి సమాగమః ॥***

*"ఓ సమీర కుమారా! హాయిగా వీచుకుంటూ వెళ్ళు. నువ్వు తప్పకుండా సీతను త్రాకి వచ్చి నన్ను త్రాకుతూ ఉండివుంటావు. నీ వలన మాకు పరస్పర శరీర స్పర్శాసుఖము లభించింది. చంద్రునివల్ల మా చూపులు కలసినట్లయింది. ఎందుకంటే, ఇక్కడి నుండి నేను చూస్తున్న చందమామనే, అశోకవనం నుండి సీత కూడా చూస్తూ వుంటుంది" అని రాముడు సీత మీద ప్రేమతో వాయుసందేశం పంపాడు. ఇదే అనంతర కాలంలో మేఘసందేశాలైనాయి. సరే, ఇలా ప్రేమ కవిత్వాలతో మొదలైనా, యుద్ధకాండ యుద్ధకాండే గదా. రామరావణ యుద్ధం భయంకరంగా సాగుతోంది. రావణుడు వానరసైన్యాన్ని చెల్లాచెదురు చేసేస్తున్నాడు. ఇప్పటి భాషలో చెప్పాలంటే, చితగ్గొట్టేస్తున్నాడు. అంతగా చితగ్గొట్టి రావణుడు సాధించిన ఘనకార్యం ఏమిటో చమత్కారంగా చెబుతాను.*

*రక్షశ్శరాంత కార్యముగ చెవులు తెగిపడిన సంగీతము పాడెనొకడు*
*అసురేశ్వరుని వాలు టుమ్మూరువులను ఛేదించ మద్దెలను వాయించెనొకడు*
*అసుర శరాళి సర్వాంగములను రట్టుసేయగా నాట్యమ్ము సేసెనొకడు*
*అరచేతులను దైత్యవరుడు మండింపగా విలవిల తాళమ్ము వేసెనొకడు*

రామభూపాల రాగ పర్యాప్తగళులు వేలకొలదిగా పాడిరి వెనుక హంగు
రావణుండు శరాంతకారముగ రామభజన చేయించే వానర వ్రజము చేత

అంటే, రావణుని బాణాల దెబ్బకు ఒక వానరుడి చెవి కోసుకుపోతే, అతడు చెవి మీద చెయ్యి పెట్టి రెండో చెయ్యి చాపి రామా అని అరుస్తుంటే, సంగీత కచేరి చేస్తున్నట్లుంది. మరో బాణం మరో వానరుడి తొడలు బద్దలుకొట్టేసరికి, అతగాడు బాధతో తొడలు బాదుకుంటుంటే, ఎడాపెడా మద్దెల వాయిస్తున్నట్లు ఉన్నది. మరికొన్ని బాణాలు వానరుల సర్వాంగాలను ఛేదిస్తూ వుంటే, వాళ్ళు ఏకంగా నాట్యమే చేస్తున్నట్లుంది. మరికొన్ని బాణాలు అరచేతుల మీది తాట వొలిచేస్తుంటే, వాళ్ళు బాధతో కరతలాలు తాటిస్తూవుంటే, తాళం వేస్తున్నట్లున్నది. ఈ రకంగా నాట్యం చేస్తూ, పాట పాడుతూ, తాళం వేస్తూ, మృదంగం వాయిస్తూ, భూపాల రాగంలో రాముడ్ని తమమీద దయ చూపించమని మేల్కొల్పుతున్న వానరులు వెరసి, రామభజనే చేస్తున్నారు తప్ప రావణభజన చేయడం లేదు. ఇది కవులలోకెల్లా గొప్ప కవియైన ఈ ఆంజనేయుని చమత్కారవాణి. రామరావణయుద్ధం ఎలా సాగిందో వర్ణించటానికి అలవిగానిది, అనన్య సామాన్యం.

**అనన్వయాలంకారం గగనం గగనాకారం ।**
**సాగరః సాగరోపమః రామరావణయోర్యుద్ధం రామరావణయోరివ ॥**

ఆకాశం ఎలా వుంటుందంటే, ఏం చెబుతారు? ఆకాశంలాగే వుంటుంది. సాగరం ఎలా వుంటుందంటే, సాగరంలాగే వుంటుంది. అలాగే, రామరావణయుద్ధానికి సాటిలేదు. అది అలాగే సాగింది. అంత భయంకరంగా సాగిన రామరావణుల ద్వంద్వయుద్ధం చూసి శత్రువులే కాదు, మిత్రులూ వణికిపోయారు. అందునా, రాముని బాణాలు ఎలా ప్రయోగించబడుతున్నాయంటే, "శ్రాంతరధ్వ నిరంతరచ్ఛాయదములు" అంటాను. దేవేంద్రుడు పంపిన రథం మీద నిలబడి రాముడు బాణప్రయోగం చేస్తుంటే, ఆ శరపరంపర, ఆ రథానికి కట్టిన గుర్రాలనే నిరంతరం అలసిపోకుండా నీడనిస్తున్నాయి. అంటే పది, ఇరవై, ముప్పై చొప్పున రాముడు బాణాలు వదులుతుంటే, వాటికవే పందిరిలా ఏర్పడి అలసిన అశ్వాలకు ఆశ్వాసన కల్పిస్తున్నాయి. ఆ ధాటి చూచి సుగ్రీవుడు భయపడి, "ఈయనకు మిత్రుడ్ని కాబట్టి సరిపోయింది కానీ, శత్రువునైతే, నా పరిస్థితి ఏమిటి?" అని వణికిపోయాడు. వృద్ధాతివృద్ధుడైన జాంబవంతుడైతే, "చేస్తే ఇలాంటివాడితో మల్లయుద్ధం చేయాలి గానీ కోతులతో, ఎలుగుబంట్లతో యుద్ధం ఏమిటీ" అని అన్నాడు. ఆయనకదే ప్రాప్తమయ్యింది కృష్ణావతారంలో. అంతటి పరమాత్మ ఎదురుగా ఉన్నా, ఒక్క నేను తప్ప మరెవ్వరూ సరియైన భావన చేయలేకపోయారంటే, జీవుల్ని మాయ ఎంతగా క్రమ్మేస్తుందో అర్థం చేసుకోవాలి. అంతటి యుద్ధంలో మధ్యాహ్నం వేళకి రాముడి చేతిలో రావణుడి సారధి మరణించాడు. గుర్రాలు చతికిలబడ్డాయి. రథం బోర్లాపడింది. రావణుడు వెల్లకిలా పడ్డాడు. ఒకే ఒక్క బాణంతో నా ప్రభువు మట్టుపెట్టవచ్చు. కానీ, ధీరుడైన రాముడు భీరువైన రాక్షసుడ్ని క్షమించి ఇలా అన్నాడు.

**గచ్ఛాను జానామి రణార్ధి తస్త్వం ప్రవిశ్య రాత్రిం చరరాజ లంకాం ।**
**ఆశ్వాస్య నిర్వాహి రథీ చ ధన్వీ తథా బలం ద్రక్ష్యపి మే రథస్థః ॥**

*"రాక్షసరాజా! చాలా అలసిపోయినట్లున్నావు. ఇంటికి వెళ్ళు. ప్రశాంతంగా పడుకో. రేపు తెల్లవారాక, క్రొత్త రథం, క్రొత్త ధనస్సుతో రా! అప్పుడు నా బలం చూద్దువుగానీ!" అని చెప్పాడు. ఇది నా రఘురాముని ధీరోదాత్త క్షమాగుణం!*

రావణుడు మర్నాడు వచ్చాడు గానీ మరి ఇంటికి వెళ్ళలేదు. అలా మరణించిన రావణుని శవం వద్ద మండోదరి ఇలా దుఃఖించింది.

**ఇంద్రియాణి పురాజిత్వా త్రిభువనం తథా ।**
**స్మరద్భిరివ తద్వైర్యం ఇంద్రియైరేవ నిర్జతః ॥**

"ప్రాణేశ్వరా! వెనుక భయంకరమైన తపస్సు చేసి ఇంద్రియాలనన్నింటినీ జయించావు. ఇప్పుడు మళ్ళీ ఇంద్రియ వ్యామోహంలో పడి కామవాంఛతో ఇలా మరణించావంటే, బహుశా ఓడిపోయిన ఇంద్రియాలన్నీ నీ మీద పగబట్టి దాడిచేసి ఇలా పగతీర్చుకుని వుంటాయి" అని దుఃఖపడింది. కానీ, భర్తను చంపిన రాముడ్ని ఒక్కమాట కూడా అనలేదు. అది, ఆవిడ సాత్త్వికత, తత్త్వజ్ఞత. మీరు కూడా జాగ్రత్తగా ఉండవలసింది ఇంద్రియాల విషయంలోనే కానీ, శత్రువుల విషయంలో కాదు. మరణించిన రావణుని శరీరానికి దహన సంస్కారాలు జరుపుకోవడానికి అనుమతించమని విభీషణుడు కోరితే, శ్రీరాముడు చెప్పిన మాట, యావత్తు మానవజాతికీ శిరోధార్యం.

**మరణాంతాని వైరాణి నివృత్తం నః ప్రయోజనం ।**
**క్రియతామధ్య సంస్కారః మమాప్యేష యథాతవ ॥**

"విభీషణా! శత్రుత్వం ఎంత తీవ్రమైనదైననూ, అది మరణంతో పరిసమాప్తం కావాలి. సీతను చెర విడిపించడం అనే మా ప్రయోజనం నెరవేరింది. ఇక నీ ఇష్ట ప్రకారం నువ్వు మీ అన్నగారికి దహన సంస్కారాలు జరిపించుకోవచ్చు. ఈ రోజు నుండి నీకే కాదు, రావణుడు నాకూ అన్నగారే" అన్నాడు నా రాముడు. అలాగే, రోజూ నా ముద్దుబిడ్డలు అని సంబోధిస్తున్న నా బిడ్డలకు కొన్ని విషయాలు చెప్పాలని అన్పించి ప్రేమతో ఈ మాటలు మీతో పంచుకున్నాను.

రామాయణాన్ని గురించి ఒక్క మాట చెబుతాను. రామాయణం త్రేతాయుగంలో జరిగిన సంఘటనలకు మాత్రమే పరిమితం కాదు. ప్రతి జీవి ఆత్మావలోకనానికై చేసే సాధనయే రామాయణం. శ్రీరాముడు పరమాత్మ. సీతాదేవి జీవాత్మ, పరమాత్మ సన్నిధిని కోరుతూ వుంటుంది. కానీ, అరిషడ్వర్గాలైన రాక్షసులు దీనికి ఆటంకంగా నిలుస్తారు. సద్గురువు స్థానాన్ని ఆక్రమించిన ఈ హనుమ బ్రహ్మజ్ఞానానికి ప్రతీకయై జీవాత్మను పరమాత్మ సన్నిధికి చేరుస్తూవుంటాడు.

కెరటం మీకు ఆదర్శం కావాలి.
ఎందుకంటే అది లేచి పడుతున్నందుకు కాదు. పడినా లేస్తున్నందుకు!

***రెండు చెవులు ఒక శబ్దాన్ని వింటాయి***
***రెండు కళ్ళు ఒకే దృశ్యాన్ని చూస్తాయి***

***రెండు నాసికలు ఒకే వాసన పీలుస్తాయి***
***కానీ,***
***అదేమి మాయరోగమో, మీకు ఉండే నాలుక మాత్రం***
***రెండు రకాలుగా మాట్లాడుతుంది.***
***హృదయంలో ద్వేషం లేకుండా, మనసులో చికాకు లేకుండా***
***భావోద్వేగాలు ఎలా కలుగుతాయి?***
***కోపం - మీ కాలేయాన్ని బలహీనపరుస్తుంది***
***శోకం - మీ ఊపిరితిత్తులను బలహీనపరుస్తుంది***
***ఒత్తిడి - మీ గుండెను, మెదడును బలహీనపరుస్తుంది***
***భయం - మీ మూత్రపిండాలను బలహీనపరుస్తుంది***
***ప్రేమ - శాంతిని, మధురానుభూతిని తెస్తుంది, మీ శరీరాన్ని మెదడును బలంగా చేస్తుంది***
***నవ్వు - ఒత్తిడిని తగ్గిస్తుంది, చిరునవ్వు ఆనందాన్ని పెంచుతుంది***
***మీ హృదయమందిరంలో మమతల దీపాన్ని వెలిగించండి***
***సంస్కారవంతులై మీ హృదయవిశాలతను చూపండి***
***మనసు కళ్ళు తెరిపించి ఒక్క క్షణం ఆలోచించండి***
***హాయిహాయిగా హనుమ సందేశాలు సందేశాత్మకంగా స్వీకరించండి***
***మారుతి మమతను అర్థం చేసుకోండి***
***పవనకుమారుని పలుకులు పంచదారపలుకులు***
***ఆ పలుకులే మీ నోట తియ్యటి రుచినిచ్చి, జీవితాన్ని, దాని రుచిని అనుభవించి***
***ఆంజనేయుని చేరి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**10-10-2020** 09:15 AM

**121)** మేము ఎటువంటి జ్ఞానాన్ని ఆర్జించాలి స్వామీ? అది ఎలా లభిస్తుంది స్వామీ?

*తోచీ తోచని ఒకామె, తోడుకోడలిని పొడిచిందట. ఏమీ తోచకపోతే, మంచి పుస్తకం చదువుకోవాలి, లేకపోతే ఇంటి పనేదో చేసుకోవాలి. కానీ, తోడికోడలు కదా అని పొడిస్తే ఊరుకుంటుందా? అనగనగా ఒక ఊరు వుంది. మంచి పంటలు పండే ఊరు అది. పంటలు సమృద్ధిగా పండే చోటే జనసాంద్రత ఎక్కువ వుంటారు. ఆ ఊరిలో అన్ని రకాలైన సంక్షేమ పథకాలు, సౌకర్యాలు కొనసాగుతున్నాయి. మంచి మంచి ఆలయాలున్నాయి. నిత్యం ధూపదీప నైవేద్యాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. రాత్రి అయ్యేసరికి ఊరిలో ఏ మూల చూసినా పురాణ కాలక్షేపాలు జరుగుతుంటాయి. ఆ ఊరిలో ఆధ్యాత్మిక*

సంపద మెండుగా వుంది. ఆ ఊరు, మంచికి మారుపేరుగా నిలిచింది. అయితే, ఊరివాళ్ళకు ఒక మంచి ఆలోచన వచ్చి, ఊరికి కొద్దిపాటి దురంలో ఒక ఆశ్రమం కట్టించారు. ఆ ఆశ్రమానికి సర్వశాస్త్రాలు తెలిసిన గురువుగారు వచ్చారు. ఆయన మంత్రశాస్త్రంలోనే కాకుండా, తంత్రశాస్త్రంలోనూ ప్రసిద్ధుడే. గురువుగారికి శిష్యులు కావాలి గదా! వాళ్ళూ ఏర్పడ్డారు. రోజురోజుకూ శిష్యులు పెరిగారు. శిష్యులలో స్థాయిలుంటాయి. కొంతమంది వింటారు. కొంతమంది చదువుకుంటారు. కొంతమంది ఆచరిస్తుంటారు. వీరి గురించి ఇబ్బంది కాదు. కొంతమంది అవేమీ చేయరు. మెట్ట వేదాంతం చెబుతూ కాలక్షేపం చేస్తారు. ఎవరి ఒత్తిడో, బాధో పడలేక ఆధ్యాత్మిక పుస్తకాలకు చందాలు కట్టి, ఇంటికి తెప్పించుకుంటారు కానీ చదవరు. అందులో వున్న విషయాలను చెప్తామంటే వినరు. ఏమంటే తీరిక లేదండీ అంటారు. దీనికి ఏమంత తీరిక అక్కర్లేదు. నాకు తెలిసి, ఆధ్యాత్మికం గంటలకొద్దీ బుర్రకెక్కించనక్కరలేదు. ఎక్కడో ఒకరి దగ్గర ఒక చిన్న రసగుళిక దొరికితే చాలు, అది మొత్తం పనిచేస్తుంది. ఉదాహరణకు నేను "ప్రతి ఒక్కటి నేర్పును ఒకటి" అంటాను. దీని గురించి ఆలోచించడం ప్రారంభమైతే, మీ జీవితకాలం సరిపోకపోవచ్చును. భగవద్గీత అంతా ఒక్కసారే చదవనక్కరలేదు. ఒక శ్లోకానికి భావం తెలుసుకుంటే, మీకున్న శోకాలన్నీ పటాపంచలైపోతాయి. అయితే, ఊరిలో వున్న ఆశ్రమం శిష్యులతో కిటకిటలాడుతోంది. గురువుగారు ప్రేమ, శ్రద్ధలతో శిష్యులకు మంత్ర రహస్యాలు చెబుతూ వస్తున్నారు. నిద్రపోయినవాడ్ని మేల్కొల్పవచ్చును గానీ, నిద్ర నటించేవాడిని మేల్కొల్పలేరు. పూర్తి జ్ఞానం తెలిసినవాడు వింటాడు, ఆలోచిస్తాడు, ఆచరిస్తాడు. పూర్తి జ్ఞానం లేనివాడు దేనినీ పూర్తిగా తెలుసుకోలేడు, వినడు, ఆలోచించడు. పైగా వితండవాదనలు చేస్తాడు. ఈ కోవకు చెందిన శిష్యుడు కూడా ఈ శిష్యకూటమిలో వున్నాడు. గురువుగారు ఈ శిష్యుని గమనించి ప్రత్యేక శ్రద్ధతో అనేక ఆధ్యాత్మిక విషయాలతోపాటు, మంత్ర రహస్యాలను కూడా చెబుతూ వస్తున్నాడు. ఒకరోజున శిష్యుడు తనకు అన్నీ తెలిసిపోయాయి, ఇక తెలియవలసినవి మరేమీ లేవు అని తనలో తాను అనుకున్నాడు. సరే, తనకు తెలిసిన విషయాలు అనుభవంలోకి తెచ్చుకుందామనుకున్నాడు. ఉన్నట్లుండి ఒక రోజున ఆ ఊరికి సమీపంలో వున్న అడవిలోనికి వెళ్ళవలసి వచ్చింది. కొంతదూరం అడవిలో ప్రయాణం చేసిన తర్వాత ఏర్పడ్డ బడలిక చేత ఒక చెట్టు నీడలో కూర్చున్నాడు. తలతిప్పి ప్రక్కకు చూసే సరికి, అక్కడ కొన్ని ఎముకలు చెల్లాచెదురుగా పడి వున్నాయి. ఏదైతే అదే అవుతుందని ధైర్యం చేసి వాటినన్నింటినీ ఒక గుట్టగా ప్రోగుచేశాడు. సరే! గురువుగారు ఇంతవరకూ తనకు నేర్పిన మంత్ర రహస్యాన్ని ఒకదాన్ని ప్రయోగించి, సంకల్పం చేసి మంత్రించసాగాడు. వెంటనే ఆ ఎముకల ప్రోగు నుండి ఒక పెద్దపులి ఉద్భవించి, అరవడం మొదలుపెట్టింది. ఆ పులిని చూసి భయపడి పరుగులెత్తడం ప్రారంభించాడు. పులి కూడా తరుముకుంటూ వస్తోంది. శిష్యుడు భయపడిపోయి, ఆశ్రమం వైపు పరుగుతీశాడు. పులి కూడా వెంటాడుతూనే వుంది. ఎలాగైతేనే, ఆశ్రమం చేరుకున్నాడు. గురువుగారు యోగనిద్రలో నుండి శిష్యుని ప్రమాదం గమనించి, ఆశ్రమ ప్రాంగణానికి వచ్చి నిలబడి చూస్తున్నాడు. "రక్షించండి గురువుగారూ!" అంటూ పెడబొబ్బలు పెడుతూ గురుగుగారి కాళ్ళమీద పడ్డాడు. గురువుగారు తనకు ఏమీ తెలియనట్లుగా "శిష్యా! ఏమైంది నాయనా?" అని అడిగారు. "గురువుగారూ! అటు చూడండి. పులి నన్ను తరుముకుంటూ వస్తోంది" అన్నాడు. "ఏదీ పులి? కన్పించుటలేదే! నీవు దేనిని

చూసి భయపడుతున్నావు?" అన్నారు గురువుగారు. "లేదు గురువుగారూ. నన్ను ఇంత వరకూ అడవి నుండి ఒక పులి తరుముకుంటూ వచ్చింది" అన్నాడు. దానికి గురువుగారు, "పులి లేదు గిలిలేదు. అంతా నీ భ్రమ. దీనినే చిత్తభ్రమ అంటారు. నీవు ఊహించుకున్నది అసంపూర్ణమైన ఆలోచన. నేను నేర్పిన జ్ఞానాన్ని నీవు సద్వినియోగం చేయటం లేదు. ఒకసారి పరీక్ష చేసుకుందాం, దీని ఫలితం ఎలా వుంటుందోనని అసంకల్పంగా ప్రయత్నించి వుంటావు. ముందు నీమీద నీకు, నేను నేర్పిన జ్ఞానం మీద నీకు సంపూర్ణమైన విశ్వాసం కుదరలేదు. కనుక నీవు మరింతకాలం ఆశ్రమంలో వుండి, సంపూర్ణ జ్ఞానగ్రహీతవైన తర్వాత బయట ప్రపంచంలో నీ జ్ఞానాన్ని ప్రచారం చేయటానికి అనుమతినిస్తాను. అంతవరకూ నీవు ఆశ్రమంలోనే వుండి, భక్తిశ్రద్ధలతో అన్ని విషయాలు తెలుసుకో. అంతవరకూ లేనిపోని ప్రయోగాలు చేయవద్దు" అని గురువు మందలించి, శాంతపర్చి, భయం పోగొట్టారు. జరిగిన పొరపాటుకు గురువుగారి పాదాలమీద పడి శిష్యుడు క్షమాపణ కోరుకోవడం, గురువుగారు చిరునవ్వు నవ్వడం జరిగిపోయింది.

ఇక్కడ విషయమేమిటంటే, ఏ విషయమైనా, గురువుల వద్ద క్షుణ్ణంగా, శ్రద్ధగా, భక్తితో, క్రమశిక్షణతో, కొన్ని నియమాలతో నేర్చుకోవాలి. అ ఆలు దిద్దకముందే అన్నీ తెలిసాయనుకోవడం అవివేకం, అజ్ఞానం. అది ఒక రకమైన మూర్ఖత్వం కూడా. ఈ ప్రపంచం పెద్ద పుస్తకభాండాగారం లాంటిది. ఎంత వెలికి తీసినా, జ్ఞానసంపద దొరుకుతూనే వుంటుంది. నేర్చుకోవాల్సింది అనంతం. జీవితం కూడా సరిపోదు. నేను చెప్పేదేమిటంటే, ఏది తెలుసుకుంటే, ఇతరమైనదేదీ తెలుసుకోనక్కరలేదో అటువంటి జ్ఞానాన్ని తెలుసుకోండి. అలాంటి జ్ఞానం ఒక్క సద్గురువు వద్ద మాత్రమే సాధ్యం. ప్రతి శిష్యుడూ చెప్పటం తగ్గించి, తెలుసుకోవడం ఎక్కువ చేయాలి. "అతిభాష మతిహాని" అని స్వామి చెప్పేవారు. నోరు ఒక్కటే, చెవులు రెండు. దీని భావం నేను చెప్పనక్కరలేదు. ఈ శరీరంలో ఎక్కడ ఒక భాగముండాలో, ఎక్కడెక్కడ రెండేసి భాగాలుండాలో వాటి అవసరం, ప్రాధన్యతను బట్టి అమర్చబడ్డాయి. నాలుకను చూసి మీరు ఎంతో నేర్చుకోవాలి. 32 దంతాల మధ్య నిత్యం వుంటూ, దాని పని అది చేసుకుంటూ, సున్నితంగా వుంటుంది. మీరు కూడా మీ అవసరం, సామర్థ్యం తెలుసుకొని మెలిగినంత కాలం ఏ ప్రమాదం వుండదు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడం, వెళ్ళిపోయిన రైలుకు టిక్కెట్టు కొనడం లాంటిది. ప్రతి పనికీ మీ అవసరం లేకున్నా, అనవసరంగా ప్రవేశించి అవమానాలను, ప్రమాదాలను కొని తెచ్చుకోకూడదు. మనసు చెప్పినట్లు కాకుండా, బుద్ధి చెప్పునట్లుగా మసలుకోవాలి. ఎవరైనా తప్పు చేస్తే, అందుకే "బుద్ధి లేదా?" అంటారు. మనిషి మట్టిలో పుట్టి, మరలా మట్టిలోనే కలిసిపోతాడనేది సత్యం. కాదనలేరు. అయినప్పటికీ, మాణిక్యం లాగా బ్రతకాలి. మాణిక్యం జాతిరాయి కూడా మట్టిలోనే పుడుతుంది. రాయి అయినప్పటికీ, రంపపు తాకిడికి మాణిక్యమవుతుంది. బంగారం కూడా మట్టి నుండే తీస్తారు. దాని విలువ చూడండి, మానవుని జీవితంలో అందరానిదిగా వుంటుంది. అలాగే, మనిషిగా పుట్టి మహనీయునిగా, మాణిక్యంగా బ్రతకాలి. పుట్టడం, గిట్టడం కోసమే అయితే, రెండూ వ్యర్థాలే. ఈ పని ఎన్నో జీవరాశులు చేస్తున్నాయి. మీలా జీవులకు కూడా కొన్ని నియమాలున్నాయి. సృష్టిలో ప్రతిజీవి నుండి చెట్టు నుండి పుట్ట వరకూ ఒక రీజను, ఒక సీజను వుంది. మరి మనిషికి అటువంటి ఇంగితజ్ఞానం లోపించటానికి గల కారణాలు నాకంటే విజ్ఞులైన మీకే బాగా తెలుస్తుంది.

ఎంతోమంది మహనీయులు మట్టి నుండి పుట్టినవారే. కానీ, మానవత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పి, అనంతమైన సంపదగా ఈ భూమ్మీద విడిచిపెట్టిన తర్వాతే తమ శరీరాలను మట్టిలో కలుపుకున్నారు. ప్రేమ, జాలి, దయ, మానవత్వం, మంచితనం, అహింస, కరుణ ఇలాంటి పదాలు, రానున్న తరానికి పరభాషా పదాలైపోతాయి. ఇప్పటికే పదంలో వున్న కమ్మదనం కన్పించుటలేదు. భాషను బట్టి భావం, భావాన్ని బట్టి ప్రేమానుబంధాలు. మీరు వాడే భాష, మీ మనోభావాలను ప్రతిబింబింపచేస్తాయి. కనుక,

*తస్మాత్ జాగ్రత్త! జాగ్రత్త! జాగ్రత్త! జాగ్రత్త! జాగ్రత్త!*

**పాపం చేత్ పురుషః కృత్యా కల్యాణమభిపద్యతే ।**
**ముచ్యతే సర్వపాపేభ్యో మహాభ్రేణేన చంద్రమాః ॥**

మానవుడు తొలుత పాపకార్యాలు చేసినా, తర్వాత పుణ్యకార్యములు ఆచరించినట్లయితే, మహామేఘం నుండి విడివడ్డ చంద్రుని వలే సమస్త పాపాల నుండి విముక్తుడవుతాడు.

***ఆధ్యాత్మికం వరమో శాపమో తెలియక అయోమయంలో మీరున్నారు***
***ప్రశాంత జీవనం, జీవిత చరమాంకంలో కావాలి***
***మీకు ఆత్మీయుల ఆప్యాయతలే అనురాగవల్లరిగా అల్లుకుపోవాలని***
***గతస్మృతులే మధుర స్మృతులుగా నిలవాలని***
***సంతోషమయ జీవితానికి పరమావధిగా మీరు నిలవాలనుకున్నారు***
***దానికి వసంతకాలం రావాలని, తీరని కోరిక దేవుడ్ని కోరుతూ***
***భగవన్నామస్మరణ చేయండి***
***దైవస్మరణే ఆధ్యాత్మికానికి ప్రాణవాయువు***
***ఆధ్యాత్మిక చింతనలే తోడుగా నిలవాలని***
***సమాజసేవకు తోడుగా నిలవండి***
***మీ మదిలో ఎన్నో ఆశలుంటాయి***
***కానీ, జీవితంలో, మదిలో మెదిలే కాంక్షలు స్థిరత్వాన్ని కోల్పోతూ వుంటే,***
***దేహం అనిత్యం ఆత్మ నిత్యం***
***దేహం జడం ఆత్మ జీవం***
***అని ఎప్పుడు తెలుసుకుంటారు నా ఈ చిన్నారి ముద్దుబిడ్డలు అని***
***ఈ ఆంజనేయుడు పరితపిస్తున్నాడు***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

కర్మయోగంలో జీవిస్తూ
నిష్కామకర్మను ఆచరించడమే
పరిపూర్ణత్వం

ఓం

**11-10-2020** 09:10 AM

**122) సమతుల్యమైన జీవనం కొరకు మేము ఆచరించవలసిన నియమాలు ఏవి స్వామీ?**

*కేవలం తమ కోర్కెలు తీరటానికే దేవతలను పూజిస్తారు, భక్తితో కాదు. దీనివల్ల దైవంతో సరియైన అనుబంధం ఏర్పడదు. వ్యాపారభక్తి ప్రయోజనాలు ఇహం వరకే పరిమితం. అలాగాక, తమ ఆరాధ్యదైవంగా భావించే శక్తిని త్రికరణశుద్ధిగా ప్రీతిపూర్వకంగా ఉపాసించాలి. అలా ఉపాసించాలంటే, తన దైవాన్ని సర్వశ్రేష్ఠుడిగా భావించాలి, ప్రకటించగలగాలి. పొరపాటున కూడా కించపరచకూడదు. అందువల్ల, దైవదూషణ దోషం సంప్రాప్తించి పుణ్యం క్షయిస్తుంది. జీవితంలో అనేక కష్టనష్టాలు పొందాల్సి వస్తుంది. లోకవైఖరి చాలా విచిత్రంగా వుంటుంది. మెతకగా వుంటే జనం లెక్కచెయ్యరు. ఎక్కువగా వాదవివాదాలు చేయడం వల్ల అవమానం కలుగుతుంది. అతిగా దానాలు చేయడం వల్ల దరిద్ర్యం ప్రాప్తిస్తుంది. అతి లోభతనం వల్ల తిరస్కరించబడతారు. కాబట్టి, ఏది ఎంతవరకూ అవసరమో అంతవరకే వుండాలి. తక్కువ వున్నా, ఎక్కువ వున్నా రెండూ సమస్యాత్మకమే. కొంతమంది అవసరానికి మించి పట్టుదల చూపుతారు. మరికొంతమంది ఆచారాన్ని పాటించరు. దానివల్ల ధర్మానికి హాని కలుగుతుంది. అతిగా ఆచారం పాటించడం కూడా మూర్ఖత్వమే. ఈ విషయాలలో సమతుల్యమే సరియైనది. ఆధిక్యతా భావాలు మనిషిని పతనావస్థలోనికి పడదోస్తాయి. నేను అందరికంటే గొప్పవాడను, ఎక్కువ జ్ఞానం కలవాడను, నేను చెప్పిందే ధర్మం అనుకునే వారంతా అవమానాల పాలు కాక తప్పదు. జ్ఞానులు నిరాడంబరంగా వుంటారు. వినయస్వభావం కలిగి వుంటారు. అహంకారం వారి సామీప్యానికి కూడా రాదు, చేరదు. భగవదవతారులైన శ్రీరామ, శ్రీకృష్ణులు తమ జీవితకాలంలో ఆదర్శవంతమైన వినయవిధేయతలు చూపారు. అందరిపట్ల సమత్వాన్ని, స్నేహభావనను చూపారు. సర్వశక్తిమంతులు, సర్వేశ్వరులు అయినవారే అలా వుండగా, మీరు లక్షోవంతు కూడా ప్రజ్ఞ లేని పరిస్థితిలో అహంకరించటం ఎంత మూర్ఖత్వమో మీరే ఆలోచించుకోవాలి. 'తిమి' అనే చేపను 'తిమింగలం' తింటుంది. దాన్ని కూడా చంపి తినే 'రాఘవం' అనే చేప వుంటుంది. దానిని మింగేది మరొకటి వుంటుంది. ఈ సత్యాన్ని గుర్తుంచుకుని, నేను సర్వాధికుడ్ని అనే గర్వాన్ని పొందకూడదు. గోబ్రాహ్మణ దేవతలయందు బ్రహ్మతేజం అంతర్లీనంగా దాగివుంటుంది. దానిని కించపరచినప్పుడు, అగ్నిలా ప్రజ్వరిల్లి వినాశనాన్ని కల్గిస్తుంది. మీకు లోకంలో ఒక నానుడి వుంది. అది చాలామందికి అనుభవపూర్వకంగా తెలిసిందే. "వనిత, విత్తం, పుస్తకం, పరహస్తం గతం గతః" భార్యను, ధనాన్ని, పుస్తకాన్ని ఇతరుల ఆధీనంలో వుంచకూడదు. అలా చేసినట్లయితే, అవి తిరిగి వచ్చినప్పుడు క్రమంగా పతితగా, కొంత తగ్గినదిగా, నలిగిపోయినవిగా అందుతాయి. ఇది సర్వకాల సత్యం. ఇప్పటికీ, ఎప్పటికీ రుజువు అవుతూనే వుంటుంది. కొందరు ఏదో చిన్న కారణాన్ని పట్టుకుని అతిముఖ్యమైన, విలువైన కార్యాన్ని వదిలివేస్తారు. కీర్తిని కలిగించే మంచిపనిని ధనవ్యయం అవుతుందనే సంశయంతో చెయ్యరు. సేవకులు చెడ్డగా మాట్లాడగానే ఆవేశపడి దుర్భాషలాడకూడదు. వారిలో ఆధిక్యతను చూచి అసూయ పడకూడదు. ఇవి మనిషి వ్యక్తిత్వానికి, కీర్తిప్రతిష్టలకు సంబంధించినవి. కాబట్టి ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. కొంతమందికి మంచి-చెడుల*

తేడా వుండదు. రెండింటినీ సమంగానే పరిగణిస్తారు. అలాంటివారి ముందు బుద్ధిమంతులు మాట్లాడకూడదు. అది చెవిటివాడి ముందు గానకచేరి లాంటిది. కొందరు స్నేహధర్మాన్ని పాటించరు. కష్టంలో వున్న మిత్రుడ్ని పట్టించుకోరు. చెడు అలవాట్లకు లోనైన మిత్రుడికి నచ్చచెప్పి మంచిదారిలో పెట్టే ప్రయత్నం చెయ్యరు. అలాంటి వ్యక్తిని క్రూరుడు అని అనవచ్చు. పరుషవాక్కులు, మేకుల వంటివి. బాల్యం నుండి ఉపచారాలు, దానగౌరవాలు పొందిన మిత్రుడు కూడా కఠిన వాక్కుల వల్ల శత్రువు అవుతాడు. తనకంటే బలమైన శత్రువుని తన భుజాల మీద మోస్తున్నట్లు వినయంగా వర్తించాలి. అతని బలం తగ్గిన తర్వాత కుండను శిల మీద బాదినట్లు నశింపచేయాలి. సౌజన్యం కంటే, గొప్ప భూషణం లేదు. ఆభరణాలు, విద్య, ధనం, పౌరుషం, రాజ్యాధికారం ఇవ్వన్నీ సౌజన్యం ముందు ఎందుకూ కొరగావు. భగవంతుడు తన సృష్టికి సహజ భూషణాలు కొన్ని కల్పించాడు. అవి ఏమిటంటే అశ్వానికి వేగం, ఎద్దుకు బరువు మోసేశక్తి, రత్నానికి కాంతి, రాజుకి సాహసం, వేశ్యకు విలాసచేష్టలు, గాయకుడికి కమ్మని స్వరం, ధనవంతుడికి దానగుణం, సైనికుడికి శౌర్యం, ఆవుకు ఎక్కువ పాడి, మునులకు ఇంద్రియ నిగ్రహం, పండితులకు చక్కటి వాగ్ధాటి, ధర్మాధికారులకు పక్షపాతం లేకుండటం, సాక్షులకు సత్యవచనం, సేవకులకు నిశ్చలభక్తి, మంత్రులకు హిత వచనాలు, మూర్ఖులకు మౌనం, స్త్రీలకు పతివ్రతా ధర్మం. ఇవి ఉన్నప్పుడే వారికి గౌరవం లభిస్తుంది. అవి లేనప్పుడు భూషణరహితులవుతారు. ఇంటికి ఒక్కరే యజమాని వుండాలి. ఎక్కువమంది పెత్తనం వుంటే మంచిది కాదు. అనర్థం. మనిషి లేక జంతువుకి హింసాత్మక గుణం వుంటే వారు నశిస్తారు. ఎవరో ఒకరు వారిని వధించనూవచ్చు. చాడీలు చెప్పటం, తీక్ష స్వభావం, దొంగతనం, ఓర్వలేనితనం, ఎక్కువ దురాశ, అబద్ధమాడటం, పనులు చెడగొట్టడం, సోమరితనం లాంటి చెడు లక్షణాలు గలవారికి దూరంగా వుండాలి. అలాంటి దుర్లక్షణాలు తమకు సోకకుండా జాగ్రత్త వహించాలి. చిన్నతనంలో తల్లి, యౌవ్వనంలో భార్య, వృద్ధాప్యంలో కుమారుడు లేదా ధనం నశించుట వంటివి, గతజన్మలో చేసిన మహాపాపానికి ఫలాలుగా చెబుతాను. అలాంటివే, ధనవంతులకు సంతానం లేకపోవటం, దరిద్రులకు మూర్ఖత్వం, స్త్రీలకు నపుంసకుడు భర్తగా లభించడం, ప్రియమైనది దూరం కావటం ఇవి దుఃఖకారణాలు. దుఃఖాన్ని కలిగించే మరో ఆరు వున్నాయి. మూర్ఖుడైన కొడుకు, విధవ కూతురు, కోపస్వభావం గల భార్య, పేదరికం, నీచులను సేవించడం, ఎల్లప్పుడూ అప్పులు చేయటం అనేవి అందరకూ దుఃఖ కారకాలే. ఇవ్వన్నీ మీరు తెలుసుకోదగినవి. ఆంజనేయుని అభయంలో వున్నా, ఇంకా అరిషడ్వర్గాలు అరచేతిలోనే వున్నాయంటే, ఇంక ఏది దారి? ఎటు వెళ్ళాలి?

**న కుత్స యామ్యహం కిం ఛిన్న గర్వే బలవత్తరమ్ ।**
**కృతమన్వేతి కర్తారం పురాకర్మ ద్విజోత్తమా ॥**

మీరెవరినీ తిరస్కరించకండి. బలవంతులను నిందించకండి.
పూర్వజన్మలో చేసుకున్న కర్మలు, కర్తను అనుసరిస్తూనే వుంటాయి.
అంటే పూర్వజన్మలో చేసుకున్న శుభాశుభకర్మల ఫలితాన్ని కర్త తప్పక అనుభవించవలసే వుంటుంది.

నేను ధనికుడను అని అనుకునే కంటే,
నేను ఈ రోజు ఫలానా మంచిపని చేశాను అనుకోండి.

***పుణ్యధామంబులు, పుణ్యతీర్థంబులు***
***పనిగట్టి తిరుగంగ ఫలితమేమి?***
***నియమనిష్ఠలనుచు, నిత్యపూజలనుచు***
***ఆచరించిన వచ్చు లాభమేమి?***
***గుడిగోపురంబులు, కోనేళ్ళు, బావిళ్ళు***
***కట్టించినా వచ్చు పుణ్యమేమి?***
***విరివిగా దానధర్మాలు, వేల సంతర్పణల్***
***సలిపినా పొందిన సారమేమి?***
***శాస్త్రముల్ బహుకళా శోధనా సాధనల్***
***యెరిగున్న, జీవనమెరుగునా యేమి?***
***ఆధిపత్యంబులు, అఖిల నైపుణ్యముల్***
***కలిగున్ననూ కడకు వెలుతురేది?***
***తాను యెవరు? ధరణి వాస్తవంబెట్టిది?***
***తనువునందు జీవధర్మమేమి?***
***సత్యము నెరింగించు ఈ ఆంజనేయుని మాట బాట***
***ఒక్కటాచరించండి ముక్తి కలుగు***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**12-10-2020** 09:05 AM

**123) వేదాంతపరంగా 'నిన్ను నీవు తెలుసుకో' అన్న వాక్యానికి గల విలువ ఎట్టిది స్వామీ?**

కొన్ని మాటలు పైకి తేలికగా అనిపించినా, అంతరాంతరాల్లోకి వెళ్ళి ఆలోచిస్తే, ఎంతో గంభీరమైన భావం, లోతైన అర్థం వుంటుంది. అలాంటివాటిల్లో, "నిన్ను నీవు తెలుసుకో" అనే మాట ఒకటి. ఏ వేదాంత ఉపన్యాసమైనా, ఈ పదం తప్పనిసరిగా వుంటుంది. వేదాంతులు, జ్ఞానులు అనే మొదటిమాట ఇదే. వేదాంతమంటే, అంతుపట్టనిది, అందుకోలేనిది. తమ లాంటివారు కనీసం ప్రయత్నం చేయలేని విషయమని భావించేవారు కోకొల్లలు. అందుకే, ఆ మార్గం వైపు వెళ్ళడానికి తాము అనర్హులం అని, కనీసం ఆ ఆలోచనల ఛాయలకైనా పోరు కొందరు. వేదాంతమంటే అదో రకమైన పిచ్చి అని కొందరనుకుంటారు. ఎందుకంటే, వాళ్ళు చెప్పేవన్నీ అర్థం లేని మాటలు కాబట్టి, వాటిని పట్టించుకునే అవసరం లేదని వారి భావన. అలాంటివారు, ఆ పదానికి, మాటకి చేసే వ్యాఖ్యానం ఇలా వుంటుంది. "ఇతరుల గురించి తెలుసుకోమంటే ఒక అర్థం వుంది గానీ, తనను గురించి తాను తెలుసుకోవడం ఏమిటీ?" అని విపరీతంగా స్పందిస్తారు. కాసేపు వేదాంతాన్ని ప్రక్కన పెట్టండి. ఉపనిషత్తులు, దాని

*సారాంశాన్ని ప్రాచీన మనోవిశ్లేషణ గ్రంథం భగవద్గీత లాంటివి ఆ మాటనే చెబుతున్నాయి. చివరకు ఈ సద్గురువు దానినే చెబుతున్నాడు. అయినా ప్రాచీనతను వ్యతిరేకించే కొందరు వాటిని వ్యతిరేకిస్తారు. కానీ, ఈ ఆధునిక కాలంలో అత్యంత ఆదరణ కలిగిన విషయం 'వ్యక్తిత్వవికాసం'. ఇది జీవనగమనాన్ని సరిచేస్తుందని నేటి మానవులకు ఈ విషయం మీద ఆసక్తి ఎక్కువ. అందుకే తీరిక చేసుకుని మరీ, ఆ తరగతులకు హాజరవుతున్నారు. అక్కడ వారు చెప్పేదీ ఇదే. నిన్ను నీవు తెలుసుకో అనే! ఇన్ని వాదాలూ ఒకే విషయాన్ని గురించి చెబుతున్నాయంటే, ఆలోచించవలసిందే కదా! కాలం, మార్గం, గమనం వేరైనా, విషయం ఒక్కటే. నాటి నుంచి నేటి వరకూ ఆ విషయానికే ఇంత ప్రాధాన్యతనిచ్చి ఎందుకు చెప్పాలి? అని మీరు ప్రశ్నించుకోగలిగితే, వచ్చే సమాధానం నిజంగా ఎవరి గురించి వారికి (తన గురించి తనకి) తెలిసినది చాలా తక్కువ అని. దానికి ముఖ్యకారణం ఒక్కటే. ఆ ఆలోచన రాకపోవడం. ఎవరో గుర్తు చేసే వరకూ అలాంటి విషయం ఒకటుందని గుర్తించకపోవటం. అందువల్లనే తన గురించి తాను తెలుసుకోవడానికేముందీ? అనేవారు మరికొందరు. అటువంటి ప్రశ్న ఉదయించిన తర్వాతైనా ఎవరికి వారు ఆ ప్రశ్నను ప్రశాంత చిత్తముతో విశ్లేషించుకుంటే, తనను గురించి తనకే ఎన్నో నిష్ఠుర సత్యాలు బయటపడతాయి. తనలోని లోపాలు, లోతుపాతులు, అసత్యాలు, అవలక్షణాలు లాంటివన్నీ మనసుకు గోచరిస్తాయి. అంతేగాక, మానసికస్థాయి వికారాలు, స్థితిగతులు అన్నీ గోచరమవుతాయి. చిత్రమేమిటంటే, తను ఇలాంటి లక్షణాలు కలవాడనని తెలిసినా, నిజాయితీగా ఒప్పుకునే వారెవరూ ఉండరు. దానికి మూలకారణం తను అలాంటివాడినని తనకు తెలిసినట్లే ఇతరులకు తెలిస్తే, తనను చులకనగా చూస్తారని భయం. అందుకే లేనిపోని జంఝాటం ఎందుకు? అని ప్రశ్న వేసుకోవడమే మానేసి తనను గురించి తాను తెలుసుకునే ప్రయత్నమే విరమించుకుంటున్నాడు. దాని స్థానంలో ఊహలు, మనసుకు నచ్చచెప్పుకోవటానికి, సర్ది చెప్పుకోవడాలు, ఒప్పించుకోవడాలు, ఓదార్పులాంటి వాటితో కాలక్షేపం చేస్తారు. అంతే తప్ప, తన గురించి కొంతవరకూ తెలిసింది కాబట్టి, తనలో వున్న అవలక్షణాలను సరిచేసుకొని, ఉత్తమ మార్గంలోకి పయనించే ప్రయత్నం చేసేవారు అరుదు. అలా చేసేవారు ఉత్తమవ్యక్తులుగా అలరారుతారు. తాను దారితప్పే పరిస్థితులు వచ్చిన ప్రతిసారీ, తండ్రి తనతో అన్న మాటలు మళ్ళీ తనను సరిగా నిలబెట్టేవి అని ఈ ఆంజనేయుని ఒక్కసారి తలచుకోండి. ఇంతటి స్ఫూర్తిని కలిగించే మాటలు ఏమిటంటే, ఇతరులను అర్థం చేసుకునేవాడు విజ్ఞాని. తనను తాను తెలుసుకున్నవాడే వివేకి. వివేకం లేని విజ్ఞాన ప్రయోజనం శూన్యం అని చెబుతాను. ఆ మాటల్లోని ఆంతర్యం ఆలోచించగలిగితే ఎన్నో భావాలు స్ఫురిస్తాయి, తనని తాను తెలుసుకోవడం వల్ల ఒనగూడే లాభాలు ద్యోతకమవుతాయి. సోక్రటీస్‌ను ఒకసారి ఒక పెద్దాయన "ఎవరు నువ్వు?" అని అడిగారట. ఆ మాటకి సోక్రటీస్ "ఆ విషయం తెలియకనే సతమతమవుతున్నాను. తమరేదో మార్గం చూపిస్తారని వస్తే, తమరూ అదే ప్రశ్న వేస్తున్నారు" అన్నారట చమత్కారంగా. అలా అడగటంలో గర్వం లేదు, వినయమే వుంది. అందుకే గొప్పతనానికి ముందు వినయం వుంటుంది – పతనానికి వెనుక గర్వం వుంటుంది! కాబట్టి, గొప్పవారు కావాలనుకుంటే, వినయంతో వుండి, తనను తాను తెలుసుకోగలగాలి. అలా కాకుండా గర్వంతో నాకన్నీ తెలుసు అనుకునే వాడికి మిగిలేది పతనమే. తనను గురించి తాను*

తెలుసుకోవడమంటే, పెద్దపెద్ద పరీక్షలకు గురి చేసుకోవడం, మనసును మోసం చేసుకొని జీవించడం, బాగానే ఉన్నానని సర్దిచెప్పుకోవడం, అతిగా ఊహించుకోవడం కాదు. వ్యక్తిత్వాన్ని ఖచ్చితంగా అంచనా వేయడం, ఖచ్చితమైన ఆలోచన కలిగి వుండటం. తనను తాను తెలుసుకోలేనివారు ఏకాలంలోనైనా ఎలా వుంటారో చెబుతాను. ఎవరైతే తనను గురించి తాను తెలుసుకోలేని స్థితిలో అజ్ఞానిగా వుంటారో, అలాంటివారి ఇంద్రియాలు వశంలో వుండవు. అలా వశం తప్పినవారు ఇంద్రియలోలురై, చాపల్యానికి గురై, సుఖాలుగా భ్రమింపచేసే కర్మలను ఆచరిస్తూ, తాను సుఖంగా ఉన్నానని భ్రమిస్తూ, అనంతమైన దుఃఖంలో కొట్టుమిట్టాడుతుంటారు. అమృతతుల్యమైన జీవితాన్ని చేజేతులా జారవిడుచుకుంటారు. కాబట్టి, కొంతైనా తెలుసుకునే ప్రయత్నం చేయాలి. తనను తాను తెలుసుకున్నవాడు, అందరి గురించి, అన్నింటి గురించి, ఈ ఆంజనేయుని గురించి తనంత తానుగా తెలుసుకున్నవాడవుతాడు. అలాంటివాడే స్థితప్రజ్ఞుడు, స్థిరమైన బుద్ధి కలవాడని అనిపించుకుంటాడు.

***పరిత్యజతియో దుఃఖం సుఖం చాప్యుభయం నరః ।***
***బ్రహ్మ ప్రాప్నోతి సోత్యంతమసంగేన చ గచ్ఛతి ॥***

ఎవడు సుఖదుఃఖాలను రెండింటినీ పరిత్యజిస్తాడో, అతడే బ్రహ్మానందాన్ని పొందుతాడు.

***కలలోనైనా అనుకోలేదేమో***
***ఇంతటి మహద్భాగ్యం మీ జీవితంలో ఒకటుందని***
***ఎక్కడ మీరు? ఎక్కడ ఈ అనుభవం?***
***మీరు ఊహించనిది జరిగినది ఈనాడు***
***మీరు ఊహించినది జరగలేదేనాడు***
***చీమంత మనసు ఎన్నో చిత్రాలు చేస్తుంది***
***బంధాల బందిఖానా నుండి***
***స్వేచ్ఛా విహారంతో గగనాన ఎగిరే విహంగాల్లా***
***ధీటుగా పోటీపడుతున్న మీ మనస్సు***
***ఎన్నో వేల కిలోమీటర్లు దాటి***
***ఈ అనంత విశ్వంలో ప్రయాణించి***
***ఈ ఆంజనేయుడ్ని చేరింది***
***ఈ బిడ్డలను చూచిన నా మది అల్పసంతోషిలా వుంది***
***నా ఈ బిడ్డలతో మమైకమైపోవాలని***
***ఉవ్విళ్ళూరుతుంది కానీ, ఆగమని చెబుతాను***
***ఎందుకంటారా? ఇప్పుడేగా చెప్పాను***
***అద్భుత ఆనంద ఆధ్యాత్మికమైన విషయం***
***'నిన్ను నీవు తెలుసుకో' అని***

***ఆ సమాధానం తెలిసిన మరుక్షణమే***
***తెలుసుకోవటానికి శ్రీసత్యసాయి కుటీర్‌లో అడుగుపెట్టావు***
***అభయమొసగే ఆంజనేయుని స్వర్గద్వారంలో అడుగు వేశావు***
***ఇక సంతోషం ఆనందం మిమ్ములను వరించబోతున్నాయి***
***అనేది అనుభవంలోకి వస్తుంది***
***నా యీ చిన్నారి బిడ్డలకు సదా***
***ఆంజనేయుని రక్ష కలిగేను నా ఈ చిన్నారి బిడ్డలకు***
***ఈ చిన్నారి బిడ్డలే పొన్నారి బిడ్డలై***
***పవనసుతుని చేరి పరవశించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**13-10-2020** 09:20 AM

*ఈ రోజు మీతో ఆనందంగా గడపాలని వుంది. చమత్కారంగా ఒక కథ చెప్పాలని వుంది. ఏ కరోనాకి మీరు భయపడుతున్నారో, అది దేవతాలోకంలో కూడా కలకలం సృష్టించింది అంటూ హాస్యంగా చెప్పాలనిపించింది. స్వర్గలోకంలో సభ నడుస్తోంది. అందరూ ఆనందంగా, హుషారుగా వున్నారు. సడెన్‌గా వాయుదేవుడికి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. ఎక్కడి నుండి మెసేజ్ అని ఇంద్రుడు అడిగాడు. యమలోకం నుంచి ఇంద్రా! అక్కడ ఏదో కరోనా వైరస్ వచ్చిందట. చాలా ప్రమాదకరం అట. మనల్ని మాస్కులు వేస్కోమంటూ యమ సీరియస్‌గా, యమవార్నింగ్ మెసేజ్ పంపాడు యముడు. ఇంద్రుడు వెంటనే, "అక్కడ ఎప్పుడూ ఏదో ఒక సమస్య ఉంటూనే వుంటుంది కదా. ఐనా ఏది పడితే అది తినడం, ఎలాపడితే అలా ఉండటంవల్లే ఇలాంటివన్నీ వస్తాయని వాళ్ళకు తెలీదా? మనకి ఇదేమైనా కొత్తా చెప్పు. ఇదివరకు ఇలాగే ఇబోలా వైరస్ అని, స్వైన్‌ఫ్లూ అని, నా బొంద అని ఏదో ఒకటి మన నెత్తిమీదకు తెస్తూనే ఉంటారు, ఈ నరకలోకం వాళ్ళు. మనది స్వర్గం. ఇక్కడికి ఎలాంటి వైరస్ రాదు. వచ్చినా బ్రతకదు. నేను బ్రతకనివ్వను. నువ్వు టెన్షన్ పడకు వరుణా" అంటూ వెటకారంగా నవ్వాడు. ఇంకెప్పుడూ వాట్సాప్ గ్రూపులో ఇలాంటి మెసేజెస్ పెట్టవద్దని చెప్పు ఆ యముడికి. మేటర్ సీరియస్ అవునో కాదో తెలుసుకుందామని, వరుణదేవుడు ఆ మెసేజ్‌ను నారదుడికి ఫార్వర్డ్ చేశాడు. చాలారోజుల నుంచి కొత్త న్యూస్ లేక వెయిట్ చేస్తున్న నారదుడికి ఆ మెసేజ్ చాలా ఆనందం ఇచ్చింది. అంతే! వెంటనే చిడతలు కొట్టుకుంటూ నరకంకి బయలుదేరాడు. నరకలోక ముఖ్యద్వారం దగ్గర మాస్కులు వేసుకున్న యమభటులు కనిపించారు. లోపలకు వెళ్ళబోతుంటే, ఆయన్ను ఆపి, టెంపరేచర్ చెక్ చేశారు. ఆయన చిడతల మీద, తంబురా మీద శానిటైజర్ చల్లారు. ఆయన అరచేతుల్లో కూడా వేసి, శుభ్రంగా తుడుచుకోమన్నారు. ఆయన లోపలకు వెళ్ళేసరికి అందరూ మాస్కుల్లోనే వున్నారు యముడు చిత్రగుప్తుడితో సహా. యముడు*

*కరోనా వైరస్ కోసం చెప్పిన జాగ్రత్తలు తీసుకోమన్నాడు. క్రొత్త పాపులను కూడా వైతరిణి నదికి అవతలి ఒడ్డునే ఆపి, 14 రోజులు అయ్యాక టెస్ట్ రిజల్ట్స్‌ని బట్టి లోనికి రానిస్తున్నారట. మేటర్ తెలుసుకున్న నారదుడు వెంటనే బ్రహ్మలోకం వెళ్ళాడు. అప్పటికే బ్రహ్మ నాలుగు ముఖాలకు నాలుగు మాస్కులతో వున్నాడు. నారదుడు వెంటనే "ఈ విషయం అప్పుడే మీ వరకూ వచ్చిందా నాన్నగారూ" అన్నాడు. "నువ్వు మెంబర్ అయిన వాట్సాప్ గ్రూపుకి అడ్మిన్‌రా నేను. నువ్వు నాకే చెప్తున్నావా?". "అయ్యో! అలా అనలేదు నాన్నగారూ" అంటూ, ఆ ఆ ఆ ఆ ఆచ్ అని తుమ్మాడు నారదుడు. బ్రహ్మ కోపంగా, "తుమ్మేటప్పుడు ఆ చెయ్యో లేక నీ చిడతలో అడ్డుపెట్టుకోవచ్చు గదా?" అన్నాడు. "నాన్నగారూ! ఇది కరోనా తుమ్ము కాదండి. నరకలోకం నుండి వస్తున్నప్పుడు వయా కైలాసం వెళ్ళి వచ్చాను. దాని చల్లదనం వల్ల కావచ్చుండి". "ఏంటీ? నువ్వు నరకలోకం నుంచి వచ్చావా? ఆ విషయం చెప్పవేం? ఇంకో 14 రోజుల వరకూ నువ్వు ఎక్కడికీ వెళ్ళకుండా సెల్ఫ్ క్వారంటైన్ అవ్వాలి. అర్థం అయ్యిందా?" అంటూ మంత్రం చదివాడు. వెంటనే నారదుడి చుట్టూ బుడగ లాంటిది వచ్చింది. అక్కడ వైకుంఠ ముఖద్వారంలో కూడా జయవిజయులు మాస్కులు వేసుకుని వైకుంఠం* **Is Closed Until Further Notice** *అని డోర్‌కి కాగితం అంటించేశారు. ముల్లోకాలు అల్లకల్లోలం అవుతున్నా, ఏమీ పట్టనట్లు, ఇంద్రలోకంలో జనాలు నార్మల్‌గా తిరుగుతున్నారు. అనుకున్నదంతా అయ్యింది. మరుసటిరోజు న్యూస్ పేపర్‌లో "ఇంద్రలోకంలో తొలి కరోనా కేసు" అంటూ హెడ్‌లైన్ పెట్టేశారు. విషయంలోకి వెళ్తే, యమలోకంలో శిక్ష పూర్తిచేసుకుని స్వర్గానికి వచ్చిన ఒక మాజీ పాపి వల్ల ఇంద్రలోకంలోనికి కరోనా ఎంటర్ అయిపోయింది. నిర్లక్ష్యం వల్ల తెచ్చుకున్న తంటా. వెంటవెంటనే పాకి స్వర్గంని నరకం చేసిపడేసింది. చేతులు కాలిపోతున్నాయి, ఆకులు పట్టుకుందాం అని ఆకుల కోసం పైలోకంలోకి వెళ్ళినా, అన్నీ క్లోజ్డ్ డౌను ఒక్క కైలాసం తప్ప. వెంటనే శివుడి దగ్గరకి పరిగెత్తాడు ఇంద్రుడు. చేసిన తప్పుని క్షమించి రక్షించమని శివుడిని కోరుకున్నాడు. శివుడు మాస్క్ తీసి, "చూడు ఇంద్రా! నువ్వు చేసింది క్షమించరాని తప్పు. కరోనా వైరస్ వల్ల అన్ని లోకాలకి ముప్పు. ఇకనైనా నీ వేయికళ్ళు తెరిచి జాగ్రత్తగా వుండు" అన్నాడు. ఇంద్రుడు ఇంకా కన్విన్స్ కాలేక, "విషాన్ని మింగిన మీకు ఈ కరోనా ఒక లెక్కనా? దయచేసి ఇంద్రలోకాన్ని కాపాడండి" అన్నాడు. శివుడు ప్రశాంతంగా కరోనాకి మందు లేదు. మింగటానికి అది విషమూ కాదు. కాబట్టి, నివారణ ఒక్కటే మార్గం. కాబట్టి, నన్ను ఇంకా విసిగించకుండా చెప్పింది చేయుము. వెంటనే స్వర్గాన్ని మూసేయి. అందరినీ వాళ్ళ వాళ్ళ ఇంటికి పంపు. క్రొత్తగా వచ్చేవాళ్ళను 14 రోజులు త్రిశంకుస్వర్గంలోనే ఆపి, పరీక్షలు చేశాకే అనుమతించు. నువ్వు కూడా కొన్ని రోజులు ఇంట్లోనే వుండు. పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆకాశవాణి ద్వారా తెలుసుకో. వెళ్ళు!" అని పంపించివేశాడు. ఇంద్రుడు స్వర్గంకి తాళం వేసి ఇంటిముఖం పట్టాడు. ఇంద్రుడి భార్య శచీదేవి శానిటైజర్‌తో చేతులు కడుక్కుంటూ, "ఎందుకండీ అంత డల్‌గా వున్నారు?" అని అడిగింది. ఇంద్రుడు, "రోజూ స్వర్గంలో ఉండేవాడిని. ఈరోజు ఇంట్లో ఉండవలసి వచ్చింది" అన్నాడు. శచీదేవి, "చాల్లేండి. మేము రోజూ ఇంట్లోనే ఉంటాం. ఆ మాటకొస్తే ఇలాంటి సమయంలో ఇంట్లో ఉండటమే స్వర్గం" అంటూ నవ్వుతూ రేడియో ఆన్ చేసింది. అదే సమయంలో ఆకాశవాణిలో చిత్తూరు నాగయ్య పాడిన "గృహమే కదా*

స్వర్గసీమ" అంటూ పాట వస్తోంది. "చూశారా! సూపర్ టైమింగ్. దీని గురించి ఆలోచిస్తూ నవ్వుకుంటున్న నన్ను అన్ని లోకాలవాళ్ళు క్రీగంట చూస్తున్నారు. ఎక్కడ ఆ చూపులు భస్మీపటలం చేస్తాయోనని, "శ్రీరామరామ రామేతి" ఎత్తుకుని చెట్ల మీది నుండి మనుష్యుల మధ్య తిరగటానికి వచ్చాను. బజారులో ఇద్దరు ఆడవాళ్ళు, "అమ్మాయ్! క్రొత్త కాపురం ఎలా వుంది?" అని అడిగితే, "ఏడ్చినట్లుంది. మాస్కుకు గతిలేని వాడికిచ్చి నా గొంతుకోశారు" అంది. "పిన్నీ రేపు సాయంత్రం మా అమ్మాయి 16 మాస్కుల నోము. తప్పకుండా రావాలి" అని పిలిచింది. ఏదో సామెత చెబుతారు చూడక్కా!" అంటూ ఇంకొక ఆవిడ, "మాస్క్‌లేని మగాడు మగాడేనా" అని, ఇంకొకావిడ పొరుగింటికి వెళ్ళింది. 1,2 గంటలు చక్కగా మాట్లాడిన తర్వాత టీ త్రాగి తన ఇంటికి బయలుదేరుతూ చల్లగా ఇలా చెప్పింది. "వదినా! నిన్న డాక్టర్‌గారిని కలిశాను. మీకు కరోనా పాజిటివ్ వచ్చింది. 14 రోజులు క్వారెంటైన్‌లో ఉండాల్సి వుంటుంది అన్నారు. ఈ 14 రోజులు ఎవ్వరినీ కలవడం కుదరదు కదా, అందరినీ ఒకసారి కలిసి వెడదామని వచ్చాను" అంది. కానీ నేను ఎక్కడికీ వెళ్ళలేదు. చెట్ల మీది నుండి రామమంత్రాన్ని జపిస్తూ వచ్చాను. నా సాక్షిగా నన్ను నమ్మండి చాలు!

నేటి సుమతీ శతక పద్యం చెబుతాను.

తన హస్తమె తన శత్రువు
తన ఏకాంతమె తనకు రక్ష
తన చేతి శానిటైజర్ తన చుట్టంబౌ
తన శుభ్రతె తన స్వర్గము
తన తిరుగుడే నరకమండ్రు తథ్యము సుమతీ!

**అందరూ తప్పంతా నాదేనంటూ పదేపదే నిందిస్తారెందుకు?**
**మీ ప్రమేయం లేకుండానే నేనొచ్చానా?**
**యుద్ధమెపుడూ హఠాత్తుగా రాదు**
**అజ్ఞానపు మత్తులో హద్దులు మరచి పెను చీకటి నాహ్వానించిందెవరు?**
**నా వలన విధ్వంసం జరిగి వుండవచ్చు**
**అందుకు నాకూ బాధగానే వుంది**
**మాయలఫకీర్ తన ప్రాణం సప్తసముద్రాలకావల దాచినట్లు మీ సహజ లక్షణాలు ఎక్కడ దాచారు?**
**ఎవరి జీవితాలు వారివేనంటూ, చేసే పయనం ఇంకెంత కాలం?**
**జననమరణ కాలగమనంలో, విలువలు మరచిన వెర్రితనం**
**కాసుల బంధంలో కాలమెరుగక, క్రొత్త దారులకు పుంతలు తొక్కుతుంటే**
**నేనైనా, రేపు మరొకటైనా రాక తప్పదు**
**అనుబంధాల వాకిళ్ళు తెరచి ఎన్నాళ్ళయింది?**
**ఆత్మీయతా భోజనాలెక్కడ? అనురాగాల పిలుపులు గుర్తున్నాయా?**

*అసూయ ముళ్ళు అనునిత్యం గుచ్చుతుంటే, కుటుంబప్రేమలు చివురులెత్తక*
*సమాజ వనాలకు చీడ సోకుతోంది.*
*అంతా నాదే నాకే అనుకొని, మనమన్నది మరచి ఎన్నాళ్ళయిందో!*
*నవ్వుతూ నలుదిక్కులు కలుపుతూ, ఎవరికి వారే రసవత్తరంగా*
*రకరకాల పాత్రలను పోషిస్తుంటే, ఏ ప్రకృతి కాపాడుతుంది మిమ్ములను?*
*మనుషుల మధ్యే కాదు దూరం, మనసుల మధ్యా పెరిగింది*
*ఒకచోట కలసివున్న భిన్న ధృవాల్లా, ఎంతకాలం మనుగడ సాగిస్తారు?*
*ఒక్కసారి మనసు విప్పి చూడండి. దేహతంత్రులు ఎన్ని రాగాలు ఒలికిస్తాయో*
*పులిని చూచి నక్క వాతపెట్టుకున్నట్లు, పద్మవ్యూహపు పాశ్చాత్య పోకడన*
*కొత్తొక వింత పాతొక రోతై, అనుభూతులు లేని ఆలింగనాలతో*
*ఆచారవ్యవహారాలు అడుగున పడ్డాయి*
*పరిగెత్తే పాదాలు ఇప్పుడెందుకు నట్టింట నిలకడగా ఉన్నాయి?*
*సమస్యలొచ్చినప్పుడే బంధీలవుతారా?*
*విశ్వానికి కాంతిరేఖలు మీరు*
*జగతిని ఇకనైనా జాగృతం చేయండి*
*కరోనాని - మీ కారణజన్మురాలిని*
*మీ గాయాలకు ఔషధమయ్యాను*
*మనిషితనం మారాకులు తొడుగుతుంటే,*
*మీలో కన్పిస్తోంది ఓ నూతన ఉషోదయం*
*అదే నిలవాలి కడవరకూ*
*కుట్రలు, కుతంత్రాలు వీడి,*
*ఇకనైనా సహజంగా జీవించండి*
*ఏ దుర్మార్గం చెంత చేరదు*
*పెను విషాదానికి పలుమార్లు దుఃఖిస్తూ*
*భరించలేని వేదనతో నిష్క్రమిస్తున్నా కరోనా,*
*థాంక్యూ కరోనా అని ఈ వీరాంజనేయుడు*
*వినసొంపుగా, కనసొంపుగా చెబుతూ*
*నేను చేయలేనిది తాను చేయుటకై వచ్చిన కరోనా*
*కరుణ నేర్పుటకై కారుణ్యముతో వచ్చిన కరోనాకు*
*ఖచ్చితంగా థ్యాంక్స్ చెప్పండి*
*నా చిన్నారి ముద్దుబిడ్డలారా!*

ఓం

**14-10-2020** 09:10 AM

## 124) ఆధ్యాత్మిక ఎదుగుదలకి అంతరంగశుద్ధి యొక్క ఆవశ్యకత ఎట్టిది స్వామీ?

*మీకున్న సందేహాలను తీర్చుటకు ఈరోజు ఋషితత్త్వాన్ని గురించి కొంత చెబుతాను మీకు అవగాహనలోనికి రావటానికి. తనను తాను తెలుసుకున్న వాడే ధన్యుడవుతాడు. బాహ్య ప్రపంచాన్ని, అందలి సంఘటనలను, వ్యక్తులను గురించి ఆసక్తిగా తెలుసుకోవటం ద్వారా అంతరంగం కలుషితమై, శక్తి విపరీతంగా హరించుకుపోతుంది. మానవ మేధస్సు ఒక రకమైన ప్రసార కేంద్రం వలె పనిచేస్తుంది. పుట్టుక నుండి మరణం వరకూ బాహ్యప్రపంచపు సమాచారం లోపలికి ప్రవేశిస్తుంది, లోపలి సమాచారం బయటకు వెళ్తూ వుంటుంది. అయితే, అందుకు మూలకారణం బాహ్యప్రపంచమా? లేక మీ అంతరంగమా? బాహ్యప్రపంచం కానేకాదు. మీ అంతరంగమందలి సంస్కారాల స్వభావాన్ని బట్టి మీ స్పందన వుంటుంది. అంతరంగమందు ఉత్తమ సంస్కారాలుంటే, బాహ్యప్రపంచపు సమాచారం అంతరంగాన్ని అంతగా ప్రభావితం చేయదు. అలాగాక, చెడు సంస్కారాలుంటే, చర్య, ప్రతిచర్యలు ఎక్కువగా వుంటాయి. వాస్తవానికి అటువంటి చర్య, ప్రతిచర్యలు సమూలంగా ఆగిపోవటమే సంపూర్ణ యోగస్థితి అవుతుంది. ఇది ఒక అసాధారణ స్థితి. వేదాంతపరంగా దీనిని స్థితప్రజ్ఞత అంటారు. మాటలకు, వర్ణనకు, వివరణకు అందనిది స్థితప్రజ్ఞత అంటే. ప్రజ్ఞను అనంతంగా విస్తరింపచేసి, విశ్వవ్యాపిత భావనలో జీవించడం. అందుకు బాహ్యప్రపంచంతో వున్న సంబంధాలన్నీ సమూలంగా తొలగిపోవాలి. అట్టి స్థితిలో నిద్రాణమైవున్న అంతర్గత, అతీంద్రియ గుప్త శక్తులు బహిర్గతమై, సిద్ధులను ప్రదర్శించగల సిద్ధపురుషులవుతారు. మానవమేధస్సుకు పరిధిగాని, పరిమితిగానీ ఉండదు. అది ఒక అనంతమైన విశ్వపు గ్రంథాలయం. బయట నుండి ఎటువంటి సమాచారాన్ని పొందవలసిన అవసరం లేదు. అంతా అంతరంగంలోనే నిక్షిప్తమై ఉంటుంది. ప్రజ్ఞ విస్తరించే కొలది, సూక్ష్మమైన విశ్వ కదలికలన్నీ గోచరిస్తాయి. కుంచించుకునే కొలది, బంధాలు బలోపేతమవుతాయి. అందువలన బాహ్యప్రపంచపు సమాచారం కోసం అన్వేషణ చేయడం కన్నా, మీ అంతరంగాన్ని సమూలంగా శుద్ధి గావించుకోవడం అత్యంత ఆవశ్యకం. అజ్ఞాని బాహ్యప్రపంచంలో వుంటాడు కానీ, అంతర్ముఖమవ్వాలనే ఆసక్తిని కనబర్చడు. జ్ఞాని మాత్రం బాహ్యప్రపంచంలో ఉన్నప్పటికీ, దానిపట్ల ఎటువంటి ప్రతిస్పందన, ప్రతిచర్య చూపకుండా తనలోనికి తాను పయనిస్తాడు. కాబట్టి, అంతర్ముఖమే ఆధ్యాత్మికతకు చక్కని రాచబాట అవుతుంది.*

## 125) ఋషియొక్క స్థితి ఎట్టిది స్వామీ?

*కొందరు అసాధారణ స్థాయిలో వుండి, సామాన్య మానవులకు అందని విధంగా లక్షలాదిమందిని సమ్మోహితం చేయగలుగుతున్నారంటే, వారికి జీవితం అన్నివిధాలా నందనవనమైనట్లే గదా! అందుకు మూలకారణమేమిటి? వారిలోని ప్రత్యేకత ఏమిటి? వారు అనుసరించిన విధానమేమిటి? ఇటువంటి కీలకాంశాలను గురించి శాస్త్రీయ పంథాలో తెలుసుకోండి. మీరు సాధారణ స్థాయిలో ఉంటే, వారంతా అసాధారణమనిపించవచ్చు గానీ, మీరు అసాధారణ స్థాయికి ఎదిగితే, వారు ప్రదర్శించిన సిద్ధులన్నీ*

సాధారణంగా కన్పిస్తాయి. కొందరు ఆధ్యాత్మిక మార్గంలో జీవిస్తూ, అతి భయంకరమైన రుగ్మతలకు లోనై, జీవితాన్ని మధ్యలోనే బలవంతంగా ముగించిన సందర్భాలను గమనించడం వలన, మీకు ఆ మార్గం పట్ల కొన్ని సందేహాలు, అనుమానాలు కలగవచ్చు. వారు రుగ్మతలకు గురైతే, అందుకు మూలకారణమేమిటి? ఇటువంటి అంశాలను శాస్త్రయుక్తంగానే ఈ సద్గురువు చెప్పదలుచుకున్నాడు. మానవజీవితంలో అత్యంత పరాకాష్ట స్థాయి ఋషితత్త్వం. ఋషి అంటే పరిపూర్ణుడు, త్రికాలజ్ఞుడు, సర్వజ్ఞుడు, సత్యదర్శకుడు, పరిపూర్ణ స్థితికి చేరి, సర్వం తెలిసి వుండి, మూడు కాలాలనూ అంచనా వేసే విధంగా సత్యదర్శనం గావించుకున్నవాడు. వీరు అందరికీ, అన్నింటికీ అతీతంగా ఉంటారు. వీరికి అసలు శరీరమే వుండదు. విశ్వశక్తిని ఆలంబనగా చేసుకొని, తమ దైనందిన కార్యక్రమాలను నిర్వహిస్తారు. వీరి ప్రతి ఆలోచన దివ్యత్వంగా, ప్రతిమాట మంత్రంగా, చేసే ప్రతిపని యజ్ఞంగా ఉంటుంది. ఇటువంటివారి ద్వారానే లోకకళ్యాణం సఫలీకృతమవుతుంది. విశ్వవ్యాపిత భావనలో జీవిస్తూ, సృష్టికి ప్రతిసృష్టిని చేయగలుగుతారు. అద్భుతాలను ప్రదర్శించగలుగుతారు. అయితే, అటువంటి స్థితికి చేరడం సామాన్యులకు సాధ్యమవుతుందా? ఎందుకంటే, విశ్వశక్తిని ఆలంబనగా చేసుకొని జీవించడమంటే అందుకు ఎన్నో జన్మలు అవసరమవుతాయి గదా! ఇది కొందరి మనసుల్లో ఉత్పన్నమయ్యే హేతుబద్ధమైన ప్రశ్న. అయితే, అందరూ గ్రహించవలసిన నగ్న సత్యమేమిటంటే, మానవమేధస్సుకు అసాధ్యమనేది లేదు. శాస్త్రీయపరమైన విధానాలను అనుసరించగలిగితే, అద్భుతమైన అనుభవాన్ని పొందవచ్చు.

**126) దానవత్వం అంటే ఏమిటి స్వామీ?**

మానవజీవితం నాలుగు అంతస్థుల్లో పనిచేస్తుంది. అవి, 1) దానవత్వం 2) మానవత్వం 3) మాధవత్వం 4) ఋషితత్త్వం.

1) దానవత్వం: ఇది పూర్తిగా మాంసాహార జంతుస్వభావం. అరిషడ్వర్గాలనబడే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు తారాస్థాయిలో ఉంటాయి. ఇతరులను హింసించే ధోరణి అధికంగా వుంటుంది. వీరి ఉనికి అందరికీ అసౌకర్యంగా వుంటుంది. శారీరక ఇంద్రియాలకే పరిమితమవుతారు. ప్రపంచం నుండి నాకేమిటి? అనే భావన ఎక్కువగా వుంటుంది. కామక్రోధాలు ప్రకోపించడం వలన అంతరంగంలో అశాంతి, అసంతృప్తి అధికంగా వుంటాయి. మూర్ఖత్వం, ఆవేశం, తొందరపాటు ఎక్కువగా వుంటాయి. తాము సమస్యల్లో ఉంటూ, ఇతరులకు సమస్యలను సృష్టిస్తూ వుంటారు. వినాశనాత్మక, విచ్ఛిన్నకర ధోరణి అధికంగా వుంటుంది. శారీరక సుఖం, ఇంద్రియాల వినోదమే జీవితలక్ష్యంగా ముందుకు సాగుతారు. అంతరంగమంతా తమో, రజోగుణాలతో కూడిన చెడు సంస్కారాలతో నిండి వుంటుంది. హత్యలు, నేరాలు, మానభంగాలు, రక్తపాతం, ఉద్యమాలు, విప్లవాలకు కారకులవుతారు. కామక్రోధాలు, రాగద్వేషాలు ఎక్కువగా ఉంటాయి. జీవితం అన్ని విధాలా పరిమితంగా వుంటుంది. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు అన్న చందాన ఏకపక్ష ధోరణిలో వుంటారు. జీవితాన్ని అన్ని విధాలా దుర్వినియోగ పరుచుకుంటారు. భయం, ఉద్రేకాల మధ్య జీవితం ఒడుదుడుకులతో కొనసాగుతుంది. వీరి ద్వారా సమాజంలో మనోకాలుష్యం అధికంగా తయారవుతుంది. వీరి సంఖ్య తక్కువైనా, సమాజంపై వీరి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వీరిది అతి హేయమైన దుర్మార్గపు జీవితం.

కలవడానికి, విడిపోవటానికి చూపించే తొందర
అర్థం చేసుకోవడానికి, దగ్గర అవడానికి చూపిస్తే ప్రతి బంధమూ అందంగానే ఉంటుంది.

***మీరు ఒక పది మాటలను పాటించండి***
***అప్పుడు మీ జీవితమే పదిలంగా ఉంటుంది***
***అవి పవనకుమారుడు బోధిస్తున్న ఆజ్ఞలుగా పాటించండి***
***సదా జీవితంలో వల్లెవేసుకోండి***
***నిన్న చెప్పిన మాట "నేనెవరు" సదా మరచిపోకండి***
***మనము, మేము అంటూ అందరినీ కలుపుకోండి***
***అంతేకాదు, అహం అనే పదాన్ని అంతమొందించండి***
***ఇవి అన్నీ అంతమొందించాక, అక్కడొక పుష్పం వికసిస్తుంది***
***అదే ప్రేమ. ఆ ప్రేమను అందరితో పంచుకోండి***
***ఆ ప్రేమపుష్పానికి ఒక సుగంధముంటుంది***
***ఆ సుగంధమే మీ నుండి ఉద్భవించే నవ్వు***
***ఆ నవ్వు నిన్ను నలుగురిలోకి ఆహ్వానిస్తుంది***
***నవ్వుతూ నవ్వుతూ కూడా తప్పు మాట్లాడకండి***
***ఎందుకంటే, నలుగురిలో తప్పుడువాడవవుతావు***
***సద్గుణాలను ఆచరించడంలో నిన్ను మించిన వాడు లేడనుచూ***
***సదా విజయం వరించాలి, నీవు వర్ధిల్లాలి***
***వీటితో ప్రక్కనే వుండే ఈర్ష్యను గుర్తించండి***
***అది మిత్రుడు కాదు, శత్రువు***
***కావున, దూరంగా ఉంచండి***
***వీటిని గుర్తించటానికి విజ్ఞానం***
***అనే మిత్రుడి సహాయంతో***
***అడుగు ముందుకు వేసి, సద్గురువు ఆంజనేయుడు***
***ఇస్తున్న వరాలతో మనుషుల్ని దగ్గర చేసుకుని***
***జీవించినట్లయితే, మీరే ఋషులు***
***మహామనుషులు, మనీషిలుగా మారుతారనేది తథ్యము***
***తథ్యము తథ్యము తథ్యము***
***నవజీవన రహస్యాలు***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా అందుకోండి!***

అకస్మాదేవ కుప్యన్తి ప్రసీదన్త్య నిమిత్తతః ।
శీలమే తద సాధూనా మభ్రం పారిప్లవం యథా ॥

దుష్టుల స్వభావం చంచలమైన మేఘం వంటిది. వారు అకస్మాత్తుగా కోపించుచుందురు. కారణం లేకనే ప్రసన్నులగుచుందురు.

ॐ

**15-10-2020** 09:05 AM

**127) మానవత్వం అంటే ఏమిటి స్వామీ?**

మానవత్వమే మనిషి సహజ స్వభావం. మానవుడంటే మానవత్వానికి ప్రతిరూపమే. మానవుడు ఉష్ణరక్తపు స్వభావమందలి సకశేరుక శాకాహారి. కాఠిన్యం, కఠోరం అనే అంశాలకు అవకాశం ఉండకూడదు. పరిణామక్రమంలో మానవుడు స్వేచ్ఛాయుత సంచార జీవనానికి స్వస్తిపలికి, స్థిరనివాసానికి మారి, కుటుంబవ్యవస్థ ఆవిర్భవించి, కుటుంబసభ్యుల మధ్య మోహబంధాలు బలోపేతమై, మనుగడ కోసం సాగుతున్న పోరాటంలో మానవునిలో దానవత్వం ఆవశ్యకతను సంతరించుకుంటోంది. మానవత్వంతో జీవించే వ్యక్తులలో హృదయమట్టం వికసిస్తుంది. కరుణ, జాలి, దయ, ప్రేమ, అనురాగం, ఆప్యాయత వంటి విశిష్ఠమైన లక్షణాలుంటాయి. దానవత్వాన్ని ఛేదించుకోగలిగితేనే మానవత్వం వెల్లివిరుస్తుంది. అంతరంగంలో సేవాతత్పరత ఉంటుంది. ఇతరులకు సహాయం చేయాలనే భావన కలుగుతుంది. వాస్తవానికి మానవత్వాన్ని మించిన మహోన్నత సంపద మరొకటి ఏముంటుంది? ఎవరిలోనైతే ప్రజ్ఞ కుదించుకుని, మానవత్వం వికటిస్తుందో, వారిలో దానవత్వం ప్రకోపిస్తుంది. ప్రస్తుతం మానవాళి జీవన విధానమంతా భౌతిక అవసరాలను సమకూర్చుకోవడంలో నిమగ్నమైనందువలన, అరిషడ్వర్గాలు ప్రకోపించి, మానవత్వం కనుమరుగైపోతోంది. వాస్తవానికి మానవత్వం లేకుండా దివ్యత్వానికి అవకాశమే ఉండదు.

**128) మాధవత్వం అంటే ఏమిటి స్వామీ?**

మానవత్వం యొక్క తదుపరి స్థాయే మాధవత్వం. మానవత్వంలో పూర్తిగా విజయవంతమైతేనే, దివ్యత్వం వెలుగులోకి వస్తుంది. మానవత్వంతో జీవించే వ్యక్తిలో అహంకారం తక్కువగా వుంటుంది. ప్రజాసంబంధాలలో విజయవంతమవుతారు. హృదయమట్టం వికసించి ఉన్నతమైన లక్షనాలు ఏర్పడుతాయి. విచక్షణ, వివేకం వంటి ఉత్తమమైన ఆలోచనా విధానంతో బుద్ధిమట్టం వికసించి, దివ్యత్వం వైపుకు పయనించడం జరుగుతుంది. నైతిక విలువలతో, సమాజంపై పూర్తి పట్టు లభిస్తుంది. వేలాదిమంది హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతారు. ప్రపంచంచే పూజలందుకునే అర్హతను పెంపొందించుకుంటారు. మరణించిన తదుపరి కూడా వీరి ప్రభావం అలాగే వుంటుంది. జీవించి ఉన్నప్పుడు కొన్ని ప్రాంతాలకే పరిమితమైన వీరు, మరణించిన తదుపరి, చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయి, కోట్లాదిమందిచే ఆరాధించబడతారు. వీరి జీవితానికి నూటికి నూరుశాతం సార్ధకత చేకూరుతుంది. వీరి ఉనికి కోట్లాదిమందిని ప్రభావితం చేయగలుగుతుంది. ఆదర్శవంతమైన జీవనవిధానంతో జీవితాన్ని ప్రపంచానికి అంకితం చేస్తారు.

**129) ఋషితత్త్వం అంటే ఏమిటి స్వామీ?**

మాధవత్వం యొక్క తదుపరి స్థితే అవధూతగా మారడం. వీరు అన్నింటికీ, అందరికీ అతీతంగా వుంటారు. ప్రజాసంబంధాల నుండి పూర్తిగా విడుదలవుతారు. ప్రకృతితో కలిసిపోయి, దానికి అనుగుణమైన జీవనవిధానంలో జీవిస్తారు. "నేను ప్రకృతిలో ఒక భాగమే. దాని నుండి నేను వేరుకాదు" అనే భావనలో ఉంటూ, శారీరక స్పృహ లేకుండా, శరీరాన్ని పూర్తిగా వదిలివేసి, జయించి, ఆహారం, నిద్ర, స్నానం, విశ్రాంతి వంటివి అవసరం లేకుండా జీవించగలుగుతారు. మాటలను వదిలివేసి, సంపూర్ణమౌనాన్ని పాటిస్తారు. ప్రజలచే ఆరాధించబడతారు. కానీ, దానికి ఎటువంటి ప్రాధాన్యతను ఇవ్వరు. వీరు నివసించే ప్రాంతాలు శక్తిస్థావరాలై, పవిత్రంగా ఉంటాయి. మౌనం ద్వారానే సందేశాలిస్తారు. కర్మరాహిత్యం, నైష్కర్మ్యస్థితిలో జీవిస్తూ, ఆత్మకు చేరువవుతారు. అన్నీ తెలిసినా, అమాయకపు స్థితిలో ఉంటారు. చుట్టూ జరిగే విషయాలపట్ల చర్య–ప్రతిచర్యలు, స్పందన–ప్రతిస్పందనలు ఉండవు. ఒంటరితనం, మౌనం, ఏకాంతాలే వీరి ప్రధాన లక్షణాలు. "నేను ఫలానా" అనే పరిమిత స్థితి నుండి, "నేను ఏమీ కాను" అని శూన్యం నుండి, "నేనే సర్వస్వం, అంతటా నేనే" అనే భావనలో జీవించడమే పరిపూర్ణ జీవితమవుతుంది. దానినే ఋషితత్త్వం అంటారు. వీరికి విశ్వమే శరీరమవుతుంది. విశ్వశక్తిని ఆలంబనగా చేసికొని, లోకకళ్యాణం కోసం తమ ప్రణాళికలను రూపొందించుకుంటారు. శూన్యం నుండి తమ దైనందిన కార్యక్రమాలను కొనసాగిస్తూ వుంటారు. కాబట్టి, "నేను చేస్తున్నాను" అనే భావన వుండదు. సంకల్పము, క్రియ ఒకేసారి జరుగుతాయి. విశ్వసంకల్పాలకు అనుగుణంగా సృష్టిని చేయగలుగుతారు. సిద్ధులను ప్రదర్శించే సిద్ధపురుషులవుతారు. వీరికి అసలు శరీరమే లేదు అనే భావన వుంటుంది. కాబట్టి సమాజం, ప్రపంచం, ప్రకృతిలను గురించిన ఆలోచనలు ఉండవు. విశ్వశక్తి పుష్కలంగా ఉంటుంది కాబట్టి శరీరం ధృఢంగా, ఆరోగ్యంగా వుంటుంది. ధైర్యం, ఆత్మవిశ్వాసం, సంకల్పబలం, వాక్శుద్ధి వంటి విశిష్టమైన లక్షణాలతో ప్రపంచాన్ని సమ్మోహితం చేస్తారు. పంచభూతాలను, ప్రకృతిని సైతం శాసించగలుగుతారు. వీరు సామాన్యులకు అందని కార్యక్రమాలను చేపట్టి, వానిని సునాయాసంగా నెరవేర్చగలుగుతారు. వీరి అంతరంగాన్ని అంచనా వెయ్యడం సాధ్యం కానేకాదు. ఆత్మస్థితి నుండి తమ దైనందిన కార్యక్రమాలను కొనసాగిస్తారు. అదే స్థితి నుండి విశ్వమంతటినీ దర్శించగలుగుతారు. భాషకు, వర్ణనకు, వివరణకు అందని స్థాయిలో ఉంటారు. వందల సంవత్సరాలు తేజస్సుగా, చైతన్యవంతంగా, చురుకుగా జీవించగలుగుతారు. వీరిది అసాధారణ స్థితి. ఆది–అంతాలు, పుట్టుక–మరణాలు లేని అనంతస్థితి అనుభవించగలుగుతారు. తమ ఇచ్ఛ ప్రకారమే దేహత్యాగం చేస్తారు. ఇదే మానవజీవితంలో అత్యంత ఉన్నతస్థితి. పరిపూర్ణత్వాన్ని ప్రయోగపూర్వకంగా అనుభవించగలుగుతారు. ప్రపంచానికి, ప్రకృతికి అతీతంగా జీవించగలుగుతారు. ప్రపంచానికి తల్లిగా, తండ్రిగా ఉంటారు. ఆనందాన్ని ప్రయోగపూర్వకంగా అనుభవిస్తారు. తన నుంచే ఈ చరాచర జగత్తు ఆవిర్భవించి తిరిగి మరలా తనలోనికే లయం చెందుతుందనే పరబ్రహ్మతత్త్వంలో ఉంటారు. సృష్టికర్తగా తమ జీవితాన్ని మలచుకుంటారు. అనుభవసారాన్ని అనుభవిస్తారు తప్ప, సిద్ధాంతానికి అతిగా ప్రాధాన్యతనివ్వరు. బోధనలకన్నా, ఆచరణకు ప్రాధాన్యతనిస్తారు. విశ్వమందలి సూక్ష్మశరీరాలను, వాసనాబీజాలను సైతం చూడగలుగుతారు. వానిని నియంత్రించగలుగుతారు. విరు

ఎటువంటి సాధనలు చెయ్యరు. జీవితాన్నే సాధనగా మలచుకుంటారు. శరీరం నుండి విడివడి, భూమండలమంతటా పరిభ్రమిస్తారు. ద్వంద్వాలకు అతీతంగా ఏకత్వాన్ని ప్రదర్శిస్తారు. అపారమైన నిగ్రహం ఉంటుంది. ఇంద్రియదృష్టి వుండదు. అతీంద్రియ ఆత్మదృష్టి మాత్రమే వుంటుంది.

**వసనస్యేవ ఛిద్రాణి సాధూనాం వివృణోతియః ।**
**అపశ్యాన్నాత్మనో దోషాన్ సపాపః ప్రేత్య నశ్యతి ॥**

ఎవడు తన తప్పులను గుర్తించక, ఎల్లప్పుడూ సజ్జనుల దోషాలను వస్త్రంలోని రంధ్రాల మాదిరిగా కొండంతలుగా చేస్తాడో, అట్టి పాపి మరణానంతరం పరలోకంలో దుఃఖాన్ని పొందుతాడు.

అతిగా అరవటం వల్ల మాట విలువ,
అతిగా ఏడ్వటం వల్ల కన్నీటి విలువ తగ్గుతాయి

***చిరునవ్వుల చిరుజల్లులు***
***సిరిమువ్వల సిరిమల్లెలను కురిపిస్తుంది***
***అంతేకాదు, చిరునవ్వు ఎన్నో సమస్యలను తీరుస్తుంది***
***చిరుదరహాసం మంచి స్నేహాన్నందిస్తుంది***
***చెలిమిని, కలిమిని, బలిమిని పెంచి***
***కొండంత అండనిస్తుంది ఈ చెలిమి***
***అలాంటి చిరునగవే నీ చిరునామా కావాలి***
***చిరునగవే చింతయన్నది దరిచేరకుండా చూస్తుంది***
***దీనితో చిరాకులు పరాకులు తొలగిపోయి***
***చిన్నాపెద్దా భావాలు, వినయ వినమ్రతలు నిన్ను చేరి***
***మనశ్శాంతితో బ్రతికేటట్లు చేసి***
***మంచి ఆరోగ్యాన్ని అందుకునేలా సహాయకారి అవుతుంది.***
***అట్టి సహాయకారిని మరువకు***
***మీ దరహాసాన్ని మరువకండి***
***మీ చిరునవ్వులు సిరులు పండిస్తుంది***
***ఈ చిరంజీవి బోధలు ఆశ్రయించుకుని***
***చిరు చిరునవ్వులతో చిందులేస్తూ***
***మారుతి మాటలకు ముసిముసినవ్వులు***
***మురిపెముతో ముద్దుముద్దుల మాటలు***
***అడుగులేస్తూ, ఆచరణ చూపిస్తూ, నా ముచ్చటను తీర్చండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**16-10-2020** 09:45 AM

**130) ఋషితత్త్వాన్ని అందుకోవడం ఎలా స్వామీ?**

*ఋషితత్త్వం ప్రపంచ మానవజాతికే ఆదర్శం. దానిని అందుకుని అనుభవించే వ్యక్తి జీవితం పరిపూర్ణమైనట్లే. "నేను భగవంతుడను" అనే అంశాన్ని అనుభవంలోకి పొందగలిగితేనే జీవుడు పరమాత్మలో ఐక్యం చెందుతాడు. వేదాంత పరిభాషలో దానినే ముక్తి లేక మోక్షం అంటారు. అందుకు పూర్వజన్మ సుకృతం ఎంత ముఖ్యమో, స్వయంకృషి కూడా అంతే అవసరం. కృషి ఉంటే మనుషులు ఋషులౌతారు అనేది నగ్నసత్యం. కృషి చేసే ప్రతి మనిషీ ఋషే. కృషి లేకుండా ఫలితాన్ని ఆశించడం స్వార్ధమవుతుంది. కృషిని బట్టే ఫలితముంటుంది. మానవజీవితం జీవభావంతో మొదలవుతుంది. దానిని కరగించుకోవడం కోసమే, జన్మ యొక్క అవసరం ఏర్పడుతుంది. అందుకు మీరు సద్గురువుచే బోధించబడుతున్న బోధలను విని, సశాస్త్రీయంగా, సాంకేతిక పంథాను అనుసరించగలగాలి. జీవభావం అంటే, ప్రపంచంతో ఉన్న సంబంధం – అది లేకపోతే, ఇక ప్రపంచం లేనట్లే! అంతా భగవంతుని మాయయే. అందుకు మీరు మూడింటినీ కరగించుకోవాలి.*

*1) శరీరం: "శరీరమాద్యం ఖలుధర్మ సాధనమ్" తెలిసిందే గదా! జీవభావాన్ని సమూలంగా కరగించుకోవడం కోసం ఎటువంటి శరీరం అవసరమవుతుందో అటువంటి శరీరాన్ని తయారుచేసుకుంటుంది. కర్మలు కరగిపోవాలంటే, తప్పక కర్మలను ఆచరించవలసిందే. అందుకు శరీరం తప్పక ఆరోగ్యంగా ఉండాలి. శరీరం ఆరోగ్యంగా ఉన్నప్పుడే దానిని మీరు మరచిపోగలుగుతారు, వదిలివేయగలుగుతారు. ఆరోగ్యవంతమైన శరీరం మానసిక ప్రశాంతతకు ప్రత్యక్ష నిదర్శనమవుతుంది. మీరు దేహాన్ని పైనుండి క్రిందికి సూక్ష్మంగా పరిశీలించినట్లయితే, అది పంచభూతాత్మకమై నిరంతరం మార్పులకు లోనవుతూ వుంటుంది. అయితే, మారేది ఏదైనా మాయకు ప్రతిరూపమే. శరీరాన్ని సూక్ష్మంగా విభజించుకుంటూపోతే, అంతిమంగా రేణువులతో కూడిన పరమాణువులు కనిపిస్తాయి. అటువంటి రేణువులన్నీ ప్రాణశక్తి ఘనీభవం చెందటం ద్వారా ఉత్పన్నమవుతాయి. ఎవరైతే సూక్ష్మంలో జీవిస్తారో వారికి అంతా ప్రాణశక్తిమయంగా గోచరిస్తుంది. అటువంటి ప్రాణశక్తికి ఆధారం శుద్ధచైతన్యమే. అంటే శాస్త్రీయ పంథాలో విశ్లేషించుకోగలిగితే, అసలు దేహమనేది లేదు. అంతా శుద్ధచైతన్యమయమే. ఎవరైతే దీనిని గురించి శాస్త్రీయ పంథాలో అవగాహన గావించుకుంటారో, వారికి శరీరమనేది లేదు, ఉండదు. దానిపట్ల ఎటువంటి మమకారం ఉండదు. అసలు శరీరమే లేని స్థితి సంపూర్ణస్వేచ్ఛ అవుతుంది. జీవుడు శరీరానికి బలంగా అతుక్కుంటే, కలిసిపోతే, మోహమున్నట్లే. జీవభావం కరగిపోయే కొలది సూక్ష్మశరీరంతో స్థూలశరీరాన్ని ఆపాదమస్తకం దర్శించవచ్చు. అప్పుడు శరీరమంతా కరిగిపోతుంది. శరీరం కరిగిపోవటం అంటే ఆత్మకు చేరువకావడమే. శారీరక మమకారముంటే, ఆత్మకు సంబంధించిన అవగాహన ఉండదు. అందువలన, శరీరాన్ని సమూలంగా కరగించివేసే విధానాలను అనుసరించగలగాలి.*

*2) మెదడును కరగించాలి: మానవజీవితంలో, జీవనవిధానంలో శరీరాన్ని నడిపించడంలో, దానిని*

ఆరోగ్యంగా ఉంచడంలో మెదడు ప్రముఖపాత్ర పోషిస్తుంది. మానవదేహమంతటిలో నాడీవ్యవస్థ ప్రత్యేకమైనది. అది కేంద్ర నాడీవ్యవస్థ, పరిధీయ నాడీవ్యవస్థ, స్వయంచోధిత నాడీవ్యవస్థ అనే మూడు భాగాలుగా విభజించబడి వుంటుంది. ఆ మూడింటిలో కూడా కేంద్ర నాడీవ్యవస్థ చాలా కీలకమైనది. అది మెదడు వెన్నుబాములతో కూడి వుంటుంది. ఇది ఒకవైపు శరీర అవయవాలతోనూ, మరొకవైపు పరిసరాలతోనూ ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి వుంటుంది. ప్రపంచ సమాచారం జ్ఞానేంద్రియాల ద్వారా లోపలకు ప్రవేశించడం, అంతరంగ సంస్కారాల ప్రేరణతో వాసనాబీజాలు బయటకు వెళ్ళడం జరుగుతుంది. అది నిరంతరాయంగా పనిచేస్తూనే వుంటుంది. వాస్తవ విషయమేమిటంటే, శరీరంలో ఎన్ని అవయవాలుంటాయో, వానిని నియంత్రించే అన్ని కేంద్రాలూ మెదడులో ఉంటాయి. కేంద్రం సక్రమంగా పనిచేస్తే, తదనుగుణమైన అవయవం ఆరోగ్యంగా ఉంటుంది. కేంద్రం చెడిపోతే, దానికి సంబంధించిన అవయవం రుగ్మతలకు గురి అవుతుంది. శరీరం కరిగిపోయిందంటే, తదనుగుణమైన కేంద్రం కరిగిపోతుంది. ఎవరైతే, బాహ్యప్రపంచపు సమాచారాన్ని అతిగా స్వీకరిస్తారో, వారి అంతరంగం లోనికి ఆ కలుషితం ప్రవేశించి కేంద్రాలను బలహీనపరుస్తుంది. అసలు బాహ్యప్రపంచపు సమాచారం లోనికి ప్రవేశించకుండా ఉండాలంటే, అంతరంగ సంస్కారాలు సమూలంగా శుద్ధిగావించుకోబడాలి. శరీరం కరిగిపోతే, అంతా ఏకత్వమని తెలుసుకొని, అనుభవంలోకి పొందగలిగితే, మెదడు కూడా సమూలంగా కరిగిపోతుంది. మెదడు కరిగిపోతే శరీరం కూడా కరిగిపోయినట్లే. దానినే "నేను ఏమీ కాదు" అనే స్థితి అంటారు.

3) మనస్సు: శరీరాన్ని నియంత్రించేది మెదడైతే, ఆ మెదడును నియంత్రించేది మనస్సు. మనసు అనేది మానవజీవితంలో కీలకపాత్ర పోషిస్తుంది. మరొకరకంగా వివరించాలంటే, శరీరానికి – ఆత్మకు మధ్య అడ్డుగోడవలే ఉంటుంది. శరీరం కరిగిపోతే, ఆత్మకు చేరువైనట్లే. అలా జరగకుండా అవరోధం కలిగించేది మనసే. మనసనేది లేకపోతే, మోహబంధాలు తొలగిపోయినట్లే. మనిషికి మనసు ఎంత అవసరమో అంత ప్రమాదకరం. అది మనిషిని భౌతిక ప్రపంచంలో బంధిస్తుంది. వాస్తవానికి మనసే భౌతికప్రపంచాన్ని సృష్టిస్తుంది. అటువంటి భౌతికప్రపంచం కరిగిపోతే, ఇక మనసుకు అవకాశమే వుండదు. అందుకు మీరు అంతరంగ సంస్కారాలను సమూలంగా కరిగించుకోగలగాలి. అంతరంగం శుద్ధి అయితే, బాహ్యప్రపంచంతో ఎటువంటి ఘర్షణా వుండదు. అందువలన, మనసును బలోపేతం చేయకూడదు. దానిని విస్తరింపచేసి, ఆత్మకు చేరువకావాలి, కాగలగాలి. వాస్తవానికి మనసు విస్తరించే కొలదీ అది ఆత్మగా రూపాంతరం చెందుతుంది. మేధస్సుకు–మనసుకు మధ్య ప్రత్యక్ష సంబంధముంటుంది. మనసనేది మేధస్సులో ఒక భాగం. మేధస్సు అనేది నాలుగు అంతస్థుల సమ్మేళనం. అవి, 1) చేతన మనసు 2) ఉపచేతన మనసు 3) అంతఃచేతన మనసు 4) అధిచేతన మనసు. ప్రాపంచిక సమాచారం మెదడుకు చేరడమంటే, అందులో కీలకమైనది మనసే కదా! చేతన మనసు ఇంద్రియాలతో, ఉపచేతన మనసు గతంతో, అంతఃచేతన మనసు అతీంద్రియ శక్తులతో కూడి వుంటుంది. అధిచేతన మనసు మాత్రం స్వచ్ఛంగా ఆత్మతో అనుసంధానమై వుంటుంది. ఈ నాలుగింటిలో కూడా ఉపచేతన మనసు చాలా కీలకమైనది. అదే చెడుసంస్కారాలకు నిలయమవుతుంది. దానిని సమూలంగా శుద్ధి గావించగలిగితే, మిగిలిన మూడూ చైతన్యవంతంగా పనిచేస్తాయి.

**అద్యాపి నోజ్ఝతి కిల కాలకూటమ్**
**కూర్మోభి భక్తి ధరణీం ఖలు పృష్ఠభాగే ।**
**అమ్భోనిధి ద్వహతి దుస్తర బాడబాగ్నిమ్**
**అఙ్గీకృతం సుకృతినః పరిపాలయన్తి ॥**

ఈశ్వరుడు లోకక్షేమం కోరి నేటికినీ కాలకూట విషమును తన కంఠమందే ఉంచుకొనెను గానీ, విడువలేదు. విష్ణువు తాబేలై భూభారమంతయు, తన మూపుపై మోయుచున్నాడు. సముద్రుడు లోకముల తల్లడిల్లజేయు బడబాగ్నిని ధరించినాడు. మహాపురుషులు లోకక్షేమమునాశించి ఎన్ని కష్టములు వచ్చిననూ తానంగీకరించిన పనిని సాధింతురు.

సద్గురువు సన్నిధి అంటే అమ్మవడి చేరిన బిడ్డలుగా సురక్షితంగా ఉండాలి. పాము నీడన చేరిన కప్పల బ్రతుకు కాకూడదు.

***కోటి దీపాలతో కొలువున్న స్వామీ! గుండె గూటిలోన నిలువలేవా? అని అడుగలేరా?***
***కోటి పుష్పాలతో కూర్చున్నవాడు హృదయపీఠముపైన కూర్చోనలేడా? అని***
***కోటి జీవులను కాపాడెడివాడు, ఈ దీనజనులపై కరుణ, జాలి చూపి బ్రోవగారావా? అని***
***కోటి జల బిందువుల కాంతితో నా శ్వాసవై కదలాడియుండలేవా? అని***
***కోటి ఐశ్వర్యాలు కుమ్మరించు స్వామీ!***
***కూడు గుడ్డ గూడు నీయలేవా?***
***నా అజ్ఞానాన్ని మన్నించు స్వామీ! అని***
***కోటి పూజలు గొన్న గొప్ప జ్ఞాననిధిని నీవు అని***
***నా చిరుపూజ మెచ్చి, కోటివిద్యల వేల్పు వెలుగువౌ నిన్ను***
***జపము తపము ధ్యానములతో నా జాడ తెలుసుకొను ప్రయత్నము***
***నీవు ఆరంభించినచో, నా వంతైన యజ్ఞయాగాది క్రతువులొనర్చిన మిమ్ము***
***సత్కర్మల్లో క్రీడించు మిమ్ము, నిష్కామ సేవతో ఈ నిరంజనుని పట్టుకొని***
***పవనసుతుని పాదాలు పట్టిన మిమ్ము పాలించకుండా ఎలా ఉండుదు నా చిన్నారి బిడ్డలారా?***
***దుర్లభుడనుటకు సులభముగా చిక్కితినే కానీ,***
***ఈ చిరంజీవి సాక్షిస్వరూపుడిగా సాక్షాత్ మీ ముందు నిలచిన***
***ఈ నిరుపమాన నిర్వికార నిరంజనుడు***
***ఈ చిన్నారి ముద్దు బిడ్డలకై పరిగెత్తిన వైనం***
***మాటమాటకూ జ్ఞానభోజనం ముద్దలుగా చేసి***
***దానిని ముద్దుతో అందిస్తున్నాడు***
***మాటల ముద్దులను అందిస్తున్నాడు మారుతి తన చిన్నారి ముద్దుబిడ్డలకు***
***అందుకే ఈ సంబోధన***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**17-10-2020** 09:15 AM

**131) చెడు సంస్కారాలను ఏ విధంగా తొలగించుకోవచ్చు స్వామీ?**

*భూమండలమంతటిలో జ్ఞానాన్ని నిక్షిప్తం చేసుకోగలిగిన ఒకే ఒక జాతి మానవుడు. అయితే, దాని వలన ఉపచేతన మనసు కలుషితం కాకూడదు. అదే జరిగితే, శరీరమందలి అనియంత్రిత అవయవాలు రుగ్మతలకు గురై, జీవితకాలం కుదించబడే అవకాశముంటుంది. శరీరం బలహీనంగా వుంటే, జీవనయానం కుంటుపడుతుంది. అందువలన, ఉపచేతన మనసునందలి చెడు సంస్కారాల మాలిన్యాన్ని సమూలంగా తొలగించుకోవాలంటే, ఆత్మజ్ఞానమొక్కటే శరణ్యం. అజ్ఞానమనే అంధకారం ఆత్మజ్ఞానమనే వెలుగుతో తొలగిపోతుంది. చెడు సంస్కారాల మాలిన్యం తొలగిపోవటానికి, ద్వంద్వాలను కరిగించివేయగల పూర్ణజ్ఞానం తప్పనిసరి. దానిని ముందు సశాస్త్రీయపంథాలో, సద్గురువుల బోధలతో అవగాహన గావించుకొని, ఆ తదుపరి అనుభవంలోనికి పొందగలిగితే చాలు. "జ్ఞానాగ్నిదగ్ధ కర్మాణమ్" అన్నట్లు, ఆత్మజ్ఞానమనే అగ్నిలో అన్ని సంస్కారాలు సమూలంగా కరిగిపోతాయి. సంస్కారశుద్ధి జరిగితే చేతన, ఉపచేతన, అంతఃచేతన మనసులు కరిగిపోతాయి. అట్టి స్థితిలో అధిచేతన మనసు చైతన్యవంతమవుతుంది. విశ్వవ్యాపిత భావన కలగడమే గాక, శరీరమంతా విశ్వశక్తితో పూరించబడుతుంది. అదే ఋషితత్త్వం. దానిని అనుభవంలోనికి పొందడమే మానవజీవిత పరమార్థం.*

***న తన్మిత్రం యస్య కోపాద్ బిభేతి***
***యద్ వా మిత్రం శంకితే నోప చర్యం ।***
***యస్మిన్ మిత్రే పితరీ నాశ్వ సీత***
***తద్వై మిత్రం సంగతా నీతరాణి ॥***

ఎవడి కోపము వలన భయపడవలసి వచ్చునో, వాడు మిత్రుడు కాజాలడు. ఎవడిని శంకతో కూడిన మనస్సుతో చేరవలసియుండునో, వాడు మిత్రుడు కాదు. ఎవడు తండ్రివలె విశ్వసింపగలిగినవాడో, వాడే మిత్రుడు. ఇతరులు పరిచితులు మాత్రమే.

***ముగ్ధమోహన మోము నిచ్చిన ఆ భగవంతుడిని***
***ముదమారా గనుచూ మీ జన్మధన్యంబు చేసుకోండి***
***మీరు కోరిన భగవంతుడు మీ సన్నిధికే ఏతెంచుచున్నాడు***
***మందస్మిత గంధమాస్వాదనము చేయుచున్నారు***
***నిరంతరం దానితో భావశుద్ధి కలిగి, బంధముల నుండి విడిపడండి***
***మీ పాపదోషములన్నీ పారిపోవును***
***ప్రణవనాదంలోని మాధుర్యం విన్నచో***
***ఆ స్మరణ వైభవం ఎంతో అనుభవములోనికి వచ్చి***
***మాయ చూర్ణము కాగా మోహమంతయు అంతముకాగా,***

***అభయహస్తము నందించిన ఈ ఆంజనేయుడు మోహమణగద్రొక్కు***
***మురిపాల పాదాలు మీ ఎడ చెప్పలేని, వర్ణించలేని ప్రేమతో అందించాడు***
***సర్వరూపాల వాడయిన భగవంతుని***
***సర్వతీర్థాల వాడయిన భగవంతుని***
***సర్వలోకాల వాడయిన భగవంతుని***
***సర్వమూ తానైన భగవంతుని***
***తలదాల్చి, శరణమనుచూ వందనాలర్పించి, ఆత్మశాంతిని పొంది***
***ముదమార కాషాయవస్త్రము ధరించి***
***వైకుంఠ శోభను గని, మీరనుభవించునది కైవల్యము అని గ్రహించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

నిన్న జరిగినదాన్ని మార్చలేరు. రేపటి గురించి తెలియదు.
ఏం చెయ్యాలనుకున్నా ఈ రోజే, ఇప్పుడే చెయ్యాలి.
గతం నీ చేతిలో లేదు కానీ, భవిష్యత్తు నీ గుప్పిట్లోనే ఉంది

ॐ

**18-10-2020** 11:20 AM

ఒకప్పుడు పాశుపతాస్త్రం పొందగోరి అర్జునుడు పరమశివుడ్ని గూర్చి తపస్సు చేయాలని నిశ్చయించుకున్నాడు. అందునిమిత్తం ఒంటరిగా రథంలో బయలుదేరిన అతడు, అరణ్యమార్గంలో అనేక మృగాలను వేటాడుతూ ఒక పగటివేళ రామేశ్వరం చేరుకున్నాడు. అక్కడ అతడు సముద్రస్నానం చేసి, 'మధ్యాహ్నికం' నిర్వర్తించాడు. ఆ తర్వాత గర్వంతో రథాన్ని సముద్రతీరంలో అటూ ఇటూ సమధికోత్సాహంతో వేగంగా నడిపించాడు. అప్పుడు అక్కడ అరణ్యంలోని కొండ మీద శ్రీరామభక్త హనుమాన్ తపస్సు చేసుకుంటున్నాడు. ఇక్కడ నన్ను నేను పేరుపెట్టి సంబోధించుకుంటున్నాను. రామ రామ రామ అంటూ జపంలో లయించిపోయి ఉన్న నన్ను అంటే, ఆంజనేయుడ్ని అర్జునుడు యాదృచ్ఛికంగా అక్కడ చూశాడు. నన్ను చూచి గర్వంతో అర్జునుడు, "ఏయ్ ముసలి కోతీ! నువ్వు ఎవరు? నీ పేరేమిటి?" అని గద్దిస్తూ అడిగాడు. అందుకు నేను నవ్వుతూ ప్రశాంతంగా "శ్రీరాముడు బండరాళ్ళతో సేతువు నిర్మించి, లంకకు వెళ్ళి రావణుడ్ని సంహరించాడు. అంతటి కీర్తిమంతుడైన శ్రీరామునికి దాసుడ్ని నేను. నన్ను హనుమంతుడని, వాయుపుత్రుడని పేర్కొంటారు" అని చెప్పాను. నేను శ్రీరాముని ఆ విధంగా ప్రశంసిస్తూ చెప్పడం విన్న అర్జునుడికి నవ్వాగలేదు. అతడు పరిహాసంగా, "ఓ వానరమా! నీ రాముడు పరాక్రమవంతుడై ఉండివుంటే, సముద్రం మీద సేతువు నిర్మించే కార్యానికి అనవసరంగా ఎందుకు ఉపక్రమించాడు? ఆయన నిజంగానే మేటి విలుకాడు అయినచో, తన బాణాలతోనే వంతెన నిర్మించి, ఆ కార్యాన్ని స్వయంగా తానే పూర్తిచేసి ఉండకూడదా?" అంటూ అహంకారంగా ప్రశ్నించాడు.

అంతదాకా ప్రశాంతంగా వున్న నాకు, అర్జునుడు రాముని గూర్చి అమర్యాదగా మాట్లాడటంతో, ఆగ్రహం ముంచుకొచ్చింది. తనను అమర్యాదగా మాట్లాడి వుంటే కూడా నేను సహించి ఉండేవాడ్ని. శ్రీరాముని ఒకడు పరిహసిస్తూ మాట్లాడితే నేను ఎలా సహనం వహించి ఉండగలనూ? అందుకే నేను కోపోద్రేకంతో, "అర్జునా! బాణాలచే వారధి నిర్మిస్తే నావంటి వానర సైన్యంలోని బలిష్టమైనవారి కారణంగా ఆ వారధి సముద్రంలో మునిగిపోతుందని, రాముడు బాణాలచే వారధి నిర్మించలేదు. నువ్వు నా రాముని కన్నా గొప్ప విలుకాడవా?" అని అడిగాను. "విల్లుకు విజయుడు" అనే ఖ్యాతి అర్జునుడికి ఉంది గదా. దాంతో అతడు అహంకారంతో "ఆంజనేయా! బాణాలచే నిర్మితమైన వారధి కోతుల భారంతో సముద్రంలో మునిగిపోతే, ఇక విలుకాని విలువిద్యకు ఏం మహత్యముంటుంది? నేను ఇప్పుడే నువ్వు చూస్తూ వుండగానే నీ కళ్ళ ముందే, బాణాలచే అద్భుతమైన వారధిని నిర్మిస్తాను. నువ్వు దానిపైకెక్కి నిలబడి నీ ఇష్టం వచ్చినట్లు ఎంతసేపైనా గంతులు వెయ్యి. తరువాత నేను నీ రాముని కన్నా గొప్ప విలువిద్యాపారంగతుణ్ణా కాదా అని నువ్వే తెలుసుకో" అని పలికాడు. అప్పుడు నేను, "రామా! నేను నీ దాసుడ్ని. నన్ను నీవు ఎలాగైనా చేసుకో" అని మనసులో ప్రార్థించాను. తరువాత "రామ్ రామ్" అంటూ అర్జునుడు సముద్రం మీద నూరు యోజనాల దూరానికి నిర్మించిన బాణవారధి పైకి ఎక్కకుండానే నా కాలిబొటన వ్రేలితో ఒక మూల అదిమి నొక్కానంతే! మరుక్షణమే నేను ఆ విధంగా చెయ్యాలి అని కాచుకున్నట్లుగా, ఆ వారధి కుప్పకూలి, వారధి ఉండేదనే ఆనవాలే లేకుండా సముద్రంలో మునిగిపోయింది. పిల్లలు అట్టలతో కట్టిన ఇల్లు గట్టిగా గాలి వీచినప్పుడు కూలిపోయే రీతిలో వారధి కూలి సముద్రంలో జాడ కూడా తెలియనంతగా మునిగిపోయింది. ఈ ఘటనతో వీరాధివీరుడైన అర్జునుడికి అవమానంతో ముఖం చిన్నబోయింది. అతడు నిశ్చేష్టితుడయ్యాడు. అగ్నిప్రవేశం చేసి మరణించడానికి అతడు ఏమాత్రం సంకోచించలేదు, విచారపడలేదు. "పాశుపతాస్త్ర సముపార్జనకై వచ్చిన నేను, వచ్చిన మహత్కార్యాన్ని నెరవేర్చలేకపోయానే! నాకు పట్టిన గతి తెలియక, పాండవులైన నా సోదరులు తల్లడిల్లిపోతూ, నన్ను వెదుకుతుంటారే!" అని అనుకుంటూ అతడు బాధపడ్డాడు.

(ఎంతో గొప్ప లక్ష్యం కోసం మీరు ఏతెంచారు. మహత్కార్యాలు సాధించే స్థితిలో ఉన్నారు. దాన్ని వదిలిపెట్టి అహంకారంతో మిమ్ములను మీరే నాశనం చేసుకుంటున్నారు. మీ అహంకారమే ఎన్నెన్నో మంచిపనులు జరగటానికి ఆటంకంగా ఉంటున్నది. ఇది గ్రహించి కూడా మీ అహంకారాన్ని తొలగించుకోవటానికి మీరు సిద్ధంగా లేదు. అంతేగాక, ఇతరుల దుఃఖానికి మూలకారణమవుతున్నారు. మహత్కార్యాలు సాధింప వచ్చిన మీరు, సిగ్గులేకుండా అల్ప విషయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అందుకు మీరు సిగ్గుపడాలి. ఈ గుణపాఠానికి అర్జునుని స్థితి అద్దంపడుతున్నది కదా!)

పాపం అర్జునుడు ఏం చేస్తాడూ! అతడి ప్రగల్భాలు తేలిపోయాయి. తన ప్రతిజ్ఞ మేరకు అగ్నిప్రవేశం చేయడానికి ఏర్పాటు చేయనారంభించాడు. అర్జునుడ్ని అగ్నిప్రవేశం చేయవద్దని నేను పరిపరి విధాలా బ్రతిమలాడుతూ కూడా చెప్పాను. అయినప్పటికీ, అర్జునుడు తన ప్రతిజ్ఞను నెరవేర్చుకొనుటకై కట్టెలు పేర్చి అగ్ని రాజేశాడు. చివరగా అర్జునుడు తన ఆప్తమిత్రుడు, గురువు అయిన శ్రీకృష్ణుడ్ని తలచుకుని, "కృష్ణా! నన్ను ఇలా వదిలిపెట్టావే? చివరకు ఈ దుస్థితికి దిగజారిపోయేలా

*చేశావే?" అంటూ హృదయం ద్రవించేలా ప్రార్థించాడు. ఇక అతడు అగ్నిప్రవేశం చెయ్యడానికి ఇక కొన్ని క్షణాలే ఉన్నాయి. అర్జునుని ప్రార్థనలకు దిగివచ్చిన కృష్ణుడు ఒక బ్రహ్మచారి రూపంలో అక్కడకు వచ్చాడు. అప్పుడు అతను, "అరే! నీవు ఖ్యాతిగాంచిన అర్జునుడవు కదా! నువ్వు ఇక్కడ ఏం చేస్తున్నావు?" అని అర్జునుడ్ని అడిగాడు. ఏడుపు రావటం ఒక్కటే తక్కువ. అర్జునుడు ఆ బ్రహ్మచారికి జరిగినదంతా పూసగుచ్చినట్లు చెప్పాడు. అంతా సావధానంగా విన్న ఆ బ్రహ్మచారి రూపంలోని కృష్ణుడు, "ఆహా! అర్జునా! మహా వీరుడవైన నీ కథ చివరికి ఇలాగ అయిపోయిందే!" అన్నాడు. తెచ్చిపెట్టుకున్న విస్మయంతో, తరువాత కాసేపు ఏదో యోచించి నాతోనూ, అర్జునునితోనూ ఇలా చెప్పాడు. "మీరిద్దరూ పాల్గొన్న పోటీలో న్యాయం లేదు. ఎప్పుడైనా సరే, పోటీ అంటూ వచ్చినప్పుడు, అందుకు సాక్షిగా మధ్యస్థుడు లేక నిర్ణేత అనే వ్యక్తి ఉండాలి. అదే న్యాయమైన పద్ధతి. మధ్యస్థుడు ఉండి, పోటీ ఫలితం ఇది అని తీర్పు ఇవ్వడం సముచితం. మధ్యస్థుడు లేకుండా మీరుగానే పోటీ ఫలితాన్ని తీర్మానించడం సబబు కాదు. దాన్ని పోటీ అని పరిగణించడం కూడా సరికాదు. మీరిద్దరూ మునుపటి మాదిరే మళ్ళీ ఇప్పుడు పోటీ చేయండి. నేను మధ్యస్థుడిగా ఉండి, పోటీని పర్యవేక్షించి ఫలితం ప్రకటిస్తాను" అన్నాడు. బ్రహ్మచారి యోచనకు ఇద్దరూ సమ్మతించారు. అర్జునుడు మొదటి పనిగా కృష్ణుని సహాయం అర్థిస్తూ చిత్తశుద్ధితో ప్రార్థించాడు. బాణ ప్రయోగంతో వారధి నిర్మించాడు. సాక్షాత్తూ బ్రహ్మచారి రూపంలోని శ్రీమన్నారాయణుడు తన చక్రాయుధాన్ని వారధి మధ్యలో నిలిపి ఉంచాడు. నేను అప్పటికే ఒకసారి వారధిని సముద్రంలో ముంచివేశాననే గర్వంతో మనుపటి మాదిరే కాలిబొటనవ్రేలితో వారధిని అదిమి నొక్కాను. కానీ, వారధి చెక్కుచెదరలేదు. దాంతో విస్తుబోయిన నేను వారధినెక్కి నా బలాన్నంతా ప్రదర్శిస్తూ అటూ ఇటూ గెంతసాగాను. కానీ, ప్రయోజనం శూన్యం. చివరకు విశ్వరూపం దాల్చి పదేపదే వారధిపైకి దూకాను. కాని, వారధి కించిత్తు కూడా చలించక సుదృఢంగా నిలబడింది. ఇక నేను ఓటమిని ఒప్పుకునే ఉద్దేశ్యంతో తీరం మీదికి దూకాను. అదే సమయంలో కృష్ణుడు బ్రహ్మచారి రూపం విడిచి రాముడిగా, కృష్ణుడిగా దర్శనమిచ్చాడు. త్రేతాయగంలో ఒకసారి రాముడు, "ద్వాపరయుగంలో కృష్ణుడిగా నీకు దర్శనమిస్తాను" అని మాట ఇవ్వడం నాకు చటుక్కున గుర్తుకు వచ్చింది. అలా నేను అనుకున్న అదే సమయంలో రామునిగా, కృష్ణునిగా మారి నాకు దర్శనం ఇచ్చాడు. ఆయనకు వంగి నమస్కరిస్తున్న నన్ను కృష్ణుడు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నాడు. తరువాత ఇలా చెప్పాడు, "ఆంజనేయా! నేనే రాముడ్ని, నేనే కృష్ణుడ్ని. రాముడిగా, కృష్ణుడిగా విభిన్ననామాలతో నన్ను అర్చించే మీ ఇద్దరినీ ఒకేత్రాటి మీదకు చేర్చడానికే ఈ లీల జరిపాను. అర్జునా! రాముని తక్కువ చేసి మాట్లాడి, నన్ను మరచిపోయి, మొదటిసారి వారధి నిర్మించావు. ఆంజనేయుడు నన్ను మనసారా ప్రార్థిస్తూ పనికి ఉపక్రమించాడు, సాఫల్యం పొందాడు. వారధి కుప్పకూలిపోయింది. రెండవసారి నన్ను మనసులో తలచుకుని వారధి నిర్మించావు కాబట్టే, ఇప్పుడు విజయం నిన్ను వరించింది. ఆంజనేయా! మొదటిసారి నన్ను తలచుకోవడం వలన పోటీలో విజయం పొందిన నువ్వు రెండవసారి నన్ను మరచిపోయావు. అంతేగాక, మొదటిసారి గెలుపును తలచుకొని గర్వించి, వారధిని కూల్చ ప్రయత్నించావు. నీ ఆ మనోస్థితే నీ ఓటమికి కారణం అయింది". ఇలా చెప్పి కృష్ణుడు అంతర్ధానమయ్యాడు. వారధి మధ్యలో వున్న*

సుదర్శన చక్రం మళ్ళీ తన ఆవాసానికి తిరిగి వెళ్ళిపోయింది. మహాభారతయుద్ధంలో అర్జునుని రథపతాకంలో నేను ఆసీనుడినై భాసించాను. ఆ కారణంగా కపిధ్వజుడు అని అర్జునునికి పేరు వచ్చింది. గర్వం పనికిరాదని తెలుసుకున్నాను. భగవంతునికి పూర్తిగా శరణాగతులు కావాలి. విభిన్న నామాలతో ఒకే భగవంతుడు విరాజిల్లుతున్నాడు. నిజమైన భక్తులకు ఎప్పుడో ఎంతో అరుదుగా గర్వం తలెత్తినా, ఆ గర్వాన్ని తొలగించి భగవంతుడు అనుగ్రహిస్తాడని నేను ఈ కథ మీకు చెబుతున్నాను నా చిన్నారి ముద్దుబిడ్డలారా!

**లోకోత్తరం చరిత మర్పయతి ప్రతిష్టాం**
**పుంసాం కులం నహి నిమిత్త ముదార తాయాం ।**
**వాతాపి తాపనమునే కలశః ప్రసూతిః**
**లీలాయితాం పునరముద్రా సముద్రపానమ్ ॥**

మనుష్యులు కులముచేగాక, లోకోత్తరమగు చరిత్ర వలననే ప్రతిష్ఠను బొందుదురు. ఇందులకు వేరొక కారణముండదు. ఎట్లన, అగస్త్యమహర్షి పుట్టుక కలశములోనైననూ, సముద్రమునంతయూ లీలగా ఒకే గుటకలో త్రాగినాడను ప్రతిష్ఠను పొందెను గదా!

ఓం

**19-10-2020** 10:00 AM

## 132) గురువు అందించే విద్య యొక్క విశిష్ఠత ఎట్టిది స్వామీ?

ఏ కాలములోనైనా మనిషికి విద్యే పెన్నిధి. అది ఆధ్యాత్మికవిద్య అయినా, లౌకికవిద్య అయినా, దానిని అధ్యాపనం చేసే గురువు అధిక గౌరవాస్పదుడు. గురువుయెడల మీరు చూపవలసిన భక్తి నిరుపమానమైనది. ఏ సంప్రదాయంలోనైనా గురుశిష్య సంబంధం పరమ పవిత్రమైనది. అది జ్ఞాన, విజ్ఞాన, వివేక, సంయమనాలకు కూడలి స్థానం. గురువు అంటే భౌతికశాస్త్ర విషయాదులను బోధించేవాడు మాత్రం కాదు. అంతకు మించిన లోతైన విశిష్ఠమైన అర్ధం గురువు అనే పదంలో ఉంది. శిష్యునిలో నిగూఢమై, నిద్రాణమై వున్న మానసిక జీవచైతన్యస్థితిని జాగృతం చేసేవాడని అర్థం. అజ్ఞానాన్ని తొలగించి, మానసికవికాసాన్ని కల్గించి, అతనిలో జ్ఞానజ్యోతిని వెలిగించేవాడని అర్ధం. లోకంలో పిల్లలందరూ సాధారణంగా తల్లినో, తండ్రినో పోలివుంటారు. పిల్లల దేహాకృతికి కారణాలు తల్లిదండ్రులు, వారి ఆలోచనలకు, హృదయానికి మంచి ఆరోగ్యవంతమైన ఆకృతి కల్పించేవారు అధ్యాపకులు. విద్యార్థుల యెడల అధ్యాపకులు చూపే ప్రేమాభిమానాలు, కరుణ, వాత్సల్యం వంటి గుణాలు పిల్లల మనసుల్లో నిలిచి వుంటాయి. పిల్లలకు హృదయాన్ని అర్పించండి అని చెబుతాను. రాముడి ఘనత దశరథుని కుమారుడవటం కంటే, వశిష్ఠమహర్షి శిష్యుడు కావటంలోనే వుంది. విశ్వామిత్రుడు జనకమహారాజుకు శ్రీరామచంద్రుడు వశిష్ఠుని శిష్యుడని చెప్పటం వలన తన కుమార్తె సీతకు తగిన వరుడిగా నిర్ణయించి

వివాహం జరిపించాడు. ఇక ఈ సద్గురువు బోధించే విద్య ఎటువంటిదంటే, ఉజ్జీవనకరం, ధైర్య వీర్య జనకం. శీలనిర్మాణ సమర్ధమగు భావాలను గ్రహించుటే, అసలైన విద్య. ఈ భావములను గ్రహించి వాటిని జీవితంగా, శీలంగా మలచుకోగలిగితే, గొప్ప విజ్ఞాన భాండాగారాన్ని సొంతం చేసుకున్నవారిని మించి విశేష విద్యావంతులవుతారు. గురుశిష్యులిద్దరికీ కొన్ని లక్షణాలు నిర్దేశించబడ్డాయి. పవిత్రత, నిజమైన జిజ్ఞాస, ధృతి శిష్యునికుండవలసిన ముఖ్య లక్షణాలు. శాస్త్రహృదయ గ్రహణం, పావనత్వం, పవిత్రమైన శీలం, వినిర్మల ప్రేమ, స్వార్ధరహిత చింతన గురువుకు కావలసిన లక్షణాలు. గురువు యెడల విశ్వాసం, వినమ్రత, వినయం, విధేయత, గౌరవం లేనిదే శిష్యునకు వికాసం కలగదు. గురువును పూజించండి. సాక్షాత్తూ భగవంతునిగా ఆరాధించండి. కానీ, అంధప్రాయంగా అనుసరించకండి. పూర్ణ గురుభక్తుడివైనా, నీ ఆలోచనలు వీడకు. కానీ, ఆలోచనలలో కూడా గురువుపై చెడు అనేది రాకూడదు. అటువంటి విద్య యొక్క గొప్పదనాన్ని చెబుతాను.

**విద్య నిగూఢగుప్తమగు విత్తము, రూపము పురుషాళికిన్**
**విద్య యశస్సు భోగకరి, విద్య గురుండు విదేశ బంధువున్**
**విద్య విశిష్ఠ దైవత్వము, విద్యకు సాటి ధనంబు లేదిలన్**
**విద్య నృపాల పూజితం, విద్యనెరుంగనివాడు మర్త్యుడే**

విద్య అంటే పెన్నిధి. లోకరంజితమైన రూప సంపదనిస్తుంది. పదిలంగా దాచివుంచిన గుప్తధనంలా కాలాంతరంలో ఉపయోగపడుతుంది. అజరామరమైన కీర్తిని, సమస్తభోగాలను, సర్వసుఖాలను కలిగిస్తుంది. గురువులకు గురువై, హితాన్ని బోధిస్తుంది. అంతేకాదు, పరమాత్మవలె మోక్షాన్ని ప్రసాదిస్తుంది. ఇష్టదైవంవలె ఇహపరలోక ఫలాలనిస్తుంది. విద్యకు మించిన సంపద ఏదీ ఈ లోకంలో లేదు కాబట్టి, విద్యలేనివాడు వివేకశూన్యుడై పశుప్రాయుడేనంటాను. మనిషికి సద్విద్యే సకల భోగాలను సాధించి ఇచ్చే ధనం. పాండిత్యం, సద్విద్య కలిగివుంటే, సకలలోక వశీకరణశక్తి ఉన్నట్లే. పండితులు అసాధారణ ప్రతిభ కలవారగుట వలన, వారాలోకంలో ఎల్లవారికీ పూజ్యులని ఈ విధంగా విద్యయొక్క విశేష లక్షణాలను ఈ రకంగా అభివర్ణించాను. ప్రతివ్యక్తిలోనూ స్వతఃసిద్ధంగా జ్ఞానం, అంతర్గతంగా అంతరంగంలో దాగివున్న దానిని బహిర్గతం చెయ్యడమే. దేన్నినైనా కనిపెట్టారని చెప్పటం, లోకమింత వరకూ గ్రహించిన జ్ఞానమంతా, ఎక్కడో బాహ్యప్రపంచం నుండి పొందింది కాదు. వ్యక్తి మనస్సు నుంచే కలుగుతోంది. పరిశీలన, జ్ఞానం, మనసులే అయితే, మీ మనసులో వున్న అనంతమైన విశ్వభాండాగారాన్ని వెలికితీయటానికి బాహ్యప్రపంచం తగిన సమయాన్ని, సూచనలను, అవకాశాన్ని కల్పిస్తుంది. వ్యవహారికమైనా, పారమార్థికమైనా, జ్ఞానం లేక విద్య అంతా మనిషి మనసులోనే వుంది. ప్రకృతి రహస్యాలని, శక్తులని, మహిమలని చెప్పబడేవన్నీ మనిషి అంతరంగంలోనే ఉన్నాయి. సమస్తజ్ఞానం జీవాత్మ నుండి వెలువడుతోంది. ప్రతి జీవిలోనూ గర్భితంగా లేక అగ్నికణంలా వున్న జ్ఞానాన్ని చెకుముకిరాయితో ఒరిపిడి చేసి జ్వలింపచేసేది సంఘటన. మనిషి గ్రహించినా, గ్రహించలేకపోయినా వాని ఆత్మ అఖండ శక్తిమయం. సృష్టిలోని సర్వశక్తి మీలో వుంది. దానిని వెలికి తీసి, లక్ష్యం వైపు నడిపించే ఆధ్యాత్మిక శిక్షణ అవసరం. ఆ శిక్షణనిచ్చుట కొరకై సద్గురువుగా ఈ ఆంజనేయుడు మీ సన్నిధికి ఏతెంచాడు.

***ఎంతటి మధురాతిమధురమో శ్రీరామనామము***
***అది మనసు చింతలు తీర్చే మహత్వ జ్ఞానము***
***జీవితాల క్రొత్త వెలుగులు నింపే కమనీయము***
***అనవరతమూ ప్రేమ, శాంతము నింపే రమణీయం***
***అహమును చంపి ఇహపరములను తెల్పును***
***మోహములను దుంచి శోకములను బాపును***
***రాగానురాగాల నగుమోముల గావించును***
***ప్రేమానురాగాలలో పరివర్తన ప్రభవించును***
***స్వార్ధపరత్వముల విరచి శివధ్యాస కల్గించును***
***శివాయన్న, రామాయన్న మనసు మీ చెంతన నిలుచును***
***ఆత్మయందు తలచిన కస్తూరి పరిమళం వెదజల్లును***
***మంచిని పెంచి, పదుగురికీ పంచు ఆలోచనలనిచ్చు***
***ఎదుటి మనుషుల గౌరవించు సౌమ్యం, సౌశీల్యం***
***ప్రేమగా పలుకరించు తీయని మాటల స్నేహం***
***భక్తితోడ అలరించు నిండు మనసు మనోహరం అన్పించెడి విధముగా***
***ఆకలి తీర్చెడి పట్టెడు అన్నము,***
***దాహం తీర్చు దోసిలి తోయము***
***దేహ దౌర్బల్యతల నధిగమించు ఔషధము***
***జ్ఞానవృద్ధికి అపార ఉపాయము, సోపానము***
***నిన్ను, నన్ను జీవులన్నిట నడిపేటి ధనామృతం***
***సునాయాసమైన రసరమ్య అక్షరద్వయం***
***బ్రతుకుకు మూలమైనది రామనామము***
***గతుకులన్నిటినీ మాయం చేసే మననమంత్రం***
***జనలోకాన్ని గట్టుకు చేర్చే వేదసారం***
***ప్రేమగా సాగిపొమ్మని చెప్పే ప్రియ ఉచ్ఛరణ***
***అందరికీ అన్నింటికీ ఒక్కటే మార్గం రామనామస్మరణం***
***ఈ సద్గురువు ఆంజనేయుని జీవనగమ్య ప్రేమసూత్రం***
***నిత్యపారాయణం అదే మీకూ మార్గదర్శి కావాలి***
***నా ఈ చిన్నారి ముద్దుబిడ్డలకు!***

*మనిషిలో సహజంగా వున్న సంపూర్ణత్వం యొక్క వ్యక్తీకరణయే విద్య*
*జ్ఞానం వెలుపల నుండి లభించుట లేదు, అది మీ అంతరంగంలోనే వుంది.*
*ప్రపంచం ఇంతవరకూ గ్రహించిన జ్ఞానమంతా మనస్సు నుండే ఉద్భవించింది*

*ప్రపంచాన్ని పరిశీలించే అవకాశాన్ని కల్పించేది మాత్రం బాహ్యప్రపంచమే గానీ, పరిశీలించేది మాత్రం మనస్సే!*

ॐ

**20-10-2020** 09:10 AM

**133) ఆధ్యాత్మిక మార్గం యొక్క విశిష్ఠత ఎట్టిది స్వామీ?**

ఆధ్యాత్మిక మార్గమనేది ఒక వ్యక్తిని మోహబంధాల నుండి సమూలంగా విడుదల గావించి, సంపూర్ణ స్వేచ్ఛను ప్రసాదించి, జీవిత పరమార్థాన్ని నెరవేర్చగల చక్కని రాచబాట. అయితే, దానిని గురించి శాస్త్రీయ పంథాలో అవగాహన గావించుకొని, అనుభవంలోకి పొందడమనేది కత్తి మీద సాము వంటిదనే చెప్పాలి. అందుకే లక్షలాదిమంది ఆ మార్గంలోకి ప్రవేశిస్తున్నప్పటికీ, పరిణతి చెందడం లేదు. అయితే, ఆధ్యాత్మిక మార్గంలోనికి ప్రవేశించినప్పటి నుంచి, ఆ మార్గంలో పట్టు సాధించగలిగితే, జయించవలసిన దానిని జయించవచ్చు. మానవజీవితం కర్మలమూటతో మొదలవుతుంది. అవి కొన్ని జన్మల నుండి వంశపారంపర్యంగా, తరతరాలుగా సంక్రమిస్తున్నాయి. వానిని కూకటివ్రేళ్ళతో సహా సమూలంగా తొలగించగలగాలి. అందుకు క్రమం తప్పని సాధన అత్యంత అవసరం. సంస్కారాలు ఉన్నంత వరకు మనిషిలో జీవభావం కొనసాగుతూనే వుంటుంది. జీవభావం సమూలంగా తొలగిపోతేనే దివ్యత్వం బహిర్గతమవుతుంది. అందుకొరకై నామస్మరణ, తపస్సు, మంత్రోచ్చారణ, ఇష్టదైవాన్ని పదేపదే జపించడం వంటి అనేకరకాల విధానాలు అమలులో వున్నాయి. వాని వలన లక్షలాదిమంది ఎంతో కొంతమేరకు ఫలితాలు పొందారు, పొందుతున్నారు. అయితే, అవ్వన్నీ బాహ్యముఖ ప్రయాణాలే. బాహ్యపరమైన వ్యక్తుల గురించి, దేవతలను గురించి, త్రిమూర్తులను గురించి, రూపనామాలను గురించి పదేపదే స్మరించడం ద్వారా ఉత్తమ సంస్కారాలు ఏర్పడుతాయి గానీ, పాత సంస్కారాలు మాత్రం తొలగిపోవు. అందువలన, జన్మజన్మలుగా నిల్వవున్న సంచితకర్మలు, ఈ జన్మలో సంక్రమించిన ప్రారబ్ధకర్మలు సమూలంగా తొలగిపోవాలంటే, సంపూర్ణ అద్వైతబ్రహ్మజ్ఞానము అత్యంత ఆవశ్యకరం. పూర్ణజ్ఞానాన్ని గురించి సద్గురువుల ద్వారా అవగాహన గావించుకొని, దానిని పదేపదే శ్రవణ, మనన, నిధిధ్యాసల ద్వారా అనుభవంలోకి పొందగలిగితే, వ్యవసాయక్షేత్రం సమూలంగా శుద్ధి అవుతుంది. అయితే, దురదృష్టకరమైన అంశం ఏమిటంటే, ప్రస్తుతం పరిపూర్ణ అద్వైతబ్రహ్మజ్ఞానాన్ని అందించడం బహుకష్టతరమైపోతోంది. ఎందుకంటే, ఆధ్యాత్మికతను గురించి శాస్త్రీయ పంథాలో అందించేవారు లేరు, ఒకవేళ అందించగలిగినా దానికోసం పరితపించేవారూ లేరు. కారణమేమిటంటే, సూక్ష్మశరీరంపై సమూలంగా పట్టు సాధించినవారు మాత్రమే దానిని అందించగలుగుతారు. తమో రజో గుణాలను అధిగమించి సత్త్వగుణంలో జీవించేవారు మాత్రమే దానిని అవగాహన గావించుకోగలుగుతారు. అందువలన, విధానం గొప్పదైనా, సిద్ధాంతం ఉన్నతమైనదైనా, ఆధ్యాత్మికతను అందించటానికి ప్రస్తుతం అనుకూలమైన వాతావరణం లేదు. వాస్తవానికి ప్రస్తుతం మానవులు ఆధ్యాత్మికమార్గం వైపునకు విపరీతంగా ఆకర్షించబడటానికి కారణం అంతరంగమందలి

అసంతృప్తియే తప్ప, బాహ్యాప్రపంచం కానేకాదు. కేంద్రీకరణం పెరుగుతూ, వ్యక్తి పూజలకు, విగ్రహాలకు ప్రాధాన్యం పెరుగటం వలన సాధకులలో బానిసత్వం పెరుగుతూ వచ్చింది. అది ఆధ్యాత్మిక తిరోగమనమే తప్ప పురోగమనం కానేకాదు. ప్రాథమిక స్థాయిలో ఉన్నవారు, నామస్మరణానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. పరిణతి చెందినవారు ఏమీ చేయకుండా ఉండే స్థితి నుండి, తమ దైనందిన జీవితాన్ని కొనసాగిస్తారు. అయితే, ఆధ్యాత్మికంగా పరిణతి చెంది, సంపూర్ణ స్వేచ్ఛను అనుభవించాలనుకుంటే మాత్రం, పూర్ణజ్ఞానమే శరణ్యం. వేరే మరొక్క ప్రత్యామ్నాయమే లేదు. మనసుతో చేసే సాధనలన్నీ ప్రాథమికమైనవే. మనసును కరగించివేసే విధానాలే పరిపూర్ణమైనవి.

## 134) ఆహారం విషయంలో సాధకులు పాటించవలసిన నియమాలు ఏవి స్వామీ?

సద్గురువుగా, అధికారికంగా చెబుతున్నాను. మనిషి మనుగడకు, జీవనచర్యలకు, దైనందిన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడానికి వీలుగా, ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఆహారం తీసుకోవాలి గదా! అందులో ఎటువంటి సందేహం లేదు. మానవుడు సహజసిద్ధంగా, స్వతహాగా శాకాహారి. శారీరక అమరిక, దంతాల నిర్మాణం జీర్ణరసాల ఉత్పత్తి, ప్రేగుల పొడవు వంటి అంశాలను మీరు పరిశీలించినట్లయితే, మనిషిది పూర్తిగా శాకాహారితత్త్వమని ఋజువవుతుంది, ఋజువుగావించబడ్డది. మాంసాహారులతో పోలిస్తే, శాకాహారులు ఎక్కువకాలం జీవించగలుగుతారు. ఆధ్యాత్మికంగా పరిణతి చెందాలనుకొనేవారు తప్పక ఆహార నియమాలను పాటించవలసిందే. మరొక విశేషమేమిటంటే, ఏ మానవుడూ పూర్తిగా మాంసాహారి కానేకాదు. ఎందుకంటే, మాంసంతోపాటు ఇతర శాకాహార పదార్థాలను, మరియు అన్నం కలిపి సేవించడం జరుగుతుంది. కాబట్టి, అటువంటివారిని మాంసాహారుల కంటే, మిశ్రమహారులుగా భావించవచ్చు. అయితే, ఆహారం ప్రభావం శరీరంపై, మనసుపై ప్రత్యక్షంగా ఉంటుంది. మీరు సేవించే ఆహారంలో 80 శాతం భౌతిక దేహానికి, 20 శాతం సూక్ష్మశరీరానికి పంపించబడుతుంది. అందువలన, మనసును సాత్త్వికత వైపుకు మళ్ళించగలగాలి. సత్త్వగుణంలో జీవించేవారు అన్నివిధాలా సమత్వంలో, సమతుల్యంలో ఉంటారు కాబట్టి, ఆహారం ద్వారా మనసు ఎటువంటి అసౌకర్యానికి గురికాదు. అందుకు 1) అవసరమైనంత మేరకే ఆహారం తీసుకోవాలి 2) ఆకలిగా ఉన్నప్పుడు ఆహారం తీసుకుంటే అది పూర్తిగా జీర్ణం గావించబడుతుంది 3) కష్టించి పనిచేసి ధనాన్ని సమకూర్చుకుని ఆహారం తీసుకుంటూ ఉండాలి. ధనం విలువ తెలిసినవారికే జీవితపు విలువ తెలుస్తుంది. అక్రమ సంపాదనకు అలవాటుపడ్డ వారికి, ఆహారం విలువ తెలియదు. చివరగా చెబుతాను ఒకమాట. 1) పదార్థశుద్ధి 2) పాకశుద్ధి 3) పాత్రశుద్ధి 4) పరిసరాలశుద్ధి చాలా అవసరం. ఇటువంటి విధానాలన్నీ సాత్త్వికతలో జీవించేవారికి మాత్రమే అవగాహన అవుతుంది. ప్రస్తుత మానవుడు భౌతికవాదపు మత్తులో జీవిస్తున్నందువలన, గురుకులాల్లో, ఆశ్రమాలలో ఉంటూ కందమూలాలు, దుంపలు, పండ్లు, కూరగాయలు వంటి ప్రకృతిసిద్ధమైన ఆహారాన్ని నూటికి నూరు శాతం తీసుకునే అవకాశమే లేదు. ఇటీవలి రోజులలో కొంతమంది శాకాహారం పేరుతో దండిగా మసాలాలు, రజోగుణ సంబంధమైన పదార్థాలను మోతాదును మించి చేరుస్తూ, దానిని శాకాహారంగా పిలుస్తూ, తప్పుదోవ పట్టిస్తున్నారు. ఘాటైన పదార్థం ఏదైనా రజోగుణాన్ని ప్రకోపింపచేస్తుంది. నిల్వవున్న పదార్థం ఏదైనా తమోగుణాన్ని పెంచుతుంది. అలా కాకుండా, తాజాగా లభించే పదార్థాన్ని

పరిమితంగా తీసుకుంటే శారీరక ఆరోగ్యానికి, మానసిక ఒత్తిడికి ఎటువంటి అవకాశం ఉండదు. సాధకులుగా సాగే జీవితాన్ని అందుకుని, మధుర పదార్ధంగా మారి, ఈ సద్గురువుకు ఆనందాన్ని అందివ్వండి ముముక్షువులై, ముక్తిగ్రహీతలై భువిపై నిలవండి నా చిన్నారి ముద్దుబిడ్డలారా!

**అక్రుద్ధ్యంతో నసూయంతో నిరహంకార మత్సరాః ।**
**ఋజువః శమస్సంపన్నాః శిష్టాచారా భవంతితే ॥**

కోపం, అసూయ, అహంకారం, మాత్సర్యం ఈ గుణాలు లేకుండా
ఋజుత్వం, మనోనిగ్రహం కలిగియున్నవారే శిష్టాచారులు.

పుట్టిననాటి కథను, పోయేనాటి కథను మరచిపోయి
మధ్య కథతో మురిసిపోకండి.

***<u>నాతో గొడవ</u>***

***మీలో లోలోపల ఎన్నెన్నో ప్రశ్నలు***
***ఆ దేవుడివే అన్నీ తప్పులు అంటారు***
***ఉత్సవాలలో అపశృతులు, ఊరే గింపులో ప్రమాదాలు***
***తొక్కిసలాటలో మరణాలు, తీర్థయాత్రల్లో వరదలు***
***గుడిలో దేవునితో వ్యాపారాలు, పేదవాడికి అన్యాయాలు, ఉన్నవాడికి సౌకర్యాలు***
***ఏమిటీ మోసాలు? ఏమిటీ వేషాలు?***
***దేవుడేం చేస్తున్నాడు? అంటారు, అందుకే దేవుడే లేడంటున్నారు***
***దీనికి నేను సమాధానం చెప్పాలి గదా***
***చెబుతాను మరి!***
***తల్లిని మించిన 'దైవం' లేదన్నాను మరి, ఆవిడను పూజిస్తున్నారా?***
***తండ్రిని మించిన 'వేదం' లేదన్నాను, ఆయన్ని ఆదరిస్తున్నారా?***
***మానవసేవే మాధవసేవ అన్నాను, ఆర్తులకు సాయం చేస్తున్నారా?***
***అవసరానికి మించి దాచినా, దోచినా కడకు చిల్లిగవ్వ కూడా దక్కదన్నాను, విన్నారా?***
***ఇంత దూరాల గుళ్ళకు రమ్మన్నానా? మీ ఊరి గుడిలోనే లేనన్నానా?***
***ఇన్ని వ్రతాలు, పూజలు, ఆర్భాటాలు చేయమన్నానా?***
***ఆకో, పూలో, నీళ్ళో చాలన్నానా?***
***ఇవి అన్నీ మీ అహం, ధనం, కీర్తి కోసమే ఇన్ని ఆర్భాటాలు చేస్తున్నారు***
***నా గుడులు మీరే కట్టారు, నా రూపాలు మీరే చెక్కారు, నా దర్శనాలు మీరే వ్రాశారు***
***ధర్మంగా వుంటే, ప్రతిరోజూ మంచిరోజే***
***మంచి మనసుంటే ప్రతిరోజూ పండుగరోజే***
***మంచితిథియని, మంచి పండగని, ఒకేరోజు వెర్రిగా లక్షల్లో జనం***

***మూకుమ్మడిగా ప్రదక్షిణాల జనం***
***ప్రమాదాలు ఉండవా? దుష్ఫలితాలు చెందరా?***
***ఇంకా ఇంకా నన్నే నిందిస్తారా?***
***ఎప్పుడూ రాళ్ళల్లో బంధిస్తారా?***
***నేనెక్కడ లేననీ? నీ ప్రక్కనే లేనా?***
***కొండల్లో బండల్లో లేను***
***నీలాంటి మనుషుల్లో ఉన్నాను***
***నువ్వు చేసే మంచి పనుల్లో ఉన్నాను, సాటిజీవుల్లో ఉన్నాను, సమాజసేవలో ఉన్నాను***
***మనసు మనసులో వుంటే, మంచి భావన వుంటే, నీ అహం చంపుకుంటే***
***నేను, మేను ఒకటి కాదని ఒప్పుకుంటే, నీ గుండెల్లో నేను లేనా?***
***గుళ్ళ చుట్టూ, రాళ్ళ చుట్టూ తిరగకు***
***నీ చుట్టూ నీవు తిరుగు, నీలోనికి నీవే తొంగి చూసుకో.***
***గుడిలో దీపాలు వెలిగించడం మాని, నీలో ఆత్మజ్యోతిని వెలిగించుకో***
***అప్పుడు నీవే నేను - నేనే నీవని తెలుసుకో***
***జీవుడే దేవుడు - దేవుడే జీవుడు***
***అజ్ఞానపు చీకటి తెరలను తొలగించి***
***ఎట్టఎదుట సాక్షాత్కరించి సమాధానమిచ్చిన ఈ ఆంజనేయునికి సమాధానాలనిచ్చి,***
***సద్గురువుల సదా రక్షణలో,***
***శిక్షణలో ఉన్నతులై ఉన్నత మార్గాన పయనించి***
***పవనకుమారుని ప్రజ్ఞా ప్రాసస్త్యాలను పంచుకొని, పెంచుకొని***
***పారమార్థిక జీవులై తరించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**21-10-2020** 10:10 AM

**135)** భక్తి ద్వారా మాలో ఎటువంటి పరివర్తన వస్తుంది స్వామీ?

*స్వామీ! మా గురువుగారు చెప్పిన మంత్రం పన్నెండు సంవత్సరాల నుండి జపం చేస్తున్నాను. ఇంకా ఎంతకాలం చేయాలి? అని మీరడిగితే, "నేను జపం చేస్తున్నాననే భావన పోయేటంత వరకూ" అని చెబుతాను. ఎందుకంటే, మనిషి 'నేను' అనే దానిని మర్చిపోడు. అలాగే 12 సంవత్సరాల విషయము కూడా మర్చిపోడు. గుడిలో ప్రదక్షిణాలు చేస్తున్నప్పుడు ఎక్కువ దృష్టి దేవుడిపైన ఉంటుందా లేక సంఖ్యపైనా? ఎక్కువమంది నిజాయితీగా జవాబు చెబితే సంఖ్యపైనే అని చెబుతారు. కానీ,*

ప్రదక్షిణాలు అయిపోయిన తర్వాత ఒక సంతృప్తి కలుగుతుంది. నలుగురికీ చెప్పుకుంటారు. 108 ప్రదక్షిణాలు చేశామని, మీ భక్తిఖాతాలో ఒక ఎంట్రీ. కానీ, వాస్తవానికి నిజమైన సంతృప్తి ఆ సంఖ్యలో, ఆ చెప్పుకోవటంలో కాదు. దేవుడిని 'సంఖ్య' విస్మరించి తలచుకుంటూ ప్రదక్షిణాలు చేస్తేనే అని మీ అంతరాత్మ మెల్లగా చెప్పటానికి ప్రయత్నిస్తుంటే, మీరు దాని పీక నొక్కే ప్రయత్నం చేయటం సబబేనా? నిజమైన భక్తుడు ఎప్పుడూ నేను ఆ పూజచేశాను, ఈ నారాయణసేవ చేశాను అని ఇతరులతో చెప్పడు. సర్వజ్ఞుడైన దేవదేవునికి అసలే చెప్పడు. భక్తిలో సీనియారిటీ అంటే సంవత్సరాల తరబడి అదే రికార్డు వల్లెవేయడం ఎంతవరకూ సమంజసం? భక్తికి వయస్సుతో, అనుభవంతో ఎటువంటి సంబంధము లేదు. కృష్ణుడ్ని తనవాడిగా భావించినప్పుడు మీరా వయసెంత? సాక్షాత్ భగవంతుని ప్రత్యక్షం చేసుకోగలిగిన ధ్రువుని వయసెంత? శ్రీమన్నారాయణుని ప్రతీక్షణం అలర్ట్‌గా ఉంచగలిగిన (తనని రక్షించటానికి) ప్రహ్లాదుని వయసెంత? సిరికిం జెప్పడు అంటూ పరుగు పరుగున ఆ శ్రీమహావిష్ణువు రావటానికి గజేంద్రుడు తాను చేసిన పూజల లిస్టు చదివాడా? నాలుగు తరాల నుండి దైవాన్ని విశ్వసించినా, ఆ ప్రత్యక్షదైవమే, "నేను భీష్ముని చంపుదు" అని పరుగున వస్తుంటే భీష్ముడు ఏమైనా ఏకరువు పెట్టాడా? గమనార్హమైన విషయం ఏమిటంటే, మీరు అనుభవం కాదు చెప్పుకోవలసింది, ఆ అనుభవం మీకు నేర్పినదేమిటి, తద్వారా ఆచరణలో వచ్చిన మార్పు ఏమిటి? అని. విద్య అనేదానికి "ప్రవర్తనలో మార్పు" అని నిర్వచనం చెబుతాను. అ, ఆ, ఇ, ఈ, 1,2,3,4 నేర్చుకోవడం విద్య కాదు. విద్యాహీనుడు విద్యావంతుడైన తర్వాత అతని ప్రవర్తనలో ఆశించిన మార్పు రావాల్సిందే. అప్పుడే ఆ విద్యకు సార్ధకత. భక్తి అయినా అంతే. భక్తునిగా రూపుదిద్దుకున్న తర్వాత క్రమేణా మార్పు రావాలి సుమా! ప్రతి మానవునికీ ప్రతిరోజూ ఏదో ఒక నేర్చుకోదగిన విషయం (చూసే దృష్టి ఉండాలి) కన్పిస్తూనే వుంటుంది. అందువలననే ప్రతి వ్యక్తీ నిత్యం విద్యార్థియే అని చెబుతాను. కేవలం స్తోత్రాలు చదివాం, పూజలు చేశాం, తీర్థయాత్రలకు వెళ్ళాం అని సర్వీస్ బుక్‌లో ఎంట్రీలలాగా చెప్పుకుంటే ఎలా? సన్మార్గానికి మళ్ళించేదీ భక్తే, దుర్గుణాలకి స్వస్తి చెప్పే మనోస్థైర్యాన్ని ఇచ్చేదీ భక్తే. సేవ, త్యాగం, కరుణ, సానుభూతి, పరోపకారం, సహృదయత, క్షమ, విశాల దృక్పథం, మానవత్వం, నైతిక విలువలకు స్వాగతం పలికి మీ అంతరంగంలో స్థిరనివాసం ఏర్పర్చేదే భక్తి. కాలక్రమేణా ఇలా సద్గుణాలను అలవరచుకొని ఆచరణలో పెట్టగలిగిన వ్యక్తి మాత్రమే భక్తుడు అనే పదానికి నిర్వచనంగా చెప్పుకోవచ్చును. నా దివ్యచరణసన్నిధిలో అద్భుతమైన అవకాశం, జీవితాన్ని గడిపే అపురూపమైన అవకాశం లభించినందుకు మీరు చాలా సంతోషంగా వుండి వుంటారు. సత్యం, ప్రేమ ఇంకిపోయి ఎడారిగా మారిన ప్రపంచంలో, ఫలపుష్పభరితమైన ఒయాసిస్సులాంటిది నా సన్నిధి, అది మీకు దొరికింది. కనీసం జీవితంలో కొంత భాగమైనా నా సన్నిధిలో గడపగలిగిన భాగ్యశాలులు మీరు. ఎటు చూసినా చిరునవ్వులు చిందిస్తూ ఉండగలిగే ఆనంద పారవశ్యం చాలు మీకు. ఇంత ఏ ఇతర విషయాలూ మీకు అక్కరలేదు. ఈ భూమిపై ఎన్నిసార్లు జన్మించారో మీకు తెలియదు కానీ, ఈ జన్మలో మాత్రం చక్కని పాఠశాలలో ఉత్తమ విద్యను, శిక్షణను అభ్యసించగలిగినందుకు మిమ్మల్ని మీరు సదా అభినందించుకుంటూ వుండాలి. భగవంతుని వెచ్చని ఒడిలో సేదతీరి, శాశ్వత నిద్రనొందటానికి విశ్రాంతి పొందటానికై స్వామి ఆజ్ఞకై ఎదురుచూస్తూ శేషజీవితాన్ని గడుపుతూ మీరెక్కడి నుండి

బయలుదేరారో, ఆ చోటును కనుగొనండి. కానీ, ఆ దారిలోనే ఉన్నానని మాత్రం నిస్సంశయంగా చెప్పగలిగి వుండాలి. ఎన్నాళ్ళు ఈ అన్వేషణ చేస్తారు? ఈ జీవితకాలం సరిపోయేనా? ఇంకా జన్మలు కావాలా? బహుదూరపు బాటసారులే కావచ్చు. కానీ, మీరు వెళ్తోంది రాజమార్గంలోనే. అది నేనెరుగుదును. నేను తప్పక గమ్యం చేర్చగలను. ఆ విశ్వాసం నాకుంది. ఎందుకంటే నేనే గైడ్‌ని. మీ గమ్యం, గమనం కూడా అదే కాబట్టి మిమ్మల్ని తప్పక చేరుస్తాను. కానీ, నన్ను ఫాలో అయినప్పుడే సుమా!

**ద్వావిమౌ పురుషవ్యాఘ్రః సూర్యమండల భేధినౌ ।**
**పరివ్రాజ్ యోగయుక్తశ్చ రణేచాభిముఖో హత్వాత్ ॥**

*పురుషశ్రేష్ఠుడవగు ధర్మరాజా!*
*యోగనిష్ఠగల సన్యాసి, యుద్ధమందు ధైర్యముతో ఎదురునిలచి పోరాడి మరణించినవాడు*
*వీరిద్దరే సూర్యమండలములను గూడా చీల్చుకుని ఊర్ధ్వలోకములకు వెళ్ళుదురు.*

*ప్రణాళిక అంటే:-*

*భవిష్యత్తును వర్తమానంలోకి తెచ్చుకోవటమే*
*అలా చేస్తే మీ భవిష్యత్తును మీరే నిర్మించుకోవచ్చు*
*నిర్దిష్టమైన ప్రణాళికతో కూడిన లక్ష్యం ఉండాలి*
*అదే అత్యద్భుతమైన ఆత్మవిశ్వాసాన్ని, కొండంత మనోబలాన్ని ఇస్తుంది.*

***తెలిసో తెలియకయో, మనస్సు ఏదైనా చిత్రభ్రమలకు లోనైనప్పుడో,***
***నిషాపానంలో మత్తు మనిషిగా అదుపు తప్పినప్పుడో***
***మీ ద్వారా జరిగిన తప్పుకో, మీకు సంబంధించిన అసహజ ప్రవర్తనకో***
***మీ వారనుకున్న వారిద్వారా కలిగిన అమధురభాషణమో***
***మీ మాట, చేత, చూపు వల్లనైతేనేమి,***
***మీ భావనలు మీ సాన్నిహిత్యం, మీ ఆలోచనలవల్ల నైతేనేమి***
***ప్రత్యక్షంగానైననూ, పరోక్షంగానైననూ***
***ఎప్పుడైనా, ఎక్కడైనా, ఏమరపాటులోనైనా***
***మీ మదిలో కలిగే చిన్న అలజడి మొదలు కించిత్తు బాధనైనా ఎవరికీ చెప్పుకోలేక***
***ఏమని రాసుకోలేక, నీలో నీవే కుమిలిపోయేలా చేసే మనో భౌతిక గాయాలకైనా***
***మిమ్ము కలవరపెట్టిన ఏ క్షణానికైనా***
***మనసా, వాచా, కర్మణా మీకు చెప్పేదొకటే***
***అశ్రువులతో అర్ధించేదొకటే***
***పశ్చాత్తాపంతో పగిలిపోయిన మీ గుండె పరివర్తనతో ప్రార్ధించేది ఒకటే కావాలి***
***చిన్నబుచ్చుకోకుండా, పెద్దమనసుతో మిమ్మల్ని క్షమించమని కోరండి***
***మీ అంతరంగ పరిశుద్ధికై ఈ ఆంజనేయుని బిడ్డలుగా***

**సదా సద్గురువుల బోధనామృతమును గ్రోలుతున్న**
**నా చిన్నారి ముద్దుబిడ్డలారా!**

**ॐ**

**24-10-2020** 09:30 AM

**136) ఆధ్యాత్మిక మార్గాన్ని అవలంభిస్తూ మేము తీసుకొనవలసిన జాగ్రత్తలు ఏవి స్వామీ?**

"విద్యాదదాతి వినయం". విద్య వినయప్రదాత అని అర్థము. విషయం కేవలం శిరోనమ్రత కాదు. అహంకార, మమకార రహితమైన భావమే వినయమునకు సరియైన అర్థము. ప్రతి మానవుడూ అహంకార, మమకార రహితమైన జ్ఞానమును హృదయమందు నెలకొల్పి, జీవనమార్గము నందు దీనిని నిత్యోపయోగముగా అనుభవిస్తూ రావాలి. ఆధ్యాత్మిక తత్త్వప్రభావము చేత, అనేకమంది జనులు దివ్యత్వాన్ని గుర్తించి, పవిత్రమార్గములో ప్రవేశించి, దివ్యమైన ఆధ్యాత్మికతత్త్వాన్ని అనుభవిస్తూ వస్తున్నారు. సత్యసంపత్తి అనేడిది ఆధ్యాత్మికమే. అట్టి ఆధ్యాత్మికత అనునది మీ నైతిక ప్రవర్తనపైన ఆధారపడి ఉన్నది. మానవునిలోని మంచితనం నిప్పువంటిది. దానిని భౌతిక విషయవాసనలనే నివురు చేత కప్పబడి వున్నది. అందువలన, మీరు విషయవాంఛలకు అతీతంగా ఉండగలగాలి. ప్రపంచములో ఈనాడు సాంకేతిక విజ్ఞానము, ఆ విజ్ఞానముతోపాటుగా అజ్ఞానము కూడానూ పెరుగుతూ వస్తున్నది. ఈనాడు అజ్ఞానమనే చీకటి, మీకు ప్రతి అణువునా, ప్రతి క్షణమునా గోచరిస్తూనే ఉన్నది. కనుక, మానవునికి చదువుకున్న సంస్కారము, అధికారము కంటే, లోకజ్ఞానము అత్యవసరంగా ఉండవలసిన విషయము. మానవుడు ముందుగా మానవతా విలువలను పెంచుకోవాలి. ఈ విలువలు కేవలం ఆధ్యాత్మిక సంపత్తి పైన తప్ప, అన్యమార్గములో అభివృద్ధి గావించుకొనుటకు వీలుగాదు. దీనికి ఎన్నో ఉదాహరణలు మీకు చెబుతూ, ప్రభావితులను చెయ్యటానికి అనేకవిధాలుగా నిర్విరామముగా కృషి చేస్తూనే వున్నాను. విత్తనమును మట్టిలోపెట్టి నీరుపోసి, శ్రద్ధగా పెంచుకొన్నప్పుడే, అది మహావృక్షముగా రూపొందుతుందనీ, కానీ అదే విత్తనమును ఒక డబ్బాలో పెట్టి నీరుపోస్తే అది కుళ్ళిపోతుందని, అదే విధముగా మానవతా విలువలు పవిత్రమైన ఆధ్యాత్మిక హృదయమునందు మాత్రమే ఆవిర్భవించి, అభివృద్ధి చెంది, వికసించి జగత్తుకు ప్రకటించబడాలి. కానీ దురదృష్టవశాత్తూ, మానవుని హృదయము స్వార్థచింతనలతో సంకుచితమైపోవుట వలన తన క్షేమము, తన కుటుంబక్షేమము సమాజముపైన ఆధారపడివున్నదని గుర్తించుకోలేకపోతున్నారని మీ పరంగా నేను ఆవేదన చెందుతూ ఉంటాను. నాది మాతృహృదయము, పితృహృదయము కావున. స్వార్థస్వప్రయోజనాలను, సంకుచిత భావాలనూ త్యాగం చేసి, సమాజక్షేమానికై సర్వులూ కంకణం కట్టుకోవాలి. సమాజ సంక్షేమమే దేశ సంక్షేమము. సమాజపరమైన బాధ్యతలు గుర్తించి వర్తించలేని వ్యక్తిని సమాజమే దూరంగా ఉంచుతుంది. మీ అందరిలో కూడా పవిత్రభావనలు మరుగున పడుతున్నాయి.

మీ జీవిత గమ్యమును సంకుచిత మార్గమువైపు ప్రవేశింపచేస్తున్నారు. ఆకారమానవునిగా తాను అన్నీ అనుభవిస్తున్నాడే గానీ, ఆచారమానవత్వానికి స్వస్తి చెబుతున్నాడు. యవ్వనమునందు మానవుని

*రక్తము ఉరకలు వేస్తూవుంటుంది. ఈ సమయంలో అతడు మదోన్మత్తుడై ఉంటాడు. తనను మించినవాడు లేడను గర్వాతిశయంతో ఉంటాడు. ఇలాంటి తరుణంలో కూడా ఆడంబరాలతో, మోహంతో మునిగిపోతుంటారు. ఫలితంగా నిత్యజీవితపరమావధిలో సూటిగానున్న సత్యాన్ని విస్మరిస్తున్నారు. ధనబలం, బుద్ధిబలం, విద్యాబలములే జీవితానికి అతి ముఖ్యమన్న భ్రమలో చాలామంది ఉండిపోతున్నారు. అయితే, నిజమైనబలం దైవబలం మాత్రమే. లోకంలో ధనవంతులు, మేధావంతులు ఎంతమంది లేరు? గొప్పగొప్ప పదవులను పొందినవారు ఎంతమంది లేరు? మరి వీరందరికీ మానసిక ప్రశాంతత అందుతోందా? లేదు లేదు. ఇవ్వన్నీ కేవలం భౌతికమైన కీర్తిని మాత్రమే అందించగలవు. కనుక, ప్రతిఒక్కరూ యుక్తాయుక్తములను విచారించి, వివేకముతో ముందుకుపోవాలి. నేను మీకు ఒక ఉపదేశాన్ని అందిస్తున్నాను. అష్టమదములను త్యజించటం అత్యవసరం. ఎందుకంటే, మానవునిలో అష్టమదములు నెలకొని వుంటాయి. వీటిని ఎప్పుడు త్యజించగలడో, అప్పుడే సంపూర్ణ మానవునిగా పరిణతి చెందే అవకాశం ఉంటుందని చెబుతాను. కామ క్రోధ మోహ మద మాత్సర్యాలను పూర్తిగా త్యజించుట సాధ్యం కాదు. కాని, వాటిని అదుపులో పెట్టుకొనుటకు సర్వదా ప్రయత్నిస్తూనే ఉండాలి. ధన, కుల, యవ్వన, సౌందర్య, రాజ, విద్యామదములు చేత మానవుడు ఆవరించబడి ఉన్నాడు. ఇవ్వన్నీ స్థిరముగా ఉండేవి కావని తెలుసుకోగలగాలి. అనిత్యమైన వాటిని ఆశ్రయించి, సత్యమైన నిత్యమైన మానవత్వాన్ని వ్యర్థం చేసుకుంటున్నారు. ఇది క్షంతవ్యం కాదు. అంతేకాదు, స్వేచ్ఛ అనే పదానికి అర్థం తెలుసుకోకుండా ప్రవర్తిస్తున్నారు. విదార్థులే కాదు, పెద్దలు కూడా పరతత్త్వాన్ని మాత్రమే ఆశ్రయించాలి గానీ, ఐహిక జీవనంలో పరులకు స్వాధీనం కారాదు. స్వేచ్ఛ అంటే ఏమిటి? ఆత్మజ్ఞానమే స్వేచ్ఛ. ఆత్మానందమే స్వేచ్ఛ. ఆత్మభావనే స్వేచ్ఛ. కనుక ఇష్టానుసారం ప్రవర్తించడం, ఇంద్రియసుఖములకై జీవితాన్ని అంకితం చేసుకోవడం స్వేచ్ఛ అనిపించుకోదు. మీ అంతరాత్మకు తృప్తి కలుగునట్లుగా నడుచుకోవడమే స్వేచ్ఛ. భగవంతుడు సర్వశక్తులనూ మీకందిస్తున్నా, దుష్కర్మల జోలికి వెళ్ళరాదు. కర్మకు తగ్గ ఫలితాన్ని అనుభవించటం ఎప్పటికైనా, ఎవరికైనా తప్పదనే సత్యాన్ని గుర్తించి నడుచుకోవడమే నా ఉవాచ!*

*భగవద్గీతలోని శ్లోకాలు ముఖ్యమైనవి 118*
*ఉపనిషత్తులలోని శ్లోకాలు ముఖ్యమైనవి 118*
*118 లోంచి నీ జన్మసంవత్సరం తీసేస్తే, వస్తుందీ ప్రస్తుత వయస్సు*

**ధర్మార్థౌ యః పరిత్యజ్య స్యాదింద్రియ వశానుగః ।**
**శ్రీ ప్రాణ ధన ధారేభ్యః క్షిప్రం పరహీయతే ॥**

ఎవడు ధర్మార్థములను వదిలి, ఇంద్రియములకు బానిస అగుచున్నాడో,
అతడు త్వరలోనే ఐశ్వర్యమునూ, ధనమునూ, భార్యాదులనూ, ప్రాణమునూ పోగొట్టుకొనును.

**మనిషిని నిగ్రహింపచేసే నిగ్రహం ప్రేమ, తృప్తి**
**వీటిని దూరం చేసుకొనక, మనిషిని దహింపచేసే**
**అసూయ, అత్యాశ, ద్వేషం మున్నగువాటిని దగ్గరకు తెచ్చుకొనక**

*జీవితానికి చెరుపు చేసే అధికారం, అహంకారం దరికి చేర్చుకొనక*
*ఆశించకూడని అప్పు, యాచన అనునవి ఎప్పటికీ ఎప్పటికీ దూరంలో ఉంచి*
*జీవితంలో ఎప్పటికీ చేయకూడని వంచన, పరదూషణలను గుర్తించి*
*నేర్పరిగా మీకు కావలసిన లక్ష్యం సహనం వినయంలతో*
*మీలో పురుషప్రయత్నానికి భంగం కల్గించే వ్యామోహం స్వార్థంలను విడనాడి*
*సంచరించకూడని మార్గాలలో అంటే ఒంటరితనం, చీకటి అంటే తమస్సు వీటిని వదిలించి,*
*ఆచరించదగినవి, బోధించదగినవి రెండే రెండు*
*అవి నీతులు, సుద్దులు*
*నిత్యమూ ఆచరించదగినవి ధర్మము, దయాదాక్షిణ్యములు*
*నిత్యమూ చేయదగిన దానము, ధ్యానములను చేస్తూ*
*నిత్యమూ ఆలోచించదగిన సద్భావము, ఐకమత్యములను అనుసరిస్తూ*
*కరుణ, క్రమశిక్షణలనే పాటిస్తూ*
*సత్యవ్రతం, మౌనవ్రతంలను ఆచరిస్తూ*
*ఆంజనేయుని హృది ఉప్పొంగేలా*
*ఆత్మరక్షణ, ఆత్మవిమర్శ చేసుకుంటూ*
*ఆర్భాటం, ఆడంబరాలను ప్రక్కకు త్రోసివేసి*
*పవనకుమారుని ప్రక్కనే నిలచి*
*దైవచింతన, దైవదర్శనాలతో ఆలోచనలను తక్కువ చేసి*
*ఆచరణ ఎక్కువ చేసి, వివేకం సమయస్ఫూర్తిలతో మరువకుండా చేయవలసినవి చేయుచూ*
*మారుతి మాటల మూటలు బరువు అనుకొనక*
*దైవధ్యానానికి పనికిరాని కోపము, చింత, వాంఛ అనునవి వదిలి*
*హాయిగా హాయిగా జీవనాన్ని సాగిస్తూ*
*హనుమ అండదండలతో, అభిమానరాహిత్యాన్ని పొంది*
*పొంగుచున్న ప్రేమాభిమానాలను*
*మీరు అనే పాత్రలో నిల్వ వుంచి*
*నిరాడంబరులై, నిస్వార్థపరులై*
*నిరంజనుని చేరి, నిత్యసంతోషులై, నిరవధిక ఆనందలబ్ధులై*
*సదా శ్రీరాముని శుభవీక్షణములలో మునిగితేలండి సదా*
*నా చిన్నారి ముద్దుబిడ్డలారా!*

ఓం

**25-10-2020** 09:20 AM

ఒకసారి రవీంద్రనాథ్ ఠాగూర్ జపాన్‌కు వెళ్ళాడు. ఆయన వ్రాసిన గీతాంజలి పుస్తకంపై ఓ పదిరోజులపాటు ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుండి ఏడు గంటల వరకూ ప్రసంగించేవాడు. ఆ ప్రసంగం వినటానికి ఓ వృద్ధుడు క్రమం తప్పకుండా వచ్చేవాడు. ప్రసంగం ప్రారంభం కావడానికి చాలా సమయం ముందే అక్కడికి వచ్చేవాడు. రవీంద్రనాథునితోపాటు లేచి వెళ్ళేవాడు. ప్రసంగం అయిన తర్వాత రవీంద్రుని గౌరవంతో రోజూ పూలమాలతో సత్కరించేవాడు. ఆయన ప్రవర్తన చాలా సాదాసీదాగా వుండేది. రవీంద్రుడు చెప్పే ప్రతిమాటా శ్రద్ధగా విని, జీవితానికి అన్వయించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు అన్పించేది. ఆయన వేసుకున్న దుస్తులు కూడా చాలా సాధారణంగా వుండేవి. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆయనకి రవీంద్రుడంటే వల్లమాలిన అభిమానం. ఉపన్యాసం తర్వాత రవీంద్రుడిని చాలామంది గౌరవభావంతో పలుకరించేవారు. కొంతమంది ఆయన పాదాలను భక్తితో స్పృశించేవారు. ఆత్మజ్ఞానం మీద ఆయన చేసే ఉపన్యాసాలు వారి జ్ఞానపరిధిని ఎంత విస్తృతం చేస్తున్నాయో తెలియకుండానే చాలామంది వినేవారు. ఆయన చెప్పే ప్రతిఒక్క మాట వారి జీవితానికి అంత విలువైనది. ఈ జ్ఞానం కోసమే శ్రీకృష్ణపరమాత్మ సాందీపని మహర్షి దగ్గరకు, శ్రీరామచంద్రుడు తన కులగురువైన వశిష్ఠముని దగ్గరకు, ఈ ఆంజనేయుడు సూర్యుని దగ్గరకు, ఈ రోజు మీరు ఆంజనేయుని దగ్గరకు వచ్చారు. ఆ ముసలాయన ప్రతిరోజూ రవీంద్రుల ముందు మ్రోకరిల్లేవాడు. ఆయన చివరిరోజు ఉపన్యాసం అయిపోయిన తర్వాత చాలామంది బంగారు నాణేలు, ధనం, పండ్లు, పూలు ఆయనకు సమర్పించారు. ఆ ముసలాయన మాత్రం చాలా మర్యాదపూర్వకంగా తన ఇంటిని సందర్శించమన్నారు. రవీంద్రులవారు ఇదివరకే ఆయన భక్తికి సంతుష్టులై వున్నారు కాబట్టి, ఆ ఆహ్వానాన్ని మన్నించారు. ఆ ముసలాయన మనస్సు ఆనందంతో పులకించిపోయింది. ఠాగూర్ తన సహాయకుడిని పిలిచి ఈ విధంగా అన్నాడు. "ఈ పెద్దాయన చూస్తే ఉద్విగ్నమనస్కుడిలా ఉన్నాడు. మన రాకకోసం ఆయన ఎక్కువ ఖర్చు పెట్టకుండా చూసే బాధ్యత నీది. అలాగే, వారి పిల్లలకు కూడా 200 యోన్‌లు ఇవ్వండి. ఆ ముసలాయన సాయంత్రం ఖచ్చితంగా మూడు ముప్పావు అయ్యేసరికి రోల్స్‌రాయిస్ కారులో ఠాగూర్ ఉండే వసతిగృహం ముందు వాలిపోయారు. అంతకు మునుపు ఠాగూర్ నాలుగు గంటలకు వస్తానని చెప్పి వున్నాడు. ఆయన రవీంద్రుని ఆ కారులో ఎక్కించుకుని ఓ కొండలాంటి ప్రదేశంపైనున్న ఇంద్రభవనం లాంటి పెద్ద భవంతిలోకి తీసుకువెళ్ళాడు. వెళ్ళగానే, వాచ్‌మెన్ గౌరవంగా తలుపుతీసి నిలబడి సెల్యూట్ చేశాడు. లోపలకు వెళ్ళగానే గౌరవంగా కన్పిస్తున్న చాలామంది పెద్దమనుషులు ఆయన్ని ఆత్మీయంగా ఆహ్వానించారు. బంగారు సింహాసనం మీద కూర్చోబెట్టారు. బంగారు పాత్రల్లో సుమారు రెండువందల రకాల వంటలు చేయించి నివేదించారు. ఆయన కుటుంబమంతా ఠాగూర్‌కు పూజచేసినట్లు చేసి, ఆయన పాదాల దగ్గర ఆసీనులయ్యారు. రవీంద్రులవారికి ఇదంతా ఆశ్చర్యంగా వుంది. ఆ వృద్ధుడితో, "మీరు నన్ను ఎక్కడికి తీసుకువచ్చారు? దయచేసి మీ ఇంటికి తీసుకువెళ్ళండి. ఈ భవనానికి ఎందుకు తీసుకువచ్చారు?" అన్నాడు. అప్పుడాయన, "ఓ ఋషివర్యా! ఇదే నా ఇల్లు. ఈ కార్లు, ఈ బంగళా

అన్నీ నావే. మీ ముందు మ్రోకరిల్లినవారంతా నా భార్యాపిల్లలు, కోడళ్ళు, అల్లుళ్ళు, మనుమలు, మనుమరాండ్రు. నాకు రెండు కర్మాగారాలున్నాయి" అన్నాడు. "ఓ! అయితే, మీరు ఇంత ధనవంతులై వుండి కూడా నా దగ్గరకు వచ్చేటప్పుడు అతి సాధారణంగా వచ్చేవారు. ఎందుకో తెలుసుకోవచ్చా?" అనడిగాడు రవీంద్రుడు. "స్వామీ! భౌతిక సంపదలు నిజమైన వ్యక్తిత్వానికి కొలమానాలు కావు. నాకింత ధనముందని గర్వంగా చెప్పుకోవటం కేవలం మూర్ఖత్వం. ఆ ధనం ఎంత పోసినా, ఆత్మానందాన్ని కొనలేము. మాకున్న సంపద ఎప్పుడు ఎలా కరిగిపోతుందో ఎవ్వరికీ తెలియదు. అలాగే ఎల్లప్పుడూ తన సంపాదనలు కాపాడుకోవటానికి ఆలోచిస్తూ ఉండేవాడికి తన గురించి తాను ఆలోచించడానికి సమయం ఉండదు. ఈ ప్రపంచం దాటితే, ఆ సంపదలకు విలువ ఉండదు. అమూల్యమైన ఆత్మజ్ఞానంతో పోలిస్తే, ఈ సంపదలంతా చాలా అల్పమైనవి. ఈ సంపదలు నాకు కష్టాలు కొనితెచ్చిపెడుతుంటే, మీరిచ్చిన జ్ఞానం నాకు అత్యంత సంతోషాన్నిస్తుంది. నా జీవితమంతా మీకు కృతజ్ఞుడిగా ఉంటాను. ఇప్పటిదాకా సిరిసంపదలే ధ్యేయంగా బ్రతికాను. అవేవీ నాకు సంతోషాన్నివ్వలేదు. మీరు చెప్పిన ప్రతిమాటా నా అజ్ఞానపొరలను తొలగించాయి. నేను మామూలు దుస్తులు వేసుకుని, మీ దగ్గరకు రావటానికి కారణం జ్ఞానసముపార్జనలో మీ దగ్గర ఓ యాచకుడ్ని మాత్రమే అని సూచించడానికే. మీ సమక్షంలో నేను ఎంతో సంతోషంగా ఉన్నాను". ఈ మాటలు వినగానే రవీంద్రులవారి హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. కాబట్టి, ఎక్కడైతే నిజమైన విద్యకు విలువ ఉంటుందో, అక్కడే జీవితానికి గౌరవం ఉంటుంది. సత్పురుషుల బోధనలు ఎక్కడ గౌరవించబడతాయో, అక్కడ సిరిసంపదలకు విలువలేదు. రవీంద్రులవారు సంతోషంగా, "ఓ మిత్రమా! నీకు సిరిసంపదల కన్నా ఆత్మసాక్షాత్కారం మీదనే మక్కువ ఎక్కువ. నీవు నిజంగా ధనవంతుడవే. నీలాంటి శిష్యులను కలుసుకున్నందుకు నాకు ఈరోజు చాలా సంతృప్తిగా వుంది. నా బోధనలకు సార్థకత చేకూరింది. నేను ఎక్కడికి వెళ్ళినా ప్రజలు భౌతికమైన సుఖసంపదల కోసం అడుగుతూ, అమూల్యమైన సమయాన్ని వృధా చేసేవారు. కానీ, మీరు తెలివైనవారు. మీరు అడగకపోయినా, భగవంతుడు మీకు అన్నీ ఇస్తున్నాడు. మీ జ్ఞానతృష్ణను తీర్చటానికి నన్ను ఆ భగవంతుడు ఇక్కడకు పంపినట్లున్నాడు" అని ఆయన దగ్గర సెలవు తీసుకున్నాడు. మరి ఈ సద్గురువుకు అలాంటి శిష్యులు కావలెను. మరి మీలో ఎవరు అటువంటి శిష్యులుగా మారతారో వేచి చూస్తున్నాను. వేచి చూచుటలోని ఆనందాన్ని ఎప్పుడు ఇస్తారో?

*చావుబ్రతుకులు ఎక్కడో లేవు. బలంలో బతుకుంది – బలహీనతలో చావుంది!*

**మాతృవత్పరదారాశ్చ పరద్రవ్యాణి లోష్టవత్ ।**
**ఆత్మవత్ సర్వభూతాని వీక్షంతే ధర్మబుద్ధయ ॥**

ధర్మబుద్ధి గలవారు పరస్త్రీలను తల్లులుగాను, పరద్రవ్యమును మట్టిగాను,
ఇతర ప్రాణులను తమవలెనూ చూతురు.

**ధనమే దైవంబయ్యే దర్పంబే మతమయ్యే**
**స్వార్థమే బుద్ధికి స్థానమయ్యే అహము శ్వాసంబయ్యే ఆశలు అందలంబయ్యే**

***ధర్మంబు వమ్మయ్యే, ధాత్రిలోన దయయు హీనంబయ్యే, నయము (స్నేహము) శూన్యంబయ్యే***
***కపటమే జీవితకాంతులయ్యే, ప్రేమానురాగముల్ రోగాలపాలయ్యే***
***కామాంధులుగా చేసే కలిని చదువు***
***బ్రతుకు బరువయ్యే, మతులు గతులు దప్పె***
***జాగుచేసిన జగతికి నేది యవునో***
***త్వరపడి మార్పుయన్నది అతి త్వరలో తెచ్చుకుని***
***భావసంశుద్ధి కలుగుటే భక్తియగును***
***పుణ్యకార్యముల్ చేయుటే పూజయగును***
***పరులకుపకార కార్యముల్ తపములేయగును***
***మరువకండి ఇటువంటి మంచి మాటలు***
***మారుతి చెప్పిన దానిని***
***చెప్పినది చేసి చిత్తమును అదుపులో ఉంచుకొని***
***మూకుమ్మడిగా పోటెత్తు అరిషడ్వర్గములను***
***ఆంజనేయుని పేరు చెప్పి విజయసారథులై,***
***వినయభూషణంతో దరిచేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**26-10-2020** 09:10 AM

**137) మేము శాంతముగా ఎలా జీవించగలము స్వామీ?**

*మీరంతా భగవంతుని చేతిలో నిస్సహాయ ఉపకరణాలు. ఈ భావన మీకు ఎల్లకాలం ఎల్లప్పుడూ ఉంటే, "నేను, నా ఇచ్ఛ" అన్న భావాలు పోతే, మీరు సదా శాంతిలో ఉండగలుగుతారు. కౌసల్యానందనుడు తన జీవితాన్ని ఉదాహరణగా నిలిపి, మీకు సర్వోత్కృష్ట బోధ చేశాడు. గీతలో, "నిమిత్తమాత్రం భవసవ్యసాచిన్" అన్నప్పుడు, శ్రీకృష్ణుడు అర్జునునికి చెప్పింది కూడా ఇదే. అలా నిరంతరం భావించాలంటే, దీనికి చాలా శక్తి కావాలి. శ్రీరాముడిలోని ఈ శక్తికే మీరు ప్రణమిల్లుతున్నారు. మీరు కూడా అంత శక్తిని పొందాలని అనుకుంటున్నారు. ఆయనకు ఆ శక్తి ఎలా వచ్చింది? అన్ని కష్టాలు వచ్చినప్పుడు కూడా శ్రీరాముడు చలించకుండా ధీరుడిలాగా ఎలా నిలబడగలిగాడు? అని మీరు ప్రశ్నించుకుంటే, నిస్సంగబుద్ధి, వైరాగ్య తీవ్రత, ప్రపంచమంతా దైవలీల అన్న అవగాహన ఆయనకు ఈ శక్తిని ప్రసాదించింది. మీరు కూడా అలాంటి వైరాగ్యాన్ని, నిస్సంగబుద్ధిని అలవరచుకోవటం ద్వారా శక్తిని పొందవచ్చు. దైవం ఆడుతున్న నాటకంలో మీరంతా పాత్రధారులని గ్రహించటమే శ్రీరాముడికి మీరు చేసే నిజమైన పూజ. కష్టాలు ఒకదాని తర్వాత ఒకటిగా వచ్చినప్పటికీ, మనోనిబ్బరం కోల్పోకుండా సంయమనాన్ని కలిగివుండి,*

బాధనంతా తాను తీసుకొని, ఇతరులకు మాత్రం ఆనందాన్ని పంచియిచ్చిన ధర్మమూర్తి శ్రీరాముడు. ప్రపంచం మొత్తాన్ని దైవలీలగా సదా కాంచగలగటం వలన శ్రీరాముడికి అంత సహనశీలత, క్షమాగుణం అబ్బినాయి. గాలిదుమారం మహాపర్వతాన్ని ఏమీ చేయలేని విధంగా, కష్టాలు ఆయన్ని విచలితుడ్ని చేయలేకపోయాయి. ఆయన మనస్సును కల్లోలపెట్టలేకపోయాయి. అందుకే రాముడు మనకు ఆరాధ్యదైవం. మన జీవననౌకకు దిక్సూచి అయినాడు. శ్రీరాముడ్ని పూజించడమంటే, ఎలాంటి క్లిష్ట సమాయాల్లోనైనా, ఎలాంటి ఇడుములు వచ్చినా ప్రశాంతతను కోల్పోకుండా ఉండగలగటమే. మేము అలా ఉండగలగటం సాధ్యమా? అని మీరు అడిగినట్లయితే, శ్రీరాముడు గృహస్థ జీవితంలో కుటుంబ బాధ్యతల మధ్య ఉంటూనే, అలా ప్రవర్తించగలిగాడు కదా! మీరు ప్రతీదీ చాలా తీవ్రంగా తీసుకుంటున్నారు. సర్వం భగవంతుడి లీల అన్న స్పృహ మీకు సదా ఉండటం లేదు. మీ సంకల్పం ప్రకారం జరిగితే, మీకు సంతోషం. విరుద్ధంగా జరిగితే దుఃఖం. అసలు మీ సంకల్పం అంటూ ఉండకూడదు. ఒకవేళ ఉన్నా, మీ సంకల్పం అంత ముఖ్యం కాదని తెలుసుకోవాలి. సృష్టి మొత్తం దైవసంకల్పం మేరకే నడుస్తున్నది. అందుకే మీ లక్ష్యాలకు, ఆశయాలకు, ఆశలకు అంత ప్రాధాన్యం ఇవ్వవలసిన అవసరం లేదు. అవి నెరవేరినా, నెరవేరకపోయినా ఫరవాలేదని అనుకోవాలి. ప్రపంచం అనే నందనవనంలో మీ అహంకారం, సంకల్పం ఒక కలుపుమొక్క. ఈ కలుపుమొక్కను తీసివేస్తే, మీకు శాంతి. ఈ ప్రపంచంలో మీ ఉనికి చాలా అల్పం. ప్రస్తుతం మిమ్మల్ని భయభ్రాంతులకు గురిచేసి, జీవితాన్ని అల్లకల్లోలం చేస్తున్న వైరస్ మీకు ఈ విషయాన్నే గుర్తు చేస్తున్నది. ఆస్తులు, సంపాదన, కీర్తిప్రతిష్టలు, అధికారం అని పరిగెడుతున్న మీ అందరికీ ఇది పెద్ద మేలుకొలుపు. ఇది కఠోరసత్యం. దీన్ని జీర్ణించుకోవటం కష్టం. జీవితం క్షణభంగురం. శరీరాలు నశ్వరాలు అని మీ సద్గురువు బోధిస్తున్నా, చెబుతున్న విషయం మీ మనస్సులోకి వెళ్ళటం లేదు. వైరాగ్యమే ధైర్యాన్ని ప్రసాదిస్తుందంటే, మీకు అదేదో నైరాశ్యంతో కూడుకున్న భావనలాగా అన్పిస్తుంది. ఈ మహమ్మారి మీకు ఆస్తిపాస్తుల మీద వున్న పిచ్చి వ్యామోహాన్ని కొంత తొలగించింది. మిగతా వ్యామోహాన్ని మిమ్మల్ని తొలగించుకోమంటుంది. అందుకే, కరోనాకు నేనే థ్యాంక్సు చెబుతాను. భగవంతుడిగా ఎంత బోధించినా రాని మార్పు, ఒక వైరస్‌గా తీసుకువచ్చింది. అది కూడా భగవంతుడి ప్రమేయం లేకుండా రాలేదు, గుర్తించండి. ఇకనుంచైనా, ధర్మనిష్ఠ, సర్వజీవులపై ప్రేమ, పరోపకారమే జీవనధ్యేయంగా జీవిస్తామని మాట ఇస్తే, ఇప్పుడే వెళ్ళిపోతానని మాట ఇస్తుంది. ఈ బాధాకర పరిస్థితుల నుండి మీకు తొందరగా విముక్తిని ప్రసాదిస్తానంటుంది. ఇలా బాస ఇవ్వటానికి శక్తి కావాలి. భగవంతుడు ఆ శక్తిని ఒసగుగాక! కరోనా శీఘ్రమే నిష్క్రమించుగాక! ధర్మమూర్తి ఆ శ్రీరాముడు తిరిగి మన అందరి జీవితాల్లోకి ప్రవేశించుగాక అని మీ ఈ ఆంజనేయుడు ప్రార్థిస్తున్నాడు శ్రీరాముడిని. సర్వసమర్థుడైన ఆ శ్రీరాముడు తనను స్మరించి స్తుతించే శరణాగతులకు ఇహపరాలు ప్రసాదిస్తాడనటంలో సందేహం లేదు.

**యస్యామతం తస్యమతం మతం యస్య నవేదసః ।**
**అవిజ్ఞాతం విజానతం విజ్ఞాతమ విజానతమ్ ॥**

ఎవనికి తెలియబడదో వానికి తెలియబడును. ఎవనికి తెలియబడినదో వానికి తెలియదు.
తెలిసినవారికి తెలియబడలేదు – తెలియనివారికి తెలియబడినది.

***ప్రాక్టికల్‌గా ప్రేమ శాంతులను ప్రవహింపచేసిన బంగారు తండ్రి నా శ్రీరాముడు***
***ప్రేమ శాంతులే పూజగా చేసి చేయించిన ఆదర్శమూర్తి ఆనందరాముడు***
***ఆస్తికభావాలు, హైందవధర్మాలు ఆచరణలో చూపినాడు నా రాముడు***
***దీనుల దైన్యాన్ని తెగటార్చి, సత్యాన్ని, ధర్మాన్ని పూని నడిపిన చుక్కాని రామయ్య***
***విశ్వశాంతికి దివ్వవెలుగు తానై, లోకకళ్యాణదాయిగా, వైకుంఠధాముడిగా, రాముడిగా***
***అనుచూ, వేదములెల్ల ఔచిత్యమును బల్క, సుందరరూపాయ అని శివుడు పల్క***
***మందమతుల ఎదలు ముత్యాలసరాలుగా మార్చి పుడమితల్లి మెడన వేసి***
***శుభము లొసగునట్టి, శ్రీరామా!***
***మారుమనసు పొంది నిను గొలుతుము మారుతి మత్సరంబును విడచి,***
***మహిలోన బిడ్డలకు నీదు తత్త్వమునెరిగించి నిన్ను చేరు నిమిత్తమై***
***దరిచేరి ప్రక్షాళన గావించి, పరుగుపరుగున ఈ పవనకుమారునితో***
***పయనము చేస్తూ పరిపరి విధాలుగా పరంధామమును చేరు మార్గములో***
***ముముక్షువులై ముక్తిపథాన్ని పొందాలని***
***ఆశీర్వదించు రామా నా ఈ చిన్నారి ముద్దుబిడ్డలను అని ప్రార్థిస్తున్నాడు ఈ హనుమ***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

జయించడానికే జన్మించారు.
దృఢ సంకల్పం కలిగి పట్టువీడక పనిచేయండి!

ఓం

**27-10-2020** 09:10 AM

**138) జ్ఞానం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి స్వామీ?**

*పసితనం ఆటలపాటలతో గడిచిపోతుంది. తరువాత భార్య, పిల్లలు, సంసారం. మరికొంత కాలం గడిచిన తర్వాత తాను సుఖంగా బ్రతకటానికి భౌతిక సుఖాలను అనుభవించటానికి సంపాదన మీద, ఏ విషయం గుర్తురాదు. కాలం అగదు గదా! తర్వాత వృద్ధాప్యం. అప్పుడు ఇదివరకు అది చేశాను, ఇది చేశాను, ఇప్పుడు చేయలేకపోతున్నాను. ఇంటా బయటా నా మాటకు విలువలేదు అనే బాధ. ఇదంతా కాలపురుషుడు చూస్తున్నప్పటికీ, ఆయనకు ఎవ్వరియందు భేదభావం లేదు కనుక సమయం రాగానే ప్రాణవాయువును అనంతవాయువులతో కలిపేస్తాడు. కాయం భస్మమై కాలిపోతుంది. ఇందుకా మానవజన్మ వచ్చింది? ఎన్ని జన్మల పుణ్యఫలమో ఈ మానవజన్మ! దీనిని ఎంత వృధా చేసుకుంటున్నారు? మీరు లౌకిక ఉపాయములు ఎన్ని చేసినా, సుఖము లభించవచ్చు కానీ, ఆనందము లభించదు. మంత్రతంత్రముల వలన కానీ, యజ్ఞయాగాదుల వలన గానీ, శాశ్వితానందము కలగదు. మీరు శాస్త్రపురాణములు పారాయణ చేయుటవల్ల కానీ, శాశ్వతానందము దొరకదు. అందుకే, "క్షీణేపుణ్యే*

మర్త్యలోకే విశంతి" అని చెబుతాను. పుణ్యపాపాలు తీరగానే మళ్ళీ ఏదో ఒక జన్మ ఎత్తవలసిందే, తప్పదు. ఒక్క జ్ఞానాగ్ని వలననే జన్మపరంపరలు తొలగిపోతాయి. అటువంటి జ్ఞానసముపార్జనకే మానవుడు కృషి చేయాలి. జ్ఞానులను సేవించడం ద్వారా దీన్ని మీరు అలవర్చుకోవాలి. ఈ కాలంలో ఎవరు అసలైన జ్ఞానులో తెలుసుకోవడం చాలా కష్టం. కాబట్టి, ఎవర్నీ నిందించకుండా మౌనంగా మీ ప్రయత్నం నిరంతరాయంగా కొనసాగిస్తూ వుండాలి. దానిని తెలుసుకొనుటకై మీరు కాలమానాన్ని అంటే నెలలు, సంవత్సరాలుగా నిర్ణయించుకున్నారు. పోయిన సంవత్సరములో మీరు అనుకున్నది సాధించారా? చేసిన దానికి ఆనందం పొందారా, లేదా? దానికి కారణం ఏమిటి? ఇన్ని అనర్థాలు ఎందుకు జరుగుతున్నాయి? అని కొంచెం ఆలోచించి ఇకముందు జరగబోయే కాలానికి మీరు బాగా ఆలోచించి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. ఆలోచించుకుని అడుగు వేయాలి.

**139) పూర్ణాయుర్దాయం అంటే ఏమిటి స్వామీ? ఎవరు పూర్ణాయుష్కులు స్వామీ?**

**అకాలమృత్యు హరణం**
**సర్వవ్యాధి నివారణం**
**సమస్తపాప క్షయకరం**
**శ్రీపరమేశ్వర పాదోదకం పావనం శుభమ్ ॥**

అంటూ దేవాలయాలకు మీరు వెళ్ళినప్పుడు తీర్థం తీసుకుంటారు. అకాలమృత్యువు వాతపడకుండా, పూర్ణాయుర్దాయముతో ఉండాలని, మీమనసులోని కోరిక. బ్రాహ్మణోత్తములు కూడా, "శతమానం భవతి" అని దీవిస్తారు. అది మీకు ఇంకా సంతోషాన్ని కలగచేస్తుంది. అసలు పూర్ణాయుర్దాయం అంటే? కలియుగంలో వంద సంవత్సరాలు జీవిస్తే పూర్ణాయుర్దాయం (ఆరోగ్యంగా వుంటే) అనుకుంటారు. 60 సంవత్సరాలకు షష్టిపూర్తి, 70 సంవత్సరాలకు భీమరథశాంతియాత్ర, 80 సంవత్సరాలకు సహస్ర చంద్రోదయం, 100 సంవత్సరాలకు కనకాభిషేకం చేసుకుంటారు. వీరిని సంపూర్ణాయుష్కులు అంటారు. ఇది కలిలోని మాట.

అంతరాత్మ కన్నా అధ్యాపకుడు లేడు
అరయ కాలమె మీకు పరమగురువు
గ్రంథరాజమగును ప్రత్యక్షలోకమె
ఎవరు స్నేహితుండు, ఈశ్వరుండే!

అదే అంతరాత్మ ప్రబోధం. అనగా మీలో వున్న ఒక శక్తి, మీరు చేసే ప్రతి క్రియనూ గమనిస్తూ, ఇది చేయకూడదు, బాధపడతావు, ఇది చెయ్యి, సుఖపడతావు అని ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ, గుర్తుచేస్తూ వుంటుంది. ఆ శక్తియే ఆత్మశక్తి. అదే దైవం. దానిని మీరు వినటానికి కనీసం ప్రయత్నించుటలేదు. ఇక రెండవ వరుసలో, కాలమే మీ గురువు. అనగా నిద్రలేచినది మొదలు రాత్రి పడుకునే వరకూ ప్రపంచములో అన్ని విషయాలను వింటున్నారు, చూస్తున్నారు. జీవితంలో వచ్చే ఆర్థిక, శారీరక, మానసిక కష్టసుఖాలను పట్టిన ప్రతిజీవీ ఎప్పుడో ఒకప్పుడు గిట్టడం (పోవటం) కూడా చూస్తున్నారు. అది కూడా

బాల్యమందో, లేక ప్రాయమందో, లేక ముదిమి (ముసలితనము) యందో తెలియదు. అందుకని, కాలమే మీకు గురువు అనే సత్యమును తెలియచేస్తుంది. మూడవ వరుసలో గ్రంథరాజము అని చెప్పాను. ఏమీ చదువుకోకపోయినా, ప్రత్యక్షంగా కొన్ని, పరోక్షంగా కొన్ని అనుభవాలతో కూడిన పుస్తకమే ఈ లోకం అని చెప్పాను. నాల్గవ పంక్తిలో ఎవరు స్నేహితుడు? ఒక భగవంతుడు మాత్రమే! మీరు వెళ్ళిపోయేటప్పుడు కూడా ఆ స్నేహితుడే తోడుగా వస్తాడు. భౌతికమైన వారంతా ఇక్కడే ఉండిపోతారు. అందుకనే అత్యంత సాన్నిహిత్యం లోకి దిగి వచ్చిన సత్యసాయి అవతారంలో "సదా నిరంతర హరి గుణగావో ప్రేమ భక్తిసే భజన సునావో" అని సాయిరాముడు ఒక చిన్నపాటలో ఎంత అంతరార్థం ఇమిడ్చారో చూశారా? అదే ఆ ప్రేమమూర్తి మీకు బోధించిన బోధల సారాంశము. దానిని మీరు గుర్తించి ఆచరించినప్పుడు, నదిని దాటుటకు నావ అవసరంబు అని చెప్పినట్లు, మళ్ళీ మానవజన్మ వస్తుందో రాదో అని గ్రహించుకుని, ఆరోగ్యాన్ని ఆహారవిహారాల ద్వారా కాపాడుకుంటూ, ఇంకా కొంతకాలం జీవించేటట్లు అనుగ్రహించండి స్వామీ అని ప్రార్థించవచ్చు. కానీ, దైవం ప్రసాదించిన పూర్ణాయుర్దాయం, దానిని ఎలా సద్వినియోగం చేసుకోవాలి అని మీరు తెలుసుకోవాలి. పూర్ణాయుష్కులు అంటే ఎటువంటివారై ఉండాలి? ఎలా ఉండాలి? అందుకే నేను పైన చెప్పిన ప్రతి పదానికీ ఎన్ని సంవత్సరాలు జీవించావు అని కాదు, ఎలా జీవించావు అన్నదే ముఖ్యం. దానిని మీలోనున్న దైవశక్తి, కాలము, ప్రపంచము తెలియచేస్తుంది అని చెబుతాను.

గెలవాలన్న తపన, గెలవగలననే నమ్మకం,
గెలిచేందుకు కావాల్సింది నిరంతర సాధన
ఈ మూడే నిన్ను గెలుపునకు దగ్గర చేసే మార్గాలు

**ప్రాజ్ఞోపసేవినం వైద్యం ధార్మికం ప్రియదర్శనమ్ ।**
**మిత్రవన్తం సువాక్యంచ సుహృదం పరిపాలయేత్ ॥**

బుద్ధిమంతులను సేవించువాడు, వైద్యుడు, ధార్మికుడు, అందగాడు, మిత్రబలగం కలవాడు, మధురభాషియునైన స్నేహితుని జాగ్రత్తగా కాపాడుకొనవలెను.

***గాలికి లేని భేదం, మతానికి లేని భేదం***
***నీటికి లేని భేదం, కులానికి లేని భేదం***
***భూమికి లేని భేదం, జాతికి లేని భేదం***
***నిప్పుకు లేని భేదం, వర్ణానికి లేని భేదం***
***ఆకాశానికి లేని భేదం, ప్రాంతానికి లేని భేదం***
***పంచభూతాలకు లేని భేదం***
***సృష్టికి లేని భేదం, సద్గురువుకు లేని భేదం***
***మీకెందుకురా మనిషీ ఈ విభేదాలు?***
***గాలిలో పుడతారు, గాలిలో పెరుగుతారు, గాలిలో పోతారు***

***భూమి నుండి వస్తారు,  భూమిలోనే కలిసిపోతారు***
***నీటిలోనే ఉంటారు,  నీటిలోనే ఛస్తారు***
***నిప్పులోనే ఉంటారు,  నిప్పులోనే కరిగిపోతారు***
***ఆకాశాన్నుంచి వచ్చారు,  ఆకాశంలోనే కలిసిపోతారు***
***వాటికి లేని ఈ భేదం మీకెందుకురా ఈ విభేదం?***
***స్వర్గసుఖాలకై లోకమంతా వెదికేరు***
***మోక్షప్రాప్తికై క్షేత్రాలన్నీ తిరిగేరు***
***ముక్తి కోరి దానధర్మాలు చేస్తారు***
***పుణ్యం కోసం యజ్ఞయాగాదులు చేస్తారు***
***సద్గురువుల బోధలు ప్రక్కకు తోస్తారు***
***ఈ ఆంజనేయుని బోధలు పెడచెవినపెట్టి***
***దేనినీ ఆచరించక,  ఆదరించక,  అనుభవానికి తెచ్చుకొనక***
***విని ఆనందిస్తుంటే అందుతుందా?***
***మరి మీకెలా మోక్షం వస్తుందిరా?***
***అని గట్టిగా అడగాలని ఈ మారుతికి***
***ఎంతో... ఎంతో... ఎంతో... ఆవేదనతో***
***అబ్ధి లంఘించిన నాకు మిమ్ములను ఏ రీతిగా కాపాడాలి?***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**28-10-2020** 09:10 AM

**140)** పరమాత్మప్రాప్తికి మార్గమేమిటి స్వామీ?

*మీరు ఈ లోకంలో ఏ పనిచేసినా ఏదో ఒక ఫలితం కోరుకునే చేస్తారు. ఏ ఫలితం లేకపోతే, "ఎందుకండీ అనవసరంగా చేయటం?" అంటారు. అయితే, ఫలితం మీద ఆసక్తితో చేస్తే, ఆ ఫలితం మీకు బంధమవుతుంది. పుణ్యకర్మలు, పూజాపునస్కారాలు, దానధర్మాలు చేస్తారు. ఇలా చేసేటప్పుడు మీకు అంతరంగంలో పుణ్యం కావాలనే కోరిక, పుణ్యం వస్తుందనే భరోసా, నమ్మకం ఉంటుంది. పుణ్యం వచ్చే మాట నిజమే. అయితే, ఆ పుణ్యంవల్ల ప్రయోజనమేమిటి? కొంతకాలం దేవలోకంలో భోగాలు అనుభవించి, ఆ పుణ్యం క్షయం అవ్వగానే తిరిగి మరలా కర్మఫలాలను అనుభవించటానికి ఈ లోకానికి రావల్సిందే గదా! దేవలోకం భోగభాగ్యాలకే గానీ, అది కర్మభూమి కాదు. అక్కడ సత్కర్మలు ఆచరించటానికి అవకాశం లేదు. పరమాత్మను అందుకోవాలంటే, తగిన సాధనకు మరలా ఇక్కడకు రావల్సిందే. కనుక ఫలితం ఆశించకుండా భగవత్ ప్రీత్యర్థం కర్మలు ఆచరించమని చెబుతాను. ఆసక్తి లేకుండా కర్మలు*

చెయ్యాలనే ఉద్దేశ్యంతో పూజ పూర్తి అయిన పిదప, మీరు "ఏతత్ ఫలం సర్వం పరమేశ్వారార్పణమస్తు" అంటారు. కనుకనే ఫలితం మీద ఆసక్తి వద్దని చెబుతాను. స్వర్గం-నరకం ఉన్నాయో లేదో మీకు తెలియదు. అక్కడకు వెళ్ళి వచ్చినవారెవరూ మీకు కనబడరు. కానీ, ఇంద్రుడంతటి వానికే పరస్త్రీని కాంక్షించినందుకు ఒళ్ళంతా కళ్ళతో బ్రతకవలసి వచ్చింది. దీని అర్థం, తప్పు చేస్తే దేవుడంతటి వాడికే శిక్ష తప్పనప్పుడు, ఇక సామాన్యమానవులకు మాత్రం ఈ సిద్ధాంతం వర్తించదా? అని మీరు ప్రశ్నించుకోవాలి. తప్పు చేస్తే, శిక్షకు ఎట్టి మినహాయింపు వుండదని చెప్పడమే దీని అర్థం. మీరు ప్రాణాలు విడిచే సమయంలో ఏ తలంపు కలుగుతుందో, అది మీ మరుజన్మకు నాంది అని ఎన్నోసార్లు చెప్పాను. ఏది చివరి క్షణమో తెలియని మీరు ఎల్లప్పుడూ మంచి తలంపులతో ఉండాలి. జననమరణాలకు మూలకారణం మీ తలంపులే. కొందరు కష్టాలు కలిగినప్పుడు దైవంపై విశ్వాసం కోల్పోతారు. ఎందరెందరో దైవభక్తుల చరిత్రలు చదివితే, వాళ్ళు ఎన్ని కష్టాలు, దుఃఖాలు అనుభవించినా ధృఢవిశ్వాసం కలిగి ఉండటం వల్లనే దైవానికి ప్రీతిపాత్రులయ్యారు. వారి కీర్తిప్రతిష్ఠలు కూడా ఆచంద్రతారార్కం నిలిచాయి. కష్టాలు కలిగినప్పుడు అవి ఒక నిర్దిష్టమైన దైవశాసనమును అనుసరించి వచ్చాయని భావించాలి. గంధపుచెక్క అరగదీసినకొద్దీ పరిమళం అందిస్తుంది. చెఱకుగడ నమిలిన కొద్దీ తీయని రసాన్ని అందిస్తుంది. బంగారాన్ని కాల్చినకొద్దీ మాలిన్యం తొలగి శుద్ధమైన అపరంజిగా ప్రకాశిస్తుంది. కష్టాలలో కూడా ధృఢవిశ్వాసంతో, స్థిరచిత్తుడైనవాడు ఉత్తముడైన మానవుడిగా వర్ధిల్లుతాడు. మంచి పనులు చేస్తున్నప్పటికీ, ఒక్కోసారి చెడుఫలితం ఎందుకొస్తుంది అని మీరు ప్రశ్నిస్తే, నా సమాధానం, "ఏ విత్తులను నాటి ఇచ్చోటనుంటివో, అట్టి ఫలములే నీకు అందుచుండు" అని చెబుతాను. గీతలో శ్రీకృష్ణపరమాత్మ చెప్పినట్లుగా "అనపేక్షః శుచిర్దక్షః" అంటే, బాహ్యశుద్ధి, భావశుద్ధి కలిగి వుండటమే భక్తుని లక్షణం. పాపకర్మ నరుడు ఓపికతో చేస్తాడు, పాపఫలము పొందటానికి మాత్రం ఒప్పుకోడు. మనసు ఇష్టానుసారం పరుగులు పెట్టకుండా దానికి ఒక పని పెట్టాలి. అదే నామస్మరణ!

### 141) మనస్సును అరికట్టడం ఎలా స్వామీ?

మనస్సు తత్త్వం ఏమిటంటే అది ఖాళీగా కూర్చోదు. ఏదో విషయంపైకి పరుగులు పెడుతూనే వుంటుంది. దీనికి కోతినాడించేవాడిని ఉదాహరణంగా చెబుతాను. కోతి కూడా ఖాళీగా కూర్చోదు. అందుకే దానికెదురుగా పొడవాటి కర్రను పాతి, "ఎక్కు తిమ్మన్నా, దిగు తిమ్మన్నా" అంటూ దానిని పైకి, క్రిందకీ ఎక్కి-దిగే పని పెడతాడు కోతినాడించేవాడు. అట్లే మనసుకు నామస్మరణ అనే పని పెట్టాలి. మనసును అరికట్టుటకు ఆహారనియమాలు ఎంతగానో దోహదపడతాయి. ఇంద్రియాలన్నింటిలోకి జిహ్వ చాలా ప్రధానమైనటువంటిది. దానికి ఒకటి మాట్లాడటం, రెండవది రుచి చూడటం. నాలుక వల్లనే బంధమోక్షాలు సంభవిస్తాయి. ప్రాచీన ఋషులు ఇంద్రియనిగ్రహం కొరకు చాతుర్మాస వ్రతములు ఆచరించేవారు. ఆ నాలుగు నెలలు వర్షాకాలం గనుక ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి ప్రయాణం చేయటం కష్టం కనుక, అరణ్యాలలో కుటీరాలు నిర్మించుకుని తపస్సు చేసేవారు. కందమూలాదులను తింటూ యోగసాధన చేసేవారు. కానీ, నేటి కాలంలో చాతుర్మాసంలో ఒక్కొక్క దినం ఒక్కొక్క భక్తుడు విందు ఇస్తున్నాడు. అయితే, కాలం మారింది. నాలుకను అరికట్టడం ద్వారా అధికకాలం జీవించవచ్చును.

జిహ్వాకంటే బలమైనది మనస్సు. మనసును అరికట్టుకోవటం కూడా చాలా కష్టమే. అర్జునుడంతటి వాడే, "చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్ధృఢమ్" అన్నాడు. అట్టి చంచలమైన మనసును అరికట్టుకునే విధానం గురించి ఒక కథ చెబుతాను.

ఒక రాజుగారు గ్రామస్థులను పిలిచి తలా ఒక మేకను ఇచ్చి "దీనిని బాగా పెంచండి. అయితే, వాటిని తన వద్దకు తీసుకుని వచ్చినప్పుడు మాత్రం అవి ఆకులు పెట్టినా తినకూడదు" అనే షరతు విధించాడు. "అట్టి వారికి బహుమతి కూడా ఉంటుంది" అని ప్రకటించాడు. ప్రజలంతా మేకను బాగా మేపితే ఇంకా ఆకులు ఎట్లా తింటుంది అని అందరూ బాగా మేపసాగారు. ఒక అమ్మాయి మాత్రం తను పెంచే మేక ముందు ఆకులు పెట్టేది. అది మేయబోయేసరికి, దాని మూతిపై కొట్టేది. కొన్నాళ్ళకు ఆ మేక ఆకులు అందుబాటులో ఉన్నా, వాటివైపు చూడటం మానేసింది. ఒకరోజు రాజు అందరినీ పిలిపించి, పరీక్షించారు. అందరి మేకలు ఆకలును చూడగానే తింటున్నాయి. ఈ మేక మాత్రం యజమాని చేతిలో వున్న కర్రను చూస్తోంది. ఆ అమ్మాయి బహుమతిని గెలుచుకుంది. మనసుకు అనేక విషయాల మీద ఆసక్తి వుంటుంది. నిలకడగా వుండదు. కానీ, ఈ విధమైన అభ్యాసముల ద్వారా అరికట్టుకోవచ్చు అని ఈ కథ చెప్పాను. మనసు పరిశుద్ధమైనప్పుడే బుద్ధి వికసిస్తుంది. బుద్ధి వికసించినప్పుడే సిద్ధి కలుగుతుంది. ఈ విధంగా పాపపుణ్యాలకు, మరుజన్మకు మనసే కారణమవుతుంది. చెడ్డ విషయాలు మీ చెంతకు వస్తే, వాటికి ఏ మాత్రం పట్టింపునివ్వకూడదు. ఉదాహరణకు ఎవరైనా బంధువు సూట్‌కేసు పట్టుకుని మీ ఇంటి ముందుకు వస్తే, అతనికి ఎదురెళ్ళి "ఏమండీ! ఎలా వున్నారు?" అంటూ కుశలప్రశ్నలు వేస్తే అతను వెంటనే తన పెట్టెతో సహా ఇంట్లోకి వచ్చేస్తాడు. అట్లా కాకుండా అతను ద్వారం దగ్గరకు వచ్చినప్పుడు మాట్లాడకుండా వుంటే ఏ లాడ్జికో, హోటల్‌కో వెళ్ళిపోతాడు. అదే రీతిగా, చెడ్డ విషయాలు, చెడ్డభావాలు వస్తే, వాటిని చూసీ చూడనట్లు వదిలిపెట్టండి. అవి నీలోకి ప్రవేశించవు. అట్లా కాకుండా వాటిని "హలో" అని పలుకరిస్తే, అవి వచ్చి నెత్తికెక్కి కూర్చుంటాయి. ఇంట్లో ఉన్న అనేక ద్వారాల ద్వారా మిత్రులను రానిస్తారే గానీ, బజారులో పోయే గాడిదలను, పందులను రానివ్వరు గదా! అంటే, దేహానికి ఉన్న నవద్వారాల ద్వారా విచక్షణతో పవిత్రమైన వాటినే ప్రవేశపెట్టుకుంటే పుణ్యులవుతారు, పావనులవుతారు అంటాను. విత్తనాలు భూమిలో నాటినప్పుడు అవి నేలలో సరిగా పడినా, తలక్రిందులుగా పడినా పైకి మొలుస్తాయి. అలాగే, భగవన్నామాన్ని ఏ విధంగా జపించినా, తప్పక సత్ఫలితం లభిస్తుంది. బంధువులందరూ వాకిటిదాకాను, వల్లకాటికున్ వత్తురు. బంధమణచి నిను బాయను ఆత్మబంధువు భగవన్నామమేరా! రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం యని నోరారా పల్కండి!

**వికర్మణా తస్య మానాః పాపాద్వి పరిముచ్యతే ।**
**నతత్ కుర్యాం పునరితి ద్వితీయాత్ పరిముచ్యతే ॥**

ఎవరు పాపకర్మలనాచరించి, తరువాత పశ్చాత్తాపమును పొందునో, అతడు ఆ పాపకర్మల నుండి విముక్తిని పొందుతాడు. అంతేగాక, "ఇక ఎప్పుడూ ఇటువంటి పాపకర్మలను చేయను" అని నిర్ణయం తీసుకుంటే, భవిష్యత్తులోని పాపకర్మల నుండి కూడా విముక్తుడవుతాడు.

***పరోపకారం నిమిత్తమే వృక్షాలు ఫలిస్తున్నవి***
***పరోపకార నిమిత్తమే నదులు ప్రవహిస్తాయి***
***పరోపకార నిమిత్తమే ఆవులు పాలిస్తున్నాయి***
***ఓ నరుడా! పరోపకారానికే నీ శరీరమున్నది***
***మరి నీవు ఏ పరోపకారం చేస్తున్నావు?***
***నీవు చేసే పరోపకారం అంటే,***
***పరులుగా భావించి వరాన్ని అందుకోలేనంత దూరాన్ని సృష్టించుకొని,***
***నిన్ను నీవు పరాయివానిగా చేసుకుంటున్నావు.***
***నీకు దగ్గరలో నేనున్నాను, నాకు దూరంలో నీవుంటున్నావు.***
***అంగదూరంలో నేనున్నాను, అందనంత దూరంలో నీవున్నావు.***
***చెప్పవలసిన రీతిలో చెబుతున్నాను***
***చెప్పినదంతా చెవి వరకూ రప్పించకపోతే, రాకపోకలు లేని ఎడారి అవుతుంది జీవితం.***
***జీవితం ఏ జాతిది? ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంటే,***
***సుగంధభరితమైన ఈ జీవితం***
***నేను నేను నేను అనే రెండక్షరాలలోని అహంకారాన్ని చంపి***
***రాం రాం రాం రాం రాం***
***అన్న రెండక్షరాలతో కూడిన అమృతాన్ని స్వీకరించి***
***మీలో వున్న అంటరానితనమనే అహంకారాన్ని అణగార్చి***
***ఈ ఆంజనేయుడు చెబుతున్న విషయాల మీద రక్తులై, రాగద్వేషాదులను త్రుంచి,***
***త్రుటిలో దొరకు మోక్షాన్ని ఎందుకు వదులుకుంటారు?***
***వదలకుంటే, చెదలు పడుతుంది.***
***మందు కోసం చూడకుండా మంత్రాన్ని పఠించి పవనకుమారుని చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

సేవ చేసేవారికి ఉండవలసింది దైవీసంపద. మీ ఆచరణ ప్రధానం.
పేరు కొరకు ఏ పని చేసినా, అది నిష్ఫలమే.
అందుకే నిష్కామకర్మ ఆచరించాలి.
నీకు కేటాయించిన పని, నీవు ప్రేమతో చేయగలగాలి.
ఒక గ్లాసుతో నీరు ఇచ్చేటప్పుడు కూడా నేను నీళ్ళు ఇవ్వాలి కదా
అనే దాని కన్నా, ఆ వ్యక్తిని ప్రేమగా పలుకరించి ఆ నీళ్ళను అందిస్తే,
ఆ నీళ్ళ కన్నా నీ పలుకరింపుకే ఆ వ్యక్తికి దాహం తీరుతుంది.
నీ ప్లేటులో అన్నం వడ్డించుకుంటున్నప్పుడు, నీ భోజనాన్ని నీవు తిట్టుకోవు.
అలాగే, నీవు పెట్టుకునే దానికన్నా ప్రేమగా వడ్డన చేయగలగాలి.

*ఎందుకంటే, మీ అదృష్టంగా మీ ఎదుట భగవంతుడు భోక్తగా వచ్చాడు. అటువంటి భోక్తకు ఈరోజు ఆహారమందించే అవకాశాన్ని ఇచ్చిన భగవంతునికి నా జీవితాంతం కృతజ్ఞుడినై, కృతజ్ఞురాలినై ఉంటాను అన్న మీ ఆలోచనే అంతరంగాన్ని పరిశుద్ధం చేస్తుంది!*

ఓం

**29-10-2020** 09:10 AM

త్రిలోక సంచారియైన నారదుడు ఒకసారి లోకసంచారం చేస్తూ, యమలోకానికి వెళ్ళాడు. అక్కడ ఎప్పటిలాగే పాపులను శిక్షిస్తూ ఉండటం గమనించాడు. అయితే, అక్కడి పాపులలో భూలోకంలో ఎన్నో యజ్ఞయాగాదులు, దానధర్మాలు, పుణ్యకార్యాలు చేసినవారు కూడా ఉండటాన్ని చూసి, ఎక్కడో పొరపాటు జరిగి వుంటుందని మనసులో అనుకుని, "తర్వాత చూద్దాంలే" అనుకుంటూ, అటునుంచి అటే స్వర్గానికి వెళ్ళాడు. అక్కడ పుణ్యాత్ములు, నిత్యదైవభక్తిపరులుండటం సహజమే కానీ, చిత్రంగా భూలోకంలో ఉన్నప్పుడు ఎప్పుడో తప్ప దానధర్మాలు, పూజాపునస్కారాలు, దైవకార్యాలు అంతగా సలపనివారు కూడా అక్కడ ఉండటం చూసి, ఆశ్చర్యపోయాడు. అక్కడ యమలోకాన్ని, ఇక్కడ స్వర్గలోకాన్ని పోల్చుకుని, "సందేహం లేదు. ఎక్కడో కాదు అక్కడా, ఇక్కడా పెద్ద పొరపాటే జరిగింది. అటు వాళ్ళిటు, ఇటు వాళ్ళటు వెళ్ళవలసి వుండేది. కానీ, తారుమారైంది. ఈ విషయాన్ని వైకుంఠవాసుడికి విన్నవించితే గానీ, నాకు మనసు కుదుటపడదు అనుకుంటూ, సరాసరి వైకుంఠానికి బయలుదేరాడు. నారదుడు వెళ్ళేసరికి, నారాయణుడు శేషతల్పంపై లక్ష్మీదేవి సపర్యలు చేస్తూండగా సుఖశయనుడై ఉన్నాడు. నారదుడు తన నారాయణ నామస్మరణతో విష్ణుమూర్తి దంపతులకు నమస్కరించి, "దేవా! దేవదేవా! మహానుభావా! జగత్పాలకా! జనార్దనా! అంటూ, స్వామీ! మీరేమో లోకాన్ని మరచి ఇక్కడ సుఖశయనులై ఉంటున్నారు. అక్కడేమో అన్నీ అవకతవకలు జరుగుతున్నాయి. అయినా, నాకెందుకులే, పాలకులు మీరు, పాలితులు వారు. ఏది ఎలా వుంటే మాత్రం నాకేం పని?" అంటూ గట్టిగా ఓ నిట్టూర్పు విడిచాడు. ఇది గమనించిన విష్ణుమూర్తి, "నారదా! ఊరికేరారు మహానుభావులు" అన్నట్లు, మీరేదో కార్యానువర్తులై వచ్చి వుంటారు. నర్మగర్భంగా నానబెట్టడం ఎందుకు? మనసులో ఉన్నదేదో మనవి చేయండి, ఇంతదూరం వచ్చి ఇంటి వెనుక దాగడం మంచిది కాదు గదా!" అని అన్నాడు. విష్ణుమూర్తి మాటలు విన్న నారదుడు వైకుంఠవాసా! నేను లోకసంచారం చేస్తూ, ఈ వేళ ముందుగా యమలోకానికి వెళ్ళాను. అక్కడి పాపులలో ఎందరెందరో గొప్పవారుగా పేరుగడించిన వారిని చూశాను. నిత్యం మీ సేవలో తరించినవారినీ చూశాను. తర్వాత స్వర్గానికి వెళ్ళగా అక్కడ నామమాత్రం విశిష్ఠంగానైనా మీ సేవలను అంతగా చేయనివారిని, మిమ్ము ఎప్పుడో తప్ప, అంతగా పూజించని వారినీ చూశాను. ఏమిటీ వైపరీత్యం? నాకైతే, ఎక్కడో పొరపాటు జరిగిందనిపిస్తోంది. మీకూ అలాగే అన్పించడం లేదా స్వామీ? అని తన సందేహాన్ని వెలిబుచ్చాడు. నారదుడి మాటలను శ్రద్ధగా విన్న నారాయణుడు "మునీంద్రా! మీరు

త్రికాలజ్ఞులు, త్రిలోక సంచారులు, అన్నీ తెలిసినవారు. మీరు చెప్పినవి సత్యాలే. కాదనను. కానీ, వాటి వెనుకగల అంతరాలను, ఆంతర్యాలను గమనించండి. మరణానంతరం 'యమ'లోకానికి వెళ్ళినవారిలో అనేకానేక పుణ్యకారాలు, దైవకార్యాలు చేసిన వారున్నారన్నది నిజమే. కానీ, వారు చేసినవన్నీ కూడా స్వార్థం కోసమే, ఆడంబరం కోసమే, డంబాచారం కోసమే, సమాజంలో తమ స్థాయిని నిరుపించుకోవడం కోసమే. వ్యక్తిగతంగా తాము అభివృద్ధి చెందడం కోసం అవ్వన్నీ నిర్వహించారు. ఉన్నవారమనే భావనతో ఉన్నవారినే చేరదీశారు, ఉన్నవారికే సేవలు చేశారు. వారు చేసిన ప్రతికార్యం వెనుక వారి స్వప్రయోజనముంది. కొలువులను కొలవడమనేది కోరికలను తీర్చుకోవడం కోసం కాకూడదు గదా! ఏ కోరికలూ లేకుండా, దేనినీ ఆశించకుండా, కేవలం దైవార్పణ బుద్ధితో, సకల లోకహితార్థమై, తమకున్న దానిలో కొంత భాగాన్ని పదిమంది దీనులతో పంచుకుంటూ, వారిని సేవించుచూ, వారిలోనే దైవాన్ని గాంచుతూ, వారి సేవలోనే తరించుచూ, చేసేది ఏ యజ్ఞమైనా, యాగమైనా, దానమైనా కానీ, వారిలో ఆ భావనలు కొరవడ్డాయి. ఆయా కార్యాల కోసం వారెంత వెచ్చించారో, అదే దైవకార్యాన్ని అడ్డు పెట్టుకుని అంతకు అనేకరెట్లు మళ్ళీ కూడబెట్టుకున్నారు. అందుకే వారికి పుణ్యం కన్నా పాపం ఎక్కువ అంటుకుంది. వారు చేసిన కార్యాల్లోని కొద్దిపాటి పుణ్యాలకుగాను మొదట స్వర్గసుఖాల్ని అనుభవించి, పిదప నరకానికి వెళ్ళారు. ఇక మీరు చూసిన స్వర్గలోకవాసుల్లో ఎందరో మామూలు మానవులున్నారు. అందులో కొందరైతే దీనులు, దిక్కులేనివారు, బిచ్చగాళ్ళు కూడా వున్నారు. నిజమే కాదనను. కానీ, వాళ్ళంతా వాళ్ళ జీవితకాలాల్లో అనుక్షణం నన్నే స్మరిస్తూ జీవితాన్ని గడిపారు. వారు వేసిన ప్రతి అడుగుకీ నన్ను సాక్షీభూతుడ్ని చేశారు. దైవకార్యాలు చేయాలంటే, వారికి శక్తి లేదు. కానీ, శక్తికి మించిన భక్తి వుంది. ఆ భక్తిని స్మరణరూపంలో చాటుకున్నారు. ఎటువంటి ఖర్చూ లేదు. నిండు మనసుతో చేసే క్షణకాల స్మరణమైనా, కోటియాగాల ఫలం. దండి గుణముతో చేసే స్వల్పదానమైనా కోటి పుణ్యాల బలం. వారిలో ఆశ మాత్రమే వుంది కానీ దురాశ, అత్యాశలు లేవు. వారు చేసిన ఏ పనిలోనూ స్వార్థం లేదు. అంతటా, అన్నిటా సాత్త్వికమే. వారంతా ఉన్నంతలో నన్ను కొలుచుకున్నారు. కలిగి వున్నంతలో కలిమిని పంచుకున్నారు. అదే నాకు కావలసింది. ఇహలోక సుఖాలపై ధ్యాస లేనివారే మోక్షానికి చేరువవుతారు. వారిలో ఆ లక్షణాలున్నాయి. అందుకే వారు వారివారి జీవితాల్లో తెలిసో, తెలియకో చేసిన స్వల్పపాపాలకు మొదట నరకంలో శిక్షలను అనుభవించి, పిదప అనల్ప స్వర్గసుఖాలననుభవించుటకై స్వర్గానికి చేర్చబడ్డారు. ఇప్పుడు చెప్పు నారదా! ఎక్కడైనా అవకతవక జరిగిందా?" అని ప్రశ్నించిన నారాయణుడి ముందు నారదమునీంద్రులు మోకరిల్లి "స్వామీ! అవకతవక జరిగింది అక్కడ, ఇక్కడ కాదు, నా ఆలోచనల్లోనే. నా అజ్ఞానాన్ని తొలగించి, విజ్ఞానాన్ని, విపుల జ్ఞానాన్ని వెలయించారు. భక్తికన్నా భావం ముఖ్యమనే అంశం నాకు అవగాహనైంది. ధన్యుడను స్వామీ" అంటూ నిష్క్రమించాడు నారదుడు. ఇది ఎందుకు చెప్పానో అర్థం చేసుకోండి.

**సంతస్తృణోత్సారముత మాంగాత్ సువర్ణ కోట్యర్పన మానుసంతి ।**
**ప్రాణవ్యయేనా వికృతోపకారా ఖలే ఫలే వైర మినోద్వహంతి ॥**

తల మీదనున్న గడ్డిపోచను తీసివేసినంత మాత్రమున మహోపకారమును చేసినట్లుగా సత్పురుషులు భావించుదురు. ప్రాణములు పణముగా పెట్టి, ఉపకారమొనర్చిననూ, దుష్టులు పగబూని సాధించుచుందురు. ఇది వారివారి నైజ స్వభావము.

ఆనందానికి లోటు రానీయవద్దు. మనశ్శాంతికి చేటు రానీయవద్దు.

***ప్రేమను పంచి మీ జన్మను తీర్చిదిద్ది***
***విద్యావినయ సంపదలను ఇచ్చి***
***సరస్వతిగా ప్రణవస్వరూపముగా నిరంతరం నిను ఎదిగేలా చేసి***
***నీతో సేవలు చేయిస్తున్న ఈ సద్గురువును గుర్తించి గురుస్థానంలో***
***ఈ విశ్వకళాక్షేత్రంలో విజ్ఞాన వీధులందు***
***విశ్వాత్ముని చేరు విజయపథం వైపు***
***జీవిత ధ్యేయానికి మార్గము చూపు ఈ ఆంజనేయుడు శిష్యశీల నిర్మాణ శిల్పి.***
***చెడును ఎదిరించి, అక్రమాలను నిలదీసి, పరము చేరునట్టి వివరంబులు తెలిపి***
***జ్ఞానబీజాలు వేసిన సద్గురువుకు, శాంతిదాతకు***
***ఆనందాన్ని చేకూర్చు రామనామాన్ని స్వీకరించి తన్మయులై***
***తరగని శాంతి సౌభాగ్యగ్రహీతలై ముక్తిపదాన్ని పొందండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**30-10-2020** 09:50 AM

**142) ఒకరి మనస్సును నొప్పించి మాట్లాడటం వల్ల ఎట్టి పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది స్వామీ?**

వ్యక్తుల మధ్య వ్యవహారాలలో మాటలే మంటలు రేపుతాయి. మంచి బంధాలు తెగేలా చేస్తాయి. ముఖ్యంగా కుటుంబాలలో, కార్యాలయాలలో, ఆశ్రమాలలో కూడా మీ ఆధీనంలో ఉన్నవారి విషయంలో ఎవరి కోసం భరిస్తారులే అన్నట్లు తృణీకారభావంతో మాటలను ఈటెల్లా విసిరేస్తూ వుంటారు. మీ అసహనాలకు, అసంతృప్తులకు వాళ్ళను అవుట్‌లెట్‌లుగా ఉపయోగించుకుంటూ వుంటారు. కానీ, వాళ్ళ మనసు ఒకసారి కాకపోయినా ఒకసారి అయినా నొచ్చుకుంటుందని ఆలోచించరు. ప్రతి ద్రవానికీ మరిగే స్థానం (బాయిలింగ్ పాయింట్) ఒకటుంటుంది. ఆ భాష్పీభవన స్థానం దాటాక అది ఆవిరైపోతుంది. అలాగే, ప్రతి హృదయానికీ సహనం నశించిపోయే స్థాయి ఒకటుంటుంది. ఎదుటివారిలో ఆ సహనస్థాయి దాటితే, వారి అనూహ్యమైన ప్రతిచర్యకు మీరు సిద్ధం కావాల్సివుంటుంది. మాటలతో మనసుల్లో ములుకులు గుచ్చే ఈటెగాళ్ళు కాలక్రమంలో మానసికంగా ఒంటరివారైపోతారు. అందుకు ఒక గురువుగారు తమ వద్దకు వచ్చే హజ్రా అనే శిష్యుడి తల్లిని ఉదహరించేవారు. ఆమె ఎవరిని చూసినా వ్యంగ్యంగా మాట్లాడుతూ, మనసులను గాయపరచేవారు. అలా తన ప్రవర్తనతో దగ్గరి బంధాలన్నింటినీ ఆమె దూరం చేసుకున్నారు.

ఆమె చివరి రోజుల్లో ప్రమాదవశాత్తూ దెబ్బతగిలి మంచాన పడ్డారు. ఎవరి పలకరింపులకూ నోచుకోక, దీనంగా కన్నుమూశారు. గురువుగారు ఆమెను ఉదాహరణగా చూపుతూ, "*చూశారా! తన కటువు మాటలతో ఆమె ఎలాంటి దుస్థితిని అనుభవించిందో! అందుకే ఎవరినీ మాటలతో బాధపెట్టకూడదు*" అని అనేవారు. సాధారణంగా మనుషులకు కసి వున్నా, దాన్ని చూపించుకోలేనంత నిస్సహాయత ఉన్నప్పుడు, వ్యంగ్యంగా మాట్లాడుతారు. అలాంటి వికృత స్వభావులకు అనివార్యంగా, అవసరార్థం తప్ప, ఎవ్వరూ దగ్గర ఉండలేరు. వాళ్ళకు పేరుకు చుట్టూ మనుషులున్నా, మనసులు మాత్రం వారికి ఎన్నడూ దూరంగానే వుంటాయి. మనుషులు అసహనంగా, కోపంగా ఉన్నప్పుడు, ఎందుకు బిగ్గరగా అరుస్తారు? ప్రక్కనే ఉన్నవారితో కూడా ఎందుకు గట్టిగా మాట్లాడతారు? వాళ్ళు పేరుకు ప్రక్కప్రక్కనే ఉన్నా, వాళ్ళ మనసులు ఎంతో దూరంగా వుంటాయి. అందుకే అలా బిగ్గరగా మాట్లాడతారు. వాళ్ళకు అది అర్థం కాకపోయినా, వాళ్ళ అంతరాత్మకు అర్థమవుతుంది. అందుకే అలా పెద్దగా మాట్లాడిస్తుంది. నిజమే కదా! ప్రక్కనే ఉన్న వ్యక్తితో కూడా మీరు అంత భీకరంగా మాట్లాడుతున్నారంటే, వాళ్ళ మనసులకు మీరు ఎప్పుడో దూరమైపోయారని నిర్ధారణ అయిపోయినట్లే. మీలో సున్నితంగా, సునిశితంగా వుండే భావాల్ని వ్యక్తం చేసే సంస్కారం లోపించినట్లే.

మీరు సన్నిహితంగా, మీకు సన్నిహితంగా జీవించాల్సి వచ్చిన మనుషుల్ని అర్థం చేసుకుంటూ, వారి మనస్సు నొప్పించకుండా వ్యవహరించాల్సిన బాధ్యత మీకుంది. అది ఏడడుగులు నడచివచ్చిన భాగస్వామే కావచ్చు, ఎనిమిది గంటలు కలిసి పనిచేసే సహోద్యోగే కావచ్చు, నిరంతరం సహజీవనం సాగిస్తున్న ఆశ్రమవాసులే కావచ్చు. అయితే, దురదృష్టవశాత్తూ మీరు, అలవాటైన బంధాలను అంత శ్రద్ధగా పట్టించుకోరు. వీళ్ళు ఎప్పుడూ ఉండేవాళ్ళే కదా! మీరు వాళ్ళకు, వాళ్ళు మీకు ఎప్పటి నుంచో తెలిసిన వాళ్ళమే కదా! అని ఓ నిర్లక్ష్యభావంతో వ్యవహరిస్తూ వుంటారు. కానీ, అది పొరపాటు. అద్దం పగిలితే అతకనట్లు, అనుబంధం బీటలు వారితే కలుసుకోదు. తెగిపోయిన దారానికి ఎన్ని ముడులు వేసినా, అవి ముడుల్లాగానే ఉంటాయి గానీ, మునుపటిలా ఉండదు. అందుకే తెగక ముందే ఆలోచించాలి, తెగకుండా చూసుకోవాలి. ఒక్కమాటలో చెప్పాలంటే, కోపంగా మీ నుంచి దూరమైనవారు మళ్ళీ దగ్గర అవుతారేమోగానీ, మౌనంగా దూరమైనవాళ్ళు మాత్రం ఎన్నటికీ తిరిగిరారు. మీరు నిర్లక్ష్యం చేస్తే ఎదుటివారికి ఎంత బాధ కలుగుతుందో, ఎదుటివారు మిమ్ములను నిర్లక్ష్యం చేసినప్పుడు మీకు అర్థమవుతుంది. అల్పమానవులు మీలోని అల్పత్వాన్ని ఎత్తి చూపుతారు. అందుకు మీరు సిగ్గుపడేలా చేస్తారు. అనేకసార్లు వారి నుంచి విడివడేలా వ్యవహరిస్తారు. కానీ, మహాత్ములు మీలోని లేశమాత్రం మంచిని కూడా పెద్దదిగా చేసి చూపిస్తారు. నిన్ను కించపరచరు. ఈ ఆంజనేయుడు కూడా మీలోని ఎన్నో తప్పులను క్షమిస్తూ, క్షమకు మారురూపంగా నిలిచాడు. జీవితంలో నేర్చుకోవాల్సిన పాఠాలను విశదీకరిస్తూ, వివరంగా, సవివరంగా, సకాలంలో సద్బోధలు సలుపుతున్న ఈ సద్గురువు బోధలు పెడచెవిన పెడుతూ పలుమార్లు అహంకారాన్ని, అహంభావాన్ని ప్రదర్శిస్తూ ఉన్నారు. ప్రకటనలు ప్రకటించనక్కరలేదు. ప్రదర్శితమయ్యే మీ హావభావాలను చూచి సంతృప్తి చెందనా? సందేహాస్పదమైన మీ అంతరంగంలోని సన్నివేశాలను లెఖ్ఖపెట్టుకుంటూ, సందేహనివారణ గావించినా, సంకరజాతివలే మార్పు రాకపోతే, మీ

*జీవితం వ్యర్థం. మీరు సాధన పేరుతో చేస్తున్న కాలక్షేపాలు వ్యర్థం వ్యర్థం వ్యర్థం వ్యర్థం! ఇన్ని వ్యర్థాలలోంచి వార్ధక్యమొచ్చినా, ఇంకా ఇంకా ఇంకా అభిమాన అహంకారాలే ఆహారమైతే, ఎలా ఎలా ఎలా ఎలా ఎలా ఎలా అని ఈ ఆంజనేయుని బాధ. తీర్చండి. తీరుస్తారా? అంజలి ఘటించి అర్థిస్తూ, మీ శ్రేయస్సును కోరే ఈ పవనపుత్రుని ఒక్క కోర్కె అందరూ కలసివుండి, మనసులను దగ్గర చేసి, ముముక్షువులు కావాలి అని కోరుకుంటున్నాను. కోరుకోవచ్చో లేదో తెలియదు, కోరవచ్చు అంటే కోర్కె తీర్చండి!*

**ఉపాహారా నాహారంతో దేవతానాం యథాద్విజాః ।**
**కుర్వతే తద్వదేతాభ్యాం కరోమ్యహ మతంద్రితః ॥**

*పండ్లు మొదలైన ఉపాహారాలను సమర్పిస్తూ బ్రాహ్మణులను, దేవతలను సేవించిన రీతిగా,*
*నీవూ ఏమాత్రం ఏమరుపాటు లేకుండా వృద్ధులైన వారిని సేవిస్తూ ఉండాలి.*

అసాధ్యమైన పనుల గూర్చి ఆలోచించకు
సాధ్యమయ్యే పనులను మాత్రం ఎప్పటికీ వాయిదా వేయకు

***గుణము కొంచెముండి, గొప్ప చదువుండిన ఫలమదేమి, దాని విలువ ఏమి?***
***పంట పండని భూమి పదియెకరములేల? కొంచమైన చాలు మంచిభూమి***
***ప్రకృతి మాయల చేత బంధించబడుటచే నీవే బ్రహ్మంబను ఎరుకను మరచితివి***
***పంచేంద్రియములచే వంచింపబడుటచే దేవుడే జీవుడను తెలివి పోయింది***
***మమత అహంకార అభిమాన మాయలో బడుటచే, ఆత్మదర్శనముపై ఆశ తొలగెను***
***బ్రహ్మలో నీవు, నీలో బ్రహ్మముండగా, నీకు బ్రహ్మకు భేదము లేకుండె***
***నీవే బ్రహ్మయనుచు ఇప్పడైనా తెలుసుకోండి, తెలియనిది తెలుపుటకు***
***మీ అజ్ఞానపు తెర తొలగించుటకు సద్గురురూపంలో విచ్చేసిన***
***ఈ ఆంజనేయుని ప్రేమబోధను గ్రోలి, మీరు సచ్చిదానందమూర్తులై***
***సత్వరము దరిచేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**31-10-2020** 09:35 AM

**143) గృహస్థాశ్రమములో ఉంటూ, పరమాత్మ ప్రాప్తిని ఏ విధంగా సాధించవచ్చును స్వామీ?**

*సన్యాసం ఎంత ఘనమైనదో, సంసారధర్మమూ అంతే ఘనమైనది. పరివ్రాజకునిగా పరమాత్మ దర్శనానికి పరితపించే పారమార్థికుడు ఎంత ఉన్నతుడో, బంధాల నడుమ బ్రతుకుతున్నా భగవంతునిదే భారమంతా అనుకునే భక్తుడూ అంత ఉన్నతుడే. ఒకరిది సత్యాన్వేషణ, మరొకరిది సర్వసమర్పణం. గమనాలు వేరుగా అన్పించినా, ఇరువురి గమ్యం మాత్రం ఆ పరంధామమే. అందుకే సర్వసంగ పరిత్యాగులే*

కాదు, సాంసారిక జీవులు తరించే తరుణోపాయాన్ని చెప్పింది సనాతనధర్మం. బ్రహ్మచర్యం నుండి గార్హస్థ్యానికి, గార్హస్థ్యం నుండి వానప్రస్థానికి, వానప్రస్థం నుండి సన్యాసానికి మరలుతూ, ఒక్క జీవితకాలంలోనే ముక్తిని పొందే మార్గాన్ని చూపింది. పరివారంతో ఉంటూనే పరమార్థాన్ని ఎలా తెలుసుకోవచ్చో చెబుతాను. సమస్త బంధాలను త్యజించి సాధనతో సర్వేశ్వరుడ్ని సాక్షాత్కరించుకునే శక్తిసంపత్తులు అందరికీ ఉండవు. అత్యధికులు ఆ అనుకూలతను అర్థం చేసుకుని ఆ ఆశ్రితపాలకుడిపై ఆధారపడితే చాలు, ఆ సాధనాఫలాలన్నీ ప్రసాదిస్తాడు. అందుకే గృహస్థాశ్రమము, దాని ధర్మాలను నిర్వర్తించటంలో తప్పులేదు గానీ, భగవంతుడి పాదపద్మాలపై మనసు నిలిపి నిష్కామబుద్ధితో నీ బాధ్యతలను నెరవేర్చాలి అని చెబుతాను. మానవమాత్రులైన మీకు భార్యాపిల్లలు, బంధువులు, బలగాలు ఉండటంలో తప్పులేదు కానీ, వాళ్ళకే బందీ అయిపోయి, వారి మాయలోనే పడిపోయి, భగవంతుని విస్మరించటం వల్లనే మీకు బంధాలు, బాధలు, బహుజన్మలు. ఎందరి మధ్యలో ఉన్నా అంతరంగంలో మాత్రం అందరివాడైన ఆ దేవదేవుడిపై భక్తిని పెంచుకోవాలి. కౄరుడైన కంసుడ్ని చంపి కృష్ణుడు కంసాంతకుడయ్యాడు. ఆయన చేతి వేణువులా, ఆయన పాదరేణువులా గడిపిన గోపగోపికలకు కరుణాంతరంగుడయ్యాడు. గోకులమంతా ఆబాలగోపాలుడితో,

**చరణ సేవకులకు సంసారభయమును బాపి శ్రీకరంబు పట్టు కలిగి**
**కామదాయియైన కరసరోజంబుమా మస్తకముల నునిచి మనువు మీశ**

ఓ స్వామీ! నీ పాదాలను సేవించే వారికి సంసారభయాన్ని పోగొట్టి మేలు కలుగచేయటంలో పట్టుదల గలిగినవాడవు. నీ హస్తంతో లక్ష్మీదేవిని పట్టినవాడవు. అలాంటి నీ చేయి మా శిరములపై ఉంచి, మమ్మల్ని రక్షించు అంటారు. అందుకే చెబుతాను, వినయంతోనే విద్య శోభిస్తుంది. అలాంటి విద్యతో వినయం సుసంపన్నం అవుతుంది. అలాంటి నిరహంకార స్వభావంతోపాటు, నిరాడంబర జీవనం తుదివరకూ సంసారాన్ని సుశాంతంగా ముందుకు నడిపిస్తాయి. దీనికి విరుద్ధంగా అహంకారం, ఆడంబరం జతకలిస్తే, మీ బ్రతుకులు అశాంతిపాలవుతాయి. మొదటిది మీలో కోపాన్ని పెంచుతుంది, రెండవది మీలో లోభాన్ని ప్రేరేపించుతుంది. కోపంవల్లే కలతలూ కలహాలు, లోభంవల్లే అక్రమాలూ అప్పులు. ఇవ్వన్నీ కలిసి మీలోని మానవీయ మాననీయగుణాల్ని దూరం చేసి, మాయం చేసి, మిమ్మల్ని భూమికే భారంగా మార్చేస్తాయి. ఎంత చదివితే అంత ఒదగాలి. ఎలాంటి రుణాలకు తావులేని సరళజీవనం గడపాలి. భూమి మిమ్మల్ని మోస్తున్నందుకు బాధపడే అవకాశమివ్వవద్దు. కోపాన్ని విడిచి శాంత స్వభావాన్ని అలవరచుకొని ఉండమని అనునయంగా చెబుతాను. ఎప్పుడూ ఎలాంటి తాపత్రయాలకూ తావు లేకుండా, మీకు దక్కాల్సింది దక్కుతుందన్న నమ్మకంతో ఉండాలి. ఎంతటి గడ్డు పరిస్థితిలోనూ ఎదుటివారిని అర్థించని ఆత్మగౌరవజీవనం గడపాలి. అదే ఆదర్శగృహస్థు లక్షణం. అందుకే ఎవరినీ ఎప్పుడూ యాచించకు. నీకు ప్రాప్తమైంది ఎప్పటికైనా నీకు లభిస్తుంది. ప్రాప్తం లేకపోతే లభించదు. లభ్యమైన దానితో సంతృప్తి చెందాలి. కానీ, ఈనాడు మీరు సంసారబాధితుల్లా మిగిలిపోవటానికి ప్రధానకారణం, ఏది చూస్తే అది మీకు దక్కాలనే అత్యాశ. ఎప్పుడు ఎవరి నుంచి ఏం లాభం పొందుదామా అనే దురాశ. దానికితోడు, కలియుగంలో మీరు అన్నగతప్రాణులు. నిరంతరం దేహపోషణ మీదే ధ్యాస.

పైగా, మీ పనేదో మీరు చూసుకోకుండా, అనవసరమైన విషయాల్లో తలదూర్చటం, ఫలితంగా ఉన్న సమస్యలతోపాటు క్రొత్త సమస్యల్ని సృష్టించుకుంటున్నారు. కొన్నిసార్లు, ఇతరుల మనసుకు కష్టం కలిగించి, వాళ్ళు పెట్టే శాపనార్థాలను భరిస్తున్నారు. వీటన్నింటినీ ఉటంకిస్తూ, మీకు మేలు కలగాలంటే, ముందు ఈ అవలక్షణాలన్నింటి నుంచి విముక్తి పొందాలి. ప్రాపంచికులకు పాపం మూటగట్టించే ప్రధాన మోహలక్షణం పరస్త్రీ వ్యామోహం. ఆ దుర్గుణంతో ఆనాడు దశకంఠుడు లాంటివాడే సర్వనాశనమయ్యాడని మీ అందరికీ తెలిసిందే. అయినా నేటికీ ఎంతోమంది ఈ మోహానికి వశులై, పశుప్రాయులుగా ప్రవర్తిస్తున్నారు. అందుకే రాముడ్ని ఇలా ప్రార్థించండి. "ఓ రామా! ఇతరుల ధనాన్ని, పరస్త్రీలను దొంగిలించాలనే కోరిక గల మా మనస్సు అనే దొంగను చేపట్టి, నీ సేవచే ప్రకాశించిన జ్ఞానమనెడు తాళ్ళచే బంధించి, నీ పాదములనెడు దేవతా కల్పవృక్షాలకు కట్టివేయమని కోరండి. మనసులో పరమాత్మ ప్రతిష్ఠుతుడైతే, తెలియకుండానే మీలో పవిత్రభావనలు పొడసూపుతాయి. పరస్త్రీలందరూ పూజ్యనీయులుగానే కన్పిస్తారు. ప్రక్కదారులన్నీ ముళ్ళదారులుగానే కన్పిస్తాయి.

మేధావులు ఆలోచనల గురించి, తెలివైనవాళ్ళు సంఘటనల గురించి, తెలివితక్కువవాళ్ళు మనుషుల గురించి చర్చిస్తారు.

***పాపం కృత్వాహి మన్యేత నాహమస్మీతి పూరుషః ।***
***తం తుదేవాః ప్రపశ్యంతి స్వపైవాః తర పూరుషః ॥***

ఎవడు పాపకార్యములను చేసి కూడా నేను పాపిని కాను అని తలుస్తాడో, వాడు భ్రమించినవాడే. ఎందుకంటే, అతడు చేస్తున్న పాపాలను దేవతలు, అతని అంతరాత్మ చూస్తూనే ఉన్నారు.

***సర్వవేళల యందు భగవంతుడే మీకు రక్షయగును***
***ప్రేమభిక్ష పెట్టి సౌఖ్యాన్ని అందించి***
***మీ మదిని మంచి మార్గములో నడుపును సతతము***
***భక్తితో మీరు భగవంతుని పాదములు పట్టి వీడకున్న, పరమసుఖము దొరకదే***
***తీపియన్న అదియే, తేనెకన్నా రుచి***
***దాన్ని పొందేవారి జన్మలే ధన్యములు***
***'నేను' అనేది దేహమందు కలవదు దేనితోను***
***తాను వేరుగానే యుండు కానీ మనిషి ఒడలు 'నేనే' యంటూ తొడగొట్టి మాట్లాడు***
***ఇట్టి మాయను నశ్వరంబుగా భావించు***
***అంతులేకయున్న ఆకాశమును బోలి***
***అంతరంగమందు శాంతియున్ననూ***
***లోకమెల్లా తానై ఏకత్వమునసుండు.***
***సముద్రమునందు పడిన బండనట్లు***
***బాధలోనున్న వారిని ఆదుకోండి***

***నీకు చేతనయిన విధములో ఆదుకో చేదుకో***
***దేహముతో ఉన్నంత కాలం సేవ చేసి***
***జగము సత్యము కాదు అనునది ఎరింగి***
***దేవులాడుట దేని కొరకు?***
***ధర్మమార్గములో నడచి ధనము కొరకై పరితపించక***
***పవమానసుతుడు బోధిస్తున్న బోధలతో***
***తృప్తియైన బ్రతుకునందుకొనుచు, బ్రతుకు అందించు ప్రాప్తిని పొందుతూ***
***మీ గతిని మార్చుకుని, గతమును తుడిపివేసి***
***తుది అడుగులుగా ఆంజనేయుని వైపు నడచి గమ్యం చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**16-11-2020** 11:50 AM

**144) మీరు మాకు ఎంతో దయతో, ప్రేమతో అందించిన ఈ కుటీర జీవితాన్ని మేము ఏ విధంగా అనుభవించాలి స్వామీ?**

*మీరెప్పుడైనా నా వద్దకు వచ్చి వెళ్ళేరోజు, స్వామీ! ఈసారి మీ దగ్గర వుండలేకపోయాను అని అన్నట్లయితే, ఒక్కక్షణం విరామం లేకుండా నావద్ద నుంచి సమాధానం ఒక్కటే రావాలి. అదేమంటే, ఈసారే నా దగ్గర ఉన్నారు, నామం చేస్తూనే ఉన్నారు అని చెప్పగలిగే విధంగా పుట్టపర్తి వచ్చి కుటీరంలో సాధన సల్పుతూ వుండాలి. మీకు ఏమి అర్థమైంది? భగవంతుని సాన్నిధ్యం అంటే పుట్టపర్తి వచ్చి కూర్చవటం కాదు. నామాన్ని ఎప్పుడైతే మీ మనస్సులో స్మరిస్తూ ఉంటారో, అప్పుడు మీకు నా సాన్నిధ్యం దొరుకుతుంది. భౌతికంగా మీరు నా వద్ద వున్నా ఒకటే, లేకపోయినా ఒకటే. నేనెప్పుడైనా నీవెవరవు తండ్రీ! నీవు తప్పకుండా నా దగ్గర ఉండాలయ్యా అని నేనడిగితే, మీ సమాధానం నన్ను మురిపించేలా స్వామీ! నేనుండలేనుగానీ, మీరుంచుకొనండి అని అడగాలని అన్పిస్తుంది. ఎందుకంటే నామం ద్వారా, నామజపం ద్వారా నా సాన్నిధ్యాన్ని మీరు అనుభవించవచ్చు. ఈ ఆంజనేయుడు లోకకుటుంబీకుడు. ఎందుకంటే, నాలోనే సమస్త విశ్వాన్ని, సమస్త విశ్వంలో నన్ను దర్శిస్తూ ఈ క్షేత్రాన్ని పరిపాలిస్తూ వుంటాను. ఈ కుటీర్‌కు రావడానికి, పోవడానికి ఎవరికైనా, ఎప్పుడైనా ద్వారాలు తెరిచే వుంటాయి, వుండాలి. ఇక్కడ ఉంటున్న మీరందరూ ఒకే చైతన్యంయొక్క వ్యక్తరూపాలని, ఒకే చెట్టుకొమ్మలని, ఒకే తల్లిబిడ్డలని భావించి జీవించాలని నా ఆశయం. సామూహిక జీవనంలో కొన్ని కష్టనష్టాలు ఉన్నమాట వాస్తవమే అయినా, అవన్నీ అజ్ఞానం వల్ల ఏర్పడిన కృత్రిమ అవరోధాలే తప్ప యదార్థానికి అనేకులు కలిసి ఉండటం, కలిసి పనిచేయడం, కలిసి కష్టసుఖాలను పంచుకోవటం ఉదాత్తజీవనం అని నా భావన. దీనిచే అహంకారం దూరమౌతుంది. వేరువేరుగా జీవిస్తున్నా, కష్టసుఖములు రెండూ తప్పటంలేదు కదా. పదిమందితో*

పంచుకుంటే కలిగే తృప్తి, ఆనందం వేరు. ఈ సత్యం మీ జీవితంలో అసలు గుర్తించకుండా ఉండరు. గుర్తించడం వల్లనే కదా, మీ ఇండ్లలో మామూలుగా శుభాశుభకార్యాలకు పదిమందినీ పిలవటం, వాళ్ళతో తాత్కాలికంగా అయినా కలిసివుండటం. అలాగే కుటీరానికి ఆహ్వానించి నామజపం అనే విందుభోజనాన్ని ఏర్పాటుచేయండి. ఇలా కలిసి జీవించడంలో వ్యక్తిగతంగా కొన్ని ఇబ్బందులున్నా, ఆ జీవితంలో వుండే నిండుదనం, ఉదాత్తత, వ్యష్టి జీవనంలో ఏ విధంగానూ రావు. ఈ సత్యాన్ని నా బిడ్డలు గుర్తించాలని, ఆచరించాలని, ఆనందించాలని, జీవితాలను సార్థకం చేసుకోవాలని నా ఆకాంక్ష. అందుకనే నా కుటీరాల్లో స్థానం కల్పిస్తున్నాను. జీవితంలో ప్రతి పనీ సాధనే అంటున్న నేను మీకు ఈ సాధనను అనుగ్రహించి, మీ అందరిలో వున్న రాగద్వేషాలను దూరం చేసుకుని, సుఖశాంతులను పొందాలని ఆశీర్వదిస్తున్నాను. రాగద్వేష అసూయలను పారద్రోలాలి. మీ అందరి కోసం కుటీరాలు నిర్మించి ప్రజాసేవ, ఆధ్యాత్మిక ప్రబోధాల ద్వారా, సామూహిక సాధనల ద్వారా ఉదాత్తము, త్యాగమయము అయిన జీవితానికి బాటలు వేస్తూ, సమాజంలో సుఖశాంతులు సాధించటానికి ప్రయత్నం చేయండని చెబుతున్నాను. ఒక విధంగా ఇది ఆశ్రమం కాదు, ఆశ్రయం. మీ అందరి మధ్య ప్రేమపూరితము, విశాలము అయిన పవిత్రమైన జీవనానికి బంగారుబాట ఏర్పాటు చేసి, తిండి, వసతి విషయంలో ఆందోళనను తొలగించి, నేనే ఆ బాధ్యత మొత్తం స్వీకరించి, తండ్రి ధర్మాన్ని నెరవేరుస్తున్నాను. ఈ విధమైన జీవనమే నిజమైన సాధనగా భావించి జీవించగలగడం వరం. ఇక్కడున్న ఈ అన్నపూర్ణాలయానికి, మందిరానికి తదితరమైనటువంటి వానికి కేంద్రము, బలము నేనే. సహనం, ప్రేమ, కారుణ్యం, త్యాగం ఉత్తమోత్తమ గుణాలు. నిత్యనూతనంగా ప్రకాశిస్తూ, నేను మీకు ఆరాధ్యదైవంగా అయ్యాను. నేను వాత్సల్యాన్ని వర్షించే తల్లిని, తండ్రిని మాత్రమేకాదు, ఆపదలో ఆదుకునే బాంధవుడ్ని. అజ్ఞానాన్ని రూపుమాపే గురువును. భయాన్ని, బాధలను దూరం చేసి వెన్నుతట్టి ధైర్యం ఇచ్చే అభయప్రదాతను. నేను కల్గించే రక్షణ, చూపించే వెలుగుబాట, నడిపించే తీరు, బోధించే పద్ధతి, సంస్కరించే విధానం అన్నీ అపురూపమైనవి, సమగ్రమైనవి. ఇది తండ్రి ఒడి, మమతల గర్భగుడి మాత్రమే కాదు, సమతల, మమతల పెద్దబడి కూడా. శ్రీరాముని సేతుబంధనంలోను, లోకకంటకుడైన రావణుని సంహరించడంలోను, నర వానరులకు ప్రవేశం ఉన్నట్లు, శ్రీకృష్ణుని విశ్వరక్షణలో అర్జునాదులకు, యాదవులకు సంబంధం ఉన్నట్లు, నేను కావించే ఈ లోకకళ్యాణ కార్యక్రమంలో మీరూ పాలుపంచుకునే అదృష్టాన్ని నేను మీకు అనుగ్రహిస్తున్నాను. ఉన్ముఖులై సంసిద్ధులు కావడం వాంఛనీయం. నేను ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ, వాచ్యంగానూ, సూచ్యంగానూ అదే విధంగా బోధిస్తూ, నా బిడ్డలకు అలవాటు చేస్తున్నాను. నా స్థితి సహజంగా అదే కనుక, బిడ్డలకు కూడా అది రుచ్యంగానూ, పథ్యంగానూ అనిపించి అనుసరించడం ద్వారా ఆరాధించడం సాధ్యపడుతుంది. నేను అపురూపమైన వ్యక్తిని, అనంతమైన శక్తిని. నానుండి అందరూ చేతనైతే నేర్చుకోవలసినది అవ్యాజంగా ప్రేమించడం, పంచిపెట్టడం, సమదృష్టి, సహనం, సానుభూతి, స్థితప్రజ్ఞత. నేను అనంత కళ్యాణ గుణరత్నాకరుడనని నా రాముడు శ్లాఘిస్తూ, లోకైక దీపాంకురాన్ని అని, అందుకే ఆ చల్లని వెలుగుకు అందరూ ఆకర్షించబడతారని, దర్శనంలో పరవశిస్తారని రామయ్య దీవెన. ఎప్పుడూ చూస్తూనే ఉండాలని ఉవ్విళ్ళూరుతుంటారని, ఇంత మంచితనం కనీ వినీ ఎరుగలేము గదా అని నన్ను అందరిచేత పొగిడించేవాడు. అందుకే అది నేను ఒక్కడినే అనుభవిస్తే చాలదు గదా! నా బిడ్డలకు కావాలి. ఎందుకంటే, మీరు తింటే నేను తిన్నట్లే. మీరు

తినకపోతే చిక్కిపోతారు. మీకు పెట్టకపోతే నేను చిక్కిపోతాను అని అంటున్నాను. అందుకే మీకు పరిపూర్ణంగా వడ్డించటానికి సంసిద్ధమై కుటీరాలలో కూర్చున్నాను. దేశ కాల పరిధులను అతిక్రమించి, ఇక్కడ ఎందరెందరో మీమీ బ్రతుకులను పండించాలనుకుంటున్నాను. నా దివ్యసన్నిధిలో తృప్తిని, శాంతిని, ఆనందాన్ని అనుభవించండి. మీ అందరికీ సౌకర్యాలను పెంచి, అనతికాలంలో ఫలప్రదాతై, ప్రేమ, సహనం, త్యాగం, సేవ వంటి ఆదర్శాలను ఆచరణసాధ్యాలని నిరూపించగల ఒక వినూత్నమైన బిడ్డలుగా తయారుకండి. సిద్ధసంకల్పుడైన ఈ ఆంజనేయుడు ఈ అవకాశాన్ని మీ అందరికీ ఇచ్చి, వినియోగించుకునే ధైర్యాన్ని ప్రసాదిస్తున్నాను.

**యేషు విప్రతి వద్యంతే షట్సు మోహాత్మలాగమమ్ ।**
**తే ష్వధ్య వసిరాధ్యాయీ విందతే ధ్యానజం ఫలమ్ ॥**

*శబ్దము మొదలైన ఇంద్రియ విషయాల వలన కలిగే ప్రాప్తి, విషంలోని మోహం వల్ల మానవులు సంశయంలో మునిగిపోతున్నారు. ఆయా ఇంద్రియ విషయాల పరిణామాన్ని ఆలోచన చేసేవారు మాత్రం ధ్యానం వల్ల కలిగే ఫలితాన్ని పొందుతారు.*

కాలానికి మీరు ఇచ్చే విలువ మీ విలువను పెంచుతుంటే,
డబ్బుకి మీరు ఇచ్చే విలువ ఆపదలో ఆదుకుంటుంది.
మనిషికి మీరు ఇచ్చే విలువ మనసులో సుస్థిరస్థానాన్ని నిలుపుతుంది.

***హంగుల కోసం ఏడుస్తున్నా, ఆర్భాటాల కోసం పరితపిస్తున్నా,***
***పొగడత్తల కోసం పరిగెడుతున్నా, పాపాలు లెక్కలేకుండా చేస్తున్నా,***
***నివురుగప్పిన నిప్పులా మసలుతున్నా, రక్షకతంత్రాలతో ముందుకు పోతున్నా,***
***నటనలో ఎప్పుడూ జీవిస్తున్నా, మత్తులో దిగజారిపోతున్నా,***
***మూఢనమ్మకాలలో మునిగిపోతున్నా, మంచిని సమూలంగా చంపేస్తున్నా,***
***మానవత్వాన్ని ఎక్కిరిస్తున్నా, ప్రేమించేవారిని నిందిస్తున్నా,***
***కపటజపాలు చేస్తున్నా, భక్తిముసుగును తొడిగేస్తున్నా,***
***చేయకూడని వాటిని చేస్తున్నా, పేరు కోసం ఆరాటపడుతున్నా,***
***సమాజాన్ని నిలువెల్లా కాల్చేస్తున్నా, కర్మ చేతిలో తప్పించుకోలేకపోతున్నా,***
***ఏడుపును నవ్వుతో కప్పేస్తున్నా, చివరకు ఛస్తూ బ్రతికేస్తున్నా,***
***ఎన్నాళ్ళీ నియంత్రణ? ఎన్నాళ్ళీ నిరీక్షణ?***
***ఎంతకాలం? ఇంకెంతకాలం?***
***అంధకారబంధురాన జీవించక***
***ఆంజనేయుని చేరి అనతికాలంలోనే బంధాలను త్రెంచుకుని***
***బాంధవుడిని చేరి సదా సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**17-11-2020** 09:20 AM

**145) మాకు ఆనందం ఎలా ప్రాప్తిస్తుంది స్వామీ?**

*మానవుడు ప్రతిదినం, ప్రతిక్షణం ఆనందము నభిలషించియే కర్మలనాచరిస్తున్నాడు. కానీ, ఆనందాన్ని అనుభవిస్తున్నాడా? లేదు. ఎన్ని కఠినమైన సాధనలు చేసినప్పటికీ, ఎన్ని కార్యములు ఆచరించినప్పటికీ తాను ఆశించిన ఆనందమును నోచుకోలేకపోతున్నాడు. భౌతికంగా, వైజ్ఞానికంగా ఎంతో పురోగతిని సాధించినా, నైతికంగా, ధార్మికంగా, ఆధ్యాత్మికంగా దిగజారిపోతున్నాడు. ప్రాకృతమైన వాంఛల నిమిత్తమై, కాలమును, ప్రాయమును, కర్మలను వినియోగం చేస్తున్నాడు. అనేక జన్మల నుండి, స్వార్థ స్వప్రయోజనాపేక్ష మానవుల హృదయంలో నాటుకుపోయింది. ఇదే మానవుని అశాంతికి గురిచేస్తున్నది. తన అభీష్టం నెరవేరితే అహంకారం పెరుగుతుంది. అభీష్టం విఫలమైతే అసూయ అభివృద్ధి చెందుతుంది. అంటే, ఏ విధంగానైనా దుర్గుణాలే అభివృద్ధి చెందుతున్నాయి. తన హృదయం పవిత్రం గావించుకోకపోవటమే అందుకు కారణం. మానవుని హృదయం కరుణతో నిండివుండాలి. తన జీవిత పరమావధిని గుర్తించటానికి ప్రయత్నించాలి. తన కర్తవ్యమును నిర్వర్తించినప్పుడే ఆనందం ప్రాప్తిస్తుంది. కర్తవ్యనిర్వహణే దైవారాధన. ఏది జరిగినా, మీ మంచికోసమే అని భావించాలి. మొట్టమొదట మానవత్వంలోని దివ్యత్వమును గుర్తించాలి, అర్థం చేసుకోవాలి. ఏది చేసినా, ఏది చూసినా, ఏది చెప్పినా, ఏది అనుభవించినా అంతా దైవసంకల్పం వలననే జరుగుతుందని, మానవుడు నిమిత్తమాత్రుడేనని, ఎప్పటికీ సూత్రధారుడు కాడనీ గ్రహించాలి. మీరు దేహముతో కర్మలనాచరించి, సత్ఫలితాలను పొందుతున్నారు. అయితే, భగవంతుని సంకల్పముతో మాత్రమే కర్మలనాచరిస్తున్నారని తెలుసుకోగలగాలి. గుండె ఆడుటకు, దేహంలో రక్తప్రసారం జరుగుటకు, భుజించిన అన్నం అరుగుటకు మీరు ఏమి ప్రయత్నం చేస్తున్నారు? మంచిచెడ్డలన్నింటికీ కారణం దైవసంకల్పమే అని చెబుతాను. వివేకమున వర్తించెదమని కడు విర్రవీగెదరు గానీ, చివరికేవేళ ఏమి జరుగునో తెలియజాలరెంతటి వారయినా. ఒక అడుగు ముందు పెట్టినా, రెండవ అడుగు వేసే లోపల ఏమవుతుందో తెలియదు. భవిష్యత్తు మీ హస్తంలో లేదు. ఒక గృహమునకు పునాది వేశారు. అది పూర్తయిన తర్వాత ఘనంగా ప్రారంభోత్సవము జరపాలని అనుకుంటారు. కానీ, అంతవరకూ మీరు ఉంటారన్న గ్యారంటీ ఏమిటి? కనుక, భగవంతునిపై భారం వేసి, మీ కర్తవ్యమును మీరు నిర్వర్తించటం అత్యవసరం. సమిష్టితత్త్వమే దైవత్వం. మీ అంతరాత్మయే దీనికి సరియైన సాక్ష్యం. అంతరాత్మను అనుసరించియే తీరాలి. అప్పుడే సరియైన ఫలితం లభ్యమవుతుంది. అంతరాత్మను నమ్మలేనివారికి ఏదీ ఫలించదు.*

**ఏకం విషరసో హన్తి శస్త్రేణై కశ్చ వధ్యతే ।**
**సరాష్ట్రం స ప్రజం హన్తి రాజానాం మన్త్ర విప్లవః ॥**

విషము ఒక మనిషిని మాత్రమే చంపగలదు. శస్త్రమున్నూ ఒకనినే చంపును.
కానీ, మన్త్ర విప్లవము రాష్ట్రముతో, ప్రజలతో కూడుకొనిన రాజునే నాశనము చేయగలదు.

తియ్యటి నీరు నింపుకున్న బావి మౌనంగా వుంటుంది.
అదే ఉప్పునీటితోనున్న సముద్రం గర్జిస్తూ వుంటుంది.
అలాగే, అజ్ఞాని అరుస్తూ వుంటాడు, జ్ఞాని మౌనంగా ఉంటాడు.

***అల్లకల్లోలం చేసుకుంటున్న మానవజీవితాలను తీర్చిదిద్దటానికై వచ్చిన***
***ఈ అసమాన ప్రతాపుడు ఆంజనేయుడు***
***అనతికాలంలోనే ఆత్మీయులైన నా బిడ్డలకు అలంకారమును చేర్చి***
***అందమైన వానిగా తీర్చిదిద్దుటకు కంకణం ధరించి***
***ధగధగలాడు ఆత్మసామ్రాజ్యమునకు గొనిపోయి***
***తీర్చిదిద్దు పరిశ్రమలో పాండిత్యవంతులై***
***పవనకుమారుని ప్రతిభను గైకొని గైరుహాజరు వేసుకుని***
***హాయిహాయిగా రామసామ్రాజ్యానికి తరలివచ్చి, తనువును వదిలి***
***త్యాగమయులై, రామమయులై, హనుమాన్ ప్రీతిపాత్రులై***
***సదా సుఖించండి నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**16-12-2020** 04:40 PM

*1. ఎందరో భ్రమపడుతున్నట్లు, బాధ్యతల నుంచి తప్పుకోవటం మీకు తలవంపేమీ కాదు. ఆమాత్రం పనులను, పెత్తనాన్ని వదులుకోవటానికి మనసు విలవిలలాడిపోతే, ఏదో ఒకనాడు బాధ్యతల్నే కాదు, బంధాల్నీ వదిలేసుకోవాలి కదా! ఆ పరిస్థితి నుంచి ఎలా తప్పించుకుకుంటారు? అందుకే ఈ చిన్న నిర్గమనాలు మిమ్ములను ఆ మహానిష్క్రమణకు మానసికంగా సంసిద్ధుల్ని చేస్తాయి.*

*2. ప్రతీ నివృత్తి, అనుభవం మీ జీవన ప్రస్థానంలో మరపురాని మజిలీగా మిగిలిపోతుంది. రాలే ప్రతి ఆకూ, చెట్టుకు ఓ పాఠాన్ని నేర్పుతుంది. అందుకే ఆకులన్నీ రాలి మోడువారిన మానులో కూడా ఓ తెలియని అందం, అంతకు మించి గాంభీర్యం ఉట్టిపడుతుంది. అలాగే మీ జీవన నిష్క్రమణ అనుభవాలు, అనుభూతులు కూడా!*

*3. వీడ్కోలు రూపంలో మీరు కొందరికి దూరమైతే, మీకు కొందరు దూరమై వియోగ మాధుర్యాన్ని పంచిపెడతారు. పోగొట్టుకున్న ప్రేమలతో జీవితం మరింత సుసంపన్నం కావాలి.*

*4. నిష్క్రమణ ఆధ్యాత్మికంగా అంతర్యోగంగా కూడా తోడ్పడుతుంది.*

*5. కొందరు సన్యాసులకు అనేకమైన బాధ్యతలనప్పగించి, వారు ఊపిరి సలుపుకోలేనంతగా అశేషమైన భక్తపరివారంతో ఒక వెలుగు వెలిగేలా వుంచి, చరమాంకంలో ఎవరితోనూ సంబంధం లేకుండా ఏకాంతంగా తమ కాలాన్ని గడిపేలా చేస్తాను. వాళ్ళ వరకూ వాళ్ళు ఒంటరిగా ఎవరికీ పట్టనట్లుగా ఉంటూ వుంటారు.*

బయట నుంచి వాళ్ళను చూచిన వారికి వారి స్థితి ఏమిటో సాధారణ దృష్టితో చూస్తే అర్థం కాదు.

6. జ్ఞానదీపికల్లాంటి వారి జ్ఞాపకాలను తరచి చూచినప్పుడు మాత్రం ముఖంలో తేజస్సు తళుక్కుమంటుంది. ఆ వయస్సులో కూడా ఆ వరిష్ట సాధువులను ముందుకు నడిపిస్తున్నది నిస్సంగత్వమే.

7. ఈ లోకం నుంచి నిష్క్రమించే సమయంలో కూడా ప్రశాంతంగా గడపటానికి శారీరక ఆరోగ్యం కన్నా ముఖ్యమైంది మానసిక నిస్సంగత్వమే.

8. ఎంత ఉత్సాహంగా కార్యరంగంలోకి ప్రవేశిస్తారో, అంతే ఉత్సాహంగా అక్కడి నుండి నిష్క్రమించగలగాలి. మీ అంతరంగాన్నే ఆరామస్థలిని చేసుకుని, ఆఖరిక్షణాల వరకూ ఆనందంతో గడపాలి.

9. ప్రకృతిని శాసించి నిలబడాలి. జడపదార్థంపై చైతన్యం సాధించే విజయమే మానవ నాగరికత. ప్రకృతిలో జడపదార్థానికి, చైతన్యానికి జరిగే ఈ చిరు సంగ్రామానికి నిత్యప్రయోగశాల సజీవ మానవదేహం.

10. ఈ సంగ్రామం రసవత్తరంగా మారుతుంది. దాదాపు అన్ని సందర్భాలలో శరీరం తనకు శక్తినిచ్చిన చైతన్యం పైననే ఆధిపత్యం చలాయించి, చైతన్యవంతమైన మనిషిని అంతగా కృంగదీస్తుంది. శరీరాన్ని అధిగమించడం ద్వారా మానసికవ్యాధి అనే పరాజయాన్ని పరాభవించి, ఈ జడారణ్యంలో చైతన్యబావుటాను ఎగురవేస్తారు. ఆ చైతన్యదీప్తితో, తోటి మనుషులలో నిరంతర స్ఫూర్తిని నింపగలగాలి.

11. మీ తోడై, నీడై, జీవించే ప్రతీక్షణం, మరణం తర్వాత కూడా జన్మజన్మలుగా మీతోనే వుండి, మిమ్మల్ని ప్రేమించే నన్ను తెలుసుకోలేక ప్రేమను పంచలేక, బాధను పంచుతున్నారు.

12. నా ప్రేమను గుర్తించండి. కోరికల హోరులేని నిశ్శబ్దంలో మీ కోసం ఎదురుచూస్తుంటాను. మీ చల్లటి ప్రేమను కురిపించండి.

13. కోరికలతో మళ్ళీమళ్ళీ జన్మలెత్తుతూ, కష్టాలను భరిస్తూ, అశాశ్విత సుఖాలను నిజమైన సుఖాలని అనుకోకండి. ఆస్తులను కూడబెట్టుకుంటున్నామంటూ, పాపాలను పెంచుకోకండి. అశాంతితో జీవితాన్ని గడపక, ముందుతరాలకు భక్తిజ్ఞానాలను కానుకగా ఇవ్వండి. జీవితసత్యాన్ని, నా తత్త్వాన్ని గ్రహించగల మానసిక శక్తిని పొందండి. నన్ను ప్రేమించడమంటే సమస్త ప్రాణికోటిని ప్రేమించడం, ఆ ప్రేమే నా అనుగ్రహమని, మహా ఐశ్వర్యమని, ఆశీర్వచనమని గ్రహించండి. అప్పుడు అనుక్షణం మీ తల్లినై, తండ్రినై ప్రేమ నిండిన హృదయంలో మీతో ఉంటానని గ్రహించి మీ పిల్లలకు కూడా చెప్పండి.

14. పవిత్ర గంగా స్నానంతో మనోమాలిన్యం ప్రక్షాళనమై, శుద్ధ మనస్సు ఓ నూతన దైవారాధనకు ఉవ్విళ్ళూరుతుంది. ఆయన ప్రేమైశ్వర్యానికి వారసుడివన్న భావం నిలువెల్లా ముంచెత్తుతూ, క్రొత్తక్రొత్త శక్తినిచ్చి, మిమ్ములను ముందుకు నడపాలి లేదా ఈ ఆంజనేయునికి దూరంగా జరగండి.

15. మా హృదయం వేరు. నా హృదయం మిమ్ములను ప్రేమపాత్రులుగా చూడాలని పరితపిస్తుంది. నా ఐశ్వర్యానికి వారసులను చెయ్యాలని వుంటుంది. శుద్ధభక్తి, జ్ఞానవిజ్ఞానాలు, మోక్షేచ్ఛ, సాధుసంగమం,

నామసంకీర్తన – ఇవీ నా అసలైన అనుగ్రహఫలాలు. భక్తి జ్ఞాన వైరాగ్యాలు అఖండశక్తిని ప్రసాదిస్తాయి. ఆ శక్తితో మనసును జయించగలిగితే, హృదయకవాటాలు తెరుచుకుని, నా ప్రేమపూర్వకమైన పిలుపు, మీ క్షేమం కోరే నామాట వినగలుగుతారు. అప్పుడు మీకు మత్తు వదిలి జీవితపరమార్థం బోధపడి, అంతులేని సంసార తాపత్రయాల నుండి విముక్తులవుతారు. అలా విముక్తులైన వారిని చూచి, నా హృదయం ఉప్పొంగుతుంది. నాకూ బాధే. ఆ బాధే లేకపోతే పదేపదే అవతారాలతో మానవరూపం దాల్చి, అనేక బాధలకోర్చి మీకోసం ఎందుకు రావాలి? ఈ ఆంజనేయుడు మీ ముందుకు ఎందుకు రావాలి? ఎందుకు చెప్పాలి? ఎందుకు? ఎందుకు? ఎందుకు?

ॐ

**17-12-2020** 05:35 PM

1. మీరు మరణించిన తర్వాత కూడా అనేకమందికి మార్గదర్శకులు కావాలి. అందువలన, ప్రపంచం గురించి, అందలి వ్యక్తులను గురించి అతిగా, అనవసరంగా ఆలోచించి, కలత చెందవచ్చు. మిమ్ములను మీరు సంస్కరించుకునే కార్యక్రమాన్ని ప్రారంభించండి. అంతేగాక, పరిపూర్ణత్వం సిద్ధించిన తర్వాత ప్రపంచంలోకి వెళ్ళగలిగితే, ప్రపంచం నిన్ను తప్పనిసరిగా స్వీకరిస్తుంది. అట్టి స్థితిలో ప్రపంచం మారినా, మారకపోయినా మీ అంతరంగం మాత్రం ఎల్లప్పుడూ సంతృప్తిగానే ఉంటుంది. పూర్ణత్వం నుండి ప్రపంచానికి సేవ చేస్తున్నప్పుడు, ఫలితాన్ని ఆశించడముండదు. అట్టి స్థితిలో చేసిన సేవలకు ఫలితం రాకపోయినా నిరాశానిస్పృహలు వుండవు. మీ అంతరంగం ఆనందంగా వుంటే, మీరు ఏమీ చేయకపోయినా నిరంతరం సేవలు చేస్తున్నట్లే. అందుకే సమాజసేవ కన్నా, ఆత్మసేవ అత్యుత్తమమైనది. ఆత్మసేవ అంటే, ఎవరికి వారు తమను తాము ఉద్ధరించుకోవడమే. అదే అత్యంత విశిష్ఠమైన సేవ అవుతుంది. అదే మానవజీవిత పరమార్థం.

2. గతాగతములను విస్మరించి వర్తమానంలో జీవించడం నేర్చుకోండి.
3. జీవితప్రయాణంలో లగేజ్‌ను తగ్గించుకోండి.
4. త్యాగానురక్తిని, భోగవిరక్తిని పెంచుకోండి.
5. ఆత్మవిశ్వాసంతో భగవంతుని ప్రార్థించాలి.
6. ఒకే చింతన, ఒకే విశ్వాసమూ ఉండాలి.

మీ అందరికీ, అందరినీ ప్రార్థిస్తూ ఒకే ఒక్కమాట చెబుతున్నాను.
నేను మిమ్ములను ఆశీర్వదించటానికి రావచ్చు. మీరు పిలువవచ్చు.
కానీ, ఎప్పుడూ ఎప్పుడూ ఎప్పుడూ మిమ్ములను సరిచేయుటకు రాకూడదు.
ఇది గుర్తించవలసిన విషయము!

ॐ

**03-01-2021** 10:15 AM

## 146) జీవితంలో మేము ఆచరించవలసిన సూక్తులు తెలుసుకోవలెనని ఉన్నది స్వామీ?

*మానవులుగా బ్రతకటం కాదు, మానవత్వంతో బ్రతకాలి. ఐకమత్యం అంటే మీరు కుక్క మీద రాయి విసిరితే, కుక్క పారిపోతుంది. అదే తేనెతుట్టె మీద రాయి విసిరితే, మీరే పారిపోవాలి. ఇద్దరు కొట్టుకుంటే, ఒక్కరే గెలుస్తారు. రాజీ పడితే, ఇద్దరూ గెలుస్తారు. దేవుడి కోసం తీర్థాలు, పుణ్యక్షేత్రాలు తిరుగుతారు. ఆయనెక్కడో లేడు. శ్వాస తీసుకుంటూ సృష్టిలో నువ్వేసుకున్న లంకెలోనే వున్నాడు. సృష్టంతా అద్భుతమే. అందులో నువ్వూ ఒక భాగమే. ఆ అద్భుతమే భగవానుడు. అది తెలుసుకుని, దాన్ని అనుభవించండి, ఆనందించండి. కష్టమొస్తే భగవంతుడ్ని కొలుస్తారు. ఆయన నీకు రాబోయే కష్టాన్ని ఆపడు. నిత్యం స్మరిస్తే కొండంత కష్టాన్ని గోరంత చేసి సులువుగా దాటే శక్తిని నీకిస్తాడు. కష్టాలు కుంభవృష్టిలా నిన్ను ముంచేస్తే, నీకు గొడుగుపట్టి కాపాడుతాడు, గుర్తుంచుకోండి. జ్ఞానం ఆలోచించి మాట్లాడుతుంది, అజ్ఞానం మాట జారాక ఆలోచిస్తుంది. అమాంతంగా అజ్ఞానం పోయి జ్ఞానం రాదు. కొబ్బరిచెట్టు పెరిగేకొద్దీ, పాత మట్టలు రాలిపోతాయి. జ్ఞానం కలిగేకొద్దీ తన-పర భేదాలు తొలగిపోతాయి. పుండు మానితే, పొలుసు అదే రాలిపోతుంది. పుండు మానకుండానే పొలుసు పీకేస్తే, పుండు తీవ్రమై, రక్తం కారుతుంది. జ్ఞానసిద్ధి అంచెలంచెలుగా కలగాలి. ఆత్రం పడితే లాభం లేదు. సముద్రమంత సమస్య వచ్చిందని దిగులుపడకండి. ఆకాశమంత అవకాశం కూడా వుంది. తలెత్తి చూడండి ముందు. నీపై నీకు నమ్మకం కావాలి. నీపై నీకు వున్న బలమే నమ్మకం. నీపై అపనమ్మకం అవతలివారికి బలం. నీ బలం ఎవరికీ తెలియకపోయినా, నీవు బ్రతికేయవచ్చును. నీ బలహీనత మాత్రం ఎవరికీ తెలియనివ్వకు. నిన్ను నిన్నుగా బ్రతకనివ్వరు. మరణం మధురమైనది. అంత మధురమైనదా అని అంటే, ఒక్కసారి దాన్ని కలసినవారు వదిలిపెట్టలేరు. ప్రకృతికి కూడా, అదంటే ఎంత పక్షపాతమో చూడండి. ప్రాణంపోయిన జీవుల్ని నీళ్ళల్లో తేలుస్తుంది. ప్రాణమున్న జీవుల్ని ముంచుతుంది. మీ పరిసరాలను ఎంత శుభ్రంగా వుంచినా, మీకు అనారోగ్యం రావచ్చు. బుద్ధి అనే ఆసుపత్రిలో, ఆలోచనలు అనే వైద్యుడు నీరోగాలను తగ్గించగలడు. వాటిని ఆరోగ్యంగా వుంచుకోండి. వెంటరాని ఇంటిని, ఒంటిని రోజూ కడుగుతారు. మీ వెంట వచ్చే మనసును ఎప్పుడు కడుగుతారు? నిజాయితీపరులు సింహం లాంటి వాళ్ళు. సింహం కూర్చోవడానికి సింహాసనమెందుకూ? అదెక్కడ కూర్చుంటే అదే సింహాసనం. నిజమైన నిజాయితీపరులకు గుర్తింపు అక్కర్లేదు. ముని, మహర్షి, తపస్వి, యోగి - వీరు వేరు వేరు. మౌనంగా వుండేవాడు ముని. నియమనిష్టలతో తపస్సు చేసుకునేవాడు తపస్వి. అతీంద్రియ శక్తుల్ని ఆకళింపు చేసుకున్నవాడు ఋషి. ధ్యానంలో మునిగి వుండేవాడు యోగి. పండు తింటే అరిగిపోతుంది - తినకపోతే ఎండిపోతుంది. జీవితం మీరు ఖుషీగా గడిపినా గడపకపోయినా, భయపడుతూ గడిపినా కరిగిపోతుంది. ఇప్పటిదాకా ఇతరుల కోసమే (నావాళ్ళనుకుంటూ) బ్రతికేశారు. ఇప్పటికైనా ఆరోగ్యంగా, ఆనందంగా మీ కోసమే మీరు బ్రతకండి. వచ్చే జన్మలో మీరెవరో, ఎక్కడ ఎలా పుడతారో! అసలు జన్మ వుందో లేదో తెలీదు. మీరు నావాళ్ళు నావాళ్ళు అనుకుంటుంటే, వాళ్ళు*

*తర్వాత, వాళ్ళ వాళ్ళ కోసమే బ్రతుకుతారు. మీకంటూ ఎవరూ వుండరు. ఏమీ మిగలదు. అర్థం చేసుకుంటే, పుట్టిన దగ్గరనుంచీ పోయేందుకే మీ ప్రయాణం. ఈ మాత్రం దానికి పుట్టడమెందుకో తెలియదు. తెలుసుకోవడంలోనే వుంది కిటుకంతా. అందుకే ఈ జీవితమంతా! మరణం దగ్గర పడితేనే మహాసత్యాలు బోధపడ్తాయి. పనిచేయడానికి పనిమనిషి దొరుకుతుంది. వంట చెయ్యడానికి వంటమనిషి దొరుకుతుంది. రోగమొస్తే మీ బదులు భరించటానికి ఎవరూ దొరకరు. వస్తువుపోతే దొరకవచ్చు. జీవితం పోతే మళ్ళీ దొరకదు. తెరపడే రోజు ఏం తెలిసినా, ప్రయోజనమేమిటి? ప్రక్కనెంతమంది వున్నా, ఎంత సంపదున్నా ప్రయోజనమేమిటి? 30 లక్షల కారైనా, 3 వేల సైకిలైనా రోడ్డు ఒకటే. పది అంతస్తుల మేడైనా, పూరిగుడిసైనా వదిలేసే పోవాలి. జనరల్ బోగీలో వెళ్ళినా, ఫస్ట్‌క్లాస్‌లో ప్రయాణించినా స్టేషన్ రాంగానే ఒకేసారి దిగిపోతారు. అందరూ మానవులుగా బ్రతకటం కాదు, మానవత్వంతో బ్రతకాలి. దేవుడు చాలా తెలివైనవాడు. ఎందుకంటే బాల్యంలో ఏ టెన్షన్ లేకుండా తిరుగుతుంటే తీసి స్కూలులో వేస్తారు. టెన్షన్ స్టార్ట్ అవుతుంది. స్కూల్ అయిపోయి కాలేజిలో ఎంజాయ్ చేద్దాం అనుకుంటే, బాధ్యత గుర్తు చేస్తాడు. సరే, జాబ్ చేస్తూ ఎంజాయ్ చేద్దాం అనుకుంటే, డబ్బు మీద ఆశను పుట్టిస్తాడు. డబ్బు మోజులో పడిపోయి కొట్టుకుపోతుంటే, లాగిపట్టి ఒకటి పీకి "ఆరోగ్యం జాగ్రత్త!" అని గుర్తుచేస్తాడు. శక్తి లేనప్పుడు మమ్మల్ని చూసుకోవటానికి ఎవరుంటారు అనుకున్నప్పుడు, భార్యను పంపిస్తాడు. సరే, భార్యాపిల్లలతో ఎంజాయ్ చేద్దాం అనుకుంటే, పిల్లల భవిష్యత్తు అంటారు. పిల్లల కోసం డబ్బు వెంట పరిగెడితే ప్రేమను కోల్పోతున్నావని గుర్తు చేస్తాడు. కానీ, ఒకటి కావాలంటే ఒకటి వదులుకోవాలి అని మనిషి, ఈసారి దేవుడి మాట వినడు. కట్టలకొద్ది రూపాయలు కూడబెడతాడు. హమ్మయ్య అని ఇంటికి తిరిగి వచ్చేసరికి, పిల్లలతో ఆడుకోవడానికి ఎవ్వరూ వుండరు. పిల్లలు పెద్దవాళ్ళైపోతారు. సరే, పిల్లలకు పెళ్ళిచేసి కనీసం వాళ్ళ పిల్లలతో అయినా ఆడుకుందాం అనుకుంటే, వారి పిల్లలు వాళ్ళ భవిష్యత్తు అని ఎక్కడికో ఎగిరిపోతారు. శక్తి మొత్తం క్షీణించి ఏమీ చేయలేని ముసలి వయస్సులో జీవితం కళ్ళ ముందు కదలాడుతుంది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటాయి. అప్పుడొస్తాడు దేవుడు. "ఏడ్చింది చాలు నాయనా! నీ టైం అయిపోయింది. వెళ్దాం పద!" అని తీసుకెళ్ళిపోతాడు. ఇదే సగటు మనిషి జీవితం. దీని నుంచి బయట పడండి. భగవంతుడు చెప్పిన దానిని వినండి. తెలుసుకొని నడవండి!*

***నేను, నాది, నావాళ్ళు అనే అహంకారంతో***
***నాకే కాక అన్నీ నా వారికే అనే అత్యాశతో***
***నాకేం, నేనే గొప్ప అనే అహంతో***
***నీవే నన్ను ప్రేమించాలనే అవివేకంతో***
***నీతో నాకేం పనిలేదన్న అజ్ఞానంతో***
***నన్ను తలచడం మానినప్పుడు***
***నీతిగా బ్రతకటం లేనప్పుడు,***
***మమకారం దూరమై, అనురాగం భారమై***
***నీ హృదయాన్ని ఎందుకు మండిస్తావు?***

***క్రూరంగా ఇంకా నన్నెందుకు దండిస్తావు?***
***మానవాళినంతటా కమ్ముకున్న***
***ఈ మాయా మోహపు అజ్ఞాన బడబాగ్నిని చల్లార్చుకొని***
***అద్వైత జ్ఞానోదయం కల్గించు***
***ఈ ఆంజనేయుని చేరి సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**04-01-2021** 10:10 AM

**147) స్వామీ! గురువు యొక్క మాట ఫలిస్తుంది అంటారు కదా స్వామీ?**

*ఈ రోజు మీకు ఒక కథ చెబుతాను. ఎందుకంటే, సద్గురువు మాటలకు ఎంత విలువ ఉన్నదో తెలపటానికి ఉపయోగపడ్తుంది. ఒకానొకప్పుడు ఒక గురువుగారు, ఆయన శిష్యుడు నది నుండి వారి ఆశ్రమానికి వెళ్తున్నారు. ఇంతలో హఠాత్తుగా గురువుగారు ఒక మహావృక్షం ముందు ఆగి, ప్రసన్నంగా నవ్వుతూ, "తథాస్తు!" అన్నారు. గురువుగారి చర్యకి కారణం ఏమిటీ అని అడిగాడు శిష్యుడు. "ఆ మహావృక్షం తన కోరికని, ప్రక్కనున్న మరో వృక్షంతో చెబుతుంటే, నాకు వినబడి, తథాస్తు అన్నాను" అని గురువుగారు చెప్పగా, "ఏమిటా కోరిక గురువుగారూ?" అని శిష్యుడు అడిగాడు. "చక్రవర్తి అయి, భూమండలాన్ని ఏలాలని కోరుకుంటున్నది". "వచ్చే జన్మలోనా?" "కాదు ఈ జన్మలోనే". శిష్యుడు పగలబడి నవ్వాడు. "గురువుగారూ! ఇది గొంతెమ్మ కోరిక గదూ? అంత అత్యాశ తగునా? అర్హత చూసుకోవాల్సిన పనిలేదా?" అన్నాడు శిష్యుడు. "అర్హతకేం నాయనా? జీవితమంతా ప్రతిఫలాపేక్ష లేకుండా, ఎన్నో జీవరాశులకు ఆశ్రయం ఇచ్చింది. ఎన్నో ఫలాలను ఇచ్చింది. అదంతా పుణ్యమే కదా!" "అవుననుకోండి, కానీ చెట్టు చక్రవర్తి ఎలా అవుతుంది?" అన్నాడు శిష్యుడు. "అది విని, "ఏమో! భగవంతుడు సంకల్పిస్తే, ఏమైనా కావచ్చు" అన్నాడు గురువుగారు. ఆ రాత్రి పెద్ద గాలి వాన వచ్చి, ఆ మహావృక్షం నేలకూలింది. శిష్యుడు నవ్వుకున్నాడు. అంతటితో ఆ విషయం మర్చిపోయాడు. సరిగ్గా సంవత్సరం తర్వాత ఒకరోజు ఆ శిష్యుడు పరుగుపరుగున వస్తూ "గురువుగారూ! ఈ వింత విన్నారా? శ్రీరామచంద్రులవారి పాదుకలకి పట్టాభిషేకము చేశారు వారి సోదరులు భరతులవారు. ఇక నుండి పధ్నాలుగేళ్ళు పాదుకలు సామ్రాజ్యాన్ని పరిపాలిస్తాయట" అన్నాడు. దానికి గురువుగారు నవ్వి, "చెట్టు చక్రవర్తి ఎలా అవుతుంది అన్నావు. ఇప్పుడు అయింది కదా!" అన్నారు. "అంటే?" అడిగాడు శిష్యుడు. "అవును నాయనా! ఆ మహావృక్షం కలపతోనే వడ్రంగులు పాదుకలు చేశారు. అవి శ్రీరామచంద్రులవారికి సమర్పించారు. ఎన్ని జన్మలు ఎంత తపస్సు చేసిందో, ఎన్ని పుణ్యాలు చేసిందో ఆ మహావృక్షం. పాదరక్షలుగా మారి, శ్రీరామచంద్రులవారి పాదాల వద్దకు చేరింది. శ్రీరామచంద్రులవారు ఆ పాదుకల్ని భరతులవారికివ్వడం, భరతులవారు ఆ పాదుకలకి పట్టాభిషేకం చేయడం, అంతా ఒక్కరోజులో జరిగిపోయింది. ఆ విధంగా చక్రవర్తి కావాలన్నది ఆ మహావృక్షం కోరిక నెరవేరింది" అని చెప్పిన*

గురువుగారికి సాష్టాంగ ప్రణామం చేశాడు ఆ శిష్యుడు. సద్గురువు, గురువుల యొక్క వాక్కు సత్యం అయితీరుతుంది. కాదు కాదు... ఆ భగవంతుడే మహాత్ముల నోటివెంట వచ్చిన మాటలు నిజమయ్యేలాగా సంకల్పిస్తాడు. ఆ భగవంతుడి లీలలు మీకు అర్థం కావు.

**వృత్తం యత్నేవ ప రక్షేత్ విత్తమేతి చ యాతిచ ।**
**అక్షీణో విత్తతః క్షీణో వృత్తదస్తు హతో హతః ॥**

సదాచారమును గొప్ప ప్రయత్నము చేతనైననూ రక్షించుకొనవలెను. ధనము వచ్చును, పోవును.
ధనహీనుడైననూ, సత్ప్రవర్తన కలిగియున్నవాడు హీనుడుగా లెక్కించబడడు.
కానీ, ధనము సమృద్ధిగా ఉండియూ, సదాచారము లేనివాడు హీనుడిగానే లెక్కించబడును.

***హంగుల కోసం ఏడుస్తున్నా, ఆర్భాటాల కోసం పరితపిస్తున్నా,***
***పొగడ్తల కోసం పరిగెడుతున్నా, పాపాలు లెక్కలేకుండా చేస్తున్నా,***
***నివురుగప్పిన నిప్పులా మసలుతున్నా, రక్షక తంత్రాలతో ముందుకు పోతున్నా,***
***నటనతో ఎప్పుడూ జీవిస్తున్నా, మత్తులో దిగజారిపోతున్నా,***
***మూఢనమ్మకాలలో మునిగిపోతున్నా, మంచిని సమూలంగా చంపేస్తున్నా,***
***మానవత్వాన్ని ఎక్కిరిస్తున్నా, ప్రేమించేవారిని నిందిస్తున్నా,***
***కపటజపాలు చేస్తున్నా, భక్తి ముసుగును తొడిగేస్తున్నా,***
***చేయకూడిని వాటిని చేస్తున్నా, పేరు కోసం ఆరాటపడ్తున్నా,***
***సమాజాన్ని నిలువెల్లా కాల్చేస్తున్నా, కర్మచేతిలో తప్పించుకోలేకపోతున్నా,***
***ఏడుపును నవ్వుతో కప్పేస్తున్నా, చివరకు చస్తూ బ్రతికేస్తున్నా,***
***కొండ అద్దమందు కొంచమై ఉన్నట్లు***
***మానవత్వం ఇంకా పూర్తిగా ఇంకిపోలేదు***
***తాత్కాలికంగా తలవంచుకున్నది***
***గతంలో ఎన్నిసార్లు విజయం పొందలేదు ఇప్పుడూ అంతే! కొంచెం ఓపిక పట్టండి!***
***త్వరలో మానవకళ్యాణానికే అంతిమ విజయం సాధించాలని***
***మనోవ్యూహం రూపుదిద్దుకుని, సద్గురువుగా వేంచేసి మీముందు కూర్చున్న***
***ఈ ఆంజనేయుని చేత ముద్దుబిడ్డలుగా పిలిపించుకున్న మీరు***
***మొద్దుబిడ్డలుగా కాక, ముద్దుబిడ్డలుగా తయారుకండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

## రెండూ తల్లుల్లాంటివే!

ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదన్నది మీ నానుడి.
నేను చెబుతాను వెల్లుల్లి చేసే మేలు అంతా ఇంతా కాదు
అయితే, విషయమేమిటంటే,

ఈ రెండింటినీ ఎంత ఎక్కువగా తీసుకుంటే, అంత మేలు.
ఎందుకంటే, ఆహారంలో భాగంగా ఈ రెండు రకాల ఉల్లిని తినడం వల్ల
పేగు, గర్భాశయము, మూత్రపిండాలు, గొంతు క్యాన్సర్లు రావు.
ముఖ్యంగా వయసు పెరిగే కొద్దీ, వాడకాన్ని పెంచడం వల్ల
క్యాన్సరు వ్యాధిని అరికట్టవచ్చు.
వెల్లుల్లిలోని సల్ఫర్ పదార్థాలు ఫ్లేవనాయిడ్లు కంతుల్ని పెరగనీయదు.
దీని వల్ల క్యాన్సర్ వ్యాధి రాకుండా అడ్డుకుంటుంది.
ఉల్లి, వెల్లుల్లి!

ఓం

**05-01-2021** 10:10 AM

**148) "లోకులు కాకులు" అని ఎందుకు అంటారు స్వామీ?**

ఈరోజు కూడా ఒక కథ చెబుతాను. ఒక ఊరులో ఒక పెంకుటింటి అరుగుపై కూర్చుని తీపి బూంది తింటున్నాడు ఒక పిల్లవాడు. పొట్లంలో ఉన్నది తినేసి, ఖాళీ పొట్లం ఉండచుట్టి విసిరేశాడు. దానిని చూసిన ఒక కాకి రివ్వున వచ్చి ఆ కాగితపు ఉండను ముక్కున కరుచుకుని వెళ్ళి ఒక గోడపై వాలింది. కాళ్ళతో పొట్లాన్ని నొక్కిపెట్టి, ముక్కుతో విప్పింది. ఆశగా చుసింది. దానిలో రెండు మిఠాయి పలుకులు మిగిలి వున్నాయి. ఆనందంతో తింటున్న కాకి కళ్ళు పెద్దవయ్యాయి. అయితే, అదే కాగితంలో బూరె తింటున్న కాకి చిత్రం ఒకటి చక్కగా గీసి వుంది. అప్పుడా కాకి ఆశగా బొమ్మ నోట్లో వున్న బూరెను లాగింది. అది రాలేదు. మరోసారి ప్రయత్నించింది అమాయకంగా. దాని వాడి ముక్కు తగిలి కాకి చిత్రం కన్ను దగ్గర చిరిగింది. అప్పుడు అది నిజమైన బూరె కాదని తెలుసుకున్న కాకి నిరాశగా పొట్లం వదిలి ఎగిరిపోయింది. ఇదంతా ఆ గోడ ప్రక్కనున్న చెట్టు మీదున్న ఇంకో కాకి చూసింది. ఎగిరిపోయిన కాకి తెలివితక్కువతనానికి నవ్వుకుంది. ఇంతలో వచ్చి వాలిన మరో కాకి ఆ నవ్వుకి కారణం అడిగింది కుతూహలంగా. మొదట కాకి వెర్రిబాగులతనాన్ని వర్ణించింది రెండో కాకి. ఉత్తుత్తి బూరె కోసం కాకి పడ్డపాట్లు తలచుకుని మళ్ళీ నవ్వింది. మూడోకాకి ఈ విషయం ఇంకో కాకికి చెప్పింది. అయినా కాకి నోట్లో బూరెను లాక్కోవడం తప్పుకదా అంటూ ముగించింది. తన వర్ణనలో, "ఇది నిజం కాకి కాదు, కాగితంలో కాకిచిత్రం" అనే విషయం చేర్చలేదు. ఈ కాకి తన గూటికి చేరినప్పుడు, తోటి కాకులతో ఈ సంఘటనను పంచుకుంది. "తోటి కాకి నోట్లో బూరెముక్క కోసం, దాని కళ్ళు పొడిచిందట కూడానూ" అంటూ మరో మాట కూడా చేర్చింది. ఈ కాకులన్నీ ఎగిరి, ప్రక్క చెట్లకు వెళ్ళినప్పుడు, కనబడిన కాకులతో ఈ విషయమే చెప్పుకున్నాయి. వాటిలో ఒక కాకి అయితే, "కాకి కన్ను పొడిస్తే పాపం, రక్తం కారిందట కూడానూ" అంటూ అత్యుత్సాహం ప్రదర్శించింది. మరో కాకి ఇంకా కొంచెం ముందుకు వెళ్ళి, "ఆ గోడపై రక్తపు చారికలు చూశాను" అంటూ వాపోయింది.

మరో కాకి, "నేను ఆపటానికి ప్రయత్నిస్తే, నన్ను కూడా గాయపరచబోయింది" అంటూ చెప్పుకుని సానుభూతి పొందింది. అలా అలా మాట మారుతూ కాకులన్నీ కలిసి, మొదటి కాకిని రౌడీకాకిగా ముద్రవేశాయి. దానికి దూరంగా ఉండాలని తీర్మానించాయి. ఇవేమీ ఎరుగని మొదటి కాకి సాయంత్రం తన గూటికి చేరుకుని, తోటి కాకులను స్నేహంగా చూసింది. అప్పటిదాకా గుసగుసలాడుకున్న కాకులు చప్పున మాటలు ఆపి, మూగభావంగా తలలు తిప్పుకున్నాయి. కాకికి ఏమీ అర్థం కాలేదు. రెండు రోజులుగా అన్ని కాకులూ వెలివేసినట్లుగా దూరంగా మసలుతున్నాయి. తన తప్పేమిటో తెలియక అది తల్లడిల్లింది. తన స్నేహితురాలు కోకిలకు చెప్పింది. "ఒక్కోసారి అంతే. మన ప్రమేయం ఏమీ లేకుండానే మనలను సమాజం చెడ్డవాళ్ళని చేసేస్తుంది. నీలాపనిందలు, పుకార్లమయం ఈ లోకం. మన మనసు మన తప్పు లేదని నిజాయితీగా జవాబు ఇస్తే, బాధపడక్కర్లేదు. సంతోషంగా కాలం గడపగలిగే మిత్రుడిని ఒక్కరిని ఎంచుకో చాలు. అలాంటి వందలమంది నీకెందుకు?" అంటూ ఓదార్చింది కోకిల.

నేను చెప్పేదేమిటంటే, ఎదుటి వ్యక్తిని గురించి పూర్తిగా తెలుసుకోకుండా, అతనితో స్నేహం చేయకుండా, అతనిని పూర్తిగా పరిశీలించకుండా పుకార్లు నమ్మటం, పూర్తిగా పరిచయం లేని ఎదుటివ్యక్తిని గురించి చెడుగా మాట్లాడటం వలన ఒక మంచి స్నేహితుడ్ని కోల్పోవుటయే కాదు, అదే సమాజంలో నీ విలువ కూడా పోగొట్టుకుంటున్నావనే విషయాన్ని గ్రహించగలగాలి. అందుకే లోకులు కాకులు అన్న సూక్తి ఊరికే రాలేదు సుమా!

కాళ్ళు తడవకుండా సముద్రాన్ని దాటగలరు.
కళ్ళు తడవకుండా జీవితాన్ని దాటలేరు.

**పరిత్యజతియో దుఃఖం సుఖం చాప్యుభయం పరః ।**
**బ్రహ్మప్రాప్నోతి సోత్యంత మసంగేన చ గచ్ఛతి ॥**

ఎవడు సుఖదుఃఖాలను రెండింటినీ పరిత్యజిస్తాడో, అతడే బ్రహ్మపదాన్ని పొందగలడు.

***అనంతశక్తికి మనిషిని జతకలుపు యోగం ధ్యానం***
***విశ్వాస శ్వాసతో ధ్యానం పట్టుసాగిస్తే, మహిత యోగానికి అది తొలిమెట్టు***
***భావితరాలకు రాబోవు బాధల బాగోగుల మార్గదర్శకం ధ్యానం***
***పంచభూతాలతో పరిక్రమిస్తూ, ప్రపంచం విశ్వం సమస్తం జయించు***
***అగ్రత ఏకాగ్రత బీజం ధ్యానం***
***ఆకాశపుటగ్ని భువిపై హర్షవర్షమై కొనసాగే సమ్మిళిత ధ్యాసే ధ్యానం***
***సంపూర్ణ ఆరోగ్యానికి మనోవికాసహాసానికి, ధైర్యోత్సాహానికి***
***ఆత్మతత్వ దర్శనానికి ప్రత్యక్ష విగ్రహం నిగ్రహమే ధ్యానం***
***విదశలలో దశదశాభివృద్ధికి, కనిపించని గాలిలో దైవలీలా విలాసాన్ని***
***పూజా పూలలో ఆంతరంగిక పరిమళం చూపించే***

***చవి చూపించే స్థితిని కూర్చు ధ్యానం***
***దివ్వె లోపలి వెలుగు కిరణపు దివ్యాభరణపు అభయప్రదమై,***
***ఇహపర అనాది పునాది గాడి ధ్యానం***
***సిద్ధులు మొదలు, బుద్ధుని వరకూ జ్ఞాన సముపార్జనలో***
***యుగపురుషుల ఇహపర మహిమాన్విత సాధన ధ్యానం***
***ఈ ఆంజనేయుని చేరు అతి త్వరిత రహదారి ధ్యానం***
***ధ్యాస పెట్టి ధ్యానం చేసి నన్ను చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**06-01-2021** 10:10 AM

**149) ప్రకృతి నుంచి మేము ఎటువంటి ఆదర్శాలను పొందవచ్చును స్వామీ?**

*ఈ సృష్టిలో ఉన్న ప్రతీదీ మీకు ఆదర్శమే. ఎలా అని మీరంటే, పగబట్టినవాడి పైన పగబట్టకుండా దారం దారం పోగేసుకుని, మరో గూడుకట్టుకునే **సాలెపురుగు** మీకు ఆదర్శం. ఎన్నిసార్లు పడినా పౌరుషంతో మళ్ళీ లేచే **అలలు** మీకు ఆదర్శం. మొలకెత్తటం కోసం భూమిని సైతం చీల్చుకుని వచ్చే **మొక్క** మీకు ఆదర్శం. ఎదురుగా ఏ అడ్డంకులున్నా, లక్ష్యంవైపే దూసుకువెళ్ళే **బాణం** మీకు ఆదర్శం. ప్రత్యర్థి పెద్దదైనా సరే, సూర్యుడిని సైతం కప్పివుంచే **మేఘాలు** మీకు ఆదర్శం. అసాధ్యం అని తెలిసినా ఆకాశాన్ని అందుకోవాలని ప్రయత్నించే **గాలిపటం** మీకు ఆదర్శం. తానున్న పరిసరాల చుట్టూ పరిమళాలు నింపే 'పువ్వు' మీకు ఆదర్శం. ఎంతటి వేడినైనా భరిస్తూ మీకు మటుకు చల్లని నీడనిచ్చే **చెట్టు** మీకు ఆదర్శం. ఎప్పుడు విడిపోయినా ఇద్దర్ని కలపటానికి తాపత్రయపడే **సూది** మీకు ఆదర్శం. తన మూలంగా లోకం చీకటి అవకూడదని రోజంతా వెలుగునిచ్చే **సూర్యుడు** మీకు ఆదర్శం. తను ఎంత చిన్నదైనా తన వంతు భూదాహాన్ని తీర్చే **చినుకు** మీకు ఆదర్శం. చుట్టూ చీకటే ఉన్నా చల్లని వెన్నెల పంచే **చంద్రుడు** మీకు ఆదర్శం. ఒక్కసారి అన్నం పెడితే జన్మంతా విశ్వాసంగా ఉండే **శునకం** మీకు ఆదర్శం. జీవించేది కొంతకాలమైనా అనుక్షణం ఆనందంగా ఉండే **సీతాకోకచిలుక** మీకు ఆదర్శం. ప్రతీ దానిలో మంచిని మాత్రమే గ్రహించాలని చెప్తూ పాలు-నీటి మిశ్రమంలో పాలను మాత్రమే త్రాగే **హంస** మీకు ఆదర్శం కావాలి. ఈ ఆదర్శాలతో అడుగు ముందుకు వేయాలి. వ్యావహారిక ప్రపంచంలో మీ మహా ప్రయత్నమేదైనా ఫలించకపోతే చింతించాల్సిన అవసరం లేదు. జనార్దనుడు తన వైపుకు మిమ్మల్ని ఆకర్షిస్తున్నాడని తెలుసుకోవాలి. ఇది తెలియకపోవటం వలన, అవిరళ కృషిచేసి వైఫల్యాన్ని చవిచూసినవారు నిరాశానిస్పృహలకు, దైన్యానికి గురి అవుతుంటారు. ఎవరో కొందరు తప్ప మీరందరూ మీ శక్తులను మొదట్లో లౌకిక వస్తు ఫలాబ్ధికయ్యే వెచ్చిస్తారు. మీ ప్రయత్నాలు కొన్ని సఫలమవుతాయి, కొన్ని సఫలం కావు. మీకు ఏమి కోరుకోవాలో, ఈ మానవశరీరంతో చేయగల్గిన అత్యున్నత కార్యం ఏదో తెలియదు కాబట్టి సఫలం కాకపోవటం మీ మంచికే.*

## 150) మాకున్న స్వేచ్ఛ ఎట్టిది స్వామీ?

భగవంతుని దృష్టిలో అసలు మనిషికి స్వేచ్ఛ అంటూ ఏమీ లేదు. ఈ సృష్టి యావత్తు దైవసంకల్పం మేరకే నడుస్తున్నది. కొద్దిపాటి సంకల్పం లేదా స్వేచ్ఛ ఉందనుకున్నా, అదీ భగవానుడి స్వేచ్ఛకు లోబడి పనిచేయాల్సిందే. అది ఎలాంటిదంటే చెబుతాను. మీ స్వేచ్ఛ కొయ్యకు త్రాడుతో కట్టేసిన ఆవుకున్న స్వేచ్ఛ వంటిది. త్రాడు ఎంతవరకూ వెళ్ళగలదో అంతవరకూ ఆ ఆవు స్వేచ్ఛగానే తిరుగుతుంది. అంతకు మించి ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యలేదు. మీ సంకల్పం కూడా అలాంటిదే. ఒకవేళ ఆవు పూర్తిగా స్వేచ్ఛను పొందాలని భావిస్తే, అది తన శక్తినంతా కూడదీసుకుని త్రాడును తెంచుకోవాలి. అలా సాధ్యం కాకపోతే, కనీసం కొయ్యచుట్టూ తిరుగుతూ అంబా అని అరుస్తూ, ఆ ప్రయత్నం వలన త్రాడు మెడను కోస్తూ వున్నా పట్టించుకోకుండా ఉంటే, అలానే వదిలేస్తే చనిపోతుందేమోనని యజమాని వచ్చి విడుదల చేయవచ్చు. ఈ ప్రపంచంలోకి రావడమంటేనే బంధంలో పడటమని. జననమరణ చక్రమనే సంసారంలో చిక్కుకోవటమని గ్రహించి, మీకున్న శక్తియుక్తులను పరమాత్మను ప్రసన్నం చేసుకోవటానికి వెచ్చిస్తే, ఆయనే మిమ్మల్ని బంధవిముక్తులను చేస్తాడు. మనిషి భగవంతుడిని చేరుకోవటానికి తన సర్వశక్తులనూ ఒడ్డుతున్నాడంటే, దైవకృప ఆ వ్యక్తిపై ఆ ప్రయత్నరూపంలోనే ప్రసరితమవుతున్నదని అర్థం చేసుకోవాలి. అక్కడ వ్యక్తి సంకల్పం, దైవ సంకల్పం మమేకం అయినాయి. పరాత్పరుడి పాదాశ్రయం పొందటానికి అంతా ఆయన ఇచ్ఛ ప్రకారం జరుగుతుందని సర్వకాలాల్లో, సర్వావస్థల్లో భావించాలంటే, చాలా స్వప్రయత్నం అవసరమవుతుంది. మీ సామర్థ్యాలను ఇలాంటి ప్రయత్నముతో వినియోగించినప్పుడు, మీ ప్రయత్నానికీ దైవకృపకూ తేడా లేదు. ఇవి రెండూ ఈ దశలో ఏకమవుతాయి.

***శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్ ।***
***స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥***

చక్కగా ఆచరించబడిన పరధర్మము కంటే, అసంపూర్ణమైననూ స్వధర్మమే శ్రేష్ఠము. స్వధర్మము కొరకై మరణించిననూ అది కళ్యాణదాయకమే అగును. పరధర్మమును అనుసరించుట భయజ్వరము.

మీ జీవితంలో రంగులు పోయినప్పుడు,
మీ చుట్టూ ఉన్నవాళ్ళ అసలు రంగు బయటపడుతుంది.
తట్టుకుని నిలబడు, చాలు.
మళ్ళీ మీ జీవితంలో ఇంద్రధనుస్సు విరియక మానదు!

***అంధకార బందురాన ఎన్నాళ్ళు జీవిస్తారు, ఎన్నాళ్ళు అలమటిస్తారు?***
***మీకు పుట్టిన మాయరోగం వీడదాయే,***
***కష్టాలు వీడవు, కన్నీళ్ళు ఆగవు.***
***ఎన్నాళ్ళు ఈ నిరీక్షణ ఎంతకాలం? ఇంకెంత కాలం?***
***నామస్మరణ చేయరాయే, నామిని కనుగొనరాయే***
***భగవంతునికి - మీకు దూరమధికమాయే***

***అంతర్ జ్యోతిని వెలిగించరాయే***
***చప్పట్లు భజనలు చేయరాయే***
***చిట్కాలు చెప్పినా గుట్టుచప్పుడు చేయరాయే***
***మీలో ఏ చర్యా లేదాయే***
***రోజులు గడిచిపోతున్నాయి, నెలలు దాటిపోతున్నాయి***
***మీలోని రోగము నిర్మూలనమయ్యేదెపుడు?***
***నాకు రవ్వంతైనా కానరాదయ్యే***
***ప్రయత్నాలు కొనసాగించి, పరిస్థితులను గుప్పెట్లో పెట్టుకుని***
***కళ్ళ ముందు ఉన్నది అశాశ్వితమని భావించి***
***ఆంజనేయుని ఆదర్శాలను అందుకుని,***
***ఆత్మీయులుగా హృదయంలో చేరి నిలవండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**07-01-2021** 10:10 AM

**151) మేము భగవంతునకు ప్రీతిపాత్రులమవ్వాలంటే ఎలా స్వామీ?**

*మీరు నిత్యం అనేక రకాలైన పుష్పాలతో ఇష్టదైవాన్ని అలంకరించి ఆనందపడుతూ ఉంటారు. దైవాన్ని ఆరాధించే విధానాల్లో ఒకటిగా దీన్ని లెక్కించవచ్చు. అయితే, భగవంతుని మీద మీకు ఎంత భక్తి ఉందని మాత్రమే కాకుండా, ఆయన మిమ్మల్ని తన భక్తులు ఇష్టులు అనుకుంటున్నారా అనుకునేటట్లు మేము ప్రవర్తిస్తున్నామా? అని ఆలోచించడం అవసరం. మీలోని ఒక్కొక్క లక్షణాన్ని తెలుసుకుని, అవి ఎవరిలో ఉంటాయో వారు ఆయనకు ప్రీతిపాత్రులని తెలుసుకోవాలి. ఆ లక్షణాలను ఒక్కొక్క పుష్పంగా భావించి వాటిని ఆచరణలో పెట్టడం ద్వారా భగవంతుని ఆనందపర్చగలరు. ఇవి అందరికీ అన్నివేళలా అందుబాటులో ఉండే పుష్పాలు. వీటిని పొందటానికి దేశ, కాల, వయో, లింగ, కుల, మతాలతో ప్రమేయం లేదు. కావలసింది శ్రద్ధ, పరమాత్మకు ఇష్టులు కావాలన్న కాంక్ష మాత్రమే. ఈ భక్తిపుష్పాలు మిమ్మల్ని భగవంతునికి ప్రియమైన వారిగా మార్చగల అద్భుతశక్తి గలవి. ఎవరైతే సమస్త జీవులపట్ల ద్వేషం లేక, స్నేహభావం కలిగివుంటారో, మమకారాలు విడిచి సుఖదుఃఖాలలో సమంగావుంటారో, క్షమ కలిగివుంటారో, పరమాత్మకు వారు ఇష్టమైనవారు. అందరినీ భగవంతుని స్వరూపంగా చూసినవాడు ఎవ్వరినీ ద్వేషించకుమడా ఉండటమే గాక, స్నేహభావంతోనూ, దయతోనూ ఉంటాడు. అహంకార మమకారాలు మీకు – భగవంతునికీ మధ్య చాలా దట్టమైన తెరను సృష్టిస్తాయి. ధనం, కులం, రూపం, యవ్వనం, విద్య మొదలైన వాటివలన మీలో అహంకారం జనిస్తుంది. తద్వారా వారికంటే పైన చెప్పిన విషయాలలో తక్కువ తరగతికి చెందిన వారిని చిన్నచూపు చూడటం జరుగుతుంది. ఈ గుణం నేను,*

నాది అనే మమకారాన్ని పెంచుతుంది. సమత్వాన్ని పోగొట్టి, మాయలో పడేస్తుంది. గతజన్మల సుకృతఫలంగా లభ్యమైన ధనం, కులం, రూపం, విద్యల విషయంలో అహంకరిస్తే, అవి మిమ్మల్ని వీడిపోయే ప్రమాదముంది. కాబట్టి, అహంకార మమకారాలను విడనాడటం ఎంతైనా అవసరం. తప్పు చేయటం మానవలక్షణమైతే, క్షమించటం దైవలక్షణం. కనుక సర్వులపట్ల స్నేహభావాన్ని, దైవగుణమైన క్షమను అలవర్చుకోవాలి. ఎవరైతే ఎప్పుడూ సంతోషంగా ఉంటూ, మనస్సును తమ ఆధీనంలో ఉంచుకుని, దృఢనిశ్చయం కలిగి, భగవంతునికి అర్పితమైన మనోబుద్ధులను కలిగి ఆయనకు భక్తులు అవుతారో, అటువంటివారు ప్రీతిపాత్రులవుతారు. స్నేహభావం, క్షమాభావం కలవారు, అహంకార మమకారాలు లేనివారు ఎల్లప్పుడూ సంతోషంగా ఉంటారు. అటువంటివారి మనసులో ఏ విధమైన ఆందోళన ఉండదు. కాబట్టి, వారు మనస్సును తమ ఆధీనంలో ఉంచుకొనగలరు. ఆధీనంలో ఉన్న మనస్సునందు సంకల్పం దృఢంగా ఉంటుంది. ప్రపంచంలో ఏది సాధించాలన్నా నిశ్చయం అవసరం. అది లేకుంటే తలపెట్టిన పని సగంలోనే ఆగిపోతుంది. కాబట్టి, దృఢమైన నిశ్చయం చాలా ఆవశ్యకమైన లక్షణం. మనోబుద్ధులను ప్రాపంచిక విషయాల నుండి పరమాత్ముని వైపు మరల్చే దృఢసంకల్పం కలవారికి దైవంపట్ల భక్తిప్రపత్తులు అధికమవుతాయి. ప్రపంచంలో ప్రతి ఒక్కటీ సదా మిమ్ములను దైవం నుండి దూరం చేయటానికే ప్రయత్నిస్తుంది. దీనినే మాయ అంటారు. ఇది మిత్రునిలాగా ఉంటూనే, మిమ్మల్ని దైవం నుండి వేరు చేస్తుంది. ఈ ప్రమాదం నుండి బయటపడాలంటే, భగవంతుని సదా ధ్యానించాలి. ఏ పని చేస్తున్నా, మనోబుద్ధుల్ని భగవంతునిపై నిలపాలి. అలా చేసినవారు పరమాత్మకు ఇష్టమైన వారవుతారు. ఎవరు లోకాన్ని చూసి భయపడరో, ఎవరిని చూసి లోకం భయపడదో, ఎవరు హర్షం, భయం, ఉద్వేగం లేనివారో, అలాంటివారు భగవంతునికి ఇష్టులు. ఎవరు కోరికలు లేకుండా పవిత్రులై, వ్యథ లేనివారై, కర్మలయందు కర్తృత్వబుద్ధిని వదిలెదరో, వారు భగవంతుని ప్రేమకు పాత్రులవుతారు. ఏ తప్పూ చేయనివారికి ఏ విధమైన భయం వుండదు. భగవంతుని మీద సర్వత్రా మనోబుద్ధులు నిలుప గలిగినవారు దుష్టకర్మలు చేయరు. దుష్టకర్మలు చేయనివారిని చూసి లోకమూ భయపడదు. మోక్షమంటే అభయస్థానం. మీరు చేసే ప్రతి పనినీ మీలో ఆత్మగా ఉన్న పరమాత్మ గమనిస్తూ ఉన్నాడని భావిస్తే, చెడ్డకర్మలను చేయలేరు, పాపరహితులవుతారు. పాపరాహిత్యం వలన భయరాహిత్యం కలుగుతుంది. భయంతోపాటు అధికమైన ఆనందాన్ని, ఉద్వేగాలను కూడా విడనాడాలి. ఎందుకంటే, అవి మనస్సులో సమతాస్థితిని పోగొడుతాయి. అధికమైన ఆనందం, ఉద్వేగం ఆరోగ్యానికి హానికరం. ఎవడు సంతోషపడడో, ద్వేషించడో, దుఃఖించడో, ఏదీ కోరక శుభాశుభ కర్మలను విడుస్తాడో, అటువంటివాడు భగవంతునికి ఇష్టుడు!

**అనీర్ష్యుర్గుప్తధారశ్చ పంవిభాగీ, ప్రియం వదః ।**
**శ్లక్ష్ణో మధురవాక్ స్త్రీణాం వ చాపాం వశగో భవేత్ ॥**

పురుషుడు ఈర్ష్యారహితుడు, దానము చేయువాడు, ప్రియమును పలుకువాడు, స్వచ్ఛమైన హృదయము గలవాడు కావలెను. అతడు స్త్రీలతో మధురముగా మాట్లాడవలెను గానీ, వారికి వశుడు మాత్రము కారాదు.

***యుద్ధమెప్పుడూ హఠాత్తుగా జరగదు***
***అజ్ఞానపు మత్తులో హద్దులు మరచి, పెను చీకటిని ఆహ్వానించుకున్నాక***
***విధ్వంసము జరిగివుండవచ్చు కదా!***
***అందుకు మీకు బాధ ఉండి వుండవచ్చు***
***మాయలఫకీర్ తన ప్రాణం సప్తసముద్రాల కావలన దాచినట్లు***
***మీ సహజ లక్షణాలను ఎక్కడ దాచారు?***
***ఎవరి జీవితాలు వారివేనని, చేసే పయనం ఇంకెంత కాలం?***
***జననమరణ చక్రంలో కాలగమనంలో, విలువలు మరచిన వెర్రితనంతో***
***కాసుల బంధంలో కాలమెరుగకుండా క్రొత్తదారులకు పుంకాలు తొక్కుతుంటే,***
***అంతా నాదే అనుకున్న మీకు మనిషితనం మారాకులు తొడిగితే***
***మీలో కన్పిస్తుంది ఓ నూతన ఉషోదయం***
***ఆ ఉషోదయంలో మమతానురాగాలు పెంచుకుని,***
***పవనపుత్రుని పలుకులు ప్రణవనాదాలై, పరమాత్మని సన్నిధి చేరి***
***పరమ పవిత్రమైన బిడ్డలుగా మారండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

గురుసన్నిధి అంటే,
అమ్మవడి చేరిన బిడ్డలుగా సురక్షితంగా ఉండాలి.
పాము నీడన చేరిన కప్పల బ్రతుకు కాకూడదు!

ॐ

**08-01-2021** 10:10 AM

**152)** మేము భగవంతునికి ఏవి అర్పించాలి స్వామీ?

సంతోషం, దుఃఖం, ద్వేషం, కోరికలు ఇవ్వన్నీ మనస్సు, పరిసరాలు, వయస్సులను బట్టి మారుతూ వుంటాయి. మార్పు గలవన్నీ అశాశ్వితాలు. కాబట్టి, వాటికి మీరు బానిసలు కాక, వాటినే మీ అదుపులో ఉంచుకోవాలి. ఇలా ఎవరు ఈ మానసిక మార్పులకు లొంగక ఉంటారో, వారు మంచిపనులు ఎక్కువ చేయగలరు. మనస్సుకు క్రమశిక్షణ నేర్పినటువంటివారు తామే కర్మలు చేశామన్న భావం లేకుండా వుంటారు. అదే శుభకర్మ పరిత్యాగమంటే. ఇక అటువంటివారు దుష్టకర్మలను చేయరు. కావున వారు అశుభకర్మలను విడిచిన వారవుతారు. ఎవరు శత్రువులయందును, మిత్రులయందును, అట్లే మానావమానములు, శీతోష్ణములు, సుఖదుఃఖములు, నిందాస్తుతులు మొదలైన ద్వంద్వములందును సమంగా ఉండి, సంగరహితులై, మననశీలురై, లభించిన దానితో తృప్తి చెందుతూ, గృహాదులపట్ల మమకారం విడిచిపెడతారో, అటువంటివారు భగవంతునికి ప్రీతిపాత్రులవుతారు.

రావణుని మరణానంతరం విభీషణుడు తన అన్న రావణునికి అంత్యక్రియలు నిర్వహించటానికి నిరాకరించాడు. "శత్రువుకు అంత్యక్రియలు నేనెలా జరపాలి?" అని ప్రశ్నించాడు. అప్పుడు శ్రీరాముడు, "మనకు శత్రుత్వం రావణుని యొక్క దుష్టత్వంతో వుండేది. అతని మరణంతో దుష్టత్వం నశించింది. కనుక, ఇక అతను మనకు శత్రువు కాదు. కాబట్టి, అంత్యక్రియలు జరిపి నీ ధర్మం నీవు నిర్వర్తించు" అని తెలిపాడు. ఈ విధంగా మానవజన్మనెత్తి, శత్రుమిత్రులయందు కూడా ధర్మాన్ని సమానంగా ఆచరించాలని శ్రీమహావిష్ణువు రామావతారంలో తెలియచేశాడు. శత్రుమిత్రులపట్ల సమంగా ఉండటమే గాక, మిగిలిన ద్వంద్వాలను కూడా దాటాలి. ప్రయత్నంతో నిందాస్తుతులయందు, మానావమానములయందు సమంగా ఉండటం అలవర్చుకోవాలి. మీరు ఈ శరీరం కాదు, అంతకంటే ఉత్తమమైన శాశ్వితమైన ఆత్మను అని గ్రహించి, మననం చేసుకోవటం ద్వారా ద్వంద్వాలను దాటడం నిదానంగా అలవడుతుంది. సమత్వబుద్ధి చేకూరిన వారికి గృహాదులపట్ల అభిమానం తగ్గుతుంది. ప్రతి ఒక్కరికీ భక్తి చాలా అవసరం. కాబట్టి, అన్ని లక్షణాలతోపాటు ఆయనయందు భక్తిని కూడా కలిగివుండాలి. భక్తి అంటే భగవంతుడినే స్మరించడం, ఆయనయందే మనోబుద్ధులను నిలపడం, ఆయననే శరణువేడటం, మీ కోసం వండుకున్నదైనా సరే ఆయనకే ముందు నివేదించడం. సర్వధర్మాలయందు ఆసక్తిని, వాటి వలన ఆందోళనలను త్యజించి ఎవరు ఆయనను శరణుపొందుతారో, అటువంటి వారిని సమస్త పాపాల నుండి విముక్తులను చేస్తాడు. పరిపూర్ణ విశ్వాసంతో సామాన్య పుష్పాలతోపాటు ఈ భక్తిపుష్పాలను కూడా గట్టి ప్రయత్నంతో ఒక్కొక్కటీ అలవరచుకుంటూ ఎంతవరకూ మీరు భగవంతునికి ఇష్టులమయ్యే అర్హత కలిగిందని ప్రశ్నించుకుంటూ, ఆత్మ విశ్లేషణ, ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఇలా చేస్తే, అన్ని పుష్పాలు కాకపోయినా, కొన్ని పుష్పాలైనా తప్పక లభిస్తాయి. దానివల్ల జీవితంలో ఎన్నడూ పొందనంత శాంతి కలుగుతుంది. ఎవరిపట్లా కోపం, ద్వేషం కలుగవు. మీలో మీరే దైవానికి చేరువై, ఆ అద్భుతస్థితిని తెలుసుకోగలరు. అన్నింటినీ మించి, జగద్రక్షకునికి ఇష్టులు కాగలరు. కాబట్టి, ఈ భక్తిపుష్పాలను సేకరించటానికి ప్రయత్నించండి.

మనసులో ఏది నాటితే, అదే పెరుగుతుంది.
ప్రేమ, ద్వేషం, పగ, ప్రతీకారం, ఆశ, నిరాశ ఏదైనా.
దేన్ని పెంచుకోవాలన్నా నిర్ణయం ఎప్పుడూ మీదే!

**ఈశావాస్యమిదగ్ం సర్వం యత్కించ్ జగత్యాం జగత్ ।**
**తేన త్యక్తేన భుంజీథా మా గృధః కస్యస్విద్ధనమ్ ॥**

ఈ చరాచర సృష్టియంతయూ సమాజ రూపియగు భగవంతుడు వ్యాపించియున్నాడు.
సృష్టియంతయూ భగవంతునిలో లీనమైయున్నది.
అనగా సమాజమే భగవంతుడు – భగవంతుడే సమాజము.
కనుక, అతడు మీకిచ్చిన దానినే తీసుకొనవలెను.
ఇతరుల ధనమును అన్యాయముగా గ్రహింపరాదు.

*నన్ను తలుచుకోవడం మానినప్పడు, నీతిగా బ్రతకడంలేనప్పుడు*
*మమకారం దూరమై, అనురాగం భారమై, వయసు మీరిన నేడు*
*మీకు శాంతి కరువై, కాంతి దూరమై, మీ హృదయం భగ్నమైనదని*
*భగవంతుని చల్లని చూపుల చినుకుల కోసం మీ మది పడిగాపులు కాస్తుందని*
*ఈ సమయంలో మీరు చేసిన తప్పిదం గుర్తుకు వస్తుంది*
*ఈ మానవనైజపు రాగద్వేషాల చట్రంలో*
*కామార్థాల పాశంలో, నిరంతరం ఇరుక్కుపోవడమేనని*
*జీవితసత్యం తెలుసుకోకపోవడమే*
*అందుకే, అప్పుడయినా,*
*ప్రభూ! నన్ను క్షమించు. వయసు పెరిగిపోతోంది. మనసు తరిగిపోతోంది*
*నల్లని నింగి మృత్యువువోలే ఉగ్రరూపంతో ఉంది*
*ఎండిన నేల కలిపురుషుని కరాళ నృత్యమువలె ఉన్నది*
*ఇకనైనా నీ ప్రేమ కరుణామయ ప్రభంజనాలతో*
*ఆవర మేఘాలను మా వైపుకు పంపించమని*
*అజ్ఞానంపై జ్ఞానమెరుపు కిరణాలను ఝుళిపించమని*
*నాపై అనన్య సుధామయ ప్రేమజల్లులు కురిపించమని*
*మానవాళిసంతా కమ్ముకొన్న ఈ మాయామోహపు అజ్ఞాన బడబాగ్నిని చల్లార్చమని,*
*ఈ జనానికి అద్వైత జ్ఞానోదయం కలిగించమని వేడుకోండి.*
*మీ వేడికోలు విందు అందుకున్న ఈ ఆంజనేయుడు అరచేతిని చాచి*
*అరంగుళము దూరములో వుంటాడు*
*నా చిన్నారి ముద్దుబిడ్డలారా!*

ॐ

**10-01-2021** 10:10 AM

**153) స్వామీ! ఎంతో ప్రేమతో మీరు మా మేలు కొరకై అందిస్తున్న బోధను మేము అర్థం చేసుకోలేకపోతున్నాము స్వామి!**

*ఒకసారి పిలిచాను, రెండవసారి పిలిచాను, మూడవసారి పిలిచాను. అలా పిలుస్తూనే ఉన్నాను. నా పిలుపును అందుకోలేకపోతున్నారు. ఎప్పుడూ ప్రేమగానే పిలుస్తాను. ఆ పిలుపులోని మాధుర్యాన్ని గుర్తించలేకపోతున్నారు. ఎప్పుడూ నాయనా, నాయనా అనే సంబోధిస్తాను. అందుకే మీకు నిద్రో, మెలకువో ఈ నాటికి నా పిలుపు అందుకొని ఎక్కడున్నానో, ఎక్కడున్నానో, అసలున్నానో లేదో ఏం జరుగుతుంది, ఎక్కడి నుంచి పిలుపు? ఎవరు పిలుస్తున్నారు? ఎంత మధురంగా, కాదు కాదు మధురాతిమధురంగా ఉంది ఆ పిలుపు, శంఖనాదంలా, వేదమంత్రంలా అత్యంత ప్రేమగా పిలుస్తున్నాను*

అని ఈ క్షణం శబ్దాన్ని ఆలకించారు. అందుకే "నేను నీ అంతరాత్మను, నీతోనే వుంటాను, నీలోనే ఉంటాను" అని సమాధానమిచ్చాను. ఆ సమాధానాన్ని గుర్తించలేక "అంతరాత్మ అంటే?" అని నీవు అజ్ఞానంతో నన్ను ప్రశ్నించావు. దానికి నేను నవ్వుకుని, "దానినే మీరు దేవుడంటారు" అని చెప్పాను. అప్పుడు మీరు "అయ్యో స్వామీ! మీరా? నిజంగా మీరేనా? కలా, నిజమా? ఎంత కాలానికి పిలిచారు? నాతోనే వుంటూ, నాలోనే వుంటూ ఎందుకు మౌనంగా ఉన్నారు ఇన్నాళ్ళూ?" అని అజ్ఞానంతో అడుగుతారు. నా సమాధానం ఒక్కటే అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ. "నేను ఎప్పుడూ పిలుస్తూనే వుంటాను నాయనా. నువ్వే వినిపించుకోవు. ప్రతి విషయంలోనూ మీకు సరియైన మార్గం చెప్పాలని పిలుస్తూనే వుంటాను. కానీ, నీవు మనస్సు చెప్పేదే గానీ, హృదయంలో వున్న నా పిలుపు మీరు వింటేగా? దానికే నవ్వుకున్నాను. ఎందుకంటే, మీరే కాదు, దాదాపు అందరిదీ ఇదే స్థితి. అందుకే ఒక నిట్టూర్పు విడిచాను. మిమ్మల్ని అడిగితే, "ఔను స్వామీ! మనసుకు, అంతరాత్మకు జరిగే సంఘర్షణ లీలగా అర్థమవుతుంది కానీ, అది నువ్వే అని తెలియట్లేదు. నీ పిలుపు వినక, మనసు మాట విని అశాంతితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాము. కానీ, ఇప్పటికీ నీ పిలుపు మాకు ఎలా వినబడింది స్వామీ" అని మీరడిగితే, నా సమాధానం "మొదటిసారి ఆర్తిగా పిలిచారు. అందుకే. కానీ, మీరు మీ పిల్లల గురించి చాలా బాధపడుతూ వుంటారు కదూ! "అవును స్వామీ! వాళ్ళు బొత్తిగా మాటా వినటం లేదు. అబ్బాయి ఇల్లు వదిలివెళ్ళి పదిరోజులయింది. తల్లిదండ్రులు ఆందోళన పడ్తారని లేదు. స్నేహితుల మాయలో పడి, అన్నీ మరచిపోతున్నాడు. మా ప్రేమను అర్థం చేసుకోవట్లేదు. మేమిచ్చే ఆస్తిపాస్తులు, ఇల్లువాకిళ్ళు, సదుపాయాలు కావాలి గానీ, మేమక్కరలేదు. వాడి మంచి కోరి చెప్పే మాట వినకుండా, ఆకర్షణలో పడి ఏం బాధలలో పడతాడో అని ఆవేదనగా ఉంది" అని ఏకరువు పెడతారు. మరి నా బాధ కూడా అదే. మీరు వింటేగా? నా బాధ, ఆవేదన అదే. నా పిల్లలూ నా మాట వినట్లేదు. దానికి మీరు "మీ పిల్లలా స్వామీ?" అని అడిగితే, ఇంకెవరూ? మీరే! సకలప్రాణికోటి నా పిల్లలేగా. నన్ను విడిచి, నన్ను మరచి జన్మజన్మలుగా సంసార తాపత్రయాలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఎప్పుడు నా వైపు చూస్తారా అని ఎదురు చూస్తున్నాను. నాయనలారా! ఘోరమైన ఈ సంసార బాధలు పడకండి. నా మాట వినండి. ఇలా చెయ్యండి, అలా చెయ్యండి అని చెబుతూనే వున్నాను. మీరు పెడచెవిన పెడుతూనే వున్నారు. నా ప్రేమను మీరు అర్థం చేసుకోవట్లేదు. మీరు నా నుండి కోరుకునేది ధన కనక వస్తు వాహనాలేగా? నన్ను కాదుగా! నా మీద ప్రేమ లేదుగా! త్వమేవ మాతా పితా త్వమేవ అంటూ చక్కగా శ్లోకం వల్లిస్తారు. మరి తండ్రిగా నేను చెప్పేది వినిపించుకోరు, ఎవరో కోటికొక్కరు తప్ప. అనుగ్రహం చూపించు స్వామీ అంటారు. ఆ అనుగ్రహం మీరు కోరుకున్నదే కావాలంటారు. నిజమైన నా అనుగ్రహం గురించి మీ నిర్వచనాలు వేరు, నా హృదయం వేరు. నా హృదయం మిమ్మల్ని నా అనుగ్రహపాత్రులుగానే కాదు, ప్రేమపాత్రులుగానూ చూడాలని పరితపిస్తుంది. నా ఐశ్వర్యానికి వారసులను చెయ్యాలని వుంటుంది. శుద్ధభక్తి, జ్ఞానవిజ్ఞానాలు, వైరాగ్యాలు, మోక్షేచ్ఛ, సాధుసంగమం, నామసంకీర్తన ఇవ్వన్నీ నా అసలైన అనుగ్రహఫలాలు. భక్తి జ్ఞాన వైరాగ్యాలు ఆనందశక్తిని ప్రసాదిస్తాయి. ఆ శక్తితో మనస్సును జయించగలిగితే, హృదయకవాటాలు తెరుచుకుని, నా ప్రేమపూర్వకమైన పిలుపు, మీ క్షేమం కోరే నా మాట వినగలుగుతారు.

అప్పుడు మీకు మత్తు వదిలి, జీవితపరమార్థం బోధపడి, అంతులేని సంసార తాపత్రయాల నుండి విముక్తులవుతారు. ఇలా విముక్తులైన వారిని చూచి, నా హృదయం ఉప్పొంగుతుంది. నిజమా స్వామీ? మీ మాట వినిపించుకోనప్పుడు మీరు అంత బాధపడతారా? అని మీరు అడిగినట్లయితే, బాధపడకపోతే, పదేపదే అవతారాలలో మానవరూపం ధరించి, అనేక బాధలకోర్చుకుని, మీ కోసం ఎందుకు రావాలి స్వామీ! మిమ్మల్ని చూడాలనుంది. ఒక్కసారి కనబడరూ? అంటారు. నాకూ కనబడాలనే వుంటుంది. కానీ, మళ్ళీ ఎలా కనబడాలో మీరే నిర్ణయిస్తారుగా! అదీగాక, కనబడితే నా మాట వినరు. నా రూపం దగ్గరే ఆగిపోతారు. మళ్ళీ ఆ రూపదర్శనం కూడా కోరికలు తీరుతాయనే. దర్శనం కోసం కొట్లాటలు, తోపులాటలు చూస్తున్నాను. ఆ తోసేది నన్నే అని తెలుసుకోరు. పసిపిల్లలు, స్త్రీలు, వృద్ధులు అన్న స్పృహ లేకుండా ఎన్నో... ఎన్నని చెప్పను. నాయనలారా! నేను అణువణువునా ఉన్నాను. విగ్రహంలో వున్న నాకు చేసే సేవలు, ఉపచారాలు, నివేదనలు నన్ను చేరతాయని భావిస్తున్నారో, అలాగే ప్రతిజీవికీ మీరు చేసే సేవ, ఉపచారాలు నాకు చేసే పూజలే, సేవలే, నా నివేదనలే అంటే వినిపించుకుంటారా! మరి ఇదంతా నాకు ఆవేదనేగా, మీ పిల్లలు ఆరోగ్యంగా వుండాలని అని మీరు కోరుకుంటారు. నా పిల్లలు భవరోగంతో బాధపడకూడదని నేను కోరుకుంటూ వుంటాను. మీ పిల్లలు అన్నింట్లో విజయం సాధించి సిరిసంపదలతో సుఖంగా ఉండాలని మీరు కోరుకుంటారు. నేనూ నా పిల్లలు భక్తి జ్ఞాన వైరాగ్యసంపదలతో మోక్షాన్ని, పరమశాంతిని పొందాలని ఆకాంక్షిస్తూ వుంటాను. మీ పిల్లల్ని విడిచి మీరుండలేరు. అలాగే మీ వియోగాన్ని నేనూ భరించలేను. మీ పిల్లల కాలిలో ముల్లు గుచ్చుకుంటే మీకు గుచ్చుకున్నట్లు బాధపడతారు. మరి కర్మవశాత్తు ఏ బిడ్డ బాధపడినా, నాకు బాధేగా! మీ పిల్లలు బడి దాటి విశ్వవిద్యాలయాల్లో పెద్ద చదువులు చదవాలని మీరు ఆశిస్తారు. మరి మీరూ నా ఫోటోలు, విగ్రహాలను దాటి జ్ఞానతీరాలలో నన్ను పొందాలని నాకూ ఉండదూ? మీ తోడై, నీడై జీవించే ప్రతిక్షణం, మరణం తర్వాత జన్మజన్మలుగా మీతోనే వుండి, మిమ్మల్ని ప్రేమించే నన్ను తెలుసుకోలేక, ప్రేమల కోసం హత్యలు, ఆత్మహత్యలకు, దారుణాలు. నా ప్రేమను గుర్తించరూ? కోరికల హోరులేని నిశ్శబ్దంలో మీ కోసం ఎదురుచూస్తూ వుంటాను. మీ చల్లటి ప్రేమను కురిపించరూ? కలియుగంలో అటువంటి ప్రేమ కరువైపోతోంది నాయనలారా! వెంటనే మీరు స్వామీ! స్వామీ! ఎంత బాధపెడుతున్నాం స్వామీ మిమ్మల్ని! మా కళ్ళు తెరుచుకుంటున్నాయి. ఏం చెయ్యాలో చెప్పండి స్వామీ! మీ బాధ చూడలేము అని మీరన్నట్లయితే, కోరికలతో మళ్ళీ మళ్ళీ జన్మలెత్తుతూ, కష్టాలను భరిస్తూ, అశాశ్వత సుఖాల్ని నిజమైన సుఖాలు అనుకోకండి. ఆస్తులను కూడబెట్టుకున్నామనుకుంటూ, పాపాలను పెంచుకోకండి. అశాంతితో జీవితాలను గడపక, ముందు తరాలకు భక్తి జ్ఞానాలను కానుకగా ఇవ్వండి. జీవితసత్యాన్ని, నా తత్త్వాన్ని గ్రహించగల మానసికశక్తిని ఆస్తిగా ఇవ్వండి. నన్ను ప్రేమించడమంటే, సమస్త ప్రాణికోటినీ ప్రేమించడమనీ, ఆ ప్రేమే నా అనుగ్రహమనీ, మహా ఐశ్వర్యమనీ, ఆశీర్వచనమనీ గ్రహించండి. అనుక్షణం తల్లినై, తండ్రినై ప్రేమ నిండిన హృదయంలో మీలో ఉంటానని గ్రహించి ఆనందంగా జీవించండి.

**పూర్వం హి విహితం కర్మ దేహినం న విముంచతి ।**
**ధాత్రా విధిరయం దృష్టో బహుధా కర్మ నిర్ణయే ॥**

*ముందు చేసుకున్న కర్మము దేహధారియైన మానవుడ్ని వదలదు.*
*అనేక విధాలుగా కర్మను నిర్ణయించే సందర్భంలో బ్రహ్మ ఈ విధానాన్నే గ్రహిస్తాడు.*

*మానవునికి సంసారము కంటి అద్దాలవలే వుండవలయును.*
*కంటి అద్దాలు దృష్టిని అభివృద్ధి చేయునే గానీ, అడ్డము రావు కదా!*
*అటులనే, సంసార జీవితము భగవత్‌దృష్టిని అభివృద్ధి చేయవలయును గానీ,*
*దానిని తగ్గించేదిగా వుండకూడదు.*
*కళ్ళకు అడ్డమయ్యే అద్దాలు వేసుకుని తిరిగేవాడు అమాయకుడే కదా!*

***ఫోటోలను చూస్తే మనుషులందరూ మహా నటులే అనిపించరూ!***
***కుటుంబసభ్యులు, బంధువులందరూ, స్నేహితులు***
***ఎవరైతేనేం, ఆ కాసేపూ కస్సుబుస్సులు ప్రక్కనబెట్టి,***
***శాంతి సామరస్యాలు వెల్లివిరుస్తున్నట్లు, ఎంత చక్కగా అభినయిస్తారు!***
***పెళ్ళిల్ల, శుభకార్యాల ఫోటోలు చూస్తుంటే, స్వర్గంలో దేవతల సమూహాన్ని***
***క్లిక్ మనిపించినట్లు అన్పించదూ!***
***ఫోటోలకు పోజివ్వటానికి రసాలన్నీ విడిచి శాంతిరసాన్ని అద్భుతంగా పండిస్తారు***
***డబ్బిచ్చి ఫోటో తీయించుకుంటారు కాబట్టి,***
***ప్రశాంతత మీ ముఖంలో ప్రతిఫలించేదాకా ఫోటోగ్రాఫర్ ఓపిగ్గా నిరీక్షిస్తాడు***
***గోడకు వేళ్ళాడేవన్నీ నిజాలు కాకపోవచ్చు***
***హృదయంలో వుండే నేను మాత్రం నిజం***
***అలాగే, నిరీక్షణ నిండు మనసుతో చేస్తాను***
***మహాశయులారా! దయచేసి మారుతి మాటలను మన్నించండి.***
***ఫోటోలను చూచి మనుషులను అంచనా వేయకండి, మోసపోకండి***
***ఆంజనేయుని విగ్రహము ముందు నిలచి, నిగ్రహము పాటించి***
***నిముషములో, నిత్య సత్యమైన నన్ను చేరి సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**11-01-2021** 10:10 AM

**154) మేము అహంకారాన్ని జయించుటకు ఎట్టి సాధన చేయాలి స్వామి!**

*దేవుడున్నాడు. ఇది యదార్ధం! భగవంతుడ్ని మీరు చూడగలరు. కానీ ఎప్పుడూ? మనోనిగ్రహం కలిగినప్పుడు, ప్రశాంతమనస్కులై సుఖదుఃఖాలను సమదృష్టితో చూడగలిగినప్పుడు. అందుకోసం ప్రతిరోజూ ఆత్మవిచారణకై కొంత సమయాన్ని కేటాయించాలి. మేము ఈ లోకానికి ఎందుకు వచ్చాము? మేము*

మా జీవితాన్ని ఏ విధంగా గడుపుతున్నాము? భగవంతుని చూసేందుకు మేమేమయినా ప్రయత్నిస్తున్నామా? అంటూ ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఆత్మపరిశీలన చేసుకోకపోతే, మనస్సు మిమ్మల్ని మోసం చేస్తుంది. మీరు మనస్సుకు లోబడి జీవించరాదు. మీ ఆధీనంలో మనస్సు ఉండేలా, జాగరూకత వహించాలి. మనస్సు నిర్మలమైన కొద్దీ, భగవంతుని వైపు మొగ్గు చూపుతుంది. అలాగే, మనస్సు ఏ విధంగా మోసగిస్తుందో కూడా గుర్తించగలుగుతారు. మనస్సు ఎప్పుడూ స్థూలవిషయాలనే పట్టుకువేళ్ళాడుతుంది. జపధ్యానాలను అనుష్ఠించిన కొద్దీ, మనసు సూక్ష్మత్వాన్ని గ్రహించగలుగుతుంది. సాధన సాధన సాధన! సాధనను కొనసాగిస్తూనే ఉండాలి. అనవసర ప్రసంగాలతో కాలక్షేపం చేయకుండా, సదా భగవంతుణ్ని మీ మదిలో నిలపాలి. తింటున్నా, కూర్చున్నా, లేచినా, పని చేస్తున్నా... ఇలా ఎల్లవేళలా భగవంతుని చింతన మానరాదు. ఈ విధంగా సాధన చేసినట్లయితే, హృదయం ఆనందంతో నిండిపోతుంది. లౌకికులు తమ ధ్యానమంతా ధనం మీదపెట్టి అది ఎక్కడ ఖర్చయిపోతుందోనని బహు జాగరూకులై ఉంటారు. కానీ, మీ మనశ్శక్తి ఎంత దుర్వినియోగమవుతుందో తెలుసుకోలేరు. నిరంతర భగవన్నామస్మరణ చేయడం కంటే సులభతరమైనది, మహత్తరమైనది వేరొకటి లేదు అనే చెబుతాను. దీనితోపాటు త్యాగాన్ని కలిగి వుండాలి. ఎటువంటి త్యాగం? దానికై ఒక కథ చెబుతాను, మీకు అర్థం కావటానికి.

ఒక బ్రహ్మచారి తాను త్యాగపురుషుణ్ణని అనుకుని, తనకున్నదంతా త్యాగం చేశాడు. ఒక కౌపీనం, ఒక ఆసనం, ఒక కమండలం ఇవే అతనికి మిగిలిన ఆస్తి. అతనికి త్యాగాన్ని గురించి సరియైన అవగాహన కలిగించటానికి గురువుగారు అతనితో, "నాయనా! నీవు త్యాగం చేసిందేమిటీ? నీవు ఏమీ త్యాగం చేయలేదని నాకనిపిస్తుంది" అన్నారు. అప్పుడు ఆ బ్రహ్మచారి, "నాకున్నదేమిటి? ఒక గోచీ, ఆసనం, కమండలం మాత్రమే కదా. వీటిని కూడా త్యజించమని మా గురువుగారి అభిప్రాయమా?" అని తనను తాను ప్రశ్నించుకున్నాడు. తర్వాత ఒక చితి పేర్చి తన దగ్గర వున్న ఒక్కొక్క దానినీ అగ్నిలో వేసి, తాను నిజమైన త్యాగాన్ని సాధించాననుకున్నాడు. గురువుగారు అతనితో, "నీవు త్యాగం చేసిందేమిటీ? ఒక ఆసనం, ఒక వస్త్రం, ఒక కమండలం. ఇవే కదా? ఈ వస్తువులన్నీ ప్రకృతికి చెందినవే కదా! సొంతానివి నీవేమి త్యాగం చేశావు?" అన్నారు. "ఇక నా దగ్గర ఉన్నదేమిటి? నా శరీరం. ఈ శరీరాన్ని కూడా అగ్నికి ఆహుతి చేస్తాను" అని అనుకున్నాడు ఆ బ్రహ్మచారి. బ్రహ్మచారి అగ్నిజ్వాలలలోకి దూకబోతున్నప్పుడు, గురువుగారు "ఒక్క క్షణం ఆగు. నాయనా! ఏం చేస్తున్నావు? ఈ శరీరం నీదా? కొంచెం ఆలోచించు" అన్నారు. వెంటనే బ్రహ్మచారి తన తప్పును తెలుసుకున్నాడు. ఈ అనర్థానికంతటికీ మూలకారణం తన అహంకారమే. అహంకార త్యాగమే నిజమైన త్యాగం అని గ్రహించాడు. కాబట్టి, ఈ సకల చరాచర ప్రపంచమంతా భగవదేచ్ఛతో నడుస్తుంది. అంతా ఆ సర్వేశ్వరుడి ఇచ్ఛానుసారం జరుగుతున్నదని గ్రహించినప్పుడు, ఇక అహంకారానికి ఆస్కారమే లేదు. భగవంతుని యందు ఎవరు సంపూర్ణ శరణాగతి భావాన్ని అలవరచుకుంటారో, అలాంటివారిలో కించిత్తయినా అహంకారం ఉండదు. జీవులందరి అస్థిరమైన ఆత్మల్లో సుస్థిరుడై ఉండేవాడు, ఉచ్ఛ్వాసనిశ్వాసల్లో నెలవై జీవులు నిర్జీవులు కాకుండా చూసేవాడు ఆ సర్వేశ్వరుడు. మీ అందరివీ జీవాత్మలైతే, ఆయన ఒక్కడిదే పరమ ఆత్మ! అందుకే ఆయన పరమాత్మ! జీవులందరూ కడలి నుంచి అభిన్నమయిన చిన్నచిన్న అలల వంటివారు. ఆయన మాత్రం

అలలకు ఆధారమైన జలధి లాంటివారు. అలలు కడలికి చెందినవే కానీ, కడలి అలలకు చెందినది కాదు. అలా, అలల్లా చంచలమైన ఆత్మల్లో ఉండటం ఆ పరమాత్మకు అనాదిగా అలవాటైన లక్షణం. ఈ ప్రగాఢమైన సందేశాన్ని తెలుపుతూ అహంకారాన్ని విడనాడండి అని చెబుతున్నాను.

**అతీవ గుణసంపన్నో న జాతు వినయాన్వితః ।**
**సుసూక్ష్మమపి భూతానా ముపర్ద ముపేక్షతే ॥**

అధిక గుణసంపన్నుడు, వినయశీలుడైనవాడు, బహు సూక్ష్మమైనదైననూ
ప్రాణులకు హింస జరుగబోగా, సహించలేదు.

ఏదీ శాశ్వతం కాదు.
ఎటువంటి గడ్డు పరిస్థితులనైనా మార్చుకోవచ్చునని గుర్తిస్తే, ఒత్తిడే లేదు.

***ఎప్పుడో అప్పుడు, ఎక్కడో అక్కడ,***
***అలాగో ఇలాగో ఎలాగో మరెలాగో***
***చూడగానే కొట్టుకుంటుంది గుండె వేగంగా***
***ఎవరో ఎప్పుడో ఎలాగో అలాగ***
***ఈ రోజా, మరో రోజా? దోచుకుపోతారు దాన్ని.***
***కానీ, అందాకా పవిత్రంగా, పదిలంగా స్వచ్ఛంగా, సహజంగా ఉంచాలి దాన్ని.***
***ఇది రక్తనిధి. అర్థాల అందాల సరోవరం.***
***శరీరం సజీవం కోసమే మరి***
***అంతేకాదు, అది నవరసభరిత పుష్పం***
***పవిత్ర దేవాలయం, పరిపూర్ణ ఆనందనిలయం***
***అహంకార రహితం, అర్చించటానికే, అర్పించటానికే***
***ప్రణయమో, ప్రణవమో, ప్రమోదమో, ప్రమాదమో***
***మీరే నిర్ణయించుకోండి***
***జీవితం చిన్నది మరి ఆశ పెద్దది***
***ప్రేమ అనేది ఒక అగాధమైన జలనిధి***
***ఆరాధనా పూర్వకమైన మహోన్నత శిఖరం***
***వీటన్నింటినీ అంతర్లీనం చేసుకుంది మది***
***ముదముతో పరిభాషించినా, మదముతో పరిహసించినా,***
***స్వాధీనముతో స్పందించినా, అలజడుల మధ్య అలసిపోయినా***
***అహంకారాన్ని విడనాడటమే***
***అదే నిజం. అదే మనిషి బ్రతుకుకు అరుణోదయం***
***గాయమైనా, గేయమైనా, అమృతమైనా, హాలాహలమైనా***

***సమధురభరితం, సువర్ణ అక్షరాల కావ్యం***
***కనులకందని కమ్మని 4 అక్షరాల సమన్వయం***
***అహంకారం***
***దానిని వదిలి ఆంజనేయుని చేరి చివరగా ఆశల తీరం దాటి***
***మదిలో విరిసిన చిరునవ్వుల వర్షంతో***
***ఇదే కదా నవజీవన వర్షం అంటూ గుర్తించి నన్ను చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**12-01-2021** 10:10 AM

**155) ఆనందానుభూతి కేవలం మానవులు మాత్రమే పొందగలరా స్వామి!**

అల్పజీవులకు కూడా ఆనందానుభూతి కలుగుతుందని చెప్పటానికే ఈ ఉదాహరణ చెబుతున్నాను. అరుణోదయవేళ మంచి మాటలేమైనా వినబడతాయేమోనని ఆశగా చూస్తున్నాను. ఎందుకో మరి, సంధ్యామాత మబ్బు చాటు చేసింది. నిరాశగా వెనక్కు వాలి, దేవస్థానం పుస్తకాల షాపు మెట్ల మీద విశ్రాంతి తీసుకుంటుంటే, చిన్నగా గుసగుసలు వినబడ్డాయి. రెండు చీమలు ఇలా అనుకుంటున్నాయి. తాతా! స్వామి దర్శనానికి ఇంతమంది మనుషులు హడావుడిగా గోవిందనామాలు చెప్తూ వెళ్తున్నారు కదా. మరి నువ్వెప్పుడైనా స్వామిని చూశావా? అని ఆశగా అడుగుతుంది. దానికి తాతచీమ నవ్వి, ఆ రోజును ఎలా మర్చిపోతానురా! నీలాగే ఆలోచిస్తూ చచ్చిబ్రతికి, మహాద్వారం దాకా చేరాను. ఇక లోపలికి ఎలా వెళ్ళాలి అనుకుంటూ ఉండగానే, ఓ షావుకారుగారు జారిపోతున్న పంచె పైకి లాక్కుంటున్నారు. ఏమైందో తెలియదు గానీ, ఆయన పంచె అంచుమీద వున్నాను. ఆయన వస్త్రం మాటిమాటికీ జారిపోతోంది. శంఖనిధి, పద్మనిధి చూస్తూ ముందుకు కదులుతున్నాం. ఆయన పుణ్యమా అని పైకీ క్రిందకీ తైతెక్కలాడుతూనే కాస్త ముందుకు వెళ్ళాక, అనంతాళ్వార్ గునపం చూద్దామని తల పైకెత్తాను. అంతే! అమ్మో చీమ! అని ఒక్క దులుపు దులిపాడు. సెక్యూరిటీ గార్డ్ మీద పడ్డాను. ఆయనా విదిలించాడు. నీళ్ళల్లో పడ్డాను. అమ్మో నీళ్ళు అని భయపడుతూ వుంటే, ఓ అమ్మ చీర కొంగు స్వామివారి అభయహస్తంలా ఆదుకొంది. భయం తగ్గాక అనుకున్నాను, స్వామి నాకు కాళ్ళు కడుక్కునే అవకాశం ఇచ్చాడని. ఆ అమ్మ కొంగు సవరించుకుంటే, మళ్ళీ గాల్లోకి ఎగిరాను. అలా ఎగిరి నేలమీద పడ్డాను. ఇంక ఏ భక్తుడి కాళ్ళ క్రిందో పడి, ఈ జన్మ ముగుస్తుందనుకున్నాను. ఎలాంటి జన్మ అయితేనేమి, స్వామి ముంగిట, ఆయన నామస్మరణలో ముగింపు పలకటం ఎంత అదృష్టం! గోవిందా! అనాథరక్షకా! ఆపద్బాంధవా! శరణు శరణు! అనుకుంటూ కళ్ళు మూసుకున్నాను. అంతే! మరుక్షణం దృశ్యం మారిపోయింది. ఓ నల్లనివాడు, ఆజానుబాహువుడు, గొప్ప తేజస్సుతో వెలిగిపోతున్న దేవతాస్వరూపుడు, నవ్వు ముఖంతో నా వైపు వస్తూ కనబడ్డాడు. "స్వామి వచ్చేశారా తాతా?" అన్నాడు మనుమడు ఉత్సాహంగా. "ఉండరా!

అప్పుడేనా? కాస్త ఓపికపట్టు" అన్నాడు తాత. ఆయన ఎంతో ఆప్యాయంగా నన్ను పొదువపట్టి, తన చేతిలోకి తీసుకుని, "నేను ధన్యుడ్ని" అన్నాడు. అదిరిపడ్డాను. మృత్యుఘడియలు వచ్చేసినట్లున్నాయి అనుకున్నాను. అంతలోనే అన్పించింది. నాలాంటి అల్పప్రాణి కోసం ఆయనే వస్తారా, నా భ్రమ కాకపోతే. అంతలో ఆయన నువ్వనుకున్నట్లు కాదులే. నీ పంటపండింది అని ముందుకు కదిలాడు. అక్కడ ఎంతోమంది దివ్యస్వరూపులు వరుసగా వారి వారి వంతు కోసం ఎదురుచూస్తూ, గోవిందనామాలు చేస్తూ ముందుకు కదులుతున్నారు. పార్షదులు వారిని నియంత్రిస్తున్నారు. దక్షిణ దిక్పాలకుడు ముందుకు వెళ్ళి ఇంకో తేజోరూపుడికి నన్ను అప్పగించాడు. ఆయన చేయి వెచ్చగా వుంది. నన్ను తన ముందున్న ఆయన చేతిలో విడిచాడు. అదేమిటో, అతని చేతిలో నిలబడలేకపోతున్నాను. అటూ ఇటూ కొట్టుకుంటున్నాను. ఇంతలో నిశ్శబ్దం. రామనామం పలకడం తెలిసింది. ఒళ్ళు పులకించి గట్టిగా జైశ్రీరామ్ అనబోతే, ఆయన ముక్కుమీద వేలు వేసుకుని, "మనసులో" అని సైగ చేశాడు. సుప్రభాతం కాబోలు అనుకున్నా. హనుమ ఎందుకో హడావుడిగా వున్నారు. ఏ ఆర్తి పొందిన భక్తుడ్ని ఉద్ధరించాలో మరి, నన్ను తీసుకు వెళ్తున్నాయన. కంగారుగా ముందుకు కదిలి, నన్ను గరుడాళ్వార్‌కి అప్పగించేశాడు. ఆయన్ని ఆశ్చర్యంగా చూస్తూ వుంటే, "నాకేసి కాదు, అటు చూడు" అని సైగ చేశాడు. సుప్రభాతం అయిపోవచ్చినట్లుంది. తెర తీస్తున్నారు. ఆ దివ్యమంగళమూర్తిని చూస్తూ వుండగానే, కులశేఖరుడు కదిలిరావటం కన్పించింది. మరుక్షణం అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి పాదాల మీద ఉన్నాను నేను. "ఇంకా 'నేను' ఉందా నీలో?" అని స్వామి నవ్వుతున్నాడు. నా నోట మాట రాలేదు. మనసులో దుఃఖమనే మంచు కరిగి, గంగాయమునలై కళ్ళల్లోంచి ప్రవహిస్తోంది. "స్వామి నాలో ఉన్ననాడు, నేను లేనయా అంటూ, స్వామి పాదాల మీద ప్రణమిల్లాను" అనే మాటలు వినబడ్డాయి. ఇది మీకు ఉపయోగపడుతుందని చెప్పినాను.

నేను అనే భావం తొలగినప్పుడే ముక్తి లభిస్తుంది.
నేను, నాది అనుకోవడమే అజ్ఞానం. నీవు, నీది అనుకోవడమే జ్ఞానం.

**సంతప్తాయసి సంస్థితస్య వయసో నామాపి నజ్ఞాయతే ।**
**ముక్తా కారతయా తదేవ నలీనపత్ర స్థితం రాజతే**
**స్వాత్యాం సాగరశుక్తి మధ్య పతితం తన్మౌక్తికం జాయతే**
**ప్రాయేణాధమ మధ్యమోత్తమ గుణః స్సంపర్గతో జాయతే ॥**

నీటిబిందువు బాగుగా కాలిన ఇనుముపై బడిన, నామరూపములు లేకుండా నశించును.
ఆ నీటిబిందువే, తామరాకుపై పడినచో, ముత్యమువలే ప్రకాశించును.
అదియే స్వాతికార్తెలో ముత్యపుచిప్పలో బడిన ముత్యమే అయిపోవును.
అట్లే, అధమము, మధ్యము, ఉత్తముల గుణములు వారివారి సంబంధము వలన కలుగును.

***వేలకు వేలు వెచ్చించి, వేలమైళ్ళు పయనించి, పుణ్యనదుల స్నానమాచరించి,***
***వేలుపుల నెందరినో నిరంతరం వేడుకొని, ముడుపులు కానుకలు చెల్లించుకొని***

***వ్యయప్రయాసలకోర్చి, వెతలు చెంది, కోరికలు తీర్చమని దేవుని కోరుటకన్నా,***
***ఆపదలలో వున్నవారిని ఆదుకున్న, ఆపన్నులకు అభయహస్తమిచ్చిన,***
***ఆకలి కడుపులకు అన్నం పెట్టిన, దీనముగా వున్న దీనుల వెతలు తీర్చిన***
***ఇట్టి పరోపకార పనులెంతయో మిన్న!***
***మానవసేవే మాధవసేవ అని భావించండి***
***ఆపద్బాంధవులకే అనంతుని అనురాగం దక్కు***
***అట్టివారిని దేవుడు కష్టాల కడలిని దాటించు***
***వారి ఇష్టాలను ఎన్నింటినో తప్పక నెరవేర్చు***
***తన్ను తాను అర్పించుకున్న ఈ ఆంజనేయుడు తప్పక ఆపన్న హస్తమునందించి***
***అక్కున చేర్చుకొనును ఈ చిన్నారి ముద్దుబిడ్డలను***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**13-01-2021** 10:10 AM

(Meditation 10:50 దాకా)

**156) కోపాన్ని ఎలా అదుపు చేసుకోవాలి స్వామి!**

*ప్రతివ్యక్తిలోనూ రజోగుణం కారణంగా కోపం అంతర్నిహితంగా నెలకొని వుండటం సహజమే. ఎంతో కొంతమేర ప్రతి ఒక్కరూ కోపానికి లోనవటం కూడా మీరు చూస్తూనే వుంటారు. సులభంగా బాహ్యప్రేరణలకు లోనయ్యే స్వభావం గలవారు, తేలికగా ప్రభావితమయ్యే వ్యక్తులు కోపాన్ని అభివ్యక్తం చెయ్యడానికి ఎప్పుడూ ఏదో ఒక కారణం వెతుక్కుంటూనే వుంటారు. అంతేగాక, కోపం సాంక్రమికగుణం కలది కూడా. ఒక మనిషి కోపంలో అదుపుతప్పి పలికిన మాటలు ఇతరులలో కోపాగ్ని రగిలించే అవకాశం కూడా వుంది. అందుకనే, కోపాగ్ని జ్వలించినప్పుడు, దాన్ని ఉపశమింపచేసే మాటలు మాట్లాడటం, మౌనం వహించడం అత్యవసరం. ఇతరులు మీపట్ల ప్రదర్శించే కోపానికి మీరు ప్రతిస్పందించకుండా ఉండాలంటే, మీరు వారిని శ్రేయోభిలాషులుగా పరిగణించి, వారికి మానసికంగా ధన్యవాదాలు అర్పించాలి. ఎందుకంటే, మీపట్ల వారు కోపం వహించినప్పుడు మీ దోషాలను ఎత్తిచూపుతూ, మీకు కనువిప్పు కలిగిస్తున్నారు, తద్వారా మీ అనురక్తిరాహిత్యాన్ని పటిష్టం చేస్తున్నారు. అందుకే వారిపట్ల మానసికంగా మీరు సర్వదా కృతజ్ఞులై వుండాలి. కోపాన్ని ఒక బలీయమైన వాంఛగా పరిగణించాలి. క్రోధం ఆవహించినప్పుడు, మనిషి మనిషిగా ఉండడు. క్షణభంగురమైన వస్తువులపట్ల తీవ్ర అనురక్తి కలిగి వుండటమే కోపానికి కారణం. పరమపద మార్గంలో పరిపూర్ణతను పెంపొందించే సుగుణాలలో ఒకటి సాధుశీలత. ఆధ్యాత్మిక పరిపూర్ణతను సంతరించుకోవడంలో సాధుత్వానికి వున్న ఆధ్యాత్మికశక్తితో పాటు, సాధుత్వానికి వున్న కోపాన్ని ఉపశమింపచేసే గుణాన్ని కూడా ఎందరో మహాత్ములు మీకు బోధించారు.*

అది ఈనాడు నేను కూడా మీకు బోధిస్తున్నాను. కోపాన్ని ప్రతిఘటించేటప్పుడు, యుక్తాయుక్త వివేచన, శాంత స్వభావం, ఉదారత, సౌజన్యం, దృఢమైన మనస్తత్త్వం మొదలైన సాధులక్షణాలు మిక్కిలి ప్రభావవంతంగా పనిచేస్తాయి. కేవలం దుర్బలులు, పిరికివారు మాత్రమే సాధుత్వాన్ని, సౌమ్యత్వాన్ని అలవరచుకుంటారనేది ఒక దురభిప్రాయమే. వాస్తవానికి సౌశీల్యం లేకుండా సాధుత్వాన్ని ఎవరూ అలవరచుకోలేరు. సౌశీల్యం, సాధుత్వం సంపాదించడం ఒక సాహసవంతమైన కార్యం. ఆధ్యాత్మికమైన పరాజయాలు మీలో తీవ్ర పరితాపాన్ని కల్గిస్తాయి. అంతమాత్రం చేత మీరు నిరాశాపూరితులు, నిర్లిప్తులు కాకూడదు. తీవ్ర ఆత్మవిమర్శకు లోనుకాకూడదు. మీ అపరిపూర్ణతల గురించి చింతించి ఎన్నడూ అసహనానికి లోనుకాకపోవటమే సాధుత్వాన్ని అభివ్యక్తం చేయటానికి ఒక ప్రశస్థమైన సాధన. ఎందుకంటే, తమ విసుగుపట్ల తామే ఎక్కువ విసుగు చెందేవారు మరింతగా తీవ్రమైన ఉద్వేగాలలో కూరుకుపోతారు. తత్ఫలితంగా, కోపాన్ని అధిగమించడం వారికి శక్తికి మించిన పని అవుతుంది. తనను తాను ద్వేషించే మానవుడు పతనానికి దగ్గరలో ఉన్నాడని అంటాను.

*తలపై మోసే భారాన్ని ఇతరులు కొంత పంచుకుంటే, బాధ తగ్గుతుంది.*
*కానీ, ఆకలి బాధనూ, అలాగే అజ్ఞాన బాధనూ ఎవరికి వారే తగ్గించుకోవాలి!*

**పాపం చేత్ పురుషః కృత్వా కళ్యాణ మభిపద్యతే ।**
**ముచ్యతే సర్వపాపేభ్యో మహాభ్రేణేన చంద్రమాః ॥**

మానవుడు తొలుత పాపకార్యాలు, తరువాత పుణ్యకర్మలను ఆచరించినట్లయితే,
మహామేఘము నుండి విడివడ్డ చంద్రుని వలే సమస్త పాపాల నుండి విముక్తుడవుతాడు.

***భగవంతుడు ఈ పృథ్విపై ఓషధుల్ పుట్టించి,***
***అన్నమునిచ్చాడు ఆదిదేవుడై***
***నీరుకై దప్పికగొన్న మానవునికి నిండుగా పుష్టిగా పాలను అందించి***
***తెల్లటి మనసును ఇచ్చినాడు***
***నిప్పువై, కాంతివై నిఖిల జగాలకు చలనము పెంపుయున్ వెలుగునిచ్చినాడు***
***పవనమై, ఉచ్ఛ్వాసను ప్రాణశక్తిగా నిల్పి,***
***చైతన్యభావాల చదువునిచ్చాడు***
***ఆకాశరూపాన అవకాశ స్వేచ్ఛనిచ్చాడు***
***ఆత్మతత్త్వములోని అద్భుతార్ధములు తెలుపుటకై***
***ఈ ఆంజనేయుడు అవతరించి ఆదరించినాడు***
***ప్రేమ చూపించి, సేవ చేయించి, పరలోక గతి బాట పొందుపరచి***
***ఈ పవనకుమారుడు ప్రజ్ఞతో పూర్ణజ్ఞానజ్యోతి స్ఫూర్తినిచ్చి***
***నిలియున్నాడు మీ ముంగిట మీ హితవు కోరి సన్నిహితుడై***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**14-01-2021** 10:10 AM

**157) సాంప్రదాయముల యొక్క ప్రాముఖ్యత ఏమిటి స్వామీ? వాటిని ఎందుకు పాటించాలి స్వామీ?**

*దాదాపు వంద సంవత్సరాల పూర్వపు మాట. గోదావరి తీరంలో సస్యశ్యామల సుభిక్ష, సుసంపన్నమైన ఒక గ్రామం. ఆ గ్రామంలో సదాచార సంపన్నమైన ఒక ఉమ్మడి కుటుంబం ఉండేది. సువిశాలమైన వారి ఇల్లు మూడు తరాల ఆబాలవృద్ధులతో నిత్యం కళకళలాడుతూ ఉండేది. ఆ కుటుంబం దైవసేవకు, అతిథిసేవకు పెట్టిందిపేరు. సుగంభీర గాత్రంతో తాతగారు చేసే వేదపాఠంతో అందరూ మేల్కొనేవారు. కాలకృత్యాలు, స్నానాదులు తరువాత పూజాగదిలో స్తోత్రపఠనం, ప్రార్థన అనంతరం సూర్యభగవానునికి నమస్కరించి, అందరూ వారి వారి పనులలోకి వెళ్ళేవారు. ఒకేసారి 50 మంది కూర్చునేటటువంటి అవకాశం గలది వారి పూజామందిరం. అతిథిసేవలో తృటి కలిగినా, తాతగారి మనస్తాపానికి అంతం వుండేది కాదు. ప్రతిరోజూ సాయంత్రం మూడు గంటలకు అందరూ వసారాలోకి చేరి అతిథిసేవకు ఉపయోగించే బియ్యాన్ని రామనామపూతం చేయడం నిత్యాచారం. అంటే, శ్రీరామతారకమంత్రాన్ని మనసులో జపిస్తూ ఒక్కొక్క బియ్యపు గింజను ప్రక్కనపెట్టి యథాసాధ్యం బియ్యాన్ని రామనామపూతం చేసి, వాటిని మాత్రమే అతిథిసేవలో ఉపయోగించేవారు. అతిథులు వచ్చిన తర్వాత వారిని ఎలా స్వాగతించాలి, వారికి భోజనం ఎలా ఏ విధంగా వడ్డించాలి, ఇలా అన్ని పనులలో అందరూ సుశిక్షితులే. ఆ ఇంట్లో కొన్ని పెంపుడు పిల్లులుండేవి. భోజనాలకు విస్తర్లు వేయగానే, తాతగారి కంఠం ఖంగుమనేది. "పిల్లల్లారా! అతిథులు భోజనానికి కూర్చుంటున్నారు. పిల్లుల్ని గంప క్రింద పెట్టండి" అనగానే, పిల్లలు త్వరత్వరగా పిల్లుల్ని గంప క్రింద దూర్చేవారు. అతిథులు తుష్టిగా భోజనం చేస్తూంటే, దూరంగా గంప క్రింద ఉన్న పిల్లులు మ్యావ్ మ్యావ్ శబ్దం లయబద్ధంగా వినిపిస్తూ వుండేది. ఈ విధమైన దైవసేవ, అతిథిసేవ నిరాటంకంగా సాగుతూ వచ్చాయి. కాలక్రమంలో రెండవ తరంవారు గృహస్థులయ్యారు, మొదటి తరం స్వర్గస్థులయ్యారు. రెండవ తరంవారు అతి శ్రద్ధతో కొనసాగించారు. మూడవ తరం గృహస్థులయ్యాక, ఉద్యోగరీత్యా పట్టణాలకు చేరారు. కుటుంబసభ్యుల సంఖ్య, పూజాగది పరిమాణం తగ్గినవి. పూజకు కేటాయించే సమయమూ తగ్గింది. ఎందుకంటే, ఉద్యోగాల హడావుడి. అయినా కుటుంబ సాంప్రదాయాలపై గౌరవం మాత్రం సడలలేదు. సూర్యనమస్కారం మాత్రం నియమంగా చేస్తున్నారు, బియ్యం రామనామపూతం చేయడమూ మానలేదు. అయితే, ఒక రామనామానికి ఒక గింజకు బదులు, ఒక గిద్ద బియ్యం తీసుకుని డబ్బాను నింపుతూ వచ్చారు. అతిథి భోజనానికి కూర్చునే ముందు మ్యావ్ మ్యావ్ శబ్దం చేయటానికి ఒక పిల్లిని పెంచసాగారు. ఈ విధంగా కుటుంబ సాంప్రదాయాలను పాటిస్తున్నామనే పరమతృప్తితో ఆ తరంవారు పరమపదించారు. ఇక నాల్గవతరం గృహస్థులయ్యారు. మహానగరాలకు వలస వెళ్ళారు. పూజాగదికి చోటెక్కడ? దైవాన్ని వంటగది గోడలో ఒక గూటికి పరిమితం చేశారు. అర్ధరాత్రి వరకూ వ్యాపారం పనులు, ఆరుగంటలకు లేవడం కష్టమే. అయినా కుటుంబ సాంప్రదాయాలు వదులుకొనేదెలా? ఎప్పుడు లేస్తే, అప్పుడు దీపారాధన చేసి, అగరువత్తిని వెలిగించి, హడావుడిగా ఒక దణ్ణం పెట్టేసి, పూజను పూర్తి చేశామనే తృప్తితో కార్యక్షేత్రానికి*

పరుగులు తీసేవారు. సూర్యనమస్కారం చేయటానికి అపార్టుమెంటు నుండి సూర్యోదయమే కనిపించదాయే! మనసులోనే సూర్యనమస్కరం చేసేవారు. వ్యాపారరీత్యా పరిచయాలు పెరిగాయి. అతిథులు పెరిగారు. ఇంట్లో ఉన్నది నలుగురు. రోజుకు నాలుగు గిద్దలు రామనామ బియ్యం ఏ మూలకి? రోజుకు ఒక్కొక్కరూ ఒక తవ్వ బియ్యం 'శ్రీరామ' అంటూ డబ్బాలో పోయసాగారు. మరి పిల్లి సంగతి? మంచి ఉపాయం తట్టింది. ఇంట్లో పనిమనిషికి నెలకి 500 రూపాయలు ఇచ్చి అతిథులు వచ్చినప్పుడు పిల్లిని తీసుకొని వచ్చి మ్యావ్ శబ్దం వినిపించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ముత్తాతగారు ఎంతో దూరపు ఆలోచన చేసి ప్రవేశపెట్టిన సాంప్రదాయాలు వాటిని మేమూ పాటించామనే తృప్తితో కన్నుమూశారు నాల్గవ తరంవారు. కన్ను మూస్తూ మూస్తూ, కుటుంబ సాంప్రదాయాలను పాటిస్తూ వుండమని ఐదవతరం దగ్గర ప్రమాణం చేయించుకున్నారు. తాతముత్తాతల చరిత్ర గురించి, కుటుంబ ఆచారాల వంశపారంపర్యం గురించి కథలుకథలుగా వింటూ వచ్చారు ఎలక్ట్రానిక్ ఐదవ తరంవారు. తీవ్రంగా ఆలోచించారు. సాంప్రదాయాలను ఎలా కొనసాగించాలి? ఎలా కొనసాగించాలి? రాత్రంతా కంప్యూటర్లో దేశవిదేశాలతో వీడియోకాల్స్ అటెండ్ అవ్వాలి. జీవనయానంలో రాత్రి, పగలు మధ్య భేదం తగ్గిపోయింది. ఉదయం ఎన్ని గంటలకు లేస్తామన్నది, రాత్రి ఎన్ని గంటలు కాల్స్‌లో ఉన్నామన్న దానిపై ఆధారపడి వుంటుంది. ఈ మాత్రం దానికి పూజగది, గోడలో గూడు అవసరమేముంది? అందుకే ఒక మూల ఒక పటం తగిలించి, సమయం దొరికినప్పుడు ఒక అగరువత్తి వెలిగిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్‌లో సూర్యోదయ దృశ్యాన్ని దర్శిస్తున్నారు. అతిథిసేవకై బియ్యం కోసం డిజిటల్‌బ్రెయిన్‌లో ఒక డిజిటల్ ఆలోచన మెరిసింది. ఒక డబ్బాలో నిండుగా బియ్యం పోసి, రామనామాన్ని అనవరతంగా వల్లెవేసే యంత్రాన్ని ఆ బియ్యపుడబ్బాలో బిగించారు. నిరంతర రామనామ శబ్దంతో బియ్యాన్ని స్నాతం చేయగలిగిన వారి ఉపాయానికి వారే మురిసిపోయారు. ఇక మిగిలినవి పిల్లికూతల ఏర్పాటు. ఒక ఎలక్ట్రానిక్ పిల్లిని ఏర్పాటుచేశారు. ఆన్ చేయగానే మ్యావ్ మ్యావ్ అంటూ సహజ మధురంగా ఆలపిస్తూ వుంటుంది. ఇంకేం? సాంప్రదాయానికి కావలసినవి అన్నీ సమకూరాయి. తండ్రిగారికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నట్లే. మనసులోని అలజడి తగ్గింది. ఇక అతిథులు రానే వచ్చారు. భోజనం వడ్డించగానే మార్జాల యంత్రాన్ని ఆన్ చేశారు. ఆహారపు రుచులను ఆస్వాదిస్తూ ఆరగిస్తున్న అతిథులు రాం, మ్యావ్ శబ్దాల మిశ్రమాన్ని విని, అయోమయంగా ప్రశ్నించారు, సంగతి ఏమిటని. మన ఐదవతరం ఆసామిలో కించిత్ గర్వం, "మా తాతముత్తాతల నుండి వస్తున్న సాంప్రదాయం" అన్నాడు. "ఏం సాంప్రదాయం?" అడిగారు అతిథులు కుతూహలంతో. "అతిథులకు వండే బియ్యానికి రామనామాన్ని, అతిథులు తినేటప్పుడు మార్జాల మ్యావ్ మ్యావ్ శబ్దాన్ని విన్పించటం" అని చెప్పగా, "ఎందుకు?" అని అడిగారు అతిథులు కుతూహలంతో. "పెద్దలు ప్రవేశపెట్టిన సాంప్రదాయాలను ప్రశ్నించే స్వభావం మా వంశంలో లేదండీ" అన్నాడు మన ఐదవతరం ఆసామి సగర్వ మందహాసంతో. ఇది ఐదుతరాల వారి ఆచార చరిత్ర, సాంప్రదాయాల కథ. ఇక ఆరవతరంవారి సాంప్రదాయ పరిరక్షణ ఎలా ఉంటుందో ఊహించుకుంటూ, ఈ కథ ఇక్కడితో ముగించి కథ నుండి ఏమి నేర్చుకోవాలో ఆలోచించండి. శారీరక క్రమశిక్షణకు, మానసిక పరివర్తనకు హృదయ వికాసానికి తోడ్పడే మన సంస్కృతిని చేజార్చుకుంటున్నారు. తాతగారు ప్రవేశపెట్టిన సాంప్రదాయాల వెనుక ఎన్ని

వ్యక్తిగత కుటుంబ ఆరోగ్య సూత్రాలు దాగి వున్నాయో. బద్ధకం వీడి ఉదయమే లేచి స్నానాదులు ముగించడం వల్ల కుటుంబసభ్యుల మధ్య ఆంతరికత, అవగాహన, సూర్యనమస్కారం వల్ల ప్రకృతితో తాదాత్మ్యత, అతిథిసేవకు బియ్యం లెక్కిస్తూ రామనామం చెప్పటం వల్ల ఆధ్యాత్మికత – ఈ విధంగా మనిషిని సంస్కరించే ఎన్నో పద్ధతులు ఇమిడి వున్నాయి. ఇటువంటి వాటిని నానా కారణాలతో వదిలివేస్తున్నారు, లేదా సంక్షిప్తం చేస్తున్నారు. పిల్లులను గంప క్రింద పెట్టేటటువంటి అర్ధంపర్ధం లేని ఆచారాలను ప్రశ్నించకుండా మూఢంగా అనుసరిస్తున్నారు. ఇకనైనా తరతరాలుగా మీకు అందించబడిన సత్‌సాంప్రదాయాలను పరిరక్షించుకుని, సమాజాన్ని పట్టిపీడిస్తున్న మూఢనమ్మకాలను సమూలంగా పెరికించి పురాతన సంస్కృతీ శిథిలాలపై నవభారతాన్ని నిర్మించండి. ఇది ఆంజనేయుని విన్నపం.

***గృధ్రదృష్టిర్బకాలీరపః శ్వ చేష్ట స్సింహ విక్రమః ।***
***అనుద్విగ్నః కాకశఙ్కీ భుజంగ చరితం చరేత్ ॥***

*కార్యసాధకుడు విచారముతో కూర్చుండడు. అతడు గ్రద్దకున్న దూరదృష్టిని, కొంగకున్న నిశ్చలతను, కుక్కకున్న సావధానతను, సింహముకున్న పరాక్రమమును పొందును. కాకి వలె ఆపద విషయమును శంకించుచుండును. పాము వలె సాధనములను ఉపయోగించుకొనుచుండును. (పాము చీమలు పెట్టిన పుట్టను తనకై ఉపయోగించుకొనునట్లు, తనకై ఉపయోగించుకొనును)*

***జీవితమంటే అర్థం తెలియక బెండుగా నిలచిన మీకు***
***జీవం పోసి, కదలికల నిచ్చి, జారుతున్న కాలానికి తగ్గట్లు***
***కాయం మోహం క్రమక్రమంగా మార్పులు చెందుతూ పెరుగుతూ వుంటే,***
***గమ్యం తెలియక కలత చెందు మీకు దారి చూపుటకై నా దరిచేరమని***
***తెలివి తెప్పించి, ఈ వెలుగున నిల్పి, నడకలు నేర్పి,***
***తికమకపడుచున్న మిమ్ములను దారిలోకి నెట్టి,***
***మేరును మించి మెరిసే దేవుడిగా, సత్యాసత్యములను ఎరుకపరచి,***
***నాది అన్నది జీవితమైతే, నమ్మి నడచుటే శ్రేయస్సా?***
***అట్టి శ్రేయస్సు నా బిడ్డలకు వద్దు అని, శుద్ధమైన దివ్య చరణాలను చూపించి***
***నా దరికి నడవండి అని చేయి పట్టుకున్నాను***
***నా ఈ చిన్నారి ముద్దుబిడ్డలను***

నేటి మనిషి ఇంటిని మారుస్తాడు,
తాను నడుపుతున్న వాహనాన్ని మారుస్తాడు,
మాటాడుతున్న ఫోన్‌ను మారుస్తాడు,
చివరకు స్నేహితుల్ని కూడా మారుస్తాడు,
అయినా సరే, దుఃఖములోనే ఉంటాడు.
ఎందువలన?
తనను తాను మార్చుకోలేడు కాబట్టి!

ॐ

**15-01-2021** 10:10 AM

**158) సమర్పణ ఏ విధంగా ఉండాలి స్వామీ?**

*యాంత్రికమైన సమర్పణ కృష్ణార్పణమస్తు, రామకృష్ణార్పణమస్తు – అది యాంత్రికం. ఎందుకంటే, భగవంతుడు మీరు సమర్పించిన వాటిని స్వీకరిస్తాడా లేదా అనే సంశయం మిమ్మల్ని పట్టిపీడించడమే. మీరు ఏది సమర్పించినా భగవంతుడు తప్పక స్వీకరిస్తాడు అనే విషయం దృఢంగా విశ్వసించి సమర్పించుకోవాలి. ఇటువంటి విశ్వాసమే వ్యక్తిలో పరివర్తన తీసుకువస్తుంది. కర్మలను సమర్పించడం సులభమే కావచ్చు. కానీ కొందరికి కర్మఫలాలను సమర్పించడం అంత సులభం కాదు. అంటే మీ గతకర్మఫలాలను, సంతోష విషాదాలను కలిగించేవనే దానితో నిమిత్తం లేకుండా సమంగా భావించి స్వీకరించడం ఆవశ్యకం. దురదృష్టవశాత్తు మనుషులు మంచిపనులు చేయటానికి సుముఖంగా వుండరు కానీ, సత్కర్మల ఫలాలను స్వీకరించ ఇష్టపడతారు. అలాగే పాపకార్యఫలాన్ని అంగీకరించలేరు, అయినప్పటికీ పాపకర్మల నుండి విరమించుకోరు. కర్మలను, కర్మఫలాలను త్యజించడం కంటే, సంకల్పాన్ని, కర్తృత్వభావాన్ని విడిచిపెట్టడం ఎంతో ముఖ్యం. శరణార్థియైనవాడు స్వయం సంకల్పిత కర్మలు చేపట్టరాదు. అసంఖ్యాకమైన కోరికలు, సంకల్పాలు, వాటిని నెరవేర్చుకునేందుకై కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం మొదలైన ఆలోచనలు మీలో చెలరేగవచ్చు. కానీ, వాటిని కార్యరూపం దాల్చనివ్వకూడదు. కార్యాచరణకు పురిగొల్పే ఆ తపనను నిగ్రహిస్తూ వుంటే, క్రమంగా ఆయా కార్యాలను నెరవేర్చాలనే సంకల్పం కూడా బలహీనమవుతూ వుంటుంది. దీనికి ఒక గృహస్థు ఉదంతం చెప్తాను. శిష్యుడు తన స్వాధీన ఇచ్ఛను త్యజించి, గురువుగారికి 'ముక్త్యారునామా' అంటే 'ఆధ్యాత్మిక బాధ్యతల అప్పగింత' ఇచ్చాడు. అతనిపై గల అపారకృపతో గురువుగారే అతడి బాధ్యత వహించారు. ఒకసారి గురువుగారి సమక్షంలో ఏదో ఒక సామాన్యమైన విషయమై "ఆ పని నేను చేస్తాను" అన్నాడు శిష్యుడు. అప్పుడు గురువుగారు ఆక్షేపణీయంగా, "అదేమిటి, నేను చేస్తానని అంటావెందుకు? ఒకవేళ నీవు చేయలేకపోతే అప్పుడేమిటి? భగవత్‌సంకల్పం వుంటే చేస్తానని చెప్పాలి" అని సరిదిద్దాడు గురువు. శిష్యుడు, "ఆయన చెప్పింది నిజమే. నా పూర్తి బాధ్యతను భగవంతునిపై మోపాను. ఆయన నా భారం వహించ సమ్మతించారు. ఫలానా పని సముచితమైందనీ, నాకు మేలు ఒనగూరుస్తుందనీ ఆయన భావించి నాకు అనుమతి ఇస్తేనే దాన్ని నేను చేయగలను. నా స్వశక్తితో నేనెలా చేయగలనూ?" అన్నాడు శిష్యుడు. శిష్యుడు క్రమంగా "నేను చేస్తాను, నేను వెళతాను" అని చెప్పడం మానివేశాడు. కాలక్రమంలో తన సంకల్పానుసారం ఏమీ చేయని స్థితికి చేరుకున్నాడు. భగవత్ సంకల్పం ఏమిటో తెలుసుకోగోరి, పలుమార్లు అతడు గంటల తరబడి భగవదాదేశం కొరకు వేచివుండేవాడు. ఒకసారి దాహంతో పరితపిస్తున్నాడు. ఎదురుగానే బల్లపై గ్లాసునిండా నీళ్ళున్నాయి. అయినా వాటిని అతడు త్రాగటంలేదు. కారణం అందుకు అతనికి భగవదాదేశం లభించకపోవటమే. ఇది కొంత హాస్యాస్పదంగా కనిపించవచ్చు. నిష్క్రియునిగా, నిర్లిప్తునిగా, నిరాశావాదిగా, నిస్సహాయునిగా మారటమా శరణాగతి అంటే? అనిపించవచ్చు. కానీ, ఒక వ్యక్తి తన అన్ని ఆలోచనలకు, చేష్టలకు తాను భగవంతునిపై,*

అతని శక్తిపై ఆధారపడి వున్నాడో లేక తన దిక్కుమాలిన అహంపై ఆధారపడి వున్నాడో ప్రతికదలికలోనూ, ప్రతి శ్వాసలోనూ పరికించవలసి రావడం సామాన్యమైన ఆధ్యాత్మిక సాధనా? ఈ రకమైన శరణాగతి విషమ పరిస్థితుల నుండి సదరు వ్యక్తిని కాపాడుతుంది. దీనికి ఒక కథ చెబుతాను. ధర్మపరాయణుడైన ఒక వస్త్రాల వ్యాపారి వుండేవాడు. అతడు కొనుగోలుదారుతో "రాముడి ఇచ్ఛమేరకు నూలు ధర ఒక రూపాయి. రాముడి ఇచ్ఛమేరకు వస్త్రం కూలి నాలుగు అణాలు. రాముడి ఇచ్ఛమేరకు లాభం రెండు అణాలు. రాముడి ఇచ్ఛమేరకు ధర రూపాయి ఆరు అణాలు" అని పలికేవాడు. పరమభక్తుడైన అతనిపట్ల జనానికి ఎంత విశ్వాసం వుండేదంటే, వారు బేరమాడక, తక్షణమే డబ్బు ఇచ్చి వస్త్రాలు కొనుక్కునేవారు. రాత్రి భోజనం ముగించి ఆలయ మండపంలో భగవచ్చింతన చేసే అతడు బందిపోటు దొంగల బారిన పడ్డాడు. ఆ బందిపోటు దొంగలు తాము కొల్లగొట్టిన సామాగ్రిని అతనిచే మోయించారు. పోలీసులు రావటంతో దొంగలందరూ పారిపోయారు. కానీ, తలపై భారం ఉండటంతో అతడు మాత్రం పట్టుబడ్డాడు. న్యాయాధికారి ముందు విచారణలో సైతం అతడు, "అయ్యా! రాముడి ఇచ్ఛమేరకు నిన్న రాత్రి భోజనం చేశాను. రాముడి ఇచ్ఛమేరకు ఆ తర్వాత ఆలయమండపంలో కూర్చున్నాను. రాముడి ఇచ్ఛమేరకు నేను ఆయనను ధ్యానిస్తూ ఆయన నామగుణకీర్తనలు చేస్తున్నాను. రాముడి ఇచ్ఛమేరకు అదే సమయంలో బందిపోటు దొంగల గుంపొకటి ఆ దారిలో వెళుతోంది. రాముడి ఇచ్ఛమేరకు వాళ్ళు నన్ను కూడా లాక్కొనివెళ్ళారు. రాముడి ఇచ్ఛతో వాళ్ళు ఒక ఇంట్లో దొంగతనం చేశారు. రాముడి ఇచ్ఛమేరకు పోలీసులు అక్కడకు వచ్చారు. రాముడి ఇచ్ఛవల్ల నేను పట్టుబడ్డాను. రాముడి ఇచ్ఛవల్ల నన్ను మీ ఎదుట హాజరుపరిచారు" అని పలికాడు. అతడు ధర్మపరాయణుడని గ్రహించిన న్యాయాధికారి అతడ్ని విడుదల చేశాడు. సమస్తం భగవంతునికే సమర్పించి ఆత్మసమర్పణం చేసుకుంటే, మరేచింతా వుండదని తెలియచేస్తుంది ఈ కథ. ఈ రకమైన సాధన భగవంతుని, అతని నామాన్ని అనుక్షణం స్మరింపచేసి, జీవితాన్ని రసమయం చేస్తుంది. స్వతఃసిద్ధంగా ఏ నిర్ణయమూ తీసుకోకపోవటం, ఇష్టపూర్వకంగా ఏ పనినీ ప్రారంభించకపోవటం, సహజంగా తనకు లభించిన సమస్తాన్నీ, కర్మఫలాన్నీ భగవంతునికే సమర్పించటం, తద్వారా భగవంతుని చేతిలో పరికరంగా మారటం, ఇదే ఆధ్యాత్మిక సాధనల అంతిమలక్ష్యం. తాను భగవంతునిలో ఉన్నానని, భగవంతుడు తనలో ఉన్నాడని, సమస్త కర్మలు భగవంతుని చేతనే జరుపబడుతున్నాయని భావించటం – ఇటువంటి శరణాగతి నిరంతర దైవస్మరణతోనే సాధ్యమవుతుందని తెలియచెబుతున్నాను.

సంతోషాన్ని, సంతాపాన్ని కలిగించేది మనస్సే గానీ,
మీరు ఉన్న చోటో, పరిస్థితో కాదు.

**అక్రుద్యంతో నసూయంతో నిరహంకార మత్సరాః ।**
**ఋజువః శమసంపన్నాః శిష్టాచార భవంతితే ॥**

కోపం, అసూయ, అహంకారం, మాత్సర్యం ఈ గుణాలు లేకుండా
మనోనిగ్రహం కలిగియున్నవారే శిష్టాచారులు.

***ఎందుకు మీలో ఇంత క్రౌర్యం?***
***ఏం చూసుకుని ఈ ధైర్యం?***
***మరణం ఎప్పుడు వరమాల వేస్తుందో తెలియదు***
***తలపులలో వెలగాల్సింది జ్ఞానదీపం***
***తలాపున ఎప్పుడు వెలుగుతుందో అంతుపట్టదు***
***సూది మొన కూడా వెంట తీసుకుపోలేని వాడివి***
***ఈ లోకానికి చుట్టపుచూపుగా వచ్చిన వాడివి***
***అపరాధాల మెట్టుపై అడుగేస్తున్నావు***
***నీ సంతోషాలను వెదుక్కుంటున్న నీవు***
***సాటి మనిషిని గౌరవించలేని కుసంస్కారముతో,***
***వికసించని నీ రాతిహృదయంలో,***
***అడుగంటిన మానవత్వపు చెమ్మ బ్రతుకు సరిహద్దురేఖపై నిలిపి***
***జీవితపరమార్థం తెలుసుకోండి***
***మనసును పుటంపెట్టి, మళ్ళీ మనుషులై జీవితాన్ని***
***చరితార్థం చేసుకోండి రామనామామృతంతో ఈ ఆంజనేయుని ముద్దుబిడ్డలుగా***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**16-01-2021** 10:10 AM

**159)** మేము భగవంతుని ఏమని ప్రార్థించాలి స్వామీ?

*ఒక చిన్న కథ చెబుతాను. ఒక చిన్న కొలను వుంది. అందులో చాలా కప్పలు ఉంటున్నాయి. అవ్వన్నీ కలిసి ఒకరోజు సమావేశమై, "మనం ఎన్నో తరాలుగా ఇక్కడ వుంటున్నాం. ఎప్పుడూ ఓ నాలుగు పురుగులు తినడం, గట్టు మీద నుంచి నీటిలోకి, నీటిలోనుండి గట్టుమీదకు దూకడంతోనే మన బ్రతుకు గడిచిపోతోంది. మనకు ఒక రాజుగారుంటే బాగుంటుంది.. అప్పుడు రాజదర్బారు, ఫిర్యాదుల పరిష్కారం, పరిపాలన ఇలా అన్నీ జరుగుతూ వుంటే, మనకు చాలా వినోదంగా వుంటుంది. మనకు ఓ రాజును ఇమ్మని భగవంతుడ్ని ప్రార్థిద్దాం. అయితే, అతడు మన జాతివాడు కాకపోతే మేలు. ఎందుకంటే, మన జాతివాడే అయితే, అతడు మనకు లోకువైపోతాడు" అని తీర్మానించాయి. ఆ కప్పలు సామూహిక ప్రార్థన మొదలుపెట్టాయి. ఆ కప్పల ప్రార్థనలు విన్న దేవుడు వచ్చి, "ఓ కప్పల్లారా! ఏమి మీ కోరిక?" అని అడిగాడు. ఆ కప్పలు వాటి కోరికను తెలిపాయి. అయితే దేవుడు, "మీరిప్పుడు బాగానే ఉన్నారు కదా! ఎందుకు మీకు ఈ క్రొత్త గోల?" అన్నాడు. కానీ, ఆ కప్పలు వాటి పట్టు వీడలేదు. "సరే! మీకొక రాజును ఇస్తాను. ఇదిగో మీ రాజు" అంటూ ఒక పెద్ద దుంగను ఆ కొలనులో పడవేసి,*

మాయమైపోయాడు. ఆ దుంగను చూసి కప్పలన్నీ చాలా సంతోషించినాయి. కప్పలన్నీ ఆ దుంగరాజుగారి చుట్టూ చేరి, రాజుగారితో కబుర్లు చెప్పుకుని ఆనందించాయి. ఇక కాసేపటికి కొన్ని పిల్లకప్పలు రాజుగారి మీదకు ఎక్కి కూర్చున్నాయి కూడా. అయితే, నాలుగు రోజులు గడిచేసరికి, వారికి ఆ దుంగరాజు మరీ నిస్తేజంగా కనిపించాడు. అసంతృప్తి చెందిన ఆ కప్పలన్నీ మళ్ళీ ప్రార్థనలు మొదలుపెట్టాయి. ఈసారి దేవుడు మరింత త్వరగా ప్రత్యక్షమవ్వటం, కప్పలు ఆ దుంగరాజు నచ్చలేదని పెదవి విరచడం చకచకా జరిగిపోయాయి. మంచి పరిపాలన చేసే చురుకైన రాజును ఇవ్వండి ప్రభూ! అని వేడుకున్నాయి. దేవుడు వాటికి ఒక కొంగరాజును రాజుగా ఇచ్చి వెళ్ళిపోయాడు. ఇక ఆ కొంగరాజు వాటిలో ఒక్కొక్కదాన్నీ తీరుబాటుగా పట్టుకుతింటూ ఉంటే, అప్పటికి గానీ, ఆ బెకమేథావులకు తామేమి తప్పు చేశామో తెలియలేదు. మీరు చేసే ప్రార్థనల గురించి ఒకమాట చెబుతాను వినండి. ప్రార్థనలంటే, దేవుడికి మీరు పెట్టుకునే దరఖాస్తులు. అయితే, మీ ప్రార్థనల మీద భగవంతునికి పూర్తి సంపాదక హక్కులు ఉంటాయి. ఆయన మీ ప్రార్థనలను తగ్గిస్తాడు, సరిచేస్తాడు. తన సంకల్పానికి తగ్గట్లుగా వాటిలో మార్పులు చేసి మీ చేతికిచ్చి మళ్ళీ దరఖాస్తు చెయ్యమంటాడు. అలా కాకపోతే, గొంతెమ్మ కోరికలతో మీ వినాశనాన్ని మీరే కొనితెచ్చుకున్న వారవుతారు. మీరు రోజంతా చేసే ఆలోచనలనే మీ ప్రార్థనల రూపంలో బయటకు వస్తాయి. కాబట్టి మీ ప్రవర్తన ఎలా ఉంటుందన్న విషయంలో నిరంతరం జాగ్రత్తగా వుండాలి. ఇక మీ ప్రార్థనలన్నీ ఫలవంతం అవుతాయా అని అడిగితే, కావనే చెప్పాలిగా. ఇక మీ ప్రార్థనలలో అధికశాతం అర్థంపర్థం లేనివిగానూ, సంకుచితంగానూ, వినాశకరంగానూ, అతి స్వార్థంతో కూడుకున్నవిగానూ వుంటాయి. అసలు మీ ప్రార్థనలన్నీ ఫలిస్తే ఏమవుతుంది, ఒక్కసారి ఆలోచించారా? అలా జరిగితే, మీ జీవితాలే గాక, ప్రపంచ వ్యవహారాలన్నీ కూడా తలక్రిందులైపోతాయి. అందుకే ఉత్తమ ప్రార్థన అంటే ఏమిటో తెలుసునా? ఏ విధంగా ప్రార్థించాలో తెలుసునా? ఓ దేవా! నాకేది మేలు చేస్తుందో, ఏది కీడు చేస్తుందో నాకు తెలియదు. కాబట్టి, నేను పూర్తిగా నీమీదే ఆధారపడియున్నాను. జీవితంలో నాకు కావలసినవన్నీ నువ్వే ఇవ్వాలి. నాకు అత్యుత్తమమైన మార్గమేదో నువ్వే చూపించు. నిరంతరం నిన్ను స్మృతిలో ఉంచుకునేందుకు కావలసిన శక్తిని నాకు ప్రసాదించమని కోరండి. అప్పుడు పూర్తి బాధ్యత ఆయనదే. తన బిడ్డలకు ఏమేమి కావాలో, ఏమి ఇవ్వాలో అంతా ఆయనిదే!

**అద్యాపినోజ్ఝతి కిల కాలకూటమ్ కూర్మోభి భక్తి ధరణీం ఖలు పృష్ఠభాగే ।**
**అమ్భోనిధిర్వహతి దుస్తర బడబాగ్నిమ్ అఙ్గీకృతం సుకృతినః పరిపాలయన్తి ॥**

ఈశ్వరుడు లోకక్షేమము కోరి నేటికినీ కాలకూటవిషమును కంఠమునందే ఉంచుకొనెను గానీ, విడువలేదు. విష్ణువు తాబేలై భూభారమంతయూ తన మూపుపై మోయుచున్నాడు. సముద్రుడు లోకముల తల్లడిల్లచేయు బడబాగ్నిని ధరించినాడు. మహాపురుషులు లోకక్షేమము నాశించి ఎన్ని కష్టములు వచ్చిననూ, తామంగీకరించిన పనిని సాధింతురు.

ఉన్నత లక్ష్యాలను సాధించే క్రమంలో
తాత్కాలిక ఆనందాలు త్యాగం చేయవలసిందే

***ప్రేమ ఎంత గొప్పదో చెప్పలేరు ఎవ్వరునూ***
***ప్రేమ గల జీవి ఈ భూమిపై ఎంతో గొప్ప భాగ్యశీలి***
***ప్రేమకు వయో జాతి వర్ణ కుల లింగ వివక్షత లేనేలేదు***
***ప్రేమకు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో ఎటువంటి నిమిత్తం లేదు***
***ప్రేమను పొందటమే కాదు, ప్రేమించడం కూడా గొప్పదే***
***ప్రేమించడం ప్రేమను పొందటం ప్రతి జీవికీ జన్మహక్కు***
***ప్రేమను తిరస్కరించిన జీవి కూడా తనను తాను ప్రేమిస్తుంది***
***ప్రేమయే ప్రతిజీవికీ పెన్నిధి, ప్రేమయే దైవం ప్రతి జీవికీ***
***ప్రేమను కలిగిన జీవి ఎంత పూజనీయమో గదా***
***ప్రేమ జీవికి ఈ భూమిపై సుఖజీవనాన్ని ప్రసాదిస్తుంది***
***ప్రేమించలేని జీవిని ఈ భూమిపై మీరు ఎక్కువ చూడబోరు***
***ప్రేమకు రాజ్యాలు, భోగాలు, సంపదలు అక్కర్లేదు భూమిపై***
***ప్రేమను బజారులో కొనలేరు, అలాగే అమ్మలేరు కూడానూ***
***ప్రేమించడం భూమిపై నేరం కాదు. దానికి ఎలాంటి శిక్షా లేదు***
***ప్రేమమూర్తియే పరమపావన మూర్తియై***
***పవనసుతుడై పరిపరి విధముల మిమ్ము ప్రేమించుచూ, పూజించబడుచూ***
***ఈ భూమిపైనున్న జీవులలో***
***ఆధ్యాత్మిక అంతర్జ్యోతులను వెలిగించి***
***నిత్యనూతన శోభలతో శోభించునట్లు***
***ఈ ఆంజనేయుని అద్భుత ప్రేమధారలో***
***ప్రేమయే దైవం ఈ జగమందున***
***సర్వ జీవకోటికిన్ అని తెల్పుచున్నాడు తన చిన్నారి ముద్దుబిడ్డలకు***
***ప్రేమగా, ప్రేమతో***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**17-01-2021** 10:10 AM

**160)** భగవద్గీత మాకు ఏమి నేర్పుతుంది స్వామీ?

*పాలను త్రాగితే శారీరకమైన పుష్టి కలిగినట్లు, గీతాసారాన్ని పానం చేస్తే మానసిక పుష్టి కలుగుతుంది. గీతను కేవలం పూజాగదిలో ఉంచి పూజిస్తే చాలదు. ఇది పూజించడానికి కాదు, ప్రతినిత్యం గీతను పఠించాలి. ఎందుకంటే, నిజానికి మానసికబలం లేకపోవటమే మీ సమస్యలన్నింటికీ*

ముఖ్యకారణం. ఏదైనా కష్టం వస్తే, భయపడి పారిపోయేవాడు అధముడు. కష్టాన్ని అనిష్టంగా బాధపడుతూ వుండేవాడు సహిస్తూ వుండేవాడు మధ్యముడు. అలా కాకుండా జీవితంలో కష్టసుఖాలు సహజమేనని గ్రహించి సమబుద్ధితో సహించేవాడు ఉత్తముడు. అలాంటివాడే నిజమైన ధీరుడు. అటువంటి సమబుద్ధి కలిగినవాడే మోక్షానికి అర్హుడు. జీవితంలో సుఖదుఃఖాలు అత్యంత సహజం. నేడు మీలో చాలామందికి భగవద్గీతను చదవాలని శ్రద్ధలేదు, వినడానికి తీరికా లేదు. ఎక్కడైనా ఘంటసాల భగవద్గీత వినిపిస్తుందంటే, అక్కడ ఎవరో చనిపోయారనే దుస్థితికి వచ్చారు. చనిపోయిన తర్వాత కాదు, జీవించి వుండగా వినాల్సింది ఈ భగవద్గీత. అప్పుడే మనిషికి ధీరుడిలా జీవించడం ఎలాగో, ఆనందంగా మరణించడం ఎలాగో అర్థమవుతుంది. కురుపాండవుల సంగ్రామ సన్నాహాలు జరుగుతున్నప్పుడు, అర్జునుడు, దుర్యోధనుడు యుద్ధంలో ఇద్దరూ తమకు సహకారం అందించమని అర్థించటానికి శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళారు. అప్పుడు భగవానుడు "నేను ఒక్కడినీ ఒకవైపు వుంటాను – నా సర్వసైన్యం మరోవైపు వుంటుంది. మీలో ఎవరికి ఏది కావాలో తేల్చుకోండి" అని వారితో చెప్పాడు. అప్పుడు అర్జునుడు కృష్ణుడ్ని కోరుకున్నాడు. అర్జునుడు తన కళ్ళకు కనబడని దైవబలంపై విశ్వాసం వుంచితే, దుర్యోధనుడు కళ్ళకు కనబడే అంగబలాన్ని ఆశ్రయించాడు. అంటే, సున్నాల్లాంటి ఆ సర్వసైన్యం ముందు ఒకటిలాంటి శ్రీకృష్ణుడు లేకపోతే అంగబలమెంతున్నా విలువలేని సున్నాలతో సమానమని గ్రహించలేని అజ్ఞాని దుర్యోధనుడు. ఒక్క కృష్ణుడు తన ప్రక్కన వుంటే చాలు, ప్రపంచంలోని సమస్త శక్తులు ఏకమైనా ఎదుర్కొనవచ్చని తలచిన సుజ్ఞాని అర్జునుడు. ఆ విధంగా అర్జునుడు అచ్యుతుడ్ని అండగా చేసుకొని విజయుడయ్యాడు – దుర్యోధనుడు అర్థాంగబలాన్ని నమ్ముకుని నాశనమయ్యాడు. నేటి మీ మానసిక సమస్యలకు కారణం దుర్యోధనుడిలాంటి ధోరణియే. అంగబలం కన్నా అచ్యుతుని బలాన్ని నమ్ముకుంటే ఎన్ని కష్టాలనైనా, ఎంత విషాదాన్నైనా అధిగమించవచ్చు అనేందుకు ఇది ఒక చక్కటి ఉదాహరణగా చెప్పాను.

**161) మనస్సును ఎలా నియంత్రించాలి స్వామీ?**

మనోనిర్వహణకు రెండు గుళికలు. దేహధ్యాస ఉన్నంత వరకూ కోరికలు ఉంటాయి. కోరికలు ఉన్నంత వరకూ మనసుని పరమాత్మపై నిలపటం దుర్లభం. దేహంపట్ల మమకారం ఎంత తగ్గితే, దైవంపట్ల అనురాగం అంత అధికమవుతుంది. కానీ, నేటి ఆధునిక ప్రపంచంలో దేహధ్యాసను పెంచే సుఖాలు, సౌకర్యాలు, ఆకర్షణలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. అందువల్ల మీరు ఏకాగ్రతలేమి, చంచలత్వం, ఒత్తిడి లాంటి మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. మరి ఇలాంటి పరిస్థితులలో జీవిస్తున్నవారికి పరిష్కారమార్గం ఏమిటి? ఈ సమస్యలను అధిగమించి మనోనియంత్రణ సాధించటానికి అవసరమైన మెళకువలను చెబుతాను. విషయాలను అదే పనిగా చింతిస్తూ వుంటే, వాటిపట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆసక్తి కారణంగా వాటిని పొందాలనే కోరిక పుడుతుంది. ఆ కోరికవల్ల క్రోధం ప్రకోపిస్తుంది. క్రోధంవల్ల మోహం కలుగుతుంది. మోహంవల్ల జ్ఞాపకశక్తి నశిస్తుంది. జ్ఞాపకశక్తి నశించడంవల్ల బుద్ధి అంటే విచక్షణాజ్ఞానం నశిస్తుంది. బుద్ధి నశించడంవల్ల మనిషి సర్వనాశనమవుతాడు. మీరు ఒక సుందరమైన రూపాన్ని గానీ, వస్తువును గానీ చూసినప్పుడు, మీకు తెలియకుండానే ఆకర్షితులవుతారు. అప్పుడు ఆ విషయవస్తువు గురించి పదేపదే ఆలోచిస్తారు. అలా ఆలోచించడంవల్ల దానిపట్ల ఆసక్తి

పెరిగి, ఆ విషయవస్తువును పొందాలనే కోరిక ప్రబలమవుతుంది. ఆ కోరిక తీర్చుకోవడం కోసం ఎలాంటి వక్రమార్గాన్నైనా అనుసరించటానికి వెనుకాడరు. ఒకవేళ ఆ కోరిక నెరవేరకపోతే, అందుకు కారణమైన వ్యక్తులపట్ల, పరిస్థితులపట్ల కోపాన్ని ప్రదర్శిస్తారు. ఆ క్రోధావేశంలో విచక్షణాజ్ఞానం కోల్పోతారు. అప్పుడు మీలోని పాశవిక ప్రవృత్తి ప్రజ్వరిల్లి, ఘోరకృత్యాలకు పాల్పడతారు. విషయధ్యానం – ఆసక్తి – కోరిక – క్రోధం – మోహం – మరపు – బుద్ధినాశనం – సర్వనాశనం ఇలా మనిషి పతనమయ్యే క్రమాన్ని తెలియబరచాను. మనస్సు విషయవస్తువులతో సంయోగం చెందితే భోగం, భగవంతునితో సంయోగం చెందితే యోగం. కానీ, మనస్సు ఎప్పుడూ విషయచింతన వైపే మొగ్గు చూపుతుంది. మనిషి పతనానికి కారణం విషయవస్తువుల గురించి చింతన చేయడమే అని చెబుతాను.

***న తన్మిత్రం యస్య కోపాద్ బిభేతి యద్ వా మిత్రం శంకితే నోప చర్యమ్ ।***
***యస్మిన్ మిత్రే పితరీ నాశ్వసీత తద్వై మిత్రం సంగతా వీతరాణి ॥***

*ఎవడి కోపము వలన భయపడవలసి వచ్చునో, వాడు మిత్రుడు కాజాలడు.*
*ఎవడిని శంకతో కూడిన మనస్సుతో చేరవలసియుండునో, వాడునూ మిత్రుడు కాడు.*
*ఎవడు తండ్రివలే విశ్వసించగలిగినవాడో, వాడే మిత్రుడు. ఇతరులు పరిచితులు మాత్రమే!*

***పరంధామం కంటే పరమాత్మ వేరు కాదు***
***పరమాత్మే పరంధామం - పరంధామమే పరమాత్మ అని తెలుసుకోండి.***
***సద్గురువు బోధల ద్వారా ఆత్మజ్ఞానాన్ని తెలుసుకుని, ఆత్మలో స్థిరంగా వుండి***
***కొంత ఆత్మజ్ఞానం, కొంత ప్రాపంచికం ఐనా, కొంత కొంత చేసి అందుకోండి***
***ఆధ్యాత్మికతను అదిమి పట్టుకోండి***
***ఈ ఆంజనేయుడు అజ్ఞానాన్ని దూరం చేసి, మీ అహాన్ని, ధనాన్ని, కీర్తిని దూరం చేసి***
***ధర్మంగా వుండుటకై ఎన్నో ధర్మాలను బోధ చేసి***
***నువ్వు చేసే మంచి పనుల్లో వుంటూ, మంచి భావనలు కల్గిస్తూ,***
***నీలో ఆత్మజ్యోతిని వెలిగిస్తూ, అజ్ఞానపు చీకటితెరలను తొలగిస్తూ***
***మీ జీవితాల్లోకి తొంగి చూస్తున్నాను***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**18-01-2021** 10:10 AM

*(ఈ రోజు భగవాన్ శ్రీసత్యసాయిబాబావారి సందేశం)*

**162)** భక్తిని ఏ విధంగా కాపాడుకోవాలి స్వామీ?

*1.* *మీరు 'హృదయమందిరం' అన్న ఈ పదాన్ని ఎప్పుడు ఉపయోగిస్తారు? మీలోనే దైవం వున్నాడని*

విశ్వసించినప్పుడు, మీ హృదయమే ఆ దైవం యొక్క నెలవు అని భావించినప్పుడు కదా! బాహ్యంగా మీరు మీ ఇంటి పూజామందిరంలో కాకుండా ఆలయాలలోనే దైవాన్ని దర్శించుకుంటారు. అంతటా దైవాన్ని దర్శించగలిగే స్థాయికి చేరనంతవరకూ అంతే కదా! బాహ్యనేత్రాలకు కానవచ్చే ఆలయానికి, హృదయమందిరానికి ఉన్న కొన్ని తేడాలను గమనించే ప్రయత్నం చేయండి. ఆలయంలో భద్రతా ఏర్పాట్లు వుంటాయి. ఏమిటవి అంటే, పెద్దపెద్ద తాళంకప్పలు, సిసి టీవీ కెమెరాలు, భద్రతా సిబ్బంది వగైరా వగైరా. దేవుడి ఆభరణాలకే కాదు, విగ్రహానికి కూడా సంరక్షణ అవసరం అనే కాలం ఇది. అదే, మీ మనసు అనే కోవెలకు వున్న ఒక ప్లస్ పాయింటు ఏమిటంటే, మీరు ఎన్ని ఆభరణాలతో అలంకరించినా, మీ దైవాన్ని ఎవ్వరూ వేలేసి తాకలేరు, దోచుకుపోలేరు. గ్యారంటీ! తలుపులు, తాళాలు అవసరం లేదు. కానీ కానీ, మీ చుట్టూ ఉన్నవారు, ఒక్కోసారి మీ కుటుంబసభ్యులే, మీలోని భక్తివిశ్వాసాలను కూకటివేళ్ళతో పెకిలించటానికి తమ శాయశక్తులా కృషి చేస్తూంటారు. హిరణ్యకశిపుడు ఎన్ని తిప్పలు పడ్డాడు? బలిచక్రవర్తి గురువు ఆ సందర్భంలో కన్ను కూడా పోగొట్టుకున్నాడు కదా! సక్కుబాయి అత్తగారు, తుకారాం భార్య, త్యాగరాజు అన్నావదినలు, మీరాబాయి అత్తింటివారు ఇలా ఎందరో ఆ ప్రయత్నంలో భక్తుల్ని బాధకు గురి చేశారు. దృఢమైన విశ్వాసమనే చేతులు అడ్డంపెట్టి, ఆ గాలిదుమారం నుండి తమ భక్తిని నిలబెట్టుకోవాలి, నిజమైన భక్తులు. మరి సామాన్యుల సంగతి ఏమిటి? అలాంటప్పుడు దైవాన్నే ప్రార్థిస్తాం. ఏమని? "ప్రభూ! నాకు పదిలంగా చూసుకోవటం రాదు. భద్రంగా చూసుకోవటం రానేరాదు. జాగ్రత్తగా ఉండటం అసలే రాదు. గట్టిగా పట్టుకోవటం అంతకన్నా రాదు. కనుక, పూర్తి భారం నీదే స్వామీ! దయచేసి నా గుండె గూటిలో నుండి, ఏనాడూ జారిపోవద్దు స్వామీ!" అని ప్రార్థించండి. ఎప్పుడూ చేయి పట్టుకునే ఉంటాను. నేను చెప్పినదానిని పాటించండి.

1. మీరు ఏ ప్రదేశంలో వున్నా, దానిని పరిశుభ్రంగా వుంచండి. ఎందుకంటే, నేను మీ వెంటనే, ఇంటనే, జంటనే వుంటాను – అందుకని!
2. భోజనము చేసే ముందు బ్రహ్మార్పణం చేయండి.
3. కోపము వచ్చినప్పుడు గ్లాసు చల్లని నీరు త్రాగండి.
4. కుటుంబసభ్యులందరితో ప్రేమపూర్వకంగా సంభాషించండి.
5. అవసరంలో ఉన్న ఇరుగుపొరుగు వారికి చేతనైన సహాయం తప్పక చేయండి.
6. **See No Evil. See Always Good.**
7. ప్రతిరోజూ అర్ధగంట సద్గ్రంథ పఠనం చేయండి.
8. **Think No Evil. Think Always Good.**
9. సర్వకర్మలు "భగవత్ ప్రీత్యర్థం" అనే భావంతో మంచిపనులు చేయండి.
10. అనుస్మరణతో మీ కాలాన్ని పునీతం చేసుకోండి.

ఒక చిత్రకారుడు హృదయమందిరం అని అందమైన పెయింటింగ్ వేశాడు. గుండె ఆకారంలో

వున్న కోవెల చిత్రం చాలామందిని ప్రభావితం చేసింది. అలా చూస్తున్నవారిలో ఒకతనికి చిన్న సందేహం కలిగింది. "ఆలయం చాలా బాగుంది కానీ, ద్వారానికి హ్యాండిల్ లేదు. ఎలా తెరవటం మరి?" అని. చిత్రకారుని అందమైన సమాధానం, "హృదయద్వారాలు బయట నుండి కాదండి, లోపలి నుండి తెరుచుకుంటాయి" అని చెప్పాడు. నిజమే కదా! అంతరంగంలో ఉండే భావం ప్రధానమైనది ఎవరికైనా ప్రవేశం లభించటానికి. మనసులో వాత్సల్యం వుంటేనే, పిల్లల మీద ప్రేమ కురిపిస్తారు కదా! మనసులో స్నేహభావం ఉదయిస్తేనే కదా మిత్రులకు, అత్తగారికి, మామగారికి, భర్తకు మదిలో స్థానం లభించేది. మనసులోకి ప్రేమ, కరుణ, త్యాగం వస్తే, లోపలి నుండే దేవుడు కూడా తోడుగా వస్తాడు. అలాగే భక్తిభావం మదిలో నిండి, తొణికిసలాడుతుంటే, దైవం కొలువుండటం ఖాయం. తలుపు, తాళాల ప్రసక్తే లేదు కాబట్టి, దర్శనానికి ఎవరిపైనా ఆధారపడి ఉండనవసరం లేదు.

ఓం

**19-01-2021** 10:10 AM

## 163) సద్గురువు యొక్క పాత్ర ఎట్టిది స్వామీ?

ఇంకా నిలబడటం, నడవటం రాని నాలుగు నెలల పసివాడు, ఇంకా మంచం దిగే యోచనే తెలియనివాడు. ప్రక్కనే వున్న పడకకుర్చీలో నాన్న పుస్తకం ఏదో చదువుకుంటున్నాడు. ఇంతలో పిల్లవాడు పక్క పాడుచేశాడు. ముక్కూముఖం ఏకం చేసుకున్నాడు. బురదలో చేపపిల్లలా టపటప కొట్టుకుంటున్నాడు. చివరకు తన మురికి తనే భరించలేక కెవ్వుమని ఏడుపు లంకించుకున్నాడు. పిల్లవాడి ఏడుపు విని నాన్న దగ్గరకు వచ్చాడు. పిల్లవాడు చేతులు పైకెత్తి ఎత్తుకోమన్నట్లుగా తండ్రివైపు చూస్తూ క్యార్‌క్యార్ మన్నాడు. మలమూత్రాలు ఒళ్ళంతా పూసుకుని, దుర్గంధభూయిష్టంగా వున్న కొడుకును నాన్న చూశాడు గానీ ఎత్తుకోలేదు. అంతలో పిల్లవాడు ఏడుపు విని అమ్మ కూడా పరిగెత్తుకొచ్చింది. "ఏమోయ్! వీడు చూడు, ఎలాగ వున్నాడో. ఒంటి నిండా పెంట పూసుకున్నాడు" అన్నాడు నాన్న. అమ్మను చూచి మరింతమ గట్టిగా ఏడుస్తూ, చేతులు చాపాడు పిల్లవాడు. అమ్మ, నాన్నలా దూరంగా ఉండిపోలేదు. ఒక్క ఉదుటున వచ్చి ఎత్తుకుంది. స్నానాలగదికి తీసుకువెళ్ళి, పీట వేసుకుని కూర్చుంది. చీర కుచ్చిళ్ళు పైకి లాక్కొని, పిల్లవాడ్ని కాళ్ళపై వేసుకుంది. నీళ్ళు, సున్నిపిండి వేసి, చేపను రుద్దినట్లు రుద్ది కడిగింది. పొడితువ్వాలు పెట్టి ఒళ్ళంతా తుడిచింది. పరిమళాలు వెదజల్లే గంధపు పొడులేవో రాసింది. బొట్టు, కాటుక పెట్టింది. ఉతికిన జుబ్బా తొడిగింది. బుగ్గన కాసింత దిష్టిచుక్క పెట్టింది. ఎత్తి ముద్దులాడింది. పిల్లవాడు ఏడుపు ఆపి, కిలకిలా నవ్వుతుండగా నాన్న చేతికిచ్చింది. చదువుతున్న పుస్తకం ప్రక్కనపెట్టి, కొడుకునెత్తుకుని "నా తండ్రీ! నా బంగారుకొండే!" అంటూ ముద్దులాడాడు తండ్రి. పిల్లవాడు పరమానందంలో మునిగిపోయాడు. భగవంతుడు నాన్నలాంటివాడు. మీరు మురికిగా ఉంటే ఎత్తుకోడు. దగ్గరకు రాడు, రానివ్వడు. అమ్మ మాత్రం సద్గురువు లాంటిది. మీ దోషాలను సమూలంగా తొలగిస్తుంది. ఈ ఆంజనేయుని పాత్ర గుర్తించండి. చాలు చాలు చాలు చాలు చాలు!

**రూప యవ్వన సంపన్నా విశుద్ధ కులసంభవాః ।**
**విద్యాహీనా న శోభన్తే నిర్గంధా ఇవ కింసుకాః ॥**

విద్యలేనివాడు మంచి రూపము, యవ్వనము కలిగి ఉన్నప్పటికీ, గొప్ప వంశమునందు
జన్మించినప్పటికీ, వాసనలేని మోదుగుపూవు వలె శోభించదు.

అవకాశాలు ఎప్పుడుబడితే అప్పుడు రావు.
తెలివిగల వ్యక్తి, వచ్చిన అవకాశాన్ని ఎన్నడూ జారవిడుచుకోడు.

***పుడమిన సద్గురువు రూపంబున వచ్చితి మానవ పరివర్తనకై***
***కాంక్షతీరా వీక్షించి కలుష విదూరుడను***
***కాలయాపన సేయకుండా కదలివచ్చితిని***
***కైవల్యము పొంది తరించండి అని చెప్పి,***
***మీలో అటువంటి భావసంశుద్ధి కలిగించుటకై, అదే భక్తి కనుక***
***అట్టి భక్తి కార్యములు, పుణ్యకార్యములు చేయుటే పూజయగును అని***
***పరులకు ఉపకారమొనర్చుటే తపస్సగును యని మరచిపోకండి***
***ఈ మంచి మాటలను అని మారుతినై బోధ చేశాను***
***నీవు వెలుగులో వున్నావు***
***నీవే వెలుగు, వెలుగు నీలో ఉన్నది అంటూ***
***వెలుగు నీవే అన్న భావన హృదయాన హత్తుకొన్నట్లయితే,***
***అట్టి జ్ఞానియే నీవైనట్లయితే,***
***తప్పక బ్రహ్మలో ఐక్యమగుదువు***
***ఈ ఆంజనేయుడు తన మధురభాషణతో***
***మంజుల గళముతో మందస్మిత వదనారవిందుడై***
***భక్తకోటి హృదయాలను భర్తీ చేయు సూటి మాటలు చెప్పి,***
***హృదయాన్ని భర్తీ చేసి,***
***సూక్ష్మ ధర్మంబులు తెలిపి***
***దెలుపుతూనే మీకు ఒప్పు మీర***
***కోర్కెలకేమి, నా కటాక్షమున్నచో చాలు అంటూ,***
***నాకదే పదివేలు తండ్రీ! అనేలా,***
***ఒక్కరీతి అనుగ్రహమున్న చాలు అని మీచేత, మీ నోట మాటకై***
***ఎదురుచుస్తున్న పవమానసుతుని చేత***
***మీరు నా బిడ్డలని యెల్లవేళలా***
***నేను మిమ్ములను అండలో చేర్చుకొని***

***దీవించవలె నా చిన్నారి ముద్దుబిడ్డలను***
***ముద్దుబిడ్డలారా!***

ఓం

**19-01-2021** 10:10 AM

## 164) రమణమహర్షి యొక్క బోధ ఏమిటి స్వామీ?

*రమణుడిని, రమణుడుగా చూసినంత కాలం మీరు మీలాగానే వుంటారు. రమణుడి మరణానుభవం పొందిన నాటినుండి సమాధి అయ్యేవరకూ ఆయన ప్రపంచానికి మాత్రమే ఉన్నాడు. కానీ, తనకు మాత్రం అసలు ప్రపంచమే లేదు. రమణుడిని స్మరించారనుకుంటే, ఆయనను కదలనివ్వకుండా సమాధిలో భద్రపరిచినట్లే. రమణుడు ఆత్మస్వరూపుడైతే, ఆయన మీకు-నాకు మధ్య వున్నాడు, లోపలా వున్నాడు-బయటా వున్నాడు, సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి. అదేమాట ఆయన బ్రతికున్నన్ని రోజులూ నెత్తీనోరూ కొట్టుకుని మొత్తుకున్నాడు. కానీ, ఎవ్వరికీ ఆ విషయం మీద దృష్టి లేదు. తనకు ఆయన శరీరం మీదనే దృష్టి లేదు. ఆయన "**నేను** అనేది సప్తకోటి మంత్రాలలో మొదటిది" అని చెప్పారు. "ఓంకారం కూడా దానికి ద్వితీయమే" అన్నారు. "**నేను** అనేది మహాశక్తివంతమైనది" అని చెప్పాడు. నిజంగా మీకు రమణుడిపై ఏ మాత్రం విశ్వాసం, గౌరవం వున్నా, ఆ ఒక్క నామాన్ని మాత్రమే తీసుకొని, దానిని స్మరించాలి, జపించాలి. కానీ మళ్ళీ మీరు, "ఓం నమో భగవతే శ్రీరమణాయ" అని మొదలుపెట్టారు. ఇప్పుడు మీరు, ఆయన చెప్పింది వినినట్లా, విననట్లా? ఆయనంటే భక్తి, గౌరవం అన్నీ వున్నాయి. కానీ, ఆయన చెప్పింది విన్నదెక్కడ? ఆయన చూపిన మార్గంలో నడిచిందెక్కడ? నీవు రమణాశ్రమాన్ని చూడకపోయినా ఫర్వాలేదు, ఆయన సమాధిని దర్శించకపోయినా ఫర్వాలేదు కానీ, ఆయన చెప్పిన మాటను గౌరవిస్తే ఆయన ఆనందపడిపోతాడు. ఆయన చెప్పిన పని చేయకుండా, కాళ్ళు మొక్కుతూ వుంటే, ఆయన మాత్రం ఏం చేస్తాడు? ఈయన మాత్రం ఏం చేస్తాడు? బయటకు వెళ్ళి ఏదో ఒక పని చేయమని మీరు మీ బిడ్డకు చెప్పారనుకోండి, వాడు వెళ్ళకుండా నమస్కారాలు పెడుతూ కూర్చుంటే ఎలా వుంటుంది? చెప్పిన పని చేయలేదని బెత్తం పట్టుకుంటారా లేక నమస్కారాలు పెడుతున్నాడని ఆనందిస్తారా? ఆలోచించండి మరి! నేనూ ఆలోచిస్తాను!*

***కర్మశూద్రే కృషిర్వైశ్యే సంగ్రామః క్షత్రియే స్మృతః ।***
***బ్రహ్మచర్యం తపో మంత్రాః సత్యంచ బ్రాహ్మణే సదా ॥***

*శూద్రులకు శుశ్రూష, వైశ్యులకు వ్యవసాయము, క్షత్రియులకు యుద్ధము పరమధర్మాలు. ఇక బ్రాహ్మణులకు బ్రహ్మచర్యం, తపస్సు, మంత్రాలు, సత్యం పరమార్థాలు, పరమధర్మాలు!*

***హంగులెన్నో దిద్దుకుని, రంగులెన్నో పూసుకుని***
***ముందుగానే విచ్చేసి, మీ ముంగిట్లో వాలేటి ఈ పవనసుతుడు***

***మీ అజ్ఞానాన్ని తొలగించి, విజ్ఞానాన్ని పెంచి***
***జ్ఞానాన్ని ఎరుకచేసి, జ్ఞానంగా మార్చి***
***సాధన పేరుతో ధ్యానాన్ని ఎరుకపరచి***
***దానితో మీ దశ, దిశ మార్చి***
***ధ్యాన విశిష్ఠతలను తెల్పి, దానితో నీలోని రుగ్మతలు దూరం చేసి***
***శాశ్వితుడిని చేరుటకై, శాశ్వితంగా చింతలను మాని***
***ఆనందపుడోలిక ఆధ్యాత్మికపు డోలికలలో***
***ఆటలాడించు ఈ ఆంజనేయుడు***
***బ్రహ్మాజ్ఞానాన్ని బోధించి***
***ఇదే మార్గమని ఎన్నో రీతుల***
***స్థూల, సూక్ష్మ శరీరాల సమ్మేళనమే యోగమని బోధించి***
***జ్ఞానదీపికలను అందిస్తున్నాడు అందుకోండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

సూర్యుడిలాంటి తేజస్సుకి విద్య,
చంద్రుడిలాంటి చల్లదనానికి ఆత్మీయత,
సముద్రంలాంటి ప్రశాంతతకు సంభవం అలవర్చుకుంటే,
మీరు నిజంగా ఆదర్శవంతులే!

ॐ

**20-01-2021** 10:10 AM

**165) సంసారమును సమర్ధవంతముగా చక్కబెట్టాలంటే మేము వేటిని పాటించాలి స్వామీ?**

సంసారమంటే సముద్రంతో సమానము. కానీ, దాని నుండి బయటపడటం కష్టం. లక్ష ప్రయత్నాలలో కొన్ని విజయాలతో, మరికొన్ని అపజయాలతో, మరికొన్ని అబద్ధాలతో, కొన్ని నిజాలతో, మరొకొన్ని అపార్ధాలతో, అవమానాలతో, తగాదాలతో, బంధాలతో, బాధ్యతలతో నిండినదే సంసారం. తృప్తిగా వుంటే సంసారం సంతోషంగా సాగిపోతుంది. తృప్తి లేని జీవితం సముద్రం మధ్యలో ఉన్నట్లు వుంటుంది. తృప్తి అనేది ఎప్పటికీ మనిషికి వుంటే ఆరోగ్యం, ఆనందం, మనసులో ప్రశాంతత, మొహంలో కళ, ఇంట్లో లక్ష్మీ వగైరా వగైరా. అమ్మ కడుపులో ఉన్నప్పుడు అమ్మకు ఎంతో తృప్తి. 9 నెలలు గడిచాక ఈ లోకంతో సంబంధం ఏర్పడ్డాక, అమ్మానాన్నలకు ఎనలేని ఆనందం. మొదట బంధాలు, బంధుత్వాలు అందరి మనసుల్లో నిలిచిపోతారు. పాఠశాలకు వెళ్ళాక గురువుగారి నీడలో మంచి మాటలతో, ఆటలతో, ఎనలేని ఎవరెవరితో కుల మత భేదం లేని కుటుంబం స్నేహంగా బంధంగా ఏర్పడి, కాలమే తెలియని వేగంతో హాయిగా, తృప్తిగా సాగిపోతుంది జీవనం. యవ్వనం, వయస్సు పెరిగిపెద్దయి, పట్టుదలతో

చదువు కొనసాగుతుంది. గమన, గమ్యం ఎరగకుండా పెళ్ళి అనే బంధంతో పెనవేసుకొని, క్రొత్తబంధాలు, బాధ్యతలు బంగారు భవిష్యత్తుతో క్రొత్త జీవితంలో అడుగుపెట్టే జీవనం జీవితం? మహా సముద్రం. సంసారం సంతోషంతో, బాధ్యతలతో, కష్టాలతో, సుఖాలతో, సుఖదుఃఖాలతో జీవనం సాగించాలి. ఏదిఏమైనా, ఎంత కష్టమొచ్చినా, సర్దుబాటుతో సహజీవనం సాగించాలి. ఓర్పు మనిషికి చాలా ముఖ్యం. ఒడుదుడుకులు ఎన్ని వున్నా, ఎదుర్కొనే మనస్తత్వం వుండాలి. జీవితాన్ని ముగించవద్దు. దేవుడిచ్చిన ప్రసాదంగా భావించాలి. గడిచిన జీవితంలో ఏమి పోగొట్టుకున్నామా అని బాధపడకుండా, భవిష్యత్తు గురించి ఆలోచించడం ముఖ్యం. జీవితంలో సంపాదించాల్సిన ఆత్మవిశ్వాసంతో అడుగువేయాలి. మీకు ఎవరో, ఏదో చేస్తారని ఎదురు చూసేకంటే, మీ పని మీరు చేసుకోవడం మేలు. ఎవరికి ఎవరూ ఏమీ కారు ఈ లోకంలో. మీ నీడే మీకు తోడు, మీ ఆత్మ మీకు స్నేహం. చీకటి లేకపోతే, వెలుగు విలువ ఎవరికీ తెలియదు. రెండూ వుంటేనే కాలానికి విలువ. కనులు లేకపోతే, కంటిపాప విలువ చెప్పినా అర్థం కాదు. ప్రపంచం, ప్రకృతి, అందం, చూడలేని చీకటిమయంగా, మాయగా వుంటుంది జీవితం, జీవనం. మరణం లేకపోతే ప్రాణం విలువ ప్రాణికోటికి తెలియదు. మరణమనేది లేకపోతే, అందరూ జీవించటానికి ప్రపంచమే సరిపోదు. అందమనేది అందరినీ ఆకర్షిస్తుంది. అందం ఉండగానే సరిపోదు. మంచి మనసుండాలి. మంచి వున్నదే అసలైన మనిషి. ప్రేమ వున్న హృదయాన్ని, మనసున్న మనిషిని, సహాయం చేసిన స్నేహితుని ఎప్పటికీ మరువకూడదు. దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోండి. మీరు చేయాలి అనుకున్న పని కూడా వెంటనే చేయాలి. మంచిపని అయితే చేద్దాం, చూద్దాం, తర్వాత టైం రావాలి అని అనుకోకూడదు. ఆలస్యం అమృతం విషం మీకు అవుతుంది. మంచితనంతో, మానవతా విలువలతో ఏ పని మొదలుపెట్టినా, చరితార్థులవుతారు. పంచదార వుంటేనే ప్రాణమున్న చీమలు వస్తాయి. అలాగే కాసులుంటేనే కడదాకా చుట్టాలు వస్తారు. అన్నీ బాగుంటేనే స్నేహం. ఏడుస్తుంటే చూసి నవ్వించేవాళ్ళు కొందరే వుంటారు. నవ్వేవాడిని చూసి ఏడిపించేవాళ్ళు ఎందరో వుంటారు. అహంకారిగా వుంటే, అన్నం కూడా దొరకదు ఆఖరికి. ఎవరి జీవితంలోనైనా ఒక్కసారైనా స్వార్థం సంతోషాన్ని, నమ్మకాన్ని నాశనం చేస్తుంది. వంద బిందెలతో నీళ్ళు పోసినంత మాత్రాన చెట్టు అమాంతం కాయలు కాయదు. అలాగే మీరు ఎక్కువ కష్టపడుతున్నారు కదా అని పనులు క్షణాల్లో పూర్తయిపోవు. దేనికైనా సమయం రావాలి, సహనం కావాలి. ఈ సమయంలో మనిషి ప్రవర్తన చూసి గౌరవం వస్తుంది కానీ, మనషి కులాన్ని చూసి గౌరవం రాదు. ఇంకా ఆ కులానికే నువ్వు గౌరవమిస్తే, మనిషిగా నీవు చనిపోయినట్లే. జీవితంలో ప్రతి ఒక్కరికీ ఆశ అనేది సహజం. కానీ, అతి ఆశ పనికిరాదు. హద్దులేని ఆశ, తెడ్డు లేని పడవ కుదురుగా వుండలేవు. ఏదో ఒకరోజు మిమ్మల్ని ముంచేస్తాయి. ప్రతి ఒక్కరి జీవితంలో ప్రతి ఒక్కరికీ కావలసింది ఆలోచనే. మనిషిని సరియైన మార్గంలోకి మళ్ళించి, కార్యోన్ముఖంగా చేస్తాయి. అందుకే ప్రతివారికీ ఆలోచన అతి ముఖ్యం. గమ్యం అనేది అవకాశం కాదు. అది ఎదుర్కోవలసిన లక్ష్యం. అది ఎదురుచూడవలసిన వస్తువు కాదు. కృషితో సాధించుకోవల్సిందే. జీవితమనేది ఒక పరుగు. ఆగమంటే ఆగదు. జీవితం ఒక పెద్ద పరీక్ష. ఆ పరీక్షలో మీరు ఒక విద్యార్థియే. స్కూళ్ళు, కాలేజీలు ఒక పెద్ద స్టేజి. ఆ స్టేజి మీద మీది ఒక పాత్ర. ఆ పాత్రలో మీరు

నటులు. అందుకే మీరు ముందుకు సాగాలి. జీవనాన్ని సాగించాలి. అద్భుతాలు ఎన్నో సృష్టించాలి. దృఢనమ్మకముంటే, ఏదైనా సాధించగలం. మితిమీరిన విశ్రాంతి అన్ని విధాలా అనర్థం. మీ వ్యక్తిత్వాన్ని బట్టే, సమాజంలో గౌరవం లభిస్తుంది. పనిని అభిమానిస్తే, విజయం అదే వస్తుంది. వినయం లేని విద్య, సుగుణం లేని రూపం, ఆకలి లేని భోజనం, శౌర్యం లేని ఆయుధం, సద్వినియోగం కాని ధనం, పరోపకారం చేయని జీవితం వ్యర్థం అని తెలియచెప్పుచున్నాను.

మనిషన్నవాడు కష్టాలకు దూరంగా జీవించాలనుకుంటాడు.
మనసున్నవాడు, కష్టాలలో వున్నవాళ్ళకు దగ్గరగా వుండాలనుకుంటాడు.

**వరప్రదానం రాజ్యం చ పుత్రజన్మ చ భారత ।**
**శత్రోశ్చమోక్షణం కృచ్ఛాత్త్రీణి చైకంచ తత్సమమ్ ॥**

*ఓ భారతా! వరమును పొందుట, రాజ్యలాభము, పుత్రునిజన్మ*
*ఈ మూడునూ కష్టసాధ్యమైన శత్రుబాధ తొలగుట అనే ఒక్కటితో సమానము.*

***అతికించడం నీకు తెలియనప్పుడు, చింపుకుంటూ కూర్చోవద్దు***
***బ్రతికించడం నీకు చేతకానప్పుడు, చంపుకుంటూ పోనూవద్దు***
***మనిషిగా నీవు పుట్టినప్పుడు, మహిషిగా మసలటం అనుచితం***
***మంచి ఆలోచనలను చేసినప్పుడే, మానవత్వపు సుమాలు మదిలో పూస్తాయి***
***మంచి మనిషిగా మసలినప్పుడే, మమతానురాగాలు వెల్లివిరుస్తాయి***
***బ్రతికినంతకాలం బ్రతుకుసారం తెలియాలి***
***నీ చుట్టూ వున్నవారికి మమకారం పంచాలి***
***నీలోని జ్ఞానదీపాన్ని నువ్వే వెలిగించుకోవాలి***
***నీ చుట్టూ చీకటిని వెన్వెంటనే నీవే తరిమికొట్టాలి***
***నీ హృదయం నిండా ప్రేమ నిండాలి***
***నీ సదనం అంతా అనురాగం పండాలి***
***ధరణిలో వెయ్యేండ్లు తనువు నిల్వగబోదు***
***ధనమెప్పటికీ శాశ్వితము కాదు***
***దారాసుతాదులు మీ వెంట రారు***
***భృత్యులు మృతిని దప్పింపలేరు***
***బంధుజాలము నిన్ను బ్రతికించుకోలేరు***
***బలపరాక్రమాలేవీ పనికిరావు***
***ఘనమైన సకల భాగ్యంబెంత కల్గియూ***
***గోచీ మాత్రం పైన గొనుచుబోడు***
***వెర్రి కుక్కల భ్రమలన్నీ విడిచి***

***రామభజన చేసెడి వారికి సుఖము***
***అని నొక్కి చెబుతున్న ఈ ఆంజనేయుని పదములు పదిలముగా పట్టుకుని***
***పలుకుచున్న పలుకులు సద్గురువు పలుకులుగా***
***పవమానసుతుడనై పరిచయ వాక్యములు పలికి***
***పరంధామమునకు చేర్చి చింతలన్నీ బాపి చిరంజీవినై***
***చిరుత ప్రాయములోనే చిన్మయులైన మిమ్ము దరిచేర్చుకుంటాను***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**22-01-2021** 10:10 AM

**166)** మరణం ఎటువంటిది స్వామీ?

*మరణమంటే అందరూ భయపడతారు, భయపెడుతూంటారు. కారణమేమంటే, మీ ఈ జీవనం మరణం ద్వారా ఇక లేకుండాపోతుందని భయం. తన జీవితం యొక్క మూల ఉద్దేశ్యం తాను ఈ జగత్తులో శాశ్వితంగా, సుఖంగా ఉండవలెనన్నదే తప్ప మరింకేమీ కాదు. దాని కొరకే మనుషులు తమ జీవనపర్యంతం అనేక విధాలైన ఆశలు, ఆకాంక్షలతో పోరాటం చేస్తూ వుంటారు. వాస్తవంగా ఈ లోకంలో పుట్టుకమరణాలు, సుఖదుఃఖాలు ప్రతిమనిషి యొక్క జీవనంలో ప్రకృతి సహజమైన రాత్రిపగలు వలెనే అవిభాజ్యాలై ఉన్నవి. ఇవి రెండూ, ఒకే నాణానికి బొమ్మ-బొరుసు వంటివి. ఒకదానిని విడిచి మరొకటి వుండదు. అలాంటప్పుడు మానవుడు తన జీవితాన్ని ఎంతగా ప్రేమిస్తాడో, దాని మరియొక అంగమే అయిన మరణానికి భయపడకుండా అంతే స్థాయిలో దానిని గౌరవించాలి. ఇదే జ్ఞానియైన మానవునియొక్క మహోన్నత లక్ష్యము, లక్షణము. "నేను మరణాన్ని జయించుతాను" అనేది అసత్యమై యున్నది. ఇలా చెప్పేవారికి పుట్టుకమరణాల మర్మం తెలియదు. మరణాన్ని జయించడం ఈ లోకంలో ఎవ్వరికీ సాధ్యం కాదు. ఎందుకంటే, జడం నందు జీవం శాశ్వతంగా ఉండటానికి వీలులేదు. జీవుడు తాను జన్మించి వచ్చిన మూలస్థానమైన ఆత్మలో మరలా లీనమగుట ప్రకృతి సహజమైన తత్త్వమైయున్నది. సూర్యుడు తూర్పున ఉదయించి పడమరలో అస్తమించినట్లు కనబడుతుంది. అయితే, యదార్థంగా సూర్యుడు ఉదయించడు, అస్తమించడమూ లేదు. అతడు ఉన్నచోటనే వున్నాడు. అయితే, మీ మనసుకు మాత్రం సూర్యుడు ఉదయించి, అస్తమిస్తున్నట్లు భ్రమను కల్పించుకుంటారు. ఇక్కడ మరణమంటే తన నాశనం కాదు. తాను అనే అహంకారయుక్తమైన భ్రమ వలన, తనకు మరణమనిపిస్తుంది. వాస్తవానికి అదేమీ మీకు క్రొత్త కాదు. ప్రతిరోజూ మీరందరూ ఈ సుఖనిద్రలో దైహిక, మానసికమైన కష్టాలను మరచి, శరీరప్రజ్ఞను వదిలి గాఢనిద్రలో సుఖాన్ని అనుభవిస్తున్నారు కదా. ఇటువంటి నిద్ర కోసం కుటుంబాన్ని, ఆస్తులు, అంతస్థులను, సర్వస్వాన్నీ త్యాగం చేస్తున్నారు కదా. అటువంటి నిద్రయే మనిషి అభిలషించే అసలైన సుఖం. వాస్తవంగా లోకంలోని తాపత్రయాలతో కూడిన ఈ జీవితమే మిథ్య.*

*మరణమనేదే సత్యం. ఈ విషయం ప్రతి ఒక్కరికీ కొద్దిపాటి ఆలోచనతోనే అర్థమవుతుంది. ఇటువంటి కఠోర సత్యాన్ని వెల్లడించటానికి ఏ తత్త్వజ్ఞానియూ అవసరం లేదు. ఈ జగత్తులోని జంఝాటాల నుండి నివృత్తిని పొందుట కొరకు ప్రతిరోజూ హాయిగా నిద్రించటానికి అనేక రకాల ప్రయత్నాలు చేసే మనిషి తనకు తానుగా లభ్యమవుతున్న ఈ విధమైన శాశ్వత నిద్రకు భయపడతాడెందుకు? జీవిత అంగమే అయినా, మరణం వచ్చినప్పుడు తడబాటు, కంగారు వలన భయపడితే, అది అతడిని పాతాళానికి గెంటి, నరకయాతనలకు లోనుచేస్తుంది. అలాగాక, స్థబ్దుగా వుంటే, అది స్వర్గానికే వెళుతుంది. మానవుడు తనకు మరణం సమీపించిన సందర్భంలో భయపడక, తాను వచ్చిన త్రోవను పట్టుకొని పైకి వెళుతున్న ప్రాణానికి ఏ విధమైన ప్రతిక్రియను చేయక, నిశ్చలుడైతే, తాను నిజజీవితంలో ఆశించిన ఆనంద సామ్రాజ్య ప్రవేశం లభిస్తుంది. మరణం సంభవించటానికి ముందు మరణ సంకేతాలు ప్రతి ఒక్కరికీ లీలగా గోచరమవుతాయి. అప్పుడే అతడు గాభరాపడుతూ, ఈ జడంపై వున్న వ్యామోహం వలన తనకు ఇప్పటివరకూ లభించిన సుఖమంతా ఈ శరీరం ద్వారానే కలిగిందనే భ్రమ వలన దానిని త్యజించుటకు ఇష్టపడక, బ్రతకాలనే ఆపేక్షతో తన ఊపిరిని బిగపట్టుకొని ఉక్కిరిబిక్కిరి అవుతూంటాడు. అప్పుడు మనసు తాను బ్రతకాలని పోరాడితే, ప్రాణం జడ సంబంధాన్ని త్యజించి, తాను వచ్చిన త్రోవను పట్టుకుని పైకి వెళ్ళటానికి ఆరాటపడుతుంది. అప్పుడే బుద్ధిజీవియైన వారికి ఈ విధమైన మరణోన్ముఖుని ప్రక్కన కూర్చుని, అతని అంతరంగములో తనకు తెలియక నడుచుచున్న పుట్టుక-మరణాలనే నరకయాతనయైన స్థితిని ప్రత్యక్షంగా చూడగలిగితే, ఈ మర్మం తెలుస్తుంది. తన మరణ సందర్భంలో తనను పాపం నుండి పునీతం చేయగలరని నమ్మి, తను జీవితంలో పఠించిన మహామంత్రాలను జపించినప్పటికీ, ఏ ఒక్కటీ మృత్యువును జయించుటకు సహకరించవు. అంతేగాక, అటువంటి మంత్రాలు కూడా జ్ఞప్తికి రావు. జీవితమంతా తాను జపించిన గాయత్రి మహామంత్రాన్ని కూడా ఉచ్చరించటానికి నోరు పడిపోతుంది. దానిని స్మరించే మనసు మృత్యువనే పోరాటంలో పాల్గొంటుంది. అలాగాక, తను జీవించి ఉన్నప్పుడే, సత్కర్మలను ఆచరించి, పూజాపునస్కారాలను నిర్వహించగలిగితే, మరణాన్ని ఆనందంగా ఆహ్వానించగలుగుతారు. ఏ వ్యక్తికి మరణకాలంలో బహిర్గత మనసు అంతర్గత భ్రూమధ్యంలో తదేక చిత్తంతో స్థిరపడుతుందో, అతడు భయభీతి రహితుడై, స్థితప్రజ్ఞుడవుతాడు. అప్పుడు అతడి ప్రాణం లలాటం నుండి ఊర్ధ్వముఖంగా వెళ్ళి, తనను తానే సరళంగా తన మూలస్థానమైన బ్రహ్మానందంలో లీనమవుతాడు.*

*మనిషిలో సహజంగా వున్న సంపూర్ణతత్త్వము యొక్క వ్యక్తీకరణయే విద్య.<br>జ్ఞానం వెలుపల నుండి లభించుటలేదు. అది తన అంతరంగంలోనే వుంది.<br>ప్రపంచం ఇంతవరకూ గ్రహించిన జ్ఞానమంతా, మనసు నుండే ఆవిర్భవించింది.<br>ప్రపంచాన్ని పరిశీలించే అవకాశాన్ని కల్పించేది మాత్రం బాహ్యప్రపంచమే.<br>కానీ, పరిశీలించేది మాత్రం మనస్సే!*

**లోకోత్తరం చరిత మర్పయతి ప్రతిష్ఠాం**<br>**పుంసాం కులం నహి నిమిత్త ముదారతాయాః ।**

*వాతాపి తాపసమునే కలశః ప్రసూతిః*
*లీలాయుతం పునరముద్ర సముద్రపానమ్ ॥*

*మనుష్యుడు కులముచే గాక, లోకోత్తరమగు చరిత్ర వలననే ప్రతిష్ఠను బొందును. ఇందులకు వేరొక కారణముండదు. ఎట్లన, అగస్త్యమహర్షి పుట్టుక కలశములోనైననూ, సముద్రమునంతయూ లీలగా ఒకే గుటకలో త్రాగినవాడు అను ప్రతిష్ఠను పొందెను గదా!*

కొన్ని *హాస్యప్రశ్నలేస్తాను, సమాధానాలివ్వండి.*

1. *రైలు పట్టాలకు, కాలి పట్టాలకు అనుబంధం ఏమిటి?*

**జ: రైలు, పట్టాల మీదుంటుంది. కాళ్ళ మీద, పట్టాలుంటాయి.**

2. *కనలేని స్త్రీమూర్తి ఎవరు?*

**జ: న్యాయస్థానంలో వున్న న్యాయదేవత. కళ్ళకు గంతలు కడ్తారు కదా!**

3. *సోమవారాన్ని 'మండే' అని ఎందుకంటారు?*

**జ: ఆదివారం హాయిగా భోజనం చేసి పడుకుంటారు కదా! సోమవారం ప్రొద్దున్నే పనికి వెళ్ళాలంటే ఒళ్ళు మండుతుంది కదా!**

4. *ఒక పిల్లవాడు ఇంటి నుంచి పారిపోతే, 'కనిపించుట లేదు" అని ప్రకటిస్తారు కదా! దానికి పిల్లవాడి స్పందన ఏమిటి?*

**జ: కని – పెంచుటలేదు.**

5. *ఈ రోజులలో పిల్లలు తల్లిని హెడ్‌కుక్‌గా చూస్తున్నారు. మరి తండ్రినో?*

**జ: ఎ.టి.ఎమ్.లాగా**

6. *సభలో ఆవులిస్తే మీరు ఏం చేస్తారు?*

**జ: పాలిచ్చేవి అయితే సభ అయినాక ఇంటికి తోలుకెళ్తాను.**

7. *మనిషికి ఆనందాన్నిచ్చే సిటీ ఏది?*

**జ: పబ్లిసిటీ.**

8. *తుద+తుద = తుట్టతుద, కడ+కడ = కట్టకడ అవుతుంది కదా, అరటి+అరటి ఏమవుతుంది?*

**జ: అరటీ . అరటీ = ఫుల్‌టీ అవుతుంది.**

9. *క్రికెట్ ప్లేయర్‌కి అవధానానికి సామ్యముందా?*

**జ: వాళ్ళు వరల్డ్‌ప్లేకి వెళ్తారు. వీరు వర్డ్స్‌ప్లేకి వెళ్తారు.**

10. *పురుషులందు పుణ్యపురుషులు వేరయా అన్నాడు వేమన. ఇప్పుడు మీరు ఏమంటారు?*

**జ: పురుషులందు పుణ్యపురుషులు ఏరయా? అంటాను.**

11. *దేవుని గుడికి తాళం వేయరా?*

జ: **దేవుని భజన జరిగే చోట తాళం తప్పనిసరి.**

*12. అద్దం ముందున్న ఆడవారికి, మైకు ముందున్న అమాత్యులకు సామీప్యం ఏమిటి?*

జ: **ఇద్దరికీ సమయం తెలీదు.**

ॐ

**25-01-2021** 10:10 AM

**167) జపం ఎలా చేయాలి స్వామీ?**

*జపం మనస్సులో చేస్తే మంచిది. ప్రేమతో నిండిన మనస్సుతో జపం చేయండి. జపం చేస్తున్నప్పుడు మాలతో గానీ, వ్రేళ్ళతో గానీ లెక్కించకపోతే, నష్టమేమీలేదు. ఇదేం బజారు వస్తువా, ఇంత డబ్బు, ఇంత ఖరీదు అని లెక్కించి చెప్పడానికి? భగవంతుడు చూసేది భావం. ఆయన చూసేది మీ మనస్సులోని ఆవేదన. ఆయన మీద మీకు ప్రేమ కలిగితే, వీటి అవసరమే లేదు. ప్రేమతో భగవన్నామాన్ని ఒక్కసారి జపించినా మనస్సు, హృదయం ఆనందంతో నిండిపోవాలి. భగవంతుడ్ని ఎప్పుడూ మరువవద్దు. సంసారంలో కర్తవ్యాలను నిర్వహిస్తున్నప్పటికీ, మధ్యమధ్యలో భగవంతుని గుర్తు చేసుకోవటం అలవాటు చేసుకోవాలి. చేతులతో పని – నోటితో భగవన్నామం చేయాలి. వేయి పనుల్లో మునిగినప్పటికీ, భగవంతుని స్మరించడం మరచిపోవద్దు. సంసారంలో వుంటూ, శాంతి పొందటానికి ఇదొక్కటే ఉపాయం. ఈ విషయాన్ని మరచిపోతే, సంసారం అల్లకల్లోలం అవుతుంది.*

**168) సాధన ఎంతకాలం చేయాలి స్వామీ?**

*భగవంతుని అనుగ్రహం పొందటానికి ఎంతో సాధన కావాలి. ఈ సాధన ఎంతకాలం కొనసాగాలంటే, రోడ్డు ప్రక్కన పెద్ద వృక్షాలను చూస్తుంటారు. అల్లంత దూరంలో వరిపైరు వుంటుంది. పెద్ద వృక్షాలకు నీరు అందించాల్సిన అవసరం లేదు. వాటి వేళ్ళు విస్తారంగా భూమిలోనికి వ్యాపించి ఉంటాయి నీటిమట్టం వరకూ. కానీ, వరిపైరుకు నీరు అందుతోందో లేదో అని నిత్యం చూడాల్సిందే. తరచూ నీళ్ళు పెట్టాల్సిందే. లేకుంటే వాడిపోతుంది. వాటి వ్రేళ్ళు పైపైన 3, 4 అంగుళాల వరకే దిగి వుంటాయి. కనుక ఈ ఉదాహరణ మాదిరిగానే విశ్వాసం అనే వేర్లు హృదయాంతరాళంలో చేరి, మనసును కదలక మెదలక, అదరక బెదరక, ఎన్ని కష్టాలు ఎదురైనా భరించగల శక్తి, ఓపిక వచ్చేవరకూ ఆధ్యాత్మిక సాధన కొనసాగించాల్సిందే.*

**169) భగవంతునిపై విశ్వాసము ఏ విధముగా ఉండాలి స్వామీ?**

*సామాన్యులైన మీ భక్తివిశ్వాసాలు వరిపైరు మాదిరిగానే వుంటాయి. నిత్యం నీళ్ళు పెట్టినట్లు, నిత్యసాధన లేకుంటే మీ భక్తివిశ్వాసాలు క్షీణించిపోతాయి. భగవదనుగ్రహానికి చేరువకాలేరు. దేవుడు కరుణ చూపలేదని పరితపిస్తారు. నేటి రోజుల్లో మీరు దేవాలయాల్లో ఉన్నా, మనస్సు మాత్రం మార్కెట్లో తిరుగుతుంది. అయినా మనస్సును నిగ్రహించే ప్రయత్నంలో భాగమే, ఆధ్యాత్మిక సాధన. ఆఫీస్*

వర్క్‌లో ఉన్నప్పుడు, కారు నడుపుతూ, పుస్తకం చదువుతూ, విషయాలు గ్రహిస్తున్నప్పుడు, ఏకాగ్రతతో ఉంటే, మరే ఆలోచన రాదు. వేరే ఆలోచనల్లో వుంటే, ప్రమాదాలలో పడతారని అంతరాత్మ బోధిస్తుంది. ఆధ్యాత్మిక సాధనలో కూడా అదే విధంగా ఆలోచించాలి. చిన్న పాత్రను సముద్రంలో ముంచితే కొంచెం నీరే వస్తుంది గానీ, ఎక్కువ జలం కావాలన్నా రాదు. ఆచరణాత్మక ఆధ్యాత్మిక సాధన చేయాలి. జీవితంలో సుఖదుఃఖాలు నాణెమునకు బొమ్మా బొరుసు లాంటివి. ఒకదాని తరువాత మరొకటి వచ్చిపోతూ వుంటాయి. ఏదీ ఎక్కువకాలం వుండదు. ఈ సత్యాన్ని గ్రహించిననాడు, సుఖదుఃఖాల ప్రభావం మీపై వుండదు. భగవంతునిపై ఆధారపడి మీ విధులను మీరు నిర్వర్తించడం అలవరచుకోవాలి. భగవదేచ్ఛానుసారం అన్నీ జరుగుతున్నాయని విశ్వసించగలిగితే, మీకు ఎలాంటి ఆందోళన వుండదు. కానీ, మీ జేబులో మూడు రూపాయలు వుంటే చాలు, ఎవ్వరినీ ఖాతరు చేయరు. జేబు ఖాళీ అవగానే ఏమి చేయాలో తెలియక, భగవంతుని వైపు చూస్తారు. ఇదీ మీ స్వభావం! కానీ, కష్టసుఖాల్లోనూ ఆ భగవంతుడ్నే విశ్వసించిననాడు మీకెన్నటికీ హాని జరగదు. భగవంతుడు ఏమి చేసినా అది మీ మంచికే. వచ్చిన చిక్కేమిటంటే, మీరు దీన్ని అర్థం చేసుకోలేరు. మీకు ఓర్పు కూడా తక్కువే. భగవంతుడు ఏమి చేసినా అది మీ మంచికేనని మీరు విశ్వసించాలి. శాంతి కలగటానికి ఇంతకంటే మంచిమార్గం మరొకటి లేదు. ఈ అవగాహన లేకపోవటం వలననే మీకు మనశ్శాంతి కొరవడుతోంది. శరీరం ఉన్నంత వరకూ సుఖదుఃఖాలు అనివార్యం. మీకు సుఖాన్నిచ్చేది మంచిదని, దుఃఖానిచ్చేది చెడ్డదని తలచటం మీ నైజం. కానీ, భగవంతుని సతతం స్మరిస్తూ, ఆయనపై పూర్తిగా ఆధారపడగలిగితే, ఎలాంటి పరిస్థితులనైనా అధిగమించవచ్చు. ఈ లోకంలో భగవదనుగ్రహాన్ని మించినది మరొకటి లేదు. ఈ విషయాన్ని ఎంత త్వరగా తెలుసుకోగలిగితే, అంత శాంతిగా జీవించవచ్చు.

నేను చెప్పే మూడు ముఖ్య విషయాలు:

1. నాలుక, కోపం, కోరిక – ఈ మూడింటినీ అదుపులో ఉంచుకోవాలి.
2. గురువు, తల్లిదండ్రులు, దైవం – ఈ ముగ్గురినీ గౌరవించాలి.
3. పవిత్రత, నిజాయితీ, కఠోరశ్రమ – ఈ మూడింటినీ అలవర్చుకోవాలి.
4. సోమరితనం, అబద్ధం, పరనింద – ఈ మూడింటినీ విడిచిపెట్టాలి.
5. ధైర్యం, కీర్తి, ప్రశాంతత – ఈ మూడింటి కోసం పాటుపడాలి.
6. వాగ్దానం, స్నేహం, వాత్సల్యం – ఈ మూడింటినీ నిలబెట్టుకోవాలి.
7. మాట, నడవడిక, పని – ఈ మూడింటినీ నిరంతరం నేర్చుకోవాలి.
8. సత్ప్రవర్తన, దానగుణం, సేవ – ఈ మూడింటినీ పెంచుకోవాలి.
9. ఈర్ష్య, అహంకారం, ద్వేషం – ఈ మూడింటినీ లేకుండా చూసుకోవాలి.

**సులభాః పురుషా రాజః సతతం ప్రీతివాదినం ।**
**అప్రియస్య చ పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః ॥**

ప్రియమగు పలుకులు పలుకువారలు కోకొల్లలుగా దొరుకుదురు.
కానీ, అప్రియమైననూ, మన హితముగోరి, పథ్యమగు మాటలు చెప్పువారు,
చెప్పిననూ వినువారలు లభించుట లోకమున అరుదు.

***ఎలా చచ్చావన్నది కాదు, ఎలా బ్రతికావన్నది ముఖ్యం***
***ఛస్తే ఖచ్చితంగా నలుగురే మోస్తారు***
***బ్రతకడంలో తేడా వస్తే, ఊరంతా ఊస్తారు***
***భుక్తి కోసం వేట, వేటతోపాటు***
***పాటులో శ్రమ, శ్రమలో విశ్రాంతి***
***విశ్రాంతిలో కోర్కెలు***
***తీరితే ఆనందం, తీరకపోతే దుఃఖం***
***ఇంతే ఈ జీవితం***
***ఊహించని మలుపులు, ఊపిరాడని కష్టాలు***
***కొన్ని తీపి అనుభవాలు, కొన్ని చేదు అనుభూతులు***
***ఆశించినవి అందకపోవటం, అందని దాన్ని ఆరాధించడం***
***ఆనందాన్ని మీలోనే వెదుక్కోండి***
***అప్పడే అది ఎల్లప్పుడూ నీలోనే వుంటుంది***
***సద్గురు బోధల సారాన్ని తీసుకోండి***
***ఆంజనేయుని అండతో, సద్గురువు బోధలతో జీవించండి***
***స్వర్గం అంటే ఇదే, మరేంటో కాదు!***
***ఎప్పుడూ సంతోషంగా వుండే వారి మనసే***
***మారుతి మాటలుగా గ్రహించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**26-01-2021** 10:10 AM

**170) భగవంతుని ఏ విధముగా ఆరాధించవచ్చును స్వామీ?**

*భగవంతుని గురించి ధ్యానిస్తూ వుండటం అంటే, ఆయన లీలల్ని గురించి ఆలోచిస్తూ ఆనందాన్ని పొందటం, ఆయన కథలు విని అంతరార్థాన్ని మననం చేసుకోవటమే భక్తి. దానినే శ్రవణభక్తి అంటారు. విగ్రహాలను పూజించినంత మాత్రాన విగ్రహారాధన కాదు. తనకంటే భిన్నంగా దేవుడనేవాడు ఒకడు ఉన్నాడని తలంపు వచ్చినా అదీ విగ్రహారాధనే. ఆధ్యాత్మికత అంటే మనిషికి బ్రతకటం నేర్పేది. కొందరు దైవారాధనకు తీరిక లేదని, ఓపిక లేదని అంటారు. అది ఒక ప్రత్యేకమైన పనిగా కాకుండా, తమ*

దైనందిన పనులు చేస్తూనే ఆరాధించవచ్చు, అనుగ్రహాన్ని పొందవచ్చు. నవవిధ భక్తిమార్గాల్లో ఎవరికి ఇష్టమైన మార్గాన్ని వారు ఆచరించినా భగవంతుడు ఆదరిస్తాడు. కొందరు తమ వృత్తిని కొనసాగిస్తూనే, నామస్మరణ చేసేవారున్నారు. ఏ రీతిగానైతేనేమి, భక్తుడు ఆయనను నిరంతరం ధ్యానిస్తూ ఉంటాడో, భగవంతుడు కూడా ఆ భక్తుడిని కనిపెట్టుకునే వుంటాడు. సకల ప్రాణుల్లో అవ్యయుడిగా, ఎల్లకాలాల్లో ఆ పరమతేజస్వి, ఓజస్వి వున్నాడు. 'నవ' అంటే తొమ్మిది రంధ్రాలు గల మానవశరీరం. 'షట్' అంటే ఆరు – (దివ్యదృష్టి, దివ్యశ్రోత్రం, పూర్వనివాసానుస్మృతి, పరేంగిత జ్ఞానం, అప్రత్యక్ష విషయజ్ఞానం, వియద్గమనానుగమన వ్యూహాది లక్షణమైన బుద్ధి) ఆరు శక్తులుగల ఆత్మస్వరూపిణిగా వుంటాయి.

## 171) శరీరాన్ని ఏ విధంగా సార్థకం చేసుకోవాలి స్వామీ?

కొందరు తమ శరీరాలను పరోపకారార్థం త్యజిస్తారు. తాము మరణించినప్పటికీ, కీర్తి అనే కాయం (శరీరం) తో లోకంలో చిరకాలం ఉండిపోతారు. కలకాలం బ్రతికి వున్నట్లుగానే వీళ్ళు ప్రజల మనస్సుల్లో నిలిచిపోతారు. లోకంలో మన్ననలు పొందుతూనే వుంటారు. అందుచేతనే వీళ్ళని కీర్తికాయులని అంటారు. శరీరం నశించక ముందే మంచిపనులు చేస్తే, ఆ కీర్తి యుగయుగాలుగా లోకంలో నిలిచిపోతుంది. శరీరం సార్థకం చెందుతుంది. పూజలు, పుణ్యకార్యాలు, వ్రతాలు, క్రతువులు, యజ్ఞయాగాదులు ఇలా ప్రజోపయోగమైన ఏ ధార్మిక కార్యాన్ని ఆచరించాలన్నా కావలసిన ముఖ్య సాధనం శరీరమే. కనులారా భగవంతుడ్ని చూడాలన్నా, నోరారా నారాయణ నామాన్ని నుడవాలన్నా, చేతులారా శివుని పూజించాలన్నా కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలతో కూడిన శరీరం అవసరమవుతుంది. శరీరం నీటిబుడగలా క్షణికమైనదని మీ అందరికీ తెలుసును. ఈ శరీరం నశించి జీవితం ఎప్పుడు ముగిసిపోతుందో ఎవ్వరికీ తెలియదు. శరీరం నశించకుండా ఉన్నప్పుడే మంచిపనులు చేసి, కీర్తి సంపాదించాలి. పరహితార్థమైన పనులు చేయాలంటే, ఆ వ్యక్తి ఆధ్యాత్మికపరుడై, ధనవంతుడై వుండాలి. మీ శరీరం ముఖ్యంగా మూడు రకాలైన పనులు చేస్తుంది. భౌతికపరంగా ఆలోచిస్తే, శరీరంతో మానవుడు కొన్ని సుఖాలు అనుభవించగలడని తెలుస్తుంది. జీవితంలోని మాధుర్యాన్ని అనుభవించాలన్నా, ప్రకృతిలోగల సౌందర్యాన్ని ఆస్వాదించాలన్నా, భోగభాగ్యాల్ని రుచి చూడాలన్నా శరీరం ఉండాలి. ఇలా రసమయ జగత్తులో మునిగితేలడమే శరీరం చేసే ముఖ్యకార్యమా? శరీరానికి ఇదే పరమావధా? అని అన్నట్లయితే, కానేకాదు. ఇంతకు మించిన పారమార్థికమైన ప్రయోజనం గల మరొక కార్యముంది. అదే ధనార్జన ద్వారా ధర్మసాధన. ఇలా శరీరం చేసే, ఈ రెండో రకమైన పనులు కూడా ముఖ్యమైనవే. సృష్టిలో ఏ ప్రాణికీ లేని విశేషగుణాల్ని భగవంతుడు మానవునకు ఇచ్చాడు. ఉత్తమగుణాలతోపాటు జ్ఞానాన్ని ప్రసాదించాడు. ధర్మకార్యాచరణకు అనుకూలమైన శరీరాన్ని ఇచ్చాడు. అందుకు మీరు భగవంతునికి కృతజ్ఞులై వుండాలి. అందుకోసం మీరు ఏమి చేయాలి? మానవాళిని, ప్రాణి సముదాయాన్ని ప్రేమించాలి, సేవించాలి. వాళ్ళకు కల్గిన కష్టాల్ని దూరం చేయాలి. అప్పుడే భగవంతుడు మీకు ఇచ్చిన శరీరానికి, అతనికి కృతజ్ఞత తెలుపుకున్నట్లు అవుతుంది. ఈ విధంగా భగవంతుని కృపకు పాత్రులు కాగలుగుతారు. అతడిచ్చిన ఈ శరీరంతో పరోపకార కార్యాలు చేస్తూ చేస్తూ అతనికి చేరువ కాగలుగుతారు. ధర్మకార్యాలతోపాటు లౌకికమైన కార్యాలు కూడా చేస్తూ, మానవశరీరం తనను తాను సార్థకం

చేసుకుంటుంది. భర్తతోపాటు అనుకూలంగా వుంటూ ప్రియురాలిగా తన శరీరాన్ని అతనికి అర్పిస్తుంది భార్యామణి. తర్వాత ఆ ఇల్లాలు తల్లిగా మారుతుంది. తన బిడ్డల్ని సాకటానికి, వాళ్ళని పెంచిపెద్ద చేయటానికి ఆ మాతృమూర్తి తన శరీరాన్ని కర్పూరంలా కరిగించుకుంటుంది. తన సంతానాన్ని సత్‌పౌరులుగా తీర్చిదిద్ది, ఆదర్శపౌరులుగా మార్చి, ఆదర్శమహిళగా లోకంలో ప్రసిద్ధి పొందుతుంది. ఆ విధంగా మహిళ శరీరం సార్ధకత పొందుతుంది. కొంతమంది వ్యక్తులు తమ దాతృత్వంతో లోకంలో కీర్తిగాంచారు. కర్ణుడు మహాదాత. ఈతడు తన శరీరంలోంచి కవచకుండలాల్ని కోసి, వాటిని కోరిన ఇంద్రునికి దానమిచ్చాడు. ఇలాంటి మహాదాతల్ని గురించి మీరు పురాణాల్లో చదువుతారు. శిబి చక్రవర్తి డేగ ఆకల్ని తీర్చటానికి తన శరీరంలోని మాంసాన్ని కోసి, ఆ పక్షికి ఇచ్చి, కీర్తికాయుడయ్యాడు. దధీచి అనే మహర్షి, తన వెన్నెముకనే ఇంద్రునికి ఆయుధంగా ఇచ్చాడు. మహాదాతగా లోకప్రసిద్ధి చెందాడు. వీళ్ళంతా ఖ్యాతి గాంచారు. అంటే, అందుకు వాళ్ళ శరీరాలే కారణం. దేశరక్షణ అనే పవిత్ర క్రతువులో తమ శరీరాలను ఆహుతి చేసినందువల్లనే వీరజవాన్లుగా చరిత్ర ప్రసిద్ధులు కాగలిగారు. శరీరానికి వున్న ఈ సంజీవనీ శక్తిని గమనించి, దానిని మంచిపనులకు వినియోగించి సార్ధకపరచుకోండి.

**తెలియని మనుజుని సుఖముగ**
**తెలుపందగు, సుఖతరముగ దెలుపగ వచ్చున్**
**దెలిసిన వానిం, దెలిపియు**
**దెలియని నరుదెల్ప బ్రహ్మదేవుని వశమే**

తెలియని వారికి సులభంగా తెలియచేయవచ్చు. తెలిసినవారికి ఇంకా సులభంగా తెలియచేయవచ్చు. కానీ, తెలిసింది కొంచమే అయినా, సర్వజ్ఞుడనని భావించే వ్యక్తిని బ్రహ్మదేవుడు కూడా రంజింపచేయజాలడు.

అరచేతిలో ప్రపంచం, అందనంత దూరంలో మానవత్వం, ప్రేమతత్త్వం. మానవత్వం నుంచి యాంత్రికత్వం లోనికి, వాస్తవికత్వం నుంచి అవాస్తవికత్వం లోనికి, సమూహం నుండి ఒంటరితనంలోకి, మైదానం నుండి ఇరుకు గదుల్లోకి, మట్టిమనిషి మరమనిషిగా మారిపోతున్నాడు. ప్రమాదం పొంచి వుంది.
తస్మాత్ జాగ్రత! తస్మాత్ జాగ్రత!

**ధనరాసులును కావు, ధాన్యరాసులు గావు**
**ధార్మిక చింతనే ధనమటంచు**
**మనసును అదుపు చేసి, మమకారమును గోసి**
**తత్త్వార్థ మెరుగుటే ధనమటంచు**
**చక్రవర్తి పదవి సాధించుటయు గాదు**
**దైవత్వమున నుండ ధనమటంచు**
**వాంఛలణచి తీవ్ర వైరాగ్యమును మించి**
**తనను తాను ఎరుగుటయే ధనమటంచు**

***వాదభేదము లేని సుబోధనెరగు***
***మోదమందుచుండు మోక్షమెందుగలదో***
***తెలిపె సద్గురువు బోధలు***
***ఈ కలిమి పెంచె దాసదాసుడు ఆంజనేయుడు***
***శ్రీరఘురామ దాసునెంచె***
***అట్టి రఘురామునికి ఈ ఆంజనేయుడు నమస్కరించి***
***రామా! ఈ నా చిన్నబిడ్డలకు ఉన్న ఆధ్యాత్మికస్థితిని పెంచి***
***జ్ఞానం దృఢపరచి పూర్ణస్థితి కలుగు***
***జ్ఞానమందించి ఆశీర్వదించి***
***ఆహ్లాదాన్ని అందించండి ఈ అంజనీతనయులైన***
***నా ఈ చిన్నారి ముద్దుబిడ్డలకు.***

ॐ

**27-01-2021** 10:10 AM

**172) ఆత్మస్థితి అంటే ఏమిటి స్వామీ?**

*వాస్తవానికి ఆత్మ వేరు, ఆత్మస్థితి వేరు. ఆత్మను కూడా వదిలివేయ గలిగితేనే స్థితి అనుభవంలోకి వస్తుంది. ఆత్మ, అనాత్మలు రెండూ ద్వంద్వాలు. ద్వంద్వాలపట్ల స్పృహ ఉన్నంత వరకూ స్థితి కలగదు. వానిని వదిలివేయ గలిగితేనే స్థితి అనుభవించగలుగుతారు. ఆత్మస్థితి అనేది శూన్య స్థితి, భావాతీత స్థితి, ఆలోచనారహిత స్థితి, నిరహంకార స్థితి, పరబ్రహ్మ స్థితి. అది కేవలం స్థితి మాత్రమే. అక్కడ వర్ణనలు, వివరణలు, అంచనాలు, ఆశించడాలు వంటివి వుండవు. ఆత్మ అనేది కంటికి కనిపించేది, రుచి చూసేది, వాసన చూసేది, స్పృశించేది, దహించేది, విభజించేది, తడిపేది కాదు. దానికి రూపం, ఆకారం, గుణం వంటివి వుండవు. ఉంటే, అది ఆత్మ కానేకాదు. అది సత్యం, సనాతనం, స్థిరం, శాశ్వితం, స్వచ్ఛం మరియు సర్వవ్యాపకం. వేదాంతపరంగా పరబ్రహ్మ, పరమాత్మ, విశ్వాత్మ, శుద్ధచైతన్యం మరియు భగవంతుడు అంటారు. కనిపించే భౌతిక జగత్తుకు విశ్వమంతటికీ ఆధారం భగవంతుడే. భగవంతుని నుండే ఈ చరాచర జగత్తు ఆవిర్భవించి, తిరిగి భగవంతుడనే స్థితిలోనికే లయం చెందుతుంది. ఒక సాలెపురుగు తన లాలాజలం ద్వారా ఏ విధంగానైతే గూడును నిర్మించి, తిరిగి దానిని తనలోనికి స్వీకరిస్తుందో, అలాగే భగవంతుని నుండి ఆవిర్భవించిన భౌతిక జగత్తు కూడా తిరిగి భగవంతుని లోనికే లయం చెందుతుంది. విశ్వంలో దేనికైనా ఆకారముంది గానీ, భగవంతునికే ఏ ఆకారమూ ఉండదు. అటువంటి భగవంతుని స్థితి నుండి ఆవిర్భవించిన స్థూల ప్రపంచమంతా అధేయమవుతుంది. అయితే, అనుభవించడానికి, తెలుసుకోవడానికి ఎంతో వ్యత్యాసముంటుంది. వాస్తవానికి అనుభవంలోనికి పొందటానికి ఒక జీవితకాలం సరిపోదు. తెలుసుకోవడమనేది అతి సులభమే. అందుకే తెలుసుకునేవారు*

పెరుగుతున్నారు, అనుభవించేవారు తగ్గిపోతున్నారు. ప్రస్తుతం ఆధ్యాత్మిక మార్గమంతా బోధనలకే పరిమితమై, టన్నులకొద్దీ సమాచారం అందించబడుతోంది తప్ప, మానవాళిలో మాత్రం మార్పు రావడంలేదు. అందుకే ఇటీవలి కాలంలో కొందరు దశాబ్దాల తరబడి సాధనలో ఉన్నప్పటికీ, పరిణతి చెందకపోగా, ఇంకా బలహీనమై, ఆ మార్గానికే కళంకం తెస్తున్నారు. ఎవరైతే ఆత్మస్థితికి చేరతారో వారికి శరీరమే లేదు అనే భావన కలుగుతుంది. శరీరం పూర్తిగా కరిగిపోతుంది. విశ్వవ్యాపిత భావం కలుగుతుంది. మనోనేత్రంతో విశ్వమంతటినీ దర్శించగలుగుతారు. సృష్టికి ప్రతిసృష్టిని చేయగలుగుతారు. మానవాతీత అతీంద్రియ శక్తులను ప్రదర్శించగలుగుతారు. వారికి ఇక తెలుసుకోవలసింది, చేయవలసింది, సాధించవలసింది, అన్వేషించవలసింది, సరిచేయవలసింది ఏమీ వుండదు. అందుకే వారిని సర్వజ్ఞులు, పరిపూర్ణులు, త్రికాలజ్ఞులు అంటారు. విశ్వాన్నంతటినీ సాక్షీభూతంగా చూడగలుగుతారు. వారు ఇక ఎటువంటి సాధనలూ చెయ్యరు. చెయ్యవలసిన అవసరమే వుండదు.

**173) అయితే వారు ఆత్మస్థితిలోనే జీవితాంతం ఏమీ చేయకుండా స్థబ్ధతగా, జడంగా వుండాలా స్వామీ?**

పొరపాటున కూడా అలా వుండకూడదు. ఉండటం సాధ్యం కాదు. ఎందుకంటే, ఆత్మస్థితికి, గాఢ సుషుప్తికీ అతిసన్నిహిత సంబంధముంటుంది. ఆత్మస్థితి పూర్తి చైతన్యవంతమైనది. గాఢ సుషుప్తి పూర్తి నిద్రావస్థ, అచేతనస్థితి. చైతన్యం-అచేతనలు రెండూ బాహ్యంగా ఒకే రకంగా కన్పిస్తాయి. అందువలన, చైతన్యం ఎల్లప్పుడూ స్థిరంగా వుండదు. అప్పుడప్పుడు అచేతనంగా మారుతుంది. అట్టి స్థితిలో శరీరమంతా మొద్దుబారిపోతుంది. మెదడు స్తంభించిపోతుంది. నాడీకణాలన్నీ బలహీనపడతాయి. అందువలన ఏకథాటిగా గంటల తరబడి, రోజుల తరబడి ఆత్మస్థితిలో వుండేటట్లయితే శరీరం శుష్కించి, జీవనచర్యలు మందగించి, దీర్ఘకాలిక రుగ్మతలు సంభవించే అవకాశముంది. సాధనలోకి ప్రవేశించిన తర్వాత చాలామందికి రుగ్మతలు సంభవించటానికి మూలకారణం కఠోర సాధనే. ఎక్కువసేపు కదలకుండా స్థబ్ధతగా వుండటం వలన, మలమూత్రాలు బయటకు వెళ్ళవు. కాబట్టి, రక్తం విషపూరితమవుతుంది. వాస్తవానికి సాధన ఎవరికైనా కాఠిన్యంగా ఉందంటే, అది పూర్తిగా అజ్ఞానపు, అపరిపక్వపు స్థితే. ఆశించి కొనసాగించడమే అతి ప్రమాదకరం. "నా ప్రస్తుతస్థితి సరిగ్గా లేదు, నాకింకా ఏదో కావాలి, నాకు మోక్షం కావాలి, సంపూర్ణ స్వేచ్ఛను పొందాలి" అనే భావన ఉందంటే, బంధాలలో ఇరుక్కున్నట్లే కదా! మోక్షం కోసం ఆరాటపడటంలోనే అసంతృప్తి దాగివుంది. అసంతృప్తి ఎక్కువగా వుండి, సాధనలో కూర్చుంటే, అది ఇంకా పెరిగి, బయటకు వచ్చిన తర్వాత, ఆ స్థితి అలాగే కొనసాగుతుంది. శరీరాన్ని శుచిగా, శుభ్రంగా, పవిత్రంగా, ఆరోగ్యంగా వుంచి క్రమం తప్పకుండా పోషించాలి తప్ప, దానిని శుష్కింపచేయకూడదు. సమయానుకూలంగా దానికి అవసరమైనవి అందించాలి. వాహనం సరిగ్గా లేకపోతే జీవనయానం దెబ్బ తింటుంది, కుంటుపడుతుంది. భగవంతుని కోసం బయట అన్వేషణ గావించే ద్వైత, విశిష్టాద్వైతాలలో జీవించేవారంతా శారీరకంగా బలహీనపడతారు. ప్రస్తుతం ద్వైత, విశిష్టాద్వైతాలే ఆధిక్యతను సంతరించుకున్నాయి తప్ప అద్వైతమనేది అతి స్వల్పంగా వుంది. అద్వైతులు కూడా "ప్రపంచం సరిగ్గా వుంది, అంతా భగవంతుని మయమే, నేను ఏమీ చేయవలసింది లేదు" అనే

భావనతో జడత్వాన్ని పెంచుకుంటున్నారు. "ఊరుకుంటి తెలియ ఉత్తమయోగంబు" అన్నట్లు, ఎక్కువమంది ఆశ్రమాలకే పరిమితమై ప్రజాసంబంధాలకు దూరంగా ఉంటున్నారు. మరికొందరు పరిణతి చెందకుండానే ప్రపంచంలోనికి ప్రవేశించి కలుషితాన్ని స్వీకరించి, రుగ్మతల పాలవుతున్నారు. ఇటువంటివన్నీ చాలా సున్నితమైన విషయాలు. సద్గురుబోధలను అనుసరించకపోతే, అతి ప్రమాదకరం.

**దృష్ట్వా ధనం కులం శీలం రూపం విద్యాం బలం వయ ।**
**కన్యాం దద్యాదుత్తమంచే నైత్రీం కుర్యాదధాత్మనః ॥**

వరుని సంపద, వంశమర్యాద, గుణం, రూపం, విద్య, బలం, వయస్సు ఇవ్వన్నీ పరిశీలించి, సమ్మతమైనచో కన్యనీయవలెను. ఆ తరువాత వారి కుటుంబంతో జీవితపర్యంతం మైత్రీభావంతో మెలగవలెను.

పశ్చాత్తాపం ఉపరితలం నుండి గాక,
నిండు హృదయంలో నుండి వచ్చినప్పుడే మీలో మంచి మార్పు వచ్చినట్లు!

***నా జీవితమే మీకాదర్శనం, నా బాటే మీ గమ్యం***
***నా మాటే కావాలి మీకది వేదం***
***అలా జాతి మనుగడ కొనసాగించాలంటే,***
***భావితరాలు మారాలంటే, అవినీతి అంతమవ్వాలంటే,***
***నిజాయితీని నిలపాలంటే, సుఖశాంతులు సాగాలంటే,***
***కర్తవ్యం కదం తొక్కాలంటే, ప్రగతిబాటలో పయనించాలంటే,***
***మీలోని అరాచకాలు ఆగాలి, దురాగతాలు దూరమవ్వాలి***
***మానవత్వం మంటకలవకూడదు, సోదరభావం సన్నగిల్లకూడదు***
***ఈ ఆంజనేయుని కలలు కల్లకాకూడదు***
***కానుకగా అందించండి మీ కాఠిన్యాన్ని***
***కరకుదనాన్ని, కాఠిన్యాన్ని స్వీకరించి***
***కరుణను నింపిన పాత్రను ఈ పవనకుమారుడు అందించేను***
***అభిలాషపూర్వకంగా అందుకోండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**28-01-2021** 10:10 AM

**174) స్వామీ! ఎంతో కాలంగా సాధన చేస్తున్నా, పూర్ణత్వాన్ని సాధించలేకపోవుటకు కారణం ఏమిటి?**

జన్మజన్మలుగా నిల్వ ఉన్న సంచిత ప్రారబ్ధకర్మలు ఈ జన్మలో పరిసరాల ద్వారా ప్రవేశించే

వాసనాబీజాలు, శరీరాన్ని కలుషితం చేస్తాయి. ఆ విధంగా అంతరంగంలోకి ప్రవేశించిన కలుషితాన్ని ఎప్పటికప్పుడు బహిష్కరించకపోతే, శరీర అవయవాలు దెబ్బతిని, రుగ్మతలుగా రూపాంతరం చెందే ప్రమాదముంది. బయటనే భగవంతుడున్నాడనే భావనగానీ, విగ్రహాలకు, వ్యక్తులకు పరిమితమనే భావనగానీ అతి ప్రమాదకరం. నేను సాధన చెయ్యాలి అనే పదంలోనే అసంతృప్తి దాగివుంది. సాధించవలసింది ఏదో వుంది అనే భావన ఉందంటే, మనిషిని అసంతృప్తికి గురి చేస్తుంది. అందుకే కొందరు వివాహం కూడా మానుకొని కఠోర బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ, ఏకాంత ప్రదేశాలను ఎన్నుకొని దశాబ్దాల తరబడి సాధన చేస్తూ కూడా ఇంకా పరిణతి చెందలేకపోతున్నామని చెబుతారు. అయితే, అందుకు మార్గమేమిటి? ద్వైతం, విశిష్టద్వైతం, అద్వైతాలను మూడింటినీ కలిపి అనుభవించగలగాలి. జీవితాన్ని సాధనగా మలచుకోవాలి. నిరంతరం ఏదో ఒక కర్మను చేస్తూనే వుండాలి. శరీరాన్ని కర్మలో నిమగ్నం చేయించాలి. వాస్తవానికి శారీరక శ్రమను మించిన సాధన లేదు. శ్రమించడం ద్వారా ఖర్చయ్యే శక్తిని ఆహారం, ధ్యానాల ద్వారా భర్తీ చేసుకుంటూ వుండాలి. క్రమం తప్పకుండా కాలకృత్యాలు తీర్చుకుంటూ, అవసరమైనప్పుడు విశ్రాంతి పొందుతూ, దేహాన్ని దేవాలయంగా భావించగలగాలి. "నేను ఏమీ కాను" అనే భావన నుండి కర్మలను ఆచరించాలి. చేస్తున్న కర్మల ద్వారా ఎటువంటి ప్రతిఫలాన్ని ఆశించకూడదు. "నేనే విశ్వం, విశ్వమే నేను" అనే భావం ద్వారా కర్మలు జరుగుతున్నాయనుకోవాలి. చేయడం, చేయబడటం, చేసే వ్యక్తి, పనియొక్క ఫలితం, సర్వం భగవంతునిమయంగా భావించాలి. కర్మ జరుగుతుంది గానీ, అక్కడ కర్త లేదు. కాబట్టి, కర్మఫలమెవరికి చెందుతుంది? వాస్తవానికి కర్మఫలం కూడా భగవంతుడే కదా! కర్మలు తప్పక జరగాలి. లేకుంటే, శరీరంలో జీవనచర్యలు మందగిస్తాయి. సాధన అనేది సునాయాసంగా, సరళంగా వుండాలి తప్ప, కఠోరం, కాఠిన్యమనే అంశాలకు అవకాశమే ఉండకూడదు. శారీరక అవసరాలు తీరుతుంటేనే శరీరం ఆరోగ్యంగా వుంటుంది. దీని కోసమై అందరికీ, అన్నింటికీ దూరంగా ఉండవలసిన అవసరమేముంటుంది? ప్రపంచంలో కనిపించే దోపిడీలు, దొంగతనాలు, హత్యలు, నేరాలు, హింసాత్మక ఘటనలన్నీ పరిణామంలో ఒక భాగమే తప్ప, వానిని చూసి భయపడకూడదు, కలత చెందకూడదు, వ్యతిరేకించకూడదు. మంచీచెడులు రెండూ భగవంతుని నుండి ఆవిర్భవించినవే. తిరిగి మరలా భగవంతునిలోనే ఐక్యం చెందుతాయి. ఏకత్వమే సత్యం. అందుకు భిన్నంగా కన్పించేదంతా మాయయే. మరింకేమీ కాదు. అందుకు పరిపూర్ణ జ్ఞానం అత్యంతావశ్యకం. పూర్ణజ్ఞాని నిండుకుండలా వుంటాడు. శరీరానికి అతీతంగా వుండి, దానిని తన దైనందిన కార్యక్రమాలకు పరికరంగా ఉపయోగించుకుంటాడు. శరీరం, అందలి జీవనచర్యలు, పుట్టుకమరణాలు, జీవితం సైతం మాయ అయినప్పుడు, ఇక సరిచేయవలసింది, మార్చవలసింది, సాధించవలసింది ఏముంటుంది? శరీరంలో సంభవించే ప్రతి మార్పు, మనసులో ఉత్పన్నమయ్యే ప్రతి భావనను భగవంతునిలో ఒక భాగంగా భావించి సంపూర్ణంగా అంగీకరించగలిగితే, ఇక జీవితమే సాధన అవుతుంది. వాస్తవానికి పుట్టుకమరణాలు కూడా మాయే. విశ్వమంతా ఏకకాలంలో భస్మీపటలమైనా, మీకు మరణముండదు. మారేది, మార్పులకు గురయ్యేది, మాయకు ప్రతిరూపమైన భౌతిక జగత్తు మాత్రమే. కనుక, దానికి అతిగా ప్రాధాన్యతను

ఇవ్వవలసిన అవసరం లేదు. జ్ఞానం, గురువు, భగవంతుడు సైతం మాయే. మీరు స్వీకరించే సమాచారమంతా భౌతిక జగత్తుకు సంబంధించిన మిథ్యాజ్ఞానమే. ఆత్మస్థితికి చేరిన తర్వాత అంతా భ్రమగానే గోచరిస్తుంది. అయితే, అట్టి స్థితిని జీవితాంతం కొనసాగించకూడదు. ఎందుకంటే, చైతన్యవంతంగా జీవించగలిగితేనే, శరీరం, మనస్సు ఆరోగ్యంగా, ఉల్లాసంగా, ఉత్తేజంగా వుంటాయి. శూన్యస్థితి నుండి కర్మలను ఆచరించడం వలన, వాని ప్రభావం జీవితంపై వుండదు. విశిష్ఠమైన ఆధ్యాత్మిక సేవలను అందించడం ద్వారా సమాజానికి అద్భుతమైన ప్రయోజనం కలుగుతుంది. కాబట్టి, ఆత్మస్థితిలోనే స్థబ్దతగా వుండక, విశిష్ఠమైన ఆధ్యాత్మిక సేవలను అందిస్తూ, జీవితాన్ని సార్ధకం చేసుకోవాలని ఆశిస్తూ, సద్గురురూపంలో వేంచేసిన ఈ ఆంజనేయుడు ఆశీర్వదిస్తున్నాడు, ఆకాంక్షిస్తున్నాడు.

*మానవ సంబంధాల్లో తరచూ జరిగే పొరపాటు,*
*ఎదుటివారు చెప్పేది వినటం, అందులో సగం అర్థం చేసుకోవడం.*
*అసలేమీ ఆలోచించకుండా పదిరెట్లు ప్రతిస్పందించడం.*

**పాపం కృత్వాహి మన్యేత వాహమస్మీతి పూరుషః ।**
**తం తుదేవాహః ప్రపశ్యంతి స్వపైవాః తర పూరుషః ॥**

ఎవరు పాపకార్యములను చేసి కూడా “నేను పాపిని కాను” అని తలుస్తాడో, వాడు భ్రమపడినవాడే. ఎందుకంటే, అతడు చేస్తున్న పాపాలను దేవతలు, అతడి అంతరాత్మ చూస్తూనే వున్నారు కదా!

***నేటికి పునాది నిన్న, రేపటికి నాంది నేడు***
***నిన్న, నేడు ప్రోది రేపు***
***నిన్న, నేడు, రేపటి కలయిక జీవితహారం***
***నిజం తెలియని జీవితం, తెగిన పూలహారం***
***నిన్న వున్న మనిషి, రేపటికేమౌతాడో తెలియదు***
***నేడు మీరు చూస్తున్న నిజం రేపటికి అబద్ధంగా మారవచ్చు***
***నిన్న బ్రతుకు పోరాటం***
***నేడది తీరని ఆరాటంగా మారి, రేపు మనిషినే దహిస్తుంది***
***నిన్న, నేడు, రేపు కలయికతో జీవనయానం సాగిస్తాడు మనిషి***
***అంగరంగ ప్రబోధం ఆచరణకు ఆమోదం కావాలి***
***అంతరంగశక్తి అనుభవించేది ముక్తి కావాలి***
***అంతరంగబోధ ఆంజనేయుని బోధ***
***అది గ్రహించాలి మీ మేధ***
***దానితో అంతరంగశుద్ధి జరిగి, ప్రకాశించాలి మీ బుద్ధి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**03-02-2021** 10:10 AM

**175) జీవితాన్ని ఏ విధంగా సార్ధకం చేసుకోవాలి స్వామీ?**

*జన్మలన్నింటిలో మానవజన్మ లభించడం ఎంతో దుర్లభం. అది పూర్వజన్మ పుణ్యఫలంవల్ల లభిస్తుంది. ఆ విధంగా లభించిన మానవజన్మను ఎంతో ప్రయత్నించి సార్ధకం చేసుకోవాలి. ఎందుచేతనంటే, మానవజీవితం ఎంతో విలువైనది. కాలం విలువైనది. ఈ లోకంలో అన్నిటికన్నా విలువైనది కాలం. ఎటువంటి వస్తువునైనా కొనగలరు గానీ, కాలాన్ని మాత్రం కొనలేరు. మేథావులు, విజ్ఞాన శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు ఎన్నో విషయాలను కనుగొన్నారు గానీ, గడిచిన కాలాన్ని తిరిగి పొందగల మార్గం కనుగొనలేకపోయారు. మహర్షులు, తపస్సంపన్నులు కూడా ఈ విషయంలో ఏమీ చేయలేకపోయారు. మానవుడు జన్మించింది మొదలు కాలం చేత గ్రహించబడుతున్నాడు. గడిచిన ప్రతిక్షణం వాని ఆయువులో క్షణకాలం వంతున గడిచిపోయినట్లే, గతించినట్లే. ఆ విధంగా గడిచిన రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు మానవుని ఆయువుని క్షీణింపచేస్తున్నాయి. సూర్యోదయం అయిందంటే, మానవుని ఆయువులో ఒకరోజు తగ్గిపోయినట్లే. జన్మదిన వేడుకలు ఎంతో ఉత్సాహంగా, ఘనంగా జరుపుకుంటారు. అయితే ప్రతి జన్మదినానికి, వారి ఆయువులో ఒక సంవత్సరం తగ్గిపోయిందనే విషయం విస్మరిస్తున్నారు. మానవుని జీవితకాలం వంద సంవత్సరాలు అనుకుంటే, అందులో సగభాగం 50 సంవత్సరాలు నిద్రలో పోతుంది. మిగిలిన 50 సంవత్సరాలలో సగభాగం అనగా పాతిక సంవత్సరాలు పసితనం, బాల్యం, వృద్ధాప్యంలో గడిచిపోతుంది. ఇక మిగిలినది పాతిక సంవత్సరాలు. ఇందులో వివాహం, సంసారజీవనం, ఉద్యోగం, ధనార్జన, వ్యాధులు, సుఖాలు, కష్టాలు వీటితో గడిచిపోతుంది. వంద సంవత్సరాల ఆయువు గలవారి విషయం ఈ విధంగా ఉంటే, మరి అల్పాయువుల సంగతి ఏమిటి? జ్ఞాన సముపార్జనకు, ధర్మకర్మాచరణకు సమయం ఏదీ? జీవితం నీటివలే చంచలమైనది. ప్రాణులకు సుఖం లేదని గ్రహించాలి. అంతటి అమూల్యమైన సమయాన్ని ప్రతిక్షణం ఎంతో జాగ్రత్తగా సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి మానవుడు, ఉన్న సమయాన్ని ఏమాత్రం వృధా పరుచుకోకూడదు. హింస, దౌర్జన్యం, పగ, ద్వేషం, అన్యాయం, చెడువ్యసనాలు, నిందారోపణ, కోపతాపాలు వంటి వాటికి లోనుకాకూడదు. ప్రేమ, జాలి, దయ, కరుణ, అభిమానం, న్యాయం దానధర్మాలు, దైవభక్తి, దేశభక్తి వంటి మంచి గుణాలు అలవర్చుకోవాలి. ఇహపరాలకు అవసరమైన పుణ్యకార్యాలు, దానధర్మాలు ఆచరించాలి. దైవచింతనతో సమయం సద్వినియోగం చేసుకోవాలి. జీవితం, యవ్వనం, సిరిసంపదలు, భార్య, పిల్లలు ఇవేవీ శాశ్వితం కావు. పుణ్యకార్యాలు, ధర్మం, కీర్తి ఇవే శాశ్వితమైనవి. మానవుడు జీవితాంతం ఎంతో శ్రమించి ఆర్జించి కూడబెట్టిన ధనంలో చిల్లిగవ్వైనా మరణించిన తర్వాత అతని వెంటరాదు. ఇంటిలోనే ఉండిపోతుంది. అతని పుత్రులు, బంధువులు, మిత్రులు స్మశానం వద్దే వుండిపోతారు. అతను చేసిన పాపపుణ్యాలు మాత్రమే అతని వెంట వస్తాయి. కాబట్టి సమయాన్ని సద్వినియోగం చేసుకొని, పుణ్యకార్యాలు ఆచరించాలి. అయితే, వున్న సమయమంతా పొట్టకోసం, కూటికోసం, జీవనపోరాటానికే సరిపోవటం లేదు. ఈ యాంత్రిక యుగంలో భార్యాభర్తలిద్దరూ ఉదయాన్నే*

పొట్ట చేత్తో పట్టుకుని ఉద్యోగాలకు పోయి, తిరిగి రాత్రి ఇల్లు చేరుకుంటున్నారు. "అంతలా కష్టించనిదే రోజు గడవటం లేదు, పొట్ట నిండటం లేదు. ఇక ఒక దగ్గర స్థిరంగా కూర్చుని దైవధ్యానానికి సమయం ఏదీ?" అని ఎదురుప్రశ్న వేస్తారు. సమయం కావలసినంత వుంటుంది. మీరు చేయాలనుకుంటే ఎంతైనా చేయవచ్చు. మీకు తెలియకుండగనే మీరు ఎంతో సమయాన్ని వృథా చేస్తున్నారు. ఆ సమయంలో క్షణకాలం సార్థకం చేసుకుంటే, జన్మ సఫలమవుతుంది. అది ఏ విధంగా అంటే, ఉదయం స్నానం చేసే సమయం, భోజనం చేసే సమయం, ఆఫీసుకి వెళ్ళే సమయం, నిద్రకుపక్రమించే సమయం సాధారణంగా వ్యర్థమైన ఆలోచనలతో గడిపేస్తుంటారు. అలా కాకుండా, ఆ సమయాల్లో భగవన్నామస్మరణ చేయవచ్చు. మొదట్లో కొంత ఇబ్బందిగా వున్నా, తర్వాత క్రమంగా అలవాటు అవుతుంది. మనసుంటే ఇలాంటి మార్గాలెన్నో కన్పిస్తాయి. అమూల్యమైన కాలం క్షణమైనా వృథా చేయకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే, ఇహపర సౌఖ్యాలు పొందవచ్చు. దేహములు నిత్యములు కావు. ఐశ్వర్యం శాశ్వితం కాదు. మృత్యువు నిత్యం సమీపిస్తూ వుంటుంది. కాబట్టి, ధర్మమును సంపాదించుకోవాలి. ఇక శెలవు దినాల్లో విందులు, వినోదాలతో సమయం వృథా చేయకుండా, పుణ్యకార్యాలు చెయ్యటానికి సమయం వెచ్చించాలి. సత్యాన్ని పలకడం, దానగుణం కలిగి వుండటం, కష్టాల్లో ఉన్నవారికి తగు సహాయం చేయడం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, ఓర్పు కలిగి వుండటం, పురాణాలు చదవటం, వినటం, సజ్జనులతో స్నేహంగా వుండటం, దైవదర్శనం చేయటం, దైవభజనా కార్యక్రమాలకు సమయం కేటాయించుకోవాలి. దానివల్ల ఇహపరసౌఖ్యాలు చేకూరుతాయి. సాధారణంగా మానవుడు సుఖసంతోషాల్లో వున్నప్పుడు దైవం గురించి ఏమాత్రం ఆలోచించడు. కష్టాల్లో ఉన్నప్పుడు మాత్రమే దైవం గుర్తుకు వస్తాడు. ఇది మానవనైజం. దీనిని విడనాడాలి. కష్టాల్లో వున్నప్పుడు మాత్రమే గాక సుఖసంతోషాలలో వున్నప్పుడు కూడా, అనునిత్యం దైవప్రార్థన చెయ్యాలి. నామజపం విడువకూడదు. సమయాన్ని అన్ని విధాలా సద్వినియోగం చేసుకోవాలి.

**అస్థిరం జీవనం లోకే అస్థిరం ధన యవ్వనం ।**
**అస్థిరం దారాపుత్రాది ధర్మః కీర్తి ర్ద్వయం స్థిరం ॥**

*జీవనం, ధనం, యవ్వనం, దారాపుత్రాదులు, సిరిసంపదలు*
*ఇవ్వన్నీ ఎప్పటికీ స్థిరమైనవి, శాశ్వితమైనవి కావు.*
*ధర్మం, కీర్తి ఈ రెండే స్థిరమైనవి, శాశ్వితమైనవి అని గ్రహించాలి మీరు.*

ఈ జగమంతా ధ్యానమయం
ధ్యానంతో భగవంతుని యందు బంధం పెరుగును
ధ్యానంతో పదసంపద పెరుగును
ధ్యానంతో మనసు మంగళకరమగును
ధ్యానంతో పాపకర్మలు తొలగును
ధ్యానంతో ఉత్తమ కర్మఫలాలు కైవశమగును
ధ్యానంతో ఆంజనేయ అనుగ్రహం అందుకోగలరు

***అంతరాత్మ ప్రబోధాలను వినండి***
***అవి మీకు ఆచరణకు యోగ్యమైనవి***
***అంతరంగశక్తి అద్భుతంగా తోడ్పడి***
***మీరు ముక్తిమార్గాన్ని చేరుటకు దోహదపడుతుంది***
***అది చేస్తున్న బోధని స్వీకరించినట్లయితే,***
***మీ బుద్ధి వికసించి, వినూత్న మార్గాల్లో పయనించి***
***వైరాగ్యాన్ని స్వీకరించి, జ్ఞానాన్ని, త్యాగాన్ని, యోగాన్ని స్వీకరించి,***
***దానవత్వాన్ని వదిలి, మానవత్వాన్ని పొదివి పట్టుకుని***
***సత్యమార్గంలో పయనిస్తూ***
***దేహం అనిత్యం అని తెలుసుకుని***
***నిత్యసత్యమైన ఆత్మను తెలుసుకుని***
***ఆత్మావలోకనమే ముద్దు అని గ్రహించి***
***భౌతికవాదం వద్దు అని గ్రహించి***
***ప్రేమ దైవతత్త్వం, సేవ మానవత్వం, సేవించుట ధన్యత అని గ్రహించి***
***ఈ ఆంజనేయుడు చూపిన, నేర్పిన ఆధ్యాత్మిక జగత్తులో***
***ధ్యాననిష్ఠలో, అహంకారపూరితమైన ధనం అనే మత్తులో మునగకండి అని***
***విన్నపాలతో కూడిన విన్నపాన్ని తన బిడ్డలకు అందిస్తున్నాడు ఈ మారుతి***
***పసిబిడ్డలైన నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**04-02-2021** 10:10 AM

**176) మేము జీవితాన్ని ఏ విధంగా తీర్చిదిద్దుకోవాలి స్వామీ?**

*జీవి యొక్క జీవనానికి అర్థం ఆలోచన. కష్టాలు, సుఖాలు ఒకదాని వెంట ఒకటి వుంటేనే జీవనానికి, జీవితానికి అర్థముంటుంది. మనిషి జీవించినంతకాలం, వీటిని తప్పనిసరిగా అనుభవిస్తూనే వుండాలి. అది లోకధర్మం. కానీ, కష్టాలే జీవితాంతం వుండి, సుఖమనేది జీవనాంతంలో కలిగితే ఎంతవరకూ ఉపయోగం? అంతంలో సుఖం ఎంతవరకూ పొందగలరు? జీవించినంత కాలగమనంలో పొందలేనిది, ఆఖరి ఘడియల్లో పొందగలరా? అప్పుడప్పుడు జీవం యొక్క అవయవాల అరుగుదల గమనిస్తూ వుండండి. అరిగిపోయిన తర్వాత అతుకుబ్రతుకే అవుతుంది. కష్టాలు, సుఖాలు, శారీరక బాధలనేవి ఏ జీవికైనా ఇంచుమించుగా ఒకే విధంగా వుంటాయి. మనసున్నవాళ్ళు బాంధవ్యానికి కట్టుబడి చేస్తూనే వుంటారు. చేస్తున్నారు కదా అని మొత్తం భారం వారిమీద వెయ్యకండి. అర్థం చేసుకొని వాళ్ళని కూడా కొంతైనా అనుభవించేటట్లు చేయండి. వాళ్ళకు కష్టం కష్టంలా అన్పించదు. కొంతైనా విరామసమయం చేకూర్చండి. అంతా అయిన తర్వాత సుఖం వస్తుంది అంటే ఉపయోగం*

వుండదు. మీరు వాళ్ళని ప్రోత్సహించకపోయినా ఫర్వాలేదు కానీ, దిగజార్చే పదజాలం వాడి, కృంగిపోయేలా చేయకండి. సరియైన ప్రోత్సాహం వుంటే, లేని బలం వస్తుంది. చెయ్యలేని కార్యమైనా, చేయాలనే ఆత్మవిశ్వాసం వస్తుంది. శక్తియుక్తులు తగ్గుతున్నప్పుడు మీ కార్యక్రమాలలో, మరియు దినచర్యలలో మార్పులు చేయాలి, మరియు ఒక పరిమితి ఏర్పర్చుకోవాలి. లేకపోతే అనేక సమస్యలు వచ్చి, మీ మెదడులో కదిలే ఆలోచనలు సరిగా రాక, అనేక తప్పిదాలు తలెత్తుతాయి. దేనికైనా ఒక పరిమితి అవసరం. మొండితనం, అహంకారం పనికిరాదు. అర్ధం చేసుకోండి, ఆలోచించండి, అనుసరించండి. మనిషి ఎలా జీవించాలి? చక్కగా చూస్తూ, వింటూ, మంచిగా మాట్లాడుతూ, ఎవరికీ హాని చేయకుండా స్వేచ్ఛగా తిరిగితే, మనిషి నూరేళ్ళు బ్రతుకుతాడు. ఎవరి ధనాన్ని దొంగిలించకూడదు. అంటే, ధనార్జన ధర్మంగా వుండాలి. అంతేకాదు, ప్రేమైక సమాజం మంచిది. మనిషి నిత్యం ఓ మంచి విషయాన్ని వింటూ వుండాలి, చదువుతూ వుండాలి. చదివిన దాన్ని మననం చేసుకుంటూ వుండాలి. ఎన్ని కష్టాలు వచ్చినా, సత్యాన్ని వదులుకోకూడదు. నైతికంగా పతనం కాకూడదు. నేను, నాది అనే సంకుచిత భావనలను వదిలిపెట్టాలి. చేసేవాడు, చేయించేవాడు ఆ భగవంతుడే అనుకుంటే ఫలితాల మీద ఆపేక్ష వుండదు. ప్రతి మనిషి ఈ ప్రపంచంలో ఒకడిగా వుండాలి తప్ప, ఈ ప్రపంచంలో కలిసిపోకూడదు. మానవతా విలువలతో కూడిన జీవితం గడపటం, సక్రమమైన మార్గంలో ప్రయాణించడం వల్లే, మనిషి లక్ష్యాలను చేరుకుంటాడు. సద్గురువులు, స్వామీజీలు, నాయకులు ఇలా ఎందరెందరో మానవసేవను మాధవసేవగా భావించారు. పరోపకారమే లక్ష్యంగా బ్రతికారు. వినమ్రతతో దానధర్మాలు చేశారు. శ్రేయస్సు కోసం తమ జీవితాలను ధారపోసినవాళ్ళే. అందుకే, చిరస్మరణీయులయ్యారు. నేను కూడా అందుకే చిరంజీవినయ్యాను. అందుకే అంటారు, హనుమంతుడు ఆబాలగోపాలానికీ చిరస్మరణీయుడు, ఆదర్శనీయుడు. ఏ వయస్సు వారైనా, ఆయనను తలచుకుని స్థిమితం పొందటానికి కారణం, ఆయనలో ఉన్న సుగుణాలే. రామకార్యోన్ముఖుడై, శతయోజన పర్యంతమైన సముద్రాన్ని లంఘించేటప్పుడు, ఆయనకు ఎన్నో అడ్డంకులు ఎదురయ్యాయి. అయినా, హనుమంతుడు వెనుదిరగలేదు. లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాడు. చివరకు సీత జాడ తెలుసుకుని, కార్యసాధకుడయ్యాడు. హనుమంతుడిలా ధైర్యంగా, దూరదృష్టి, సమయస్ఫూర్తి, పట్టుదల ఉన్నవాళ్ళు ఏ రంగంలోనైనా సంపూర్ణ విజయం సాధిస్తారు. ఏ పనైనా కష్టపడితేనే పూర్తవుతుంది. కలలు కంటూ కూర్చుంటే, అణువంతైనా ముందుకు సాగదు. సింహం నోరు తెరుచుకుని ఉన్నంతమాత్రాన వన్యమృగం దాని నోటిలోకి రాదు కదా! మీ ఆలోచనలను బట్టే ప్రపంచం వుంటుంది. మీ దృష్టి మంచిదైనప్పుడు లోకం మంచిగా కన్పిస్తుంది, చెడుగా చూస్తే లోకమంతా చెడుగా కన్పిస్తుంది. ప్రతి మనిషీ, సమాజ శ్రేయస్సు గురించి నిరంతరం ఆలోచించాలి. మంచి ఆలోచనలు వెనువెంటనే ఆచరణలో పెట్టాలి. ఇతరులకు మేలు చేయకపోయినా ఫర్వాలేదు, కీడు తలపెట్టకుండా ఉండటం మంచిది. శత్రువులతో కూడా ప్రియంగా మాట్లాడాలి. అప్పుడు వాళ్ళే మిత్రులవుతారు. ధర్మాచరణ, పరోపకారం, సత్యవాక్కు ఇవన్నీ దైవీగుణాలు. భగవంతునికెంతో ప్రీతికరమైనవి. ఈ గుణాలు పాటించిన మనిషికి భగవంతుని ఆశీస్సులు ఎప్పుడూ వుంటాయి. అందుకే ప్రతి మనిషీ ధర్మమార్గంలో నడచి, నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రేమతో సకల ప్రాణులను

ఆదుకోవాలి. స్వార్థం మరచి, సంఘ పురోభివృద్ధికి కృషి చేయాలి. అప్పుడే మనిషి జీవితం సార్థకమవుతుంది. అతనిలో భగవంతుడు కొలువై వుంటాడు.

నువ్వు నడుస్తున్న దారి ఎటు తీసుకెళ్తే అటు వెళ్ళిపోవద్దు.
నువ్వు కోరుకున్న దానిని సాధించటానికి అవసరమైన దారిని
వెతుక్కుంటూ వెళ్ళు.

***పాపానాం విద్యధిష్ఠానాం లోభమేవ ద్విజోత్తమ ।***
***లుబ్ధాః పాపం వ్యవస్యంతి నరానాతి బహుశ్రుతాః ॥***

*పాపాలన్నింటికీ లోభమే మూలమని గుర్తించండి.*
*శాస్త్రాలను మిక్కిలిగా చదువని లోభులే, పాపకార్యాలను తలపెడతారు.*

| | | |
|---|---|---|
| *జీవితం ఒక సవాలు* | – | *ధైర్యంగా ఎదుర్కొనండి* |
| *జీవితం ఒక బహుమతి* | – | *సంతోషంగా స్వీకరించండి* |
| *జీవితం ఒక సాహసకృత్యం* | – | *ధైర్యంగా నిర్వహించండి* |
| *జీవితం ఒక బాధ్యత* | – | *బాధ్యతాయుతంగా నిర్వర్తించండి* |
| *జీవితం ఒక ఆట* | – | *ఆనందంగా ఆడండి* |
| *జీవితం ఒక రహస్యం* | – | *ధైర్యంగా ఛేదించండి* |
| *జీవితం ఒక పాట* | – | *హాయిగా పాడుకోండి* |
| *జీవితం ఒక అవకాశం* | – | *చక్కగా సద్వినియోగపరచుకోండి* |
| *జీవితం ఒక ప్రయాణం* | – | *క్షేమంగా పూర్తిచేయండి* |
| *జీవితం ఒక వాగ్దానం* | – | *శాయశక్తులా నెరవేర్చండి* |
| *జీవితం ఒక అందం* | – | *ఆనందంగా ఆస్వాదించండి* |
| *జీవితం ఒక పోరాటం* | – | *చివరి దాకా పోరాడండి* |
| *జీవితం ఒక గమ్యం* | – | *సమయానికి చేరుకోండి* |
| *జీవితం ఒక పజిల్* | – | *తెలివిగా పూరించండి* |
| *జీవితం ఒక మంచి పుస్తకం* | – | *పూర్తిగా చదవండి* |

***జీవితం ఒక మంచి నేస్తం ఆ స్నేహ మాధుర్యం అనుభవించండి***
***జీవితం ఒక ఆధ్యాత్మిక అనుభవం అందంగా ఆచరించండి***
***ఆంజనేయుని సామీప్యం సాధనకు అనువైనది***
***అందుకున్న జీవితఫలాలతో జీవితం ఫలింపచేసుకుని***
***పవనకుమారుని ప్రతి మాట ప్రతి చూపు ప్రతి అడుగు***
***మిమ్ములను ప్రగతిపథాన నడిపించి మిమ్ములను***
***ప్రయాస లేకుండా పరలోకప్రాప్తిని కల్గించి పారవశ్యులను చేయును***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**05-02-2021** 10:10 AM

**177) పరుల వస్తువులను ఆశించకూడదు అంటారు కదా స్వామి! అది ఎలాంటిది స్వామీ?**

ఒకప్పుడు ఒక సన్యాసి దట్టంగా చెట్లు పెరిగివున్న ప్రదేశంలో తపశ్చర్యలు ఆచరిస్తూ వచ్చాడు. ఇలా వుండగా ఒకరోజు ఆ సన్యాసి, సమీపంలో పారుతున్న నీటిలో స్నానం చేసి నడచి వస్తున్నాడు. అప్పుడు దారిలో ఆయన కూర్చుని ధ్యానం చేసే చోటుకు కాస్త దూరంలో గడ్డినేల మీద ఒక వజ్రపుటుంగరం ధగధగా మెరిసిపోతూ పడివుండటం ఆయన కంటబడింది. వజ్రపుటుంగరం ఆయనకు అక్కర్లేదు. దానిపట్ల ఆయనకు అనురక్తి లేదు. కాబట్టి, గడ్డినేల మీద పడివున్న ఆ వజ్రపుటుంగరాన్ని తీసుకోలేదు. తరువాత ఆయన కళ్ళు మూసుకుని ధ్యానంలో నిమగ్నుడయ్యాడు. కళ్ళు మూసుకున్న స్థితిలో ఆయనకు సమీపంలోని గడ్డినేల మీద ఏదో శబ్దం వినిపించింది. అప్పుడు ఆ సన్యాసి, "ఎవరో వస్తున్నారు, ఆ వ్యక్తి వజ్రపుటుంగరాన్ని తీసుకోనీ" అని అనుకున్నాడు. అడుగుల చప్పుడు కాస్త దూరంలో వినరాగానే, "వచ్చిన వ్యక్తి వెళ్ళిపోయారు" అనుకొని, ఆ సన్యాసి కళ్ళు తెరచి చూశాడు. చూడగా, వెళ్ళినది మనిషి కాదు, అదొక పసువు. ఈ విధంగా ఆ రోజు అడుగుల శబ్దం విన్నప్పుడల్లా ఆ సన్యాసి "ఎవరో వ్యక్తి వస్తున్నారు ఆ వజ్రపుటుంగరాన్ని తీసికోనీ" అని అనుకోసాగాడు. అక్కడ్నుంచి అతను ఏదైనా శబ్దం అయితే, కళ్ళు తెరచి చూసేవాడు, "ఎవరైనా వచ్చారా? ఆ ఉంగరాన్ని తీసుకున్నారా లేదా" అని. ఈ అనుభవం ఆ సన్యాసికి ఆ రోజు, నాలుగైదుసార్లు జరిగింది. ఆ రోజు ఆ దారిలో వెళ్ళిన నలుగురైదుగురు వ్యక్తులూ వజ్రపుటుంగరాన్ని తీసుకోకుండానే తమ దారిన వెళ్ళిపోయారు. రెండవరోజు ఆ దారిగుండా వెళ్ళిన నలుగురైదుగురు వ్యక్తులు కూడా వజ్రపుటుంగరాన్ని తీసుకోకుండానే వెళ్ళిపోయారు. మూడవరోజు సన్యాసి ఎవరో వ్యక్తి వస్తున్న అడుగుల శబ్దం విని కళ్ళు తెరిచి చూశాడు. అప్పుడు వృద్ధుడైన ఒక రజకుడు వీపు మీద బట్టల మూటను మోసుకుంటూ రావడం సన్యాసికి కనిపించింది. అతడికి వృధ్యాప్యం కారణంగా గూని ఏర్పడింది. కాబట్టి, వంగి నేలను చూస్తున్నట్లే నడిచి వస్తున్నాడు. తన సమీపంలోకి వచ్చిన ఆ రజకునితో సన్యాసి "అదుగో చూడండి. మీరు వస్తున్న దారిలో ఒక వజ్రపుటుంగరం వుంది. దాన్ని మీరు తీసుకోండి" అని చెప్పాడు. అందుకు వృద్ధుడైన రజకుడు, "నేను వస్తున్న దారిలో గత మూడు రోజులుగా ఆ ఉంగరాన్ని చూస్తూనే వున్నాను స్వామీ. కానీ, నేను నా శ్రమతోనే జీవించాలని అభిలషిస్తున్నాను. శ్రమపడకుండా అయాచితంగా లభించే ఆ వజ్రపుటుంగరం నాకు అక్కర్లేదు. శ్రమించకుండా లభించేది ఏదీ నాకు అవసరం లేదు. నాకెందుకూ వజ్రపుటుంగరం?" అని జవాబిచ్చాడు. ఆ దారిలో కొందరు వ్యక్తులు వెళ్ళనేవెళ్ళారు. కానీ, వారిలో ఏ ఒక్కరూ వజ్రపుటుంగరాన్ని చూడకపోవటంతో, దానిని తీసుకోలేదు. 3 రోజులుగా ఆ ఉంగరాన్ని చూస్తున్న రజకుడు "ఇతరులకు సొంతమైనదేదీ నాకు అక్కర్లేదు, ఉచితంగా లభించేది ఏదీ నాకు వద్దు, నా శ్రమను నమ్ముకునే జీవిస్తాను" అని అన్నాడు. జనులు తమ శ్రమతోనే జీవితం గడపాలి. శ్రమించకుండా తిని కూర్చోవడం, దొంగతనంతో సమానమని మీకు చెప్పుటకు, ఈ ఉదంతం వినిపించాను.

**పాటించాల్సిన నియమాలు**

*1) కాలనియమం 2) దేహనియమం 3) మనోనియమం*

**తృప్తి పడకూడనివి**

*1) దానం 2) పూజ 3) విద్య*

**సర్పశ్చాగ్నిశ్చ సింహశ్చ కులపుత్రశ్చ భారత ।**
**నావజ్ఞేయ మనుష్యేణ సర్వేహ్యేతేతి తేజసః ॥**

*ఓ భారతా! మనిషి ఎప్పుడూ సర్పమును గానీ, అగ్నిని గానీ, సింహమును గానీ,*
*సద్వంశమున పుట్టిన వ్యక్తిని గానీ అవమానింపరాదు.*
*ఇవ్వన్నియూ మిక్కిలి తేజస్సు గలవి.*

***మనసు మనిషికి ఒక దైవవరం***
***అది మరొకందుకు శాపం కూడాను***
***మనసు భావనలను సృజిస్తుంది***
***భావనలు బుద్ధులుగా మారి ఆచరణరూపం పొందుతాయి***
***సద్భావాలు సద్బుద్ధిని కల్గించి, సదాచరణలు చేయిస్తాయి***
***సదాచరణలు సుఖాన్నిస్తాయి - దురాచరణలు దుఃఖాన్నిస్తాయి***
***సదాచరణలు గల మనిషి దైవం - దురాచరణలు గల మనిషి దెయ్యం***
***సద్భావకుడు సంఘ శ్రేయస్కరుడు - దుర్భావకుడు సంఘ విద్రోహి***
***సద్భావకుడు అమరజీవి - దుర్భావకుడు వినాశకుడు***
***తన దురాచారణలకు దుష్ఫలితాన్ని పొంది,***
***తన తప్పు తెలిసి కూడా, తన ఆచరణలను సరిచేసుకోక***
***దుర్బుద్ధి సదా దైవాన్ని నిందిస్తాడు***
***సంఘంలో వున్న వారందరూ సద్బుద్ధి కలవారవ్వాలని,***
***అమరజీవులవ్వాలని, ఆంజనేయుని ముద్దుబిడ్డలవ్వాలని***
***నా నిరంతర ఆకాంక్ష***
***దానిని తీర్చండి నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**06-02-2021** 10:10 AM

**178) తీర్థయాత్రల యొక్క ప్రాముఖ్యత ఎట్టిది స్వామీ?**

ఏ మాత్రం వీలుచిక్కినా, అవకాశం వచ్చినా తీర్థయాత్రలు చేయాలని మీలో చాలామంది అనుకుంటారు. తీర్థయాత్రల వెనుకగల అంతరార్థం ఓసారి గమనించండి. తరింపచేసేది తీర్థం అంటారు.

తీర్థం అనే పదం మీరు నది, నదీసంగమం, సముద్రం మున్నగు వాటికే ప్రయోగించినా, దేశంలోని ప్రసిద్ధి గాంచిన చాలా దేవాలయాలు, నదులు, నదీసంగమాలు, సముద్రతీరంలో, సమీపంలో ఉన్నాయనేది వాస్తవం. వాటి వెనుక గల కారణాలు మీకు ఇప్పుడు అప్రస్తుతం. అలాగే, వనాలలో, కొండలపైన, దుర్గమ భాగాల్లో, ప్రసిద్ధి గాంచిన దేవాలయాలు వున్నాయి. దైవదర్శనానికి వ్యయప్రయాసలకు వెనుకంజ వేయరు భక్తులు. ప్రతి దేవాలయానికీ ఒక పౌరాణిక గాథ చెప్పబడుతుంది. అక్కడ దేవుడు ఏ సందర్భంలో వెలిసాడో తెలియచేస్తుంది ఆ కథ. అలా ప్రాముఖ్యత కలిగిన ఆ దేవాలయాన్ని సందర్శించటానికి చేసే ప్రయాణమే తీర్థయాత్రగా పరిగణించబడుతుంది. దైవదర్శనంతో పాపనాశనం జరుగుతుంది. పుణ్యం వస్తుంది. కనుక, ఆ క్షేత్రాన్ని పుణ్యక్షేత్రంగా పేర్కొంటారు. మనసు నిండా భక్తిభావం, పరిపూర్ణంగా విశ్వాసం కలిగివుండి చేసే యాత్ర మాత్రమే తీర్థయాత్ర, లేకపోతే అది విహారయాత్ర – సరదాగా చేసేదన్న మాట! సామాన్యంగా చాలామంది తమ కోరికలు తీరుతాయనే ఆశతోనో, మొక్కులు చెల్లించాలనో తీర్థయాత్రలకు వెళుతుంటారు. కానీ, దైవదర్శనంతో అనిర్వచనీయమైన ఆనందం పొందుతారనేది కూడా కాదనలేని వాస్తవం కదా! ఆ ఆనందం, ఆ సంతృప్తి కోసమే భక్తులు అమర్‌నాథ్, కేదార్‌నాథ్, మానససరోవరం, బద్రినాథ్ వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్ళటానికి ఆసక్తి చూపిస్తారు. "దైవం అంతటా వున్నాడు. ఇంకా తీర్థయాత్రలకి వెళ్ళటం దేనికీ?" లాంటి వితండవాదం ఏ భక్తుడూ చేయడు. భగవంతుడు సర్వత్రా నెలకొని వున్నా, పుణ్యక్షేత్రాలలో ప్రధానంగా వెలసి ఉంటాడని గ్రహించండి. ఎక్కడ తవ్వినా నీరు వస్తుంది. కానీ, బావి, కోనేరు, సరస్సు వున్న తావున తవ్వవలసిన పనిలేదు. కావలసినప్పుడల్లా సిద్ధంగా నీరు లభిస్తుంది కదా! మీరు విన్న, చదివిన విశేషాల వల్ల మీ మనసుల్లో ఆ పుణ్యక్షేత్రం అంటే భక్తిభావం జనియిస్తుంది. ఆ క్షేత్రాన్ని దర్శించాలనే తీవ్రమైన కోరిక కలుగుతుంది. కానీ అలా అన్పించినా, ప్రతి ఒక్కరూ తీర్థయాత్రలు చేయలేరు. మీ అందరిలో వున్న ఒక స్థిరమైన నమ్మకమే. అదేమిటంటే, తీర్థయాత్రలు చేయగలగటం కూడా ఒక యోగమే. కేవలం డబ్బు ఉంటే చాలు, ఎక్కడికైనా వెళ్ళవచ్చు అని పుణ్యక్షేత్రాల సందర్భంలో అనలేరు. ప్రాప్తి వుంటేనే దైవదర్శనం లభిస్తుంది. కలియుగ ప్రత్యక్షదైవమైన స్వామి ఎన్నోసార్లు చెప్పారు, "నేను రమ్మనకపోతే, ఎవ్వరూ ఇక్కడకు రాలేరు. నేను సంకల్పించనిదే, ఎవ్వరూ ఇచ్చటకు రాలేరు. నేను సంకల్పించే దాకా నా పేరును కూడా ఎవ్వరూ వినలేరు" అని. అందువలననే, తీర్థయాత్రలు చేసే అవకాశం దైవానుగ్రహంగా మీరు విశ్వసిస్తారు. ఆ అవకాశం వస్తే, ఆనందభరితులు అవుతారు. మీరు అరుణాచలం వెళ్ళారనుకోండి, అక్కడ రమణమహర్షి వారి గది, ఆ పరిసరాలు, ధ్యానమందిరం అవ్వన్నీ చూస్తుంటే, మీకు వారి జీవితచరిత్ర స్మృతిపథంలో మెదులుతుంది. ఎక్కడో అంతరంగం లోతుల నుండి చిన్నగా ఒక ప్రశ్న వినిపించి తీరుతుంది, "నేనెవరు?" అని. పవిత్ర కాశీ క్షేత్రంలో కాలుపెడితే ఆ విశ్వేశ్వరుని దర్శించి గంగానదిలో స్నానమాచరిస్తే, మనసు మూలల్లో ఎక్కడో పాపప్రక్షాళనైన భావం, శాంతినిస్తుంది. అలాగే, జీవితం ఒక తీర్థయాత్ర. దానిపై మానవుడు కాళ్ళీడ్చుకుంటూ, మెరకపల్లాలు వున్నా, ముళ్ళపొదలున్నా, ఆ దారిలో పయనిస్తుంటాడు. భగవన్నామం పెదాలపై వుంటే, దప్పిక అనేది ఉండదు. భగవంతుని రూపం మనసులో వుంటే, మార్గాయాసం వుండదు. పవిత్రమూర్తుల సహకారం, సహవాసం ఉత్తేజాన్ని కలిగించి ఆశను, నమ్మకాన్ని కలుగచేస్తాయి. పిలుపును అందుకునేటంతలో భగవంతుడున్నాడనే అభయం, ఎల్లప్పుడూ దగ్గరనే ఉన్నాడనే భావం,

రావడానికి ఆలస్యం కాదనే విషయం కరచరణాలకు బలం చేకూరుస్తాయి. కళ్ళకు ధైర్యాన్నిస్తాయి. జీవితం అనే యాత్ర పరమాత్ముని దిశగా పరమాత్ముని చేరుకునే యాత్ర కాదా! నామస్మరణ చేసేవారిలో భౌతికమైన కోరికలు అనే తృష్ణ వుండదు. కనుల ముందు భగవంతుని రూపం కదలాడుతుంటే, ప్రాపంచిక విషయాలతో కలిగే అలసట అనేది బాధించదు. ఆ పై దైవం నా తోడుగా నడుస్తున్నాడు అని దృఢంగా విశ్వసిస్తే, దేవుడు అందుబాటులో ఉన్నాడు. ఆర్తిగా పిలవగానే వెంటనే బదులిస్తాడు అనే నమ్మకం ఏర్పడి తీరుతుంది. అలా జీవితమనే తీర్థయాత్రలో తేలికగా దైవాన్ని చేరుకోగలము.

*శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్ ।*
*స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥*

చక్కగా ఆచరించబడిన పరధర్మముకంటే, అసంపూర్ణమైననూ, స్వధర్మమే శ్రేష్ఠము. స్వధర్మము కొరకై మరణించిననూ, అది కళ్యాణకరమేయగును. పరధర్మముననుసరించుట భయజ్వరము.

***అజ్ఞానాన్ని అందుకోకండి - ఏమీ తెలియకుండా చావకండి***
***బాధ్యతలను మరచి మీరు వెళ్ళేదారి మరచి బాటను విధ్వంసము చేసుకోకండి***
***ఈ లోకాన్ని విడిచి వెళ్ళేముందు, మీ జ్ఞానాన్ని సొంతం చేసుకోండి***
***అజ్ఞానులై చచ్చి రోడ్డున పడి పరువు తీసుకోకండి - మీరు అనాథలు కాకండి***
***ఈ ఆంజనేయుని ప్రేమను మరువకండి***
***నా ప్రేమను వదలకుండా, మానవజన్మ అమూల్యమైనదిగా గుర్తించి***
***మీరు మారండి - ఇంకొకరిని మార్చండి***
***మీ జీవితాన్ని చక్కబెట్టుకోండి - జన్మ ధన్యం చేసుకోండి***
***జీవితాన్ని సార్థకం చేసుకోండి***
***పవనపుత్రుని చేరి మీ పుణ్యాల పంటను అనుభవించండి అదృష్టశీలురై***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఆశలతో కోట్లు సంపాదించినా అవి వెంటరాకపోగా
చివరకు మృత్యువును తప్పించలేవుగా!

ॐ

**07-02-2021** 10:25 AM

**179) జీవి యొక్క జీవనయాత్రను ఏ విధముగా భావించాలి స్వామీ?**

తీర్థయాత్రలు అనగానే నేను చెప్పేమాట ఒకటే. భక్తిశ్రద్ధలతో మాత్రమే పుణ్యక్షేత్రాలు దర్శించాలి. అచట ఎదురయ్యే చిన్నచిన్న వసతి, భోజన ఇబ్బందుల్ని భూతద్దంలో చూస్తూ, దైవదర్శనం వలన కలిగే ఆనందాన్ని ఆవిరి చేసుకోకూడదు. కాశీ నుండి వస్తు విశ్వేశ్వరుడిని, అమ్మవార్లను, వారి రూపాలను

*మనసులో నింపుకోవాలి కానీ, నదీతీరంలో ఉండే పండాలను మీ మనసుతోపాటు తెచ్చుకోకూడదు. కుటుంబసభ్యులను ఒకరినొకరు అరుచుకోవటం, మీ మూడ్‌ను పాడుచేసుకోవడం అస్సలు ఏ మాత్రం చేయకూడదు. ఇంతవరకు మీరు భౌతికంగా ప్రయాణం చేస్తూ తీర్థయాత్రలకు వెళ్ళారు. ఆధ్యాత్మికంగా కూడా వెళ్ళాలి. అదెలా అంటారా? మన స్వామి అదే జగద్గురువుతో, ఆ యాత్రలో తోడుగా వుండి మార్గదర్శకత్వం వహించారు కదా! ఎందరో భక్తులు ప్రత్యక్ష దైవంతో దైవదర్శనానికి వెళ్ళారు కదా! అందులో భాగంగా మీరూ వెళ్ళారు గదా! బద్రీనాథ్, ద్వారక, వారణాసి, సోమ్‌నాథ్, శ్రీశైలం మున్నగు పుణ్యక్షేత్రాలు స్వామితోపాటు దర్శించిన వారి అదృష్టాన్ని కొనియాడతరమా! దైవంతో దైవాన్ని చేరుకునే యాత్ర గురించి అర్థవంతమైన విషయాన్ని చర్చిద్దాం. మీరు భగవంతుని సమీపించటానికి వేసే ప్రతిఒక్క అడుగుకు భగవంతుడు కూడా నీ వైపు పది అడుగులు ముందుకు వేసి వస్తాడు. ఈ తీర్థయాత్రలో ఆగడమనేది లేదు. ఇది నిరంతర ప్రయాణం. రాత్రింబవళ్ళు, లోయల గుండా, ఎడారుల గుండా కన్నీళ్ళతో, చిరునవ్వులతో, జననమరణాలతో, సమాధుల నుంచి గర్భకోశము వరకూ సాగే ప్రయాణం రోడ్డు చివరకు వచ్చి గమ్యం చేరుకున్నప్పుడు, యాత్రికుడు తన నుంచి తనలోకే పయనించినట్లు తెలుసుకుంటాడు. ఆ దారి సుదీర్ఘం. ఒంటరి ప్రయాణం. కానీ, ఆ దారిలో నడిపించిన భగవంతుడు, అంతసేపూ తనలోనే ఉన్నాడు, చుట్టూ ఉన్నాడు, తనతోనే ఉన్నాడు, తన ప్రక్కనే ఉన్నాడు! ఇంత అందంగా విశదీకరించిన ఈ ఆంజనేయుని మాటలు మౌనంగా మననం చేసుకోండి.*

**యేషు విప్రతి వద్యంతే షట్సు మోహాత్ఫలా గమమ్ ।**
**తే ష్పధ్య వసిరాధ్యాయీ విందతే ధ్యానజం ఫలమ్ ॥**

*శబ్దము మొదలైన ఇంద్రియ విషయాల వలన కలిగే ప్రాప్తి విషయంలోని మోహం వల్ల మానవులు సంశయంలో మునిగిపోతున్నారు. ఆయా ఇంద్రియ విషయాల పరిణామాన్ని ఆలోచన చేసేవారు మాత్రం ధ్యానం వల్ల కలిగే ఫలితాన్ని పొందుతారు.*

***గాలికి, మతానికి, నీటికి, కులానికి,***
***భూమికి, నిప్పుకు, జాతికి, వర్ణానికి,***
***ఆకాశానికి, ప్రాంతానికి, పంచభూతాలకు లేని భేదం***
***మనుషుల మధ్య ఎందుకు భేదం?***
***గాలిలోనే పుడతారు, గాలిలోనే పోతారు***
***భూమిలో నుండే వస్తారు, భూమిలోనే కలిసిపోతారు***
***నీరులోనే వుంటారు, నీరు లేక చస్తారు***
***నిప్పులోనే వుంటారు, నిప్పులోనే కరిగిపోతారు***
***ఆకాశం నుండి వచ్చారు, ఆకాశంలోనే కలిసిపోతారు***
***వాటికి లేని భేదం మీ కెందుకు?***
***సర్గసుఖాలకై లోకమంతా వెదుకుతారు***
***మోక్షప్రాప్తికై క్షేత్రాలన్నీ తిరుగుతారు***

***ముక్తి కోరి దానాలు, ధర్మాలు చేస్తారు***
***పుణ్యం కోసం యాగాలు, యజ్ఞాలు చేస్తారు***
***తోటివారిని తనలాగ చూడటం చేతకాని యెడల***
***నీవు చేసే యాగాలకు, యజ్ఞాలకు విలువ ఏమిటని***
***ఈ ఆంజనేయుడు ప్రశ్నిస్తున్నాడు***
***సమాధానం చెప్పండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**15-02-2021** 09:40 AM

*మీ అందరికీ ఒక విన్నపం. సాధకులనుకునే వారికి, సాధకులు కాము అనేవారికి ఇది ఒక సర్క్యులర్. దీనిని మీరు ఎంతవరకూ స్వీకరిస్తారో లేదో మీమీ మానసికస్థితిపై ఆధారపడి వుంటుంది. కేవలం చెప్పి ఊరకే వుంటే, అది సద్గురువు బాధ్యత కాదు. తాను చెప్పినదాన్ని కనీసం ఆచరించడానికి ఎంత వరకూ సమాయత్తమవుతున్నారు అనే దానికి పరీక్షాసమయం ఒకటి వుంటుంది. దానికి మీరందరూ సమాయత్తంగా వుండాలి. పెట్టిన ప్రతి పరీక్షను తేలికగా తీసుకొని, అంతరంగంలో ఎటువంటి మార్పు సంభవించనప్పుడు, నేను రావడమెందులకు, మెసేజ్‌లు ఇవ్వటమెందులకు, మీరు బాధపడటమెందులకు? కనీసం నేను కోరుకున్నంత మీరు మారలేకపోయినా ఫర్వాలేదు. మీరు గుర్తించుకునే విధంగా మారినా చాలు. లాభనష్టాల బేరీజు వేయకుండా చెప్పినదానిని, "ఇది నాకు కాదులే, నేనంతా బాగున్నాను. ఎదుటివారి గురించి చెబుతున్నారు" అనుకుంటే అది మీకు కాదు, నాకు నేనే చెప్పుకున్నట్లు! బాగుపడాలన్న తపన మీలో ఏ ఒక్కరికీ లేదు. లేనిదాన్ని తేవాలన్న భావన నాది. ముందుగానే నాలో ఉన్నదాన్ని ఈయన సరిచేసేది ఏమిటి? నేనంతా సరిగ్గానే వున్నాను. నన్ను సరిచేయవలసింది ఏమీ లేదు అన్న భావన మీలో వుంటే, దిగివచ్చిన ఈ ఆంజనేయుడు ఏమీ చేయలేడు. దిగిరాని దేవతలూ ఏమీ చేయలేరు.*

*కొన్ని ప్రశ్నలు వేస్తాను, సమాధానాలివ్వండి.*

1. *మనిషికీ మనిషికీ మధ్య భేదభావాలు ఎందుకు వస్తున్నాయి?*
2. *మీ ఆలోచనా ధోరణిలో తక్కువ ఎక్కువ ఎందుకు?*
3. *తినే ఆహారాన్ని అమృతంగా ఎందుకు భావించలేకపోతున్నారు?*
4. *ఎదుటివ్యక్తిని ఎందుకు గౌరవించలేకపోతున్నారు?*
5. *భగవన్మయమైన ఈ సృష్టిని స్వార్థపూరితమైనదిగా ఎందుకు చిత్రీకరించుకుంటున్నారు?*
6. *మీరుండే స్థానం ఏదైనా, అది భగవన్మయంగా ఎందుకు కన్పించుటలేదు?*
7. *భగవంతుని నిర్ణయానుసారం నీవు ఎచట వుండాలో, నిన్ను ఎచట వుంచాలో అది ఆయన*

నిర్ణయంగా ఎందుకు భావించలేకపోతున్నావు?

8. నేను రావాలి, మీ ఎదుట కూర్చోవాలి, చెప్పాలి, అమ్మ రాయాలి, రవి చదవాలి. ఏదైనా విపులీకరించవలసి వస్తే విపులీకరించాలి. ఇది అంతా దేని కోసం? నాకు ఏమీ తోచకనా? టైం గడవకనా? దేని కోసం?
9. మీ మీ భావాలను సరిదిద్దుకోలేకపోతే, నా ఆగమనం నిర్వీర్యం.
10. మీకు – నాకు వున్న భేదాన్ని గుర్తించండి. మరి నేనెందుకు మీ ముందుకు రావాలి? నా స్థితి ఏమిటి? మీ స్థితి ఏమిటి?
11. పిలుపులో మాధుర్యాన్ని చూపటం కాదు, మీ ఆచరణలో, మీ హావభావాలలో ఆ వినమ్రత, విధేయత చూపండి.
12. మీరు ఎన్ని పూజలు చేసినా, హోమాలు చేసినా, మాటలో మృదుత్వం, ఆప్యాయత, అనురాగం ఏ దిక్కునా కన్పించుటలేదు. దేని వలన?
13. ఈ పృథ్విలో వున్న జీవరాశులలో నీవు ఎంత? నీ స్థితి ఎంత? ఒక్కసారి ఆలోచించండి.
14. మీలో వున్న కఠినత్వాన్ని మొత్తం రంగరించి మీ భాషాపటిమను ప్రదర్శించడం శ్రేయస్కరమా?
15. మీలో వున్న గొప్పదనం ఏమిటి? ఎదుటివారిలో లేనిది ఏమిటి?
16. మీలో గుర్తించగల్గిన సుగుణాలు ఏమిటి? ఎదుటివారిలో గుర్తించలేని గుణాలు ఏమిటి?
17. మీకు మీరుగా ఒంటరిగా గొప్పగా ఉన్నంతకాలం, మీరు ఒంటరివారే. భగవంతుడు కూడా ఒంటరిగానే జీవిస్తాడు మీకు దూరంగా. గుర్తించారా?
18. ఆయుష్షుని ఆయుధాలతో తెగనరుక్కుంటున్నారు. గుర్తించారా?
19. నా ఆజ్ఞలను శిరసావహించలేని మీ శిష్యరికం ఎందులకు?
20. తినే దాని దగ్గర్నుంచి, త్రాగే వరకూ అన్నీ విషపుటాలోచనలే!
21. మీలోని అవిధేయతకు, అసంకల్పాలకు కారణాన్ని గుర్తించండి.
22. మీ అవిధేయత మిమ్ములను నాశనం చేస్తుంది. గుర్తిస్తున్నారా?
23. నా రాకకై మీరు ఎదురుచూస్తున్న విధానం, ఇంద్రజాలికుడి ప్రదర్శనకై చూస్తున్న విధంగా వుంది.
24. కాలక్రమేణా మీరు ఈ ఆంజనేయుని శక్తిని జారవిడుచుకుంటున్నారు. అర్థమవుతోందా?
25. పూర్వపు రోజులు అనగా రోజూ నేను వచ్చి నా సాన్నిధ్యంలో మీరు కూర్చుని వుండగా, ఒక శక్తిగా మిమ్ములను నిలిపింది, అది గుర్తించారా?
26. సాంబారు తయారుచేయటానికి పప్పు, ఉప్పు వాడతారు. సాధన అనేది ఉప్పుతో, పని అనేది పప్పుతో సమానం. వీని రెండింటి మధ్య నిష్పత్తి చక్కగా ఉన్నప్పుడే, ఆ వంటకం పరిపూర్ణంగా వుంటుంది.

## ముగింపు

1. తర్కాల కుస్తీపట్లతో గానీ, యోగం యొక్క వికారాలతో గానీ, సన్యాసాలను కాదనటంచేత గానీ, దైవకృపను పొందలేరు.
2. ప్రేమ ఒక్కటే దాన్ని సాధిస్తుంది. తిరిగి చెల్లించవలసిన అవసరం లేని ప్రేమ, బేరసారాలు లేని ప్రేమ, సంతోషంగా ప్రేమించే వాళ్ళందరికీ కానుకగా ఇచ్చే ప్రేమ, నిశ్చలమైన ప్రేమ, ఎన్ని అడ్డంకులనైనా, ఎంత శక్తివంతమైన విఘ్నాలనైనా ప్రేమ ఒక్కటే తొలగించగల్గుతుంది.
3. నిర్మలత్వానికి మించిన బలం లేదు. ప్రేమను మించి సంతృప్తి కలుగచేసే ఆనందం లేదు. భక్తికి మించి సుఖాన్ని కలిగించేది లేదు. సమర్పణకు మించి ప్రశంసనీయమైన విజయం లేదు.
4. పుణ్యం చేయడంలో, విషతుల్యమైన వ్యసనాలను జయించడంలో, క్రమశిక్షణ పాటించడంలో నీవు పొందిన విజయం నీరసమైన నీ సహచరుల వల్ల చెడుమాటలను, సందేహాత్మకమైన విమర్శల వల్ల, లేక లోపభూయిష్టమైన ప్రయత్నాల వల్ల జారిపోకుండా జాగ్రత్తపడాలి.
5. సత్యములో మిథ్య లేదు. కానీ, మిథ్యాజగత్తులో మీరు సత్యాన్ని అన్వేషించి, అనుభవించాల్సి వుంటుంది.

